# భువనచంద్ర

# కథలు

'స్వాతి' సచిత్రవారపత్రిక

ది ఇండియన్

ఇంకేం చెప్పాలి!

కాలం

గోత్రం

ఆ క్షణం

అద్దె ఇల్లు



ب ا

blak page

# కథలు

(స్వాతి సచిత్రవారపత్రిక)

భువనచంద్ర

సాహితి

**కథలు**

(స్వాతి సచిత్రవారపత్రిక)

**భువనచంద్ర**

email : bhuvanchandra@gmail.com

ప్రథమ ముద్రణ : ఫిబ్రవరి, 2017

వెల : రూ. **150/-**

ప్రచురణ :

**సాహితి ప్రచురణలు**

33-22-1, చంద్రం బిల్డింగ్స్,

సి.ఆర్.రోడ్, చుట్టుగుంట, విజయవాడ.

ఫోన్ : 0866- 2436642/43, 8121098500

**e-mail : sahithi.vja@gmail.com**

పాఠకులకు నమస్కారం.

"స్వాతి"లో కథ ప్రచురితమవడం అంటే లక్షలాది మందికి 'దగ్గర' కావడం. మనసులో ఎన్నోసార్లు అనుకున్నా, కథ పంపాలంటే, వేసుకుంటారో వెయ్యరో అనే సందేహం ఉండేది.

ఓసారి ఏదైతే అదే అవుతుందనుకుని "ఇంకేంచెప్పాలీ' కథ పంపించా. కథ త్వరలోనే 'వేస్తా'మనే ఉత్తరంతోపాటు 'పారితోషికం' కూడా చెక్కురూపంలో ముందే అందింది.

అప్పటినుంచీ వరుసగా కథల్ని పంపుతూనే వున్నాను. ఈ కథాసంపుటికి 'కర్తా కర్మ క్రియ' అంతా బలరామ్‌గారే. ఓ 'అన్న'గా వారు నాకు సూచనలివ్వడమే గాక, నేను కేన్సర్ బారినపడ్డప్పుడు "తమ్ముడా... నేనున్నాను... అసలు అధైర్యపడొద్దు" అని అనేకసార్లు ఫోన్‌చేసి ధైర్యమిచ్చారు. ఇప్పటికీ ఫోన్‌లో నా ఆరోగ్యం సంగతి అడిగి తెలుసుకుంటూనే వుంటారు. వారంటే నాకు భాతృప్రేమే కాక అనంతమైన గౌరవం. అందుకే-

ఈ పుస్తకం వారికే "అంకితం".

**పాఠకదేవుళ్ళకీ**

**అప్యాయత అహర్నిశలూపంచే అన్నయ్య**

**బలరాంగారికీ**

నమస్సులతో

**భువనచంద్ర**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | కాలం | 7 |
| 2. | బీ ఇండియన్ | 17 |
| 3. | ఇంకేం చెప్పాలీ! | 28 |
| 4. | ఆ క్షణం | 38 |
| 5. | అద్దె ఇల్లు | 50 |
| 6. | అంతేగా | 62 |
| 7. | బోలీరే పపీహరా | 70 |
| 8. | చూసి నేర్చుకోవాలి | 78 |
| 9. | గోత్రం | 86 |
| 10. | ఇదేకదూ | 100 |
| 11. | క్షణమాత్రంబు | 112 |
| 12. | మార్పు | 125 |
| 13. | మేధావి | 137 |
| 14. | మీరైనా చెబుతారా | 146 |
| 15. | పెళ్ళి | 155 |
| 16. | నాట్ సో రొమాంటిక్ | 161 |
| 17. | ప్రాప్తమున్న తీరానికి | 170 |
| 18. | ప్రేమ | 184 |
| 19. | పునాసపంతులు | 197 |
| 20. | శాస్తి | 206 |
| 21. | స్ఫూర్తి | 213 |
| 22. | శుభం | 223 |
| 23. | వరాలు | 237 |
| 24. | మౌనం శరణం గచ్ఛామి | 245 |
| 25. | కొడుకు | 253 |
| 26. | స్వయంవరం | 263 |
| 27. | జాగ్రత్తపరుడు | 273 |

# ఆప్తవాక్యం

నాకు సాధారణంగా సాహిత్యం మీద విమర్శలు సమీక్షలు చెయ్యడం పెద్దఇష్టం అనిపించదు. కారణం అక్షరాలనీ, అనుభూతుల్నీ ఇష్టపడకుండా వ్యక్తీకరించడం ఏ రచయితా చెయ్యలేరు. అటువంటప్పుడు ఎవరో కని పెంచిన బంగారుతల్లిని పెళ్ళిచూపుల విమర్శ చెయ్యడం ఎందుకో సబబు అనిపించదు.

అందుకే "అమ్మా! మీరు నాలుగుమాటలు రాయాలి... చెప్పడం కాదు" అని మా రాజుగారు (భువనచంద్రగారు) పట్టు పట్టినప్పుడు నాకు ఏం చెప్పాలో అర్థంకాలేదు. అడిగినవారు పరమాత్మీయులు... ఒక రకంగా మానసపుత్రుడు లాంటివారు. ఇది వయసులకు అతీతమైనది. మా అనుబంధం డాక్టర్ గోపాలకృష్ణ గారి చెట్టుకింద ఎదిగింది. ఆయన ఆత్మీయతతో మద్రాసులో కాలు నిలుపుకుంటున్నారు రాజుగారు. 'మా అమ్మ ప్రసాదం తెస్తుంది' అని నేను తెచ్చే పులిహోర, దద్ధోజనం కోసం భోజనం చెయ్యకుండా ఎదురుచూసే రాజుగారు నాకు తెలుసు.

మన రాజావారు అని డాక్టర్‌గారు ముద్దుగా పిలిచే ఇతను చెట్టుకిందకు వచ్చే అందరికీ సుపరిచితులే. ఆ తరువాత రచయితగా, సినిమాపాటల రచయితగా చాలా చాలా మెట్లు ఎదిగిన రాజుగారిలో... ఆ ఆత్మీయత ఆ ఆదరణ ఏ మాత్రమూ మారలేదు.

మా రాజుగారు కేన్సర్ మూడవస్టేజ్‌లో వున్నారని విని ఆత్మీయులమంతా అలజడి పడిపోయాము. ఎవరికి తోచిన ప్రార్థనలు విడివిడిగా చేశాము. మృత్యుంజయుడిలా, చిరంజీవిలా బయటపడ్డారు రాజుగారు. వ్యాధిని డాక్టర్ ముద్దుకృష్ణారెడ్డి గారు, డాక్టర్ కృష్ణన్ తగ్గిస్తే, ఆదిని గురువులూ, అమ్మవారూ నిర్వీర్యం చేశారు.

ఆ కీమోథెరపీ, ఆ బాధలూ ఎట్లా తట్టుకున్నారు రాజుగారు? అని అడిగితే- స్థూల శరీరాన్నించి సూక్ష్మ శరీరాన్ని విడదీసే సీక్రెట్, గురువుల అనుగ్రహం, ఇలా చాలా విషయాలు చెప్పారు. ఇందులో చాలా కథలు అప్పుడు రాసినవేనమ్మా

అన్నప్పుడు నాకు చాలా కుతూహలమనిపించింది. ఎందుకంటే అక్షరాలు కనెక్ట్ చెయ్యగలిగేంత అమృత బీజాక్షరాలు.. రాసినవారినీ చదివినవారినీ కూడా హీల్ చేయగలవు

'వాళ్ళు' పుస్తకం రాసిన భువనచంద్రకు ఆ సీక్రెట్ తెలియడంలో ఆశ్చర్యం లేదు. ఈ కథలు అన్నీ చదివిస్తాయి. కొన్ని ఆపి ఆలోచింపచేస్తాయి. పునాసపంతులు కథ సత్యం శంకరమంచి అమరావతి కథల్లో పాత్రని తలపుకి తెస్తుంది. కళ్ళు చెమరుస్తాయి.

'వరాలు' అన్న కథలో భగవంతుడు మనిషికి నిద్ర, మరపు, ఆశ, మృత్యువు అనే నాలుగు వరాలు ఇచ్చాడు అని చెబుతూ, ఇవి ఎంత గొప్పవరాలో మనని ఆలోచించ మంటారు.

'కాలం' కథలో నేటివిటీకి... ఆ పాత్రతో చాలామంది ఐడెంటిఫై అయిపోతారు. 'ప్రాప్తమున్న తీరానికి' కథలో సంసారికి, దీపంకింద నీడల్లాంటి నిజాలు... న్యూమరాలజీ తెలిసి భర్తకు ఒంటరితనం అలవాటు చెయ్యాలి, తప్పనిసరి అనుకున్న ఒక గొప్ప ఇల్లాలు కంటతడి పెట్టిస్తుంది. అంతేగాక కథలో రచయిత ఆడదాన్ని ఎంతగొప్పగా అర్థం చేసుకున్నారా! అనిపిస్తుంది. మూకుమ్మడి అత్యాచారానికి గురైన ఆడదాని కథ హృద్యమంగా చెప్తారు గోత్రం కథలో.

వంటలు, రుచులు... వీటితో చాలాకథలు నోరూరిస్తాయి. హాస్యకథలు, శృంగారకథలు, అల్లరికథలు, ఆలోచింపజేసే కథలు... పాఠకులకి విందుభోజనం లాంటిది ఈ కథాసంపుటి.

ఈ అక్షరాల అద్భుతంలో నరక సదృశ్యమైన బాధను మరిచిపోగలిగిన చిరంజీవి భువనచంద్రగారికి నూరేళ్ళ మనుగడ అమ్మవారి అక్షర శాసనం. అది తప్పదు.

శ్రీమతి **జలంధర చంద్రమోహన్**

# కాలం

"వెధవల్లారా.... అక్కుపక్షుల్లారా... లాగికొడితే లంకలో పడతారు... మళ్ళీ ఈ పక్కకి రండి... కాళ్ళు విరగ్గొట్టి చేతుల్లో పెడతా!" అరుస్తూనే ఉంది రంగమ్మగారు.

"వెవ్వెవ్వే...!" వెక్కిరించాడు అల్లంశెట్టి సత్యన్నారాయణ. "వెక్కిరిస్తావుట్రా అడ్డగాడిదా?" కోపంతో కర్ర తీసుకుని వెంటు డింది.

మేం దొరికితేగా...! అసలు 'కొన్న' మావిడికాయలు ఎక్కడైనా 'రుచి'గా ఉంటయ్యా?

'రుచి' రావాలంటే దొంగతనం చెయ్యాలి. ఆ తరువాత బ్లేడుతో 'తొక్క'ని చెక్కాలి. వాటిని బ్లేడుతోనే సన్నటి చిన్న చిన్న ముక్కలుగా తరగాలి. జేబులోంచి ఉప్పుకారం కలిపి 'రెడీ'గా ఉన్న పొట్లాన్ని బయటకి తీసి ఆ ముక్కలమీద గుమ్మరించాలి. ఆ తరువాత శ్రద్ధగా అన్ని ముక్కలకీ ఆ ఉప్పుకారాల మిశ్రమం సమంగా అంటేట్టు కలపాలి.

ఆ తరువాత ఆ ముక్కల్ని నోట్లో వేసుకుంటే, దాం తస్సాదియ్యా... ఏమి రుచీ! ఆ రుచి ముందర పెద్దాళ్ళ తిట్లూ శాపనార్థాలూ ఎందుకు పనికొస్తై?

అప్పటికే మా పేరు ఉళ్ళో 'అరచేతి' మందాన ఉంది... గజదొంగలమని. అసలు మామిడికాయల్ని 'దొంగతనం' చెయ్యని పిల్లలూ, చెరువులో చేపల్ని మింగని 'కొంగలూ' లోకంలో ఉండతగునా?

"ఒరే....మన తోటకెళ్ళి కావల్సినన్ని కాయలు కోసుకో. అక్కడా ఇక్కడా దొంగతనాలు చేసి మన పరువు గంగలో ఎందుకు కలుపుతావూ?" ఇవ్వవలసిన 'కోటా' ఇచ్చేశాక మా అమ్మ అడిగే మాట ఇదే.

"మన తోటలో వేరేవాళ్ళు దొంగతనం చేస్తారు! నవాబుగాడి బేచ్ అంతా అక్కణ్ణించేగా కొట్టుకొచ్చేదీ!" ఇదీ నా జవాబు.

పాపం నాతోపాటు 'సరస్వతి'కీ ఈ పాఠాలు తప్పేవికావు. ఉత్తినే మాతో వచ్చేదికానీ, ఒక్కసారన్నా 'దొంగతనం' చేసిన పుణ్యాన పోలా.

అసలా పిల్ల ఆ మావిడి 'క్రైమా'ని తినటం చూడాలి. సుతారంగా నోట్లో వేసుకుని, ఆ పులుపుదనానికి 'ఉస్' అంటూ ముందు పెదాలు బిగించి, ఆ తరువాత అతి సున్నితంగా దవడలు కదుపుతూ శబ్దం రాకుండా తినటం చూస్తే, మహా 'ముద్దు'గా ఉండేది. నడిచినా అంతే! మెత్తగా... భూమి కందిపోతుందేమో అన్నంత వయ్యారంగా పాదాలు భూమిమీద ఆన్చి నడిచేది. ఏ సీజన్ 'డెకాయిటీ' ఆ సీజన్‌లోనే!

చింతకాయలు విరక్కుండా కొయ్యడం ఓ కళ.

అలాగే అవి పండినప్పుడు 'డొల్ల'ని సుతారంగా విరగ్గొట్టి చిన్నచిన్న ముక్కలుగా చాకుతో విడదీసి, గింజల్ని తీసేసి చిన్నముద్దగా చేసి, దానికి 'తగినంత' ఉప్పు... కొంచెం పంచదారా అద్ది, దాన్నో కొబ్బరి ఈనెకి గుచ్చి... నోట్లో వేసుకుని చప్పరిస్తుంటే వచ్చే ఆనందాన్ని కొలవగలమా? పంపరపనసకాయల్నైతే తొనల్ని లాగించి, 'డొప్ప'ని టోపీగా నెత్తిమీద పెట్టుకుంటే ఎంత హాయి! తలకి ఎంత సువాసన!

అసలు 'మంచు కురిసిన గడ్డిమీద' చెప్పుల్లేకుండా నడిస్తే వచ్చే మజా పిల్లలకికాక ఎవరికి తెలుస్తుందీ? పెద్దాళ్ళకేం! ఎన్నైనా చెప్తారు.

"ఒరే సుబ్బయ్యగారి మనవడా... ఇట్రారా" ఆ రంగమ్మగారే రెండ్రోజుల తరువాత మేం స్కూలుకి పోతుంటే పిలిచింది.

"రాను. వస్తే కొడతావు!" 'తగినంత' దూరంనించి జవాబిచ్చాడు మా హరిగాడు.

అన్నట్టు రంగమ్మగారి భర్తపేరు కూడా హరిశ్చంద్రరావే. అందుకే 'హరి' అనే పేరుండేవాళ్ళని సూటిగా పేరుతో పిలవదు. "కొట్టన్రా! అందరూ రండి!"

భయం నటిస్తూ అందరం వెళ్ళాం.

"దొంగతనాలు చేస్తే తిడతాగానీ ఉత్తినే ఎందుకు తిడతా... ఇదిగో మా పిల్లలకోసం జంతికలు చేశా. మీరూ రెండు తినండి!" అంటూ అందరికీ తలో రెండు జంతికలూ ఇచ్చింది.

అవి జంతికలా? దోశె పెనాలంత ఉన్నాయి. "నువ్వు మంచిదానివండీ రంగమ్మ గారూ!" అన్నాను.

"వెధవది.... ముందు ఏకవచనం ఆ తరువాత మర్యాదగా బహువచనం వాడటం అలవాటైపోయింది. నీ మాటలు మారలేదురా భడవా!" ముద్దుగా నా నెత్తిన ఓ బుల్లి మొట్టుమొట్టి ఇంకో జంతిక బహుమతిగా ఇచ్చింది.

నెలకో రెండు మూడుసార్లు ఈ బహుమతులు పొందటం మాకు అలవాటే. ఆవిడ ఇద్దరు కొడుకులూ బెజవాళ్ళో కాలేజీలో చదువుతున్నారు.

మా ఊరి కరెంటుషాపు (ఎలక్ట్రికల్ షాపు) చంద్రావు నెలకి రెండుమూడు సార్లైనా 'సరుకు' తెచ్చుకోడానికి బెజవాడ పోతాడు. కొడుకులకి పంపిస్తుంది.

ఏ మాటకామాటే చెప్పుకోవాలి. రంగమ్మగారిది 'పెద్ద చెయ్యే' కాదు... 'రుచిగల' చెయ్యి కూడా. ఏ పిండివంట చేసినా ఆవిడే చెయ్యాలి. ఆవిడ వంటకాల 'రుచి' ఇంకెవరు తలకిందులుగా తపస్సు చేసినా రాదని 'ఢంకా' బజాయించి చెప్పగలను. కొబ్బరిలౌజుల రుచే వేరు, అణాకి కేవలం రెండు ఇచ్చేవాడు తూర్పుసత్తిగాడు. అవీ ఎట్టాంటివి? కాకి కూడా కొరకదూ, ముట్టదూ. అదే రంగమ్మగారి లౌజులయితే నోట్లో వెన్నలా కరిగిపోయేవి.

ఈ మాటలే మాట్లాడుకుంటూ స్కూలు చేరేలోపల ఓ 'జంతిక' ఖాళీచేశాం. మేం నములుతుంటే వచ్చే 'పటుకూపటుకూ' శబ్దాలు రైసుమిల్లు శబ్దాల్లా ఉంటే, 'సరస్వతి' మాత్రం చీమ ఒళ్ళు విరుచుకున్నంత నిశ్శబ్దంగా తిన్నది. అసలిది ఎలా సాధ్యం? సాయంత్రం వచ్చేటప్పుడు అన్ని జంతికలూ ఖాళీ.

'నమో వేంకటేశా' పాట మొదలైంది అన్నపూర్ణా టూరింగ్ టాకీసులో. బిలబిలమంటూ పరిగెత్తాం. పాటలు పాడాలంటే వినాలిగా!

❁ ❁ ❁

సుబ్బారావు మేస్టారు బెత్తం పట్టుకుని మా వీపులు విమానం మోత మోగించారు.

"వెధవల్లారా... ఆ రంగమ్మగారి కొడుకుల్ని చూడండి. చక్కగా చదువుకుని ఇంజనీర్లయ్యారు. మీరూ? రెండేళ్ళ నించీ థర్డ్‌ఫామ్‌లోనే డింకీలు కొడుతున్నారు. రేపటికి పాఠం సరిగ్గా రాయకపోయారో కాళ్ళు విరగ్గొడతా!"

హూ! అందరూ కాళ్ళు విరగ్గొట్టేవాళ్ళే! ఏం చేస్తాం? ఎంత చదివినా పూజ్యపితాజీకి డబ్బు పంపమని ఉత్తరం ముక్క హిందీలో రాయడం మావల్లకాదు. సరస్వతి హిందీలో 'మొగలాయీనే' కానీ, ఆ పిల్ల పక్కన కూర్చోనిస్తేగా కాపీ కొట్టడానికి!

అదిగాక ఆ పిల్ల ఎస్సెస్సెల్సీలో ఉంది. మనం ఇంకా ఇక్కడే ఉన్నాం. ఒక్క హిందీ మాస్టారేమిటీ, తెలుగు మాస్టారితో సహా అందరూ ఇదేమాట. ఇంటిదగ్గరి సంగతి అడగొద్దు.

"రంగమ్మగారికి అదేదో జబ్బు వచ్చిందట్రా!" అని, ఏలూర్లో పి.యూ.సి చదువుతుండగా మా దగ్గరికొచ్చిన వంకాయలపాటి ఆదినారాయణ అన్నాడు.

"ఏమిటీ?"

"తెలీదు. కానీ మనిషిబాగా జంకింది!"

చెప్పొద్దూ... మనసు మూగబోయింది. ఓ ఏడాది అటూఇటూగా కొడుకులకి పెళ్ళిచేస్తూ రంగమ్మగారు పెట్టిన 'ఊరుబంతిని' ఎలా మర్చిపోతాం?

"మరవొద్దు నాయనా... మీ ఇళ్ళల్లో ఎన్ని పరమాన్నాలూ పంచభక్ష్యాలూ ఉన్నా, ఈ పూట మాత్రం మా ఇంట్లోనే తినాలి. మీరు తప్ప చుట్టాలూ పక్కాలూ ఎవరున్నారూ!" అంటూ ఆవిడ ఆప్యాయంగా ఆదరంగా మమ్మల్ని పిలిచిన పిలుపు ఎలా మర్చిపోగలం?

"పదండ్రా... ఓరోజు కాలేజీ మానేస్తే వచ్చిన నష్టం లేదుగాని, రంగమ్మగారిని చూసొద్దాం!" అన్నాను.

పొలోమంటూ బయలుదేరాం.

"న్నాయన్నాయనే... నన్ను చూడ్డానికొచ్చారా! ఎంత మంచిమనసులురా మీవీ!" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుని నీరసంగా ఉన్నా లేచి ఉప్మాచేసి పెట్టింది కడుపునిండా.

ఆ వూరు మా వూరే! మావాళ్ళు అంటే, మా తల్లిదండ్రులు ఆ ఊళ్ళోనే ఉన్నా, ముందు మేము వెళ్ళింది రంగమ్మగారింటికే.

"వద్దు రంగమ్మామ్మగారూ, హాస్టల్లో తినొచ్చాం!" అని రాగానే అబద్ధం ఆడాం. ఆవిడ పరిస్థితి చూసి....

"వెధవన్నర వెధవల్లారా... మీరు తిన్నారో లేదో మీ మొహం చూస్తే నాకు తెలీదుట్రా? నేను తల్లిని కాదా?" ఇదీ ఆవిడ సమాధానం.

"ఒరే...మిమ్మల్ని కొట్టీ కొట్టీ నా చెయ్యి పడిపోయిందిరా!" దీనంగా అన్నారు లెక్కలమాస్టారు. ఆయనకి పక్షవాతం వచ్చిందని తెలిసి చూడ్డానికి వెళ్ళాం. ఓ కాలూ, చెయ్యి పడిపోయింది.

"లేదు మాస్టారూ... మేము ఇవ్వాళ ఉద్యోగాల్లో చేరామంటే ఆ పుణ్యం మీరు కొట్టిన దెబ్బలదే. దేవుడున్నాడు మాస్టారూ... మీకు తగ్గిపోతుంది!" తోచిన విధంగా ఓదార్చడమే కాదు... గుళ్ళో కొబ్బరికాయలూ కొట్టాం. అప్పటికి రెండేళ్ళయ్యింది నేనూ, రంగా మావూరొచ్చి.

"రంగమ్మగారింటికి పోదాంరా!" అన్నా నేను. ఇద్దరం వెళ్ళేసరికి చీకటిపడుతోంది.

"ఎవరూ?" అడిగింది రంగమ్మామ్మ.

"మేమమ్మా! నేను కృష్ణణ్ణీ, వీడు రంగడు !"

"మీరుట్రా...! ఉద్యోగాల్లో చేరారూ?"

"చేరాం మామ్మగారూ!"

"పెళ్ళెప్పుడూ?"

"నేను చెయ్యమనే అన్నా. మా అమ్మే చెయ్యను పొమ్మంటోంది!" అన్నాను.

బోసినోటితో నవ్వి "భడవకానానీ.... ఇంకా ఆ కొంటె మాటలు పోలేదుట్రా? అవునూ... నీతో తిరిగే పిల్ల ఒకతి ఉండాలిగా?" అంది.

"సరస్వతా? ఆ పిల్లని నాకెందుకిస్తారూ? ఏ కలెక్టరుకో, ఏ జడ్జీకో ఇస్తారుగానీ!" నవ్వాను.

"సరే! ఎవతి రాసిపెట్టివుంటే అదే వస్తుంది. కంగారెందుకులే!" అంటూ లేచి "ఇదే ఉందిరా!" అంటూ చెరో రెండు మరమరాల ఉండలూ పెట్టింది. ఒక్కోటీ బత్తాయికాయంత ఉంది. "ఎందుకు మామ్మా?" అన్నానే గానీ మహాప్రసాదంలా తీసుకున్నా.

"మనవళ్ళు మొన్నామధ్య వచ్చార్రా! వాళ్ళకోసం చేసినవి. మీరూ నావాళ్ళేగా!" నవ్వింది రంగమ్మగారు.

"ఈ వయసులో ఒంటరిగా ఇక్కడెందుకు రంగమ్మామ్మగారూ! పిల్లలదగ్గర ఉండొచ్చుగా?" రంగడన్నాడు.

"వాళ్ళ అలవాట్లూ, పద్ధతులూ వాళ్ళవీ... నా బతుకు నాదీ! అయినా అక్కడుంటే మీరందరూ వస్తారుట్రా నా దగ్గరికీ?" మళ్ళీ నవ్వింది రంగమ్మగారు.

నా కళ్ళు చెమర్చాయి.

❀ ❀ ❀

వైకుంఠ ఏకాదశి! ఊరంతా కళకళలాడుతోంది. గుళ్ళన్నీ భక్తులతో నిండిపోయాయి. స్నేహితులందరం రంగమ్మగారి ఇంటికెళ్ళాం.

"రండిరా పిల్లల్లారా!" నీరసంగా అంది.

అన్నట్టు 'సరస్వతీ' వచ్చింది.

అందంగా విరబూసిన పూలతీగలాగా!

నీలిమబ్బులమధ్య తటాల్న మెరిసే మెరుపులాగా! వర్షానికి తడిసిన ముద్ద మందారంలాగా వెచ్చని మెడమీద పచ్చని తాళిబొట్టుతో!

"ఎవర్ని చేసుకున్నావే అమ్మడూ?" సరస్వతి బుగ్గలు పుణికి అంది రంగమ్మగారు. "ఇంకెవర్నీ? ఎవరో కోటీశ్వరుణ్ణే చేసుకునుంటుంది!" అన్నాను.

"కోటీశ్వరుడా?"

"కాక? ఈవిడ్ని పెళ్ళిచేసుకున్నవాడు కోటీశ్వరుడు కాదా? కోట్లంటే డబ్బే కానక్కర్లేదుగా రంగమ్మామ్మగారూ!" నవ్వాను.

"ఒహో! నువ్వు లాయరువి గనక కోటేసుకుంటావుగా! కొంటెమాటలు పోలేదురా భడవా!" నవ్వింది.

"కొంటెమాటలుకాదు రంగమ్మామ్మా! నాకోసం ఇన్నేళ్ళు ఆగింది. వచ్చిన సంబంధాలన్నీ తిరగ్గొట్టింది. పెద్దాళ్ళు తిడితే కన్నీళ్ళు కార్చిందేగానీ నా పేరు చెప్పలా. నేను ఓ పెద్ద లాయరు దగ్గర కుదురుకుని కాస్త 'సంపాదన' మొదలెట్టగానే, అప్పుడు పెద్దాళ్ళకి చెప్పింది. వాళ్ళు వద్దన్నారు, బెదిరించారు అయినా పట్టువదల్లా. చివరికి ఒప్పించే నన్ను పెళ్ళిచేసుకుంది. ఇప్పుడు చెప్పండి నేను కోటీశ్వరుణ్ని కానా?"

"నిజంగా మేలిమిబంగారానివే అమ్మడూ" అంటూ మళ్ళీ సరస్వతి బుగ్గలు పుణికి, "మరి మీ అమ్మ ఏమందిరా?" అనడిగింది.

"వచ్చింది ముందు మీ దగ్గరకే. మీరు ఆశీర్వదిస్తే అంతా సక్రమంగానే ఉంటుంది. మా అమ్మ ఎందుకు ఒప్పుకోదూ బంగారంలాంటి కోడల్ని తెస్తే? అయినా ఏదన్నా అంటే వీళ్ళు కూడా వచ్చారుగా నచ్చచెప్పటానికీ!" ఫ్రెండ్స్‌ని చూపిస్తూ అన్నాను.

"అయితే ఇక్కడే ఉండండి ఒక్క నిముషం!" అంటూ లోపలికెళ్ళి పంచదార వేసిన నిమ్మ షర్బత్ ఇచ్చి– "నాయనా! పెళ్ళి చేసుకుని ముందు నా ఇంటికొచ్చావు. ఇదిగో నా దగ్గర ఈ రెండొందలూ ఉన్నై. ఏదన్నా నీ పెళ్ళానికి కొనిపెట్టు!" అని డబ్బు నా చేతిలో పెట్టింది.

వారిస్తే వినలేదు.

ఓ అరగంట తర్వాత ఇంటికెళ్ళా.

"ఊళ్ళోకొచ్చావూ, రంగమ్మ ఇంటిదగ్గర 'గృహప్రవేశ'ం చేయించావు. అవునా?" మా అమ్మ కోపంగా అడిగింది.

'పెద్దదైపోయిందిగదే అమ్మా! అందుకే వెళ్ళా. ఇంతకీ లోపలికి రమ్మంటావా వద్దా?" నవ్వాను.

"ఆ వెధవ నవ్వోటీ. ఒక్క నిముషం ఆగు!" దిష్టి తీసి మరీ మమ్మల్ని లోపలికి పంపింది.

"అత్తయ్యగారూ, ఇలా చెప్పకుండా చేసుకున్నామని..." నసిగింది సరస్వతి.

"వాడి కళ్ళెప్పుడూ నీమీదేనని నాకు తెలీదుటే? అయినా వేం పండుటాకులం. నేలవంక చూస్తూ ఎప్పుడు రాలిపోతామా అని ఆలోచిస్తాం. మీరేమో చివురుటాకులు. తలెత్తి గర్వంగా, ఇంకా ఎదగాలని ఆకాశంవంక చూస్తుంటారు. మీరు సుఖంగా ఉండటం కంటే నాకు కావల్సిందేమిటే పిచ్చిమొద్దూ!" సరస్వతిని అక్కున చేర్చుకుంది మా అమ్మ.

"ఇప్పుడు తెలిసింది... మీ వాళ్ళు ఒప్పుకుంటే చాలు మా అమ్మ గురించి ఆలోచించనక్కర్లేదని ఎందుకన్నావో! నిజంగా మీ అమ్మగారు దేవత!" నా గుండెపై తల ఆన్చి భక్తిగా అంది సరస్వతి.

స్వంత ప్రాక్టీసు బ్రహ్మాండంగా ఉంది. ఓ తెల్లవారుఝామున భక్తిగా పూజగది తుడిచి శుభ్రంచేసి పూజకి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకుని, స్నానంచేసి, హారతిచ్చి అలాగే 'రామనామం' జపిస్తూ పడిపోయింది మా అమ్మ.

కొడుగ్గా నేను ఏడవటం బెంగపడటం సహజం. సరస్వతి దాదాపు ఏడాదివరకూ మా అమ్మ మరణాన్ని జీర్ణించుకోలేకపోయింది. అయితే, మాకు పుట్టిన సంపూర్ణ మాత్రం తల్లి మనసుని మరల్చగలిగింది.

రంగమ్మగారికి పొద్దుపోవాలంటే నా కూతురూ, మా ఊళ్ళోకే మళ్ళీ ట్రాన్స్‌ఫరై వచ్చిన రంగాగాడి కొడుకూ అత్యవసరం అయ్యారు. రంగమ్మగారి పిల్లలు ప్రస్తుతం పిల్లల్తో ఫారిన్లో ఉన్నారు. రెండేళ్ళకో, మూడేళ్ళకో ఓసారి వచ్చి ఓ వారం ఉంటే గొప్ప. వారి అత్తమామల్ని కూడా 'విజిట్' చెయ్యాలిగా మరి!

మామిడిచెట్టుకి కాయలు విరగ్గాశాయి. దొంగతనంగా ఓ నాలుగు కాయలు తెంపి మళ్ళీ రంగమ్మగారిచేత తిట్లు తినాలని మరీ కోరిగ్గా ఉన్నా... నా వయసూ, నా వృత్తీ నా చేతుల్ని కట్టేస్తున్నాయి. అయితే ఆరేళ్ళ వయస్సు ఉన్న నా కూతురు మాత్రం మహారాజాగా కాయలు కోసుకొస్తోంది. 'అన్నీ మీ బుద్ధులే' అని సరస్వతి అన్నా, దానికీ ఆనందమే. సంపూర్ణ మాత్రం తిండిలో నా పోలికే 'పటుకూ పటుకూ' టైపు.

కోర్టునించి రాగానే "రంగమ్మగారు మిమ్మల్నోసారి రమ్మన్నదిట" అంది సరస్వతి. వెంటనే బయల్దేరాను కాఫీ ఇస్తానన్నా వినకుండా. బాగా బిజీ అవడంవల్ల ఈ మధ్య అక్కడికెళ్ళి నెలరోజులు దాటింది. ఏం పనో ఏమిటో? వెళ్ళేసరికి కొడుకులిద్దరూ ఉన్నారు. చలిదేశాల్లో ఉంటున్నారు గనక బాగా రంగుతేలి వున్నారు. రంగమ్మ గారు నీరసంగా మంచంమీద పడుకునివుంది.

"రంగమ్మామ్మా! పిలిచారుట" మంచంమీద కూర్చుని అన్నాను. ఆవిడ వాళ్ళవంక చూసింది.

"ఏంలేదు కృష్ణా. అమ్మ మాతో రాదు. వచ్చినా చలికితట్టుకోలేదు. ఇక్కడ ఇక ఒంటరిగా ఉంచటం ఇష్టం లేదు. అందుకనీ...." ఆగాడు పెద్దకొడుకు వేణుగోపాల్. "బెజవాడలో ఉండే మా మామగారింట ఉంచుదామను కుంటున్నాం!" పూర్తిచేశాడు రెండోకొడుకు నందగోపాల్.

"నాయనా! ఈ ఊరు నేనొచ్చింది ఆయనతో. ఆయన పోయినచోటే నేనూ పోవాలి. ఈ మట్టిలోనే నేనూ కలవాలి. ఇదే నా కోరిక" నెమ్మదిగా అన్నా ఖచ్చితంగా చెప్పింది రంగమ్మామ్మ.

"చూడు కృష్ణా, తల్లిని ఇలా ఇక్కడ ఒంటరిగా ఉంచి మేం ప్రశాంతంగా బతగ్గలమా? పోనీ మేమే ఇక్కడకొద్దామంటే మా పిల్లల చదువులు..." కొంచెం అసహనంగా అన్నాడు వేణుగోపాల్.

"పరిస్థితుల్ని బట్టి సర్దుకుపోవాలిగానీ, సెంటిమెంట్స్‌ని పెట్టుకుంటే ఎలా?" నందగోపాల్.

"రెండేళ్ళకో లక్ష ఖర్చుపెట్టుకుని దేనికొస్తున్నాం? అమ్మకోసమేగా" వేణు.

"ఒకవేళ ఇద్దరం ఇక్కడికొచ్చినా ఈ ఊళ్ళో మాకు తగిన ఉద్యోగాలు ఏమున్నై?" నందూ.

ఏం మాట్లాడనూ?

"మీకు అభ్యంతరం లేకపోతే మీ అమ్మగార్ని నేను చూసుకుంటూ ఈ ఇంట్లోనే ఉంచుతా. అవసరమైతే నేనూ, నా ఫ్యామిలీతో ఇక్కడే ఉంటా. మీకు సమ్మతమేనా?" అడిగాను.

"అంటే?"

"ఏమీలేదు. మా అమ్మగారు పరమపదించింది. నా కూతురు మామ్మగారికి అలవాటైంది. నేనూ, నా భార్య చిన్నతనంనించీ ఆమెకి తెలిసినవాళ్ళమే, మీరు వచ్చినప్పుడు మీరున్నన్ని రోజులూ మాతోపాటే ఉండొచ్చు లేదా ఆ నాలుగురోజులూ మేం మా ఇంటికి పోతాం. జీవితపు చివరి అంచున వున్న ఆమె కోరికను కాదనకండి" నేను చెప్పదలుచుకున్నది చెప్పేశా.

వాళ్ళు ఆలోచిస్తున్నారు. నాకు తెలుసు. వాళ్ళు మంచివాళ్ళే. కానీ కాలపు వేగానికి అలవాటుపడ్డవాళ్ళు. ఒకవేళ రంగమ్మగారిని బెజవాడ పంపినా ఆ చోట ఆమె ఇమడలేదని వాళ్ళకీ తెలుసు. అయిష్టంగానే వాళ్ళు ఒప్పుకున్నారు. రంగమ్మగారి మొహంలో ఓ ఆనందపు ఛాయ.

❀ ❀ ❀

"వెధవల్లారాని... మళ్ళీ ఇటొస్తే కాళ్ళు విరగ్గొడతా" అరుస్తోంది సరస్వతి.

"వెవ్వెవ్వే..." వెక్కిరించాడు అల్లంశెట్టి సత్యనారాయణ మనవడు.

"మళ్ళీ వస్తే ఏం చేస్తావు మామ్మగారూ... మాతో పరిగెత్తలేవుగా!" తగినంత దూరంలో ఉండి అరిచింది రంగాగాడి మనవరాలు. నేను లోపలికెళ్ళాను.

"చూశారా ఎంత గడుగ్గాయో... దెయ్యం పిల్లలు. ఒక్క పిందెనీ మిగల నివ్వడంలా" కోపంగా కళ్ళని పెద్దవిచేసి అంది సరస్వతి.

"అదేపని మన చిన్నతనంలో చేశాంగా!" నవ్వాను.

తనూ నవ్వింది.

అసలు సంగతి ఏమంటే ఆ పిల్లల్ని పోగేసి మామిడికాయలు 'కొట్టెయ్'మని సలహా ఇచ్చింది నేనే.

యాభైదాటిన సరస్వతి మొహంలో కాస్త 'కోపాన్ని' చూడాలంటే అదే ఉపాయం మరి.

ఈపాటికి మీకు అర్థం అయ్యే ఉండాలి. ఆ చెట్టూ ఆ ఇల్లూ రంగమ్మామ్మవే. తొంభై ఆరేళ్ళ నిండువయసులో నా చేతుల్లోనే ఆఖరిశ్వాస విడిచింది.

పిల్లలు వచ్చి మిగతా కర్మకాండలు పూర్తిచేశారు. వెళ్ళిపోతూ మార్కెట్ రేటుకి ఆ ఇల్లు నాకే ఇచ్చారు.

అక్కడి నా ఇల్లూ, రంగమ్మామ్మగారిల్లూ అలాగే ఉంచా. ఏ మార్పుచెయ్యలా. చిన్నతనపు జ్ఞాపకాలు చెదిరిపోకుండా ఉండాలంటే అవి అలాగే ఉండాలి.

మామిడికాయల కాలంలో సరస్వతి పిల్లలమీద అరిచే అరుపుల్లో 'రంగమ్మామ్మ' గొంతే వినిపిస్తుంది.

ఇహ ఇప్పుడా! రంగనాయకి పేరుతో ప్రస్తుతం నా మనవరాలిగా రంగమ్మామ్మ స్కూల్లో చదువుతోంది. మా అమ్మకూడా రంగమ్మామ్మ చెల్లెలుగా అంటే రంగనాయకి చెల్లెలు చంద్రావతిగా అదే స్కూల్లో చదువుతోంది. కాలం అంటే సైకిలు చక్రంలాంటిది కాదూ!

– స్వాతి 14-09-2012

# జీ...ఇండియన్

ఈ మధ్య అందరూ నన్ను బీ.సీ...బీ.సీ అని పిలుస్తున్నారు. సరే... షార్ట్‌ఫాంలో పిలుస్తున్నారేమోనని పెద్దగా పట్టించుకోలా. కానీ మా ఆవిడ కూడా అదే పిలుపు మొదలెట్టింది.

ఉదాహరణకు "ఏవండీ బీ.సీ గారూ.... కాఫీ టేబుల్‌మీద పెట్టాను చూశారా?"

"ఏవండోయ్ బీ.సీగారూ మావిడికాయ పప్పా? టొమేటో పప్పా?" "నిన్నేనోయ్ బీసీ... స్నానం చేసేదేమన్నా ఉందా లేదా?" ఇలా అన్నమాట.

చిత్రం ఏమంటే, పల్లెటూరినించి వచ్చిన నా స్నేహితుడు కూడా ఓ రెండ్రోజులు మా ఇంట్లో ఉన్నాక, "పోరా బీసీ" అన్నాడు.

ఇహ ఊరుకోవడం నావల్ల కాదు.

"ఒరే వీరాంజనేయులూ! మర్యాదగా బీసీ అని ఎందుకన్నావో చెప్పు. చెప్పకపోతే, చిన్నప్పుడు నువ్వు వెలగబెట్టిన లవ్‌స్టోరీ నీ పెళ్ళానికి సవివరంగా చెబుతా. ఏం కావాలో తేల్చుకో!"అన్నాను.

"ఓరి బుర్రలేని పెద్దమనిషీ! నువ్వేసుకున్న ప్యాంటు ఏ బ్రాండుదిరా?" అన్నాడు.

"ప్యాంటు వేసుకోవడం ముఖ్యంగానీ, దాని బ్రాండుతో పనేంటిరా? అది ఏదో కట్‌పీస్‌ని కొని మన సింహాచలం టైలర్‌తో కుట్టించా!"

"సినిమాఫీల్డుకొచ్చి పాతికేళ్ళయినా మనూరి సింహాచలంని వదలనందుకే నిన్ను బీ.సీ. అనేది. నా సంగజ్జాడు! ఈ షర్ట్ పీటర్ ఇంగ్లాండ్ బ్రాండుది. నే వేసుకున్న జీన్స్ 'తకిషా నికోషామా' జపాన్ వారిది. ఇదిగో ఈ అండర్‌వేర్..." చూపించబోయాడు.

"ఆగాగు! నువ్వేమన్నా కనిష్కావా, సిలీనియావా, జలియన్‌వాలావా? అండర్‌వేర్లు చూపిస్తే చూడ్డానికి. ముందు మూసేయ్!" తిక్కపుట్టి అరిచాను.

"అదికాదురా. ఇది కూడా ఘనతవహించిన 'క్రొకొడైల్' బ్రాండుది. పల్లెటూరోడ్ని నేనే బ్రాండెడ్ ఐటెమ్స్ వాడుతుంటే, నీ సిగదరగా, నువ్వేమో బీసీనాటి బట్టలు తొడిగితే ఎలారా?" మొత్తుకున్నాడు.

"ఓహో! వీళ్ళ దృష్టిలో నేను బిఫోర్ క్రైస్ట్‌గాడినన్నమాట!' బీ.సీ అంటే ఏమిటో అర్థమైంది.

"ఒరే వెర్రి వెలక్కాయా! చిరిగే బట్టలకీ, అరిగే చెప్పులకు బ్రాండులపేరుమీద అంత డబ్బెందుకురా తగలెయ్యడం?" వాడివంక జాలిగా చూసి అన్నాను.

వాడు నెత్తి కొట్టుకున్నాడు. "కాలానికి తగినట్టు ఉండాల్రా చింతలపూడోడా! లేకపోతే జనాలు మన్ని కేర్ చెయ్యరు సరిగదా, 'నలుసు'లా చూస్తారు!" బోధించాడు వీరాంజనేయులు.

"అన్నయ్యగారూ! పొద్దున్నే ఆయన ఎందుకూ? చెప్పీ చెప్పీ నా నోరు పడిపోయింది. పొద్దున్నే లేవడం, ఓ లుంగీ చుట్టుకుని వాకింగ్ పేరుమీద రోడ్లన్నీ తిరగడం. ఏ బెండకాయల దానిదగ్గరో, తోటకూర దాని దగ్గరో కూరలు కొని, ఆ సంచీడు నా మొహాన గుమ్మరించడం తప్ప ఓ అచ్చటా ముచ్చటా?" వీరాంజనేయులికి మర్యాదగా కాఫీఇచ్చి, మరో గ్లాసుని 'ఠఫా'మని టేబుల్‌పై పెట్టింది సా.కూ. (సావిత్రిగారి కూతురు).

ఆ గ్లాసు నాకోసమేనని అర్థమైంది. ఏం చేస్తాం?

"అవునూ.... అచ్చటా ముచ్చటా అంటే? మాట్లాడటం లేదా? అడిగింది కొనిపెట్టడం లేదా?" ఉక్రోషంగా అడిగాను.

"ఓహో! బోలెడన్ని కొన్నారు. వెజిటబుల్ బిర్యాని చేసిపెడతానంటే బాస్మతీ బియ్యం ఎక్కడ్నించి తెచ్చారూ?" కేవలం నావంక చూస్తూ అంది.

"కక్కిరాల పుల్లయ్య కొట్లోంచి! నేనెప్పుడు మా ఊరొచ్చినా కొనేది అక్కడేగా?" అయోమయంగా అన్నాను. బియ్యానికీ, అచ్చటా ముచ్చటకీ ఉండే లింక్ ఏమిటో నాకు అర్థంకాలా.

"హూ!....బియ్యం కక్కిరాల పుల్లయ్య కొట్లోవి, కూరగాయలు నాగభూషణం కొట్లోవి... కందిపప్పు మినప్పప్పు సరే... మీ అన్నగారు పండించినవి. ఇహ నూనె సమయమంతులవారి గానుక దగ్గరిది అవునా?"

"అవునూ! అంతకంటే స్వచ్ఛమైన, బెస్ట్ క్వాలిటీ ఎక్కడ దొరుకుతై?" నేనూ రెట్టించాను.

"ఇదన్నయ్యగారూ వరస! ఈ మనిషితో ఇంకేం చెప్పటం? చీరెలు కొందాం రా మగడా అంటే, ఇది జార్జెట్టూ, ఇది మైసూరు సిల్కు, ఇది కంచిపట్టూ, ఇది ధర్మవరం అంటాడేగానీ, డిజైనర్ చీరలుంటై అనేది ఈ మనిషికి తెలుసా?"

మునీష్ మల్హోత్రాలూ, తాషా తన్వాయియాలూ ఇవాళా రేపూ సృష్టిస్తున్న ప్రభంజనాలు ఈయనకేం తెలుసూ? ఆ డ్రెస్సులు వేసుకునేగా కోతిలా వుండే నా ఫ్రెండ్ క్వీన్‌లా మారిందీ" ట్రెడిషినల్ లుక్ ఇస్తూ అన్నది సా.కూ.

మా వీరాంజనేయులు నావంక జాలిగా చూశాడు. ఓ అయిదారు జాలిచూపులు విసిరి, "నువ్వు బాగుపడవురా బీ.సీ.?" అన్నాడు. ఈసారి మాత్రం బీ.సీ అంటే నా పేరనే అర్థమైంది.

ఆ తర్వాత మరో మూడురోజులు నాతోటే వాకింగ్‌కి వస్తూ, "ఒరే బ్రదరూ, ఈ షూస్ 'దావుద్' కంపెనీవి. ఈ షార్ట్స్ 'జాకియా సుకీమియా'వి, ఈ కళ్ళజోడు 'షాబాన్స్'వి. ఇలారా 'వాకింగ్'కి వెళ్ళాల్సింది!" అని చాలా ప్రాక్టికల్‌గా బోధించడానికి ప్రయత్నించాడుగానీ లుంగీ చెప్పుల్స్ కంఫర్టు దేనికీ రాదని వాదించా. వాడికి విసుగుపుట్టి వాళ్ళబ్బాయి కొనిచ్చిన 'బ్రాండెడ్' కార్లో వాడి ఊరు సమ్మెటారిగూడేనికి చెక్కేశాడు. నేను అతి చక్కని, అత్యంత సుఖకరమైన ఆర్.టి.సి బస్సులో సతీసమేతంగా విజయవాడ చేరాను ఆ మరుసటిరోజున. అయితే ఆ ముందురోజు జరిగిన సంభాషణ చెప్పి తీరాలి.

"ఏంటీ వదినా? ఇంకా మీరు ఆ రోకలి ముందు కూర్చుని కారం, ధనియాల పొడీ, మెంతిపొడీ, ఆవపొడీ కొట్టడం ఎందుకూ? ఎంచక్కా 'జియా' బ్రాండ్‌వి కొనుక్కుంటే బాగుంటుందిగా?" అని మా అక్కతో సావిత్రిగారి కూతురు అంది.

"ఏవిటీ 'జియా' బ్రాండా పాడా! ఆర్నెల్లక్రితం కొట్టిన వెధవపొడులు నాకెందుకూ? రెండు నిముషాలు కష్టపడితే ఫ్రెష్షుకి ఫ్రెష్షూ - ఎక్సర్‌సైజుకి ఎక్సర్‌సైజూ!" అంది మా పెద్దక్క భానుమతి.

'హూ....!" అని లోలోపలే అనుకుంది మా ఆవిడ. సరే! ఎంతైనా రోటిదంపుడు రోటిదంపుడే, రోటి పచ్చడి రోటిపచ్చడే! ఆవిడ చికాగ్గా చూసినా,

నేను మాత్రం అన్ని పచ్చళ్ళూ,పొడులూ సీసాల్లో సర్దుకున్నా.

"ఒరేయ్, ఈ అరిటికాయలు కూడా తీసుకుపో! ఏ రసాయనాలూ వెయ్యలా!" ఓ పాతిక అరిటికాయలు ఇచ్చింది మా అక్కయ్య. మహదానందంగా సంచీలో నింపాను కొన్ని నేతిబీరకాయలతో సహా.

"హూ....! ఎవడు తింటాడూ ఆ నేతిబీరకాయలూ?" ముఖం ఓమాదిరిగా పెట్టింది సా.కూ. "తినేవాళ్ళు ఇష్టంగానే తింటారు తల్లీ! నీకెందుకూ! ఇచ్చేవాళ్ళకి ఇస్తాలే!" కొంచెం చిన్నబుచ్చుకుని అన్నాను. ఇవన్నీ, అంటే, నేతిబీరకాయలూ, బుడంకాయలూ, వామన చింతకాయలూ మద్రాసులో దొరకవు (చెన్నై అనలేను!) అంతెందుకూ? ఆంధ్రా కుంకుడుకాయలు కూడా దొరకవు.

ఒకప్పుడు దొరికేవి! ఆంధ్రావాళ్ళు ఆంధ్రులమని చెప్పుకునే ధైర్యం ఉన్నప్పుడు. అలాగే తెలుగు సినిమాలు 'తెలుగు'లో తీసినప్పుడు. (తిట్టకండి మహానుభావులారా.... ఇది నిజం!)

మా మరదలి ఇంటికి పోయాం విజయవాడలో!

"జీజాజీ కైసేహై?" హిందీలో పలకరించింది మరదలు. 'రాష్ట్రభాష'ని గౌరవిద్దామనే ఆలోచనతో "అచ్ఛాహై!" అన్నాను.

వెళ్ళేటప్పుడు పిల్లాడికి అంటే మరదలి కొడుక్కి బట్టలు నేనే కొన్నాను. ఖర్చు రెండువేల అయిదొందలు. పిల్లాడికోసం బట్టలు తెస్తే తల్లి సంతోషిస్తుంది గదా అని, నేను వెతికి వెతికి సెలక్ట్‌చేసిన బట్టల్ని ఆవిడ చేతిలో పెట్టాను. "ఇవా?" కనుబొమలు పైకెత్తి మరీ నావంక చూసింది సా.కూ. నంబర్2.

"ఏం? ఖరీదైనవే అమ్మాయ్, ఇదిగో బిల్లు కూడా ఉంది. కావాలంటే చూడు!" అని బిల్లు ఇచ్చాను.

బట్టలకే టాగ్ ఉంటుంది గదా బిల్లు ఎందుకిచ్చావని మీరు అడగొచ్చు. మా ఆవిడ తరపు వాళ్ళందరూ మహా కిలాడీలు. రెండొందలు పెట్టి ప్యాంటు గుడ్డకొని, దానికి 'రెండువేల రూపాయల' టాగ్ అతికించే రకాలు. అందుకే బస్తీమే సవాల్ అంటూ బిల్లిచ్చా.

"ఉహూ! వీటి ఖరీదు ఇరవైవేలయినా వాడు కట్టడు!" ఆ బట్టలు కుర్చీమీద పడేసింది.

"అదేం? బట్టలు తొడగడం మానేసి 'గోచి' ఏమైనా పెట్టుకుంటున్నాడా?" ఆశ్చర్యంగా అడిగా.

మా ఆవిడ నా కాలు ఫటామని తొక్కింది. నేను అర్థంలేని మాటలు మాట్లాడినప్పుడు (అంటే నా మాటలు అర్థంలేనివి అని ఆవిడ అనుకున్నప్పుడు) ఇలా నా కాళ్ళు తొక్కుతుందన్నమాట.

"తప్పేం అన్నానూ? రోజూ యోగా, గాయత్రీ, ఇంకా ఏవో చాలా చేస్తుంటాడుగా?" ఉక్రోషంగా అన్నా, నా కాలుని నిమురుకుంటూ.

"అది కాదు బావా... వాడు ఏది వాడినా బ్రాండెడ్‌వే వాడతాడు!" గర్వంగా అన్నది మరదలు మాణిక్యం.

"అలా ఎలా కుదురుతుందీ? రేపో ఎల్లుండో పెళ్లి చెయ్యాలిగదా. పెళ్లాం కూడా బ్రాండెడ్ కావాలంటే ఎక్కడ్నించి తెస్తావ్?" చికాగ్గా అన్నాను.

"ఆ సంగతి వాడే చూసుకుంటాడు. నాకెందుకూ! అయినా, నువ్వు మరీ భూతకాలం వాడివి బావా. లేకపోతే ఇంకా ఆ పాత హెచ్.ఎమ్.టీ వాచీనే పట్టుకు వేలాడతావా!" పరువుతీసింది మరదలు మాణిక్యం. "నువ్వేమన్నా అనుకో. నా హెచ్.ఎమ్.టి వాచీని మాత్రం ఏమీ అనకు. ముప్పై అయిదేళ్ళనించీ వాడుతున్నా. ఒక్కసారి కూడా రిపేరురాలా!" గర్వంగా నా వాచీని ముద్దెట్టుకుని అన్నాను. మధ్యాహ్నం టిఫిన్లు కూడా 'జల్దీరామ్'వీ 'బేడ్ బరీస్'వీ. ఎంచక్కా మాంచి పచ్చిమిరపకాయలు తెచ్చి, వాటి పొట్టని సున్నితంగా చీల్చి, వాము ఉప్పులాంటి రుచికరమైన, పరిమళభరితమైన పదార్థాలు కూరి, అందమైన శనగపిండిలో ముంచి, బాణలిలో వేయించి, ఆ తర్వాత మరోసారి దాని పొట్టకి ఆపరేషన్ చేసి, ఉల్లిముక్కలూ, కొత్తిమీరా కూరి, మాంచి నిమ్మరసం అలవోగ్గా పిండి... ఆ తర్వాత ఆ యొక్క మిర్చి బజ్జీలు నములుతూ ఉంటే, ఆ ఘాటుకి కళ్ళల్లోంచి నీళ్ళుకారుతూ ఉంటే వచ్చే 'నిషా'గానీ, 'మజా' గానీ ఈ బొంద జల్దీరామ్స్‌కీ, బేడ్‌బరీస్‌కీ ఉంటుందా?

అదే మా అక్క అయితే వాటికి తోడుపెళ్ళికూతుర్లాగా అరిటిబజ్జీల్ని కూడా అద్భుతంగా వేయించదూ!

జల్దీరామ్‌గారి 'భిజియా' నోట్లో పెట్టగానే నైట్రోజన్ కంపుకొట్టింది. "నావల్ల కాదురా నాయనా... పస్తన్నా ఉంటా" అని పైకే అనేశా. అంతే అక్కచెల్లెళ్ళ మూతులు మూరెడు సాగదీసి కూర్చున్నారు.

సాయంకాలం షాపింగుట! నేనూ వస్తానన్నా, వల్ల కాదన్నారు. అయినా నేను వింటేగా!

నవనవలాడుతూ కూరగాయలు రోడ్డుపక్కన దర్శనమిచ్చాయి. వాటివంక 'వీళ్ళు' చూస్తే ఒట్టు. అదేదో 'బ్రిలియన్స్ ఫ్రెష్ష్'ట అందులోకి అడుగుపెట్టారు. అదో ఘనతవహించిన సూపర్ మార్కెట్టుట.

ఓ తోపుడుబండి తీసుకుని, నానారకాల బ్రాండెడ్ దినుసులూ, పొడులూ, సరుకులతో ఆ బండి నింపి, ఇంకో సెక్షన్‌కి దారితీశారు.

ఆ సెక్షన్ ఫ్రూట్స్ & వెజిటబుల్ సెక్షనట. ఆ ఫ్రూట్స్‌ని చూస్తే నాకు జాలితో కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి. కన్నెపిల్లలా అందంగా ఆరోగ్యంగా మిసమిసలాడాల్సిన పళ్ళు, నీరసించిన వీరవనితలా నేలచూపులు చూస్తున్నై. తెచ్చి ఎన్నాళ్ళయిందో ఫ్రెషట ఫ్రెష్!

"ఫామ్ ఫ్రెష్ లెమన్' అని ఓ టాగ్ తగిలించబడిన నిమ్మకాయలు, డొక్కలు ఎండి డొప్పల్లా ఏడుస్తున్నై. 'రోబస్టా' అరటిపళ్ళు గెలనించి ఎప్పుడు రాలి భూస్థాపిత మవుదామా అన్నట్టు ఎదురుచూపులు చూస్తున్నై.

తోటకూరలో 'తడి' అనేది మాయమై 'పొడి'గా మారటానికి 'రెడీ' అన్నట్టుంది.

'ఏమో! కసూరిమెంతీలా పౌడర్ తోటకూర కూడా బ్రాండెడ్‌గా వస్తుందేమో! ఇహ మామిడిపళ్ళయితే, మొక్క మొలవడానికి సిద్ధంగా ఉన్నాయి.

"ఇక్కడ భలే వెరైటీలు దొరుకుతయ్యే అక్కా! అదిగో ఆ కాలీఫ్లవర్ చైనాదిట!" సంభ్రమంగా సా.కూ. 2, సా.కూ. 1 కి వివరిస్తోంది.

దాన్నిచూస్తే నా పంచప్రాణాలూ అడుగంటినై. తెల్లని కాలిఫ్లవర్ కాస్తా, చేతులు పడీ పడీ, చెమటలో స్నానం చేసి, నలుపూ, పసుపూ మిక్సయితే ఎలా ఉంటుందో అలా ఉంది. యా...క్...

భరించలేక నేను వాకిట్లోకి వచ్చా. అప్పటిదాకా హ్రీం క్లీం అంటున్న నా ముక్కులు, బయటకు రాగానే సుఖంగా పనిచెయ్యడం మొదలెట్టాయి.

"రండి బాబూ రండి! పెనమలూరు కాలీఫ్లవర్.... పువ్వు పదిరూప్పాల్... తాడిగడప ములక్కాడలు మూడూ అయిదు రూప్పాల్, కంకిపాడు చుక్కకూర మూడుకట్టలూ పదిరూప్పాల్!" అరుస్తున్నాడు కూరగాయలబండీవాడు రోడ్డుపక్కన నిలబడి, కరెక్ట్‌గా ఎస్ఆర్ఆర్ కాలేజీ గేటు ఇవతల.

నాకు ఉత్సాహం ఇనుమడించి అటు పరిగెత్తా. మా మద్రాసు మహాపట్నంలో చుక్కకూర అంటే చుక్కల్ని చూస్తేగానీ దొరకదు. మరి ఇక్కడ ఆకుపచ్చగా, తాజాగా, కన్నులపండుగ్గా కట్టలు కట్టలు కనిపిస్తే ఎలా ఊరుకోనూ!

అసలా దోసకాయలు? మేలిమి బంగారంలా పచ్చగా, నిండుగా, జగదేకవీరుడి కథలో బి.సరోజలా ఊరిస్తూంటే కొనకుండా మానడం ఎవడితరం?

చుక్కకూర పప్పు, కందిపొడి కొంచెం మిక్కుచేసిన దోసావకాయా, అదిగో అక్కడ మార్లిన్‌మన్రోలా ఊరిస్తున్న టొమేటోలతో చేసిన మిరియాలచారూ, ఆ పక్కన డబుల్‌ఫ్రెష్‌గా రారమ్మంటున్న అరటికాయని ఉడికించి, చిదిమి, అల్లం, పచ్చిమిర్చి దంచిన ముద్ద వేసి ఫైనల్‌టచ్‌గా నిమ్మకాయ పిండితే....

ఎక్కడన్నా ఎవరన్నా నన్ను ఆపగలరేమోగానీ, కూరగాయల దగ్గర మాత్రం నన్ను ఆపడం బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకైనా సాధ్యం కాదు.

ఈ విషయం మా ఉళ్ళోనే కాదు, మా వాళ్ళున్న అన్ని ఊళ్ళవాళ్ళకీ తెలుసు.

'వీర' లెవెల్లో నేను ఫటాఫటామని అన్ని రకాలూ (గన్నవరం నించి వచ్చే నీలపు వంకాయలతో సహా) కొనేసి, నా ఆత్మని శాంతింపచేసుకున్నా. పెళ్ళాం తిడితే తిట్టింది, హూ కేర్స్?

"చెప్పానా? ఓ పెళ్ళికి సరిపోయేన్ని మీ బావ కొనేసి ఉంటాడని!" నావంక గుర్రుగాను, వాళ్ళ చెల్లెలివంక ప్రసన్నంగానూ చూస్తూ అంది సా.కూ. నం.1.

"ఏంటి బావా! ముందరే చెప్పొచ్చుగా?" కోపంగా చూడబోయి, ఒకింత నవ్వు కలిసిన చిరాకుమొహంతో అన్నది సా.కూ. నం.2.

"నవ్విపోదురేల నాకేటి సిగ్గు!' అనుకుంటూ ఇంటికి చేరాం. నా సెల్లు మ్రోగింది. మా వేణుగాడు, మా అన్నగారి కుమారుడు.

"ఏంట్రా వేణుగారూ!?" అన్నాను.

"రిటైల్ వ్యాపారంలో విదేశీపెట్టుబడులు బాబాయ్. టీవీలో వస్తోంది చూడు" అని ఫోన్‌పెట్టేశాడు.

టీవీ ఆన్‌చేస్తే న్యూస్ నడుస్తోంది. న్యూస్ సంగతి ఏమైనా 'యాంకరి' మాత్రం యమా చలాకీగా రిటైల్ వ్యాపారుల్ని 'ఇంటరాగేట్' చేస్తోంది.

❀ ❀ ❀

ఒక్కసారిగా దుఃఖం ముంచుకొచ్చింది. అంటే గుండెల్లోనే బాధ పొంగిందనుకోండి.

పొద్దున్నే 'వంకాయలోయ్' అంటూ నెత్తిమీద గంప పెట్టుకుని వీధుల్లో తిరుగుతూ అరిచే మా సత్తిరాజు జ్ఞాపకం వచ్చాడు. అలాగే దోసకాయలమ్మే

'జోగులూ', ఆకుకూరలమ్మే రామలచ్చిమీ, తాజా తాజా చిలగడదుంపలమ్మే వెంకయ్యతాతా అందరు నా మనసులో మెదిలారు.

ప్రపంచంలో చోటులేక, ఎవరూ ఇక తన మాటలు వినరనుకుని 'నోటు' మీద సెటిలైన గాంధీగారూ గుర్తొచ్చారు. అలాగే కిరాణాకొట్టు సుబ్రహ్మణ్యం, బడ్డీకొట్టు సూర్నారాయణ, మిఠాయి నాగభూషణం మనసులో ప్రత్యక్షమై దీనంగా చూశారు. నిజమే..... వాళ్ళంతా నా చిన్ననాటి జ్ఞాపకాలకి 'లాకర్ల' లాంటి వాళ్ళు.

ఏ సరుకుకొన్నా సుబ్రహ్మణ్యం చిన్నబెల్లంముక్కో, శనగపప్పో పెట్టేవాడు. కారం సరుకు కొంటే మిఠాయి కొంచెం పొట్లాం కట్టి ఇచ్చే నాగభూషణం గుర్తొచ్చాడు.

"ఏం పంతులుగారూ... మీ అమ్మాయికి పెళ్ళంటగా! ఒకటో నెంబరు సరుకు పంపిస్తా. వెచ్చాల జాబితా కాస్త ముందు పంపించండి!" అనే కిరాణకొట్టు రామారావూ - "మామ్మగారూ, ఆస్మాకీ బ్రహ్మాండమైన బిళ్ళలొచ్చాయి. ఇవిగో తీసికెళ్ళండి. డబ్బులు ఆనక పంపిద్దురుగాని!" అని జబ్బులు గుర్తుంచుకుని మరీ మందులు తెప్పించే సూర్నారాయణా-

"అయ్యొద్దు అబ్బాయిగారూ, అవి ముదురువి.... ఇదిగో... నేను తీసిస్తా, ఈ బెండకాయలు తీసికెళ్లండి. లేకపోతే మీ అమ్మగారి ముందర మా పరువుపోద్ది" అంటూ బెండకాయల్ని చక్కగా ఎంపికచేసి ఇచ్చే ముత్యాలూ - వీళ్ళందరూ కళ్ళముందు మెదిలారు.

డబ్బులున్నా లేకపోయినా, నమ్మకం మీద అరువిచ్చేవాళ్ళు. ఇక రైతులైతే పంట వచ్చేవరకూ కిరాణాకొట్లల్లో 'ఖాతా' పెట్టుకునేవారు.

డబ్బివ్వడం కొంచెం ఆలస్యం అయినా ఎవరూ ఖాళీచేతులతో పంపేవారు కాదు. మహా అయితే మానెడు బియ్యం అడిగితే సోలెడుతో సరిపెట్టేవారేమో, అందుకే ఆ రోజుల్లో ఆకలిచావులు లేవు.

రెండేళ్ళపాటు పొలం పండకపోయినా, ఏ రైతూ పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకునే పరిస్థితి మాత్రం ఏనాడూ రాలేదు.

బస్తాల్లో ఉండే సరుకుని, కాయితం పొట్లాల్లో పోసి, కొలిచి, పురికొసతో కట్టిచ్చేవాళ్ళు గనక 'వ్యర్థాలు' ఉండేవికావు. ఇప్పుడు ఎక్కడ చూసినా పాలిథిన్ కవర్లే. తలంటుకి వాడే రూపాయి "సాచెట్స్" దగ్గర్నించీ, నూనెలూ, పచారీ

సరుకులూ కూడా పాలిథిన్ సాచెట్స్‌లోనే. ఎంత ఘోరంగా భూమిని బలి తీసుకుంటున్నాం! ఇది చాలక ఇప్పుడు మళ్ళీ ఈ 'వాల్‌మార్ట్‌లా?'

అమెరికా రైతులు ఓపక్కన ఏడుస్తూనే ఉన్నారు. 'ఈ వాల్‌మార్టులొచ్చి అమెరికన్ రైతుని చంపుతున్నా'యని. మరి మనమెందుకు వాళ్ళని ఆహ్వానించడం?

హాయిగా ఇంట్లో వండిన శుచికరమైన భోజనాలు మానేసి ఇప్పటికే యువత హోటళ్ళమీద పడుతుండగా, మెక్‌డోనాల్డ్స్ వస్తే? ఊహించడానికే మనసు బాధపడుతోంది. ట్రాక్టర్లొచ్చాక ఎద్దులు కనపడడం మానేశాయి. పాలబూతులొచ్చాక పాలూ పెరుగూ అమ్మే పడతులు కనుమరుగయ్యారు. బాటా చెప్పులూ బూట్ల దుకాణాలు వెలిశాక చర్మకార వృత్తి సర్వనాశనమైంది.

బాయ్ జలూకాలూ మలికా జ్యూయెలర్సూ వచ్చాక స్వర్ణకారులు పనిలేని వారయ్యారు.

విదేశీమిల్లులూ, జీన్సూ దిగబడ్డాక రాట్నాలూ, మగ్గాలూ మూగబోయాయి. ఇక ఈ వాల్‌మార్టులూ మెక్‌డోనాల్డ్‌లూ..... స్టార్‌బక్ కాఫీహౌసులూ వస్తే?

మహాత్మా.... విదేశీవస్తు బహిష్కరణ సంగతి సరే, మనంతట మనం చేసుకుంటున్న ఈ స్వదేశీ వస్తు బహిష్కరణ మాటేమిటీ? బియ్యం మనదీ బ్రాండు వాళ్ళదా? కందిపప్పు మనదీ 'కౌంటర్' వాళ్ళదా!

తటాల్న ఓ మెరుపు మెరిసింది మనసులో. కళ్ళకి మిరుమిట్లు గొలిపే వెలుగు. ఓ అనంతమైన కాంతిపుంజం వెలిసింది. హాయిగా నవ్వాను. "దేనికీ నవ్వుతున్నావూ?" పిచ్చాడ్ని చూస్తున్నట్టుగా నావంక చూసి అడిగింది సా.కూ. 1.

"ఇప్పుడు ఎన్ని వాల్‌మార్టులొచ్చినా నాకు భయం లేదు!" ఆనందంగా అన్నాను.

"అదేం?" ఆశ్చర్యంగా అన్నది.

"అవును! ఈ వాల్‌మార్టుల్లోనూ బ్రిలియంట్ ఫ్రెష్షుల్లోనూ ఉండేవాళ్లంతా ఉద్యోగస్తులు మాత్రమే!"

"అవునూ! అయితే?"

"వాళ్ళకీ మనకీ ఉండేది కేవలం 'మనీ'కీ, మనిషి'కీ ఉండే సంబంధమే గానీ మనిషి మనిషికీ మధ్యన ఉండే స్నేహబంధం కాదు!" పళ్ళికిలించా.

"అంటే?"

"ఇందాక మీరు తోపుడుబండి తోసుకుంటూ సరుకులూ కూరలూ దాంట్లో పడేసి, క్యూలో నిలబడి బిల్లుకట్టి సరుకులు తెచ్చుకున్నారు అవునా?"

"కాక? ఫ్రీగా ఇస్తారా?"

"వాళ్ళ దగ్గరకెళ్ళి ఒక్క బిస్కెట్టు ప్యాకెట్టు అప్పిస్తారేమో కనుక్కో"

"ఎందుకిస్తారూ?" వెర్రివాణ్ణన్నట్టుగా చూసింది.

"ఇవ్వరు! అదే మా కక్కిరాల పుల్లయ్య కొట్టుకెళ్ళి వెయ్యిరూపాయల సరుకు అణా అడ్వాన్సు ఇవ్వకుండా అప్పుగా తీసుకురావచ్చు!"

"అవును. ఇవాళో రేపో ఇస్తావనే నమ్మకంతో ఇస్తాడు. అప్పు తీర్చేంత సమర్ధత నీలో ఉందని తెలుసు గనక ఇస్తాడూ! విచిత్రం ఏముందీ?"

"ఆ సంగతే నేనూ చెప్పేది. వాళ్ళు అప్పు ఇచ్చినా ఎదుటివాడి తాహతుని అంచనా వేసుకుని ఇచ్చేవాళ్ళు. దానివల్ల ఎవడూ అప్పులు తీర్చడం కోసం ఇళ్ళమ్ముకుని పోలా. అప్పుడీ క్రెడిట్ కార్డులు లేవు గనుక అవసరమైనవి మాత్రమే కొనేవాళ్ళం.

ఇప్పుడు మీరు అవసరం ఉన్నా లేకపోయినా ఆకర్షణీయంగా కనబడే ప్రతీదాన్నీ ఎగబడి కొంటున్నారు. దాంతో బడ్జెట్టు బ్యాలన్స్ తప్పుతోంది"

"నువ్వేమీ ప్రణబ్ ముఖర్జీవో, రోశయ్యగారివో కాదు గానీ, ముందు విషయం చెప్పు" వాక్ప్రవాహానికి అడ్డుకట్టవేసింది సా.కూ. 1.

అడ్డుకట్టలు వెయ్యడానికేగా పెళ్ళాలున్నదీ!

"ఇక్కడ అప్పు ఇవ్వడం, తీసుకోవడం గురించి కాదు నేను చెప్పేది. ఓ దుకాణదారుకీ, మనకీ ఇక్కడ ఉండే సంబంధం హ్యూమన్ రిలేషన్‌షిప్, అనగా మానవీయ సంబంధం గురించి" విశ్రాంతిగా అన్నా.

"ఆహా!"

"అవును! లుంగీ ఎగ్గట్టుకుని తిరుగుతానంటావుగా! ఓసారి నాతో రా. కూరగాయల ఆవిడ దగ్గరికెడితే, "ఏం బాబూ నాలుగురోజులయింది కనిపించకా! ఊరెళ్ళారా?" అనడుగుతుంది.

కిరాణాకొట్టుకి పోతే, "బావున్నారా సార్.... లిస్టు ఇవ్వండిచాలు... పిల్లాడితో సరుకు ఇంటికే పంపుతా!" అనంటాడు. ఇవన్నీ మెకానికల్‌గా ఉండే బ్రిలియన్స్ ఫ్రెష్షుల్లో దొరుకుతాయా?"

"అంటే నిన్ను పలకరించేవాళ్ళే గొప్పంటావు?"

"ముమ్మాటికీ అంతే. మన ఇంట్లో శుభం జరిగితే వాళ్ళు ఆనందిస్తారు. మనకు కష్టం కలిగితే 'అయ్యో' అని కనీసం జాలిచూపుతారు. అంతకంటే ఏం కావాలి? డబ్బుకేం! ఉండొచ్చూ, ఉండకపోవచ్చు. కానీ మనుషులూ, మమతలూ మాత్రం ఉండితీరాలి.

కనీసం కష్టం, సుఖం పంచుకునే వాళ్ళుండాలి. వ్యాపారస్థుడికి కొనుగోలుదారుడు కావాలి. కొనుగోలుదారుడికి వస్తువులు సమకూర్చే దుకాణదారుడు కావాలి. ఆ ఇద్దరి మధ్యా స్నేహసంబంధం ఉంటే, అదే కలకాలం మనిషిని మనిషిగా నిలబెడుతుంది!"

"ఉపన్యాసం బాగుంది!" మూతి ముచ్చటగా తిప్పింది సా.కూ. 2.

"యా! ఆహారాన్ని బట్టి ఆలోచనలూ, ఆలోచనలని బట్టి ఆరోగ్యమూ ఉంటుందంటారు పెద్దలు. అమ్మేవాళ్ళకీ, కొనేవాళ్ళకీ మధ్యలో సత్సంబంధాలు ఉంటేనే ఆరోగ్యమనే మహాభాగ్యం సిద్ధిస్తుంది"

"చప్పట్లు కొట్టమంటావా?"

"కొట్టో కొట్టో కొబ్బరికాయా కయ్యంముందూ!" రాగయుక్తంగా పాడాను.

"అదెట్టాగూ తప్పదు. పాటలు ఆపకపోతే!..." మూతితో పాటు చెయ్యి తిప్పింది ఆవిడ.

"అమ్మాయ్....మీరెన్ని అనుకున్నా ఏమనుకున్నా, నాలాంటివాళ్ళు మాత్రం మీరు ముచ్చటపడే 'తోపుడుబండి' మార్కెట్లోకి అడుగుపెట్టరు. నెత్తిన బుట్టలో కూరలమ్మే కనకమ్మే నాకు కనకదుర్గమ్మ. ఎడ్లబండిలో దోసకాయలు వేసుకుని వీధివీధీ తిరిగి అమ్ముకునే బాలయ్యే నాకు భీమేశ్వరుడు.

చెవిలో పెన్సిల్ పెట్టుకుని బట్టలు కుట్టి ఇచ్చే సింహాచలమే నాకు నరసింహస్వామి. ములక్కాడలమ్మే మాణిక్యమ్మే నాకు అలమేలు మంగతాయారు.

ఫో... నువ్వూ, మీ చెల్లి పోయి ఆ చచ్చుపుచ్చు చైనా కాలీఫ్లవరు వండుకోండి. నేనుమాత్రం నాటు సపోటాలమ్మిన సక్కుబాయమ్మ సాక్షిగా ఆవకాయ కలుపుకునే అన్నం తింటా!"

డిక్లేర్ చేశాను. ఎంతైనా మిలట్రీవాడ్ని కాదూ! జై... రైతుబజారూ, జైజై..... రైతుబజారూ!

– స్వాతి 06-09-2013

# ఇంకేం చెప్పాలీ

అద్భుతమైన అందం ఆమెది. నాలుగడుగుల పదంగుళాలు ఉంటుందేమో! 'పొడుగు' కిందకి రాదు. కాని 'పొట్టి' అనీ అనిపించదు. ఆరోగ్యమైన అవయవాలతో బిందె మోసుకెళ్ళేటప్పుడు 'తొణికే' నీళ్ళలాగా, ఆమె నడిచేటప్పుడు 'వయ్యారం' తొణికిసలాడేది.

తీర్చిదిద్దినట్లు ఉండే కనురెప్పలూ, కనుబొమలూ, పెదాలూ... గుండ్రని భుజాలూ, ముద్దొచ్చే చేతులూ ఓహ్... ఓ మహాశిల్పి చెక్కిన సజీవశిల్పంలా ఉండేది.

నల్లని కనుపాపలు కలలు నిండిన సరోవరాల్లా వుండేవి. ఒత్తైన జుట్టు జడగా మారి నాగుపామును గుర్తుకు తెచ్చేది. నవ్వులో వెయ్యి వసంతాలు విరిసేవి.

ఇహ ఆమె పలువరుస అద్భుతం. నల్లని ఆకాశంలో తటిల్లున ఓ తటిల్లత మెరిసినట్లుగా...ఆమె నవ్వినప్పుడల్లా ఆ పలువరుస మెరిసేది. న్యాయంగా చెబితే, వర్ణించడానికి అందని అందం ఆమెది.

ఆమె నడిచి వెడుతూంటే ఓ చక్కని పరిమళం జనాల్ని తాకేది. ఆ పరిమళ భారంతో కళ్ళు మత్తెక్కి మూతలు పడేవి. గొప్ప ఇంట్లో పుట్టింది. గొప్ప చదువే చదివింది. ఎన్ని 'గొప్ప' సంబంధాలొచ్చినా నవ్వి ఊరుకునేదేకానీ అవునసీ కాదనీ చెప్పేది కాదు(ట).

ఓ రోజు నా ఫ్రెండ్ నన్ను ఆమెకి పరిచయం చేస్తూ "సరూ, ఇతనో బుద్ధావతారం. ఇతనివల్ల ఆడవాళ్ళకి అపకారం జరగదని మాత్రం చెప్పగలను. అన్నీ పారేసుకుంటాడు. మిగతా సగం వెతుక్కుంటూవుంటాడు. జీవితంతో సహా!" అంది.

ఆమె తన పెద్దపెద్ద కళ్ళతో నా వంక చూసింది. ఫ్లడ్ లైట్ల వెలుతురు నామీద పడ్డట్టనిపించింది. మళ్ళీ నాఫ్రెండే, "అబ్బాయ్...ఈమె సరస్వతి... ఒకసారి చూస్తే జన్మలో ఎవరూ మర్చిపోలేరు!" అని తనని నాకు పరిచయం చేసింది. "పోవే!" అని నవ్వేసింది సరస్వతి. ఆ నవ్వుతో నా గుండె నిండిపోయింది.

మెల్లగా మా పరిచయం పెరిగింది. పుస్తకాలు ఇచ్చిపుచ్చుకోవడం దగ్గర్నించి సాహిత్యచర్చదాకా వచ్చాం. ఒకరోజున నన్ను 'మీరు' అనకుండా 'నువ్వు' అంది. ఎంత సహజంగా అన్నదంటే, నన్ను నేను ఆమె 'ఆప్తుడి'గా భావించేంతగా.

మరోసారి "నువ్వంటే నాకిష్టం...ఎందుకో తెలుసా? ఏనాడూ ప్రేమాగీమా అంటూ నాదగ్గర పిచ్చిమాటలు మాట్లాడవు గనుక!" అంది.

"మాట్లాడేంత ధైర్యవంతుణ్ణి కాదేమో!"

"ఊహూ! నీ గురించి నీకంటే నాకే ఎక్కువ తెలుసు. ఏం?" అని నవ్వింది. ఆ నవ్వులో చిన్న టీజింగ్.

"ఆ మాట ఒప్పుకుంటా!" పచ్చికమీద వెల్లకిలా పడుకుని అన్నాను. తనూ,నాకు ఓ అడుగున్నర దూరంలో వెల్లకిలా పడుకుంది. మేఘాలంటే నాలాగా తనకీ ఇష్టమే. క్షణక్షణం రూపుమార్చుకునే మేఘాలను చూస్తూ చాలాసేపు అలా మౌనంగా ఉన్నాం.

"ఆ మేఘం చూడు. ప్రియుడికోసం ఎదురుచూస్తున్న ప్రియురాలిలా లేదూ?" సన్నగా అంది.

"అది ఆడమేఘమని ఎలా తెలుసు?" అడిగా.

"చూస్తే తెలుస్తుంది!"

"చూస్తూనే ఉన్నాగా! అయినా మేఘాల్లోకూడా ఆడా మగా తేడా లుంటాయా?" నవ్వాను.

"పిచ్చిమొహమా... నల్లరంగులో నీలం కలుపుకున్న మేఘాలు ఆడమేఘాలే! అవేకదా, ఆడది కన్నీళ్ళు వర్షించినట్టు చినుకుల్ని వర్షించేదీ!" తన మంద్రమైన స్వరం నన్ను మత్తెక్కించింది.

"ఇంతకీ ప్రియుడు వస్తాడా?"అన్నాను.

"ఏమో!" నిట్టూర్చింది.

"ఎందుకా నిట్టూర్పు?"

"అదీ నాలాగే ఎదురుచూస్తోందని!" వినీవినిపించనట్లుగా అంది.

"నీలాగా ఎదురుచూస్తోందా?నువ్వు ఎవరికోసం ఎదురుచూస్తున్నావూ?" లేచి అడిగా.

"ఎవరికోసమో తెలియదు! ఎవరో వస్తారు. అప్పుడు నేనేదో అయిపోతా!"

"అంటే?"

"కనులు తెరిచి కలలు కంటున్నానోయ్ పిచ్చోడా...!"

"వచ్చేవాడు ఎలా ఉండాలీ?"

"ఎలా ఉండాలో నిజంగా నాకు తెలీదు, నాకు కావల్సింది అతడు ఇవ్వాలి"

"ఏం కావాలి?"

"అదీ తెలీదు. ఏదో ఇవ్వాలి. ఆ ఇచ్చేదే నాకు కావాల్సినదేమో!" మళ్ళీ నిట్టూర్చింది.

నేను మాట్లాడలా.

"నీకు అర్థంకాలేదు గదూ?"

"ఊఁ"

"నాకూ అర్థం కాదు. అసలు మనిషికి ఏం కావాలి? ఏది దొరికితే తనువూ, మనసూ, ఆత్మా తృప్తితో నిండిపోతాయి?" తనలో తను మాట్లాడుకుంటున్నట్టుగా అంది.

"నీ ప్రశ్నకి సమాధానం ఎన్నటికీ దొరకదేమో?"

"ఎందుకు దొరకదూ?"

"ఎందుకంటే ఎవరికీ సమాధానం దొరకలేదు గనుక! మలుపు మలుపునా వెతుకులాటే కదా బతుకంటే!"

"దొరికేదాకా వెతుకుతూనే వుంటా!" స్థిరంగా అంది.

మెల్లగా నిశాకన్య తన జుట్టుని ఆకాశం మీద పరిచింది. ఆమె కురుల మడుగున వెలుగు అణగిపోయింది. ఇళ్ళలో బల్బులు వెలిగినట్లు ఆకాశంలో నక్షత్రాలు ఒకటొకటిగా వెలిగాయి.

చీకటి చీరమీద తళుకుతారల అద్దకం...దారితప్పిన పక్షులు చీకట్లో కూతలేస్తూ ఎగురుతున్నాయి.

చల్లగాలి సరస్వతి పైటకొంగుమీద నాట్యం చేసింది.

"పోదాం!" అంటూ లేచి తన చేయి నాకు అందించింది. మెత్తని...వెచ్చని ఆ చేతిని జీవితాంతం అలాగే పట్టుకోవాలనే పిచ్చిఆశ ఆ క్షణంలో నా మనసులో మెరిసింది. కానీ కొన్ని పరిచయాలకి హద్దుంటుంది. కొన్ని పరిచయాలు ఎన్నాళ్ళైనా హద్దు దాటవు, దాటనీయవు...!

వారానికోసారి ఎవరూ పోని ఆ పార్కులోచేరి, గంటో రెండుగంటలో మేఘాల్ని గమనిస్తూ మాట్లాడుకోవటం తప్ప-ఏనాడూ ఆమె నన్ను వాళ్ళింటికి పిలవలా...నేనూ ఆమెని అడగలా...

ఓ ఏడాది గడిచింది.

మొదట తనకి ట్రాన్స్‌ఫరైంది.

ఆ తరువాత మరో ఊరికి నన్నూ బదిలీ చేశారు.

మొదట్లో వరదొచ్చిన నదిలాగా జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు, ఆ తరువాత నీరింకిన నదిలా ఆగిపోయాయి. జీవితమనే వారధినించి కాలం నదిలాగా ప్రవహించి పోతూనేవుంది.

మళ్ళీ ఇన్నాళ్ళకి! దాదాపు పదిహేనేళ్ళ తరువాత...నేనూ నా కొలీగూ నడుస్తుండగా సరస్వతిని చూశా. ఆమె ఠీవిగా మహారాణిలా ఓ ఇంటి ముందు కారు దిగింది.

'ఆమే సరస్వతి' అని నా మనసుకి అనిపించింది. కానీ ఎలాగా తెలుసుకోవడం? నా కొలీగ్ ఆగి ఆమెవంకే చూడటం గమనించా. ఆమె ఇదేమీ పట్టనట్టో, తెలియనట్టో గేటు తీసుకొని లోపలికి వెళ్ళిపోయింది. కారు వచ్చిన దారినే వెనక్కి మళ్ళింది.

నా కొలీగ్ 'నిట్టూర్చడం' విన్నా.

"ఆమె...!" అడిగా.

"స్పెంట్ ఫోర్స్" అన్నాడు.

"అంటే?"

"ఖర్చయిన శక్తి అనుకోవచ్చు!" ఒక్కసారి గాఢంగా నిశ్వసించి అన్నాడు అతను.

"అర్థంకాలా!" అయోమయంగా అన్నా.

"ఆమె జూలియట్. బోలెడుమంది రోమియోలు మాడి మసైపోయారు!" అతని గొంతులో కచ్చ.

"పేరు తెలుసా?" అడిగా.

"సరస్వతి!"

అప్పుడు నాకు నోటమాట రాలేదు. పది జన్మలెత్తినా సరస్వతి అటువంటి దంటే నేన్నమ్మను. అదేమాట నా కొలీగ్‌తో అన్నాను. "ఆవిడ అందం అటువంటిది. ఆమె గురించి 'చెడు' ఎవరు చెప్పినా ఎవరికీ నమ్మాలనిపించదు!" నిర్లిప్తంగా అన్నాడు.

"అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలవూ?"

"నేనూ ఓ శలభాన్నే గనుక!"

"వ్వాట్"

"అవును! నేను కూడా నెలల తరబడి కుక్కలా ఆమె చుట్టూ తిరిగా.. దాసానుదాసుణ్ణయ్యా. వ్రతం చెడిందిగానీ ఫలం దక్కలా!"

"అంటే?"

"నన్ను ముట్టుకోలేదు. తనని ముట్టుకోనివ్వలేదు. దగ్గరగానే ఉంచు కుంటుంది. కానీ ఆ మత్తులోంచి బయట పడ్డాక మాత్రమే తెలుస్తుంది...ఆ దగ్గరితనంలోని దూరమెంతో!" కచ్చ–బాధ కలగలిసిన స్వరంతో అన్నాడు.

చాలాదూరం నడిచాక మా దారులు వేరయ్యాయి. అతను అటూ...నేను మరో వీధికీ...!

మళ్ళీ వెనక్కి తిరిగి సరస్వతి ఉండే మేడవైపు అడుగులు వేశా. కలుసుకోక పోతే నాకు నిద్రపట్టదని తెలుసు.

గేటు ముందుకి చేరగానే, 'వెల్‌కమ్' అంటూ, నన్ను లోపలికి రమ్మని ఆహ్వానిస్తూ గేటు తీసింది.

"నేను...నేను..." తడబడ్డా.

పకపకానవ్వింది. అదే మెరుపు...

"నువ్వు నన్ను గుర్తిస్తావనీ, వెనక్కి తిరిగొస్తావనీ నాకు తెల్సు!" అంది.

"ఎలా? నువ్వు నన్ను చూడలేదుగా?"

"ఆడదానికి తలచుట్టూ కళ్ళుంటాయోయ్ పిచ్చిమొహమా. నేను కారు దిగకముందే అద్దాల్లోంచి నిన్నూ, నీ మిత్రుణ్ణీ చూశా!"

"మరి అప్పుడే ఎందుకు పిలవలేదూ!"

"నీకు నటించడం రాదు. నీ పక్కనున్నవాడు నాకు పరిచయస్తుడని ఇప్పటికే నీకు తెలిసివుంటుంది. ఎందుకంటే అతడే నా గురించి నీకు చెప్పివుండాలి. అవునా?"

"అదీ..." ఇబ్బందిగా గొణిగా.

"దాచనక్కర్లేదు మహాశయా! నన్ను పచ్చిగా వర్ణించి ఉండొచ్చు. లేకపోతే నేనో అభినవ చింతామణినని చెప్పి ఉండొచ్చు. కదూ?" మళ్ళీ నవ్వింది.

పొద్దున్నే 'విరిసిన' లేతపద్మంలా ఉందా నవ్వు. నేను ఆమె ముఖంవంక చూస్తూ అక్కడే నిలబడిపోయా.

"నా మొహమే చూడాలని ఉంటే లోపలికి వచ్చి కూడా చూడొచ్చు! పద!" నన్ను గేటు లోపలికి లాగి, గేటుమూసి ఇంటివైపు నడవటం మొదలెట్టింది. 'సౌందర్యం' ఒంపులు తిరుగుతుంటే చూడటం ఓ 'అదృష్టం!'

"ఈ సమయంలో కాఫీలూ, టీలూ తాగవని నాకు తెలుసు... ఏం కావాలి?" నన్నో కుర్చీలో కుదేసి నా ఎదుటి కుర్చీలో కూర్చుంటూ అంది సరస్వతి.

"కాసేపు నిన్ను చూడాలి... అంతే!"

"ఓరి పందూ..... నీకు చాలా ధైర్యం వచ్చిందే!" ఎంతో మురిపెంగా అంది.

ఎందుకో తలవంచుకున్నాను.... కానీ ఆమె చూపులు నన్ను తాకుతున్నట్లు అనిపించింది.

"మాటలు కరువైపోయాయా నేస్తం?" అంది. అలా అంటున్నప్పుడు ఆ గొంతులో ఏదో విషాదం.

చటుక్కున తలెత్తి – "నీకోసం ఏనాడూ మాటల కరువురాదు... కానీ ఏం మాట్లాడాలా అని ఆలోచిస్తున్నా!" మనసులో ఉన్నదే అన్నా.

"నామీద అసహ్యంలాంటిది కలగడంలేదూ?"

"ఒకప్పుడు నువ్వు అన్నమాటే ఇప్పుడు నేనూ అంటాను సరస్వతీ. నీ గురించి నీకంటే కూడా బాగా నాకే తెలుసు" అన్నాను.

"పదిహేనేళ్ళ తరువాత కూడానా?"

"ఆకాశం మారలా... వెన్నెల మారలా... నువ్వూ మారవు!" అన్నాను.

"నేనంటే ఎంత నమ్మకం బంగారూ!" గభాల్నలేచి నా పక్కన నిలబడి నా భుజం మీద తలని ఆనించింది.

"స్నేహానికి పునాది నమ్మకం కదూ!'" నేను తలతిప్పబోతుంటే ఆమె అడ్డుకుంది.

"కాసేపు నన్ను ఇలానే ఉండనీ! నీ భుజంమీద తలానితే మనసుకి హిమాలయాల్లో ఉన్నంత హాయిగానూ, ఆనందంగానూ ఉంది!"

కొన్ని నిమిషాలు గడిచిపోయాయి. ఆమె వెచ్చని నిశ్వాసాలు నా మెడని తాకుతున్నాయి. ఆమె లోంచి ఓ సన్నని(?) పరిమళం నన్ను తాకుతూ, నా శ్వాసలోనించి గుండె అంచుల్ని తాకి బయటికొస్తోంది నిట్టూర్పులా. వాల్‌క్లాక్ తొమ్మిది కొట్టింది.

"పద! తొమ్మిదయింది. హాయిగా కాసేపు లాన్‌లో పడుకుని మేఘాల్ని చూద్దాం... విసుగొచ్చాక అన్నం తిందాం!" అంటూ తను నిటారుగా నిలబడి నా చేయి పట్టుకుని లాన్‌లోకి తీసుకుపోయింది. పచ్చగడ్డిమీద పడుకుని ఆకాశాన్ని చూస్తున్నాం. వెన్నెలే వెన్నెల.... తెల్లని మేఘాలు.... తెల్లగా వెండిదీపాల్లా మెరుస్తున్న నక్షత్రాలు, తెరలు తెరలుగా వీస్తున్న చల్లగాలి చలి పుట్టిస్తోంది.

"ఆ మెరిసే తారలేమిటో తెలుసా? మనసులోని జ్ఞాపకాలు!" గుసగుసగా అంది.

"మరి మేఘాలు?"

"అవి మగవి! వర్షించవు.... తెల్లగా తేలిపోతాయి!"

"నువ్వు మారలేదు!"

"పోనీ నువ్వు మారావా?"

"ఏమో!"

"మారలేదోయ్ బదుద్దాయ్!" నవ్వుతూ అంది.

వెన్నెల ఆమె పెదవులమీద తొణికిసలాడితే, తారలు ఆమె పలువరసమీద ప్రతిఫలించాయి. "నన్ను ప్రేమిస్తావా సరస్వతీ?" తెలియని దీనత్వం నా మాటల్లో నాకే వినిపించింది.

గలగలా నవ్వింది. ఓ నైపుణ్యంగల మహావిద్వాంసుడు 'జలతరంగిణి' వాయించినట్లనిపించింది.

"ఎందుకు నవ్వుతున్నావూ?"

"అసలు ప్రేమంటే ఏమిటీ?"

నేను మాట్లాడలా... ఏమని చెప్పనూ? శరీరంతో సంబంధంలేని స్వచ్ఛమైనదనా? శరీరాలు కలిస్తేగానీ ప్రేమయొక్క గాఢత తెలీదనా? సరే... శరీరాలు కలవకపోతే ప్రేమని ఏవిధంగా తెలపాలీ? 'స్పర్శ' అనేది ఓ అద్భుతమైన ప్రకృతి ఇచ్చిన వరం. కొన్నికోట్ల మాటలు చెప్పలేని భావాన్ని ఓ చిన్న 'స్పర్శ'తో తెలియజేయవచ్చు. కానీ 'స్పర్శ'ని 'కోరిక'గా తను భావిస్తే?

"మాట్లాడవేం?" అడిగింది.

"నువ్వు చెప్పు!"

"నాకు తెలిస్తేగా? వెతికి వెతికి అలిసిపోయాను! ఏదో కావాలనుకున్నా. ఎవరో వచ్చి నాక్కావలసింది ఇస్తారనుకున్నా... నువ్వప్పుడెప్పుడో అన్నట్టు ఆ ప్రశ్న జవాబు లేని శేషప్రశ్నగానే మిగిలింది.

ఒక్కొక్కరిలో ఒక్కో ప్రత్యేకత చూసి, అదే నాకు కావలసిందేమో అనుకున్నా. విచిత్రం ఏమంటే వారిలో ఆ 'గుణం....' ఆ 'ప్రత్యేకత' వరకే నాకు కనిపించింది. మరేమీ కనిపించలా! ఏనాడూ ఆ 'ప్రత్యేకత'లు నా శరీరాన్ని అర్పించేంతగా అనిపించలా... అందుకే.... ఇలా యవ్వనం దాటి.... ఏకాకిగా మిగిలున్నా!" మాటలు ఆపి మౌనానికి చోటిచ్చింది.

"నిజమే! నువ్వన్న ప్రతిమాటా నిజమే... కాని సరస్వతీ, శరీరం వేరూ, ప్రేమ వేరూ అనుకున్నంతకాలం నీవైనా, నేనైనా ఇలాగే ఉండిపోతాం. నది

ఉంది... చుక్క నీరు లేదు...లాభం ఏమిటీ? శరీరం ఉంది, అనుభవం లేదు. కళ్ళున్నాయి.... చూపు లేదు. చెవులున్నాయి... వినికిడి లేదు. హృదయా లున్నాయి... 'స్పందన' లేదు. ఎందుకో ఆలోచించావా? ఉన్నదాన్ని మరిచి లేనిదాన్ని ఆశించటం వల్ల! నీలో ఉన్నదేదో ముందు తెలుసుకో!"

"ఎలా తెలుస్తుందీ?"

"ఎవర్నో ఒకర్ని ప్రేమించాలి! అందుకే ఆ ఎవరో ఒకరిగా నన్ను భావించి, ప్రేమించలేవా?" కొంచెం దీనత్వం నా మాటల్లో మళ్ళీ వినిపించింది... నాకే.

"ఎందుకు ప్రేమించాలి?"

"నాకు నేను తెలియాలంటే నువ్వు 'నన్ను' ప్రేమించాలి. నీచేత ప్రేమించబడినప్పుడే నీకేం కావాలో నాకు తెలుస్తుంది." ఈసారి నా గొంతులో ఆ దీనత్వం లేదు. స్థిరత్వం ఉంది. చాలాసేపు మౌనం ఓ మూగనర్తకిలా నాట్యం చేసింది. దూరదూరంగా ఉన్న రెండు మేఘాలు దగ్గరై, ఏకమై మళ్ళీ విడిపోయాయి.

"కలిసి విడిపోయిన మనసులు" వాటినే చూస్తూ అంది. నేను మాట్లాడలా.

"ఎన్నో మనసుల్ని వెతికా... అవన్నీ నా అందాన్నే చూశాయి. ఆ మనస్సుల్లో కాంక్ష తప్ప ఏమీలేదు" మళ్ళీ అంది సరస్వతి.

"తీసుకోవాలనుకునేవాళ్ళకి ఇవ్వడం ఏమి తెలుస్తుందీ?" తనలో తనే అనుకున్నట్టుగా అంది.

"నా మనసో ఖాళీగ్లాసులాంటిది! దాన్ని దేంతో నింపాలో నాకే తెలీదు!" మళ్ళీ అంది సన్నగా నిట్టూరుస్తూ.

"చాలాసార్లు చచ్చిపోవాలనిపించింది!"

ఆ స్వరంలోని విషాదం వింటే ముఖేష్ తన పాటల్ని మెరుగుపరుచుకునే వాడు. ఏ బాపూలాంటి చిత్రకారుడో వింటే, ఓ బాకుతో గుండెల్లో పొడుచుకుని ఆ రక్తంతో ఓ చిత్రాన్ని మలిచేవాడు. ఓ గంట మౌనంగా గడిచిపోయింది.

"ఒకసారి నన్ను కౌగిలించుకోవూ?" నావైపు తిరిగి ఆర్ద్రంగా అడిగింది సరస్వతి.

తనవైపుకి తిరిగి కౌగిలించుకున్నాను. తల నిమరాలనిపించింది. తల నిమిరా... ఆర్తిగా నన్ను కౌగిలించింది. ఆ కౌగిలింతతో ఆమె ఒంటరితనమూ,

వేదనా నాకు అర్థమయ్యాయి. దగ్గరగా, ఇంకా దగ్గరగా లాక్కుని పొదువుకున్నాను. శబ్ధంలేని ఏడుపెలా ఉంటుందో ఆ క్షణం నాకు తెలిసొచ్చింది. ఆమె గుండెలు ఎగసెగసి పడుతున్నాయి.

చెంపలు తడిమాను... వెచ్చని కన్నీళ్ళు...ధారగా... వర్షంలా! నా కళ్ళల్లోంచీ నీళ్ళు ఉబికాయి. ఇంకా పెనవేసుకుపోయాం... ఆ కౌగిలిలో ఆశలేదు.... అహంలేదు... శరీరాలు లేవు... మనసులు మాత్రమే పెనవేసుకున్న అనుభూతి. ప్రకృతి పిలుపు! ఆకాశాన్ని రమ్మని...!! ఆకాశం, భూమీ కలవ్వు. కలిసినట్టుగా కనిపిస్తై! అంతే.

కానీ ఇప్పుడు కలిశాయి.

దిక్కుల పంజరాన్ని చీల్చుకుని ఆకాశమూ, తనదైన సర్వాన్నీ వదిలేసి భూమీ... కలిసిపోయాయి. ఆ కలయికలో మోహం లేదు... మౌనం ఉంది.

ఆ కలయికలో 'రెండు' లేవు! ఒకటే ఉంది. దటీజ్ ఇన్‌సెపరబుల్. ప్రళయం లాంటి ప్రణయం... ఉప్పెనొచ్చిన సంద్రంలా మనసులు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. హోరుగాలికి కూలే 'మహావృక్షాల్లా' హద్దులు కూకటివేళ్ళతో కూలిపోయాయి...

మళ్ళీ నిశ్శబ్దంలోంచి శబ్దం.... ఆ శబ్దం "ఓం"కారమై దిక్కుల్ని ఆక్రమించింది. అప్పుడు... ఎన్నో యుగాలు క్షణాల్లో ఐక్యమయ్యాక... అప్పుడనిపించింది...

'ఈమె ఇప్పుడే.... ఈ క్షణానే..... నాకోసం మళ్ళీ పుట్టింది!' అని. విచిత్రంగా తనుకూడా, "నా కోసమే గదూ నువ్వు పుట్టిందీ? అదీ ఇప్పుడే, ఈ క్షణంలోనే కదూ?" అంటూ పెదాలతో నా పెదవిని మూసేసింది. ఇంకేం చెప్పాలి? మాట్లాడే నోరు చూడలేదు... చూసే కళ్ళు మాట్లాడలేవు! ఇంకేం చెప్పాలీ?

– స్వాతి 24-9-2010

# ఆ క్షణం

ఆకాశం నీలంగా, స్వచ్ఛంగా ఉంది, నగరాల్లో ఇంత స్వచ్ఛంగా ఆకాశాన్ని చూడగల గడం వరమేనని చెప్పాలి. ఎప్పుడూ ధూళీ దూసరతో నిండివుండే వీధులు కూడా శుభ్రంగా ఉన్నాయి. ఆకాలంలో అకారణంగా కురిసిన వర్షం ఢిల్లీ వీధుల్ని అద్దాల్లా మార్చింది. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. ఆఫీసుకి సెలవు కావడంవల్ల మనసూ హాయిగానే ఉంది. "వచ్చేస్తున్నానోచ్!" అన్న 'తరళ' మాటలు నా చెవుల్లో 'రింగు'మంటూనే వున్నాయి.

ఎంతసేపూ! మరో పదిగంటలు. ఆ తరువాత? నేనూ...తనూ...బస్ అంతే. "పురానాదిల్లీకి వస్తావా?" అడిగాడు నారాయణన్.

"యా!మహదానందంగా వస్తా!" ఈలవేసి మరీ కారెక్కాను. నారాయణన్ తమిళవాడు. అతని అత్తా, మేనమామ, మేనమామకూతురు ఓల్డ్ ఢిల్లీలో ఉంటున్నారు. అత్తకూతుర్నే త్వరలో పెళ్ళిచేసుకోబోతున్నాడు.

ట్రాఫిక్ పెద్దగా లేకపోవటంతో తొందరగానే 'రెడ్ ఫోర్ట్' చేరాం. "నేనిక్కడ దిగుతా!" రెడ్‌ఫోర్ట్‌కి ఓ ఫర్లాంగు ఇవతలే కారు ఆపమన్నా.

"రావచ్చుగా నాతో!" అన్నాడు నారాయణన్.

"పాయసంలో పలుగురాయిలాగా మీ మధ్య నేనెందుకూ?" నవ్వి కారు దిగాను.

కారు వెళ్ళిపోయాక ఎదురుగా చూశాను. ఓ లలనామణి నాకంటే ఓ ఇరవై గజాలముందు నడుస్తోంది. అద్భుతమైన కదలికలు. ఎత్తు ఐదడుగుల ఆరంగుళాలు ఉంటుందేమో! ఎత్తుకి తగిన సౌష్టవం.

చక్కగా, పొందిగ్గా, అందంగా చీర కట్టుకుని ఇంత నాజుగ్గా ఇంత వయ్యారంగా నడుస్తున్న ఈ అమ్మడి ముఖం ఇంకెంత అందంగా వుంటుందో! ముఖం చూడాలంటే గబగబా నడచి ఆమెని క్రాస్‌చేసి వెనక్కి తిరిగిచూడొచ్చు. కానీ మనసు ఒప్పుకోలేదు.

"ఒరేయ్.... ఏం చేస్తున్నావురా ఈడియట్? అంత బాగుందా ఆవిడ? చంపేస్తానొరేయ్!" మనసులోంచి అరిచింది తరళ.

"కూల్ బేబీ కూల్... కేవలం చూడటం వల్ల మనసేం మైలపడదు. అయినా నువ్వొచ్చాక కళ్ళకి గంతలు కట్టుకునే నడుస్తాలే!" అని మనసులోని తరళకి నచ్చచెప్పుకుని ఆ పిల్లవంక మళ్ళీ చూశా.

ఆ నడకలో ఒక రిథమ్, ఒక సొగసు, ఒక హొయలు... నా కళ్ళని కట్టి పడేస్తున్నై. ఆమె ఉన్నట్టుండి ఆగింది. వెనక్కు తిరిగింది. ఆడవాళ్ళకి తలచుట్టూ కళ్ళుంటాయా! ఆ మొహం ఎక్కడో చూసిన మొహమే. ఆమె నావంక చూస్తూ నవ్వింది.

ఆ 'నవ్వు'తో ఆమె నాకు గుర్తుకొచ్చింది. గబగబా అడుగులు వేసి, "మీరు వసుమతి కదూ!" అన్నాను.

"అవును. మీ సిస్టర్ సుకన్య క్లాస్‌మేట్‌ని. మిమ్మల్ని ఇక్కడ కలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది. నా పేరు జ్ఞాపకం ఉన్నందుకు థాంక్స్!" నవ్వింది.

"సామాన్యమైన పేరుకాదుగా మీదీ... ఇంతకీ ఇక్కడే ఉంటున్నారా?" అడిగాను.

నడుస్తూ చాందినీ చౌక్‌వైపు తిరిగాం."ఉహూ! నిన్ననే వచ్చా ఢిల్లీ. నా స్నేహితురాల్ని అడిగి బస్‌నెంబర్లు నోట్‌చేసుకుని రెడ్‌ఫోర్ట్ చూడాలని వచ్చా!" నవ్వుతూ అందిగానీ ఆ నవ్వులో ఏదో లోపించింది.

"గుడ్... అయితే మీకు నేను 'గైడ్'గా పనిచేస్తా. దీన్ని చాందినీ చౌక్ అంటారు. అదిగో ఆ వరుసగా వున్న షాపుల్లో ఇడ్లీదోసెలాంటి సౌత్ ఇండియన్ టిఫిన్లు దొరుకుతై. కానీ వాటిని నేను మీకు 'రికమెండ్' చెయ్యను. ఇంకొంచెం

మనం ముందుకు వెళితే ఎడంచేతివైపున 'పరంతావాలా గల్లీ' అని ఉంటుంది. అక్కడ పసందైన పరోటాలు దొరుకుతై. వాటిని రుచి చూసి తీరాలి!" అన్నా.

"గల్లీ పేరే అదా?" అడిగింది.

"అవును. ఆల్‌మోస్ట్ వెయ్యి సంవత్సరాల చరిత్ర ఉంది ఆ గల్లీకి. పరోటాలు చెయ్యడంలో కాశీవాళ్ళకి పెట్టింది పేరు. ఆ పరోటాలు రుచి చూడాలని మొఘల్ చక్రవర్తులు కొంతమంది, కాశీవాళ్ళని ఇక్కడికి పిలిపించారుట. అప్పట్నించీ వారి సంతతే ఈ పరోటాల్ని తయారుచేస్తున్నారు. రుచి అద్భుతం. ఆ టెక్నిక్ మాత్రం వీళ్ళు ఎవరికీ చెప్పరు!" వివరించాను.

"అబ్బో! బాగానే రీసెర్చి చేశారే!" మెచ్చుకోలుగా అంది వసుమతి. "మరి! పదండి... వాటిని రుచి చూశాకా మీరే ఒప్పుకుంటారు!" అన్నాను.

గల్లీలోకి దారితీశాం.

"కానీ నాకు ఆకలి లేదే!" అంది.

"ఫరవాలేదు. తినటం మొదలుపెడితే ఆకలి దానంతట అదే పుట్టుకొస్తుంది!" గల్లీ అంతా చప్పట్ల శబ్దం. ఆశ్చర్యంగా నావంక తిరిగింది.

"ఇక్కడ వత్తడానికి వీళ్ళు అప్పడాల కర్రలు ఉపయోగించరు. చేతుల్తోనే తయారుచేస్తారు!" ఓ దుకాణం ముందర ఆగి చూపించా.

వీధి వీధంతా పరోటా దుకాణాలే. పరోటాల సువాసన...నెయ్యితోటీ... 'ఆచార్' తోటీ.

"రెండు ఆలూ పరోటా" హిందీలో దుకాణంవాడికి చెప్పాను. చిన్నచిన్న స్టూల్స్‌మీద కూర్చున్నాం.

"ఇక్కడ సుమారు పదహారు రకాల పరోటాలు, పరోటాలతోపాటు ఇచ్చే 'సబ్జీ' రుచే వేరు. ఆచార్ అంటే మన ఊరగాయలాంటిది. అదీ వీళ్ళే తయారు చేస్తారు" అన్నాను. "ఇంకా ఢిల్లీలో ఏవేం బాగుంటాయో చెప్పండి!' అడిగింది వసుమతి.

"ఓ.కే. జ్ఞాని రెస్టారెంట్‌లో ఫాలూడా.. కరోల్‌బాగ్ సుబ్బారావు మెస్‌లో పుల్లగోంగూర పచ్చడీ, కన్నడ సాంబారూ, కెనాట్ ప్లేస్ ప్రస్తుతం పాలికా బజార్‌లో సమోసా మరియూ టిక్కీ, ఈ చౌక్‌లోనే తయారయ్యే కుల్ఫీ.... ఇంకా..." అంటూ చెప్పబోయాను.

"బాబోయ్ చాలు!" దండంపెట్టి నవ్వింది.

"ఇవన్నీ విని నేను తిండిపోతుననుకుంటే పొరపాటే. తినేది కొంచెమైనా, రుచిగా శుచిగా తినడం నా అలవాటు. అందుకే ఏ ఊరు వెళ్ళినా మంచి 'ఫుడ్ జాయింట్' గురించి వాకబు చేస్తా!" వివరించా.

పరోటాలు వచ్చినై వేడివేడిగా. పెరుగుచట్నీ, ఆచార్, ఉల్లిపాయచక్రాలు, టొమేటో చక్రాలతో సహా.

ఓ ముక్క తుంచి నోట్లో వేసుకుని - "నిజంగా మీరు చెప్పింది నిజమే. రుచి అద్భుతం!" అంది.

"అది నా గొప్పకాదు. ప్రతి పరోటా వెనకావున్న తొమ్మిదివందల ఏభై ఏళ్ళ అనుభవం!" ఇంకో రెండు పరోటాలు చెప్పాను. ఆకలి లేదన్నది కాస్తా వాటినీ మరోసారి ఆచార్‌లో కలుపుకుని తింది.

"ఊ! ఫుల్...! ఒక్క ముక్క కూడా పట్టదు!" మంచి నీళ్ళుతాగి అంది.
"గుడ్... నిన్ననే వచ్చానని అన్నారుగా... ఎక్కడ దిగారు?" అడిగాను.

"మా ఫ్రెండింట్లో దిగాను. రైల్వేస్టేషన్ దగ్గరే ఉంది దాని రూము. పాపం నేను వచ్చేముందరే దానికి పని తగిలి బాంబే వెళ్తూ తాళాలు ఇంటివాళ్ళకిచ్చి వెళ్ళింది. రేపో ఎల్లుండో వస్తుంది."

"బాగుంది! ఆవిడ ఉంటే బహుశా మనం కలిసేవాళ్ళమో కాదో. మంచి ఫుడ్ తిని ఆనందించాలంటే మంచి 'తోడు' ఉండాలి. నా అదృష్టంకొద్దీ మీరు దొరికారు!" సిన్సియర్‌గా అన్నాను.

"మీరు మీ 'తోడు'ని తెచ్చుకోలేదా ఇంకా?" అడిగింది వసుమతి.

"అంటే నాకు పెళ్ళి అయిందా కాలేదా అనేగా మీప్రశ్న! ఓ.కే ప్రస్తుతానికి పెళ్ళికాలేదు కానీ అతిత్వరలో ఓ ఇంటివాడ్ని కాబోతున్నాను. మరి మీరు?"

"నిజం చెప్పాలంటే మీ సిస్టర్‌కి పెళ్ళయినప్పుడే నా పెళ్ళి జరగాల్సింది. కానీ మా నాన్నగారు పోవడంతో పెళ్ళి ఆగిపోయింది. ఆ తరువాత మగపెళ్ళివారి తరుపున వాళ్ళెవరూ కాంటాక్టు చెయ్యలేదు. మా అమ్మ మాత్రం ఏవేవో సంబంధాలు చూస్తోంది"

"మీరిప్పుడేం చేస్తున్నారూ?"

"బ్యాంక్‌లో ఆఫీసర్ని"

"కేవలం సైట్‌సీయింగ్‌కి మాత్రమే ఢిల్లీ వచ్చారా?"

"ఉహూ! వేరే పనిమీద వచ్చి ఇలా సైట్ సీయింగ్ చేస్తున్నా!" అంది వసుమతి.

"వేరే పని అంటే బ్యాంక్ పనా? సారీ చాలా ప్రశ్నలు అడుగుతున్నానేమో!"

"అదేంలేదు! నిజం చెబితే నిన్న నాకు పెళ్ళిచూపులు. అతను ఢిల్లీలోనే పనిచేస్తారు. వాళ్ళ తల్లిదండ్రులు ట్రావెల్ చెయ్యలేరని నన్నిక్కడికి రమ్మన్నారు. మా అమ్మపోరు పడలేక వచ్చా."

"రిజల్టు తెలిసిందా?" అడిగాను.

"అలా వెంటనే చెబితే వాళ్ళు మగపెళ్ళివారెందుకవుతారూ? ఫోన్ చేస్తామన్నారు. ఒకవేళ నేను నచ్చినా నా వెనకాల ఆస్తిపాస్తులేం లేవుగా!" నవ్వింది.

"సరే... శుభం జరగాలనీ... మంచి జవాబే వస్తుందనీ ఆశిద్దాం. పదండి రెడ్‌ఫోర్ట్ చూపిస్తా. మీనాబజార్ కూడా రెడ్‌ఫోర్ట్‌లోనే ఉంది. నాకు మాత్రం రెడ్‌ఫోర్ట్‌ని ఎన్నిసార్లు చూసినా తనివితీరదు.లోపలికి వెళ్ళగానే ఏదో ఓ జన్మలో నేను అక్కడ ఉన్నాననిపిస్తుంది. ఏ మొఘల్ సేనానిగానో, చక్రవర్తిగానో నన్ను నేను భావించుకుంటూ నడుస్తూ ఉంటా!" నిజంగానే అన్నాను.

"అయితే చూడాల్సిందే! కనీసం మీ 'రాచనడక' చూడ్డానికైనా!" పకపకా నవ్వింది. "వై నాట్... పదండి. ఏ జన్మలోనో మీరూ అక్కడ ఉండే వుంటారు. లేకపోతే అసలు లోపలికి అడుగే పెట్టలేముకదా!"

"మరి నన్ను నేను ఏమని ఊహించుకోవాలి?"

"ఊహలకి సలహాలూ, సంప్రదింపులూ ఉండవు మేడమ్. మహారాణిలానే ఊహించుకోండి... తక్కువగా ఎందుకు?" నవ్వాను.

ఇద్దరం టిక్కెట్లు కొని రెడ్‌ఫోర్ట్‌లో అడుగుపెట్టాం. అడుగుపెట్టగానే ఓ పులకరింత. చక్రవర్తులు నడిచిన చోట నడుస్తున్నాననే ఊహే అద్భుతంగా ఉంది.

"ఏమో...జన్మ రహస్యాలు ఎవరికి తెలుసూ? గత జన్మసంబంధం లేకపోతే ఎవరూ ఎవర్నీ కలవలేరు. ఏ చోటకీ వెళ్ళలేరు. బహదూర్‌షాతో మొఘల్ ప్రభ

అంతరించినా, చరిత్ర మిగిలే ఉంది. బహదుర్‌షా భార్య 'జీనత్ మహల్' బంగారు డ్రెస్సు ఇంకా ఎర్రకోట మ్యూజియంలో తళుకులీనుతూనే వుంది.

గంటన్నర తరువాత బయటికొచ్చాం.

ఈలోగా మూడుసార్లు ఎంక్వైరీకి ఫోనుచేశాను. ట్రైను అయిదుగంటలు లేటు. గాడ్! బస్సులో కెనాట్‌ప్లేస్‌కెళ్ళాం. పాలికాబజార్‌లో లంచ్ మొదలెట్టాం.

"అతి త్వరలో ఇంటివాడినయ్యే ప్రయత్నాలన్నారు. పెళ్ళికుదిరిందా?" కుతూహలంగా అడిగింది వసుమతి. "ఊ....! పిల్ల పేరు తరళ. మా పక్క ఆఫీసులోనే పనిచేస్తోంది. మూడేళ్ళనించీ పరిచయం. 'మొన్నే చేసుకుందాం' అంది. మా వాళ్ళకి ఫోన్‌చేసి చెప్పాను. వాళ్ళూ ఓ.కే. ముహూర్తాలు చూడాలి అన్నారు అంతే!"

"నార్త్ ఇండియన్నా?"

"కాదు కాదు పక్కా తెలుగువాళ్ళు! ఓహో... పేరునిబట్టా? వాళ్ళు ముగ్గురు అక్క చెల్లెళ్ళు, సరళ, తరళ, విరళ"

"పేరు బాగుంది. మనిషీ అందగత్తే అనుకుంటా!"

"అందం చూసేవాడి కళ్ళల్లో ఉంటుందనేది పరమనిజం. కనుక అందగత్తే!"

"బాగా మాట్లాడుతుందా?" మళ్ళీ కుతూహలం.

"ఆహా! బాగా పోట్లాడుతుంది కూడా!" నవ్వాను.

"పెళ్ళికిముందే పోట్లాటలా?"

"ఏం? పెళ్ళయ్యాకే పోట్లాడుకోవాలని రూలేమన్నా ఉందా?" అన్నాను.

"అదేంలేదు... సరదాగా అడిగాను!"

"ఓ.కె. ఆ పిల్ల చాలా పొసెసివ్. అంతకుమించి కోపం. అనుకున్నది వెంటనే జరిగిపోవాలనే మనస్తత్వం. ఇవి మైనస్‌లు. ఇహ ప్లస్‌లు అయితే, హాయిగా నవ్వుతుంది ఏదీ దాచుకోదు. బ్రహ్మాండంగా వండుతుంది" చెప్పాను. తరళ గురించి మాట్లాడేటప్పుడు నా మొహం వెలిగిపోతోందని నాకు తెలుసు.

నావంకే కన్నార్పకుండా చూస్తున్న వసుమతిని చూస్తే సిగ్గేసింది. "సారీ! మరీ చనువుగా అన్నీ వాగేస్తున్నాను" అన్నాను.

"సారీ ఎందుకూ? వినటానికి చాలా హాయిగా ఉంది. అసలు మీ పరిచయం ఎలా  జరిగింది?"

"నవ్వనంటే చెబుతా!"

"ఓ.కె నవ్వను. ప్రామిస్"

"ఓ రోజు ఆ అమ్మాయి నడుస్తుండగా చూశాను. చీర కట్టుకుంది. ఆ వయ్యారం చూస్తూ ఆమె వెనకే ఫాలో అయిపోయా.... తను తీరిగ్గా ఓ బ్యాంక్‌లోకి ప్రవేశించింది. అది సిండికేట్ బ్యాంక్!" ఆగాను.

"ఆ తరువాత?"

"ఆమె వెళ్ళి ఓ కౌంటర్లో కూర్చుంది. నేను వెళ్ళి కౌంటర్ ముందు నిలబడ్డా. ఏం కావాలి అని హిందీలో అడిగింది. ఎక్కౌంట్ ఓపెన్ చెయ్యాలని చెప్పాను. ఏవేంకావాలో చెప్పింది. మరుసటి రోజుకి అవన్నీ తీసుకుని వెళ్ళాను!"

"తరువాత?"

"ఎక్కౌంట్‌లో మినిమమ్ ఐదువందలు ఎప్పుడూ ఉండాలన్నది. వెయ్యిరూపాయలతో ఎక్కౌంటు ప్రారంభించా. ఆ సాయంత్రం మళ్ళీవెళ్ళి పుస్తకం తీసుకున్నా"

"బాగుంది!"

"ఏమిటి? పరోటానా? నా ప్రేమకథా?"

"ప్రేమకథే, చెప్పండి"

"ఆ మర్నాడు వెళ్ళి ఐదొందలు విత్‌డ్రా చేశా!"

"ఊ!"

"ఆ తరువాతరోజున మళ్ళీ వెళ్ళి అయిదొందలు డిపాజిట్ చేశా!"

"తరువాత?"

"మళ్ళీ అయిదొందలు విత్‌డ్రా"

"ఓరినాయనో! ఆ తరువాత?"

"మళ్ళీ డిపాజిట్"

"గాడ్! ఎందుకలా చేశారూ?"

"ఆవిడా ఇదే ప్రశ్న అడిగింది. పదిరోజుల తర్వాత!"

"ఏం చెప్పారు?"

"ప్రేమించానని చెప్పే ధైర్యం లేక, నోట్లు లెక్కపెట్టేప్పుడు మీ చేతుల్నీ, వేళ్ళనీ చూడాలని" అన్నాను.

"ఏమందీ?!"

"చేతుల్నీ, వేళ్ళనీ చూడటానికి నా టైమూ, మీ టైమూ వేస్టు చెయ్యకండి! అని సీరియస్‌గా అంది"

"మరి మానేశారా?"

"ఉహూ!... మరుసటిరోజు మళ్ళీ వెళ్ళి డిపాజిట్ చేశాను!"

"గాడ్!"

"అవును. ఈ మాటా అంది 'గాడ్' అని."

"ఊ! ఆ తరువాత?"

"ఏముందీ! మరుసటిరోజున వెళ్ళి దూరంగా నుంచుని కాసేపు చూసి వచ్చేశా"

"ఆవిడ మిమ్మల్ని చూసిందా?"

"ఆ! చూసేటట్టుగానే నిలబడ్డాగా!"

"ఏమీ అనలేదా?"

"ఏమంటుందీ? నేను నిలబడింది పక్క కౌంటర్‌కి అవతలగా!"

వసుమతి అడిగింది "ఆ తరువాత?"

"నిర్మోహమాటంగా 'వై ది హెల్ ఆర్ యూ డూయింగ్ లైక్ దిస్?" అని అరిచింది.

"నేను చూసే ఆ చేతులూ వేళ్ళూ ఎవరివో, వాళ్ళని నేను ప్రేమిస్తున్నాను. అభ్యంతరం లేకపోతే పెళ్ళిచేసుకుంటాను... అభ్యంతరం ఉంటే ఎక్కౌంటు క్లోజ్‌చేసి వెళ్ళిపోతాను అని చెప్పాను"

"ఏమందీ?"

"ఇందాకే చెప్పాగా... ఒప్పించటానికి మూడేళ్ళు పట్టిందని!"

"మైగాడ్!"

"ఎస్!"

"కథ చాలా బాగుంది!" పకపకా నవ్వింది.

"నాకు తెలుసు...మీరు నేనో కథ చెపుతున్నానని అనుకుంటున్నారు గదూ? కానేకాదు."

"నిజంగా చెప్పండి... ఇదంతా నిజంగా జరిగిందా?" నవ్వుతూనే అంది.

"సరే! ఇక్కడ్నించి మనం రైల్వేస్టేషన్‌కి వెడుతున్నాం. తను ఇవాళ వస్తోంది. నా కథ నిజమో కాదో ఆమెనే అడగండి!"

"వావ్! అయితే తప్పకుండా రావల్సిందే!" ఉత్సాహంగా అంది. రెస్టారెంట్‌లోంచి బయటికి వచ్చాం.

"ఫట్‌పటీలో పోదామా?" అడిగా.

"ఉహూ! దగ్గరేగా నడుద్దాం...!" అంది.

స్టేషనులోకి వెళ్ళాం. ఇంకొద్ది నిమిషాల్లో రైలు వస్తోందన్న ఎనౌన్స్‌మెంట్ వినిపించింది.

సెల్‌ఫోన్ శబ్దం. నాదే. తీశా... అట్నుంచి తరళ.

"అబ్బాయ్.... నీకు చెప్పిన కంపార్టుమెంట్‌లో నేను లేను. నడుస్తూ వేరే కంపార్ట్‌మెంట్‌లోకి వచ్చేశా. ఇప్పుడు నేనెక్కడున్నానో నువ్వే వెతుక్కో!" అల్లరిగా అని ఫోన్ పెట్టేసింది తరళ. నేను నవ్వుకుంటూ ఆ విషయాన్ని వసుమతితో చెబుతుండగానే వసుమతి ఫోన్ మోగింది.

"ఆ...! అలాగేనండీ! అమ్మతో చెబుతా...!" చిరునవ్వుతో ఫోన్‌పెట్టేసింది వసుమతి.

"ఎవరూ?"

"చెప్పుకోండి చూద్దాం! సరే... నేనే చెబుతాను. వాళ్ళకి నేను నచ్చానట. కట్నం గురించి కూడా వర్రీ కావొద్దన్నారు" వసుమతిలో ఆనందం.

"గ్రేట్! చూశారా... ఎంత చిత్రంగా ఉందో! అట్నించి తరళ వస్తోంది. ఇటు మీ పెళ్ళి ఫిక్సైపోయింది!" షేక్‌హ్యాండ్ ఇచ్చి అన్నాను.

"ఫిక్స్ అవటానికి ఇంకా సమయం ఉందిగా! మీరు మాత్రం తప్పకుండా రావాలి!" కొంచెం సిగ్గుపడింది వసుమతి. పొద్దున్నించీ కాస్త దిగులుగా

ఉన్నదేమో, ఇప్పుడు నవ్వుతూ కళకళలాడుతోంది. టైమ్ అయిదు నిమిషాలు గడిచినా ట్రైన్ జాడలేదు.

"బహుశా ఔటర్‌లో ఆపి వుంటారు!" నా ఆత్రపు చూపుల్ని గమనించి అంది వసుమతి. మళ్ళీ ఎనౌన్స్ చేశారు ట్రైను రాబోతున్నదని. దూరదూరంగా ఉన్న మనుషులందరూ ప్లాట్‌ఫామ్‌మీద కొచ్చేస్తున్నారు. వసుమతి ఫోన్ మళ్ళీ రింగైంది. "ఆ!గాడ్!" నేలమీద కూలబడిపోయింది వసుమతి బిగ్గరగా అరుస్తూ.

"ఏమైంది?" కంగారుగా అడిగాను. "అమ్మ....అమ్మ చనిపోయిందట. మా ఇంటి ఓనర్ ఫోన్‌చేశాడు...." వెక్కెక్కి ఏడుస్తూ అంది వసుమతి.

ఆమె భుజాలు పట్టుకుని లేవదీశా. ఒకవైపు నించి ట్రైన్ వస్తూ ఉంది. చుట్టూ చూస్తే వెయిటింగ్ రూమ్ కనిపించింది. అటు తీసికెళ్ళడానికి ప్రయత్నించా. ఆమె బావురుమని ఏడుస్తూ నన్ను గట్టిగా హత్తుకుంది. నా గుండెనిండా బాధ. ఇప్పుడే పెళ్ళివాళ్ళు ఓకె అనడం - వెంటనే తల్లి చావుకబురు.

"నాకు తెలుసండీ.... మొదటిసారి పెళ్ళి అనుకోగానే మా నాన్న చనిపోయారు. ఇప్పుడు మళ్ళీ మగపెళ్ళివాళ్ళు సరే అనగానే అమ్మ చనిపోయింది. నాది దౌర్భాగ్యపు జన్మండీ.. తల్లిదండ్రులిద్దర్నీ పొట్టనబెట్టుకున్నాను" చిన్నపిల్లలా నన్ను కరుచుకుపోయి ఏడుస్తూనేవుంది.

ట్రైన్‌ఆగినా, నేనెటూ కదల్లేని పరిస్థితి. చుట్టూ విచిత్రంగా మమ్మల్ని చూస్తూ జనం.

"ప్లీజ్ వసుమతీ... పదండి" ఆమెను గట్టిగా పొదివిపట్టుకుని అవతలికి తీసుకెళ్ళానుగానీ, ఒంటరిగా వదిలి ఇవతలికి రాలేకపోయాను. గంటన్నర తరువాత విమానాశ్రయంలో ఉన్నాం. అదృష్టవశాత్తు టిక్కెట్ దొరికింది.

"మీ స్నేహితురాలికి ఫోన్‌చేసి, మీ ఇంటితాళాలు నా దగ్గర ఉన్నాయని చెప్పండి. ఇదిగో, ఇదీ నా కార్డ్. నా ఫోన్ నెంబర్ మీ స్నేహితురాలికివ్వండి. ఆవిడ వచ్చే సమయానికి నేనే రిసీవ్ చేసుకుని తాళాలిచ్చేస్తా. అన్నట్టు డబ్బేమైనా కావాలా?" అనునయంగా అడిగాను.

"ఉహూ!... మీ మేలు" ఏదో చెప్పబోయింది గానీ ఆమె గొంతు దుఖంతో పూడుకుపోయింది.

"అవన్నీ ఏం చెప్పొద్దు. చావుబతుకులు మన చేతుల్లో లేవు. మీరుమాత్రం ధైర్యంగా ఉండండి. వెళ్ళగానే ఫోన్‌చెయ్యండి. మిగతా కార్యక్రమాలకి సహాయంగా

నా చెల్లెల్నీ, చెల్లెలి భర్తనీ పంపిస్తాను. మీరెళ్ళేసరికి వాళ్ళక్కడికి చేరతారు!" ధైర్యం చెప్పా.

తలవూపి మెల్లగా లోపలికి వెళ్ళింది కన్నీళ్ళు కారుస్తూనే. నా మనసంతా ఖాళీ అయిపోయింది. ఎంత చిత్రమైనదీ జీవితం! పొద్దున్న కలిశాం. మధ్యాహ్నం భోజనం చేశాం. సాయంత్రానికి పెళ్లి కుదిరిందని ఆనందించాం. ఆ ఆనందం పెదవులమీద కొచ్చేలోగానే విషాదం ముంచుకొచ్చింది. పాపం వసుమతి! తల్లీతండ్రీ ఇద్దరూ లేకుండా ఏమవుతుందీ?

అసలామె పెళ్ళి జరుగుతుందా? అన్నీ ప్రశ్నల్నే. సడెన్‌గా.... తరళ జ్ఞాపకం వచ్చింది. గాడ్! గబగబా సెల్ జేబులోంచి తీసి ఫోన్ చేశా. "ఇంకెన్నడూ నాకు ఫోన్ చేయకు. చేస్తే నా శవాన్ని చూస్తావు. యూ చీట్.... యూ బ్లడీ రాస్కెల్..." గట్టిగా అరుస్తూ ఫోన్ పెట్టేసింది.

ఒక్కసారి నిస్సత్తువ కమ్ముకొచ్చింది. ఆడవాళ్ళు...! వాళ్ళగోల వాళ్ళదేగానీ ఎదుటివాడి మాట వినిపించుకోరా? నేను 'చీట్'నా? అంటే స్టేషన్‌కి రాలేదనుకుందా? తరళ మూడ్స్ నాకు తెలిసినవే. ఇంకోసారి ఇప్పుడే ఫోన్‌చేస్తే మళ్ళీ నిచ్చెనెక్కుతుంది. మెల్లగా రూమ్‌కి వెళ్ళిచేద్దాం అనుకుని రూమ్‌కి వెళ్ళాను. ఎన్నిసార్లు చేసినా స్విచ్‌డ్ ఆఫ్ అని వస్తోంది. జరిగినదంతా తల్చుకుంటూ పడుకున్నాను. కలో నిజమో తెలీలేదు.

రెండేళ్ళ తరువాత వసుమతినీ వసుమతి భర్తనీ హైద్రాబాద్‌లో చూడటం తటస్థించింది.ఆమె గర్భవతి అని చెప్పకుండానే తెలుస్తోంది.

"బాగున్నారా... వీరు మావారు ప్రసాద్... వీరు మా స్నేహితురాలి అన్న. ఆ రోజు నన్ను ఫ్లైట్ ఎక్కించి పంపించారని చెప్పానే... వీరే!" అంటూ మమ్మల్ని ఇద్దర్నీ ఒకరికి ఒకరిని పరిచయం చేసింది వసుమతి.

మామూలు మాటలయ్యాక, "మీరొక్కరే వచ్చారా? తరళగారు రాలేదా?" అనడిగింది.

"తనా! ఢిల్లీలో ఉంది. ఉద్యోగం తప్పదుకదా! నేను మస్ట్‌గా అటెండ్ కావలసిన పెళ్ళి వుంటే వచ్చాను. సాయంత్రం వెళ్ళిపోతాను. మీరిప్పుడు ఉండేది హైద్రాబాద్ లోనేగా?" అన్నాను.

"అవును. మా అత్తగారూ మామగారూ కూడా ఇక్కడే ఉన్నారు. నా పెళ్ళికి ముందే మా వారికి పెద్దజీతంతో ఇంకా పెద్ద కంపెనీలో ఆఫర్‌రావడంతో మావారు ఇక్కడికి మకాం మార్చేశారు. ఆ విషయం ఫోన్‌చేశాగా?"

"అవునవును! మర్చిపోయాను. ఆల్ ది బెస్ట్! ఈసారి కలిసేటప్పుడు ముగ్గుర్నీ కలవాలనుకుంటా!" విషెస్ చెప్పి బయలుదేరా. 'సాయంత్రందాకా ఎందర్నీ కలిసినా ఎవరితో ఉన్నా ఒంటరిగానే ఉన్నట్టనిపించింది. పోనీ వసుమతీ, వాళ్ళాయన్నీ ఢిల్లీ రమ్మని ఆహ్వానిస్తే?' మనసులో ఓ ఆలోచన.

ఉహూ....! ఎందుకు వాళ్ళని పిలవడం? వాళ్ళు రావడంవల్ల మబ్బులు క్షణాల్లో తొలగిపోతై.... నిజమే. కానీ నా మనసు ఒప్పుకోవటంలా. ప్రేమించ డానికి ఏ అర్హతలు కావాలీ? ఏ అర్హతలూ అక్కర్లా.

ఉద్యోగం, కులం, మతం, స్టేటస్ ఇవేమీ ప్రేమించడానికి అడ్డురావు. ప్రేమకి అసలే అడ్డురావు. కానీ పెళ్ళికి చాలా కావాలి. చాలా విషయాలు ఆలోచిస్తారు. ఎందుకూ? నా దృష్టిలో ప్రేమకైనా, పెళ్ళికైనా 'నమ్మకం' ఉంటే చాలు. రెండు నెలలపాటు 'తరళ'తో మాట్లాడటానికి ఎంతో ప్రయత్నించా. వింటేగా అసలూ!

"ఏనాడైతే ఇంకో ఆడదాన్ని నువ్వు కౌగిలించుకోవడం చూశానో, ఆ క్షణంలోనే నా గుండె పగిలిపోయింది. మరోసారి మళ్ళీ నా ముందుకొచ్చే ప్రయత్నం చెయ్యకు. నేనేం చేస్తానో, చేసుకుంటానో నాకే తెలీదు!" నావంక అసహ్యంగా చూస్తూ అంది తరళ. నా ఫ్రెండ్స్‌తో చెప్పించాలని ప్రయత్నించినా వినిపించుకోలా.

ఇప్పుడు వసుమతీ, ఆవిడ భర్తనీ ఢిల్లీ పిలిపించి వాళ్ళతో మాట్లాడించవచ్చు. కానీ ముందు ఈ విషయం వసుమతికి చెప్పాలి. 'ఒక్కక్షణం...' ఇద్దరి ప్రేమికుల మధ్య అగాధాన్ని సృష్టించిందని వసుమతికి ఎలా చెప్పనూ? చెబితే జీవితాంతం వసుమతి బాధపడుతుంది. చెప్పకపోతే అటు తరళా ఇటు నేను ఇలా ఒంటరిగా జీవితాంతం జీవచ్ఛవాల్లాగా బతకాలి.

నాకు ప్రేమమీద నమ్మకం ఉంది. ఆ ప్రేమ మా పెళ్ళికి పునాది అవుతుందో లేక సమాధి కడుతుందో కాలమే నిర్ణయించాలి కదూ!

– స్వాతి 04-1-2013

# అద్దె ఇల్లు

"ఆకు అంచున నిలిచే... వానచినుకులే మనుషుల బ్రతుకులు... రాలిపోయే దెపుడో... తెలిసేదెవరికిలే..." మాటని పాటలా పాడుకుంటోంది శశిరేఖమ్మ.

పాటకీ మాటకీ తేడా ఒక్కటే.... రాగం! రాగంతో కూడిన మాటే పాట అవుతుంది. రాగంలేని పాట కేవలం మాటలాంటిదే. మాటలు గుర్తుంటాయి... గుర్తుండవు. పాట మాత్రం గుర్తుండిపోతు ది.

కారణం ఏమంటే 'సంగీతం' భగవంతుడి భాష. దేవుడికి నచ్చే మరో భాష మౌనం.

శశిరేఖమ్మకి తెలిసినవీ ఆ రెండు భాషలే. కూనిరాగాలన్నా తీస్తుంది. ఆ కూనిరాగం రానప్పుడో, నోరు నొప్పెట్టినప్పుడో మౌనంలోకి జారిపోతుంది.

ఎంత గొప్పమాట! ఆకు అంచున నిలిచిన వానచినుకు ఎప్పుడు రాలిపోతుందో ఎవరికి తెలుసూ? మనిషి బతుకూ అంతేగా!

"భలే బాగుంది మామ్మగారూ! భలే పాట కట్టారు!" సంభ్రమంగా అన్నది వకుళమాల.

"నా మొహం... నేను కట్టడమేమిటే పిచ్చిదానా... అది 'యోగవాసిష్టం'లోని మాట! ఉత్తినే ట్యూను కట్టి పాడుతున్నా!" నవ్వింది శశిరేఖమ్మ.

"ఎక్కడిదైతేనేం! అద్భుతమైన మాట అది!" వకుళ కళ్ళు మెరుస్తుండగా అన్నది.

"అవునూ! ఇంకా మీ ఆయన రాలేదా?" అడిగింది శశిరేఖమ్మ. "అప్పుడేనా? స్నేహితులతో బాతాఖానీ కానిచ్చి తీరిగ్గా ఏ తొమ్మిదింటికో ఇల్లు చేరితే ఘనం! ఎవడైనా సినిమాకి లాక్కుపోతే అంతే సంగతులు. పన్నెండు!" నవ్వింది వకుళ.

"అంతేలే! ఇంట్లో ఒకతి ఎదురుచూస్తుంటుందనీ, తొందరగా ఇంటికొస్తే ఆ వెర్రిది సంతోషపడుతుందనీ, ఈ మగాళ్ళు అనుకుంటేగా!"

"ఐతే తాతగారు కూడా ఈయనలాగే ఆలస్యంగా వచ్చేవారా?" కుతూహలంగా అడిగింది వకుళ.

"తాతగారా? ఆయనెవరూ?"

"అంటే!?"

"అంటే గింటే ఏమీ లేదు" నవ్వింది శశిరేఖమ్మ.

"అంటే.... మీరు పెళ్ళిచేసుకోలేదా?" ఆశ్చర్యంగా అడిగింది వకుళ.

"బాగుందే అమ్మాయ్! చేసుకోలేదని ఇప్పుడు సిగ్గుపడుతూ చెప్పమంటావా? అదిమాత్రం నావల్ల కాదు. ఒకవేళ సిగ్గుపడటానికి ప్రయత్నించినా ఈ వయసులో బాగోదు" పకపకా నవ్వింది శశిరేఖమ్మ.

గేటుదగ్గర స్కూటరాగింది. వకుళమాల భర్త భాస్కరావు 'హారన్' కొట్టాడు. "వస్తున్నా!" పరిగెడుతూ గేటు దగ్గరకెళ్ళింది వకుళమాల. అరుగుమీదనించి లోపలికి వెళ్ళింది శశిరేఖమ్మ.

❂ ❂ ❂

ఆ ఇల్లు శశిరేఖమ్మదే. ఆరుగదుల ఇల్లు. వకుళమాల భాస్కరావులకో రెండు గదులూ, అనసూయా ఆంజనేయులకో రెండు గదులూ అద్దెకిచ్చింది. ఓ రెండు గదులు తనకోసం ఉంచుకుంది.

ఇంటి ముందర ఓ మామిడిచెట్టూ, ఓ వేపచెట్టూ, కొన్ని పూలమొక్కలు. వెనుకవైపున కూరమొక్కలూ, పాదులూ మొత్తం పదిహేను వందల యాభై గజాల స్థలంలో ఉన్నాయి. కూరగాయల్ని కాయించడం శశిరేఖమ్మకి ఇష్టం. ఆవిడ పుణ్యమా అని అద్దెకుండేవాళ్ళకి కూరగాయల ఖర్చు కొంత తగ్గుతోంది. అందరికీ సంతోషంగా పంచడమే కానీ, 'అమ్మటం' శశిరేఖమ్మకి తెలీదు. ములక్కాడలు విరగ్గాస్తాయి. అరటి అయితే గెలలకి గెలలే. అన్నిటినీ పంచుతూనే వుంటుంది.

"అమ్మితే బోల్డన్ని డబ్బులొస్తై మామ్మగారూ!" వకుళ ఓ రోజు అంది.

"ఐతే డబ్బు పుచ్చుకోవాల్సింది నీ దగ్గరే. ములక్కాడకి ముప్పైచొప్పున లెక్క కట్టి పట్టుకురా!" నవ్వింది శశిరేఖమ్మ.

"వద్దు మామ్మా వొద్దు... బుద్ధిలేక అన్నాను" రెండు చేతులూ ఎత్తేసింది వకుళ.

వకుళా వాళ్ళాయనకి ములక్కాడల పిచ్చి. ములక్కాడ కంచంలో కనపడక పోతే ముద్ద దిగదు.

"ఊ! నాతో పెట్టుకోకు మరి!" బెదిరిస్తున్నట్టుగా అని నవ్వేసింది శశిరేఖమ్మ.

"అసలు మీరెందుకు పెళ్ళి చేసుకోలేదూ?" మరుసటిరోజున శశిరేఖమ్మని ఆరాతీస్తున్నట్లుగా అడిగింది వకుళమాల.

"చేసుకోలేదంతే!" తేలిగ్గా తీసిపారేసింది శశిరేఖమ్మ.

"మీవాళ్ళు బలవంతపెట్టలేదా?"

"బలవంతంమీద పెళ్ళిళ్ళు కావుగా!"

"కనీసం పెళ్ళిసంబంధాలు చూడలేదా?"

"అమ్మాయ్! కావాలంటే బ్రహ్మాండంగా చేసిన కందిపచ్చడీ, పచ్చిపులుసూ ఇస్తా. తీసుకుపో! ఇంకా కావాలంటే కొత్తావకాయ కూడా ఇస్తా.

కందిపచ్చడీ, కొత్తావకాయా కలిపి కొడితే కావేటిరంగా...! అంతేగానీ, యాభై ఏళ్ళదాన్ని పట్టుకుని 'పెళ్ళిచేసుకోలేదా, మీవాళ్లు సంబంధాలు చూళ్ళేదా' అంటూ చొప్పదంటు ప్రశ్నలు వెయ్యకు సరేనా?" గదమాయిస్తున్నట్టుగా అంది శశిరేఖమ్మ.

"సరే...సరే... మీరు పచ్చిపులుసూ అనగానే నా నోరు ఊరిపోతోంది. గిన్నె తెచ్చుకోనా, మీ గిన్నెలోనే ఇస్తారా?" ఉత్సాహంగా అంది వకుళ.

శశిరేఖమ్మగారు పోపువేస్తే వీధంతటికీ తెలిసిపోతుంది. ఘుమఘుమ వాసనలు మొదలై, ఆకలి పుట్టుకొస్తుంది. ఆంజనేయులూ, అనసూయా ఊళ్ళో లేరు గానీ, లేకపోతే ఈపాటికి గిన్నెలు పట్టుకుని వచ్చేసి ఉండేవాళ్ళు.

"వకుళా! నాకేదో సందేహంగా ఉందమ్మాయ్. ఓసారి డాక్టరుకి చూపించుకురా"

"దేనికి మామ్మగారూ?"

"నీకు నెల తప్పిందని! లేకపోతే పులుపు గురించి తలుచుకోగానే నోట్లో ఇంతలా నీళ్ళూరవు"

కాసేపు ఆలోచించింది.

"అవును మామ్మగారూ... నిజమేననుకుంటా!" అన్నది వకుళ.... కొంచెం సిగ్గుపడుతూ.

"ఇహనేం! మీ ఆయనకి ఫోన్‌చేసి పిలిపించు. వెంటనే డాక్టరు దగ్గరికి వెళ్ళిరండి.

ఆ మాటే నిజమయితే చాలాజాగ్రత్తలు తీసుకోవాలి మరి!" వకుళమాల తలనిమిరింది శశిరేఖమ్మ.

❀ ❀ ❀

"జాగ్రత్తమ్మా! బరువులూ అవీ ఎత్తకు. ఏది తినాలన్నా నన్ను అడుగు. నేను చేసిపెడతా.

అబ్బాయ్! స్నేహితులూ, సినిమాలూ అంటూ తిరక్కు. పిల్లోపిల్లాడో పుట్టేవరకూ అమ్మాయి దగ్గరే ఉండు!"

శుభవార్త వినగానే వకుళమాల బుగ్గలు పుణికి భార్యాభర్తలిద్దరికీ జాగ్రత్తలు చెప్పింది శశిరేఖమ్మ.

భాస్కర్రావుకి ఇరవై అయిదేళ్ళు. వకుళమాలకన్నా మూడేళ్ళు పెద్ద. స్నేహితులంటే ప్రాణం. సినిమాలంటే పిచ్చి. భార్య అంటే ఎంత ప్రేమున్నా, సినిమా చూడకుండా ఉండలేడు. వకుళకి సినిమా అంటే చికాకు. ఎప్పుడో గానీ చూడదు.

భార్య గర్భవతి అయిందని తెలిశాక భాస్కర్రావు సినిమాల్ని త్యాగం చేసేసి పెందరాడే ఇంటికొస్తున్నాడు. ఇటు చెంబు అటు పెట్టనివాడు కాస్తా వంటతోసహా అన్నిట్లో వకుళమాలకి సహాయం చేస్తున్నాడు. అపురూపంగా భార్యని చూసుకుంటున్నాడు.

"చూశారా మామ్మగారూ, వంశాంకురం కోసం మగాళ్ళు చేసే హడావిడీ హంగామా!" నవ్వుతూనే భాస్కర్రావు వినేలా అంది వకుళ.

"కేవలం పుట్టబోయే బిడ్డకోసం మాత్రమే కాదు తల్లీ! నీకోసం కూడా... నువ్వు కష్టపడకూడదనీ కాస్తైనా నిన్ను సుఖపెట్టాలనీ!" బావి దగ్గర్నించి అరిచాడు భాస్కర్రావు. శశిరేఖమ్మకి వాళ్ళ మాటలు వింటే ముచ్చటగా అనిపించింది.

"ఉయ్యాలోయ్ ఉయ్యాలా...

రాముడు ఊగిన ఉయ్యాలా

కౌసల్య ఊపిన ఉయ్యాలా

సుఖ,దుఃఖాలు ఊపే ఉయ్యాల" అప్రయత్నంగా పాటందుకుంది శశిరేఖమ్మ.

"ఈ పాటా చాలా బాగుంది మామ్మగారూ... ఇది నాకూ నేర్పరూ!" గోముగా అడిగింది వకుళ.

"ఎందుకు నేర్పనూ? ముందు పిల్లో పిల్లాడో పుట్టనీ!" నవ్వింది శశిరేఖమ్మ.

"ఈ పాట ఎవరు రాశారు మామ్మగారూ?"

"ఏవేవో పిచ్చిమాటల్ని పాటలుగా కట్టి పాడుకుంటాను అంతే!" లేచింది శశిరేఖమ్మ. గదిలో మంచంమీద నడుము వాల్చింది. మనసు వెనక్కిపోతోంది.... గతంలోకి. అమ్మా... నాన్నా చిన్ననాటి స్నేహితులతో ఆడుకున్న తొక్కుడు బిళ్ళలూ, గచ్చకాయలూ, బొమ్మల పెళ్ళిళ్ళు ఎన్ని పెళ్ళిళ్ళు చేసిందీ! పెళ్ళికూతురెప్పుడూ తను చేసిన తాటాకుబొమ్మే. పెళ్ళికొడుకు కాత్యాయని చేసిన తాటాకుబొమ్మ. పెళ్ళికొడుకు బొమ్మలు చేసే కాత్యాయనికి పెళ్ళై ముగ్గురు ఆడపిల్లలకి తల్లి అయింది. మరి తనూ? డిగ్రీపాసైన ఉత్సాహంతో తనూ, అమ్మానాన్నా తిరుపతి వెళ్ళారు. వస్తుండగా బస్సు యాక్సిడెంటుకి గురై అమ్మానాన్నా పోయారు.

జనన మరణాల ఉయ్యాల....

ఆశనిరాశల ఉయ్యాల

తండ్రి స్నేహితులే కొంచెం సాయంచేసి తండ్రి ఉద్యోగాన్ని ఇప్పించారు. ఊళ్ళో వున్న పొలాల్ని ఎలాగూ తను చూసుకోలేదు గనుక అమ్మేసి ఇక్కడ ఇల్లు కట్టుకుని, వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుని ఉంటోంది. ఏం మిగిలింది? తల్లిదండ్రుల జ్ఞాపకాలు.

ఊ...! మరో జ్ఞాపకమూ ఉంది. గుండెపొరల కింద... కొంచెం వేధిస్తూ... బాధిస్తూ ఎంత మూర్ఖంగా ప్రవర్తించింది తనూ! అతని మొహం స్పష్టంగా మనసు అద్దంలో కనిపిస్తోంది. ఎంత వెర్రిగా తనని ప్రేమించాడూ! గభాల్న మంచంమీద నించి లేచి అద్దం ముందు నిలబడింది శశిరేఖమ్మ.

ఇరవై రెండేళ్ళ శశిరేఖ ఛాయలు కొంచెం మిగిలేవున్నై. జుట్టుకొంచెం తెల్లబడింది.

కళ్ళకింద చాలా కొద్దిగా నలుపు.

"మీ ముఖాన్ని చూస్తూ ఎన్నేళ్ళయినా తిండి నిద్రా లేకుండా గడపగలను. కరుణించరా శశీ!" అని కదూ లవ్‌లెటర్లో రాసింది! తను పట్టించుకోలేదు. రోజుకో ప్రేమలేఖ, ఆఫీసుకి వచ్చేటప్పుడూ, వెళ్ళేటప్పుడూ బాడీగార్డులా వెంట వచ్చేవాడు.

"మీ బాడీగార్డు భలేవాడండీ శశిరేఖగారూ! ఎండా వానా, చలీ, చదురూ దేన్నీ లెక్కచెయ్యడు. పోనీ కాస్త కరుణించకూడదూ!" నవ్వుతూ అడిగేది మీనా... తన కొలీగ్.

"అతని గోల అతనిదీ నా గోల నాదీ" నవ్వి ఊరుకునేది. అందగాడే కానీ ఉద్యోగం సద్యోగం లేకుండా వెంటబడేవాడ్ని ఎవరు మాత్రం పెళ్ళిచేసుకునే ధైర్యం చేస్తారు?

ఆ ఉత్తరాలు కూడా డైరెక్టుగా ఇచ్చేవాడు కాదు. ఇంటిముందు అలవాటుగా కట్టిన మెయిల్‌బాక్సులో పడేసేవాడు. ఆ మెయిల్‌బాక్సు నాన్నకొన్నది. అందుకే తీగలతో గేటుకి కట్టింది. ఉత్తరాలు ఎలానూ రావు. ఎవరున్నారు గనుక రాయడానికి!

ఆ రోజున మీనా వచ్చి "ఆ కుర్రాడు చాలా ధనవంతుడు శశిరేఖగారూ, ఉద్యోగం చెయ్యాల్సిన పనిలేదు. నేను ఎంక్వైరీ చేసే తెలుసుకున్నాను" అంది.

"ఏమో! మనిషన్నవాడు తన కాళ్ళమీద తాను నిలబడగలగాలి మీనాగారూ. ఆస్తులు కరగబెట్టుకుంటూ ఖాళీగా తిరిగేవాళ్ళంటే నాకు అసహ్యం!'" అని తనన్నది.

"పోనీ, పోనీ మీరేమీ అనుకోనంటే నేను అతన్ని పెళ్ళిచేసుకోవచ్చా? మావాళ్ళు ఎలాగూ నాకు పెళ్ళిచెయ్యరు!' బిడియంగా అడిగింది మీనా.

"మీ ఇష్టం. అతనిష్టం. మధ్యలో నా పర్మిషనెందుకు!" నవ్వుతూ తను అన్నదిగానీ లోపల ఎక్కడో ఏదో... చిన్నఅలజడి. మీనాతో పెళ్ళికి అతను ఒప్పుకుంటాడా... ఒప్పుకుంటే?

"థాంక్స్ శశిరేఖా.....థాంక్యూ!" అని ఆనందంగా బయటికెళ్ళింది మీనా.

"ప్రియాతి ప్రియమైన శశీ, ప్రేమంటే ఇచ్చిపుచ్చుకునే వస్తువు కాదు. మీనాగారు, నాకు ఇష్టమైతే నన్ను పెళ్ళి చేసుకోవడానికి సిద్ధం అనీ, దానికి మీ అభ్యంతరం ఉండదనీ అన్నారు.

కావాలంటే మీచేతే ఆ విషయం నాకు చెప్పిస్తానని అన్నారు. అప్పుడు నాకు అర్థమైంది నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నానే గానీ మీరు నన్ను ప్రేమించట్లేదని. ఉద్యోగం సద్యోగం లేనివాణ్ణనీ, నా కాళ్ళమీద నేను నిలబడలేననీ అన్నారని కూడా మీనాగారు చెప్పారు. మీరు అన్నందుకు నాకే బాధాలేదు.

కానీ నిజం మీతో చెప్పాలి. లక్షలమంది యువకులు ఉద్యోగాలు దొరక్క బాధపడుతున్నారు. నాకు జీవితం హాయిగా వెళ్ళిపోయేంత ఆస్తి వుంది.

అంతేకాదు.... ఏమైనా చిన్నచిన్న పరిశ్రమలు పెట్టి నిరుద్యోగుల్లో కొందరినైనా ఆదుకోవాలని ఉంది.

మీకు తెలీని మరో విషయం ఏమంటే, మిమ్మల్ని ఆఫీసులో దించడం వెనక్కి వచ్చేటప్పుడు మీ ఇంటిదాకా రావడం వరకూ కరెక్టే.

ఆ మధ్య సమయంలో నేనో స్కూలుకి వెళ్ళి ఉచితంగా నాకు తెలిసిన లెక్కలూ ఇంగ్లీషూ బోధిస్తూ వుంటాను. ఆ స్కూలు పేదలు చదువుకునే ఎయిడెడ్ స్కూలు. శశిరేఖగారూ, జీవితంలో నిజంగా ప్రేమించింది మిమ్మల్నే. అదెందుకు జరిగిందో కూడా నాకు తెలీదు. ప్రేమ పుట్టడానికీ, పెరగడానికీ ఎవరి పర్మిషన్లూ అక్కర్లేదు. అది గుండెలో పుడుతుంది.

ఇంతే! ఇకనుంచీ మిమ్మల్ని ఇబ్బందిపెట్టను. క్షమిస్తారుగదూ...

ఇట్లు

మధుసూదనరావు"

ఇదీ ఆ మరుసటి రోజున తనకి మెయిల్‌బాక్స్‌లో దొరికిన ఉత్తరం. "నన్ను చేసుకోవటానికి అతను ఇష్టపడలేదు శశిరేఖా... అతను మిమ్మల్ని మాత్రమే ప్రేమించాడట. నేను ఎవరిని పెళ్ళిచేసుకోదల్చుకున్నా ఓ తోబుట్టువులా సాయంచేస్తానని నాకు మాటిచ్చాడు" నిరాశతో అన్నది మీనా.

ఆ రోజునించి ఏ రోజూ అతను కనబడలేదు. ఎక్కడుంటాడో మీనాకి తెలిసి ఉండొచ్చు. కానీ తను అడగలేదు. ఎలా అడుగుతుందీ?

కళ్ళవెంట రెండు అశ్రువులు రాలాయి.

అవును. వెంటపడ్డ ప్రతి మగాడ్నీ చులకనగా చూడటం ఆడదాని లక్షణమా? ఏమో! తను చేసింది మాత్రం ఆ పనే! ఇరవై ఎనిమిదేళ్ళ తరువాత ఇవన్నీ తలుచుకుని ఏంలాభం.... అతనెక్కడో ఉంటాడు బహుశా పిల్లా పాపలతో. మరి తనూ? మధుసూదనరావు తరువాత చాలామంది పెళ్ళి చేసుకుంటామన్నారు గానీ వాళ్ళమాటల్లో 'ప్రేమ' లేదు. తన జీతానికి ఆశపడిన మాటలవి. ముప్ఫైదాటాక మరెవరూ పెళ్ళిమాటా ఎత్తలేదు.

"ఉయ్యాలోయ్ ఉయ్యాలా...

పిల్లలు ఊగే ఉయ్యాలా....

నవయవ్వనమూగే ఉయ్యాలా... సడిసేయని జీవిత ఉయ్యాలా" పాటలందు కుంది శశిరేఖమ్మ.

❀ ❀ ❀

ఆలోచనలు మళ్ళించాలంటే పాట పాడాలి. తెల్లార్లూ కూనిరాగాలు తీస్తూనే ఉంది శశిరేఖమ్మ.

"బిడ్డ కదలికలు తెలుస్తున్నై మామ్మగారూ!" సంభ్రమంగా అన్నది వకుళ.

"తల్లీ... మీవాళ్ళకి కబురుచెయ్యలేదా?" లాలనగా అడిగింది శశిరేఖమ్మ.

ఆ మాట వింటూనే బావురుమంది వకుళ.

"ఏవన్నా తప్పు మాట్లాడానామ్మా? క్షమించు. ఊరుకో తల్లీ! ఊరుకో. ఏడుపుతో డొక్కలు ఎగిరిపడుతూ వుంటే, తల్లిపేగు బిగుసుకుని బిడ్డకి ప్రమాదం అంటారు. ఊరుకోమ్మా ఏడవకు" వకుళని పొదివి పట్టుకుంది శశిరేఖమ్మ.

కాసేపు ఏడ్చి కళ్ళు తుడుచుకుని "మామ్మగారూ! మాది కులాంతర ప్రేమ వివాహం. వాళ్ళవాళ్ళూ మావాళ్ళు కూడా కులంకోసం తలనరుక్కునే రకం. అప్పటికీ ఎన్నిసార్లు కలవటానికి ప్రయత్నించినా, ఏ ప్రయత్నమూ సఫలం కాలా.

వాళ్ళు మమ్మల్ని చంపకుండా వదిలెయ్యటమే మా అదృష్టం. ఇప్పుడు ఎవరికని కబురెట్టనూ?" చేతుల్తో మొహం కప్పుకుంది వకుళ.

"ఫరవాలేదమ్మా.... నేనున్నానుగా! నాకు తోచినంతా నాకు తెలిసినంతా సహాయం చేస్తా ఏడవకు...!" బుజ్జగించింది శశిరేఖమ్మ.

❀ ❀ ❀

''మామ్మగారూ!... పిల్లాడు పుట్టాడు!'' ఆనందంగా గేటు బయటే స్కూటర్ ఆపి అరుచుకుంటూ వచ్చాడు భాస్కర్రావు. అతని మొహం ఆనందంతో వెలిగిపోతోంది.

''శుభం నాయనా శుభం'' సిద్ధంగా ఉంచిన లడ్డూ అతనికిచ్చి ఆంజనేయులుకీ అతని కుటుంబానికీ కూడా లడ్డూలు పంచింది శశిరేఖమ్మ.

వకుళను ఆస్పత్రిలో చేర్చిన రోజే లడ్డూలు చేసింది శశిరేఖమ్మ. రాత్రిళ్ళు వకుళకి తోడుగా వుండేది. పగలే ఇంటిదగ్గర ఉండటం. పగళ్ళు సెలవుపెట్టి భాస్కర్రావు ఆస్పత్రిలో వున్నాడు. మూడురోజుల తరువాత మిట్టమధ్యాహ్నం ఈ శుభవార్త.

ఆ మరుసటిరోజున ఇంటికి తీసుకొచ్చారు వకుళని. ''పురిటిస్నానం అయ్యేవరకూ నువ్వు రెస్టు తీసుకోమ్మా.... భోజనం విషయం నేను చూస్తాను'' బిడ్డని ఎత్తుకుని అంది శశిరేఖమ్మ.

బిడ్డ అందంగా, ఆరోగ్యంగా వున్నాడు. ఎప్పుడూ నిద్రే. ఆ నిద్రలో అప్పుడప్పుడూ చిరునవ్వులు. బిడ్డని ఎత్తుకున్నప్పుడల్లా శశిరేఖలో ఓ శాంతి, ఓ ప్రశాంతత.... చెప్పలేని ఓ ఆనందం.

"హూ! ఈవిడకెందుకో ఆ బిడ్డమీద అంతప్రేమ... ఏం... మన పిల్లలూ వున్నారుగా... ఎప్పుడైనా దగ్గరకి తీసిందా?" చికాగ్గా మొహంపెట్టి ఆక్రోశమంతా ఆంజనేయులు ముందర వెళ్ళగక్కింది అనసూయ.

"ఎవరిపిచ్చి వారికానందం. మనకెందుకూ!" తీరిగ్గా గడ్డం చేసుకుంటూ అన్నాడు ఆంజనేయులు. అతను సామాన్యంగా ఎవరి విషయాల్లోనూ తల దూర్చడు.

"అసలు వీళ్ళ పుట్టిళ్ళ వాళ్ళ జాడే లేదూ. కొంపదీసి వీళ్ళిద్దరూ లేచిపోయి వచ్చిన బాపతా?" మళ్ళీ అంది అనసూయ. వకుళకీ శశిరేఖమ్మకీ వినపడాలనే.

"అనసూయా! ఓసారి ఇలా వస్తావూ!" అంటూ పిలిచింది శశిరేఖమ్మ.

"జాగ్రత్త...పిచ్చిమాటలు ఆవిడ దగ్గర మాట్లాడకు. మనమిచ్చే బోడి అద్దెకి ఇట్లాంటి ఇల్లు జన్మలో దొరకదు" భార్యని హెచ్చరించాడు ఆంజనేయులు.

"ఏమిటి మామ్మగారూ! ఏమన్నా విశేషమా?"

"ఉందమ్మా... అందుకే పిలిచాను. వకుళా భాస్కర్రావూ లేచిపోయొచ్చిన బాపతే అని కదూ అన్నావు?" సూటిగా అడిగింది శశిరేఖమ్మ.

"అదీ, అదీ, ఏమో అన్నానేమో! అయినా మా ఇంట్లో మేం మాట్లాడుకునే మాటలు విని, మీరు ఇలా నిలదియ్యటం బాగుందా?" ఎదురెక్కింది అనసూయ.

"అద్దె ఇచ్చినంతమాత్రాన ఇది మీ ఇల్లు కాదు. ఇహ ఊరందరికీ వినిపించాలని బిగ్గరగా మాట్లాడి, మా ఇంట్లో మేం మాట్లాడుకుంటాం అనటం సభ్యత కానే కాదు. సరే నువ్వన్న మాటకే వస్తాను.

సాటి ఆడది బిడ్డను కని ఇంటికొస్తే అనాల్సిన మాటలా అవి? వకుళ నీకేమవుతుంది? ఏ బంధం వున్నదని ఆ పిల్లని 'లేచిపోయివచ్చిన బాపతా' అని అనగలిగావు? పుట్టింటి వాళ్ళు రానంతమాత్రాన పురుడు ఆగిపోతుందా? ఇద్దరు బిడ్డల్ని కన్న ఆడదానివి... ఎందుకమ్మా నీకంత అసూయ? నీవాళ్ళు నీకు వున్నారు. లేనివాళ్ళని చూసి నీకెందుకా కడుపుమంట?" సూటిగా అనసూయ కళ్ళల్లోకి చూస్తూ అంది శశిరేఖమ్మ.

"మామ్మగారూ.... మమ్మల్ని క్షమించండి. దానినోరూ, మనసూ రెండూ మంచివి కావు" భార్యని లోపలికి లాగుతూ అన్నాడు ఆంజనేయులు.

"నేను అన్నమాటలో తప్పేంటండీ? ఆవిడ ఇంట్లో అద్దెకుంటున్నాంగదా అని నోరుమూసుకుని వుండాలా? ఓ మాటామంతీ అనుకునే స్వాతంత్ర్యం లేదా?" ఖస్సుమంది అనసూయ.

"ఆ మాటే చెప్తున్నాను అనసూయా! మనమంతా వుండేది అద్దె ఇళ్ళల్లోనే. ఈ శరీరం అద్దెది కాక సొంతదా? రేపు మీకు ట్రాన్స్‌ఫర్ అయితే వెళ్ళిపోతారే గానీ, వెళ్ళిపోయాక ఈ ఇల్లు ఏమయిందో ఏమవుతుందో పట్టించుకుంటారా? పోనీ నెలకోసారైనా వెనక్కి వచ్చి చూస్తారా? పోనీ చూస్తారనుకుందాం. ఈ ఇంటికైతే రాగలరు. మరి శరీరమనే ఈ అద్దె ఇంటికి తిరిగి రాగలరా?"

"అసలేం మాట్లాడుతున్నారు మీరూ?" అయోమయంగా అంది అనసూయ.

**"తల్లి అండమూ, తండ్రి బీజమూ ఇవ్వగా, అంటే 'దానం' చెయ్యగా ఏర్పడిన శరీరాలు మనవి. ఇహ ప్రాణమంటావా? అది భగవంతుడు ఇచ్చేది. దేముడు తన ఇష్టం వచ్చినప్పుడు, తనిచ్చిన ప్రాణాన్ని వెనక్కి లాక్కుంటాడు. ఈ శరీరం మాత్రం ఇక్కడే వుండిపోతుంది. గృహస్తులేని గృహం ఎట్లా ఛిద్రమౌతుందో, అలాగే శరీరమూ ఛిద్రమైపోతుంది. అందుకే చెపుతున్నా, మనందరం వుంటున్నదీ 'శరీరాలనే' అద్దె ఇళ్ళలోనే!"**

"అయితే?"

"ఎప్పుడు పోతుందో తెలీని బతుకులో, వీలుంటే ఇతరులకి మంచి చెయ్యాలి కానీ బాధపెట్టడం ఎందుకమ్మా? నువ్వు మాకు వినపడాలనే అరుస్తూ మాట్లాడావు. నా సంగతి వొదిలెయ్. ఈ పిల్ల ఎంత బాధపడి వుంటుందో ఊహించావా? నీకూ పిల్లలున్నారుగా... ఆ తల్లి మనసుతో ఒక్కక్షణం ఆలోచించు" అనునయంగా అంది శశిరేఖమ్మ.

ఏదో అనబోతున్న అనసూయని "నోరుమూసుకుని పద... మళ్ళీ నోరెత్తితే జన్మలో నీ మొహం చూడను" అంటూ ఆమెను అవతలికి లాక్కెళ్ళాడు ఆంజనేయులు.

"మీరిద్దరూ ఇలా ఏడుపుమొహాలు పెట్టుకుని కూర్చోవటం బాగోలేదు భాస్కర్రావ్. ఎవరో ఏదో అన్నారని మీరు మనసులు చెడగొట్టుకుంటారా? మీవాళ్ళు రాకపోతేనేం?

ఒకరికొకరు మీరున్నారుగా! అంతకుమించి, మీకంటూ ఓ చక్కని బిడ్డ ఉన్నాడుగా! లేవండి! ఇంకెప్పుడూ ఇలా వుండొద్దు.

నాయనా! మీలాగే నాకెవరున్నారూ అనుకుంటే నేను బతికుండేదాన్నా? అదిగో ఆ చెట్లునావి. ఇవిగో ఈ పాదులు నావి. ఆ ఎగిరే మబ్బులు నావి. పక్షులు నావి.

'నాది' అనుకుంటే సృష్టే నీది. 'లేదు' అనుకుంటే ఏమీ లేదు బాధ తప్ప, సరేనా?" అంటూ వాళ్ళని ఆ సాయంత్రం సముదాయించింది శశిరేఖమ్మ.

మళ్ళీ మంచం మీద పడుకుంది. చేసిన వంటంతా వకుళా వాళ్ళకి ఇచ్చేసింది. ఆకల్లేదు. తనన్న మాటలు మళ్ళీ తనే జ్ఞాపకం చేసుకుంది శశిరేఖమ్మ.

అవును. ఇది అద్దె ఇల్లే. నిన్నటిదాకా ఓ బాధ. తన తదనంతరం ఈ ఇంటినీ, బ్యాంకులో వుండే డబ్బునీ ఎవరికివ్వాలని... ఎన్నెన్నో ఆలోచించింది.

ఎవరెవరికి ఇవ్వాలా అని మథనపడింది. "ఇవ్వటానికి ఎవరున్నారూ" అనుకుంటూ బాధపడింది.

ఉహూ! ఇప్పుడా బాధలేదు. శరీరమే అద్దెఇల్లు అనుకున్నప్పుడు ఈ ఇంటి గొడవ తనకెందుకూ? ఓ నిశ్చయానికి వచ్చింది శశిరేఖమ్మ.

❀ ❀ ❀

"వెళ్ళొస్తా మామ్మగారూ!" కాళ్ళకి దండం పెట్టింది వకుళ.

"నేనూ వెల్లొత్తా తాతమ్మా!" ముద్దుముద్దుగా దండంపెట్టి అన్నాడు వకుళమాల కొడుకు ప్రసాదు.

"శుభం తల్లీ! గుర్తొచ్చినప్పుడు వీలుంటే ఇక్కడికి రండి. ఇది మీ ఇల్లే అనుకోండి. శుభం" అంది శశిరేఖమ్మ. ప్రసాదుకి మూడేళ్ళు. భాస్కర్రావుకి ప్రమోషన్ మీద హైద్రాబాద్‌కి ట్రాన్స్‌ఫర్ అయింది. సామాన్లు తీసుకుని లారీలో అతను వెడితే, మధ్యాహ్నం రైల్లో తల్లీ కొడుకూ వెళ్తున్నారు. ఆంజనేయులూ అనసూయా క్రితంనెలే సొంత ఇంటికి మారిపోయారు.

'ఇప్పుడా ఇల్లంతా ఖాళీ... తన మనసులాగే' అనుకుంటూ నిట్టూర్చింది శశిరేఖమ్మ. ఉదయమే లేచి, 'చీరల దొంతరని' ప్యాక్‌చేసి ఊరికి చివరగా వున్న గుడిసెల్లో ఆడవాళ్ళకి పంచింది.

బోలెడన్ని పళ్ళూ, బిస్కెట్లూ కొని గవర్నమెంటు హాస్పటల్‌కి వెళ్ళి అక్కడ వరండాలో పడుండే పేషెంట్లకి పంచి, వాళ్ళతో కాసేపు మాట్లాడుతూ ధైర్యం చెప్పింది. ఆ తరువాత బ్యాంకుకి వెళ్ళి ఎక్కువ మొత్తంలోనే డబ్బు 'డ్రా' చేసి ఇంటికి తెచ్చింది.

నెలరోజుల్లో అక్కడ 'ప్లేస్కూల్' వెలిసింది. మామిడిచెట్టుకీ వేపచెట్టుకీ బోలెడన్ని బుల్లిబుల్లి ఉయ్యాలలూ, ఉయ్యాల బల్లలూ వేలాడుతున్నాయి.

ఉద్యోగం చేసుకునే భార్యాభర్తలు తమ పిల్లల్ని నిశ్చింతగా అక్కడ విడిచివెడుతున్నారు. చదువు 'కొన' లేని బీదపిల్లలకి తానే పుస్తకాలు కొని, ఫీజులు కట్టి చదువు చెప్పిస్తోంది శశిరేఖమ్మ. ఎప్పుడూ లేనిది ఆ చెట్ల మీద ఎన్ని రామచిలుకలూ గువ్వలో! అప్పుడప్పుడూ ఓ కృష్ణపక్షి కూడా వాలుతూ వుంటుంది.

"మామ్మా! ఇప్పుడు ప్రసాదు ఉద్యోగం చేస్తున్నాడు. ఇవాళే నా యాభైఒకటో పుట్టినరోజు.  ఆయన మిమ్మల్ని మరీమరీ అడిగారు" అంటూ వకుళమాల రాసిన ఉత్తరాన్ని మళ్ళీ చదువుకుంది శశిరేఖమ్మ. ఆ ఉత్తరం వొచ్చి రెండేళ్ళయింది.

ఇప్పుడు కూడా ఆ ఇంటిముందు నించి నడిచివెళ్ళే వాళ్ళకి శశిరేఖమ్మ గారి పాటలు వినిపిస్తూనే వుంటాయి– "ఉయ్యాలో ఉయ్యాలా... జానకి ఊగిన ఉయ్యాలా... నవ్వుల పువ్వుల ఉయ్యాలా..." అనో – "ఆకు అంచున నిలిచే... వానచినుకులే మనుషుల బ్రతుకులు.... రాలిపోయేదెపుడో... తెలిసేదెవరికిలే" అంటూనో...

– స్వాతి 15-3-2013

# అంతేగా

పెళ్ళికాని ఆడవాళ్ళకి పెళ్ళయినవాళ్ళంటే ఎందుకంత మంట? పోనీ పెళ్ళయిన ఆడవాళ్ళకయినా మరో ఆడదాన్ని చూస్తే సానుభూతి ఎందుకుండదూ?

అదే చెల్లెళ్ళ విషయాల్లోగానీ, అక్కల విషయాల్లోగానీ మహా ప్రేమ ఒలికించే ఆడవాళ్ళు వదినల విషయంలోగానీ, ఆడపడుచుల విషయంలో గానీ కనీసం మానవత్వాన్ని ఎందుకు చూపరూ?

ఇవన్నీ నాలో ఉదయించిన ప్రశ్నలే. నా అనుభవంలో నించి పుట్టుకొచ్చిన ప్రశ్నలే. పోనీ నేను అలాంటి ఆడదాన్నేనా? అని కూడా నన్ను నేను తరిచి చూసుకున్నా. మా వదినకి నేను చేసినంత సేవ ఎవరూ చేసి వుండరు. నేను పదోతరగతిలో ఉండేటప్పుడే కమల మా వదినగా మా ఇంట్లో అడుగుపెట్టింది.

నేను బి.ఎ రెండో సంవత్సరంలోకి వచ్చేసరికి ఇద్దరు పిల్లల్ని కన్నది.

"చూడమ్మా సంధ్యా... వీళ్ళని పెంచటం నావల్ల కాదు. వెంటవెంటనే కాన్పులవడంతో నాకు నీరసం ముంచుకొస్తోంది. చచ్చి నీ కడుపున పుడతా, కాస్త వీళ్ళని చూసుకోవూ!" అంటూ మొదటి కాన్పులో కవలపిల్లలు పుట్టినప్పుడే పిల్లల భద్రత నాకు వప్పజెప్పింది. రెండో కాన్పులో కూతురు. మొత్తం ముగ్గురికీ సర్వ చాకిరీ నేనే చేసేదాన్ని.

నిజం చెబితే, వాళ్ళమ్మ దగ్గరికి పొరపాట్న కూడా పిల్లలు పోయేవాళ్ళు గాదు.

నా ఎమ్.ఎ. పూర్తయ్యి ఉద్యోగంలో చేరేదాకా వాళ్ళని నేనే సాకాను. అప్పటికి వాళ్ళు ప్రీ-ఎల్‌కేజీకి వచ్చి స్కూళ్ళకి పోవటం నేర్చుకుంటున్నారు.

నా పెళ్ళీ విచిత్రంగా జరిగింది.

ఓ రోజున మా ఇంటికి ఓ కుటుంబం అంతా కార్లో దిగి, "మీ అమ్మాయిని మా అబ్బాయికి ఇస్తారా!" అని మా నాన్నని అడిగారు.

న్యాయంగా ఆడపిల్లవారు మగపిల్లాడి ఇంటికెళ్ళి అడిగే రోజులవి. మా నాన్న మహదానందంగా మిగతా చిన్న చిన్న విషయాలు, అంటే గోత్రం, నక్షత్రం లాంటివి విచారించి ఓ.కే. అన్నాడు.

ఆడపిల్లకి కూడా కాబోయేవాడ్ని చూడాలని వుంటుందనీ, చూసి ఒప్పుకున్నాకే పెళ్ళి నిర్ణయించాలనీ 'పెద్దలు' పట్టించుకోని రోజులవి. ఆడపిల్ల అంటే గుండెలమీద కుంపటి అనీ, ఆ కుంపటిని వదిలించుకుంటే చాలనీ భావించే రోజులవి.

సంవత్సరానికో రెండు మూడు జతల కొత్తబట్టలు కొనిచ్చేవాళ్ళు. అవికూడా వాళ్ళకి నచ్చినవే. ఫలానా అని ఆడపిల్లలు అడక్కూడదు.

పొరపాటున గట్టిగా నవ్వితే, "నోరుమూసుకో... నవ్వు నాలుగు విధాల చేటు'" అని నోరు మూయించేవాళ్ళు. ఏ సినిమాపాటైనా గట్టిగా పాడితే, "బుద్ధుందా? ఎవడన్నా వింటే ఏమనుకుంటాడూ? వాడ్ని చూసి పాడావని ఊరంతా చాటింపు వెయ్యడా?" అని తిట్లు.

గబగబా నడవకూడదు.

నడిస్తే "ఆ పరుగులేమిటే? మెల్లగా నడవకూడదూ!"

మెల్లిగా నడిస్తే, "ఏమిటా పెళ్ళినడకలూ?"

ఇవీ ఆ రోజుల్లో ఆడపిల్లకి దక్కే మంచిమాటలు. మా కాబోయే అత్తవారు కట్నం వద్దన్నారు. కానీ పెళ్ళిమాత్రం ఘనంగా చెయ్యాలిట. ఘనంగా అంటే!

మానాన్నకి చాలా వదిలింది. అయినా గుండెలమీద కుంపటి 'దిగి' పోయినందుకు మహా సంత షపడ్డాడు. మా అమ్మా సంతృప్తిగా నిట్టూర్చింది. వప్పగింతలప్పుడు మా వదిన ఏడ్చింది.

అయ్యో! నా కోసం వదిన ఏడుస్తోందే అనుకునేలోగా, "సంధ్యా, నువ్వెళ్ళిపోతే యీ పిల్లల్ని ఎవరు చూస్తారూ... ఇంటెడు చాకిరీ ఎవరు చేస్తారూ?" అని గట్టిగా ముక్కు చీదింది. ఆ మాట విన్నాక అనిపించింది ఇలా మాత్రం నేను నా

ఆడబడుచుల్ని చూడకూడదని. మా ఆయన మంచివాడే. ఆ విషయం నాతో శోభనం రోజున పాతికసార్లు చెప్పాడు.

మన మంచితనం ఇతర్లు గుర్తించి చెప్పాలిగానీ మన భుజం మనమే తట్టుకుని మురిసిపోతే ఎలా? నాలోనూ ఓ నిట్టూర్పు వెలువడింది.

ఆడదాని నిట్టూర్పుకి అర్థం తెలిసిన లేక తెలుసుకోవడానికి ప్రయత్నించిన మగవాడే నిజమైన మొగుడనే నా అభిప్రాయం ఆనాడు మరింత బలపడింది.

భార్యని భర్తో లేక భర్తని భార్యో ప్రేమించాలనే రూలు ఎక్కడా లేదు. ఒకవేళ ఉన్నా... అది అమలు అయ్యే రూలుమాత్రం కాదు.

ప్రేమ గుండెల్లోంచి పుట్టాలి. ఉబికి ఉబికి వెల్లువలా అది బైటికి రావాల్సిందేగాని, బోరుబావిలోంచి పంపుకొట్టినట్టు రాకూడదు.

నన్ను ఆయన చాలా ప్రేమించానని చాలాసార్లు చెప్పినా, నన్ను ఓ అవసరానికి పనికొచ్చే ఆడదానిగా మాత్రమే ప్రేమించాడనీ, నా మనసుతో అతనికి పెద్ద అవసరం లేదనీ, నాకు పెళ్ళయిన కొత్తల్లోనే తెలిసింది. చేసేదేముందీ!

నాకు నలుగురు ఆడబడుచులు. ఒకళ్ళ తరువాత ఒకళ్ళు పురుళ్ళకీ, పండగలకీ వస్తూనే వుండేవాళ్ళు.

అత్తగారి ఇంట్లో ఎంత అణిగిమణిగిపడున్న ఆడదయినా, పుట్టింటికొస్తే మాత్రం 'పులే'.

అదీ రక్తం రుచిమరిగిన పులి. మా ఆడబడుచులకి బెడ్‌కాఫీ దగ్గర్నించీ నేను అందించాల్సిందే. అదేమీ నేను సీరియస్‌గా తీసుకోలేదు. వాళ్ళ మొగుళ్ళకి కాఫీలు అందించాల్సి వచ్చేప్పుడే నాకు రక్తం సలసలా మరిగేది. నేను వరసకి వాళ్ళకి 'చెల్లి'నే అయినా, వాళ్ళు చూసే వెకిలి చూపులు చూస్తే ఏ రైఫిలో తీసుకొచ్చి టపటపా కాల్చెయ్యాలనిపించేది.

ఇంకోటి ఏమంటే పుట్టింటికొచ్చిన ఆ మహాతల్లులు పిల్లల్ని పట్టించుకునేవారు కాదు.

వాళ్ళకి స్నానాలు చేయించడం, టిఫిన్లూ, అన్నాలూ తినిపించడం అన్నీ నేనే చెయ్యాలి. దాంతో పనెక్కువై ఒళ్ళు పులిసిపోయేది.

మొగుడుగారికి మాత్రం ఇవేమీ పట్టదు. వారి సంతోషం వారిది. వీళ్ళందరిదీ ఒక ఎత్తయితే, మా పిన్నత్త గారి కూతురి దాదాగిరీ మరో ఎత్తు. ఆవిడ మా ఇంట్లోనే ఉండేది. నన్ను కట్టుబానిసకిందో, పనిగత్తెకిందో జమకట్టేది. ఆవిడ నోటికి అందరూ దడిసేవాళ్ళు.

కారణం ఆవిడ డాక్టరు కావడం... రెండు చేతులా సంపాయిస్తూ వుండటం.

పిన్నత్తగారి తాలూకు ఎవరూ బ్రతికిలేరు గనక యీవిడ ఆస్తి అంతా తమకే వస్తుందని మా అత్తగారూ, మా ఆయనా, ఆడబడుచులూ ఆశపడే వాళ్ళు. ఆవిడ కూడా మా ఆడబడుచులు వచ్చినప్పుడు 'ఘనంగా' పెట్టుపోతలు జరిపేది.

ఆవిడ పేరు శాంతకుమారి. జీవితంలో ఏనాడూ శాంతంగా ఉండటంగానీ, ఇతరులు శాంతంగా బతుకుతుంటే చూసి సహించడంకానీ ఆవిడ చెయ్యలేదు.

పెళ్ళి చేసుకోలేదు.

కారణం దేవుడికి తెలియాలి.

ఓ రోజు కళ్ళుతిరిగి పడిపోయా.

లేచాకా చూస్తే చుట్టూ మా ఆయనా, అత్తగారూ, ఆడబడుచులూ.

"కంగ్రాట్స్.... మీ ఆయన్ని నువ్వు తండ్రిని చెయ్యబోతున్నావు" నవ్వుతూ అన్నది శాంతకుమారి. కానీ ఆ నవ్వు విచిత్రంగా ఉంది.

మిగతా ఆడబడుచులూ ఏదో అనాలన్నట్టుగా అభినందించారు. మా ఆయన మాత్రం "ఐ నో.... ఐ...నో..." అని గర్వంగా ఓ నవ్వు నవ్వాడు. ఐ.నో అంటే ఏమిటీ? తను తండ్రి కాబోతున్నాడని తెలుసనా? లేక తన గొప్పదనంతోటే నేను తల్లిని కాబోతున్నాననా?

ఆ పూట రెస్టిచ్చారుగానీ మళ్ళీ మరుసటి రోజునించి నా పనులు నాకే చుట్టుకున్నై.

కాఫీ తెమ్మని ఒకతీ, అల్లం వేసిన టీ తెమ్మని ఇంకోతి, ఇడ్లీలతోపాటు పూరీ కూరా చెయ్యమని మరోతీ ఆర్డర్లు పాస్ చెయ్యడమేగానీ కనీసం సహాయానికి రాలేదు. రోజులు గడుస్తున్నై.

వర్షానికి గాలి తోడైనట్టు మళ్ళీ మా మూడో ఆడబడుచు గర్భందాల్చి మూడోనెల్లోనే పుట్టింటికి చేరింది. లోకంలో అదేదో అపురూపం అయినట్టు మావాళ్ళు చేసిన హడావిడికి అంతేలేదు.

ఇది ఆవిడకి మూడోసారి.

మరి నాది తొలిచూలు. ఆవిడ మంచం దిగదు సరికదా, నిమిషానికి ఓసారి 'వదినా అది తినాలనుంది, ఇది తినాలనుందీ' అని నా ప్రాణాన్ని చెండుకుతినటం మొదలెట్టింది. నాకు తినాలని ఉండదా?

ఓసారి పుల్లపునుకులు వేసి ఒకటి నోట్లో వేసుకున్నా.... ఉప్పు సరిపోయిందో లేదో చూడ్డానికి. అదే సమయంలో ఆవిడ అంటే, మా మూడో ఆడబడుచు వంటగదిలో కొచ్చింది.

"అమ్మోయ్... నా కోసం పుల్లపునుకులు చెయ్యమంటే ఆవిడ వేసింది వేసినట్టు తినేస్తోందేవ్!" అంటూ అరిచింది.

గబగబా మా అత్తగారూ, రెండో ఆడపడుచూ, మా ఆయనా పరిగెత్తు కొచ్చారు. ఏదో ఘోరం జరుగుతున్నట్టుగా.

మా అత్తగారు నావంక అసహ్యం నిండిన చూపొకటి విసిరి, 'హూ...! దొంగతిండి నీకు అలవాటని మాకు తెలీదమ్మా. తెలిస్తే బోలెడు కట్నంతో ఓ మంచిపిల్లని తెచ్చుకుని వుండేవాళ్ళం.

ఒసే రుక్మిణీ... ఈ పుల్లపుణుకులు వదిలేయ్... బజార్నించి తెప్పిస్తా. దిష్టి తగిల్తే చాలా కష్టం. నరుడి చూపుకి నల్లరాయి పగులుతుందంటారు!" అంటూ వాళ్ళని వంటింట్లోంచి బయటికి తీసికెళ్ళింది.

రెండే రెండు సెకన్లలో నాకు వాంతి అయింది. దిష్టి ఎవరికి తగిలిందీ? నా బిడ్డ వీళ్ళ వంశాంకురంకదా? కనీసం బిడ్డ తండ్రికైనా ఆ భావన లేదా? పోనీ ఊరుకున్నారా? మళ్ళీ నా పని నేనే చెయ్యాలి.

మొట్టమొదటసారిగా నా రెండు చేతులూ పొట్టమీద వేసి నిమురుతూ–

"నువ్వు ఆడో, మగో నాకు తెలీదు. కానీ నా బిడ్డా, నువ్వు నా బాధని అర్థంచేసుకో! నువ్వు తప్ప వీళ్ళెవరూ నన్ను అర్థంచేసుకోలేరు" అంటూ ఏడ్చా.

నాకు ఏడోనెల వచ్చేలోగా మావాళ్ళు మూడుసార్లు వచ్చారు. "మీకు తెలుసుగదా వదినగారూ! నాకు మోకాళ్ళ నొప్పులు. ఏమీ చెయ్యలేను."

సంధ్య ఎంతగా కలిసిపోయిందంటే, తను లేకపోతే ఒక్కక్షణం ఈ ఇల్లు గడవదు. మీకెందుకూ... పురుడు ఇక్కడే పోస్తాం.

అదీగాక మా చెల్లెలి కూతురు శాంత డాక్టరు కదా! దగ్గరుండి అన్నీ చూసుకుంటుంది. ఏం శాంతా?" అన్నది మా అత్తగారు అమ్మతో.

"అవునాంటీ! నేనున్నానుగా! సంధ్యని నా కంటిపాపలా కాపాడుకుంటాను, సరేనా?" చిరునవ్వులు చిందిస్తూ అంది శాంత.

"సరే ఒదినగారూ! మీరింత చెప్పాక ఏమంటాం! మీ ఇష్టం" అని అంటూ మావాళ్ళు వెళ్ళిపోయారే గానీ, "ఏంటమ్మా... నీకు ఇష్టమేనా?" అని మా అమ్మగానీ, నాన్నగానీ అడగలా.

నా పురిటిఖర్చు తగ్గినా తగ్గినట్లే.

మధ్యతరగతి మనుషులు ఇంతకుమించి ఇంకేం ఆలోచించగలరూ?

ఆయన మంచివాడే, కొట్టడు.... తిట్టడు.... వెక్కిరించడు... కానీ కనీస ప్రేమైనా ఇవ్వడు.

ఇవ్వలేడేమో కూడా! ఆయన దృష్టిలో ప్రేమ అంటే పడకసుఖం మాత్రమే.

లోపల బిడ్డ పెరుగుతోందనే జ్ఞానం కూడా లేకుండా ఆయన నామీద చెయ్యి వేస్తే నా ఒళ్ళు కుంచించుకుపోయేది.... సిగ్గుతో.... అసహ్యంతో..

పనులు తగ్గవు. పోనీ మానేద్దామంటే, అంట్లతో వంటిల్లంతా కంపుకొట్టేసినా ఎవరూ పట్టించుకోరు. అలా కంపుకొడుతుంటే భరించలేక నేనే ఉసూరుమంటూ పనులు చేసుకునేదాన్ని.

దేవుడి దయవల్ల వాంతులూ, వేవిళ్ళూ పెద్దగా లేవుగానీ, ఐదోనెల నుంచీ మరో ఇష్టమైన కష్టం మొదలైంది. బిడ్డ కదలడం, కడుపులో తిరగటం తెలుస్తోంది.

ఖాళీ దొరికినప్పుడల్లా పొట్టమీద చెయ్యివేసుకుని నా కష్టాలు కడుపులో బిడ్డకి చెప్పుకునేదాన్ని. ఆ కాసేపు బిడ్డ కదలకుండా శ్రద్ధగా వింటున్నట్టు అనిపించేది. తరువాత్తరవాత మరో కష్టం మొదలయ్యింది. పనులన్నీ చేసి పడుకుంటే బిడ్డ కదలికలు ఎక్కువగా ఉండేవి.

నడుస్తూ, వంగుతూ ఉంటే బిడ్డకి ఉయ్యాలూగుతున్నట్టుగా ఉండేదేమో మరి!.... పడుకుంటే 'ఉయ్యాల' ఆగుతుందిగా. దాంతో కదలికలు ఎక్కువగా ఉండేవి. ఎంతెక్కువంటే ఇహ పడుకోలేక అటు ఇటూ తిరిగేటంతగా!

'ఉమ్మనీటి' ఉయ్యాల ఊగుతేగానీ లోపల బిడ్డ నిద్రపోదేమో!

ఓ రోజు మా పక్కింటి ఆవిడ అన్నది-

"సంధ్యా... వీళ్ళు నీచేత పనిచేయిస్తున్నారని బాధపడకు. కడుపుతో ఉన్న ఆడది బరువు మాత్రం ఎత్తకుండా ఎంతపని చేస్తే అంతమంచిది. కాన్పు కూడా అంత సులభంగా అవుతుం"దని.

ఓ గంట నొప్పులు పడ్డానేమో! అంతే! బాబు పుట్టాడు. మా ఆడబడుచుకి ఆపరేషన్ చేసి ఆడపిల్లని బయటికి తీయాల్సొచ్చింది. దానికో గోల.

నా జీవితం మారిపోయింది. బిడ్డే నాకు లోకం అయిపోయాడు.

వాడిపేరు ముకుందు.

అంటే ముకుందరావు. నేను 'రమణ' అని పెడదామనుకున్నా. మా అత్తగారు ఒప్పుకోకుండా మామగారి పేరు పెట్టింది.

వాడు పుట్టిన క్షణం ఎటువంటిదోగాని శాంతకుమారికి వాడు ఆప్తుడైపోయాడు. ఎంతంటే ఇంట్లో ఉన్నంతసేపు వాడ్ని ఎత్తుకునే తిరిగేది. చిత్రంగా మనిషి పూర్తిగా మారిపోయింది. కరుకుమాటలూ, వెక్కిరింతలూ పోయి 'మనిషి'గా మారింది. ఆమెలో మార్పు చూసి సంతోషం.

నా బిడ్డని పాలుపట్టేటప్పుడు తప్ప, కనీసం ఎత్తుకోనివ్వట్లేదని బాధ. రాత్రిళ్ళూ కూడా తనదగ్గరే పడుకోబెట్టుకునేది.

నా బాధ ఎవరికర్థమవుతుందీ? పిల్లలు ఎవరికి 'మాలిమి' అయితే వాళ్ళనే స్వంతమనుకుంటారు.

ముకుంద్ విషయంలోనూ అంతే జరిగింది. వాడు శాంతని తల్లిగానూ, నన్ను 'ఆయా'గానూ భావించాడేమో తెలీదు. ఆవిడ హాస్పటల్‌నించి రాగానే తెగ కేరింతలు పెట్టేవాడు.

❀ ❀ ❀

మారిపోయిందనుకుంటున్న జీవితం మళ్ళీ మొదటికొచ్చింది. ఇప్పుడు మరింత మౌనం నన్ను మింగేస్తోంది. 'తలచెడి' ఇంటికొచ్చిన ఆడబిడ్డలూ, వాళ్ళ పిల్లలూ, మంచానున్న అత్తగారూ, రిటైరైన శాంత, తండ్రి కాబోతున్న నా కొడుకు ముకుంద్.

వేవిళ్ళతోటీ, వాంతులతోటీ నా ప్రాణాలు తింటున్న నా కోడలూ, ఏమీ పట్టించు కోకుండా టీవీ ముందు కూర్చుని 'ఆజ్ఞలు' జారీచేసే భర్తా!

పనివాళ్ళున్నా, మనం పనిచేస్తుంటేగానీ వాళ్ళు చెయ్యరు. దాంతో మళ్ళీ పని...పని...పని. అసలు ఆడదాని జీవితం ఏమిటీ?" ఆడదానికి అసలు జీవితం అంటూ ఉన్నదా?

'ఉన్నది' అనటానికి మా అత్తగారూ, నా కోడలూ ఉన్నారు. రకరకాలుగా 'మోహం'పెట్టి నా చేత కావలసింది చేయించుకు తినటానికీ, వాళ్ళ చికాకునీ, కోపాన్నీ నామీద వెళ్ళగక్కటానికీ!

'ఉన్నది' అనటానికి శాంతకుమారి ఉన్నది. ఎవరో నొప్పులుపడి కన్నబిడ్డని, లేని 'అధికారంతో' తన స్వంతం చేసుకోవడానికి, ఆ బిడ్డ అభిమానాన్నీ, అనురాగాన్నీ పొందడానికీ.

మరి నేను? దేన్ని చూసుకుని బతకాలి? ఎంతకాలం బతకాలీ? ఎన్నేళ్ళు బతికినా ఈ వెట్టిచాకిరీ తప్పుతుందా? చివరి క్షణంలోనైనా శాంతి లభిస్తుందా? అన్నీ ప్రశ్నలే.

జవాబులేవీ?

"ఎంతసేపూ అలా ముంగిలా కూచోపోతే కాసేపు ఏదన్నా పని చెయ్యొచ్చుగా" పతిదేవుడి ఉవాచ.

"కాసేపు' ఏదైనా పనిచెయ్యాలా? భగవంతుడా! వీళ్ళు కళ్ళున్న గుడ్డివాళ్ళా?

బిడ్డ కడుపులో ఉన్నప్పుడు నా కష్టాల్ని చెప్పుకుని కాస్తంత ఉపశమనం పొందేదాన్ని.

మరి ఇప్పుడూ?

ఎదురుగుండా బిడ్డ ఉన్నా వాడికి నేనూ, నా బాధా అర్థంకావు. ఏదన్నా చెబుదామని ప్రయత్నిస్తే "పోమ్మా! ఇంటికి రాగానే ఏదో మొదలుపెడతావు!" అంటాడు.

ఎవరితో చెప్పుకోనూ? అందరూ ఉండీ, ఎవరూ లేకపోవడం అంటే ఇదేనేమో!

"ఆవిడకేంటమ్మా! ఆ ఇంటి మొత్తానికి మహారాణి! అందర్నీ బాగా చూసుకుంటుంది! పెళ్ళైన ఆడది ఎలా ఉండాలో ఆవిడ్ని చూసి నేర్చుకోవాలి!" ఇవీ... అచ్చెమ్మలూ బుచ్చెమ్మలూ నా గురించి అనుకునే మాటలు. పొట్టపగిలేలా నవ్వాలనిపించదూ?

"చచ్చేదాకా చచ్చినట్టు బతకాలి!" అని ఓ కవిగారు అన్నారట. ఎంత మంచిమాటా!

కష్టం సుఖం ఎవరితో పంచుకోటానికి లేనప్పుడూ - ప్రేమని ప్రేమగా పెంచుకోవటానికి లేనప్పుడూ -

మౌనం మనసుని మింగేస్తున్నప్పుడూ-

మనిషి బ్రతకడం అంటే చచ్చినట్టు బ్రతకడమేగా! అంతేగా!

– స్వాతి 13-12-2013

# బోలీరే పపీహారా

"ఒరే సుబ్బిగా! బ్రహ్మాండమైన సంబంధం వచ్చింది. పిల్ల అప్సరస అనుకో! అర్జంటుగా సెలవుపెట్టి వచ్చెయ్యి. అసలే ఆడపిల్లలు దొరకడం లేదు.... ఈ సంబంధం మిస్ అయితే నువ్వు జన్మంతా బేచులర్‌గానే ఘోరుమనాలి. ఇట్లు మీ బామ్మ" అని బామ్మ రాసిన ఉత్తరం వచ్చింది. డేటు చూశా... అది వారంక్రితం రాసిన ఉత్తరం.

కొరియర్‌లో ఉత్తరాలు పంపమని వందసార్లు అన్నాను. వింటేగా? "ఒరే దద్దమ్మా! ఈ లోకంలో అవినీతి జరగని ఆఫీసు పోస్టాఫీసు ఒక్కటేరా. అందుకే నేను పి & టి వాళ్ళ ద్వారా తప్ప మరో మీడియాని వాడను" అని ఖచ్చితంగా చెప్పింది.

"పోనీ ఫోను కనెక్షనో, సెల్లో ఏర్పాటుచేస్తా"నంటే-

"చూస్తున్నాగా ప్రతివాళ్ళూ ఓ సెల్లు చెవిలో దూర్చుకుని ఊరేగటం! అందుకే పిల్లలక్కూడా పుట్టెడు చెవుడొస్తోంది. నేను ఉత్తరాలు మాత్రమే రాస్తాను. అంతే... అది నా ప్రతిజ్ఞ" అన్నది. (మా తాతయ్య పైకి పోకముందు పి & టి లోనే రిటైరయ్యాడు.) ఏం చేస్తాం? అర్జంటుగా లీవులెటరు రాసి మా హనుమంతరావు గారి ముందు పెట్టాను.

"ఏంటోయ్! గ్రాండ్‌మదర్ సీరియస్‌గా ఉందా? పెళ్ళి సంబంధమా!" అన్నాడు.

"అవున్సార్! నేను పెళ్ళి ఇంకా చేసుకోలేదని మా బామ్మ యమా సీరియస్‌గా ఉంది సార్" అన్నాను.

"గుడ్! నిజం చెప్పావు గనక లీవు గ్రాంటు చేస్తున్నాను.... అన్నట్టు నీవైపు నించి ఎవరు వస్తున్నారూ, పెళ్ళిచూపులకీ?' అడిగాడు.

"నేనూ మా బామ్మా అంతేనండి" అన్నా.

"నీ గురించి కాస్త బాగా చెప్పగలిగినవాళ్ళు ఉంటే ఎప్పుడూ మంచి దంటానోయ్! ఓ పనిచేద్దాం. రానూపోనూ ఖర్చులూ - బసా, ప్లస్ భోజనం నువ్వు ఏర్పాటు చేస్తానంటే నేనూ నీతో వచ్చి, నీ గురించి పిల్ల తరుపు వాళ్ళకి నాలుగు మంచిముక్కలు చెప్పి, వాళ్ళని 'ఇంప్రెస్ చేస్తా! ఏమంటావ్?" అన్నాడు.

ఆ ఐడియా నాకు బ్రహ్మాండంగా నచ్చింది. మా బామ్మకి ధాటిగా మాట్లాడడం తప్ప మరోటిరాదు, నేనేమో పిల్లని చూస్తే చాలు సిగ్గుతో ముడుచుకుపోతా. దాంతో బోలెడు సంబంధాలు తప్పిపోయాయి.

"అంతకంటేనా గురూజీ! రేపొద్దున్నే బయల్దేరదాం!" అన్నా.

"అవును. ఇవ్వాళ మంచిరోజుకాదు. రేపు పొద్దున్నే బయల్దేరదాం. ఎనిమిది గంటల్లోపైతే టైము భేషుగ్గా ఉంటుంది!" అన్నాడు హనుమంతరావు.

పొద్దున్నే హ.రా. మా ఇంటికి రాగానే నేనూ నా రూముకి తాళంవేసి బయలుదేరాను. ఇంటి యజమానితో పెళ్ళిచూపులు విషయం నేను చెప్ప బోతుండగా హ.రా వద్దని సైగ చేశాడు.

"నువ్వేం చేస్తున్నావో ఎవరికీ ఎప్పుడూ చెప్పకు... పెదవి దాటిన మాట పది ఊళ్ళకీ పాకిపోతుంది" అన్నాడు... ఇంట్లోంచి బయటికొచ్చాక-

"బస్టాండుకెంతోయ్?" ఆటోవాడ్ని అడిగాడు.

"మీటరు ఏభై దానిమీద ఇరవై... మొత్తం డైబ్భై అవుతుంది" అన్నాడు ఆటోడ్రైవరు.

"నలభై ఇస్తా...!" బేరమాడాడు హ.రా.

"అలాగే! సగం దూరం తీసుకెళ్తా!" సీటు దులిపాడు ఆటోడ్రైవరు.

"అదేంటి? సగం దూరమా?"

"కాకపోతే? బస్టాండుకైతే పైసా తగ్గదు!" నవ్వాడు ఆటోడ్రైవరు.

"పదవోయ్ సుబ్బారావ్, హాయిగా పదిరూపాయలు మనవి కావనుకుంటే సిటీబస్సులో వెళ్ళిపోవచ్చు!" ముందుకి నడుస్తూ అన్నాడు హ.రా.

"హాయిగా అలాగే నడుస్తూ వెళ్ళిపోతే ఆ పదిరూపాయలూ కూడా ఆదా చెయ్యొచ్చు. ఎల్లు-ఎల్లెహె...!' ఎగతాళి చేశాడు ఆటోడ్రైవరు.

మా హ.రా భలే కిలాడీ. ఇలాంటి కామెంట్లు విన్నా అస్సలు విననట్టే ఉంటాడు. అదేమంటే "మనీ మాత్రమే కాదోయ్.... మాటలోనూ పొదుపు పాటించాలి!" అన్నాడోసారి.

బస్స్టాండ్‌లో నీళ్ళ బాటిల్ కొననివ్వలేదు. ఆర్.టీ.సీ వాళ్ళు ఏర్పాటుచేసిన 'ఫ్రిజ్'లోవే భేషుగ్గా ఉంటాయన్నాడు. అంతేగాదు, "చూశావా నేను గనక ఇవ్వాళ నీ పక్కన లేకపోయి ఉంటే ఆటోకి డెబ్బై ప్లస్ నీళ్ళబాటిల్‌కి ఇరవై వెరసి తొంభైఖర్చు అయ్యుండేది!" అని గర్వంగా నవ్వాడు. నిజమేగా మరి!

"అబ్బాయ్! రూపాయలు పక్షుల్లాంటివి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ఎగిరిపోతై. అందుకే అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి"అని కూడా అన్నాడు. కాదు మరీ!!

హైదరాబాద్‌నుంచి మా ఊరికి అయిదుగంటల ప్రయాణం. మధ్యాహ్నం ఒంటిగంటకి ఓ పెద్ద ఊరిలో ఓ హోటల్ దగ్గర డ్రైవరు బస్సాపి, "భోజనాలు చెయ్యదల్చినవాళ్ళు పావుగంటలో కానివ్వచ్చు" అని అనౌన్స్‌చేశాడు. నేను దిగుదామన్నాను.

"ఇంకో గంటకి ఎలాగూ ఇంటికి చే ́తాంగదా... ఎందుకు అనవసరంగా డబ్బులు ఖర్చు? కావాలంటే అదిగో... అక్కడ మొక్కజొన్న పొత్తులు అమ్ముతున్నారు. ఒకటి కొన్నామనుకో.... కాలక్షేపానికి కాలక్షేపమూ అవుతుంది.... కొద్దోగొప్పో ఆకలీ తీరుతుంది" అన్నాడు.

'పొత్తు ఎంతోయ్?" బేరం చేశాడు హ.రా.

"పదిహేను రూపాయలండీ!"

"అయిదు రూపాయలకిస్తావా?"

"గిట్టదండి.... కావలిస్తే ఓ రూపాయి తగ్గించుకుని పద్నాలుగివ్వండి" అన్నాడు మొక్కజొన్నపొత్తులాడు.

"మరీ ఇంతరేటా? ఏం కలికాలం వచ్చిందోయ్! నా చిన్నతనంలో..."

"అది అప్పటిరేటు బాబయ్యా.... ఇది ఇప్పటిదండీ!" నవ్వి అన్నాడు మొక్కజొన్నపొత్తులవాడు. హ.రా. అర్జెంటుపనున్నట్టుగా, "రావోయ్... అదిగో డ్రైవరుబస్సు ఎక్కేశాడు" అంటూ నన్ను బస్సువైపు లాక్కెళ్ళాడు.

"అసలు అయిదురూపాయలు ఎందుకోయ్ వేస్టు చెయ్యడం? ఎంచక్కా కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నామంటే ఆడుతూ పాడుతూ మీ ఊరు చేరిపోతాంగా! ఇంటి దగ్గర తన చేతి భోజనం తిన్నందుకు మీ నాయనమ్మగారూ సంతోషిస్తారు. ఏం?" అంటూ బస్సెక్కించాడు. ఆయన చెప్పింది బాగానే ఉన్నా, పొద్దున టిఫిన్ కూడా తినలేదేమో– కడుపులో ఎలకలు కబాడీ ఆడుతున్నై. ఇంటికెళ్ళేసరికి మా నాయనమ్మ బ్రహ్మాండంగా నిద్దరోతోంది. మేం వస్తామని ఆవిడకి తెలీదుగా!

"వంట చేస్తాన్రా సుబ్బిగా, రెండు నిమిషాలు విశ్రాంతిగా కూర్చోండి" అన్నదావిడ.

"ఎందుకండీ... పెళ్ళిచూపులకి ఎలానూ టిఫిన్లు పెడతారుగా! ఇప్పుడు మీరు అనవసరంగా వండడం ఎందుకూ?" హ.రా.గారు అన్నాడు బామ్మతో.

"అదేమిటబ్బాయ్, వాళ్ళ పిల్లని చూడ్డానికి మనం వెళ్ళాలిగానీ - వాళ్ళు పెట్టే టిఫిన్లు తిండానికి కాదుగా వెళ్ళాల్సిందీ? వెళ్ళంగానే టిఫిన్ మీద పడితే మనం ఉత్తి 'లేకి' వాళ్ళమని అనుకోరూ?"

మెత్తగా క్లాసుపీకి మా బామ్మ గబగబా పప్పు, కూరా, పచ్చడీ, పులుసూ, చిక్కటి మజ్జిగతో మరోగంట కల్లా మా కడుపు ఫుల్లుగా నింపేసింది.

భోజనాలకి ఇన్ని పదార్థాలా? ఎంత ఖర్చో, ఎంత ఖర్చో అని తింటున్నంత సేపూ హ.రా.గారు ఇంగ్లీషులో నా బుర్ర తినేశాడనుకోండీ. అది వేరే విషయం.

❀ ❀ ❀

"ఒరే సుబ్బిగా.... ఈయన ఎవడురా?... పెళ్ళికి వెళ్తూ పిల్లిని చంకన పెట్టుకున్నట్టు తెచ్చావూ, మాటలు తెగనీడేం?" గుసగుసలాడింది బామ్మ.

"ఊరుకోవే... కట్నం ఇంకాస్త రాబట్టాలని చూస్తున్నాడు. అంతే! అది మనకీ మంచిదేగా!" నేనూ గుసగుసగానే మా బామ్మ చెవిలో అన్నాను. కాక? కట్నంవల్ల ఎన్నిలాభాలో నా చెవినిండా నూరిపోశాడాయే!

"అయ్యా... మావాడని నేను గొప్ప చెప్పకూడదు గానీ, మహమంచివాడే కాదు– మహపొదుపరి. అంతేగాకా–" చెప్పబోయాడు హ.రా. నా చెవుల్లో తేనెపోసినట్లయింది. ఎవరైనా మనని మెచ్చుకుంటుంటే అలా అనిపించడం సహజమే కదా!

"అవన్నీ సరేనండీ.... కట్నం మాత్రం అంతకుమించి పైసా ఇచ్చుకోలేము!" నిక్కచ్చిగా అన్నాడు పిల్ల మేనమామ. పిల్లమాత్రం బ్రహ్మాండంగా ఉంది... మహా అందంగా, ఆరోగ్యంగా ఉంది.

"అలా అంటే ఎలాగూ? మావాడిది సర్కారీనౌఖరీ...!"అనునయంగా అన్నాడు హ.రా.

"సర్కారీ నౌఖరీలో ఏముందండీ? గొర్రెకి బెత్తెడుతోక....! అంతేగా! అదే ఏ సాఫ్ట్‌వేర్‌వాడో, బ్యాంకువాడో అయితే వేరే విషయం" చప్పరించాడు పిల్ల మేనమామ. పిల్ల తల్లీ తండ్రీ చోద్యం చూస్తున్నారే తప్ప నోరెత్తడం లేదు. ఏ మాటకి ఆ మాట, బామ్మ తరువాత వయసులో పెద్దవాడు పిల్ల మేనమామ.

"ఒహో.... అలా అంటారా....హ...హ..... మీరు అక్కడే పప్పులో కాలేశారని నేను ఖచ్చితంగా చెప్పగలను. అసలు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఎప్పుడు వూడతాయో, బ్యాంకులు ఎప్పుడు దివాలా తీస్తాయో ఎవరు చెప్పగలరూ? అదే సర్కారీ ఉద్యోగం అయితే- " సస్పెన్సుకోసం ఆపాడు.

"అయితే?" అడిగాడు పిల్ల మేనమామ. పిల్లా, పిల్ల తల్లీతండ్రీ, చివరికి మా బామ్మ కూడా కుతూహలంగా కొంచెం ముందుకి వంగారు. జవాబుకోసం.

"నేను చెప్పబోయేది బాగా వినండి!" మళ్ళీ ఆపాడు హ.రా. చిరునవ్వుతో.

"చెప్పవయ్యా బాబూ.... సర్కారీ ఉద్యోగం అయితే ఏమిటిటా?" అసహనంగా అన్నాడు పిల్ల మేనమామ.

"వస్తున్నా. సర్కారీ ఉద్యోగం వల్ల లాభం ఏమిటంటే... ఏమిటంటే - ఒకవేళ మావాడు ఉన్నట్టుండి 'ఠపీ' అన్నా, నెలతిరక్కుండా ఆ ఉద్యోగం మీ అమ్మాయికిచ్చేస్తారు. ఈ సదుపాయం సాఫ్ట్‌వేరు వాళ్ళకీ, ప్రైవేటువాళ్ళకీ, ప్రైవేటు బ్యాంకు గాళ్ళకీ ఉందా? ఉందాంట!" ఛాలెంజింగ్‌గా అన్నాడు.

ఆ మాట వినగానే 'దెబ్బకిఠా- దొంగలముఠా' లాగా మాకందరికీ నిలువు గుడ్లుపడ్డై ముందు తేరుకుంది మా బామ్మే.

"ఓరి నీ జిమ్మడా... నీ నెత్తిమీద పిచ్చుకలు గూళ్ళెట్టా.... నా మనవడు ఠపీమనాలిట్రా? నీ దివసం బెట్టా... నిన్ను కోసికోసీ కాకులకీ, గద్దలకీపడెయ్యా" వీరావేశంతో తిట్లందుకుంది మా బామ్మ.

"అది కాదండీ.... నేను చెప్పేదేమిటంటే" సర్దుకోబోయాడు హ.రా.

"ఏమిటీ నీ శ్రార్ధం? ఇంకొక్క క్షణం ఇక్కడ ఉంటే నిన్నేంజేస్తానో నాకేతెలీదు. ఓరి నీ కళ్ళల్లో కారంగొట్టా....మావాడు తపీమంటే ఉద్యోగం దానికిప్పిస్తావట్రా" భీకరంగా ఇంతెత్తున మళ్ళీ లేచింది మా బామ్మ. పెళ్ళికూతురు వాళ్ళకి ఇంకా స్పృహ వచ్చినట్టులేదు.

"నువ్వాగవే బామ్మా.... కాస్త నా మాట విను" నేను బలవంతంగా మా బామ్మని ఆపుతుండగా ఓ ఆటో వచ్చి గేటు ముందర ఆగింది. ఓ నడివయస్సు దాటినావిడ గునగునా నడుస్తూ లోపలికొచ్చింది.

పరిస్థితి గమనించి, "ఏమిటి? ఏమయింది? అన్నీ మాట్లాడుకున్నారా? ఈ అబ్బాయే కదూ పెళ్ళి కొడుకూ! ఇతనూ? ఓర్నీ నువ్వటోయ్ పపీహరా..." ఆశ్చర్యంగా హ.రా.ని చూస్తూ అన్నది ఆవిడ.

"ఈ నెలతక్కువ వెధవ నీకు తెలుసునా అమ్మాయ్? వీడ్ని కొబ్బరిపీచుతో తగలెట్టా - మావాడు తపీ అంటే ఆ పిల్లకి ఉద్యోగం దొరుకుతుందిట... వీడ్నీ..." మళ్ళీ లంకించుకుంది మా బామ్మ.

"ఈయన తెలీకేం....! వీళ్ళావిడ నేనూ పనిచేసేది ఒకే ఆఫీసులోనేగా! వీళ్ళ పెళ్ళిక్కూడా నేను వెళ్ళాను. పాపం పెళ్ళయిన నాలుగో నెల్లోనే ఇతన్ని వదిలేసి పుట్టింటికొచ్చేసింది... అదేం అంటే హ...హ...హ..." అంటూ నవ్వడం మొదలెట్టిందావిడ.

"అవన్నీ ఇప్పుడెందుకండీ?" కోపంగా అన్నాడు. "నువ్వు నోరుమూసుకో... భడవా... మావాడు తపీమనాలని అంటావా?

నువ్వు చెప్పమ్మాయ్. ఈ చింతయ్‌గాడిని ఆ పిల్ల ఎందుకు వదిలేసిందో..." హ.రా నోరుమూయిస్తూ అన్నది మా బామ్మ.

కదిలితే కరుస్తా టైపులో ఉన్నదేమో, పాపం పారిపోయే ధైర్యం కూడా హ.రా చెయ్యలేకపోతున్నాడు.

"ఆ పిల్ల నాకంటే పదేళ్ళు చిన్నది బామ్మగారూ. పెళ్ళిలోనే ఈ మనిషి 'నస' మొదలెట్టాడు. కాశీయాత్ర ఘట్టంలో రెండు జతల చెప్పులు కావాలన్నాడు"

"అదేమిటీ! కాశీయాత్ర అంటే పెళ్ళిలో ఉత్తుత్తియాత్రేగా?" ఆశ్చర్యపోయాడు పిల్ల మేనమామ.

"అదేమరి! కాశీ పోవడానికొకటీ - తిరిగి రావడానికొకటీట. ముక్కుపిండి మరీ వాళ్ళ దగ్గర్నుంచి రెండు జతల చెప్పులు వసూలు చేశాడు. ఇప్పటికీ బహుశా అవే వాడుతూ ఉండాలి...." నవ్విందావిడ.

"పెళ్ళయిన తరువాత గదా వదిలేసిందీ? ఎందుకే వర్ధనీ?" అడిగింది పెళ్ళికూతురు తల్లి. ప్రశ్న విని మళ్ళీ పకపకా నవ్వారు వర్ధనిగారు.

"అమ్మో....ఆ విషయాలు తల్చుకుని ఇప్పటికీ నవ్వుకుంటాం..... బెండ కాయలు కొంటే మొదలు చివరా కట్‌చేసి కదా కూర చేస్తాం! అందువల్ల కిలోకి యాభైగ్రాములైనా వేస్టు అవుతుందిట. సో – బెండ, దొండ, ఆనప, బీర ఇవ్వేమీ కొనగూడదట...."

"మరి అవన్నీగాక ఇంకేం తినాలి వీడి శ్రార్ధం...!" కోపంగా అంది బామ్మ... హ.రా.ని చూస్తూ. "ఆకుకూరలు కొంటే వీసమెత్తయినా 'వేస్టు' ఉండదుట. బంగాళాదుంప అయితే తొక్కుతో కూడా తినొచ్చుట. ఉడకబెడతాం గనుక నూనె ఖర్చు ఆదాట..... ఓర్నాయనోయ్.... చింతచిగురు తెచ్చి చింతపండు బదులు వాడమనేవాడుట... ఏదైనా సరే ఏభై గ్రాములకి మించి కొననిచ్చేవాడు గాదుట! ఏమయ్యా నిజమేనా?" పకపకా నవ్వుతూ అన్నది వర్ధనిగారు.

"అవునండీ.... అందులో తప్పేముందీ? రేట్లు మారుతూ ఉంటై గనక యాభైగ్రాములు మాత్రమే కొనమన్నాను. ట్రాన్స్‌ఫర్లు తప్పవు గనక చాపా, దిండూ బెస్టు అన్నానూ. అయినా అనవసరపు ఖర్చు తగ్గించమనడం కూడా తప్పేనా?" కోపంగా అరిచాడు హ.రా.

"పొదుపుచెయ్యడం వేరూ పొట్టమాడ్చడం వేరూ... ఇంత పీనాసివి గనకనే నీ మరదళ్ళు నీకు పపీహరా అని పేరెట్టారు!" గట్టిగా అన్నారు వర్ధనిగారు.

"పపీహరానా? అంటే?" అయోమయంగా అన్నాను నేను. "పరమపీనాసి హనుమంతరావని..." మళ్ళీ పకపకా నవ్వింది వర్ధని.

"ఓహ్.... అందుకా..." మెల్లిగా నవ్వాను నేను.

"ఏమిటీ?" కుతూహలంగా అన్నది వర్ధని.

"నాకేమో ఆ పాటంటే చాలా ఇష్టం. నేనెప్పుడు ఆ పాట గున్‌గునాయించినా హనుమంతరావుగారికి పిచ్చి కోపం వచ్చి నామీద బోలెడంత పనిపెట్టేవారు!"

"పాపం ఆ పిల్ల పెళ్ళయి ఆరేళ్ళయినా అలాగే ఉంది. మేం విడాకులు ఇచ్చి మరో పెళ్ళిచేసుకోమని సలహా ఇచ్చినా మౌనంగా ఉంటుందే తప్ప నోరు తెరిచి మాట్లాడదు" జాలిపడుతూ అన్నారు వర్ధనిగారు.

"ఓరి నీ పళ్ళ కింద గుండ్రాయిబడా. ముందా పిసినారితనం తగ్గించి, పిల్లని కాపురానికి తెచ్చుకో... ఇప్పటికే తొండ ముదిరినట్టు ముదిరావు. అయినా,

సిగ్గు లేదుటయ్యా... చచ్చేటప్పుడు వెంట తీసుకెళ్తావా? గడ్డివాము దగ్గర కుక్క కాపలా లాగా ఆ పొదుపేమిటీ నీ బొంద" కేకలేసింది మా బామ్మ.

"గడ్డివామి దగ్గర కుక్కకాపలా అంటే?" అడిగాను.

"కుక్క గడ్డిని తినా తినదు... తినే ఆవుని గడ్డి మెయ్యానివ్వదు. అచ్చు ఈ పపీహరాలాగానే!" అంటూ అప్రయత్నంగా నవ్వింది బామ్మ.

"అబ్బ ఊరుకోవే! పాపం, పొదుపరితనంలో తప్ప మా హనుమంతరావు లాంటి మంచివాడు ప్రపంచంలో ఉండడు తెల్సా!" హ.రాని ఊరడిస్తూ అన్నాను.

"అయితే ఇప్పుడన్నావోయి, ఆ పిల్ల కాళ్ళు పట్టుకునైనా కాపురానికి తెచ్చుకోమను" తేల్చింది బామ్మ.

"ఆయన సంగతి అట్టా ఉంచి పెళ్ళిసంగతి ముందర మాట్లాడండి" తేరుకుని అన్నాడు పిల్ల మేనమామ.

"ఇంకా ఏమిటయ్యా మాట్లాడేదీ.... మాకు చిల్లు పైసా కట్నం అక్కర్లా.... పెళ్ళి కూడా సింపుల్‌గా చెయ్యి!" ఠీవిగా అన్నది మా బామ్మ.

"అలా అంటే ఇంకేం కావాలి! గ్రాండ్‌గానే చేస్తాం. అయినా అమ్మాయీ అబ్బాయీ ఏమీ మాట్లాడుకోలేదుగా... అబ్బాయ్...నువ్వేమైనా అమ్మాయిని అడగాలా?" నన్ను చూస్తూ అన్నాడు పిల్ల మేనమామ.

"అదే...మీ... అమ్మాయికి... పాటలూ అవీ ఏమైనా!" అంటూ సిగ్గుపడుతూ అన్నా.

"ఓహ్... బ్రహ్మాండంగా పాడుతుంది. నాలుగైదేళ్ళ క్రితం 'పాడుతా తీయగా' లో కూడా ఫస్టొచ్చింది.

"పాడవే అమ్మాయ్!" ఇంతసేపటికి నోరు విప్పాడు పిల్ల తండ్రి, నాకు కాబోయే మామ.

పిల్లకూడా పెద్దగా బతిమాలించుకోకుండా పాట ఎత్తుకుంది.

"బోలీరే పపీహరా... పపీహరా..." అని.

కంగారుపడి మా హ.రా వంక చూశా. ఆయనా ఆ పాటని ఇప్పుడు ఎంజాయ్ చేస్తునట్టే కనిపించాడు. ఇంకేముంది చెప్పడానికీ...!

– స్వాతి 03-07-2015

# చూసి నేర్చుకోవాలి

"కనీసం పక్కింటాయన్ని చూసైనా మనకి 'లైటు' వెలగదు" ఆవిడ కంఠంలో విసుగూ కోపం వరదలా బయటికొచ్చాయి.

"ఏం వెలగాలి?" నేనడిగాను.

"చూస్తూనేవుంటిరిగా"

"ఎవర్ని?"

"పక్కింటాయన్ని!"

"చూస్తూనేవున్నా రోజూ! ఆయన ఆఫీసుకి వెళ్ళేటప్పుడూ వచ్చేటప్పుడూ"

"ఆ చూడ్డం కాదు!"

"మరెలా చూడాలి?"

"వెళ్ళేటప్పుడు ఆవిడకి ఎంత చక్కగా ఎంత ప్రేమతో టాటా చెబుతాడో చూడండి... ఆఫీసునుంచి వచ్చేటప్పుడు ఎంత ప్రేమగా మల్లెపూలూ, స్వీట్లూ తెస్తాడో చూడండి! 'హూ...! 'వెధవ పెళ్ళై' పాతికేళ్ళయినా నా ముచ్చట ఒక్కసారైనా తీర్చారా?" ముక్కు ఎగబీల్చి కళ్ళురుద్దుకుంది.

"ఆయన ఇల్లు వేరూ ఆఫీసు వేరూ గనక టాటా చెప్తాడు. నాకు ఇల్లూ, ఆఫీసూ ఒకటేగా?'

"ఆఫీసుకి వెళ్తేనే టాటా చెప్పాలని రూల్ లేదు!" ఆవిడ స్వరంలో చిన్న ఈసడింపు.

"పోనీ కూరగాయలకీ వాటికీ వెళ్ళేటప్పుడు టాటా చెప్పమంటావా? అసహ్యంగా ఉండదూ?"

"హూ! చెప్పింది శ్రద్ధగా విని అర్థంచేసుకునేవాళ్ళకి చెప్పినా లాభం ఉంటుంది గానీ, రాళ్ళకీ రప్పలకీ చెప్పి ప్రయోజనం ఏమిటీ?"

"అంటే నేనో రాయినో రప్పనో అంటావు!"

"నేనెందుకంటానూ? పూజకొద్దీ పురుషుడన్నారు!"

"రాయికీ పూజకీ లింకెట్టావన్నమాట. శభాష్!"

"అయినా.... మనకి లేనివాటి గురించి ఆలోచించడం బుద్ధితక్కువ. పావలా పుణ్యంచేసి పాతిక రూపాయల 'ఫలం' రావాలంటే ఎలా వస్తుందీ?" ఆఫీసు గదిలోంచి బెడ్‌రూమ్‌లోకి 'వాకౌట్' చేసింది.

ఆ తరువాత జరగబోయేది పెళ్ళైన ప్రతి మగవాడికీ తెలిసిందే. కొన్ని నిమిషాల పాటు మౌనం. ఆడదాని 'చికాకు' నుంచి మగవాడికి రక్షణ ఇచ్చే 'కవచం' ఏదీ?

అప్పుడెప్పుడో గుంటూర్లో ఉండేప్పుడూ ఇలానే...

"ఆయన చూడండి, ఎంత చక్కగా పొద్దున్నే లేచి భార్యకి సహాయం చేస్తాడో.... మీరూ ఉన్నారు!" అంటూ కొన్నాళ్ళు యుద్ధం ప్రకటించింది.

'ఆయన్ని' అబ్జర్వ్‌చేశా. పొద్దున్నే లేవడం.... కాఫీ కలిపి భార్యకిచ్చాకే తాను తాగటం.... ఆవిడ అంట్లు తోమితే తను తొలచడం.... కూరగాయలు తరిగివ్వడం, పిల్లల్ని ఆడించడం అబ్బో. ఎన్ని పనులు చేస్తాడో, నావల్ల కాదు గదా- కానే కాదు. అందుకే నోరు మూసుకున్నా.

కొన్నాళ్ళ తరువాత ఆయనోరోజున లైబ్రరీలో కనిపించాడు. "మీరిక్కడ పనిచేస్తారా?" అనడిగా.

ఆయన కొంచెం సిగ్గుపడి, "లేదు సార్.... మా ఆవిడ లెక్చరరు. నాకు ఉద్యోగం దొరకలా... దొరుకుతుందనే ఆశా లేదు. అందుకే ఆవిణ్ణి ఆఫీసులోనూ, పిల్లల్ని స్కూల్లోనూ దింపేసి ఇక్కడ పుస్తకాలు తిరగేస్తూవుంటా! మీవీ కొన్ని కథలు చదివా!" అన్నాడు.

ఆ మాటే మా ఆవిడతో అంటే "ఛీ! సిగ్గులేదండీ? ఆడదాని సంపాదన మీద ఆధారపడ్డ మగాడూ ఒక మగాడేనా? అందుకే అన్నీ ఆడంగిరేకుల పనులు చేస్తున్నాడు" అసహ్యంగా మొహంపెట్టి ఈసడించింది.

"మరి మీ అన్నయ్య బతికేది మీ వదిన ఆస్తిమీదేగా?" తుఫాను వస్తుందని తెలిసినా అడిగా.

"మొదట ఆ పిచ్చిమాట మానండి. మా అన్నయ్యకేం? కావాలని వెంటబడి మరీ మా వదిన పెళ్ళిచేసుకుంది. ఇంటినిండా నౌకర్లు చాకర్లూ.... ఈయనలాగా మా అన్న, పెళ్ళానికి సేవలుచేస్తూ తిరగడు. మహారాజులా దర్జాగా ఉన్నాడు" వాళ్ళన్నని తలుచుకున్నప్పుడు ఆవిడ కళ్ళల్లో మెరుపుల వర్షం కురుస్తుంది.

"మరి ఆ మధ్య మూడెకరాలో, నాలుగెకరాలో అమ్మి మీ వదిన మీవాడి పేకాట బాకీ తీర్చిందని నువ్వే అన్నావుగా?" అనడిగా.

"అవునూ... అయితే ఏమయిందిట? వాడికేం వాడు మగాడు. కొంపలో కూర్చుని పెళ్ళాం కొంగుపట్టుకుని తిరిగే చవటకాదు!"

"ఒహో..... పెళ్ళానికి సహాయం చేసేవాడు 'చవటా', పెళ్ళాం ఆస్తి అమ్మి పేకాడేవాడు మగమహారాజూ! శభాష్!" నా నవ్వులో కొంచెం వెటకారం ఉందని నాకు తెలుసు. ఆ 'కొంచెం' మోతాదూ ఏమాత్రం సుడిగాలిని రేపగలదో కూడా తెలుసు. వారం రోజులు నిరవధిక మౌనం.

నిజం చెప్పొద్దూ... నాకు చాలా హాయిగా ఉంది.

ఆ తరువాత ఆర్నెల్లకో, ఏడ్నెల్లకో.... విజయవాడలో... "హూ...! పక్కింటాయన్ని చూసైనా నేర్చుకోండి. ఎన్ని చీరలూ, ఎన్ని నగలూ తెచ్చాడో!"

"లంచం పట్టాడేమో?"

"అలా వెటకారం చెయ్యకపోతే మీ నోరు ఊరుకోదుగా. అయినా పుణ్యం కొద్దీ పురుషుడన్నారు!" అని విసవిసా వంటింట్లోకి నడిచింది.

ఆ మర్నాడు ఆ నగలూ, చీరలూ తీసుకొచ్చి మరీ నాకు చూపించింది. అవి చూసి "చాలా బాగున్నాయి!" అన్నా.... ఏదో ఓ కామెంటివ్వకపోతే మరో గొడవగనక.

"హూ...." చాలా బాగున్నాయిట! పక్కింటి మగాడు చెయ్యగలిగిన పని మనం చెయ్యలేకపోయామే అని సిగ్గుపడాలి గానీ – బాగున్నాయట..." చరచరా లోపలికి నడిచింది. నిజం చెప్పాలంటే 'చరచరా' అనకూడదు. అది కామన్‌జండర్‌కి సంబంధించింది. 'విసవిసా' అన్నదే కరెక్టైన మాట. అది కేవలం స్త్రీలకి మాత్రమే, అందునా మొగుడి మీద అలిగిన అతివలకి మాత్రమే వర్తించే

పదం గనక. ఆ తరువాత గిన్నెల 'దబదబలూ', పిల్లల 'విలవిలలూ' అలక 'సీన్'కి నేపథ్య సంగీతాన్ని సమకూర్చాయి.

టూకీగా చెప్పాలంటే-

**ఎ.** పామర్రులో పక్కింటాయన్ని చూసి కొత్తస్కూటర్ కొనలేనందుకూ, (మనకసలు స్కూటరెక్కడిదీ- ఉన్నదల్లా మా నాన్న పాతికేళ్ళు వాడిన 'హంబర్' సైకిలు) **బి.** గుడివాడలో 'పక్కింటాయన్ని' చూసి టేప్‌రికార్డరు 'హోదా' పొందలేనందుకూ, (మా ఇంట్లోది బి.సి నాటి వాల్వురేడియో, అది పలకదూ పాడదూ, కేవలం అలంకారార్థం ఓ బల్లమీద ఠీవిగా కూర్చుంటుంది... అంతే!)

**సి.** బాపట్లలోనో, బందర్లోనో 'పక్కింటాయన్ని' చూసి నెలకో 'టూరు' ఎంజాయ్ చెయ్యలేనందుకూ (మా వూరెళ్ళటానికే నాకు బడ్జెట్ చాలదు) ఇలా చేంతాడంత లిస్టుంది.

ఇంతమంది 'గురువులు' పక్కింటాయన రూపంలో సాక్షాత్కరించినా, ఏమీ 'నేర్చు'కోలేని నా అసమర్థతకి మా ఆవిడ ఓపికతో సతాయిస్తూనే వుంది. ఎప్పుడూ గుళ్ళోకి వెళ్ళనివాడ్నైనా, ఓసారి గుళ్ళోకెళ్ళి, "హే ప్రభూ.... మళ్ళీ జన్మంటూ ఉంటే... మళ్ళీ నన్నే మా ఆవిడ పెళ్ళి చేసుకోవలసి వస్తే, నన్ను మాత్రం 'ఇలా' కాకుండా, ఏదో ఒక 'పక్కింటాయన'లా పుట్టించు" అని గట్టిగా ఓ మొక్కు కూడా మొక్కుకున్నా.

జీవితంలో అన్నీ 'ఎండమావు'లే ఉండవు. అప్పుడప్పుడు కొన్ని 'సెల యేళ్ళు' కూడా ఉంటాయని ఓరోజు నాకు అర్థమైంది. నేను నిద్రపోతున్నాననే 'భ్రమ'లో మా ఆవిడ ఉంది. 'భ్రమ' అని ఎందుకంటున్నానంటే నిద్రపోతున్నట్టు 'నటించకపోతే' ఆ రోజు మళ్ళీ గొడవొస్తుందని అర్థమై గాఢమైన నిద్రని నటిస్తూ నా ఆలోచనలో నేనుండగా పక్కింటావిడ వచ్చింది.

ఆరోజు నిజంగా నాకు జ్ఞానోదయమైంది. ఇద్దరు ఆడవాళ్ళు కలిస్తే 'ఇన్ని' మాటలు మాట్లాడుకోగలరనీ- చుట్టుపక్కల ఆడా, మగా వాళ్ళ గురించి 'వీళ్ళకి' 'ఇంత' సమాచారం తెలుసుననీ-

నేనేకాదు.... ఏ మగాడూ ఊహించలేడు. సమాచార సేకరణలో ఆడవాళ్ళ మెదడు 'ఇంత' స్మార్ట్'గా పనిచేస్తుందని నే కల్లో కూడా అనుకోలా. నేను అసలు 'పత్రిక' అంటూ పెడితే, నా విలేఖరులందరూ ఆడవాళ్ళే అయి వుండాలని 'రూలు' కూడా పెడదామనుకున్నా.

ఏ మగాడు లంచంపడుతున్నాడో, ఏ కుటుంబ స్త్రీ ఎవరితో 'రహస్య' కలాపాలు సాగిస్తుందో, ఏ కాలేజీ పిల్ల ఎవడ్ని 'ముగ్గు'లోకి దింపే ప్రయత్నం చేస్తోందో, ఏ 'పిన్ని' గారు కోడలికి తెలీకుండా కూతురికి ఎంత 'దోచి' పెడుతుందో, ఏ 'మావ'గారు పని పిల్లమీద లుక్కేస్తున్నాడో-

ఏ ఉద్యోగస్తురాలు ఎన్ని 'టక్కులు' పోతోందో, ఏ చీర ఖరీదు వంద రూపాయలైతే దాన్ని రెండొందలు' అని స్టిక్కరతికించి 'ఫలానా' ఆవిడ 'ఫలానా' ఆవిడకి అమ్మిందో, ఎవరి నగలు ఒరిజనల్‌వో, ఎవరి నగలు గిల్టువో, ఎవరు పరమ పీనాసో, ఎవరు 'అప్పు' తీసుకుని ఎలా ఎగ్గొడతారో ఓరి నాయనోయ్! ఇవన్నీ 'వింటున్న' నా చెవులు దిబ్బళ్ళెక్కేశాయి.

కెజిబిలూ సిఐఎలూ వీళ్ళ ముందు ఎందుకు పనికొస్తై? చివర్లో పక్కింటావిడ "మీకేం సుభద్రగారూ... మీవారు చూడండి. అసలెవరితోటీ మాట్లాడరు... ఆయనేమిటో ఆయన 'పనేమిటో!' అంటూ నా చెవుల్లో అమృతం పోసింది. నేను ఆనందపడేలోపే మా ఆవిడ, "సరేలెండి....! మావారి సంగతే చెప్పుకోవాలి! ఓ ముచ్చటా అచ్చటా లేని శిలావిగ్రహం!" అని క్షణంలో కొట్టిపారేసింది. పాపం! పక్కింటావిడ ఏం మాట్లాడాలో తెలీక... "అలాగంటారా...! సరే.... మా వారొచ్చేటైమైంది.. వెళ్ళొస్తా!" అని చెక్కేసింది.

కాసేపు నిద్రని అభినయించి పడగ్గదిలోంచి బయటికొచ్చా. పోస్టుమేన్ మళ్ళీ ట్రాన్స్‌ఫర్ ఆర్డరు తీసుకొచ్చాడు. తప్పదు. 'పని' చెయ్యనివాళ్ళకి ఏ ట్రాన్స్‌ఫర్లూ వుండవు.

పగలూ, రాత్రీ ఒళ్ళు విరుచుకుని పనిచేసేవాడిని మాత్రం, ఎక్కడ బిజినెస్ 'డల్'గా ఉంటుందో అక్కడికి 'బదిలీ' చేస్తూనే ఉంటారు. నేనెక్కడికి వెళ్ళినా 'పని' మీదే కాన్సన్‌ట్రేట్‌చేస్తా. పగలంతా తిరుగుతూ 'ఆర్డర్లు' పట్టి ఏ రాత్రి పదింటికో 'కొంప'కి చేరి ఆ తరువాత వర్క్ రిపోర్ట్ తయారుచేసి అప్పుడు విశ్రాంతి తీసుకుంటా.

'విసవిస'ల పెళ్ళాలు దొరికినవాళ్ళందరూ 'గొప్ప' పనిమంతులుగా తయారవు తారని స్వానుభవంతో ఘంటాపథంగా చెప్పగలను. గయ్యాళిపెళ్ళాం వల్ల సోక్రటీస్ 'వేదాంతి' అయినట్టూ, చండికవల్ల ఉద్దాలకుడు 'ప్రసిద్ధి' చెందినట్టూ, మా ఆవిడ 'ఓర్పు' వల్ల నేనూ మంచి పనిమంతుడ్నని మా కంపెనీలో పేరు తెచ్చుకున్నా.

"ఏమిటీ? మళ్ళీ ట్రాన్స్‌ఫరా?" అంది.

"ఊ!"

"ఊ అంటే ఎక్కడికి?" కోమలంగా అడిగింది.

"మా వూరికి!"

"ఛస్తే రాను! కావాలంటే రోజూ బస్సులో వెళ్ళిరండి!" బహుశా ఏ 'చక్రవర్తి' కూడా 'రాజముద్ర' లేసేప్పుడైనా ఇంత 'అధికారికంగా' డిక్లేర్ చేసి ఉండడు.

"మా వూరెళ్ళాలంటే ఐదుగంటలు బస్సుప్రయాణం.... అదీ ఎక్స్‌ప్రెస్ బస్సులో...! రోజూ వెళ్ళిరావడం కుదురుతుందా?" చికాగ్గా అన్నా.

"రోజూ వెళ్ళడం కుదరకపోతే వారానికోసారి రండి!" తేల్చేసింది. ఇదేదో 'బా'గుందని నాకనిపించింది. హాయిగా వారంపాటు మా అమ్మదగ్గర ఆనందంగా ఉండొచ్చు.

"అలాగే!" అన్నాను. అలా అన్నప్పుడు నా గొంతులో ఆనందాన్ని మా ఆవిడ పసిగట్టకుండా ఉండగలదని నేనేనాడూ అనుకోను. ఎందుకంటే అటువంటి విషయాల్లో 'పెళ్ళయిన' ఆడవాళ్ళు మహాఎక్స్‌పర్టులు.

"అంటే పెళ్ళాం, పిల్లలు ఎట్టా చచ్చినా ఫరవాలేదన్నమాట. హాయిగా మీ అమ్మ దగ్గర కూర్చుంటారన్నమాట?" ఆవిడ స్వరంలో 'లాలిత్యం' ఎక్కువయింది.

"నువ్వేగా వారానికోసారి రమ్మందీ?"

"అంటే వెళ్ళిపోవడమేనా?"

"ఇక్కడే ఉన్నాగా! ఇంకా వెళ్ళనేలేదుగా?"

"వెళ్ళటం అంటే వెళ్ళారని గాదు, వెళ్ళడానికి సిద్ధపడ్డారని అర్థం" అంది.

ఓరి దేముడా! వీళ్ల మెదడులో ఏ ఎక్స్‌ట్రా ఎలిమెంట్ ఉంటుందోగాని, కోడిగుడ్డు మీద ఈకలు పీకడమేగాదు ఆ ఈకల్తో టోపీలు కూడా మన నెత్తిన పెట్టగలరు. వాదించడంవల్లనో విడమర్చి చెప్పడంవల్లనో 'పని' కాదని తెలిసినప్పుడు 'మౌనం'వహించడమంత మంచిపని మరొకటి లేదు. అందుకే నోరు మూసుకున్నా.

గది లోపలికి నేను నడుస్తుండగా ఆవిడ అరిచింది. "వాగితే వాక్కోనీ... అదో వెర్రిది... అనేగా మీ ఉద్దేశ్యం?"

దీన్నే అంటారు.... "కయ్యానికి కాలుదువ్వటం" అని. ఆ తరువాత మామూలే. 'ఛస్తే రాను' అన్నది కాస్తా బయలుదేరటానికి 'నేనడక్కుండానే' సిద్ధపడింది. అంతెందుకూ? సామాన్లు కూడా సర్దటం మొదలెట్టింది.

నా గుండెల్లో 'రాయి' పడింది. పాపం 'రామా కృష్ణా' అనుకుంటూ కాలం వెళ్ళబుచ్చుతున్న మా అమ్మ, మేం గనక మా వూరు చేరితే ఏమి అగచాట్లు పడుతుందోనన్న ఆలోచనే నాకు నిద్దర రాకుండా చేసింది.

'ఫోను' కనిపెట్టినవాడు ప్రజ్ఞాశాలి. ఆయనకి థేంక్స్ చెప్పుకుంటూ ఎస్.టి.డి సెంటర్నించి మా ఆఫీసుకి ఫోన్‌చేసి, నానా అబద్ధాలూ చెప్పి మా వూరు కాకుండా మరో వూరు అంటే "ఏలూరు"కి బదిలీ చేయించుకున్నా.

"ఫోను" కనిపెట్టిన 'ప్రజ్ఞాశాలి'కి థాంక్స్ ఎందుకు చెప్పానంటారా? లేకపోతే హెడ్‌క్వార్టర్స్‌కి వెళ్ళాలంటే ఓ రోజు పడుతుంది. నేనే 'కావాలని' ట్రాన్స్‌ఫర్ చేయించుకున్న సంగతి మా ఆవిడకి తెలిసి నానా రభసా అవుతుంది.

ఓ రెండురోజుల తరువాత "ఒహో! నేను మీ వూరొస్తే మీ అమ్మ పాపం కష్టపడిపోతుందని ట్రాన్స్‌ఫర్ మార్పించుకున్నార న్నమాట!" అంది.

ఆవిడ గొంతులో నా 'నిజ' స్వరూపాన్ని 'పసి' గట్టిన విజయగర్వం తొణికిసలాడింది. 'మౌనం' మహాభాగ్యం... అందునా పెళ్ళైన మగవాడికి. ఏలూరు చేరిన నెలరోజుల తరువాత అనుకుంటా – మా ఆవిడ 'హూ!" మీరూ ఉన్నారు ఎందుకూ? పక్కింటాయన్ని చూడండి! భార్య గర్భవతి కాగానే ఎక్కడ కందిపోతుందో అని స్కూటరున్నా 'కారు' కొన్నాడు. అయినా...." అంది.

చదివిన సామెతనే మళ్ళీ మళ్ళీ చదువుతుంటే రాసేవాడికీ, వినేవాడికీ బోరుకొట్టదూ?

❀ ❀ ❀

ఓ వారం గడిచింది. మార్పు ఏమిటంటే పక్కింటాయన భార్య పుట్టింటికి వెళ్ళింది. ఈ వారంలోనే మా ఆవిడా, పక్కింటావిడా ఫ్రెండ్స్ అయిపోవడం నా గురించీ, నా 'శిలావిగ్రహ' తత్వాన్ని గురించీ మా ఆవిడ పక్కింటావిడకి వర్ణించడం జరిగిపోయింది.

పక్కింటాయన కూడా మా ఆవిడ్ని 'అక్కగారూ' అంటూ చనువుగా పిలవడం ఈవిడ సాక్షాత్తూ శ్రీమహాలక్ష్మిలా 'అక్క మహాలక్ష్మి' పొంగిపోవడం నేను గమనించానని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు.

"పాపం....! కమ్మగా వండిపెట్టే పెళ్ళాం లేక మా తమ్ముడు కష్టపడుతున్నా డండీ. అందుకే ఇవ్వాళ గారెలు, పాయసం చేసి ఇచ్చా!" అని మా ఆవిడ చెప్పినప్పుడు మాత్రం నా ప్రాణం ఉసూరుమంది.

రాకరాక వచ్చానని మా అమ్మ గారెలూ, పాయసం చేస్తే ఈవిడే "హూ! కొడుకు మీద ప్రేమ పొంగిపోతోంది. ఇంతోటి గారెలూ, పాయసాలూ మీకు మెక్కపెట్టడం లేదనేగా మీ అమ్మ ప్రత్యేకంగా చేసిందీ?" అంటూ ఇంత పొడుగు దీర్ఘం తీసింది.

తను చేస్తే ఒప్పు, ఎదుటివాళ్ళు చేస్తే తప్పు!

మరోవారం గడిచాక తప్పనిసరి పరిస్థితుల్లో (మా ఆవిడ పుట్టినరోజు) సపరివార సమేతంగా సినిమాకి వెళ్ళాల్సివచ్చింది. సినిమా ఆల్‌రెడీ మొదలెట్టేశారు. సినిమా మొదటినించీ చూడాలనేది మా ఆవిడ నిశ్చితాభిప్రాయం. 'లేటు' అవడం వల్ల ఆవిడ "రుసరుస' స్వరాలు మధురంగా పలికిస్తూ చీకట్లో తడుముకుంటూ సీటుమీద కూలబడింది. ఆ పక్కసీట్లో నేనూ మా పిల్లలూ కూర్చున్నాం. ఎదుటి సీట్లో ఇద్దరు సరసాల్లో మునిగి తేలుతున్నారు.

ఇంటర్వెల్‌లో లైట్లు వెలిగినప్పుడు చూశా! మా పక్కింటాయన, అంటే మా ఆవిడకి 'దేవుడిచ్చిన తమ్ముడు' ఓ ఎర్రగా, పొడుగ్గా, అందంగా ఉండే అమ్మాయితో కలిసి కూల్‌డ్రింకు తాగుతున్నాడు. కూల్‌డ్రింకు తాగటంలో తప్పేమీలేదుగానీ, ఆవిడ కొంచెం తాగి 'యీతని'కివ్వడం, ఇతను కొంచెం తాగి నవ్వుతూ 'ఆమె' కివ్వడం మళ్ళీ ఆవిడ పెదాలతో సీసామూతిని బిగించి, కొంచెం తాగి 'ఇతని' కివ్వడం, ఇతనూ 'అదేపని' చేసి ఆవిడకివ్వటం, మహాముచ్చటగా అనిపించింది.

మా ఆవిడ ఆ విషయం గమనించినా గమనించనట్లు నటిస్తోందని నాకు తెలుసు. నాకు తెలుసని ఆవిడకీ తెలుసు. ఇంటికొచ్చాక తీరిగ్గా, మొట్టమొదటిసారి ధైర్యంగా అన్నా....

"అవునుగాని సుభద్రా!" ఇన్నాళ్ళూ నువ్వెంత చెప్పినా నాకు 'తట్ట'లేదు గానీ, పక్కింటాయన్ని చూసి 'నేర్చు'కోవలసింది చాలా ఉందని ఇవాళే నాకు తెలిసింది" అని.

ఆ తర్వాతేం జరిగిందో మీరే ఊహించుకోండి.

– స్వాతి 15-10-2013

# గోత్రం

ఇరవై సంవత్సరాలక్రితం మల్లికి రెండేళ్ళు. నాకు పన్నెండు. గునాగునా నడుస్తూ నా దగ్గరికి వచ్చి చేత్తో నా వీపుమీదో, తొడమీదో, మొహంమీదో సున్నితంగా కొట్టి 'మాబయ్యా' అని సంతోషంగా అరిచేది.

'మాబయ్యా' అంటే 'మామయ్యా' అన్న పిలుపు అన్నమాట. వాళ్ళ ఇంట్లోనే మేం అద్దెకు ఉండేవాళ్ళం. పెద్ద అరుగుల పెంకుటిల్లు. ఎండాకాలంలో కూడా చల్లగా ఉండేది.

'మల్లి' అమ్మ నాగమణి నా స్వంత అక్కలాగే ఉండేది. మల్లి నాన్న మాత్రం మహా 'చిటపట'గాడు. ఎప్పుడు చూసినా సణుగుడే. అప్పటిదాకా పకపకా నవ్వే మల్లికూడా వాళ్ళ నాన్నని చూస్తే తక్కున నోరుమూసుకుని బొమ్మలా కూర్చునేది.

"హో.... నేనంటే హడల్" అని ఆ పిచ్చిమానవుడు గర్వంగా అందరితోటీ చెప్పుకునేవాడుగానీ, ఓ చిన్నపిల్ల మనసులో కూడా అతనంటే 'భయం' తప్ప ఏమాత్రం 'ప్రేమ' లేదని అర్థం చేసుకోలేదు.

మల్లికి అయిదేళ్ళు వచ్చేసరికల్లా ఓ చిన్నసైజు 'విజ్ఞానఖని' అయిపోయింది. తెలుగు నెలల పేర్లూ, ఇంగ్లీషు నెలల పేర్లూ ఒకటేమిటీ సుమతీ శతకం మొత్తం వొప్పజెప్పేది. ఆ పిల్ల పలకమీద అక్షరాలు రాసినంత అందంగా లోకంలో ఎవరూ రాసివుండరని ఘంటాపథంగా చెప్పగల్ను.

అంతెందుకూ నేను 'బట్టీపట్టే' ఇంగ్లీషు పద్యాలు నాకంటే దానికే బాగా వచ్చేవని చెప్పటానికి నేనేమీ సిగ్గుపడను. ఎర్రగా, తెల్లగా, బొద్దుగా, ముద్దుగా 'మల్లి' అందరికీ ఫేవరెట్ అయిపోయింది. చక్కగా అందరితోనూ కలిసిపోయేది.

దాన్ని బజారు తీసికెడుతున్నా, స్కూల్లో దిగబెడుతున్నా నేను మహాగర్వంగా ఫీలయ్యేవాడ్ని. ఇహ మా అమ్మ మురిపెం చెప్పక్కర్లేదు.

ఏ పండుగ వచ్చినా ఆ పిల్లకి పట్టుగౌనో, పట్టు లంగాజాకెట్టో కొనాల్సిందే. అన్నట్టు చెప్పలేదు గదూ... మా అమ్మ ఆ ఊరి గవర్నమెంట్ స్కూల్లో టీచరు. మా నాన్న గురించి నాకేమీ తెలీదు.

నేను పుట్టిన మూడునెలలకే ఆయన పోయాట్ట. దాని ఆరో ఏట అనగా నా పదహారో ఏట, మా అమ్మ ఉద్యోగం వొదిలెయ్యడంవల్ల మేం ఆ ఇల్లు వదిలి ఢిల్లీకి మారాల్సి వచ్చింది.

జీవితం ఓ నదిలాంటిది. ఐతే ఒడ్డున కూర్చుని దాని గమనం తిలకించే వాళ్ళు చాలామంది ఉంటారు. మా అమ్మలాంటివాళ్ళయితే ఎదురీది మరీ అనుకున్న గమ్యాన్ని చేరతారు. అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారు.

నిజం చెప్పొద్దూ, నాకు ఇరవైయేళ్ళు వచ్చేవరకూ మా అమ్మగురించి కూడా ఏమీ తెలీదు. ఎప్పుడూ చదువుతూనే వుండేది. పరీక్షలమీద పరీక్షలు రాసి పాసవుతూ వుండేది. నా ఇరవయ్యో ఏట స్వయంగా 'లా ప్రాక్టీసు' మొదలుపెట్టింది.

మూడేళ్ళపాటు కృష్ణారావుగారి దగ్గర జూనియర్‌గా చేసింది. ఆ తరువాత ఆయన ఆశీస్సులతోనే స్వంత ప్రాక్టీస్ మొదలెట్టింది. ఎక్కువగా స్త్రీలకి సంబంధించిన కేసులే తీసుకునేది.

'మీ మదర్ చాలా గ్రేట్ మిస్టర్ యోగి. షీ ఈజ్ ఒన్ ఇన్ ఎ మిలియన్' అని నా కొలీగ్ సుమిత్ర నాతో చెప్పేవరకూ మా అమ్మ గొప్పదనం గురించి నాకు తెలీదు. ఎందుకంటే మామూలు విషయాలు తప్ప ఏనాడూ ఆవిడ ప్రొఫెషనల్ విషయాలు నాదాకా రానిచ్చేది కాదు.

నేనూ అంతే– నేను, నా చదువూ, ఫ్రెండ్స్!

"అమ్మా... నువ్వు చాలా గ్రేట్ అని నా ఫ్రెండ్ సుమిత్ర అన్నదే!" అన్నాను మా అమ్మతో.

నవ్వింది అంతే.

"అదికాదమ్మా..." ఏదో అనబోయాను.

"యోగీ... ఒక విషయం ఎప్పుడూ గుర్తుపెట్టుకో. పదిమందీ మనని 'గొప్ప' అన్నంతమాత్రాన అదే నిజమని కాలరు ఎగరెయ్యనక్కర్లేదు. అలాగే వందమంది మనం 'అప్రయోజకులం'అన్నంత మాత్రాన కృంగి కృశించిపోనక్కరలేదు.

నిజమైన గొప్పదనం ఏమిటో తెలుసా? నీ గురించి నువ్వు తెలుసుకోవడం. అంటే, నీలోని బలాలూ, నీలోని బలహీనతలూ నువ్వే గుర్తించడం అన్నమాట...!" క్లీన్‌గా ఎటువంటి సంశయానికీ తావివ్వకుండా చెప్పింది మా అమ్మ.

"ఒకమాట అడుగుతాను చెబుతావా అమ్మా?" అన్నాను. నవ్వింది. నవ్వి, "ప్రశ్నలు అడగటం చాలా తేలిక అనుకుంటారు చాలామంది. ప్రశ్న స్పష్టంగా లేకపోతే సమాధానం 'సరయినది' రాదు అని గుర్తించరు. సరైన మాట నువ్వడిగితే సరైన సమాధానమే చెబుతా...!" అంది.

"మనకి అసలు చుట్టాలు ఎవరూ లేరా?" అని అడిగాను...

"చుట్టాలు ఉంటే బాగుంటుందేమో అనే పరిస్థితుల్లో నిన్ను పెంచానా?" సూటిగా నావంక చూస్తూ అంది.

"లేదు... కొన్ని లక్షలమంది మనుషులకంటే నువ్వు నన్ను ఎంతో చక్కగా, గొప్పగా పెంచావు. ఫలానాది కావాలీ అని అడక్కముందే అన్నీ అమర్చావు. ఇంత చిన్న వయసులో బ్యాంక్ ఆఫీసర్‌ని కావడం కూడా నీ ముందుచూపు వల్లనే... కానీ, ఒక్క విషయంలోనే నాకు బాధ....

ఏమంటే నేను పుట్టినదగ్గర్నించీ నువ్వు కష్టపడటమే చూశా తప్ప ఒక్కపూట కూడా విశ్రాంతి ఎరగవు. అదీగాక...." ఆగాను.

"సారీకన్నా, ఎందుకో... చుట్టాలంటే పాముల్లాగా చుట్టుకునేవాళ్ళని నా చిన్నతనంలోనే ఓ అభిప్రాయానికి వచ్చాను. నా అభిప్రాయమే సరైనదని అనే మూర్ఖత్వం నాలో లేదు. కానీ నిన్ను మాత్రం చుట్టాలకి దూరంగానే ఉంచాను... పెంచాను.

ఇప్పటికీ వాళ్ళ అవసరం నాకూ, నా అవసరం వాళ్ళకీ ఉంటుందనుకోను. ఒకవేళ నీకు ఏమైనా, 'చుట్టాలు ఉంటే బాగుంటుందని' గాఢంగా అనిపిస్తే చెప్పు... వాళ్ళ అడ్రసులు వెతికిపట్టుకుని నీకు ఇస్తాను" మామూలుగా అన్నట్టు అన్నా, ఆ స్వరంలో ఒక బాధ ధ్వనించింది.

ఆ 'బాధ' ఎందుకో నాకు అర్థమయింది. ఆ తరువాత నేను ఏనాడూ మా అమ్మముందు చుట్టాల ప్రసక్తి తీసుకురాలేదు.

అలాగే ఓ రోజున మా అమ్మ కొలీగ్ శ్వేత నా ముందరే "ఏం సరస్వతీ, నీ కొడుక్కి పెళ్ళి చెయ్యవా?" అని మా అమ్మనడిగింది.

"ఆ విషయం ఆలోచించుకోవాల్సింది వాడు. ఎప్పుడు పెళ్ళి చేసుకుంటాడో, ఎవర్ని పెళ్ళి చేసుకుంటాడో, ఆ నిర్ణయాలను వాడికే వొదిలేశా...!" అని స్పష్టంగా చెప్పింది అమ్మ.

"అదేమిటీ? పిల్ల ఎటువంటిదో, ఆ పిల్ల కులగోత్రాలు, వంశాచారాలూ ఇవన్నీ తరిచి చూశాకే గదా వివాహం నిశ్చయించాలీ? ఆ పిల్లాడికి ఇవన్నీ ఏం తెలుసైె?" అంది శ్వేతాబన్సల్.

"అన్నీ చూసి చేసిన పెళ్ళిళ్ళు సజావుగా ఉంటున్నయ్యా శ్వేతా? ఒకవేళ సజావుగానే ఉంటే, మనం ఇంత బిజీగా ఎలా ఉంటాం!" పకపకా నవ్వింది మా అమ్మ. నిజమే.... అమ్మకీ, శ్వేతకీ కూడా విడాకుల కేసులే ఎక్కువొస్తై.

శ్వేతాబన్సల్ కూడా నవ్వేసింది... సంభాషణ పొడిగించకుండా.

మా అమ్మ నేను డిగ్రీ చదువుతున్నప్పుడే చెప్పింది... "తెలివైనవాడు ఎవరూ అంటే నా దృష్టిలో 'సమయ'పు విలువ తెలిసి నడుచుకునేవాడు. డిగ్రీ చదువుతున్నావు. ప్రేమా గీమా అంటూ ఎండమావుల వెంటపడి భవిష్యత్తుని నాశనం చేసుకుంటావో, ఇది కష్టపడాల్సిన వయసు అన్న గ్రహింపుతో భవిష్యత్తుకి మంచిబాట వేసుకుంటావో నీ ఇష్టం.... అలాగే నీ పెళ్ళి విషయంలో కూడా నేనేమీ అభ్యంతరంపెట్టను.

ఒక్క విషయంలో తప్ప - నీ సంపాదనతో 'మీ ఇల్లు' గడవాలిగానీ, నా సంపాదనతో కాదు... ఇది బాగా గుర్తుంచుకో" అంది.

ఇంకో విషయం కూడా చెప్పాలి. ఇంతవరకూ నా కులం ఏమిటో నాకు తెలీదు. 'ఫక్తు శాకాహారులం' అంతే. కులం ప్లేస్‌లో 'ఇండియన్' అని రాసేది. తండ్రిపేరు రాయాల్సిన పేరులో లేట్ ఎమ్.పి.రావు అని రాసేది.

మా అమ్మ జీవితం చాలా మిస్టీరియస్ అనిపించినా ఏనాడూ నేను ఆ మిస్టరీ ఛేదించే పనికి పూనుకోలేదు. అటువంటి పని చెయ్యడం అంటే మా అమ్మని చిత్రవథకి గురిచెయ్యడమేనని నాకు తెలుసు.

❀ ❀ ❀

"ఓ.కే మిస్టర్ యోగి..... అసలు విషయానికి సూటిగా వస్తాను. మీకు ఇరవైతొమ్మిదీ, నాకు ఇరవై ఎనిమిదీ. ఇద్దరిదీ ఒకే కేడర్, ఒకే బ్యాంక్. కులాల

విషయంలో మీకు పట్టింపు లేదని తెలుసు. మాకూ లేదు. మనం పెళ్ళి చేసుకుంటే బాగుంటుందని నా అభిప్రాయం.

నేనంటే మీకు ఇష్టమని అనుకుంటున్నాను. కానీ భార్యగా నన్ను మీరు ఇష్టపడతారో లేదో తెలీదు గనుక అడిగేస్తున్నా... విల్ యూ మేరీ మీ?" తన అమెరికన్ టైపు ఇంగ్లీషులో అడిగింది సుమిత్ర.

"మీరంటే నాకు ఇష్టం అనే అనుకుంటున్నాను మిస్ సుమిత్రా.... బట్ భర్తగా నన్ను మీరు భరించగలరో లేదో అనే విషయం మీరే తేల్చుకోవలసిందిగా నా మనవి. భరించగలనూ అనుకుంటే మిమ్మల్ని మా అమ్మగారికి 'కాబోయే... నో.... రాబోయే కోడలుగా' పరిచయం చెయ్యడానికి నాకు ఎటువంటి అభ్యంతరం లేదు" అన్నాను.

ఆ మాట నిజమే. అప్పటివరకూ నేనెవర్నీ ప్రేమించో, కామించో మనసు పారేసుకోలేదు. నా మనసు నా దగ్గరే భద్రంగా ఉంది.

"థేంక్స్ మిస్టర్ యోగీ! బహుశా రేపు సాయంత్రమే మావాళ్ళతో పాటు మీ ఇంటికి వద్దామనుకుంటున్నాను. మీరు కూడా ఓ.కె. అంటే!" అంది.

ఓ.కె అనక కాదని ఎలా అంటానూ? నన్ను అర్థం చేసుకోగలిగిన వ్యక్తి సుమిత్ర.

చిన్నప్పటినుంచీ ఒంటరిగా పెరగటంవల్ల కాస్త 'మితభాషి'ననే చెప్పుకోవాలి.

అట్రాక్టివ్ ఐటెమ్స్ అనగా ఆకర్షణీయంగా, చూడంగానే 'కొనెయ్యాలి' అనిపించే వస్తువుల్ని నేను చూస్తానేగానీ కొనను గనుక 'క్రెడిట్ కార్డు' అవసరం జన్మలో రాదని ఘంటాపథంగా చెప్పగలగటమే కాక– అనవసరపు సామాను ఉండదు గనక ఒక్క 'డబుల్ బెడ్‌రూమ్'లో ఎడ్జస్టయిపోగలనని ఎప్పుడయినా స్టాంపు పేపరుమీద రాసివ్వగలను.

'కంపెనీ' కోసం అంటూ అనవసర 'జాద్యా'లకి పోనూ – తావివ్వనూ. ఇవన్నీ సుమిత్రకి తెలుసు.

నేను పీనాసిని కాను. కానీ నేను సంపాయించే ప్రతి పైసాకీ విలువ నిస్తాను.... ధనాన్ని గౌరవిస్తాను. ఇతరులు కూడా అలాగే గౌరవించాలని కోరుకుంటాను. సుమిత్ర కూడా ఆల్‌మోస్ట్ నాలాగే ఆలోచిస్తుందని నాకు తెలుసు.

"ఊ... 'బాగుంది' అయితే మీ మధ్య 'ప్రేమ' అనేది ప్రాతిపదికగా లేదన్నమాట పెళ్ళికి... మంచిది. ఇది ఒక ఒప్పందంలాంటిది. అంటే ఒక బిజినెస్ డీల్‌లాంటిది. గుడ్...." నవ్వింది మా అమ్మ.

"అంటే నీకు ఇష్టమేనా... ఇష్టంలేదా?" అయోమయంగా అడిగాను.

"ఇక్కడ కావల్సింది 'నా ఇష్టం' కాదు. మీ ఇద్దరి ఇష్టం....! ఐనా ఇందులో చర్చించడానికి ఏముందీ?" లేచింది మా అమ్మ. ఒకసారి లేచిందంటే చర్చ ఆగినట్టేనని నాకు తెలుసు.

"వంటలపోటీ" గెలవాలంటే– బోలెడు ఐటెమ్స్ చేయమంటున్నారు ఛానెల్స్ వాళ్ళు. అక్కర్లేదు.... సౌత్ పిండివంటల్లో 'అరిసెలూ', నార్త్ వంటకాల్లో 'సమోసా' చేయిస్తే చాలు విజేతని క్షణాల్లో గుర్తించవచ్చు.

ఇటు అరిసె అయినా అటు సమోసా అయినా 'పర్‌ఫెక్టు' పాళ్ళు కుదిరితేగానీ 'అద్భుతం' అనిపించవు. అదృష్టవశాత్తూ మా అమ్మ రెండిట్లోనూ ఎక్స్‌పర్టే. 'దిసీజ్ వెరీ టేస్టీ' అయిదో అరిసెని ఆస్వాదిస్తూ అన్నాడు ఉత్తమ్‌కుమార్ షోన్యాల్.

ఆయన సుమిత్రా (లేక) షుమిత్రావాళ్ళ నాన్న.

అమ్మ జవాబుగా నవ్వింది.

సుమిత్ర చాలా బుద్ధిగా ప్రిన్సిపాల్ ముందర స్టూడెంట్‌లాగా కూర్చునివుంది. పక్కా 'చీర'లో పవిత్ర భారతప్రతిష్టని నిలుపుతోంది.

బెంగాలీలకి స్వీట్లంటే ప్రాణం. ఉత్తమ్‌కుమార్ ఉత్తమశ్రేణికి చెందిన భోక్త.

నేను చాలా పూర్ ఈటర్‌ని అయినా మంచి ఫీడర్‌ని. మరో రెండు అరిశెలూ, ఇంకో రెండు సమోసాలు ఆయన ప్లేట్‌లో వేశాను. ఎలాగయినా కాబోయే మావగారు కదా.

"ఒహ్....నో..." అంటూ ప్రతిఘటించినట్టు నటించాడు గానీ వాటికీ ప్రశాంతంగా 'న్యాయం' చేశాడు.

"ఒహ్... ఫెంటాస్టిక్ ఫుడ్.... బహుత్ అచ్ఛా.... మరోసారి మరోసారి వస్తూనే వుంటాగా బెహన్‌జీ! వచ్చినప్పుడల్లా మీ ఆంధ్రా ఫుడ్ తినిపించాలి.

వహ్వా... ఇంతకీ 'యోగి' వాళ్ళ నాన్నగారు ఏం చేస్తారూ?" అన్నాడు.

"ఏమీ చెయ్యరు! చేసే అవకాశమూ లేదు! ఆయన నా చిన్నప్పుడే పైకి వెళ్ళిపోయారు!" అన్నాను.

"ఓహ్...సారీ... ఇంతకీ మీ గోత్రం ఏమిటీ?" అడిగాడు ఉత్తమ్‌కుమార్ షోన్వాల్.

నేను మా అమ్మవంక చూశాను.

మా అమ్మ చాలా ప్రశాంతంగా, "ఉత్తమ్‌జీ... మావాడూ, మీ అమ్మాయీ ఇద్దరూ పెళ్ళి చేసుకోవడానికి నిర్ణయించుకున్నారు. మీ కులం, గోత్రం ఏమిటీ అని నేను ఇంతవరకూ మావాడినో, మిమ్మల్నో, మీ అమ్మాయినో అడగలేదు. ఏనాడూ అడగను. మీ ప్రశ్నలకి జవాబు ఇస్తేనే పెళ్ళిచేస్తానని మీరు పట్టుబడితే మాత్రం ఐయాం సారీ.... నేనేమీ చెయ్యలేను" అంది.

"అదేమిటి బెహన్‌జీ... చెట్టు లేకుండా విత్తనం పుట్టదుకదా... కనీసం గోత్రమూ, కులమూ కూడా తెలీకుండా పిల్లని ఎలా ఇస్తామూ? నేనయితే అవే అడిగాను. మా ఆవిడకి ఇంకా చాలా పట్టింపులున్నై.... ఇవాళ తను ఓ చుట్టాన్ని అర్జెంటుగా ఎటెండ్ కావాలి గనుక వెళ్ళిందిగాని..."

ఏదో ఇంకా చెప్పబోతుంటే సుమిత్ర కల్పించుకుని, "వాట్ డాడీ.... ఇంకా బీసీనాటి మాటలు మాట్లాడితే ఎలాగూ?" అంది.

"తప్పేముందమ్మా..... నేను అడిగింది కేవలం గోత్రాన్నే కదా... స్వగోత్రీకులైతే మీరిద్దరూ అన్నా చెల్లెళ్ళవుతారు!" కొంచెం చిరాగ్గా అన్నాడు.

"అదంతా పిచ్చితనం... మన రాష్ట్రం వేరు... వాళ్ళ రాష్ట్రంవేరు...మన భాష వేరూ.... వాళ్ళ భాష వేరు....!" వాదించింది సుమిత్ర.

"మరి ఇక్కడి ఆకాశం, సూర్యుడు, చంద్రుడు అక్కడా ఉన్నాయిగా? వాదించడానికేం? ఏదైనా వాదించవచ్చు. మీ ఆత్రం మీది....! అంతేగాని, రేపు మీకు పిల్లలుపుడితే వాళ్ళ పెళ్ళిరోజునయినా ఇదే ప్రశ్న వస్తుంది. ఏం చెబుతారూ?" కోపంగా అన్నాడు ఉత్తమ్‌కుమార్ షోన్యాల్ (షోన్యాల్ లేక సన్యాల్)

మా అమ్మవంక చూశాను. ఏమీ మాట్లాడలేదు. స్థిరంగా సుమిత్రవంక చూస్తోంది.

సుమిత్ర ఏమీ అనలేక, అడగలేక ఇబ్బందిపడి "ఆంటీ... మేం మళ్ళీ ఓ రోజున వస్తాం... ప్లీజ్... సరేనా?" అంటూ లేచింది.

మా అమ్మ చిరునవ్వుతో "సరేనమ్మా... ఎప్పుడైనా రావచ్చు...ఉత్తమ్‌జీ... మిమ్మల్ని కష్టపెడితే సారీ... కానీ నాకు నేను కొన్ని నిర్ణయాలు తీసుకున్నాను. వాటిలో కులం, గోత్రం, మతం, ప్రాంతం అనే చట్రాలకి అతీతంగా నాకొడుకు పెళ్ళిచెయ్యాలని... కాదు... వాడు చేసుకోవాలని.

అది కేవలం నా నిర్ణయం మాత్రమే. నా నిర్ణయం వల్ల వాడి జీవితం పాడవకూడదు. అది వాడి ఇష్టం.... మళ్ళీ మనం కలిస్తే చాలా సంతోషిస్తానని మాత్రం చెప్పగలను!' అంది.

సుమిత్రని నేను పెళ్ళిచేసుకోవాలనే నిర్ణయాన్ని తీసుకున్నానేగానీ, ఆమె అంటే పీకల్లోతు ప్రేమలో ఏమీ కూరుకుపోలేదు.

నిజం చెప్పాలంటే మొదటిసారి మా అమ్మ మాటలు చాలా మూర్ఖంగా అనిపించాయి.

ఆఫ్టాల్ గోత్రం పేరుచెబితే ఏం పోతుందీ! అదే అన్నాను... వాళ్ళు వెళ్ళిపోయాక.

"నిజమే! ఆఫ్టాల్ గోత్రం పేరు చెప్పకపోతే ఏం పోతుందీ? ఆ అమ్మాయి స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోగలదైతే నీ దగ్గరికొచ్చి పెళ్ళిచేసుకుంటుందీ! నీకంటే గోత్రమే ముఖ్యమనుకుంటే వాళ్ళ నాన్న రేపో మాపో తెచ్చే సంబంధానికి తలవొగ్గి, హాయిగా పెళ్ళిచేసుకుని, పిల్లల్ని కని ఉత్తమనారిగా పేరు తెచ్చుకుంటుంది...! బస్.... అంతే!" అంది....

ఎంత సింపుల్‌గా అన్నదంటే, నాకనిపించింది, 'ఈమె నిజంగా నా తల్లేనా? అసలు నా గురించి ఆలోచిస్తే ఈ మాట అంటుందా!' అని.

"షాకయ్యావా? మొండిదాన్ననే నిర్ణయానికి వచ్చావా? అసలు నేను ఆడదాన్నేనా, కన్నతల్లినేనా అనే అనుమానం వచ్చిందా?

పర్లేదు తొందర ఎందుకూ? ఆ అమ్మాయి ఏమంటుందో చూద్దాం. ఆ తర్వాత సంగతి అప్పుడాలోచిద్దాం!" అంది నవ్వుతూ.

ఆ నవ్వు మనిషి నవ్వినట్టుగా నాకు అనిపించలేదు. ఒక పాషాణం నవ్వినట్టు అనిపించింది. సైలెంటుగా నేను నా గదిలోకి వెళ్ళిపోయా.

ꕥ ꕥ ꕥ

"యోగీ... మీ మదర్ చాలా టఫ్ విమెన్... ఒక్క గోత్రం విషయంలో అంత పట్టుదల ఎందుకూ?" మరుసటిరోజున బ్యాంకులో కలవగానే అడిగింది సుమిత్ర. "నిజంగా గోత్రం అంత అవసరమయినదంటావా?" అడిగాను.

"కాక! రేపు మనకి పిల్లలు పుడితే వాళ్ళకి ఏమని చెబుతాం? వాళ్ళ పెళ్ళి విషయంలోనూ అవతలివాళ్ళు ఇదే ప్రశ్న అడుగుతారుగా...!" చాలా సీరియస్‌గా అంది సుమిత్ర.

సుమిత్ర సీరియస్‌గా ఉండగా నేను చూడటం ఇదే మొదటిసారి. పెదవులు.... కొంచెం బిగిసి.... కనురెప్పలు ఒంపుతిరిగి, నేను రోజూ చూసే సుమిత్రలాగా కనిపించలేదు.

"అప్పటి విషయం ఇప్పుడే ఆలోచించాలా?" చాలా మామూలుగా అన్నాను.

"కాక? అయినా అంత మూర్ఖత్వం దేనికీ? ఇట్సే సింపుల్ క్వశ్చన్..." అంది.

"అంత సింపుల్ క్వశ్చన్‌కి సమాధానం కోసం మీకూ అంత పట్టుదల ఎందుకు సుమిత్రా? ఈజీగా తీసుకో. మా అమ్మని అడగొచ్చు. ఖచ్చితంగా చెబుతుంది కానీ, హర్టవుతుంది అడిగినందుకు.

ఈరోజువరకూ 'గోత్రం' విషయంలో మా మధ్య ఏనాడూ చర్చ జరగలేదు. ఇప్పుడు కొత్తగా అడిగితే?" అన్నాను.

సుమిత్ర ఏమీ మాట్లాడకుండా తన సీటువైపు వెళ్ళింది. ఆనకట్టకి సన్నటి 'పగులు' వచ్చినట్టు మా మధ్య ఓ సన్నటి పగులు ఇప్పుడు నాకు స్పష్టంగా కనిపిస్తోంది.

మా అమ్మ మాటలు గుర్తుచేసుకున్నాను. నిన్న నేను ఆలోచించిన విధానానికి నాకే సిగ్గువేసింది. నా చదువూ, నా స్టేటస్సూ... నా స్నేహమూ అన్నీ ఒక్క 'గోత్రం' అనే సిల్లీ తుఫానుముందు ఎగిరిపోయాయా? లంచ్ కలిసే చేశాం కానీ, స్నేహ వాతావరణం లోపించింది.

"అయితే?" అన్నాను సుమిత్రతో. భుజాలు ఎగరేసింది, 'ఐ డోంట్ నో' అన్నట్టు. మూడువారాలు మూడు నెలలై మూడు సంవత్సరాలుగా కాలనదిలో కలిసిపోయాయి.

సుమిత్రా నేనూ అలాగే ఉన్నాం. కొలీగ్స్‌లా....! ఇప్పుడు నా వయసు ముప్పైరెండు.

బ్యాంక్‌లో ఉండగా అమ్మ ఫోన్‌చేసింది. "యోగీ! వారంరోజులు సెలవు పెట్టు... మనం అర్జెంటుగా హైద్రాబాదు వెళ్ళి అక్కడ్నించి నాగమణివాళ్ళ ఊరు వెళ్ళాలి..." అంది.

"ఏ నాగమణీ?" అడిగాను.

"చిన్నప్పుడు వాళ్ళ ఇంట్లో మనం అద్దెకు ఉండేవాళ్ళం. వాళ్ళ అమ్మాయి 'మల్లి' నీకు గుర్తులేదా?" అంది అమ్మ.

"అవును...కానీ..." ఏదో చెప్పబోయాను.

"ప్లీజ్! లీవు పెట్టు" అని ఫోన్‌పెట్టేసింది అమ్మ. ఏదో టెన్షన్‌లో ఉన్నదని మాత్రం తెలుస్తోంది. అయినా ఎప్పుడో చిన్నప్పటి ఇంటి ఓనర్ల ఇంటికి ఇంత అర్జెంటుగా ఎందుకు పోవాలీ?

"ఏమిటీ దీర్ఘ ఆలోచన?" నవ్వుతూనే అడిగింది సుమిత్ర.

"అర్జంటుగా మా ఆంధ్రాలో ఓ ఊరికి వెళ్ళాలని మా అమ్మ ఆర్డరు వేసింది" నవ్వాను నేను.

"ఎందుకూ?" అడిగింది.

"నాకు తెలిస్తేగా నీకు చెప్పడానికి....!" నవ్వాను మళ్ళీ... కాస్త ఇబ్బందిగా.

"ఓ.కె. ఓ.కె....! చివరికి మా నాన్న 'గోత్రం' సంగతి వదిలెయ్యమన్నారు, ఇవ్వాళ పొద్దున్నే... నిన్న రాత్రి ఆయనకి మైల్డ్ స్ట్రోక్ వచ్చింది. నువ్వు తొందరగా వచ్చేస్తే - నీకు అభ్యంతరం లేకపోతే...." అంటూ కళ్ళుదించుకుంది సుమిత్ర.

"రియల్లీ!" ఆనందంగా ఆమె చేతిని షేక్‌చేశాను. అబ్బ... ఎన్నేళ్ళు వృథా అయ్యాయో...

"థాంక్స్... కమ్‌బ్యాక్ సూన్!" కళ్ళు మెరుస్తుండగా నవ్వి అంది సుమిత్ర.

"ఫ్లైట్‌లో వెళ్ళాల్సినంత అర్జెంటా?" సీట్ బెల్ట్ బిగించుకుని అన్నాను.

"ఇన్నేళ్ళూ నేనూ, నాగమణీ ఉత్తరాలు రెగ్యులర్‌గా కాకపోయినా అప్పుడప్పుడు అయినా రాసుకుంటూనే వున్నాం. నాగమణి భర్త చనిపోయి చాలాఏళ్ళయింది. నిన్న ఏడుస్తూ ఫోన్ చేసింది రమ్మని!" నిస్సత్తువగా అంది అమ్మ.

పరీక్షించి చూశా. తల అక్కడక్కడా నెరిసింది. కళ్ళచుట్టూ నల్లని వలయాలు.

కంటికి కనిపించని బరువు మోస్తున్న లేడీ అట్లాస్‌లాగా ఉంది. న్యాయంగా ఆలోచిస్తే ఓ స్త్రీగా తనేం సుఖపడిందీ? మూడేళ్ళుగా నేనూ అప్రయత్నంగానే కొంచెం దూరం అవుతున్నాననే చెప్పాలి.

సుమిత్ర మాటలు అసంకల్పితంగానే నా మనసుమీద పనిచేశాయి.

నాకు బాధ కలిగింది. నా చెయ్యి అమ్మచేతి మీద వేసి "సారీ అమ్మా" అన్నాను.

"సారీ ఎందుకూ?" పేలవంగా నవ్వి కళ్ళుమూసుకుంది మా అమ్మ. బాగా అలిసిపోయిందనిపించింది. నా ఆలోచన కరెక్టే. హైద్రాబాద్‌లో అంటే శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో విమానం లేండ్ అయ్యేవరకూ మా అమ్మ కళ్ళు మూసుకునేవుంది. బహుశా... నిద్రపోయిందేమో తెలీదు.

బయటికి రాగానే 'టాక్సీ' మాట్లాడింది.

ఒక విషయం తప్పక చెప్పితీరాలి.

మా అమ్మ మాటల్లోనూ, నవ్వుల్లోనూ, నడకలోనూ కూడా ఓ హుందాతనం ఉట్టిపడుతూ వుంటుంది. ఆ హుందాతనం వృత్తికి సంబంధించింది కాదు. ఆమె సంస్కారానికి సంబంధించింది. అందుకేనేమో టాక్సీ డ్రైవర్ చాలా 'వినయంగా' డోర్ తీసి నిలబడ్డాడు.

ꙮ ꙮ ꙮ

ఆ పెంకుటింటిముందు కారు ఆగేసరికి ఉదయం ఏడున్నర. టాక్సీవాడి డబ్బిచ్చేసి సామానుతో అంటే ఓ చిన్న సూట్‌కేస్‌తో దిగాం.

తలుపులు వేసివున్నాయి.

తలుపులు కొట్టిన పదిపదిహేను క్షణాలకి గానీ తలుపులు తెరుచుకోలేదు. చూడగానే నేను షాక్‌తిన్నా.... ఈవిడ నాగమణా....! అందంగా, ఆరోగ్యంగా మిసమిసలాడే నాగమణి అక్కయ్యా ఈవిడా....? నాకు నోటమాట రాలేదు.

సుడిగాలిలా వచ్చి మా అమ్మని కావలించుకుని బావురుమని ఏడ్చింది నాగమణి.

"వచ్చావా సరస్వతివదినా.... వచ్చావా..." అంటూ నిలబడలేక అరుగుల మీదే కూలబడిపోయింది.

మా అమ్మ నాగమణక్క తల నిమురుతూ ఉంది గానీ, ఆమె కళ్ళల్లోనూ కన్నీరే.

"హ్రీ....హ్రీ...." లోపలినించి ఎవరిదో అరుపు. గభాల్న లేచింది నాగమణి.

"రా వదినా... చూడు.... నా ఖర్మ ఎలా కాలిందో....!" మా అమ్మ చెయ్యి పట్టుకుని వెర్రిగా ఇంటిలోపలికి లాక్కెడుతూ అంది నాగమణి.

మా అమ్మ వెనక నేనూ నడిచా.

ఆ గది నాకు బాగా తెలుసు.

ఒకప్పుడు మేము ఉన్నదే... మంచంమీద కాళ్ళూ చేతులూ కట్టబడివున్న ఆ అస్థిపంజరం ఎవరిదీ? నాకు కళ్ళు తిరుగుతున్నట్లనిపించింది.

"ఇదిగో ఒదినా.... ఇదే....ఇదేనమ్మా నా మల్లి.... చూడు...!" భోరున ఏడుస్తూ మా అమ్మ కాళ్ళదగ్గర ఒదిగిపోయింది నాగమణి.

"మల్లా... మల్లీశ్వరా..." అప్రయత్నంగా అరిచాను. ముద్దుగా బొద్దుగా ఉండే 'ఆ' మల్లీశ్వరా ఈ ఎముకల పోగు....

మాటరాక నేలమీద కూర్చుండిపోయా....

మా అమ్మచేసిన మొట్టమొదటి పని మల్లికి కట్టిన కట్లను విప్పదియ్యడం.

మల్లి మా అమ్మ మొహమ్మీద ఫటాఫటా కొట్టినా దాన్ని గట్టిగా గుండెల్లో పొదువుకుంది మా అమ్మ. లక్షగ్రంథాలు చెయ్యలేని పని ఒక్క 'మాట' చెయ్యగలదు. కోటిమాటలు చెయ్యలేని పని ఒక్క 'స్పర్శ' చేసి చూపించగలదన్న విషయం ఆ క్షణంలో నాకు అర్థమయింది.

"ఈ..." అంటూ గుండె పగిలేలా రోదించింది మల్లి. అసలేమయిందీ? వీళ్ళిద్దరూ ఇలా ఎందుకయిపోయారూ? ప్రశ్నలు.

మా అమ్మ నావంక చూసింది.

ఆ చూపు నాకు అర్థమై బయటికి వచ్చాను.

ఇరవయ్యేళ్ళుగా ఊరేమీ మారలేదు.... చాలా చిన్న మార్పులు తప్ప. పెరుమాళ్ళు హోటలు ఇంకా అదే సెంటర్లో ఉంది. ఓ పది ఇడ్లీలూ, గారెలూ పొట్లాలు కట్టించుకుని బయటికి వచ్చాను.

సత్యన్నారాయణ మాస్టారు కనిపించారు, ఒంకీలా ఒంగిపోయి. "నమస్తే మాస్టారూ.... నేను యోగిని! మీతోపాటు పనిచేసిన సరస్వతిగారి కొడుకుని!" నన్ను నేను పరిచయం చేసుకున్నా.

"నువ్వట్రా..... ఎంత ఎదిగావూ! ఎప్పుడొచ్చావూ? మీ అమ్మ ఎలా ఉందీ? గొప్ప క్రమశిక్షణ గలిగిన మనిషి!" అంటూ ప్రశ్నలు గుప్పించారు.

"పొద్దున్నే అమ్మా, నేను ఇద్దరం వచ్చామండీ.... నాగమణిగారి ఇంట్లో, అదే అదివరకు మేమువున్న ఇంట్లోనే దిగాము!" జవాబిచ్చాను.

"పాపం...! బంగారంలాంటి ఆ కుటుంబం నాశనమైపోయింది...! మనుషుల్లో మంచితనమూ, మానవత్వమూ హరించుకుపోయి పైశాచికత్వమూ, రాక్షసత్వమూ చోటు చేసుకుంటున్నాయి!" అంటూ నిట్టూర్చారు ఆయన.

"అసలు ఏమైంది మాస్టారూ?" అడిగాను.

"తెలీదా? నాల్గునెలల క్రితం ఆ పిల్ల.... అబ్బ ఎంతమంచిదో, ఎంత బుద్ధిమంతురాలో... పట్నం నుంచి వస్తుండగా నలుగురు స్టూడెంటు వెధవలు" సైలెంటైపోయారాయన మరో మాటరాక.

"హూ.... రేప్ చేసే ప్రయత్నం మాత్రమే చేశారనీ, రేప్ చేసినట్లు ఏ ఆధారాలూ లేవుగనుక రెండునెలల జైలుశిక్షతో వాళ్ళు బయటపడ్డారు. ఆ షాక్‌నుంచి పాపం ఆ పిల్ల ఇప్పటికీ కోలుకోలేదు. అదీగాక..... తెలుసుగా లోకులు కాకుల్లాంటివాళ్ళు. కాకులు పాపం అరుస్తై. వీళ్ళు మాటలతో పొడుచుకుతింటారు... ఛీ.... వీళ్ళజన్మలు చెడా...!" ఖాండ్రించి ఉమ్మేశారాయన.

అడగటానికీ, వినడానికీ ఇంకేముందీ?

"మల్లెపువ్వులాంటి మల్లీశ్వరి పాపపు చూపులుపడి పిచ్చిదైపోయింది....! ఒరే నాయనా.... భగవంతుడనేవాడు ఒకడున్నాడని నమ్మేవాణ్ణి! ఆ పిల్లని చూశాక, ఆ నలుగురు వెధవల్నీ కాల్చిపారెయ్యాలని నాకే అనిపించిందిరా!" కళ్ళు తుడుచుకుంటూ అన్నారు మాస్టారు.

వారంపాటు ఒక్కక్షణం మల్లిని వదిలి మా అమ్మ ఉండలా... స్నానం చేయించింది.

అన్నం కలిపి ముద్దలు పెట్టింది. ఒడిలో పడుకోబెట్టుకొని జో కొట్టింది.

"ఇదిగో నీ 'మావయ్యా... గుర్తున్నాడా'" అని దానికి నన్ను చూపించి గతాన్ని 'జ్ఞప్తికి' తెచ్చే ప్రయత్నమూ చేసింది.

అంతచిక్కి ఒడిలిపోయినా 'మా...మ...య్యా...." అని అనేటప్పుడు మల్లికళ్ళల్లో ఓ వెలుగు కనిపించేది. నిజమో కాదో గానీ, అలా కనిపించేదని నాకు అనిపించేది.

"యోగీ....! నీ పెళ్ళి కేవలం 'గోత్రం' గురించి ఆగిపోయింది...! ఆ ఒక్క చిన్న విషయమూ ఎందుకు నీతో చెప్పట్లేదని నీకు కోపం.

ఒకమాట చెప్పనా? మల్లిమీద అత్యాచార ప్రయత్నమే జరిగింది. నా విషయంలో ఆ అత్యాచారానికి అంతిమఫలం కూడా దక్కింది, ఆ ఫలానివి నువ్వే....! ఇప్పుడు చెప్పు.... ఏ గోత్రం చెప్పమంటావు? ఎవరిగోత్రం చెప్పమంటావు?

ఆనాడు నావాళ్ళు నా ఖర్మకి ఎట్లా వొదిలేశారో ఈ నాగమణినీ, మల్లినీ చుట్టాలూ పక్కాలూ అలాగే ఒదిలేశారు. వీళ్ళ తప్పేంవుంది?

నేను ఏటికి ఎదురీది బతికాను. నిన్ను బతికించాను. నీ పుట్టుకకు కారణమైన మృగాన్ని చంపి ముక్కలు చెయ్యాలని నా గుండె ఇప్పటికీ రగులుతూనే వుంది. కాని, నిన్ను ఏం చెయ్యనూ?

నువ్వే పాపం చేశావని నిన్ను శిక్షించాలీ? నాయనా... ఇప్పుడు చెప్పు.... ఏ 'గోత్రం' ఉంటుంది మానవమృగాలకి?"

"దేవుడా...! నేను నిన్ను చూశాను.... మా అమ్మ పాదాలదగ్గర! ఇంకేం వద్దు!" కరువుతీరా ఏడ్చాను.... ఆ పాదాలమీదపడి...!

❀ ❀ ❀

రెండేళ్ళు పడితేనేం! ఎందుకూ, ఎలా అని అడగొద్దు. ఆ వివరాలవల్ల ఏం ఉపయోగం? డాక్టర్లు చెప్పిన చిట్కా మాత్రం ఫలించింది.

హాస్పిటల్‌కి వెళ్ళాను. మొట్టమొదటిసారి మల్లి కళ్ళల్లో ఓ గుర్తింపు..... రెండు చేతులూ జాచి 'మామయ్యా' అని నావంక చూస్తూ భోరుమంది.

గట్టిగా.... గుండెల్లో గుండెలు కలిసిపోయేట్టు హత్తుకున్నాను. నా కళ్ళల్లోంచి కన్నీళ్ళు.... నాకు తెలుసు.... దాని పక్కనున్నది అంతకుముందే, ఓ అరగంట క్రితం పుట్టిన 'నా బాబు' అని. అచ్చు నాలాగే ఉన్నాడు..... ఆ ముక్కూ... ఆ నోరూ...

ఇంకేం చెప్పేదీ!

– స్వాతి ఆగష్టు 2014

# ఇదేకదూ

"నేను నీ స్నేహితుడ్ని అంతే! దేవుడ్ని కాను! కానీ, ఒక్క విషయం చెప్పక తప్పదు నువ్వేది చెయ్యదలుచుకున్నావో అన్నీ చేసెయ్.... ఎందుకంటే మహా నువ్వు బ్రతికేది కొద్దిరోజులు మాత్రమే. నిన్ను హాస్పటల్ అనే ఈ 'నిర్బంధం'లో ఉంచదలుచుకోలేదు. ఇంకో పదినిముషాల్లో నిన్ను డిశ్చార్జ్ చేసేస్తా" షేక్‌హ్యాండ్ ఇచ్చి అన్నాడు డాక్టర్ మూర్తి.

"అంటే?" అడిగాను. ఓ క్షణం నావంక సూటిగా చూసి అన్నాడు.

"భ్రమలో నిన్ను ఉంచటం ఇష్టంలేక నిజం చెప్పాను. ఇంకా నీ అహంకారాన్నే అట్టిపెట్టుకుంటావో, ఆనందంగా గడిపే ప్రయత్నంచేస్తావో నీ ఇష్టం. ఒకటిమాత్రం మర్చిపోకు, ఏదైనా తిరిగిరావొచ్చు... కరిగిన కాలం మాత్రం తిరిగిరాదు... వస్తాను" గబగబా గదిలోంచి వెళ్ళిపోయాడు.

ఈ హాస్పిటల్ నేను కట్టిందే. ఇదే కాదు, నా చేతుల్తో ఓ మహాసామ్రాజ్యాన్నే నిర్మించాను. నేను ఇంజనీర్ని కాదు.. కానీ ఇంజనీరింగ్ కాలేజీలు ఉన్నాయి. డాక్టర్ని కాను.... కానీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఉన్నాయి.

'పరిశ్రమ'తో సంబంధం లేకపోయినా లెక్కలేనన్ని ఇండస్ట్రీస్ నాకున్నాయి. నా కింద 'ఎంతమంది పనిచేస్తున్నారో' లాంటి చిన్న వ్యవహారాలు కూడా నాకు తెలీదు.

అసలు నాకెందుకు తెలియాలీ? నాకున్నది ఒకటే. అద్భుతమైన 'బ్రెయిన్'. ఆ బ్రెయినే నన్ను ఓ మహాసామ్రాజ్యానికి అధిపతిని చేసింది.

ఒక్క క్షణం మనసు కలుక్కుమంది. ఈ మహాసామ్రాజ్యం ఇంకెంత కాలం నా ఆధీనంలో ఉంటుందీ? నా తరువాత? గా...డ్...

డాక్టర్ మూర్తి సహాయంతో వెనుక గేటునించి బయటికొచ్చాను. అసలు నేను డిశ్చార్జ్ అయినట్లు ఎవరికీ తెలియచెయ్యొద్దని మూర్తికి చెప్పటమేగాక అతనిచేత ఒట్టుపెట్టించుకున్నాను.

బ్లాంక్ చెక్ మూర్తి చేతికిచ్చాను. డబ్బుకేం? క్రెడిట్ కార్డులకి లెక్కలేదు. హార్డ్‌క్యాష్ ఓ నాలుగు లక్షలు తీసుకున్నాను.

అప్పటికి వారంనించీ హాస్పటల్లోనే ఉండటం వల్ల 'గడ్డం' పెరిగింది. చేరినప్పుడు వేసుకున్న 'సూట్'నే ఇప్పుడు వేసుకుని బయటికొచ్చాను. 'అడి' కార్‌తో సహా నా ఒక్కడికోసం తొమ్మిది కార్లున్నై. ఇక నా నివాసం నిజంగా ఇంద్రభవనమే. కానీ నేను అక్కడికి వెళ్ళదలుచుకోలేదు. అసలు నేను 'నేను'గా ఎవర్నీ కలవదల్చుకోలేదు. నడుస్తున్నాను. అబ్బ... నడిచి ఎంత కాలమైందీ! ఎప్పటికప్పుడు ఎ.సి కార్లే... అలవాటు తప్పినా... నడుస్తుంటే హాయిగా ఉంది. ఎటొచ్చీ నా సూటే... ఇబ్బందిగా...

ఎదురుగా ఓ రెడీమేడ్ షాపు... హాయిగా ఓ పైజామా లాల్చీ కొనుక్కున్నాను. అద్దంలో చూసుకుంటే ఎంత బాగుందో ఆ డ్రెస్సు. ఇంతా ఏడిస్తే దాని ఖరీదు అయిదువందలు.

నా సూట్‌ని అక్కడే ప్యాక్‌చేయించి పైజమా లాల్చీతోనే బయటికొచ్చా. మరో పదినిముషాల తరువాత ఓ చెప్పుల షాపులో ఓ జత చెప్పులు కొనుక్కుని, నా షూస్‌ని కూడా 'ప్యాక్' చేయించేశా. ఆ సూట్‌ని, షూస్‌ప్యాక్‌నీ ఓ గుడ్డి బిచ్చగాడి దగ్గర పడేశా... ఓ వంద నోటుతో సహా. అమ్మయ్య... ఇప్పుడు ఫ్రీగా ఉంది. డబ్బు ఓ సంచిలో పడేసి భుజానికి తగిలించుకున్నా.

చాలాదూరం నడిచా. చెమటలు పడుతున్నాయి. ఎక్కడికెళ్ళాలీ? ఫుట్‌పాత్‌ని ఆక్రమించుకున్న సెకెండ్ హ్యాండ్ దుకాణాలు... ఠక్కున ఆగాను.

'నా దగ్గర ఈ పదిరూపాయలే ఉన్నాయి. దయచేసి ఆ గౌను ఇవ్వండి మీకు పుణ్యం ఉంటుంది!" బతిమలాడుతోంది ఓ స్త్రీ. ముప్పై ఏళ్ళు ఉంటాయేమో! ఆవిడ పక్కన పాపకి ఎనిమిదేళ్ళు మించవు.

"ఆ తెల్లగౌనయితే ఎనిమిదికే ఇస్తాను. ఇది మాత్రం పదిహేనుకి తగ్గదు" నిర్ధాక్షిణ్యంగా అన్నాడు ఆ దుకాణాదారుడు.

"చిట్టీ.... ఆ తెల్లగౌను చూడు ఎంత బాగుందో! అది తీసుకోనా మరీ. అది కొన్నాక నీకు ఓ వేరుశెనగ ఉండ కూడా కొనిపెడతాగా!" అనునయంగా పిల్లతో అన్నది ఆమె.

"ఉహూ.... నాకా గులాబి గౌనే కావాలి. ఇంకేదీ వద్దు...!" పిల్ల గొంతులో పట్టుదల... "అదికాదే.... నా దగ్గర అంతడబ్బు లేదు!" ఆ స్త్రీ గొంతులో నిస్సహాయత "నా తల్లిగదూ... నా బంగారు కదూ... ఆ తెల్ల గౌను తీసుకో"

"నా కసలు ఏదీ అక్కర్లా...ఫో!" పిల్ల కోపంగా అన్నది. నాకెందుకో కళ్ళవెంట నీరు తిరిగింది.

"నా బంగారు తండ్రి కదూ.. ఈ పూటకీ ఆవకాయతో తినెయ్... రేపు ఖచ్చితంగా బజ్జీలు చేసి పెడతాగా!" బతిమలాడుతూ మా అమ్మ. "చచ్చినా తినను.... నువ్వెప్పుడూ అబద్ధాలే!" అన్నం ప్లేటుని విసిరేసి నేను. ఎంత మౌనంగా మా అమ్మ ఆ అన్నపు మెతుకుల్ని ఏరి ప్లేటులో పెట్టిందీ...! ఒక్కమాట అనలా. "చచ్చి నీ కడుపున పుడతానయ్యా... రేపు దీని పుట్టినరోజు" బతిమలాడుతోంది ఆ స్త్రీ.

"కుదరదన్నానుగదమ్మా... కొంటే కొనూ... లేకపోతే ఫో" మరో కస్టమర్‌ని అటెండ్ అవుతూ కసిరాడు దుకాణదారు.

"చిట్టీ... ఈ ఒక్కసారికీ నా మాట విను. ఆ తెల్లగౌను తీసుకో... సరేనా?" పిల్లగడ్డం పట్టుకుని బతిమలాడుతోంది ఆ స్త్రీ.

నాకు తెలుసు. ఇవన్నీ భాగ్యవంతులూ మధ్యతరగతివాళ్ళూ వాడేసిన బట్టలనీ, వాటిని ఏ స్టీల్ సామానువాడికో పడేసి చెంచానో, గరిటో తీసుకుని ఉంటారని. ఈ సెకెండ్ హ్యాండు దుకాణంవాళ్ళు వాటిని చక్కగా ఉతికించి, రిపేరుచేసి మళ్ళీ అమ్మకానికి పెడతారు.

ఓ అయిదురూపాయలు తక్కువకిస్తే దుకాణంవాడికొచ్చే నష్టం ఏమీ ఉండదు. కానీ ఇవ్వడు. ఎందుకంటే ఆ పిల్ల దృష్టి 'గులాబీ గౌను' మీద ఉంది. అందుకని ఆ తల్లి 'చచ్చినట్టు' కొని తీరక తప్పదు. వ్యాపారం అంటే ఎదుటివాడి బలహీనతని క్యాష్ చేసుకోవటమేగా!

"నాకక్కర్లా.... ఫో...." కాళ్ళు దబదబా నేలకేసి బాది అన్నది ఆ పిల్ల మంకుగా.

"డబ్బు లేదన్నా వినవేం!" కోపంగా ఆ పిల్ల వీపుమీద ఒకటి అంటించింది తల్లి.

"ఫో....నాకసలు ఏదీవద్దు..." ఏడుస్తూ నేలమీద కూచుంది పిల్ల. నవ్వొచ్చింది. ఏడిస్తే 'చచ్చినట్టు' కొనిస్తుందని ఆ పిల్లకీ తెలుసు. "ఓరి భగవంతుడా!" నుదుటి మీద బాదుకుంది ఆ తల్లి.

సడన్‌గా ఆ దుకాణాదారుడి ముందుకెళ్ళి "ఆ షర్టెంతా?" అన్నాను. ఓ షర్టుని చూపిస్తూ.... "ముప్ఫైరూపాయల్" అన్నాడు నావంక చూస్తూ.

"ముందు ఆ గౌనుని ఆవిడకి ఇచ్చెయ్... పదిరూపాయలకే ఇవ్వు. మిగతావి నేను ఇస్తా!" అన్నా మెల్లగా, షాపువాడికి మాత్రమే వినిపించేట్టు చెప్పాను. అతను ఆశ్చర్యంగా నావంక చూశాడు.

"అబ్బబ్బ నీ పిల్ల ఏడుపుని ఆపవమ్మా.... సరే ఆ పదిరూపాయలకే ఆ గులాబీ గౌను పట్టుకుపో.... ఏం చేస్తాం!" గులాబీ గౌనుని ఆ స్త్రీ వైపుకి విసిరి అన్నాడు దుకాణదారు. ఠక్కున ఏడుపు ఆపేసి ఆనందంగా గౌనుని అందుకుందా పిల్ల. కొంగుముడి విప్పి చిల్లరంతా లెక్కపెట్టి పదిరూపాయలు ఇచ్చేసింది ఆ తల్లి.

"దేవుడు నిన్ను చల్లగా చూడాలి నాయనా... నా ఊపిరి కూడా నువ్వే పోసుకుని బతుకు!" దీవించి పిల్లభుజంమీద చెయ్యివేసింది తల్లి.

నా నల్ల కళ్ళద్దాల వెనక గిర్రున నీళ్ళు తిరిగాయని నాకు మాత్రమే తెలుసు.

"నాయనా... ఇదిగో....ఇవే నా దగ్గర మిగిలున్నవి... నిన్ను ఒంటరిగా వదిలేసి'" సైలెంటైపోయింది మా అమ్మ. తన కొంగుకి కట్టుకున్న ముడివిప్పి నోట్లూ చిల్లరా నా చేతిలో పెడుతూ... మా అమ్మ కొంగుని ముఖానికి హత్తుకుని ఏడ్చాను.... "అమ్మా నీకేం కాదే..." అంటూ.

కానీ ఆ రాత్రే నిశ్శబ్దంగా నా ఒళ్ళో తలపెట్టుకుని చచ్చిపోయింది.

"ఆవిడకే ఇవ్వొచ్చుగా సారూ!" అదో మాదిరిగా నావంక చూస్తూ అన్నాడు దుకాణంవాడు.

"ప్రాణం పోయినా ఆవిడ తీసుకోదు. ఎందుకంటే ఆవిడ బిచ్చగత్తె కాదు... మనలాంటి వ్యాపారస్తురాలూ కాదు!" బిగుసుకున్న 'గొంతు'ని సడలించే ప్రయత్నం చేస్తూ ఓ ఐదువందల రూపాయల నోటు అతని చేతిలో పడేసి ముందుకి నడిచా. అమ్మపోయాక నేను చెయ్యని పనిలేదు.

డిగ్రీ ఉన్నా ఉద్యోగం రాకపోవటంతో నానా పనులూ చెయ్యక తప్పలేదు. "బావా...నువ్వు అందగాడివే... చదువుకున్నవాడివే... కానీ అవి అన్నంపెట్టవుగా...

అదీగాక, ఈ 'ఇరుకు' బతుకు నేను బతకదల్చుకోలేదు. డబ్బున్నవాడైతే చాలు... ఎంత వెధవైనా వెంటనే పెళ్ళిచేసుకుంటాను!" నిష్కర్షగా చెప్పింది నా మేనమామ కూతురు.

అసలు మా అమ్మ చనిపోకముందు, "అనసూయా! నీ కొడుకుని నా కూతురికివ్వాలే. ఒట్టెయ్యి!" అని మాట తీసుకున్నది మా మామయ్యే. అప్పుడు ఈమే అక్కడే ఉంది. ఎందుకోగానీ నా మనసు పగిలిపోకపోగా ఇంకా గట్టిగా బిగిసిపోయింది.

"అలాగే ఆశా.... ఆల్ ద బెస్ట్" మా మామ కూతురితో అని ఆ ఊరు వదిలేశాను.

"సార్... ఈవెనింగ్ న్యూస్ సార్. రెండ్రూపాయలే... ప్లీజ్ సార్...." వెంటపడ్డాడు ఓ కుర్రాడు... పేపర్ల కట్ట మోస్తూ. ఎక్కడబడితే అక్కడ టీ.వీ.లుండగా ఈవెనింగ్ ఎడిషన్‌లు ఎవరు కొంటారు? ఓ రెండ్రూపాయలిచ్చి సరదాగా ఓ పేపరు తీసుకున్నా.

"ప్రముఖ విద్యా, వైద్య, పారిశ్రామికవేత్త పరిస్థితి అలానే ఉంది. వారం దాటినా ఏమీ మార్పులేదని 'లైఫ్' హాస్పటల్స్ గ్రూప్ వైస్ ఛైర్మన్ డా॥ మూర్తి ప్రెస్‌మీట్‌లో అన్నారు" హెడ్‌లైన్స్‌లో నా పేరే ఉంది.

"సార్.... ఫోటోలో ఉన్నాయనా మీరూ ఒక్కలాగే ఉన్నారు సార్" ఆశ్చర్యంగా నావంక చూస్తూ అన్నాడు పేపరుబోయ్.

"ఆయనకి వెయ్యికోట్ల ఆస్తి. అదీ హాస్పటల్లో ఉన్నాడు. నాలాగా రోడ్డుమీద కాదుగా!" నవ్వాను.

"కరెక్టే... పాపం ఆయనున్నది హాస్పిటల్లోగదా!" ముందుకెళ్ళాడు పేపర్‌బోయ్.

ఇప్పుడేం చెయ్యాలి? కొవ్వొత్తి కరిగిపోతోంది.... సరే నాకేం కావాలి?

"పరిత్రాణాయ సాధూనాం..." రోడ్డుకి అవతలున్న గుడిలోంచి ఘంటసాల గారి గొంతువినిపిస్తోంది. అటువైపు నడిచాను. సాయంకాలం ఏదో 'గురూజీ' స్పీచ్ ఉన్నట్టుంది. చాలామంది కూర్చుని పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు.

"అబ్బ.... నిన్నటి ఉపన్యాసం ఎంత బాగుందో... నువ్వు మిస్సయ్యావుగానీ సుబ్బారావ్.... మనిషికి ముక్తి లభించాలంటే నిరంతరం భగవధ్యానంలో ఉండాలని ఎంత చక్కగా నిరూపించారో!" ఓ ముసలాయన మరో ముసలాయనతో అంటున్నాడు.

నేను తక్కున లేచాను.

దూరంనించే గర్భగుడిలో కనిపిస్తున్న దేవుడికి నమస్కరించి బైటికొచ్చాను. స్వర్గ నరకాల గురించో, ముక్తి గురించో, పుణ్యపాపాల గురించో ఆలోచించే టైమ్ నాకు ప్రస్తుతం లేదు.

సరే... శరీరాన్ని విడిచిపోయాక అవి ఉంటేనేం.... లేకపోతేనేం? నా జేబులో సెల్లు మోగింది. ఆ సెల్లు నా పేరుమీద లేదు. మూర్తే తనపేరు మీద మరో సిమ్ కార్డ్ తీసుకుని నాకు ఇచ్చాడు. అతనికి తప్ప నా నెంబరు ఇంకెవ్వరికీ తెలీదు.

"చెప్పు మూర్తీ..." అన్నాను. "లాయరు ద్వారా నీ భార్యాపిల్లలు నన్ను అడిగించారు... అదే ఆస్తి విషయం.... ఏం చెయ్యమంటావూ?"

"వాళ్ళకి ఎంతెంత ఇవ్వాలో... మిగిలినది ఏం చెయ్యాలో స్పష్టంగా ఆలోచించుకునే ఉన్నాను. ఓ పని చేద్దాం... నా స్వహస్తాలతో విల్లు రాసి నీ దగ్గరకు తీసుకొస్తా.

క్వయిట్‌గా దాన్ని రిజిస్టర్ చేసేసి వాళ్ళ కాపీలు వాళ్ళకి పంపించేద్దాం. అంతా నా స్వార్జితం గనక ఏ పేచీలు ఉంటాయని అనుకోవటంలా!"

"సరే! వాళ్ళు నిన్ను చూడాలని గొడవపెడుతున్నారు!" ఓ క్షణం ఆగి అన్నాడు మూర్తి.

"నేను స్పృహలో లేనని చెప్పి పంపించెయ్!" నవ్వాను.

"ఓ.కే. అదో సమస్య కాదనుకో!" తనూ నవ్వి పెట్టేశాడు.

ఇద్దరు వ్యక్తుల మధ్య అయినా, రెండు దేశాల మధ్య అయినా గొడవలు రావడానికి కారణం ఏమిటీ? అసలు దెబ్బలాటలు, యుద్ధాలూ ఎందుకొస్తాయి? యుద్ధాలూ, దెబ్బలాటలూ నిజంగా వచ్చేది మనుషుల మధ్యా, దేశాల మధ్యా కాదు. అవి వచ్చేది 'అహంకారాల' మధ్య. ఈ విషయం నాకు బాగా తెలుసు. జనం దృష్టిలో నాకు అహంకారం ఎక్కువ. వాళ్ళకి తెలిసింది అంతే.

ఎవరికి కావల్సింది వాళ్ళకి ప్రశ్నలు అడక్కుండా ఇచ్చేస్తే నువ్వు చాలా మంచివాడివి. అలా కాకుండా వాళ్ళ దృష్టి తప్పు అని నిరూపిస్తే నువ్వు అహంకారివి. అందుకే, నా భార్య దృష్టిలోనూ, నా పిల్లల దృష్టిలోనూ నేను అహంకారిని.

ఫకాల్న నవ్వాను. చుట్టూ చూస్తే కొంతమంది నావంక వింతగా చూస్తున్నారు. అదీ నాకు వినోదంగానే అనిపించింది.

నిజంచెప్తే.... ఆ 'అహంకారమే' నన్ను ఇన్నాళ్ళూ 'కవచం'లా కాపాడుతూ వచ్చింది. నన్ను 'నమ్మని' నావాళ్ళనించీ, నేను 'నమ్మని' నావాళ్ళని అనుకునే వాళ్ళనించీ.

డబ్బుని సంపాయించడంలోనే అహోరాత్రాలూ గడిపాను. డబ్బు డబ్బుని సంపాయించడం మొదలెట్టాక, నా చుట్టూ ఉన్నవాళ్ళని జాగ్రత్తగా గమనించడం మొదలెట్టాను.

అందుకేనేమో ఆస్పత్రిపాలయింది. పొద్దు చీకటనే శిరోజాల్లో చిక్కుకుపోయింది. ఆకాశంలో నక్షత్రాల్లా రోడ్లమీదా షాపుల్లోనూ దీపాలు వెలిగాయి. 'ఉడుపి కృష్ణాభవన్' నియాన్ లైట్ల వెలుతుర్లో కనిపించింది.

గబగబా అడుగులు వేశాను.

ఇరవై రూపాయలిచ్చి సాంబారిడ్లీ టోకెన్ తీసుకుని, సెల్ఫ్ సర్వీస్ లైన్‌లో నిలబడ్డాను.

మా ఊర్లో ఉడుపి హోటల్ కొత్తగా పెట్టినప్పుడు నా గోల భరించలేక మా అమ్మ నన్ను హోటల్‌కి తీసికెళ్ళి సాంబారిడ్లీ ఇప్పించింది.

"నువ్వూ తినమ్మా..." అని అడిగి మా అమ్మచేత కూడా కొంచెం తినిపించేంత 'బుద్ధి' అప్పటికి నాకు రాలేదు. గబగబా తినెయ్యడం తప్ప. తింటూతింటూ మా అమ్మ వంక చూస్తే ఆమె కళ్ళల్లో అనంతమైన తృప్తి. ఇప్పటికీ ఆ కళ్ళు నన్ను వెన్నాడుతూనే ఉన్నాయి...దీవిస్తూనే ఉన్నాయి....

"నీతోటి నీకోసం మేమున్నామంటూ" నన్ను సముదాయిస్తూనే ఉన్నాయి. మా అమ్మ నా ఎదురుగానే ఉన్నట్టు ఊహించుకుంటూ, బరువెక్కిపోయిన గుండెని నేనే జోకొట్టుకుంటూ టిఫిన్ తినేశాను. శరీరం ఇక్కడున్నా – మనసు మా ఊరి నాటి హోటల్లో ఉంది....మా అమ్మ ఎదురుగా!

"చచ్చినా వాళ్ళకి పైసా దక్కనివ్వను. ఎంత కష్టపడి పెంచానూ! కృతఘ్నులు... కుక్కకైనా విశ్వాసం ఉంటుంది!" బాధగా ఓ మధ్యవయస్కుడు మరో వ్యక్తితో అంటున్నాడు.

వాళ్ళు పక్కటేబుల్ దగ్గరున్నారు. కొన్నిరోజుల క్రితం నేనూ ఇతనిలాగే అనుకున్నాను. నా ఆస్తిలో ఒక్కపైసా కూడా 'వాళ్ళ'కి ఇవ్వకూడదని. పిల్లల

సంగతి సరే... తల్లి కూడా వాళ్ళతో చేరి పట్టుబడుతుందా... అవసరమైతే కోర్టుకెడతానంటుందా? నేను చేసిన తప్పేమిటీ? వాళ్ళు అడిగింది ఇచ్చి వాళ్ళకి ఇష్టంవచ్చినట్టు నేను ఉండలేదు.

అంతేగా! హాస్పటల్లో చేరాక అనిపించింది..... 'వాళ్ళెంత పిచ్చివాళ్ళా' అని. పిచ్చివాళ్ళు కాకపోతే వాళ్ళల్లోని స్వార్థాన్ని వాళ్ళే ఎందుకు బైట పెట్టుకుంటారూ? అందుకే క్షమించా. వాళ్ళకివ్వాల్సింది వాళ్ళకిచ్చేస్తే నేను సర్వస్వతంత్రుడినైపోతా.

ఇప్పుడు నాకు కావల్సింది అదే! అందరినించీ అన్నింటినించీ విముక్తి. హారన్‌లు జోరుగా వినిపిస్తే చుట్టూ చూశాను. నాకు తెలీకుండానే 'సిటీ బస్టాండ్' కొచ్చానన్నమాట. అంటే సుమారు మూడుమైళ్ళకి పైగానే నడిచానన్నమాట.

ఇప్పుడైతే బస్టాండ్ స్వరూపం పూర్తిగా మారిపోయింది కానీ అప్పటి పరిస్థితి వేరు. ఓ అయిదారు షెల్టర్‌లు తప్ప అంతా ఖాళీనే. అలాంటి ఓ షెల్టర్ దగ్గరే... కళ్ళు మూసుకుని కూర్చున్నా... నా గుండె శబ్దం పెరిగిందని నాకు తెల్సు. మనసు గతంలోకి జారిపోతోందనీ తెలుసు.

❀ ❀ ❀

"మళ్ళీ రావా?" కన్నీళ్ళతో అన్నది సరస్వతి.

"నిజంగా తెలీదు" తల వంచుకుని అన్నాను.

"మావాళ్ళ మీద నీకు కోపంగా ఉంది కదూ! నామాట విని కొన్నాళ్ళిక్కడ ఉండిపో... ఎట్టాగొట్టా ఒప్పిస్తాగా!" బతిమలాడింది.

"వాళ్ళు ఒప్పుకోరు సరస్వతీ... ఎప్పటికీ ఒప్పుకోరు. నూరోమెట్టు మీద మీరుంటే మొదటి మెట్టు మీద కూడా లేనివాడ్ని నేను. నువ్వెంత ప్రయత్నించినా వాళ్ళు ఒప్పుకోరు!" తల విదిలించి అన్నాను.

"నువ్వు వెళ్ళిపోతే నేను నిజంగా బతకలేనురా.... ప్లీజ్‌రా.... నాకోసం, కేవలం నా కోసం ఆగవూ!" సన్నగా ముసురుతున్న చీకట్లో తన తలని నా గుండెకి ఆనించి అన్నది సరస్వతి. కళ్ళల్లోంచి ధారగా కన్నీరు నా షర్టుని తడుపుతోంది. పిచ్చి ప్రేమ పుట్టినప్పుడు మాత్రమే తను నన్ను 'రా' అంటుంది.

"మళ్ళీ వస్తా సరస్వతీ...నిజంగా ఓ రోజు వస్తాను. కనీసం తొంభై తొమ్మిది మెట్లు ఎక్కి నీ ముందుకొస్తా!' బింకంగా అన్నాను.

"నేను నిన్ను వెళ్ళనివ్వను... వెళ్ళనివ్వను!" చెదురుమదురుగా ఉన్న జనాలు చూస్తారన్న భయంలేకుండా నన్ను గట్టిగా కావలించుకుని అన్నది సరస్వతి. అంతేగాదు నా తలని చేతుల్తో కిందకి వొంచి ముద్దులు పెట్టింది.... ఓ విధమైన వెర్రి ఆవేశంతో.

ఇప్పటికీ ఆ కౌగిలి వెచ్చదనం నా నరాల్లో దాక్కునే ఉంది. ఆ తర్వాత ఎన్ని ఒట్లు పెట్టుకుందో..... ఎంత బతిమలాడిందో... నేను వింటేగా? ఎలా వింటానూ... వాళ్ళ వాళ్ళు నా చెంపలు పగలగొట్టీ, బూటు కాళ్ళతో తన్నీ నన్ను అవమానించిన సంగతి సరస్వతికి ఎలా చెప్పగల్ను?

కళ్ళల్లోంచి కారిన నీరు వెచ్చగా నా బుగ్గలమీద నించి జారిపోయింది. లేచాను. గంటతరువాత ఢిల్లీ వెళ్ళే విమానంలో ఉన్నాను. ఇండియా గేట్- ఎన్ని జ్ఞాపకాలూ!!! అక్కడే నాకోసం ఉండేది సల్మా! ఢిల్లీ వెళ్తూ సరస్వతిని తల్చుకుని నిట్టూర్పులు విడుస్తుండగా పరిచయమై, ఢిల్లీలో తలదాచుకోవడానికి తన ఇంట్లో చోటిచ్చింది. వాళ్ళ నాన్న షాబుద్దీన్ దగ్గరే నేను పనికి కుదిరింది.

అలా అనేకంటే సల్మానే నాకు పని కుదిర్చింది అనటం ధర్మం. ట్రైన్‌లోనే చెప్పింది.... నేను 'అచ్చు' తనకి బాగా ఇష్టమైన 'హమీద్'లా ఉన్నానని. నాకు తెలిసిన సౌత్ ఇండియన్ వంటకాలు తయారుచేస్తూ షాబుద్దీన్ గారి నించి నార్త్ ఇండియన్ వంటకాలు నేర్చుకుంటూ మూడేళ్ళు వాళ్లింట్లోనే ఉన్నాను.

షాబుద్దీన్‌గారికి రెస్టారెంట్ ఉంది. ఢిల్లీ ఆ ప్రాంతంలో, సౌత్ ఇండియన్ టిఫిన్లని పరిచయం చేసింది నేనే.... షాబుద్దీన్‌గారి రెస్టారెంట్‌లోనే.

టాక్సీ ఆగింది. మార్పు ఆ ప్రాంతంలోనూ కొట్టొచ్చినట్టు కనిపిస్తూనే ఉంది.

"యహా మీర్ సాబ్ ఔర్ సల్మాజీ రెహతేథే....ఆప్ కుఛ్ జాన్‌తే హై!" అడిగాను ఇప్పటికీ మిగిలిఉన్న అప్పటి పాన్‌షాప్‌లో.

"ఓ సబ్‌లోగ్ యహాసే చలేగయే! జాకే దస్ సాల్ హోగయా!" అన్నాడు పాన్‌వాలా. బస్.. ఎక్కడో ఉంటారు పిల్లల్తో మనవల్తో. అక్కడ్నించి కరోల్‌బాగ్ వెళ్ళి ఓ రూమ్ తీసుకుని పడుకున్నా. 'సల్మా' నాలో 'హమీద్'ని చూసుకున్నదేగానీ నాలోని 'నన్ను' చూడలేదు.

అందుకే మా మధ్య స్వచ్ఛమైన అనుబంధం మాత్రమే మిగిలింది. మీర్‌సాబ్‌తో సల్మా నిఖా జరగడం నా ఎదురుగానే జరిగింది.

నిద్రపట్టలేదు. రాత్రి ఒంటిగంట. హోటల్ ఖరీదైందే. రిసెప్షన్‌కి ఫోన్‌చేసి అడిగాను. లిక్కర్ దొరుకుతుందా అని. "సారీ సార్.... అంతా క్లోజ్ చేసేశాం...

ఒక్క ఛాన్సు మాత్రం ఉంది. మీ ఫ్లోర్‌లోనే రూమ్ నెంబర్ 611కి వెళ్ళి ట్రై చెయ్యండి.

అతను అంటే అమరేందర్‌సింగ్ అనీ ఓ పంజాబీ. ఎప్పుడూ తన దగ్గర 'స్టాక్' పెట్టుకుంటాడు. రాత్రంతా మేల్కొనే ఉంటాడు" అన్నాడు. గ్రేట్! తను ఇవ్వలేకపోవచ్చు... కానీ ఎక్కడ మనకి కావల్సింది దొరుకుతుందో 'హింట్' ఇవ్వడం కూడా గొప్పేగా! నవ్వొచ్చింది. నా ఆఫీసులో ఓ మినీ బారే ఉంది. అన్ని బ్రాండ్స్‌తో కళకళ్ళాడుతూ.

రూమ్ నెంబర్ 611 దగ్గరకెళ్ళి బెల్ కొట్టాను.

"కౌన్‌హై..." తలుపు తీశాడు అమరేందర్. దిట్టమైన పంజాబీ సిక్కు.

"భాయి సాబ్.... మీ దగ్గర లిక్కర్ ఉంటే నాకో పెగ్గు ఇవ్వగలరా?"" ప్లీజింగ్‌గా అడిగాను.

"ఏ ధరమ్‌శాలా నహీహై!" అన్నాడు చికాగ్గా తలుపుముయ్యబోతూ.

'ఫ్రీగా వొద్దు... ఐ విల్ పే...!" అన్నాను తలుపు ముయ్యకుండా అడ్డుపడుతూ.

"కిత్‌నాదేగా.... ఏక్‌లాఖ్?" ఎగతాళిగా అన్నాడు.

"ఓ! పెగ్గుకి లక్ష" అన్నాను నవ్వి. ఓ క్షణం నావంక తేరిపార చూసి, "అందర్ ఆజావ్" అన్నాడు.

రెండో పెగ్గు పూర్తిచేస్తుండగా అన్నాడు, "అరేభాయ్... దుఃఖం కాటువెయ్యని మనిషి లోకంలో ఉన్నాడా? ఉండదు. నేనే ఉన్నా. ఇదిగో, ఈ గుండె నిండా దుఃఖపు కాట్లే.... నీకోటి తెలుసా? అందరూ మృత్యువంటే భయపడతారు. నేను భయపడను.

మృత్యువంటే మరో సరికొత్త జీవితానికి పునాది. పాతచొక్కాని వొదిలేసి కొత్త చొక్కా తొడుక్కుంటుందన్నమాట 'మనసు'! అరే, జొర్‌పీవో,,, క్యాజానే కౌన్ సఫల్‌మే!" అంటూ మూడో పెగ్గు పోశాడు.

"ఇదిగో మూడు లక్షలు!" సంచిలోంచి తీసి ఇవ్వబోయాను. "హ...హ..." గట్టిగా నవ్వాడు అమరేందర్. "అరే పాగల్.... డబ్బెవడికి కావాలీ... లోకం నిద్రలో మునిగేవేళ నాకు కాసేపు తోడున్నావు చూడూ! అది చాలు. అయినా మిత్రమా, ఒక్క కన్నీటిబొట్టు విలువ ఎంతుంటుందో తెలుసా? లోకంలో ధనాన్నంతట్నీ కలిపినా ఒక్క కన్నీటిబొట్టు విలువకి సమం కాదు... జా..జా...

సోజా!" అని నా గ్లాసుతో పాటు నన్ను బయటికి పంపి తలుపు వేసుకున్నాడు. నవ్వుకున్నా! ఎంత డబ్బుని ఖర్చు చెయ్యాలనుకున్నా.... ఖర్చు కాదు... నా మూడు లక్షలూ నవ్వాయి.

లేచేసరికి పగలు పన్నెండు. స్నానం చేసేసి నా భుజంమీది బేగ్‌తో కిందికి దిగాను.

కిందంతా పోలీసులూ... పంజాబీలూ....

"ఏమైందీ?" రిసెప్షన్ కౌంటర్లో వాడ్ని అడిగాను. తాళాలు ఇచ్చేసి ఖాళీచేస్తానని చెప్పాక.

"ఓహ్..... మీకు తెలీదా? మీ ఫ్లోర్‌లోనే 611 రూమ్‌లో ఉండే అమరేందర్‌జీ తెల్లవారుఝామున నిద్రలోనే చనిపోయారు. ఆయనకి ఊళ్ళో ఇల్లు ఉన్నా నెలకి పదిరోజులు మా హోటల్లోనే, ఆ రూమ్‌లోనే ఉంటారు" చెప్పాడతను విచారంగా.

నిర్ఘాంతపోయాను. "అయినా మిత్రమా... ఒక్క కన్నీటిబొట్టు విలువ తెలుసా?" అమరేందర్‌జీ మాటలు నా చెవిలో గింగురుమన్నాయి. బొటబొటా కన్నీళ్ళు కారి నా బుగ్గలమీదుగా జారిపోయాయి.

"ఆఖరికి మూడు పెగ్గుల 'ఖరీదూ' కన్నీటి రూపంలో తీసుకున్నావా స్నేహితుడా!" మనసు రోదిస్తోంది.

"న్యూఢిల్లీ రైల్వేస్టేషన్" సరస్వతిని ఆ బస్టాండ్లో వదిలిన రోజున జి.టి ఎక్కి ఆ మరుసటి రోజున దిగింది ఇక్కడే. అదిగో... ఆ ప్లాట్‌ఫామ్‌మీదే సల్మా వెనక భయంభయంగా దిగింది. ఈ న్యూఢిల్లీనే నాకు జీవితమిచ్చిందీ జీవించడం నేర్పిందీ... మళ్ళీ ఇప్పుడు, అదే ట్రైన్‌లో... ఆరున్నర... సాయంత్రం. ట్రైన్ బయలుదేరింది.

హోటల్ ఖాళీచేసాక నా ఫ్రెండ్ కృష్ణశాస్త్రి ఇంటికెళ్ళాను. అతను ఢిల్లీ హైకోర్టు లాయరు. రాతకోతలన్నీ స్పష్టంగా రాసి, తెలిసినవాళ్ళతోనే సాక్షి సంతకాలు చేయించి, మొత్తం డాక్యుమెంట్‌ని 'సీల్' చేసి అతనికి అప్పగించా. మిగతా విషయాలన్నీ అతను చూసుకోగలడు. అమరేందర్ చావు నాకు ఒక పాఠం చెప్పింది. చెయ్యాల్సిన పనిని తక్షణమే చెయ్యాలనీ, ఆలస్యం చెయ్యకూడదనీ.

ప్రశాంతంగా ట్రైన్‌లో కూర్చున్నా. మూడువేలు చేతులు మారితేనేగానీ 'ఆపద్ధర్మ' టిక్కెట్టు దొరకలేదు. అదీ ఎ.సి టూటైర్‌ది. టిక్కెట్టు ఖరీదు వేరనుకోండీ.

లోపలికి వచ్చాక చూస్తే చాలా బెర్తులు ఖాళీగానే ఉన్నాయి.

ఆ...! అమరేందర్ మృత్యువుని మనసులోంచి తుడిచేశా. ఎందుకంటే అతను మృత్యువుని ఆహ్వానించకపోయినా ధైర్యంగా ఎదుర్కొన్నాడు.

నా పక్కనే మృత్యువుందని తెలిసి నేనెందుకు విచారించాలి? ఓ కోకోకోలా బాటిల్‌లోంచి సగం కోకో పారబోసి ఆవారా విస్కీ నింపి తెచ్చుకున్నా. నేనెప్పుడూ వెజిటేరియన్‌నే... అందుకే తినడానికి ఏదుంటే ఏమీ!

ఎంత ఎ.సి అయినా జనాలు గడబిడా మాట్లాడుకుంటూనే ఉన్నారు. నేను మెల్లిగా, విశ్రాంతిగా విస్కీ సిప్‌చేస్తూ ఆ అల్లరినంతా ఆస్వాదిస్తున్నా. మనసంతా ప్రశాంతంగా, సుఖంగా ఉంది. ఆగ్రాలో ట్రైన్ ఆగింది. "ఎక్స్క్యూజ్‌మీ..... కింది బెర్త్ నాది!" మెత్తని గొంతు. తలతిప్పి చూశా. సరస్వతి!! కలా... నిజమా? కళ్ళు నులుముకుని మరీ చూశా... ఒక్కతే ఉంది. వెంట ఎవరూ లేరు.

"సరస్వతీ!" గట్టిగా అరిచాననుకున్నాగానీ... నా మాట నాకే సరిగ్గా వినపడలేదు.

"దట్ ఈజ్ మై బెర్త్!" మళ్ళీ మెత్తగా అన్నది సరస్వతి. నా నోట మాట రావటం లేదు. గుండె పట్టేస్తోంది. "నే....ను.... నేను సరస్వతీ!" గొంతు పెకల్చుకుని అన్నాను.

"నువ్వా...మైగాడ్!" గభాల్న నా పక్కన కూర్చుంది. నా నుదుటినించీ, తలనించీ చెమటలు ధారాపాతంగా కారుతున్నాయి. ఒళ్ళు చల్లబడుతోందని కూడా నాకు తెలుస్తోంది. "ఏంటిరా... నువ్వేనా... ఏమయిందిరా... నువ్వేనా..." గబగబా నన్ను దగ్గరకి తీసుకుని పమిటతో నా ముఖం తుడుస్తూ అన్నది సరస్వతి.

నేను మాట్లాడలేకపోతున్నా... కానీ.. ఆమె నన్ను గుండెకి హత్తుకుని ఏదేదో మాట్లాడటం తెలుస్తోంది. ఆమె గుండె చప్పుడు నాకు వినిపిస్తోంది. ఆమె కంగారుగా నా నుదుటిమీద అద్దుతున్న పెదాల స్పర్శ స్పష్టంగా నాకు తెలుస్తోంది.

అమ్మయ్య.... నా మొహానికి ఆమె గుండెల వెచ్చదనం తెలుస్తోంది. ఎంత ప్రశాంతంగా ఉందీ!! మానస సరోవరంలో మనసు ఈదులాడుతున్నంత హాయిగా ఉంది. ఆమెలోంచి ఓ వెచ్చదనం.... నాలోకి ప్రవహిస్తోంది. జీవితం అంటే ఇదే కదూ! సుఖం అంటే ఇదే కదూ....!! ఇదేనా స్వర్గం!!!

– స్వాతి మార్చి 2015

# క్షణమాత్రంబు

"నేను వచ్చేశా....!" సరిత గొంతువిని తలెత్తి ఆమె ముఖం చూశా. ఆవిడ మొహంలో కొంచెం విచారం, కొంచెం సంతోషం దోబూచులాడుతున్నాయి. "అంటే?" కొంచెం కంగారుగా అడిగాను. అప్పటికే నాపక్క కౌంటర్లో 'క్యాష్' లెక్కపెడుతున్న లావణ్య కుతూహలంగా మావంక చూస్తోంది.

"ఇల్లు వదిలి వచ్చేశాను రమేష్. ఎనిమిదేళ్ళ చెరసాలకి చరమగీతం పాడేశా!

నీకు తెలుసా, చెప్పుల్లేకుండా తార్రోడ్డుమీద పరిగెడుతూ పాటలు పాడాలనుంది. భూమినీ, ఆకాశాన్నీ పడుగుపేకలా కలిపేయాలనుంది.

ఓహ్! రమేష్! నా మనసులోని భావాల్ని ఎలా చెప్పనూ?" చుట్టుపక్కల ఉన్నవాళ్ళని ఏమాత్రం గమనించకుండా ఉద్వేగంగా అంది సరిత.

ఇందాకటి విచారం స్థానే ఇప్పుడు ఉత్సాహం చోటుచేసుకున్నది ఆమె మొహంలో.

నేను పనిచేస్తున్నది బ్యాంక్‌లో. అదీ 'రష్ అవర్' చికాకులో ఉన్నాను. సరిత చిన్నసైజు రచయిత్రి అని చిన్నప్పటినుంచీ నాకు తెలుసు. అంతేగాక ఎమోషనల్..... అంటే, ఏం చేస్తోందో, ఏం మాట్లాడుతోందో తనకే తెలీనంత.

లావణ్య నోరు తెరుచుకుని చూడటం గమనించాక నాకు కంగారింకా ఎక్కువైంది. "సరితా.... కొంచెం.... అదిగో....ఆ కుర్చీలో కూర్చో..... ప్లీజ్!" సరితని బ్రతిమాలాను. ఉన్నట్టుండి సీట్‌లోనించి లేవడం బ్యాంక్ క్లర్క్‌కి ఎలా కుదురుతుందీ!

"నో రమేష్ నో! అర్జంటుగా బయటికి వచ్చెయ్. ఎన్నో చెప్పాలి. నేనిప్పుడు ఫ్రీ బర్డ్‌ని...." మారాం చేస్తున్న చిన్నపిల్లలా మొహం పెట్టి అంది.

"ప్లీజ్.... కాస్సేపు కూర్చో!" ఇబ్బందిగా ఉన్నా ఏమీ చేయలేని పరిస్థితి నాది.

"ఓ.కే. ఐదు నిముషాలు సరేనా?" వరం ప్రసాదించే దేవతలా ఫోజుపెట్టి కస్టమర్స్ కోసం వేసిన కుర్చీల్లో కూర్చుంది సరిత.

మాట్లాడకుండా నేను లేచి నా బుల్లి క్యూబికల్ తాళం వేసి మేనేజర్ దగ్గరికి వెళ్ళబోతుండగా– "హమ్మా...! పెళ్ళయిన అమ్మాయినే పట్టినట్టున్నారే, ఏమో అనుకున్నాను!" కొంచెం వ్యంగ్యాన్ని మిళాయించి పరిహాసంగా నవ్వుతూ అంది లావణ్య. అర్జంటుగా వెళ్ళాల్సివచ్చిందని మేనేజర్‌గారికి విన్నవించుకున్నాను. "బ్యాంకింగ్ అవర్స్‌లో ఇలా ఇబ్బంది పెట్టడం బాగుందా రమేష్? ఇప్పటికిప్పుడు మీ ప్లేస్‌లో ఎవరిని కూర్చోబెట్టనూ?" చికాగ్గా అన్నాడు బ్రాంచి మేనేజర్.

"సారీ సార్... కొంచెం తప్పనిసరి అయి మిమ్మల్ని ఇబ్బందిపెడుతున్నాను" చేతులు పిసుక్కుంటూ అన్నాను. "హూ!" కుర్చీలోంచి లేచాడాయన.

అంటే నా ప్లేస్‌లో ఆయనే కూర్చుంటాడన్నమాట. తాళాలు ఆయన చేతికిచ్చి సరిత దగ్గరికి వచ్చి "ఇప్పుడు చెప్పు...!" ఎదురుగా నిలబడి అన్నాను.

"బయటికి పోదాం పద!" చిన్నపిల్లలాగా ఉత్సాహంగా అంది సరిత.

సరిత నాకు చిన్నతనం నించీ తెలుసు. వాళ్ళ నాన్న తాసిల్‌దార్ (తహసీల్ దార్‌ని ఊళ్లల్లో అలాగే అనేవాళ్ళు) మా నాన్న ఓ చిన్న వ్యవసాయదారుడు. ఎదురుబదురు ఇళ్ళు. మా ఊళ్ళో ఉన్న ఏకైక రెండంతస్తుల మేడలో వాళ్ళు అద్దెకుండేవాళ్ళు. సరిత ఇద్దరు అన్నల తరువాత పుట్టింది గనుక మహాగారాబం.

మూడో తరగతి చదివే నా చెల్లెలి క్లాస్‌మేట్ గనుక మా రెండిళ్ళకీ బాగా రాకపోకలుండేవి. తహసీల్దారు గారు ఆఫీసులో గంభీరంగా వున్నా ఇంట్లో మాత్రం సరదాగా ఉండేవారు.

నన్ను 'రమ్మీ' అని పిలిచేవారు. నాకుమాత్రం అప్పుడు వయసెంతనీ? నేను ఆరోతరగతి చదివేవాడ్ని. తొమ్మిదో తరగతి అంటే అప్పట్లో "ఫోర్త్ ఫాం" అయ్యేవరకూ సరితావాళ్ళు మా ఊళ్ళోనే ఉన్నారు.

అయితే నా డిగ్రీ పూర్తయ్యేవరకూ మా మధ్య ఉత్తరాలు మాత్రం సాగేవి.

వాళ్ళ అన్నయ్య పెళ్ళికి కాకినాడ వెళ్ళాను. అప్పుడే సరితని చూసి ఆశ్చర్యపోయాను. అద్భుతమైన అందాన్ని సంతరించుకున్నది. చాలా క్లోజ్‌గా మాట్లాడటమేగాక నన్ను అన్నివిధాలా బాగా చూసుకున్నది. నిజం చెప్పొద్దూ... "సరితా! నన్ను పెళ్ళి చేసుకోవడం నీకిష్టమేనా?" అని అప్పుడే అడగాలనుకున్నాను గానీ వాళ్ళ రెండో అన్న నా దగ్గరికొచ్చి "రమ్మీ.... సరితకి పెళ్ళికుదిరిందిరా.... అతను ఓ పే....ద్ద కంపెనీలో ఎ.జి.యమ్ నెలకి లక్షా పదిహేనువేలు జీతం అన్నాడు.

ఇంకేం చెయ్యనూ! రెండేళ్ళు గడచింది.

సరిత పెళ్ళికి వెళ్ళలేకపోయాననటంకంటే వెళ్ళకూడదనుకున్నాననటమే నిజం. ఎందుకంటే, 'తొలిప్రేమ' వసివాడిన అనుభవం కలిగిందిగా మరి.

పదేళ్ళ తరువాత అంటే ఏడాది క్రితం ఈ ఊళ్ళో ఓరోజు రోడ్డుమీద సరితని చూశాను.

కరెక్టుగా చెబితే తనే ముందు నన్ను చూసి పరిగెత్తుకొచ్చి పలకరించింది.

"ఓహ్.... రమ్మీ...అబ్బ...నువ్వు....నువ్వు... ఓహ్... నిన్ను మళ్ళీ చూస్తానని అనుకోలేదు. ఓహ్.... రమ్మీ.... నిజంగా చెబితే నిన్ను నేను ప్రేమించాను తెలుసా? ఓహ్..." అంటూ నా చేతులు ఎమోషనల్‌గా పట్టుకోవటమే కాక, ఉన్నఫళంగా నన్ను వాళ్ళింటికి వొద్దొద్దన్నా లాక్కెళ్ళింది.

"ఏవండోయ్.... ఇతను రమేష్! మనిషికి మహాసిగ్గు..." అంటూ ఆయనకి పరిచయం చేసింది.

ఆయన్ని చూడటం అదే మొదటిసారి.

మనిషి అందంగా, ఆరోగ్యంగా, కొత్తనోటులాగా కళకళలాడుతున్నాడు.

"ఓహో....రమ్మీ అంటే మీరేనా? గుడ్! మా బావమరుదులు అప్పుడప్పుడు ఇంకా రమేష్ పెళ్ళి చేసుకోలేదని సరితతో అంటుంటారు. ఇంతకీ పెళ్ళి చేసుకున్నారా?" అన్నాడు.

మొదటి పరిచయంలోనే 'ఇలా' అడగటం నాకు ఇబ్బందిగా అనిపించింది. నేను పెళ్ళిచేసుకోనిమాట నిజమే గానీ, అదో అంతర్జాతీయ సమస్య అవుతుందని మాత్రం ఏనాడూ ఊహించలేదు. కొంచెం ఇబ్బందిగా నవ్వాను.

"పోన్లెండి! ముప్ఫై అయిదు సంవత్సరాలు దాటాయనుకుంటాను? అయినా పెళ్ళే జీవితం కాదుగా...!" అతను నన్ను అనునయిస్తున్నాడో, హేళనచేస్తున్నాడో అర్థం కాలేదు.

"హేయ్ రమ్మీ... అన్నట్టు మావారి పేరు కామేశ్వర్రావు.... సరదాగా నేను 'కమ్మీ' అని పిలుస్తాను. హ....హ.... రమేష్ 'రమ్మీ' అయితే కామేష్ 'కమ్మీ' ఎందుకు కాకూడదూ!" పకపకా నవ్వుతూ వాళ్ళాయన వీపు చరిచింది సరిత.

"మ....మ్మీ...." అదేదో ఎడ్వర్‌టైజ్‌మెంట్‌లోలాగా పరిగెత్తుకొచ్చిందో ఆరేళ్ళపిల్ల.

"రియల్‌స్టార్ మీ మమ్మీ - ఎండ్ 'పాపా' ఆల్సో" అన్నాడు సరితభర్త.

"ఇదిగోనోయ్ రమ్మీ. నా వరాలమూట. వజ్రాలకోట. పేరు దమయంతి!" అంటూ కూతుర్ని కావలించుకుంది సరిత.

"నేను వస్తానండీ...!" లేచాను నేను.

"అదేమిటీ? భోజనంచేసి వెళ్ళరా? ఓహో...బ్యాచిలర్ కదా... మందూ గిందూ పార్టీలేమైనా ఉంటాయేమో కదూ! అందునా సండే!" నవ్వాడాయన.

"నేను తాగనండీ!" నిజాన్ని నిజంగా చెప్పి సరిత బలవంతం చేసినా వినకుండా బయటికి వచ్చేశాను. అప్పటిదాకా నా శ్వాస ఇబ్బందిగానే ఆడటం నేను గుర్తించకపోలేదు.

❀ ❀ ❀

"ఆయనేమన్నా చాలా మంచివాడనుకుంటున్నావా? ఓహ్... కానేకాదు.... మహా ఫోర్ట్వంటీ..... భయంకరమైన తెలివితేటలు.... నువ్వేం చేసినా 'ఓ.కే అన్నట్టు నటిస్తూనే, తనమాటే సాగించుకోగల సమర్థుడు.

"ఆ రమ్మీగాడికి నువ్వంటే 'ఇది' పోలేదు సుమా సరితా, ఎందుకంటే నీ అందం అటువంటిది' అని నాకు బటర్ కొట్టాడు తెలుసా?" ఉన్నదున్నట్టుగా చెప్పి కుండపగల గొట్టింది సరిత ఆ మరుసటిరోజున. నేనేం మాట్లాడనూ? వీలున్నంత దూరంగా ఉండాలనుకున్నాను. కానీ సరిత ఉండనిస్తేగా! మాంచి పనిలో ఉండగా ఫోన్‌చేసేది.

"రమ్మీ... ఆ మనిషి ఏమన్నాడో తెలుసా? మా నాన్న పరమపిసినారట! మా అమ్మకి అల్లుడ్ని ఎలా గౌరవించాలో తెలీదుట. నేనో మొద్దునిట"

"రమ్మీ... ఇహ ఈ మనిషితో నేనుండలేను. చిన్నప్పటినించీ నేను ప్రేమించింది నిన్నే! అది నిజం. ఇతను తాళికట్టాడు అంతే!" "రమ్మీ.... ఈ మనిషి మాట్లాడితే ఎంత కోపమొస్తోందో తెలుసా? ఏదో ఓ రోజు కత్తితో పొడిచి జైలుకెళ్ళిపోతా!"

"రమ్మీ... నేనీ మనిషిని వదిలి వచ్చేస్తే నువ్వు నన్ను చూడగలవా? నీ మనిషిలా నన్ను ప్రేమించగలవా?" ఇలా ఉండేవి సరిత ఫోన్లు.

నేనేం చెయ్యాలి? ఆ 'మనిషి' ప్రవర్తన చూశాక అతనిమీద నాకు సదభిప్రాయం కలగలేదనేది నిర్వివాదాంశం. నిజం చెబితే మరోసారి అతన్ని కలుసుకోవాలని అనిపించనేలేదు.

కానీ 'ఎమోషనల్' సరిత వల్ల అతనిని కలవక తప్పలేదు. అదీ సరిత పుట్టినరోజు 'లంచ్'కి.

"ఇప్పుడు మీకు ముప్పై ఆరు.... ఆడపిల్లలు అంటే ఏ పెళ్ళికానివాళ్ళో దొరకడం అసంభవం. పోనీ డైవర్సీలని చూడమంటారా?" అన్నాడు. అతను రెండోసారి కలిసినప్పుడు.

నిజం చెప్పొద్దూ.......నాకు చిర్రెత్తుకొచ్చింది.

ముప్పై రెండేళ్ళ పెళ్ళికాని ముదిత మా ఆఫీసులోనే కొలీగ్‌గా ఉంది. పెళ్ళి చేసుకుంటానని నేను ఒక్కమాట చెబితే రెడీ అంటుందని నాకు తెలుసు. నేనేమీ నడుం వంగిపోయినవాడ్ని కాదే! డైవర్సీని వెతుకుతానంటాడా?

"వద్దులెండి! పద్దెనిమిదేళ్ళవాళ్ళని ఇద్దర్ని పెళ్ళి చేసుకుంటే వయసులు కరెక్టుగా కలుస్తాయి" కావాలనే ఓ పాతజోకుని జాతీయం చేశా.

"అబ్బా!" అన్నాడు. ఆ 'అబ్బా'కి ఓ అయిదొందల అర్థాలుంటాయి. నాకు మాత్రం ఆ 'అబ్బా' పంటికింద రాయిలాగా అనిపించింది.

వడ్డన చేస్తూ "రమ్మీ... మా ఆయనకి మహా సెన్సాఫ్ హ్యూమర్.... ములక్కాడకి 'రొమాంటిక్ క్రీ' అని పేరు పెట్టాడు. హహ్హహ్హా...!" నవ్వుతూ పులుసులోని ములక్కాడ ముక్కలు నా ప్లేటులో వేసింది సరిత. నాకు నవ్వురాక 'వెర్రిమొహం' పెట్టాను. అసలు అందులో సెన్సాఫ్ హ్యూమరేముందీ? "మీకు తెలుసా? టొమేటోని 'రోజీ లిప్స్' అని పిలుస్తాను. ఉల్లిపాయకి 'టియర్ ఫ్రూట్' అని పచ్చిమిరపకాయకి 'గ్రీన్ గాళ్' అని కూడా పేర్లు పెట్టాను!" గర్వంగా అన్నాడు.

గోడమీద మౌనంగా ఉన్న రెండు బల్లులు ఆ మాటకి కకావికలై పారిపోయాయి.

"ఇంకోటోయ్.... ఈ మధ్య దమయంతిని 'దమ్ము' అని పిలుస్తున్నాను. హహహ!" పెరుగు వడ్డించింది. ఆ పెరుగు ఎంత పుల్లగా ఉందంటే నాకు అర్జెంటుగా నాలుక పీకేసుకోవాలనిపించింది.

"ఏమైనా రమ్మీగారూ, వైఫ్ అంటే సరితలాగా ఉండాలి. ఒబిడియంట్, హైలైట్ ఇంటెలిజెంట్, క్రియేటివ్, ఓహ్..... అన్నీ అద్భుతమైన సుగుణాలే!" పార్టీ కార్యకర్త, పార్టీ అధ్యక్షుడ్ని పొగుడుతున్నంత భక్తిగా మొహంపెట్టి అన్నాడాయన.

సరితకూడా ఆ క్షణానికి తగిన రియాక్షన్ ఇచ్చింది. ఆయన 'యాక్షన్' ఎదుటివాడి ప్లేటులో 'చట్నీ'లాగా ఎక్కువనిపించింది.

గానీ, 'రియాక్షన్'ని మాత్రం మామూలుగానే తీసుకున్నా. (అయ్యా.... ఎదుటివాడి ప్లేటులో ఇడ్లీ పెద్దదిగానూ,, చెట్నీ ఎక్కువగానూ అనిపించుట లోకసహజము)

వాళ్ళిద్దరూ అలా పరస్పర డబ్బా కొట్టుకోవడం చూసి నాకు కళ్ళు తిరిగిన మాట వాస్తవం.

ఎందుకంటే నిన్నంటే నిన్న, "నా మొగుడు పరమ ఈగోయిష్టు, అతనితో బతకడం అంటే ఏసిడ్‌తో పాయసం చెయ్యటం లాంటిది.

ముద్దపప్పులో అరటిపండు నంజుకుతినడం లాంటిది. ఇంకా....!" అంటూ బోలెడు ఉపమానాలు చెప్పింది సరిత. మరి ఇప్పుడు!

మొత్తానికి భోజన కార్యక్రమం ముగించి వక్కపలుకు వేసుకుంటుండగా ఆయనన్నాడు.... "యూ నో మిస్టర్ రమ్మీ.... కనీసం ఓ పదిమంది బ్యూటిఫుల్ డాల్స్ నన్ను ప్రేమించి నేనంటే పడి చచ్చేవారు. బట్.... నేను సరితనే ఎందుకు 'సెలక్టు' చేసుకున్నానో తెల్సా? ఆమె సింప్లిసిటీ చూసి" రహస్యం చెబుతున్నట్టు హస్కీగా అన్నాడాయన.

"ఓ కమ్మీ.... స్టాపిట్!" ముద్దుగా విసుక్కుంటున్నట్టు మొహం పెట్టింది సరిత.

మొత్తానికి ఈ 'ఎపిసోడ్' జరిగి ఓ నెలే అయిందనుకుంటా. ఇప్పుడు సడెన్‌గా ఈ సునామీ!

‘గీతాభవన్’లో కూర్చున్నాం.

“ఏమన్నా తింటావా?” అడిగా.

సరిత కళ్ళల్లో నీళ్ళు.

“చూశావా? పెళ్ళై ఎనిమిదేళ్ళయినా ఆ మనిషి ఒక్కరోజున కూడా నా ఆకలి గమనించలేదు. ఏనాడూ నన్ను ‘తిన్నావా’ అని అడిగిన పాపానపోలేదు.” కళ్ళు తుడుచుకుంటూ ముక్కు చీదుకుంది. నేను కొంచెం గ్రేట్‌గా ఫీలయిన మాట వాస్తవం.

మాంచి మసాలాదోశ తెప్పించా. గీతాభవన్ మసాలా దోశలకి మహాప్రసిద్ధి.

పాపం బ్రేక్‌ఫాస్ట్ తినలేదేమో గబగబా దోసెతింది. చేయి కడుక్కుని–

“రమ్మీ! ఎప్పుడూ నిన్ను ప్రేమిస్తూనే వున్నాను. ఇవాళ ఆ ప్రేమ వందరెట్లు ఎక్కువైంది. ఎంత అర్థంచేసుకునే మనసు నీది!” అంది.

నా ఛాతీ పదంగుళాలు పొంగింది. మాంచి పొగలుగక్కే కాఫీని సరిత ఊదుకుంటూ తాగుతుండగా అడిగాను. “ఇప్పుడు చెప్పు... ఏం జరిగిందో!”

“నో రమ్మీ...నో....ఆ విషయాన్ని జ్ఞాపకం చెయ్యకు. నేనా మనిషిపేరు ఎత్తడానికి కూడా ఇష్టపడను. హి ఈజ్...ఒహ్... నీకో నిజం తెలుసా? నా చిన్నతనం నించీ, అంటే మూడో తరగతినించీ ప్రేమించింది నిన్నే. అయితే నిన్నే పెళ్ళాడతానని మావాళ్ళకి చెప్పలేకపోయా.

అదీగాక... యూ....నో - పెద్దాళ్ళు ఒప్పుకోరని నాకు తెలుసనుకో. ఏమైతేనేం, ఇప్పుడు నా జీవితం నాది. నా ఇష్టం వచ్చినట్టు నేను బ్రతకాలను కొంటున్నాను.

నువ్వంటే నాకెంత ఇష్టమో తెలుసా?

నీకు కజ్జికాయలన్నా, పచ్చిమిర్చి అల్లంవేసి చేసిన అరటికాయ ఉప్మా కూరన్నా ఎంత ఇష్టమో నాకిప్పటికీ గుర్తే! పప్పులో నెయ్యి కాకుండా ‘ఇంగువ’ నూనె వేసుకుంటావనీ గుర్తే!

అందుకే.... అందుకే నీతో నా జీవితం గడపటానికే వచ్చేశా. సామాన్లతో సహా...!” ఓ క్షణం నావంక చూసి కళ్ళు కిందకి దించుకుని అంది సరిత.

“సామాన్లతోనా? ఏవీ?” ఆశ్చర్యంగా అడిగాను.

“మా పక్కింటివాళ్ళ దగ్గర పెట్టొచ్చాను. నువ్వు సరే అంటే ఇద్దరం వెళ్ళి తెచ్చుకుందాం.

ముందే చెబుతున్నా, సామాన్లు తెచ్చేటప్పుడు పొరపాటున కనిపించినా నువ్వాయన్ని చూడటానికి వీల్లేదు. ఒకవేళ ఆయనే నిన్ను మాట్లాడించినా మాట్లాడటానికి వీల్లేదు. ఐ డోంట్ లైక్ హిమ్!" అని చాలా సీరియస్‌గా అంది.

పెద్ద పెద్ద 'గాలి మరలు' నా బుర్రలో గిర్రున తిరిగినట్టు అనిపించింది.

సరిత 'ఎమోషనల్' అని తెలుసుగానీ, ఇంతలా 'రివల్యూషనరీ' అని తెలీదు.

"అదిగాదు సరితా, కాస్త నామాట విను.... ఈ విషయం మీ అమ్మానాన్నకీ, అన్నయ్యకీ తెలిస్తే?" నచ్చచెప్పే ప్రయత్నంలో అన్నాను.

"ఐ డోంట్ కేర్. ఎప్పుడయితే వాళ్ళు నా పెళ్ళి చేసేశారో అప్పుడో వాళ్ళకి నామీద అధికారం పూర్తిగా పోయింది. వాళ్ళేమనుకుంటే నాకేం?" సీరియస్‌గానే అంది సరిత.

"మరి దమయంతి గోలచేస్తే?"

"ఏమనీ? పావలాకాసంత పిల్లది కూడా వాళ్ళ నాన్ననే సపోర్టు చేసింది. అందుకే దాన్నీ 'మనం' రానివ్వొద్దు. దాన్ని వాళ్ళ నాన్న దగ్గరే ఏడవనీ" కోపంగా అంది. "ఆయన పోలీసు రిపోర్టిచ్చో.... కోర్టుకెళ్ళో..." చెప్పబోయా.

"స్టాపిట్! నేనేమన్నా చిన్నపిల్లనా? మేజర్ని. పోలీసు రిపోర్టు ఇస్తే అతను ఎంత శాడిస్టో వివరించి చెబుతా... కోర్టుకి వెళ్తే వెళ్ళనీ... నాక్కావలసిందీ ఆ మనిషినించి విడాకులేగా...!" పంతంగా అంది.

ఓరి దేముడా! ఇప్పుడు నేనేం చెయ్యాలి?

ఇప్పుడు సరితని నేనుండే ఇంటికి తీసుకెళ్ళొచ్చు కానీ, ఇంటి ఓనరిణి చూస్తే మరుక్షణం ఇల్లు ఖాళీ చేయిస్తుంది. బోలెడంత పరపతి ఉపయోగిస్తే గానీ నాకు అద్దె ఇల్లు దొరకలా.

అదేం ఖర్మో బ్రహ్మాచారులకి ఎవరూ ఇళ్ళు అద్దెకివ్వరు. ముఖ్యంగా ఆడ ఓనర్లు. పెళ్ళిచేసుకోవడానికి మాత్రం మళ్ళీ బ్యాచిలర్లే కావాలి. పోనీ ఏదన్నా హోటల్లో రూమ్ తీసుకోవచ్చు కానీ, ఖర్మకాలి ఏ 'రైడింగో' జరిగితే?

"ఏమిటి రమ్మీ ఆలోచిస్తున్నావా? హూ! నీమీద నాకు కొండంత నమ్మకం. నువ్వొ నన్ను ప్రేమించావని నాకు తెలుసు" అంది.

"మీ చెల్లెలు ఎన్నిసార్లు చెప్పిందో! అందుకే నీ ఇష్టాయిష్టాలేమిటో దాన్నడిగి తెలుసుకున్నాను.

సరే, పెద్దాళ్ళు పెళ్ళిచేశారనుకో. ఆడపిల్లని! తప్పదు గదా! మరిప్పుడు ఏం చేద్దాం" అంది.

సరిత మాటల్లో ఒకదానికొకటి 'పొంతన' లేదని నాకు తెలుస్తూనే వుంది.

"అదే ఆలోచిస్తున్నా సరితా! పోనీ కొన్నాళ్ళు మీ పుట్టింటికి..." చెప్పబోయాను.

"హూ! ఆయనమీద అలిగి నా పుట్టింటికి పోతే ఎవరూ ఏమీ అనుకోరు. ఆయన్ని అసహ్యంతో వదిలేసి పుట్టింటికి పొమ్మంటావా? వాళ్ళు అడిగే ప్రశ్నలకి జవాబులు చెప్పే నరకాన్ని భరించమని నాతో అంటున్నావా? చావనన్నా ఛస్తాగానీ పుట్టింటికి వెళ్ళను!" కోపంతో లేచింది.

"సారీ సారీ సారీ.... అంటే, ఓ ఇల్లు దొరికేదాకా కొన్నాళ్ళు....." నసిగాను.

"ఏం? నీ రూము ఉందిగా? నన్ను తీసుకెళ్ళాలంటే అవమానంగా భావిస్తున్నావా?" ఇంకా కోపంగా అంది సరిత.

"అది కాదు సరిత...."

"నాకు అర్థం అవుతోంది రమ్మీ. మగాడివనిపించావు! నా మాట ఏనాడూ నువ్వు కాదనవనే నమ్మకం ఓ నిముషం వరకూ నాకు ఉండేది.

నీ ప్రేమ ఎప్పుడూ 'నాదే'నని గర్వంగానూ, గొప్పగానూ ఉండేది. ఒక్క క్షణంలో...!" అని చెప్తుండగానే కుళాయి తిప్పినట్టు సరిత కళ్ళల్లోంచి బొటబొటా నీళ్ళు కారాయి. సత్తువ లేనట్టు ధమాల్న మళ్ళీ కుర్చీలో కూలబడింది సరిత.

చుట్టుపక్కల 'టేబుల్స్' వాళ్ళు మా ఇద్దరి వంకా కుతూహలాన్ని మించిన మరో దృష్టితో చూడటం నా దృష్టిని దాటిపోలేదు.

"ఓ.కే సరితా. నన్ను దయచేసి అపార్థం చేసుకోకు. మా ఓనరిణే కాదు. ప్రపంచం ఏమన్నాసరే నాకు లెక్కలేదు. పద... నా రూమ్‌కే పోదాం!" నేను లేచాను. సరిత తలెత్తి నావంక చూసి, నమ్మకం కుదిరిందో ఏమో, "నాకు తెలుసు రమ్మీ నువ్వు వజ్రానివి, యూ ఆరే డైమాండ్" అంటూ ఉత్సాహంగా నా వెనకాల నడిచింది.

"సార్! బిల్లు!" అరిచాడు సర్వరు.

"సారీ.....మర్చిపోయా!" వందనోటు ఇచ్చా. అతను చిల్లర తెచ్చాక 'టిప్పు' భారీగానే ఇవ్వాల్సొచ్చింది.

ఆస్తిపోతే మళ్ళీ సంపాయించుకోవచ్చు. ఆరోగ్యం అటూ ఇటూ అయినా మళ్ళీ బాగుచేసుకోవచ్చు. కానీ ఆడదాని ముందు పరువుపోతే మాత్రం జన్మలో

ఇక సంపాయించలేం. అందుకే ఏదైతే అది కానిమ్మని సరితని నా 'హోండా' మీద ఎక్కించుకుని రూమ్‌కి దారిపట్టాను.

ధైర్యంగా, హాయిగా నా భుజంమీద చేయివేసి, "నా సామిరంగా... ఇవ్వాళ ఏడుస్తాడు చూడూ! ఓహ్! ఎవరైనా వీడియో తీసి నాకు చూపిస్తే ఎంత బాగుండునూ!" అంది సరిత.

ఆ గొంతులో ఎంత ఉత్సాహమో!

"నువ్వు బయటికి వచ్చేటప్పుడు అతనితో చెప్పే వచ్చావా?" అని అడిగా.

"చెప్పేవద్దామనుకున్నానుగానీ కుదర్లేదు. ఆయన ఆఫీసుకీ, అది స్కూలుకీ పోయారుగా మరి! అందుకే ఉత్తరం రాసి పెట్టేశా. నేను జన్మలో తిరిగి రాననీ....మొహం కూడా చూడననీ!" ఎంతో ఉల్లాసంగా అంది సరిత.

"ఇప్పుడు ఆయన ఆఫీసులోనూ, దమయంతి స్కూల్లోనూ ఉంటారన్నమాట!"

"అవును! సాయంత్రం ఇంటికొచ్చాక ఉత్తరం చూసి ఏడుస్తాడు..... ఇటూ అటూ జుట్టు పీక్కుంటూ వెతుకుతాడు!" నవ్వు జోడించింది.

"కాదుమరి!" ఏదో ఓ మాట అనాలి గనక అన్నాను. రోడ్డు 'బ్లాక్' అయింది.

ట్రాఫిక్‌జామ్. వెనక్కి తిరగటానికి లేదు. చచ్చినట్టు వెయిట్ చెయ్యాల్సిందే.

"రమ్మీ... దమయంతి బాగా ఏడుస్తుందంటావా? నాకోసం బెంగపెట్టు కుంటుందా?" సాలోచనగా అంది సరిత. "ఎందుకేడవదూ? బెంగపెట్టుకుంటుంది కూడా. ఎంతయినా నీ కూతురుగదా! నువ్వంటే ప్రేమ ఎందుకుండదూ?"

"అవునవును. ఏదో వాళ్ళ నాన్న ఏడిచిపోతాడని సపోర్టు ఇచ్చిందేమోగానీ, దానికేం తెలుసూ? చిన్నపిల్ల! పోనీ!...." ఆగింది సరిత.

"చెప్పు సరితా" అన్నాను, ఎలాగయినా సరితని కూతురి ఆలోచనవైపు మళ్ళించాలని. "అదీ...! దాన్నీ మనతో ఉంచుకుందామా?" అడిగింది.

"తప్పకుండా! అయినా దమయంతికి నువ్వు బయటికొచ్చిన విషయం సాయంత్రం దాకా తెలీదుగా! కనుక ఇప్పుడు స్కూల్లో బాగానే ఉంటుందిలే! ఏమీ కంగారక్కర్లా!" అన్నాను.

ట్రాఫిక్ గంటకి కానీ క్లియర్ కాలేదు.

ఎండలో బుర్ర మాడింది.

హెల్మెట్‌లోనించి బుగ్గలమీదకీ, భుజాలమీదకీ, మొహంమీదకీ చెమటల వర్షం.

సరిత కొంగుని తలమీద వేసుకుని ఎండని భరించింది. టైమ్ చూస్తే రెండూ నలభై.

"రూమ్‌కి వెళ్ళే దోవలో ఒకే ఒక్క హోటల్ ఉంది. ఆ హోటల్‌లో భోజనం చేద్దామా? రూమ్‌లో ఏమీ తినడానికి ఉండవు!" అడిగాను.

"ఇప్పుడేగా మసాలాదోశ తిన్నదీ! పోనీ బిస్కెట్లు కొను. నువ్వు ఏమీ తినలేదుగా! లంచ్‌కి బదులు బిస్కెట్లు తిందాం!" అంది.

బిస్కెట్లూ, అరటిపళ్ళూ కొన్నాను.

నేను పక్కా పల్లెటూరిటైపుగాడ్ని. భోజనం సుష్టుగా తినడం అలవాటుగానీ, 'బదులు'గా తినడం అస్సలు అలవాటు లేదు. ఏం చేద్దాం?

బండి ఆపి గేటు తీస్తున్నప్పుడే 'ఓనరిణి' చూసి కనుబొమలు ముడేసి బయటికొచ్చింది రాకెట్టులాగా. "గుడాఫ్టర్నూన్ ఆంటీ, తనూ...." అని ఓ క్షణం ఆగాను.

"సరితని ఆంటీ, ఇకనుంచీ రమ్మీ రూమ్‌లోనే ఉండిపోదల్చుకున్నా. మా అమ్మాయి కూడా వచ్చేస్తుంది తెలుసా?" గడగడా చెప్పింది సరిత.

మా ఓనరిణి తెల్లమొహం వేసి నిలబడింది.

"మీ అమ్మాయా...?" అని అయోమయంగా అడిగింది. "అవునవును... మా అమ్మాయే..... దమయంతి'" ఉత్సాహంగా అంది సరిత.

ఇంకో క్షణం అక్కడుంటే ఏం జరుగుతుందోనని గబగబా మేడమెట్లు ఎక్కి రూమ్ తాళం తీశా. సరితకూడా లక్కు బాగుండి కింద ఆగకుండా నా వెనుకే వచ్చింది. టైమ్ మూడూ పది.

"ఈ పాటికి 'దమ్మూ'ని స్కూలు వ్యాన్ వాళ్ళు ఇంటిదగ్గర దించేస్తారు. పక్కింటావిడ పాపం దానికి తాళంచెవి ఇచ్చిందో లేదో!"

"ఎందుకివ్వదూ?" అన్నాను.

"ఎందుకేమిటీ? మా పక్కింటావిడ ఓ మొద్దు, ఎప్పుడు చూసినా నిద్రపోతూనే వుంటుంది. ఆవిడ గనుక నిద్రపోయిందనుకో, పాపం వాళ్ళ నాన్న వచ్చేదాకా దమ్మూ వరండాలోనే ఉండాలి. అన్నట్టు వరండాలో ఎండపడుతూ వుంటుం దిప్పుడు!" బేలగా అంది.

"పోనీ... ఇంటికి వెళ్ళి దమయంతిని కూడా తీసుకొద్దామా!" అని అన్నాను.

"వొద్దొద్దు! నేను బయటికి వచ్చిన విషయం ఆ మనిషికి తెలిసి బుద్ధి రావాలి. నేనా? ఒక్కసారి నిర్ణయం తీసుకున్నాక వెనక్కి తగ్గేది లేదు.

ఈ విషయం ఆయనకీ బాగా తెలుసు. ఏడ్చి 'గీ' పెట్టినా ఆయనతో కాపురం చెయ్యడం కల్ల!" రోషంగా అంది సరిత.

"నువ్వు పక్కింటివాళ్ళింట్లో పెట్టిన సామాన్ల కోసమైనా వెళ్ళాలిగా మనం. పోనీ ఫోన్ చేద్దామా?" అడిగాను. "నో...!" సీరియస్‌గా అంది సరిత.

"పోనీ ఆవిడకి ఫోన్‌చేసి నిద్రలేపి దమ్మూకి ఇవ్వమని చెబుదామా?" అన్నాను.

కాసేపు ఆలోచించింది సరిత.

"ఆ! ఆ పని చెయ్యొచ్చు!"

నేను సెల్ తీసి సరిత తన పక్కింటివాళ్ళ నెంబరు చెబితే డయల్‌చేసి రింగ్ అవుతుండగా సరితకిచ్చాను. రింగ్ అవుతున్న శబ్దం వినిపించింది కానీ, ఫోన్ తీసినట్టు లేదు.

"చెప్పాగా... ఆవిడ ఊర్మిళటైపు మనిషనీ.... పోనీ మనమే వెళ్దామా?" కొంచెం సందేహంగా అడిగింది సరిత.

"ఓ...! హాయిగా వెళ్దాం!" చాపమీదనించి లేచా. "మరి ఆయన కనపడితే?" అన్నాను.

"చెప్పాగా! అతనితో ఇక కాపరం చేసేది లేదని మొహం మీద చెప్పేస్తా. రమ్మీ, ఏ ఆడదయినా తెగించనంతవరకే! భరించినంతకాలం భరించా. ఇక ఆ మనిషి నీడని కూడా భరించలేను. అతనంటే...హూ..." పళ్ళు కొరికిందేమోనని నా అనుమానం.

"అసలేమయిందీ?" మరోసారి విషయం రాబట్టే ప్రయత్నం చేశా.

"అసలు తల్చుకుంటుంటేనే ఒళ్ళు మండుతుంది. ఆడదంటే మగాడి కాలికింద చెప్పా? యుగయుగాలుగా భరించాం. ఇప్పుడు దెబ్బకి దెబ్బ తిట్టుకి తిట్టు... అంతే!" కోపం ధ్వనించింది ఆ మాటల్లో.

"మరి నా రూమ్‌లో మంచాలు అవీ లేవు. అలాగే ఉండదానికి కావలసిన సౌకర్యాలు కూడా తక్కువే!" ఉన్న విషయం బయటపెట్టాను.

"మంచాలుకాదు రమేష్ ఉండాల్సింది, మంచి మనసు! చెప్తున్నాగా. నువ్వు నిజంగా మనసున్నవాడివి! లేకపోతే ఈ ఎండలో నా కోసం!" నా భుజం గట్టిగా చేతితో నొక్కింది.

నేను మహోత్సాహంతో బండి స్పీడు పెంచాను. పదినిమిషాల్లో సరితా వాళ్ళింటి ముందు ఉన్నాం. థ్యాంక్‌గాడ్!

దమయంతి ఇంకా రాలేదనుకుంటాను.

బండి చప్పుడు వినగానే పక్కింటావిడ గబగబా బయటికొచ్చి "ఎక్కడికెళ్ళావు సరితా? నీ సెల్ తీసికెళ్ళలేదా? పాపం మీ ఆయన ఆఫీస్‌మెట్ల మీంచి జారిపడితే ఆఫీసువాళ్ళూ హాస్పిటల్‌కి తీసికెళ్ళారట. నా నెంబరుకి ఫోన్ చెయ్యమని మీ ఆయన నెంబరిచ్చారట. నడుముకీ, తలకీ దెబ్బ తగిలిందిట" గడగడా కబురు చెప్పింది.

"అయ్యో" గభాల్న కింద కూలబడింది సరిత... ఏడుస్తూ! గుండెలు బాదుకుంటూ.

"లే సరితా లే.... హాస్పిటల్‌కి వెళ్దాం!" అన్నాను చెయ్యిపట్టి లేపుతూ.

"ఛీ..... ఎంత దుర్మార్గురాల్ని! ఇందాకట్నించీ ఆయన్ని పాపం తిడుతూనే వున్నాను. ఎంత పాపం! బంగారంలాంటి మనిషిని నానామాటలు అన్నాను. నన్ను నిలువునా పాతిపెట్టినా తప్పులేదు.

నా తిట్లే శాపాలై ఆయన్ని పడేసివుంటే రమేష్.... ఛీ ఎంత నికృష్టపు జన్మనాది... అయ్యో... ఎన్ని మాటలన్నానూ..." కొంగు నోటికి అడ్డం పెట్టుకుని ఏడుస్తూ, వెక్కుతూ అంటోంది సరిత.

'ట్రినిటీ' హాస్పిటల్ ముందు బండి ఆగగానే లోపలికి పరిగెత్తింది. మూడు, నాలుగు నిమిషాల తరువాత గానీ నేను గది నెంబరు కనుక్కోలేకపోయా. తీరా లోపలికి చూస్తే ఏముందీ!

"ఏవండీ... నా మాంగల్యం గట్టిదండీ...మీకేం కాదండీ. తిరుపతి వెంకన్నకీ, కనకదుర్గమ్మకీ కూడా మొక్కేశానండీ" కొంగుతో 'ఆయన' మొహం తుడుస్తూ అంటోంది.

కాసేపాగాక నన్ను గుర్తించి, "రమేష్.... ఇంటికి వెళ్ళి 'మా' దమయంతిని తీసుకురావూ!" అంది.. ఇంకేం చెప్పనూ?

– స్వాతి జూన్ 2014

# మార్పు

"సృష్టిలో ఏ తప్పూ లేదు... ఉన్న తప్పంతా నీ దృష్టిలోనే ఉంది అన్నారో మహానుభావుడు!" అన్నాను నేను. "అవునా!" మామూలుగానే అన్నట్టు అన్నదిగాని, ఆ 'అవునా' అనేమాటలో వెటకారం స్పష్టంగా ఉంది.

శంకరాభరణంలో శంకరశాస్త్రి 'అమ్మా' అనే మాటని ఎన్ని విధాలుగా అన్నారో అంతకంటే ఎక్కువసార్లు, ఏ మాటనైనా అనగల నైపుణ్యం, వెటకారం సావిత్రికి ఉంది. ఒక్క వెటకారాన్ని మాత్రమే కాదు... నవరసాల్నీ మాటల్లో ఒలికించడం సావిత్రికి వెన్నతో పెట్టిన విద్య.

ఓసారి స్నేహితుడ్ని పరిచయం చేస్తూ, "వీరు శంకర్‌గారు... గొప్ప వాయులీన విద్వాంసులు!" అన్నాను.

"అబ్బా!" అని కళ్ళు బాగా తెరిచి కనుబొమలు పైకెత్తింది. ఆ 'అబ్బా'లో ఆశ్చర్యం ఉందో, వెటకారం ఉందో, మెచ్చుకోలు ఉందో ఈనాటికీ నాకు అర్థంకాలా. మా స్నేహితుడైతే ఆనాటినుంచీ ఈనాటివరకూ ఫోన్‌చేస్తే ఒట్టు. అంతేగా మరి! ఎవరికి తోచింది వారు అర్థం చేసుకుంటారు. వద్దనడానికో, సరిచెయ్యడానికో మనకేం హక్కుంది?

❀ ❀ ❀

అసలు పెళ్ళంటే ఏమిటీ?

"రెండు మనసులు, రెండు తనువులు, రెండు ఆత్మలు ఏకమయ్యే పవిత్ర కార్యక్రమం" అన్నాడు వీరేశ్వర్రావు.

"ఓహో!" అన్నారు ఫ్రెండ్స్.

"అంతేకాదురా వీరిగా, రెండు కుటుంబాల్ని బంధుమిత్ర సపరివారంగా ఏకం చేసే మహత్తర ప్రక్రియ!" అన్నాడు విశ్వనాథం.

అందరం చప్పట్లు కొట్టాం.

నిజమేగా! మొన్నటివరకూ, అంటే సావిత్రితో పెళ్ళి కుదరకమునుపు, నేను ఒంటరిగాడ్ని. వచ్చేనెల పెళ్ళయిపోతే నాకు ఓ పెళ్ళామేగాక, ఓ అత్తగారూ, మామగారూ, ఇద్దరు వదినలు తద్వారా ఇద్దరు తోడల్లుళ్ళూ వీరంతా కూడా నా 'పరివారం' అవుతారు గదా! ఈ ఆలోచనే అద్భుతంగా ఉంది. వచ్చిన చిక్కల్లా సావిత్రితోనే.

ఆమె హావభావాలు నేను సరైనవిధంగా, సరైన పద్ధతిలో అర్థం చేసుకోగలనా అన్నదే నా ప్రస్తుతసమస్య. నన్ను అర్థంచేసుకోవడం తనకి సమస్య కానేకాదు. మంచినీళ్ళు తాగినంత సులభం.

ఆ మాట రెండు మూడుసార్లు తనే అంది. ఏ మాటకామాటే చెప్పుకోవాలి. సావిత్రి నిజంగా అందగత్తె. అంటే, ఎర్రగా బుర్రగా ఉంటుందనికాదు. నవ్వితే నవరత్నాలు రాలతాయనికాదు. సావిత్రిని చూసి సినిమా హీరోయిన్లందరూ సిగ్గుపడిపోతారనికాదు. 'ఇక్‌రాత్ మె దోదో చాంద్ ఖిలే' అని సావిత్రిని చూసి కవికుమారులు అద్భుత గీతాలను రాసేస్తారని కాదు.

ఆవిడ అందం అంతా మితంగా మాట్లాడటంలో ఉంది. నేను గంటసేపు వాగితే ఆవిడ ఓ చిన్న చిరునవ్వుతో సమాధానం చెబుతుంది.

నేను ఆవిడ అందాన్ని అనర్గళంగా వర్ణిస్తే, 'అంత ఏం లేదు' అన్న ఒక్క మాటతో సరిపెడుతుంది. మితభాషి అయిన భార్య కంటే మగాడు కోరుకునే మగువ లక్షణం ఇంకేముంటుంది?

నా తరపున ఓ నలుగురు స్నేహితులూ, సావిత్రి తరపున ఓ ఆర్‌టీసీ బస్సుడు బంధువులూ కలిసి సంయుక్తంగా మా పెళ్ళి జరిపించారు. సింగిల్ బెడ్రూమ్ అపార్టుమెంటులో మా 'గృహప్రవేశం' ఘనంగా జరిగింది. నా ఫ్రెండ్సు, సావిత్రి బంధువులూ ఇచ్చిన గృహోపకరణ సామగ్రి చాలా డబ్బుని ఆదా చేయించింది.

కొత్త మంచం, కొత్త ఫోమ్ బెడ్డు, సరికొత్త దిళ్ళు, వాటి మీద సావిత్రి అక్కలు జల్లిన మల్లెపూలతో శోభన కార్యక్రమం దివ్యంగా జరిగింది. దివ్యం

అని ఎందుకంటున్నానంటే, ఇంటర్వెల్స్‌లో నేను కొంచెం అతిగా స్పందించి, అతిగా వాగినా తను మాత్రం ముచ్చటగా మూడే మాటలు అంది. అవి మాటలని కూడా చెప్పలేననుకోండి.

ముద్దు పెట్టుకున్నప్పుడు 'ఊ'-కౌగిలించుకుని అతుక్కుపోయినప్పుడు 'ఊ...హ్'- మిగతా కార్యక్రమం తరువాత 'అబ్బా' విత్‌స్మైల్.

నేను లేచేసరికి కాఫీ సిద్ధం.

స్నానం చేసి రాగానే టిఫిన్ సిద్ధం. ఆఫీసుకి వెళ్ళడానికి డ్రెస్ చేసుకోగానే కేరేజీ సిద్ధం. ఇంకేం కావాలి!

మగాడి గుండెలో ఆడది పర్మనెంటుగానూ, డైరెక్టుగానూ స్థిరపడటానికి ఏకైక మార్గం పొట్ట.

రకరకాలుగా వండి నా గుండెని జయించింది సావిత్రి. మెల్లమెల్లగా నా ఫ్రెండ్స్ 'రాక' తగ్గింది. వాళ్ళ 'అంటే' సావిత్రి చుట్టాల 'రాక' పెరిగింది.

ఆ విషయం నేను గమనించేసరికే నా రాజ్యం యావత్తూ సావిత్రి వశమైపోయింది.

❀ ❀ ❀

ఓరోజు, అంటే మా వివాహమహోత్సవ తొలి వార్షికపు రోజు నేనో అందమైన చీరనూ, జాకెట్టు గుడ్డనూ కొని మహా సంబరంగా ఆమెకి 'ప్రజెంట్' చేశా. అంతేగాక, "బాగుందా సావిత్రీ? ఇది కట్టుకుంటే నువ్వు రంభలా ఉంటావు సావిత్రీ..." అని అధిక ప్రసంగం చేశా. నావంక ఓసారి కళ్ళెత్తిచూసి, "రంభెవరూ?" అని లోపలికి చక్కాబోయింది.

ఒక చిన్న మేకు అంత పెద్ద టైరుని ఎలా నిర్వీర్యం చెయ్యగలదో నాకు అప్పుడర్థమైంది. ఆ రోజంతా నీళ్ళు తాగుతున్నా అన్నం తిన్నా నాకు పొలమారుతూనే వుంది. ఏమాటకామాటే చెప్పుకోవాలని అన్నాను గదూ! ఆ రాత్రి మాత్రం 'కార్యక్రమాలు' నిర్విఘ్నంగానూ, శుభకరంగానూ జరిగాయని ఖచ్చితంగా చెప్పగలను.

'మాటలదేం వుంది... చేతలు ముఖ్యంగానీ' అని నాలో నేను అనుకుని సావిత్రిని మరింత ముద్దు చేశానని బల్లగుద్ది మరీ చెప్పగలను. నెలన్నర తరువాత 'డాక్టర్ దగ్గరికి వెళ్ళొస్తే మంచిదేమో!" అని ఓ సంపూర్ణ వాక్యాన్ని నాకు ప్రసాదించింది సావిత్రి.

నేను తండ్రి కాబోతున్నాననే మహత్తర విషయాన్ని డాక్టరు సరస్వతి ఎమ్.బి.బి.ఎస్...... గైనకాలజిస్టు మొహమంతా నవ్వు పులుముకుని చెప్పినా సావిత్రి మాత్రం "మా వాళ్ళకి ఫోన్ చెయ్యండి!" అన్న చిన్న వాక్యంతో విషయాన్ని నిర్ధారించింది తప్ప మరో హడావిడి చెయ్యలా.

మూడో రోజుకి నా సింగిల్ బెడ్రూమ్ అపార్ట్‌మెంటు రైల్వే కంపార్టుమెంటులా మారిపోయింది. వాళ్ళ అమ్మానాన్నలతోపాటు సావిత్రి ఇద్దరు అక్కలూ, వాళ్ళ నలుగురు పిల్లలూ ప్లస్ భర్తలూ చాపలూ దిళ్ళూ వేసుకుని చక్కగా సెటిలై పోయారు... చోటు దొరకనిది నాకే!

అయినా అంత శుభవార్త విని వాళ్ళంత సంతోషంగా వచ్చాక చిన్న చిన్న విషయాలు పట్టించుకోకూడదని, 'సర్వీస్' వరండాలో నేనూ సెటిలయ్యా.

"ఇల్లు ఇరుకైనా పర్లేదు. మనసు విశాలంగా ఉండాలి. మీది విశాలమైన మనసు!" అని సావిత్రి నాకో సర్టిఫికెట్ ఇచ్చి వాళ్ళ అక్కల మధ్యలో నిద్రకి సెటిలైనప్పుడు నా మనసు మరింత విశాలమై ఆనందంతో ఊగిపోయింది. పెళ్ళయిన ఇన్నాళ్ళకి ఇంత మహత్తరమైన మెప్పుపొందటం ఎవరికి మాత్రం ఆనందం కలిగించదూ!

ఓ నాలుగు రోజులుండి వాళ్ళు వెళ్ళిపోయాక, ఓ సునామీ వచ్చి సుతారంగా వెళ్ళిపోయిన భావన కలిగింది నాకు. వాళ్ళ అక్కల పిల్లలు నలుగురూ నా శరీరాన్ని ఓ మినీ ఫుట్‌బాల్ కోర్టులా భావించి వాళ్ళ టాలెంట్ మెరుగులు పెట్టుకున్నారని మాత్రం చెప్పక తప్పదు! ఆ మాటే సావిత్రితో అంటే "మనకీ పుడతారుగా!" అన్న ఒక్కమాటతో నా కంప్లైంట్‌ని దూదిపింజలా ఎగరగొట్టింది.

ఎనిమిదో నెల పూర్తి అయినా తను మామూలుగానే ఉన్నది గానీ, అవసరానికి మించి ఒక్కమాటకూడా మాట్లాడలా. నేనే, రకరకాల పేర్లు... రకరకాల రాష్ట్రాలవీ, దేశాలవీ గాలించి ఓ పెద్ద బౌండుబుక్కు తయారుచేశా. ఆడపిల్ల అయితే ఓ రెండు వేలు, మగపిల్లాడైతే ఓ రెండువేలూ సిద్ధంగా ఉంచా. అవికూడా పుట్టిన నక్షత్రానికి ప్రత్యేకంగా తయారుచేశా.

ఇవన్నీ సావిత్రి గమనిస్తూనే వుంది కానీ, కామెంటు మాత్రం చెయ్యలా. నేనే ఇక ఆగలేక, ఉత్సాహం ఆపుకోలేక, సుముహూర్తం చూసి, "పోనీ నువ్వు చెప్పు.... బాబైతే ఏ పేరూ, పాపైతే ఏ పేరూ?" బుజ్జగించి అడిగా.

"పాపైతే మున్నీ, బాబైతే బుడ్డిగాడు" అని ఠక్కున చెప్పింది సావిత్రి.

"అవి కేవలం ముద్దుపేర్లే గానీ స్కూల్లో రాయడానికి పనికొచ్చే పేర్లుకావుగా!"' మతిపోయి అడిగా.

"ఇప్పటికి ఇంతే. పుట్టాక ఆలోచిద్దాం!" అటు తిరిగి పడుకుని కళ్ళు మూసుకుంది.

ఇంకేం మాట్లాడనూ?

❁ ❁ ❁

ఆ రోజు రానే వచ్చింది. పుట్టింది బుడ్డిగాడే! మళ్ళీ అపార్టుమెంటు రైల్వే కంపార్టుమెంటైంది. ఈసారి నా ఒళ్ళు ఫుట్‌బాల్ గ్రౌండ్‌గా మాత్రమే కాక టెన్నిస్ కోర్టులా, బ్యాడ్మింటన్ కోర్టులా, ఫోర్‌సీట్ సోఫాలా మారినా నాకు మాత్రం బాధ కలగలేదు.

చిత్రం ఏమంటే బుడ్డిగాడు కూడా తల్లిలా మితభాషే. కేవలం రెండు సెకన్లు మాత్రమే ఏడ్చి, 'ఆకలి' అనే విషయాన్ని తల్లికి చేరవేస్తాడు. ఆవిడ పాలివ్వగానే మౌనముద్రలోకి దూరిపోతాడు.

అప్పుడే భూమిని చీల్చుకుని బయటికి వచ్చిన మొక్క పెద్దదవడం సహజం. చిన్న నిక్కరుతో బడికి వెళ్ళే పిల్లలు, చూస్తూ చూస్తూ వుండగానే పేంట్లలోకి మారిపోయి ఫోజులు కొట్టడం సహజాతి సహజం.

మా అత్తగారికీ, వదినగార్లకీ కూడా మగపిల్లలు లేరు. అంచేత మా 'బుడ్డిగాడు' రెండు కుటుంబాలకీ సారీ, మొత్తం కుటుంబానికి ఏకైక మగధీరుడై మధ్యాహ్న మార్తాండునిలాగా ఎదిగిపోయాడు.

❁ ❁ ❁

తోడల్లుళ్ళ పిల్లలు నలుగురికీ పెళ్ళిళ్ళయ్యాయి. అందరికంటే చిన్నదాని పెళ్ళిలో, సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా స్థిరపడ్డ మా బుడ్డిగాడు ఓ అమ్మాయిని ప్రేమించి ఆ విషయాన్ని వాళ్ళమ్మకి చెప్పటం నాకు మాత్రం 'విస్మయాన్ని' కలిగించింది.

లక్షమాటలకి ఒక్క 'ఊ'తోనో, 'ఊహూ'తోనో జవాబుచెప్పే వీడు - ఎలా ప్రేమించి ప్రేమించబడ్డాడనేది నాకు చిదంబర రహస్యమే.

వాడు నా కొడుకైనా, ఏనాడూ నాతో రెండు మాటలు పూర్తిగా మాట్లాడి ఎరగడు. వాళ్ళమ్మతో బాగానే మాట్లాడతాడని కేవలం నా అనుమానమే గానీ, నిర్ధారణ కాదు.

"ఆ అమ్మాయి అతిగా మాట్లాడుతుంది. అంచేత వద్దు!" అంది సావిత్రి బుడ్డిగాడితో.

"అదా....! దానికేం? అతిగా మాట్లాడే నాన్నతో నువ్వు ఇన్నాళ్ళూ కాపరం చెయ్యట్లా? నేనూ అంతే!" అన్నాడు.

"ఏమో, నాకైతే ఇష్టంలేదు!" సావిత్రి.

"నేనా అమ్మాయిని ప్రేమించాను. ఆ అమ్మాయి కూడా నన్ను ప్రేమించింది. పెళ్ళి చేసుకుంటానని మాట ఇచ్చాను!" బుడ్డిగాడు.

"నీ ఇష్టం. నాకు మాత్రం ఇష్టంలేదు" సావిత్రి.

నా చెవుల్లో తేనెవర్షం కురుస్తోంది. వాడు చరచరా డబుల్‌బెడ్రూమ్ అపార్టుమెంట్లోని వాడి 'గది'కి వాకిన్ చేశాడు.

సావిత్రి కూడా వంటగదిలోకి వాకౌట్ చేసి తన 'నిర్ణయాన్ని' చెప్పకనే చెప్పింది.

నేనే ఇద్దరికీ కాస్త 'సర్దుబాటు' చేద్దామనుకున్నాగానీ నన్నసలు వాళ్ళు సంభాషణలో పాలుపంచుకోనిస్తేగా!

మా ఇల్లు ప్రస్తుతం మౌనానందులవారి ఆశ్రమంలా ఉంది. అన్నీ చూపుల్తోనే జరిగిపోతున్నై. నో మాటలు. రావాల్సిన రోజు రానే వచ్చింది. అంటే ఆ అమ్మాయి ఓ సాయంత్రం మా ఇల్లు 'విజిట్' చేసింది.

"హలో అంకుల్, హలో ఆంటీ! నా పేరు ప్రసన్న, మీ కిరణూ నేనూ ప్రేమించుకున్నాం!" అందంగా నవ్వుతూ అంది.

భార్య 'మితభాషి' అయితే అందం అనుకున్నవాడినల్లా, ఇప్పుడు 'అతిభాషి' అయితేనే అందం అనే నిర్ణయానికొచ్చాను.

ఆ పిల్ల ఆరోగ్యం తొణికిసలాడే ఉత్సాహంతో వెలిగిపోతోంది.

"అలాగా" అంది సావిత్రి. ఆ 'అలాగా' అనే మాటలో నాకు మాత్రం ఏ అర్థమూ భావమూ స్ఫురించలా.

"అవును. మీరిద్దరూ కూడా నాకు నచ్చారు!" నవ్వింది ప్రసన్న. "ఆహా...!" అంది సావిత్రి.

"మరి మా వాళ్ళని పంపించమంటారా?" ఉత్సాహంగా అంది ప్రసన్న. "వైనాట్ ప్రసూ!" లోపలికొస్తూ అన్నాడు బుడ్డిగాడు. సావిత్రి కళ్ళెత్తి వాడివంక చూసింది. "ఓకేనా అమ్మా?" వాడు తల్లివంక చూస్తూ నవ్వాడు. అన్నట్టు చెప్పడం మర్చిపోయా... తల్లీకొడుకులు ఇద్దరూ మాటల విషయంలోనే గాదు... నవ్వుల్లో కూడా పొదుపరులే.

"హూ" అని ఓ శబ్దం చేసింది సావిత్రి. ఆ 'హూ' అంటే అవుననా కాదనా? నాకు అర్థం కాలా.

"నైస్ మమ్మీ.... యూ ఆర్ గ్రేట్ మమ్మీ!" వాడు సావిత్రి రెండు భుజాలు ఆనందంగా నొక్కి, "రేపు మంచిరోజే, మీ వాళ్ళని పిల్చుకొచ్చెయ్ ప్రసూ!" అన్నాడు.

"యా! థాంక్యూ ఆంటీ... బై అంకుల్!" అంటూ ఆనందంగా ఆ అమ్మాయి బయటికి పోతుంటే, బుడ్డిగాడు ఆమెని అనుసరిస్తూ వెళ్ళాడు.

"ఇంతకీ నువ్వు ఒప్పుకున్నట్టా లేనట్టా?" అడిగా.

"ఆ పిల్ల మహాజాణ" మరోమాట సావిత్రి మాట్లాడలా.

❀ ❀ ❀

మర్నాడు సాయంకాలం ప్రసన్న వాళ్ళ అమ్మా నాన్నతో మా ఇంటికొచ్చింది. నవ్వీ నవ్వనట్టుగా నవ్వి... "రండి!" అంది సావిత్రి.

వాళ్ళు లోపలికి వచ్చి సోఫాలో కూర్చుని... "మీ ఇల్లు బాగుందండీ!" అని సంయుక్తంగా అన్నారు.....

"అవునవును! అంతే!" నేను గొణుగుతున్నట్టు ఏదో అన్నానే గానీ ఆ మాటలు అసందర్భం అనిపించలా.

ఆలోచించి మాట్లాడటం ఓ కళ. అది నాకు రాదు. అందువల్లే ఇంట్లోనూ, ఆఫీసులోనూ కూడా నేను మిస్‌ఫిట్‌నే. అయితే, నేను మహాతెలివైనవాడిననీ అందుకే దేనికీ సూటిగా సమాధానం చెప్పకుండా దాటేస్తాననీ సావిత్రి ఉద్దేశ్యం. ఆ విషయం ఆవిడ వాళ్ళ అమ్మానాన్నలతో చెప్పడం నేను చెవులారా విన్నాను. నిజం చెప్పొద్దూ.... కొంచెం ఆనందించాను కూడా.

ఎప్పుడు చేసిందో ఏమిటో గాని, మాంచి ఉల్లిపాయ ముక్కలూ కొత్తిమీరా వేసి నిమ్మకాయ పిండిన మిర్చి బజ్జీలూ, వాటికి తోడుగా కమ్మని అరటికాయ బజ్జీలూ, ఆ రెంటికీ ఫైనల్ టచ్ ఇవ్వడానికన్నట్టు నోరూరించే జీడిపప్పు ఉప్మా, ఆ ఉప్మాకి తోడుగా బ్రహ్మాండమైన రంగుతో మురిపించే టొమేటో ఉల్లిపాయ చట్నీ.... అతి సుందరంగా పేట్లో అలంకరించి తెచ్చింది.

చెప్పొద్దూ..... ఆ యొక్క రంగూ, ఆ యొక్క సువాసనా, ఆ యొక్క సర్దిన విధానం అద్భుతంగా ఉండి నోరూరించాయి అంటే నమ్మండి. ముందు మొహమాటపడ్డట్టు నటించినా, ప్రసన్న ఫ్యామిలీ మొత్తం ఆవురావురంటూ ప్లేట్లని ఖాళీ చేశారు.

ఇంతలో ఆఫీసునుంచి బుడ్డిగాడు రావటం, వాళ్ళని ఎంటర్‌టైన్ చెయ్యడానికి అనర్గళంగా మాట్లాడటం చూసి నా కళ్ళు తిరిగిపోయాయి.

మాట్లాడటంలో వీడికి 'ఇంత టాలెంట్' ఉందని ఈ రోజువరకూ నా ఊహకి అందకపోవడం కేవలం నా యొక్క బుర్రలేనితనమే అనిపించింది.

'మాట్లాడాల్సినచోట ఎంతైనా మాట్లాడు. కూడనిచోట నోరు మెదపొద్దు' అన్న సుభాషితం అర్జంటుగా నాకు గుర్తుకువచ్చి నేను నోరుమూసుకుని చెవులకి పని అప్పజెప్పాను. సావిత్రి కూడా కర్ర విరక్కుండా, పాము చావకుండా అత్యంత జాగ్రత్తగా సున్నితంగా తన అంచనాలని వాళ్ళకి అర్థమయ్యేలా చెప్పింది. మధ్యలో రెండు మూడుసార్లు నవ్వుని కూడా ప్రదర్శించి కట్నకానుకల్ని రాబట్టే ప్రయత్నం అతి తక్కువ మాటలతో కానిచ్చింది. వాళ్ళు ఓకే, బుడ్డిగాడూ ఓకే, సావిత్రీ ఓకేనని అనుకున్నా.

"మరోసారి కలిసినప్పుడు నిశ్చితార్థం గురించి మాట్లాడుకుందాం వదిన గారూ!" అంది.

అంటే ఓకే అనేకదా అనుకున్నాను.

కానీ అప్పుడే ఓకే కాదని రాత్రి తెలిసింది.

"మళ్ళీ కలవడం ఎందుకూ? ఇవాళే మాట్లాడి ఉండొచ్చుగా?" కొంచెం కోపాన్ని ప్రదర్శించాడు బుడ్డిగాడు.

"వాళ్ళు మనిల్లు చూశారు. మనం వాళ్ళ ఇల్లు చూశాక గదా సరైన అంచనాకి రాగలిగేది!" అన్న వాక్యంతో వాడి నోరు మూయించింది సావిత్రి.

చేసేదేముందీ? ఆపై వారం మేం వెళ్ళాం.

టిఫిన్ ఏర్పాట్లు భారీగానే చేశారు. ప్రత్యేకంగా 'మాడుగుల హల్వా' కూడా తెప్పించారు.

నాదేముందీ, వాళ్ళు మాట్లాడుకుంటే నేను నిమిత్తమాత్రుడిలా జీడిపప్పు మిఠాయినీ, దాని రుచినీ లెక్కకట్టడంలో మునిగిపోయా.

"ఆ పిల్లే కాదు.... ఆ పిల్ల తల్లికూడా మహాజాణ!" ఇదీ ఆవిడ ఒక్కముక్కలో చెప్పిన సారాంశం.

"అదికాదు సావిత్రీ.... వాళ్ళు..." చెప్పబోయా. 'హూ' అంటూ ఓ నిట్టూర్పు నిట్టూర్చి కళ్ళు మూసుకుంది. అంతే, నేను రేడియో కట్టేసినట్టు నోరు కట్టేసుకున్నాను.

మగాళ్ళ ప్రపంచం చాలా విశాలమైనదనీ, ఆడవాళ్ళ ప్రపంచం కేవలం భర్తా, పిల్లలూ, ఇల్లూ మాత్రమేననీ చాలామంది అనడం నేను చాలాసార్లు విన్నా. మగాడి ప్రపంచం వేరుశెనక్కాయలాగా ఉత్తిడొల్ల అనీ, ఆడాళ్ళ ప్రపంచం పూర్తిగా గుజ్జుతో నిండిన వెలక్కాయలాంటిదనీ చాలాకాలందాకా నాకు అర్థంకాలా. ఈ మధ్యే అర్థమైంది.

అంతేగాదు.... మగాడి మనస్తత్వం అరటిపండైతే ఆడవారి మనసు కొబ్బరికాయ. అరిటిపండుదేముందీ వేలికొసలతో తొక్కతీసి తినెయ్యొచ్చు. కొబ్బరికాయ అలా కాదే! పీచు తియ్యటానికే బోలెడు శక్తి కావాలి. ఆ తరువాత ఆ కాయని పగలకొట్టి లోపలికి దిగితేగానీ కొబ్బరి మందమూ, కొబ్బరి నీళ్ళ రుచీ అర్థంకావు.

మా సావిత్రి వ్యవహారమూ అంతేననిపించింది. తల్లీ కొడుకుల అతి క్లుప్త సంభాషణని వింటున్నానేగానీ ఆ సంభాషణ సారాంశం నా మట్టిబుర్రకి అర్థమైతేగా!

"కట్నకానుకలు అవసరమా?" బుడ్డిగాడు.

"ఏమో! రేపు నీ పిల్లలకి వాటితో అవసరం గడవొచ్చుగా?" అంది సావిత్రి.

"అది రేపటి సంగతి" బుడ్డిగాడు.

"నేటి పునాదిమీదే రేపటి భవిష్యత్తు ఆధారపడి వుంటుంది!" అంది సావిత్రి.

"ఓహ్" బుడ్డిగాడు... అసహనంగా.

"ఆ!" సావిత్రి స్పష్టంగా.

ఇలా కొన్నాళ్ళు క్లుప్తంగా సంభాషణలు జరిగాయి.

తల్లుల్ని బుట్టలో వెయ్యడం పిల్లలకి వెన్నతో పెట్టిన విద్య. అయితే పద్ధతులే విచిత్రంగా ఉంటాయి.

ఇంట్లో 'భోజనాలు' తగ్గించడం ద్వారా బుడ్డిగాడు వాళ్ళ అమ్మని పెళ్ళికి ఒప్పించగలిగాడు.

"భలే ఒప్పించాడు!" అన్నాను.

"వాడి మొహం. ఆ పిల్లని చూసినప్పుడే నేను నా మనసులో ఒప్పుకున్నా!" అంది సావిత్రి.

నా నోట్లోంచి మరోమాట వస్తే ఒట్టు.

వాళ్ళు పెట్టవలసినవి వాళ్ళు పెడితే, మేం పెట్టవలసినవి మేం పెట్టాం. 'పెట్టాం' అనడం తప్పు, ఎందుకంటే ఆ పరిజ్ఞానం నాకు లేదు గనుక, సావిత్రి ఏం చెయ్యమంటే అది చేశానని మాత్రమే చెప్పగలను.

"అన్నయ్యగారు మేధావి వదినగారూ! ఏం చేసినా భలే నిశ్శబ్దంగా ముచ్చటగా చేస్తారు. మీరంటే ఆయనకి ఎంత గౌరవం, ఎంత ఇదీ!" అని ప్రసన్న మాతృమూర్తి నాకు పెద్ద సర్టిఫికెటు ఇచ్చింది.

ఎందుకో నాకు అది మెప్పుకోలుగా అనిపించలా. అంతేకాక, నేను బుర్రలేని వాడిననే అర్థం అందులో ఉందేమో అని కూడా అనిపించింది. చేసేదేముందీ!

"ఇంతింతై వటుడింతై" అని పోతనగారు రాసిన పద్యం, వామనుడి కంటె ఆడవాళ్ళకి బాగా సరిపోతుంది. కోడలు ఇంటికొచ్చాకగానీ, సావిత్రిలో ఎంత నిబిడీకృత శక్తి ఉందో నాకు తెలీలా.

ఓ చిన్న ఆవగింజంత బీజం అడయారు మర్రిచెట్టులా విస్తరించడం కళ్ళారా చూశా.

పాతికేళ్ళ సంసారంలో పదిగంటలసేపైనా (టోటల్ మాటల సమయాన్ని కూడితే) మాట్లాడని సావిత్రి, కోడలు రాగానే నాతో గంటలు గంటలు మాట్లాడుతోంది. అసలు 'ఇన్ని' విధాలుగా ఓ వ్యక్తిని పరీక్షించవచ్చా అన్న ప్రశ్న నా మెదడుని చాలాసార్లు తొలిచింది.

ఆడది 'అమ్మ'గా ఉన్నంతసేపూ ఓలాగా 'అత్త'గా మార్పుచెందిన మరుక్షణం ఓలాగా ఉండేట్టు భగవంతుడే ప్రత్యేకంగా సృష్టించాడేమో! లేక కొడుకు పెళ్ళికాగానే తల్లి మనసులో కొన్ని కొత్త రసాయనాలు ఊరి ప్రత్యేకంగా ప్రవర్తించేలా చేస్తాయేమో!

అంతేకాదు.... 'హలో ఆంటీ హలో అంకుల్' అని ఆరోగ్యకరమైన ఉత్సాహంతో పలకరించిన ప్రసన్న కూడా, 'భార్య'స్థానానికి ఎగబాకంగానే, చిత్రాతిచిత్రంగా మారిపోయింది. అత్యంత సహజంగా సూటీపోటీమాటలూ, తప్పకాలూ జరిగిపోతున్నై. ఇవన్నీ నాకు కొత్తేగానీ, వాళ్ళు మాత్రం అతి సహజంగా పుట్టిన దగ్గర్నించీ అవన్నీ ఉన్నట్లుగానే ప్రవర్తిస్తున్నారు.

అసలొక్కొక్కసారి వీళ్ళిద్దరూ ఓచోట కలిసివుంటారా లేక విడి కాపురాలు పెట్టి విడివిడిగా ఉంటారా అనే అనుమానం కూడా వచ్చేది. ఆ మాటే సావిత్రితో

అన్నాను, "మీరు ఇద్దరూ ఇలా గతాన్ని తవ్వుకుంటూ సూటీపోటీ మాటలతో పొడుచుకుంటూనే వుంటారా లేక వాడిచేత విడి కాపురం పెట్టిస్తావా?" అని.

"పోదురూ.... అదో పెద్ద జాణ!" అని మాత్రం అంది.

నాకు తెలుసు. తల్లీ- పెళ్ళాం మధ్య నలిగిపోవడం ఏ మగవాడికీ ఎంతోకాలం నచ్చదనీ, నడవదనీ.

"నా కొడుకుని అది బుట్టలో వేసుకుంది. వాడివ్వాళ నామీద అరిచాడు" అంది ఓనాడు సావిత్రి. అది దుఃఖమో, కోపమో నాకు అర్థంకాలేదు.

"మామయ్యా.... ఇక నావల్ల కాదు. మా పుట్టింటికి నేను పోతా" అని మరోనాడు ప్రసన్న డిక్లేర్ చేసింది.

"ఇదంతా నీవల్లే వచ్చింది. అన్నీ చూస్తూ కూడా విఘ్నేశ్వరుళ్ళాగా కూచుంటావు తప్ప పరిష్కారం చెప్పలేవు" అన్నాడు కొడుకు.

దీర్ఘంగా ఆలోచించాను. బహుశా నా తల్లే బతికుంటే, నేనూ ఇలాంటి పరిస్థితిలోనే ఉండేవాడ్నేమో అనిపించింది. అత్తగారు లేరు గనక సావిత్రికి ఎదురులేదు. అలా అని సావిత్రి చెడ్డదని నా ఉద్దేశ్యం కాదు. తను ఆడది....

'అమ్మ' అన్నప్పుడు రెండు పెదాలూ కలుస్తాయి. అదే 'అత్తా' అంటే పెదాలు విడిపోతాయి. కావాలంటే ఆ రెండు మాటల్నీ ఓసారి ఉచ్చరించి చూడండి. అమ్మయిన ప్రతి ఆడదీ అత్తకాక తప్పదుగా! ఓ రోజున క్లినిక్‌నుంచి డా॥ సరస్వతి ఎమ్.బి.బి.ఎస్.... గైనకాలజిస్టు ఫోన్‌చేసి "కంగ్రాట్స్....మీరు తాతయ్య కాబోతున్నా"రంది.

బహుశా ఈ చిన్నమార్పు కొంత 'తేడా' తీసుకురావచ్చు అనిపించింది. నిజంగా తెచ్చింది కూడా. సన్న సన్నగా 'అధికారపు' స్వరం తగ్గి అనునయం పెరిగింది. కానీ నా మనసులో ఓ అనుమానం. ఈ తేడా ఎందుకొచ్చిందీ? ఇదెంతకాలం ఉంటుందీ?

రేపు ఏ మనవడో, మనవరాలో పుడితే 'వాళ్ళ' స్థితి ఏమిటీ? పుట్టబోయేవాడు 'తల్లి' అధికారానికి తలొగ్గాలా లేక నాయనమ్మ అధికారానికా? వాడంతటవాడు నిర్ణయించుకునేదాకా జరగబోయే 'నిశ్శబ్దయుద్ధపు' పరిణామాలు ఎంతవరకూ ఉంటాయి? అసలీ తేడాలకీ, యుద్ధాలకీ కారణం? మగవాడు ఆకాశం అయితే స్త్రీ ప్రకృతి అన్నారు పెద్దలు. ఎంత సత్యమైన మాట!

ఆకాశం వర్షిస్తుంది. అంతే! ఆ వర్షం వల్ల అప్పటిదాకా ఎండిపోయి బీటలుపడ్డ భూమి ఒక్కసారిగా పచ్చదనాన్ని సంతరించుకుంటుంది. మొక్కలు మొలవడం, పెరగడం, ఆకులు రాల్చుకోవడం, మళ్ళీ కొత్త ఆకులు రావడం ఇదంతా ప్రకృతి మార్పేకానీ ఆకాశం మారదు. ఆకాశంలాగే పురుషుడూ నిర్లిప్తుడే.

మార్పులు చేర్పులూ అన్నీ స్త్రీలోనే. గర్భందాలుస్తుంది. తల్లవుతుంది. తనను చీల్చుకు వచ్చిన మొక్కలకు భూమి ఎలా బలాన్ని సమకూర్చి పెంచుతుందో, స్త్రీ కూడా అలాగే తనలోని శక్తిని బిడ్డకి ఇచ్చి పెంచుతుంది.

అందుకే, ఏ బిడ్డనయినా తల్లి తిడుతుందేమోగానీ తండ్రిని ఒక్కమాట అననివ్వదు. ఒకవేళ అంటే పులిలాగా తిరగబడుతుంది. ఒకవేళ భర్తకీ,..... బిడ్డకీ గొడవొచ్చినా బిడ్డనే సమర్థిస్తుంది. కారణం భర్త ఎవరి కడుపులోంచో పుట్టినవాడు.... బిడ్డ తన పేగు.

ఈ 'తల్లిమనసుకి' అటు సావిత్రిగానీ, ఇటు ప్రసన్నగానీ అతీతమైన వాళ్ళు కారు. బిడ్డ పెళ్ళి అవగానే భార్య అంటే కోడలు తన బిడ్డని 'స్వంతం' చేసుకుంటుందేమో అని తల్లీ, నా మొగుడు నాకే సొంతం అని భార్యా అనుకోవడం కూడా సహజమైన పరిణామమే.

ఇటు తల్లి – అటు భార్య– వీరిద్దరి ప్రవర్తనతో ఏ మగాడికైనా పిచ్చెక్కడమో, విరక్తి పుట్టడమో సహజం. ఈ రెండు శక్తుల్నీ హద్దుల్లో ఉంచాలంటే మూడో శక్తి కావాలి. లేకపోతే ప్రళయం తప్పదు. నేనో నిర్ణయానికి వచ్చాను.

అధికారం ఎవరూ ఎవరికీ ఇవ్వరు. తీసుకోవడమే! మితభాషి అతిభాషిగా మారగాలేంది, అతిభాషి మితభాషి కాలేడా? అధికారం చలాయించలేడా? ఆ అధికార వినియోగం చాలు... పరిస్థితుల్ని చక్కదిద్దడానికి.

"సృష్టిలో తప్పులేదు. ఉన్న తప్పంతా నీ దృష్టిలో ఉంది" అన్న వాక్యం చాలా గొప్పది. అలాగే, జాగ్రత్తగా గమనిస్తే, సృష్టిలో 'మార్పు' ఉన్నాలేకపోయినా 'దృష్టి'లో మాత్రం మార్పు వచ్చితీరాలి.

అదే 'మార్పు'కి అసలైన నిర్వచనం. ఇప్పుడు ఇల్లు ఆకాశమంత ప్రశాంతంగా ఉందని వేరే చెప్పాలా?

–స్వాతి, 05-10-2012

# మేధావి

చెప్పొద్దూ... కాత్యాయని అంటే నాకు చాలా అభిమానం. ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ ఉంటుంది. మాంచి 'తెలివి' కలిగిందేకాక, 'పొదుపరి' కూడా. చుట్టాలూ, పక్కాలూ పుట్టినరోజుకీ, పండగలకీ ఇచ్చిన 'డబ్బు'ని జాగ్రత్తగా దాచి, అవసరం ఉన్నప్పుడు ఆనందంగా వాళ్ళ అమ్మకి ఇచ్చేది.

'ఆనందం'గా అని ఎందుకన్నానంటే, ఆ డబ్బుకి 'కొంత' వడ్డీతో సహా తిరిగి చెల్లించాలని షరతుపెట్టి మరీ ఇచ్చేది. అంత హుషారుగానూ 'వసూలు' చేసేది.

'డబ్బు' విలువ తెలిసిన పిల్లగాబట్టి కాత్యాయని అంటే నాకు చాలా అభిమానం.

"బాబాయ్! మనిషి ఎంత సంపాదించినా, వాడు 'పొదుపు' చేసిన ధనమే అసలు సంపాదన. రోజుకి లక్ష సంపాయించి లక్షా ఖర్చుపెడతాడనుకో, వాడి సంపాదన 'నిల్' అన్నమాట!" అని పదోతరగతి చదివేటప్పుడే నాకు చెప్పింది కాత్యాయని.

"వాహ్! ఎవరు చెప్పారమ్మా?" అని ఆశ్చర్యపోయా. "చదువుతూవుంటాగదా బాబాయ్.. ఇలాంటివి 'తెలిస్తేనే' జీవితం 'మంచి'గా గడుస్తుంది!" అంది. పదోతరగతి పిల్లనోట 'జీవితం.... మంచిగా గడవటం' అన్నమాటలు వినగలనని నా జీవితంలో నేను ఊహించలా!

మా మధ్య చుట్టరికం ఏమీలేదు. వాళ్ళదీ మాదీ ఒకేవీధి. పక్కపక్క ఇళ్ళు. దాంతో చిన్నప్పటినుంచీ 'కాత్యా' మా ఇంట్లోనే ఎక్కువ కాలం గడిపేది. ఆటలూ, పాటలూ మా దగ్గరే. మాకూ పిల్లలు లేకపోవటంతో మా ప్రేమనంతా 'కాత్యా' మీదే పెట్టుకున్నాం.

ఇంటర్ అయ్యాక 'కాత్యా' వాళ్ళ నాన్న సుందర్రావుకి మరో ఊరు ట్రాన్స్‌ఫరైంది. అయినా కాత్యా ఉత్తరాలు రాస్తూనేవుంది.

'సినిమాలు చూడటం దండగ... ఆ డబ్బుతో చాలా 'మంచి' పనులు చెయ్యొచ్చు. ఆ పనులతో 'ధనం' వృద్ధి చెయ్యొచ్చు. హోటల్లో భోజనాలూ, టిఫిన్లూ చెయ్యటం దండగే. ఆ డబ్బుతో హాయిగా ఇంట్లోనే రెండు రోజులు వండుకోవచ్చు' నువ్వు చేసే 'ధానధర్మాల' వల్ల స్వీకరించినవాళ్ళు సోమరులుగా మారతారు. 'దానం చెయ్యడం అంటే దేవుణ్ణి 'హేళన' చెయ్యడమే.

పోస్టుకార్డు రాయవలసిన చోట 'ఇన్‌లాండ్ కవర్' రాసేవాడు దేశద్రోహి. 'ఇవన్నీ 'కాత్యా' నాకు రాసే ఉత్తరాల్లోని సుభాషితాలు. అవన్నీ నేను శిరసావహించడానికి ప్రయత్నించి, మా ఆవిడచేత అష్టోత్తరాలూ, సహస్రనామాలూ చదివించుకున్న సంఘటనలు కోకొల్లలు.

ఏమైనా, ఏదో ఓ రోజున 'కాత్యా' దేశం గర్వించే 'మేధావి'గా కీర్తింపబడుతుందని నా ప్రగాఢ నమ్మకం. 'సైన్స్' గ్రూప్ తీసుకుంటే, తేలిగ్గా గవర్నమెంటు 'ఖర్చు'తో డాక్టరవుతావని మాస్టర్లు ఎంతచెప్పినా, ఎకనామిక్స్ తీసుకున్నానని గర్వంగా నాకు రాసింది. ఇంత పొదుపరీ నాకు ఉత్తరాలు రాసి అనవసరపు ఖర్చెందుకు చేస్తుందా అని మీరడగవచ్చు- నా సమాధానం ఒక్కటే. తను మా ఊరు వదిలివెళ్ళేముందే, వారానికో 'రిప్లై'కార్డు నేను తనకి రాయాలని 'ఒట్టు' పెట్టించుకుని మరీ వెళ్ళింది.

అందాకా ఎందుకు, ఓ 'పాత' చీరని మా ఆవిడ పనిమనిషికి ఇవ్వబోతుంటే, "పిన్నీ...ఎంత 'దుబారా' చేస్తున్నావో తెలుసా? ఈ చీరెని చక్కగా కత్తిరించి రెండు డోర్ కర్టెన్లుగా కుట్టొచ్చు. 'డోర్' కర్టెన్లు చిరిగిపోతే వాటిని సరిచేసి 'విండో' కర్టెన్లుగా మార్చొచ్చు.

ఒకవేళ అవీ చిరిగిపోతే తువ్వాళ్ళుగానో, రుమాళ్ళుగానో మార్చొచ్చు. అవీ చిరిగిపోతే ఇంట్లో పొయ్యి తుడిచే మసిగుడ్డలుగానో, లాంతర్లు తుడిచే పొడిగుడ్డలుగానో మార్చొచ్చు. అంటే ఈ చీరని మరో నాలుగేళ్ళపాటు రకరకాలుగా

వాడుకోవచ్చు. తెలుసా?" అని మా ఆవిడకి జ్ఞానోదయం కలిగించింది. పనిమనిషి తిట్టుకుంటే తిట్టుకోనీగాక! మనకేం?

అంతెందుకూ...ఓసారి 'నా ఎనిమిది మూరల 'పంచె' చిరిగితే దాన్ని రెండు 'లుంగీలుగా' రూపాంతరం చెందించి నా ధనాన్ని 'పొదుపు' చేసింది.

శకుంతలాదేవి 'లెక్క'ల్లో ఎంత మేధావో, మా కాత్యా కూడా పుట్టుకతోనే 'పొదుపులో' మేధావి అనీ, అది కేవలం ఆమె పూర్వజన్మ సుకృతఫలమనీ నేను మనసా వాచా నమ్మేవాణ్ణి. గిఫ్టుబాక్సుల్నీ, రేపర్లనీ దాచి మళ్ళీ వాడేది. వాడించేది! 'ఫ్యూజ్‌డ్' బల్బుల్ని కూడా 'అలంకరణసామాగ్రి'గా తయారుచేసేది.

'పాస్' అయిన క్లాస్‌మేట్స్ దగ్గర పాతపుస్తకాలు 'కొని' చక్కగా తనే 'బైండ్' చేసి పేద విద్యార్థులకి 'లాభానికి' అమ్మి, కానీ ఖర్చులేకుండా కొత్త పుస్తకాలు కొనుక్కునేది. 'బేటీ హోతో ఐసా!' అని నేను మురుసుకునేవాడ్ని, అఫ్‌కోర్స్... నా స్వంతకూతురు కాకపోయినా!

కాత్యా 'డిగ్రీ' విజయవంతంగా పూర్తిచేసిన శుభ సందర్భంలో 'బట్టలు' పెట్టాలని నేనూ, మా ఆవిడా వాళ్ళ ఊరెళ్ళి బట్టలకొట్టుకి తీసుకెళితే "బాబాయ్... ఎంతపెట్టి కొనాలనుకుంటున్నావో ఆ క్యాష్ నాకివ్వండి... బట్టల అవసరం ప్రస్తుతం నాకు లేదు!" అని నిర్మొహమాటంగా చెప్పి, ధనరూపంలో మా 'బహుమతి'ని అందుకుంది, 'తర్వాత ఏం చెయ్యబోతున్నావూ?" అనడిగా.

"పెళ్ళిచేసుకుంటా!" అంది. "అప్పుడేనా! ఇంకా చదవొచ్చుగా?" ఆశ్చర్యంగా అడిగా.

"ఇప్పుడు పెళ్ళిచేసుకుంటే డిగ్రీవాడు చాలు. పోస్టు గ్రాడ్యుయేషన్ చేస్తే వచ్చేవాడూ పోస్ట్‌గ్రాడ్యుయేట్ అయ్యుండాలి... అంటే, కట్నం ఎక్కువివ్వాలి. ఎలాగూ ఉద్యోగం చెయ్యమంటారు. ఆ డబ్బు వాళ్ళకెందుకూ సంపాయించి ఇవ్వడం?" అనడిగింది.

తెల్లమొహం వేశానని చెప్పక్కర్లేదుగా! ఓ నెలలోపే సుందర్రావుగారు బ్రహ్మాండమైన 'ఇంజనీరు' సంబంధం తెస్తే – చేసుకోనని మొండికేసింది. నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తే "సంబంధం గొప్పదే, కాదనను. కాని వాళ్ళు మనకంటే చాలా 'పై' స్థితిలో ఉన్నారు. అక్కడికి 'కోడలు'గా వెడితే నిమిషానికోసారి 'మన' స్థితిని హేళనచేస్తూ వాళ్ళ 'గొప్ప' ప్రదర్శిస్తారు.

అదే మనకంటే తక్కువస్థితిలో ఉన్న కుటుంబంలోంచి వరుణ్ణి తెస్తే, "మన చెయ్యే' పైనుంటుంది!" అని చక్కగా విశదీకరించింది.

ఇంకేం చెబుతాం? మొత్తానికి కాత్యా పెళ్ళి ఓ 'లెక్చరర్'తో జరపడానికి నిర్ణయించారు. పెళ్ళిచూపులరోజున అతను 'కాత్యా'తో మాట్లాడితే, తనూ అతనితో వివరంగా కొన్ని విషయాలు మాట్లాడిందిట. పెళ్ళి ఇంకో నెల ఉన్నదనగా సుందర్రావు నాకు ఫోన్‌చేసి "బ్రదర్...కాత్యాతో 'డీల్' చెయ్యడం నావల్ల కావట్లా... దయచేసి మీరిద్దరూ వచ్చి కాస్త నచ్చజెప్పండి" అన్నాడు. ఇద్దరం వాళ్ళ ఊరెళ్ళాం.

❀ ❀ ❀

"ఏంటమ్మా ఏమిటో హడావిడి చేస్తున్నావుట?" అడిగా.

"అవును బాబాయ్. ఇన్విటేషన్ కార్డుల దగ్గర తేడావొచ్చింది" అంది.

"అదేం?"

"నాన్నగారూ అమ్మా సెలక్టుచేసిన కార్డు ఒక్కొక్కటీ ఇరవై రూపాయలు. నేను వద్దన్నా."

"అదేంటమ్మా... కార్డు గ్రాండ్‌గా ఉంటే నీకే గొప్పగా! అదీ పెళ్ళి జరిగేది జీవితంలో ఒకసారేగా?" ఆశ్చర్యంగా అడిగా.

"మీ పెళ్ళికార్డు మీ దగ్గర ఉందా బాబాయ్?" అడిగింది.

"ఉహూ!"

"పోనీ మీ ఫ్రెండ్స్ అందరూ చాలా రిచ్‌పీపుల్ కదా! వాళ్ళవో, వాళ్ళపిల్లలవో పెళ్ళికార్డులు మీ దగ్గరున్నాయా?"

"ఉహూ! ఎన్నని దాస్తాం? ఎంతకాలం దాస్తాం?" అన్నా.

"నేను చెప్పేదీ అదే! కార్డు ఖరీదు వెయ్యి రూపాయలైనా ఎవరూ దాన్ని దాచుకోరు. మహా అయితే కొన్నినెలలో, సంవత్సరాలో ఉంచి చింపిపారేస్తారు. అవునా? చింపి పారేసేదానికి 'ఖరీదు' పెట్టి కొనడం ఎందుకూ? పెళ్ళికార్డు అంటే ఇన్‌ఫర్‌మేషన్ ఇచ్చే ఇన్విటేషన్. అందుకే పూర్వకాలంవాళ్ళు ఓ కార్డుమీదే ప్రింట్ చేయించి పోస్టు చేసేవాళ్ళు. నేనూ అదే చెయ్యాలనుకుంటున్నా" అంది.

నిజమేగా మరి! ఎంత గొప్పవాళ్ళ పెళ్ళికార్డయినా ఇంట్లో కలకాలం దాచుకోముగా. కాత్యాకే నేనూ ఓటువేశా, ఇంకా చెబితే మెచ్చుకున్నా. నన్నడిగితే,

పెళ్ళి చేసుకోబోయే వాళ్లందరూ ఈ విషయాన్ని గుర్తించి పాటించాలని కూడా అన్నాను. సుందర్రావు, అతని భార్యా మాతో 'ఏకీభవించక' తప్పలా.

పెళ్ళికి 'తప్పక' వచ్చేవాళ్ళకి మాత్రమే 'కార్డు' వెయ్యాలని కాత్యా మళ్ళీ పట్టుబట్టింది. "అదేం?" అని అంటే, "రానివాళ్ళ కోసం కార్డుల్ని ఎందుకు వేస్టు చెయ్యాలీ?" అంది కాత్యా. "వేస్తేగదా వస్తారో రారో తెలిసేదీ?" చికాగ్గా అంది వాళ్ళమ్మ.

"సరే. వేస్తావు. వేసిన కార్డుల్ని బట్టేగా భోజనాల ఏర్పాటు చేసేది! లిమిటెడ్ కార్డుల్ని వేస్తే భోజనాల ఏర్పాటుకి ఓ అంచనా ఉంటుంది. అలాగే కల్యాణమండపం 'బుక్' చెయ్యడానికీ ఓ అంచనా ఉంటుంది!" అంది.

"ఒక్కగానొక్క కూతురు పెళ్ళికి పిలవలేదని చుట్టాలూ పక్కాలూ 'గడ్డి' పెట్టరా?" కోపంగా అరిచాడు సుందర్రావు. "పోస్టులో వేశాంగానీ మీకు చేరి ఉండకపోవచ్చు అంటే సరిపోతుందిగా!" నవ్వింది కాత్యా.

"ఇంకేం చెయ్యాలో నువ్వే చెప్పి తగలడు!" విసుగ్గా అంది వాళ్ళమ్మ.

"సరే. భోజనాల్లో ఓ పప్పు, రెండు కూరలు, రెండు పచ్చళ్ళు, సాంబారు, ఓ ఊరగాయా, స్వీటూ, హాటూ, పెరుగూ మాత్రమే ఉండాలి"

"మరి కిళ్ళీలూ?" మా ఆవిడ అంది. ఆ ి దకి తాంబూలం వెయ్యడం అలవాటు.

"కిళ్ళీలుండవు పిన్నీ. చక్కగా ఆకులూ, వక్కపొడీ, సున్నండబ్బా సిద్ధంగా ఉంటాయి. కావలసినవాళ్ళు విశ్రాంతిగా కూర్చుని వేసుకుంటారు. అసలు పెళ్ళిళ్ళలో ఇచ్చేది ఇవ్వాల్సిందీ తాంబూలమేగానీ 'కిళ్ళీ' కాదుగా!" నవ్వింది కాత్యా.

"ఇంకా....?" అడిగా.

"టిఫిన్లకీ, భోజనాలకి విస్తళ్ళనే వాడాలి గానీ, పేపర్ రోల్స్‌నీ, పేపర్ ప్లేట్స్‌నీ, డిస్పోజబుల్ గ్లాసుల్నీ వాడటానికి నేనొప్పుకోను" అంది కాత్యా.

"ఇది మంచి ఆలోచన. పర్యావరణానికి హాని జరగదు!" నేను మనస్ఫూర్తిగా మెచ్చుకున్నా.

"అలాగే, వాళ్ళకి ఏ సందర్భాలలో మనం బట్టలు పెట్టాలో, మనకు ఏ సందర్భాలలో వాళ్ళు బట్టలు పెట్టాలో ముందే తేల్చుకుని, బట్టలబదులు 'డబ్బు' ఇచ్చి పుచ్చుకుందాం. ఎందుకంటే పెళ్ళికి వచ్చేవాళ్ళు ఎలానూ బట్టలు

పెడతారు..... అటువాళ్ళకీ, మనకీ కూడా! అన్ని ఏం చేసుకుంటాం?" ఆరిందలా అంది.

"మరి మనమూ వచ్చేవాళ్ళకి బట్టలు పెట్టాలి కదే?" వాళ్ళమ్మ అంది.

"బట్టల బదులు ఓ బహుమతిని సెలక్టుచేసి ఇద్దాం. దాంతో ఖర్చు తగ్గుతుంది. ఇచ్చినదీ 'పెళ్ళిజ్ఞాపిక'గా మిగిలిపోతుంది!" అంది కాత్యా.

అప్పుడు నాకు 'బల్బు' వెలిగింది. కాత్యా ఇవన్నీ ఆలోచించుకునే ఉన్నదనీ.... 'రెడీమేడ్' సమాధానాలు తన దగ్గర సిద్ధంగా ఉన్నాయని. చెప్పొద్దూ... పెళ్ళి చాలా బాగా జరిగింది. ఏమాత్రం ఆర్భాటమూ, వృథా లేకుండా, చాలా అనవసరపు సాంప్రదాయాలకి 'కాత్యా' చాకచక్యంగా అడ్డుకట్టవేసి, ధనాన్నీ సమయాన్నీ కూడా 'ఆదా' చేసింది.

కొంతమంది 'మూతీ ముక్కూ' విరిచినా, మిగతావాళ్ళు 'మెప్పు'తో సర్దుకున్నారు. అంతా అయ్యాక, 'భలే ఆదాచేశావమ్మాయ్! మీ నాన్న అదృష్టవంతుడు!" అన్నా.

పకపకా నవ్వి, "అసలు అదృష్టవంతురాలిని 'నేనే' బాబాయ్. నేను ఒకత్తినే గదా కూతుర్ని! ఎంత మిగిలినా నాదే కదా రేపూ!" అంది. అంతదూరం నేను ఆలోచించకపోవడంతో నాకు మాటపెగల్లా 'ఓర్నాయినోయ్... ఇదేమి బుర్ర' అని ఆశ్చర్యపోయా.

❀ ❀ ❀

కాత్యా ఉద్యోగంలో చేరానని ఉత్తరం రాసింది. అందులో, "నా జీతం విడిగా బ్యాంకులో వేసుకుంటున్నా. ఇద్దరమూ ఇద్దరి జీతాలూ ఖర్చుపెడితే రేపు 'రాబోయే' అవసరాలెలా తీరతై' అని కూడా రాసింది. ఈ ఉత్తరం మాత్రం తన 'స్వంత' ఖర్చుతోనే రాసింది.

కాత్యా భర్త కాంతారావు కూడా సమర్థుడూ, తెలివైనవాడూ. ఎందుకంటే వాళ్ళు ఎప్పుడు మా ఇంటికి వచ్చినా, 'కాత్యా భలే తెలివైనదండీ... ఫలానా పనిచేసింది' అనో, 'కాత్యాకి ముందుచూపు చాలా ఎక్కువ మావయ్యగారు..... 'ఫలానా' విధంగా ఆలోచించిమరీ అమలుచేసింది' అనో బాహాటంగా బహిరంగంగా చెప్పేవాడు.

పెళ్ళాన్ని పదిమందిలో 'పొగిడే'వాడు తప్పక సమర్థుడు, తెలివైనవాడు అని నా నమ్మకమూ, నిశ్చితాభిప్రాయమూ. అయితే ఏనాడూ కాత్యా, కాంతారావుని

'మెచ్చు'కోలేదు సరికదా, 'ఆయనకేం తెలుసూ!' అని నిష్ఠూరంగా అనేది. అయినా అతను ఆ విషయాన్ని గుర్తించనట్టే ఉండేవాడు. ఒకటిమాత్రం నిజం. ఆర్థికపరమైన 'కంట్రోల్' కాత్యానే ఉంచుకుంది.

అసలు నా దృష్టిలో మగవాళ్ళు మూడు రకాలు.

అన్ని కంట్రోల్సూ అంటే ఆర్థికపరమైన, కుటుంబపరమైన కంట్రోల్సన్నీ భార్యచేతుల్లో పెట్టేసి హాయిగా చీకూ చింతా లేకుండా బతికేవాళ్ళు ఉత్తములు.

కేవలం 'మందూ, సిగరెట్టూ' లాంటివాటికి మాత్రం 'కొంత' ధనం తన దగ్గరుంచుకుని మిగతా హక్కులన్నీ భార్యకి ట్రాన్స్‌ఫర్ చేసేవాళ్ళు మధ్యములు.

అన్నిపనులూ 'తన' నెత్తినే వేసుకుని పగలూ రాత్రీ బండచాకిరీ చేస్తూ పెళ్ళాంచేతా, పిల్లలచేతా 'మాటలు' పడేవాళ్ళు అధములు. కాంతారావు నిశ్చయంగా 'ఉత్తమ' కోవకే చెందుతాడు. అందుకే పాతికేళ్ళ వారి వైవాహిక జీవితంలో ఏ...నా...డూ... పొరపొచ్చాలు రాలేదు.

❀ ❀ ❀

సుందర్రావూ, నేనూ 'అరవైఅయిదులు' దాటితే కాత్యా కాంతారావులు 'పెళ్ళీడు' కొచ్చిన 'పిల్లల' తల్లిదండ్రులుగా రూపాంతరం చెందారు.

సుందర్రావు రిటైర్ కావడంతో మేము మళ్ళీ మా ఊళ్ళోని పక్కపక్క ఇళ్ళల్లోనే ఉన్నాం. కాత్యా కాంతారావులు వాళ్ళపిల్లలతో హైదరాబాద్‌లో ఉంటున్నారు. పిల్లలిద్దరూ 'సాఫ్ట్‌వేర్' ఇంజనీర్లు.

కాబోయే 'కోడలి' వివరాలు చెపుతూ పదిరోజుల ముందే పెళ్ళికి రావాలని 'ఫోన్' చేసింది కాత్యా.

ఇన్విటేషన్‌లు వచ్చాయి. నా కళ్ళు తిరిగాయి. ఒక్కొక్కటీ 'వంద' రూ॥ పైనే ఉంటుంది. ఫోన్ చేశా.

"కార్డు బాగుందా బాబాయ్! నేనూ, ఆయనా, టింకూగాడూ అందరం కలిసి సెలెక్టు చేశాం" అంది.

"అదికాదమ్మా...ఖరీదైన కార్డులు వద్దని నీ పెళ్ళిలో"

"ఓహ్ అదా! ఈ కార్డుఖర్చులన్నీ టింకూగాడి కాబోయే మామగారివే! మనకి పైసా కూడా ఖర్చులేదు. ఆ కండీషన్ మీదే పెళ్ళికి మేం అంగీకరించాం!" అంది.

"అంగీకరించడం అంటే?' అయోమయంగా అన్నాను.

"అసలు విషయం ముందు నీకే చెబుతున్నా. పిల్ల చాలా బాగుంటుంది. మనకంటే 'కాస్త' తక్కువ కులం. అయితేనేం, మహామర్యాదస్తులు. పిల్లకూడా ఒక్కతే! ఇహ అభ్యంతరం చెప్పడానికి ఏముందీ? అదీగాక మన 'టింకూ'గాడు ఆ అమ్మాయిని తప్ప వేరే అమ్మాయిని చేసుకోనని మొండికేశాడు.

"లవ్ ఈజ్ గాడ్" అంటారు గదా! అందుకే పెళ్ళికి ఒప్పుకున్నాం. ఈ విషయం నువ్వే మా నాన్నకి చెప్పు!" అని ఫోన్ పెట్టేసింది కాత్యా.

ఇక చెప్పటానికేవుందీ! అందరం పెళ్ళికి వెళ్ళాం. బ్రహ్మాండమైన కల్యాణ మండపం. దాని 'అలంకరణకే' కనీసం ఓ పదిలక్షలు ఖర్చు అయుంటాయి. యూనిఫామ్‌లో బేండుమేళాలు... సన్నాయిమేళాలు.

పెళ్ళి రాత్రి 10గం॥కు అవటంతో 'డిన్నర్' ముందే ఏర్పాటుచేశారు. ఎన్ని కౌంటర్లో! చైనీస్ ఒకవైపు.... నార్త్ ఇండియన్ ఒకవైపు, సౌత్ ఇండియన్ ఓవైపు.... కేవలం టిఫిన్స్ ఓవైపు - ఫ్రూట్‌జ్యూస్‌లూ స్టార్టర్సూ ఓవైపు... ఐస్‌క్రీమ్సూ డిజర్టర్సూ ఓవైపు... పిచ్చెక్కింది.

జనాలకి లెక్కలేదు. అమ్మాయీ అబ్బాయీ ఇద్దరూ 'సాఫ్ట్‌వేర్' వాళ్ళు గనక రెండు కుటుంబాల చుట్టాలూ పక్కాలూ స్నేహితులూ సపరివారసమేతంగా వచ్చారు.

"ఎలా ఉన్నై బాబాయ్ పెళ్ళి ఏర్పాట్లు?" గర్వంగా అడిగింది కాత్యా. "ఇంత ఆడంబరం నీకు ఇష్టం ఉండదుగదమ్మా!" అన్నా. "ఖర్చంతా వాళ్ళదే బాబాయ్!" చిద్విలాసంగా అంది కాత్యా.

ఆ 'రేంజ్'లోనే పెళ్ళి జరిగింది. వచ్చినవాళ్ళూ ఆ 'రేంజ్'లోనే బహుమతు లిచ్చారు. అన్నిట్నీ నిర్మొహమాటంగా 'తనపరం' చేసుకుంది కాత్యాయిని.

నా గొంతులో 'వెలక్కాయ'లాంటిదేదో పడ్డట్టు అనిపించింది. ఐనా అడగటానికో సందేహాలు తీర్చుకోటానికో సమయం కాదనిపించి 'బహుమతి'ని చదివించా. పెళ్ళి జరిగిన మూడునెలల తర్వాత శ్రీ & శ్రీమతి టింకూ 'లుఫ్తాంసా'లో అమెరికాకి ఎగిరిపోయారు.

"బ్రదర్...కాత్యా నా కూతురే! కానీ నాకు ఎప్పటికీ అర్థంకాదు" అని మాత్రం సుందర్రావు అన్నాడు.

నాకు మాత్రం ఏం అర్థమైంది గనకా? సంవత్సరం తరువాత 'కాత్యా' మళ్ళీ నాకు ఫోన్ చేసింది.

"బాబాయ్.... అమ్మాయి పెళ్ళి రిజిస్ట్రార్ ఆఫీసులో జరిగిపోయింది. ఈమాట నాన్నకీ, అమ్మకీ నువ్వే చెప్పాలి" అంది. "అదేంటమ్మా?" అన్నాను.

"అంతే బాబాయ్! ఈ తరం పిల్లలు మనమాట వినేటట్టుగా ఉన్నారా? అది ప్రేమించానంది. 'సరే' అన్నాం. ఇంతకంటే ఘనంగా 'ఎలా' చెయ్యగలం?" అంటూ నిట్టూర్చింది కాత్యా.

"అదెలాగమ్మా? కుర్రాడిదీ లవ్‌మేరేజీనేగా? వాళ్ళంత ఘనంగా చేసినప్పుడు మీరూ ఘనంగానే పదిమందినీ పిలిచి చెయ్యొచ్చుగా?" అన్నాను.

"వాడు ప్రేమించిన పిల్ల 'మనకులం' కంటే 'కాస్త' తక్కువది. ఇది ప్రేమించిన వాడు 'మన కులం' కంటే ఎక్కువవాడు. పదిమందికి చెప్పి చేస్తే 'మనం' తక్కువై పోమూ! అందుకే రిజిస్ట్రార్ ఆఫీసులో దండలు మార్పించాం!" అంది కాత్యా.

"జీవితంలో పెళ్ళంటూ జరిగేది ఒకేసారికదమ్మా... పోనీ ఇప్పుడు రిసెప్షన్‌లాంటి దన్నా ఇవ్వొచ్చుగా!" అన్నాను.

"ఎందుకు బాబాయ్... ఖర్చుదండగ. మనం అవునన్నా కాదన్నా వాళ్ళు పెళ్ళిచేసుకో వటానికి సిద్ధపడ్డారు. ఆపాలనుకున్నా వాళ్ళు ఆగరు. అందుకే కానిచ్చేశా" అంది.

"కానీ...!"

"నువ్వు చెప్పబోయేది నాకు తెలుసు బాబాయ్. నాన్నా అమ్మా బాధపడతారు. అంతేగా? మీ కాలం వేరూ... మా కాలం వేరూ – నా పిల్లల కాలం వేరూ! కాలానికి తగినట్టు నడుచుకుంటేనే 'జీవితం' బాగుండి మంచిగా గడుస్తుంది. అవునా?" అంది.

ఇంకేం చెప్పనూ?

అన్నట్టు కాత్యా కూతురు 'పింకీ' ప్రేమించిన పిల్లాడికి ఇద్దరు తమ్ముళ్ళూ, ఓ చెల్లెలూ ఉన్నారట. అంతగా కలిగినవాళ్ళు కారట.

ఇంతకీ అసలు 'కాత్యా' తీసుకున్న నిర్ణయాలని ఏ విధంగా తీసుకోవాలీ? చెప్పొద్దూ... ఆ విషయంలో ఇప్పటికీ నేను ఆలోచిస్తూనే వున్నా!

– స్వాతి 10-08-2012

# మీరైనా చెబుతారా

"అసలే గొర్రెతోక బెత్తెడు! దాన్ని 'బారెడు' చైమంటే ఎలా?" కోపంగానే అడిగాను. "సవరం పెడ్తేసరి!" అంటూ నవ్వింది శ్రీమతి మంగతాయారు. అంటే నా భార్య.

"గొర్రెకి సవరం పెడతావు సరే! గొర్రె తోకంత ఉన్న నా జీతానికి ఏం సవరం పెడతావూ?" అని కోపంగా కాస్త చికాకునీ మేళవించా.

"అప్పు అనే తోకని తగిలించు మహానుభావా!" మళ్ళీ నవ్వింది.

'అప్పు'ంటే నాకు చచ్చేంత భయం. ఒకసారి దాన్లో కూరుకుపోతే చచ్చేదాకా చచ్చినట్టు చస్తూచస్తూ బతకాలి. ఆ మాటే ఆవిడతో అన్నాను. "హు! సాక్షాత్తు ఏడుకొండలవాడే కుబేరుణ్ణి అప్పడగంగా లేనిది బోడిగుమాస్తావి. నువ్వు అప్పడిగితే తప్పేంటిట?" అని నా యావత్తు ఆర్గ్యుమెంటునీ కొట్టిపారేసిందా కిలాడీ.

తప్పేముందీ? ఒకేసారి కలిసికట్టుగా మూడు గండాలొచ్చిపడ్డాయి. ఒకటి 'కిలాడీ'గారి చెల్లెలు 'పకోడి' గారి కొడుకు 'చకోడి' పుట్టిన్రోజు. రెండు: నా ప్రాణస్నేహితుడి కొడుకు పెళ్ళి. మూడు: మా నాన్నగారి ఆబ్దికం. అదీ అరవదేశంలో పెట్టాలి! రెండూ, మూడూ తప్పించుకోలేనివి.

ఒకటోదాన్ని ఎలాగొలా తప్పిద్దామని ప్రయత్నిస్తే ఈవిడ చెట్టెక్కి కూచుంటుంది.

ఏంచైటం? ఈ మూడు కారణాలకీ ఏ బేంకూ అప్పివ్వదుగాక అప్పివ్వదు.

ఏ ప్రభుత్వమూ 'సబ్సిడీ' ఇవ్వదు. ఈ 'కారణాలు' చెప్పి ఎవడి కాళ్ళు పట్టుకున్నా 'పని' జరగదు.

'అబద్ధం' శరణం గచ్ఛామి' ఒకటేమిగిలింది. మూడు రోజులు 'తిరిగి తిరిగి' మూడువేలు సాధించా.

❁ ❁ ❁

మా 'పకోడి' గారి ఇల్లు మహాసందడిగా ఉంది. రంగురంగుల దీపాలూ, 'తాషామర్ఫా'లతో మోగిపోతోంది. ఇంటిముందరా, వీధిలోనూ ఎక్కడ చూసినా కార్లూ మోటర్ సైకిళ్ళే.

మేం 'టేక్సీ'లో దిగాం. అక్కడికీ చిలక్కి చెప్పినట్టు చెప్పాను నా టివిఎస్‌లో పోదామని. వింటేనా?

"అదో బండా? దానికంటే ఎలుకనో, పిల్లినో ఎక్కిపోవటం సుఖం. అయినా మా చెల్లెలు ఎవరనుకుంటున్నారు? బేంకు మేనేజర్‌గారి భార్య. ఆ 'ముండా' మోపెడ్‌లో దిగితే ఎంత నామోషీ?" ఖయ్యిమని అరిచింది. టేక్సీకి నూటయాభై 'చది'వించా.

"రండి రండి! రండి అక్కా రండి....!" మొహం 'ఇంత' పెద్దది చేసుకుని నవ్వుతూ అంది పకోడీగారు. "వచ్చేశానే లల్లీ (అసలు పేరు అదే)!" చెల్లెలి చేతులు పట్టుకుని ఊపుతూ అంది కిలాడీ.

"హల్లో బాగున్నారా?" నన్ను పలకరించాడు పకోడీ గారి భర్త. ఆయన కొత్త సూటూబూటుతో చాలా హుషారుగా ఉన్నాడు. "హి హ్హి" పళ్ళికిలించా, పబ్లిక్ రిలేషన్సులో నేనుమాత్రం చాలా 'పూర్'.

"స్టైలుగా హలో అనక ఆ ఇకిలింపు ఎందుకూ? అసలే మన మొహం పనసకాయలా ఉంటుంది. దానికితోడు ఆ చండాలపు ఇకిలింపు!" క్లాసు పీకింది కిలాడీ.

అయ్యో.... పెళ్ళవంగానే ఆడది స్వాతంత్ర్యం కోల్పోతుందన్నవాళ్ళని నిలువునా చీరెయ్యాలి. స్వాతంత్రాన్ని కోల్పోయేది మగవాళ్ళే.

పెళ్ళయిన క్షణంనించీ ఎట్టా నవ్వాలో, ఎట్టా నడవాలో, ఎట్టా తినాలో, ఎట్టా మాట్లాడాలో, ఆఖరికి ఎట్టా ఏడవాలో కూడా చెప్పేది పెళ్ళాలే కదా!

వాళ్ళు టీచర్లు మనం ఎల్‌కేజీగాళ్ళం.

వాళ్ళు మనని సరిదిద్దుతునే వుంటారు. మనం 'రుద్ద'బడుతూనే వుంటాం. వాళ్ళు 'బాసు'లూ మనం మాత్రం కేవలం 'సేవకులం'

మొత్తానికి ఓ మూల 'జాగా' చూసుకుని కూర్చున్నా. కుర్చీలూ, టేబుళ్ళూ 'ఘనంగా' వరుసల్లో మెరుస్తున్నై. రకరకాల చీరలూ, పేంట్లూ, జీన్స్‌లూ, చుడీదార్లూ హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్నై.

ఓ పే...ద్ద టేబుల్ మీద పే...ద్ద... కేకు. 'కొయ్యటం' కోసం రిబ్బను చుట్టిన ఒక 'వెండి' నైఫ్ కూడా సిద్ధంగా ఉంది. కేకుమీద నాలుగు కొవ్వొత్తులు.

నా చిన్నతనంలో నా పుట్టినరోజు వస్తే 'ఘనంగా' మా అమ్మా నాన్నా నా కోసం 'ఆయుష్ హోమం' చేయించారు.

పేదవాళ్ళకి పంచెలూ, చీరలూ పంచారు. మా మాష్టారికి బట్టలు పెట్టి, మా బళ్ళో ఉన్న పిల్లలందరికీ లడ్డూలూ కారప్పూస పంచిపెట్టారు. కొంచెం పెద్దయ్యాక మా అమ్మా నాన్నా గుడికి తీసికెళ్ళి పూలూ, పళ్ళు, కొబ్బరికాయా పూజారికిచ్చి పూజలు చేయించేవాళ్ళు.

అంతకుముందు మా వీధిలోని ముత్తయిదువుల్ని పిల్చి, నా తలకి నూనె పెట్టించి, కుంకుడుకాయ రసంతో తలంటిపోసి, కొత్తబట్టలు తొడిగించి, ఇంట్లో పూజచేశాక గుడికి తీసికెళ్ళేవారు. ఆ రోజు పాలేళ్ళకి భోజనం మా ఇంట్లోనే. రజకుడూ, క్షురకుడూ కూడా సపరివారంగా మా ఇంట్లోనే భోజనం చేసేవారు.

అదో ' పండగ'లాగా జరిగేది. అందుకే మరి 'పుట్టిన రోజు పండగ' అనేవాళ్ళేమో!

'పకోడీ'గారూ, వాళ్ళాయనా ఇద్దరూ బ్యూటీపార్లర్‌కి వెళ్ళొచ్చారేమో, ధగధగ లాడుతున్నారు.

ఇక 'చిట్టి చెకోడీ' గాడి వైభవం చెప్పక్కర్లా. వాడికో 'రాజస్తానీ' డ్రెస్సు వేశారు. తలమీద 'రెడీమేడ్' మహారాజా 'పాగా'! ఠంచనుగా ఏడింటికి ఎవరో 'సిస్టమ్' ఆన్ చేశారు. 'ధమాల్ ధమాల్' అంటూ భీకరశబ్దాలు. 'గజ స్పీకర్ల' లోంచి కర్ణకఠోరంగా వినిపించాయి.

ఉలిక్కిపడ్డా. కాస్త హార్ట్ వీక్‌నెస్ వాళ్ళెవరన్నా ఉంటే ఆ శబ్దానికి గుండె 'ఆగి' పుణ్యలోకాలకి 'తరలి'పోయేవాళ్ళు. ఆ 'జింబూంబా' శబ్దాలహోరులో అర్థంపర్థం తెలీని ఓ పాట. ఏ భాషో కూడా తెలియలేదు.

చీరలూ, మిడ్డీలూ రెపరెపలాడాయి. జీన్సులూ, చుడీదార్లూ నృత్యాలు మొదలెట్టాయి.

ఓ స్పాట్‌లైట్ వెలిగి ఓ మూలని 'స్వాచ్'చేసింది.

"హెల్లో" అంటూ 'అయిదంకెల్లో' వసూలుచేసే ఓ టీవీ యాంకరు 'కెవ్వున' అరిచింది.

ఓ రెండు మూడు కుర్చీలు (ఖాళీవే) గాల్లోకి ఎగిరి మళ్ళీ కిందపడ్డాయని నా అనుమానం.

ఎవరో పుణ్యాత్ముడు 'సిస్టమ్' నోరు నొక్కాడు.

"హెలో ఫ్రెండ్స్...గుడ్....ఈ...వ్...నింగ్!' మళ్ళీ అరిచింది యాంకర్. ఆవిడ అరుపుకంటే 'సిస్టమ్' డబడబలే బెటరనిపించాయి. ఆ మాట మా ఆవిడ ఒప్పుకోదని నాకు తెలుసు.

"ఇవాళ మన బుచ్చి బుచ్చి బుల్లి బుల్లి 'సుబాస్' బాబు (వత్తు మింగేసింది) పుటినరోజు. (పుట్టుకతోటే వత్తుల్ని మింగటం అలవాటనుకుంటా) లెట్స్... సెలిబ్రేట్'" అనరిచేసరికి రెండు మూడు బల్బులు ఫటాల్న పేలిపోయాయి.

'ఎనర్జీ ఆఫ్ సౌండ్' అంటే ఏమిటో నాకు తెలిసొచ్చింది. 'చూపు'తో చంపటమే కాదు... వెరైటీగా 'కేక' తోటీ చంపొచ్చని అర్థమైంది.

'ఇట్స్ టైమ్ నౌ' అంటూ యాంకర్ మళ్ళీ చాలా గా....ఠిగా అరిచింది. జనాలు కేకు వున్న టేబుల్ చుట్టూ చేరారు. పకోడిగారూ, పకోడీగారి భర్తా చిరునవ్వులు చిందిస్తూ ఆ నాలుగు కొవ్వొత్తులూ వెలిగించారు. చుట్టూతా ఉన్నవాళ్ళు కరతాళధ్వనులు చేశారు.

'బట్ వై దిస్?' అని గొణుక్కున్నా. ఏ టెన్సింగో ఎవరెస్ట్ ఎక్కినందుకు చప్పట్లు చరచవచ్చు. ఏ మిల్కాసింగో వేగంగా పరిగెత్తినందుకు చప్పట్లు చరవొచ్చు. కేవలం కొవ్వొత్తులు వెలిగించినందుకు చప్పట్లా? ఈ మాటే మా ఆవిడతో అంటే, "యూ బిలాంగ్ టూ బీ.సీ" అని ఇంగ్లీషులో ఈసడించింది.

"ఊదమ్మా!" ముద్దుగా పకోడీ, చకోడీని బతిమలాడింది. వాడో పది నిముషాలు 'మారాం'చేసి తల్లిదండ్రులతో 'గారాం' చేయించుకుని నోటినిండా గాలిపీల్చి ఒక్క ఊదు ఊదాడు.

నాలుగూ ఠక్కున ఆరిపోయాయి. ఐతే అవి గాలికి ఆరాయా లేక వాడి నోట్లో వర్షంలా కురిసిన 'జల్లు'కు ఆరాయా దేవుడికీ, కొవ్వొత్తులకే తెలియాలి.

అసలు దీపాలు వెలిగించడం ఎందుకూ? ఆర్పడం ఎందుకూ? పుట్టినరోజున దీపాలు వెలిగిస్తాం గానీ ఆర్పకూడదు గదా! లేక, 'ఒరే బాబూ... నీ ఇంటిదీపాన్ని వెలిగించాలంటే వందిళ్ళ దీపాల్ని ఆర్పినా పర్లేదు!' అని ఇండైరెక్ట్‌గా చెప్పడమా?

ఆ తరువాత వాడికి వీడూ, వీడికి వాళ్ళూ, ఒకళ్ళకొకళ్ళు ఆ ఎంగిలికేకులు ఆనందంగా ఆరగించడం చూసి నా ఒళ్ళు గగుర్పొడిచింది.

అన్నట్టు ఆ మధ్యలో కేక్ కోసినప్పుడు రకరకాల అపశృతులతో "హ్యాపి బర్త్‌డే టూ యూ" అని పాటపాడారు. ఆ పాట రాసిందెవరో తెలీదుగాని మహా తెలివయినవాడు. ఒక్క 'పేరు' మారిస్తే ఎలక్కీ పిల్లికీ కూడా ఆ గీతం వర్తిస్తుంది.

పిల్లాజెల్లా, పెద్దా చిన్నా, కుక్కా కోడీ అన్నింటికీ వర్తించేలా రాయడం అంటే మాటలా! ఆ తరువాత 'గిఫ్ట్' కార్యక్రమం మొదలయింది. నా ముక్కుమీద 'గుద్ది' మరీ మా ఆవిడ వెయ్యివిచ్చురూపాయలు 'చకోడీ'గారి పుట్టినరోజుకని లాక్కుంది.

ఏం కొన్నదో కూడా 'సరస్వతి' సాక్షిగా నాకు మాత్రం తెలీదు. కానీ చదివించాం... సంయుక్తంగా.

ఆ 'అక్షతలు' ఉంటయ్యేమో ఆశీర్వాదం ఇద్దాం అని చూశాగానీ, అవేమీ కనపళ్ళా. మధ్యలో 'యాంకరి' అరుపులూ, హడావిడి!

చుట్టూచూస్తే 'పకోడీ'గారి అత్తగారూ, మావగారూ, నేనూ ముగ్గురం శుద్ధబుద్ధావతారాల్లా బిక్కుబిక్కుమంటూ నిలుచుని వున్నాం. ఆ తరువాత 'డిన్నరు!'

ఒక్క 'తెలుగు' వంటకం లేదు. అన్నీ చైనీసువీ, పంజాబీవీ, మళయాళంవీ, మాయాబజారువి.

ఆహూతులందరూ లొట్టలేసుకుని ఆరగిస్తే, మేం ముగ్గురం 'కర్డ్‌రైస్' అనబడే పెరుగన్నంతో సరిపెట్టుకున్నాం. ఓ గండం గడిచింది. ఫంక్షన్ అవగానే వాళ్ళూ మాకు ఒక 'సంచీ' బహుమతిగా ఇచ్చారు. దాంట్లో ఓ యాభై గ్రాముల మిక్చరు పేకెట్టూ, ఓ బెంగాలీ స్వీటూ, పచ్చిగా ఉన్న ఓ బత్తాయి 'కాయా' ఉన్నై.

"కనీసం తాంబూలమన్నా ఇవ్వరుటే!" ఇంటికి వచ్చాక అన్నా.

"తాంబూలం ఎందుకూ 'పాన్‌బీడా' ఇచ్చారుగా!" అంది.

'సాయంకాలం మర్చిపోవద్దు!' నా ప్రాణస్నేహితుడు' ఎస్ఎమ్ఎస్ పంపాడు.

“పెళ్ళిరేపుగా?’ అయోమయంగా అన్నాను మా ఆవిడతో.

“ఏమో! వెళ్ళొస్తే పోలా!” అంది ఆవిడ.

“ఇవ్వాళ రిసెప్షన్” అనీ అంది. ఈసారి మాత్రం ‘టేక్సీ’ కోసం ఆవిడ పట్టుబట్టలేదు. ‘గిఫ్టు’ నేనే కొంటానని నేనన్నా, “మీ సెలక్షన్ ఏడిచినట్టే ఉంటుంది!” అని ఆవిడే కొని, చక్కగా ‘ప్యాక్’ చేయించి తెచ్చింది.

“ఏం కొన్నావే?” అనడిగినా ఏమీ మాట్లాడలా. నేను రెట్టిస్తే, “వెయ్యి రూపాయల విలువైంది!” అంది అంతే. ఆటోకి ‘అరవై’ చదివించుకుని, మఫత్‌లాల్ (సన్స్) పోపట్‌లాల్ (సన్స్) ఇందూలాల్ చిచోడియా కల్యాణమండపం ముందర దిగాం. వందలకొద్దీ కార్లు.

‘డెకరేషన్’కే ముదున్నర లక్షలు అయిందిట!

‘ప్రాణస్నేహితుడు’ ప్రస్తుతం మల్టీప్లెక్స్ ఓనర్ ఎండ్ ఎమ్మెల్యే. హంగూ ఆర్భాటం ‘విచ్చలవిడిగా’ ఉన్నాయి. ఓ పక్క ‘స్పీకర్ల’ జోరూ, మరోపక్క ముగ్గురు ‘టీవీ’ యాంకర్ల జోరూ. ఒక్కరి అరుపులూ విన్యాసాలూ భరించడమే కష్టం. ముగ్గురైతే...? ఆల్రెడీ మేం ‘లేటు’ అని లోపలికి వెళ్ళగానే తెలిసింది.

‘పెళ్ళికొడుకూ, పెళ్ళికూతురూ’ చిలకా గోరింకల్లా నిలబడి సరసాలాడు కుంటున్నారు. ‘రిసెప్షన్’కి వచ్చినవాళ్ళు ‘క్యూ’లో నిలబడి తమవంతు రాగానే ‘గిఫ్ట్’ ఇచ్చేసి, వాళ్ళపక్కన నిలబడి ఒక ఫోటో తీయించుకుని, ‘వీడియో’లో చిత్రింపబడి కిందకి దిగుతున్నారు.

ఆ తరువాత వాళ్ళే ‘భోజనశాల’కి వెళ్ళి అంతో ఇంతో తినేసి మెల్లగా జారుకుంటున్నారు. మధ్యలో మినిస్టర్లూ, మిగతా ఎమ్మెల్యేలూ వస్తే ‘క్యూ’ బంద్. వాళ్ళ ‘విఐపి, ప్రత్యేక, స్పెషల్, బ్రేక్ దర్శనాలు అయ్యేదాకా(సారీ, ఫొటోలు, వీడియోలు అయ్యేదాకా) జనరల్ ‘క్యూ’లో వాళ్ళు నిరీక్షించాల్సిందే.

దూరంనించి నా ‘ప్రాణస్నేహితుడు’ నన్ను గుర్తించి చెయ్యాడించాడే గానీ స్టేజీ దిగే ప్రయత్నం చెయ్యలా. మేమూ ‘గిఫ్ట్’ ఇచ్చి దిగబోతుంటే, “రేపు పెళ్ళికి రావాలోయ్ మరిచిపోకు!ఆ!” అనిమాత్రం అన్నాడు.

ఇహ పెళ్ళికెందుకూ? చక్కగా ‘వధూవరుల్లా’ ఉండాల్సిన వాళ్ళేమో యూరోపియన్ సూటూ, గుజరాతీ చీరకట్టుతో ఉన్నారు. రేపు జరగబోయే పెళ్ళిలో ఏముంటుందీ?

'తెర' తీసేదాకా నేను మా ఆవిడ 'మొహం' ఎరుగను. వీళ్ళేమో ఇప్పుడే సరసాలాడుతున్నారు.

అప్పుడేమో ఆకాశమంత పందిరి, భూదేవంత పీటావేసి, గాడిపొయ్యిలో 'కమ్మని' తెలుగువంటలు చేయించి, బాజా భజంత్రీలూ, పురోహితులు వేదమంత్రాలతో పెళ్ళిచేయించి, పెద్దవాళ్ళకి మొక్కించి, అక్షతలు వేయిస్తే, ఇప్పుడు కేటరింగ్ ఫుడ్డూ యాంకరు మంత్రాలతో పెళ్ళికానిస్తున్నారు.

పెళ్ళిళ్ళన్నీ కూడా మండపాల్లోనే జరిగేవి.

పదహారురోజుల పండగ అయ్యేదాకా 'పందిరి' విప్పేవారు కాదు. ఇప్పుడేమో షామియానాలూ, పేపరుప్లేట్లూ, ప్లాస్టిక్ గ్లాసులూ. ఇంకేంవుందీ చూడ్డానికీ?

గజ్జలపట్టీలూ, పసుపూ పారాణీలూ మోటు! మెహందీలు మేకప్ నిగనిగలూ నీటు.. లంగాఓణీలూ కన్నెల వాలుచూపులూ మోటు! చుడీదార్లూ గాగుల్సూ సెల్‌ఫోన్లూ నీటు. ఇహ వంటలసంగతి వద్దేవద్దు మహాప్రభో! అన్నీ ఒకటే రంగూ, రుచీ, వాసనా. మరో 'వెయ్యి' వదిలించి రెండో 'గండం' గడిచింది.

❀ ❀ ❀

మూడోది 'గండం' అని చెప్పకూడదుగానీ, గండం అమ్మాబాబై కూర్చుంది. శ్రద్ధగా పెట్టేది శ్రాద్ధం. పద్ధతిగా పెట్టేవాళ్ళూ, పెట్టించేవాళ్ళూ కూడా 'కరువై' పోయారు. అప్పుడైతే అంటే ఓ పదిహేనేళ్ళ క్రితం 'భోక్తలు' ఒకరోజు ముందరే వచ్చేవారు.

ఆ రాత్రి వారు ఫలహారంతో సరిపెట్టుకోవాలి. తెల్లవారుజామున మా అమ్మ 'మడి' కట్టుకుని వంటలన్నీ చేస్తుంటే, నేను 'పురోహితుడి' సూచనలతో సర్వం సిద్ధం చేసేవాడ్ని. పైపనులకి మా ఆవిడ ఉండేది.

ఇప్పుడు పురోహితులవారు ఓ 'టైమ్' చెప్తారు. భోక్తలూ, వంటావిడా కూడా ఆయన సూచించినవాళ్ళే అయ్యుండాలి. లేకపోతే ఆయన 'చిటపటలు' భరించలేము. భోక్తలు రాగానే కాఫీలు (వాళ్ళు పొద్దున్నే టిఫిన్ తినేసివచ్చారని తెలిసినా మనం నోరెత్తకూడదు)

మూడుగంటలు పట్టే కార్యక్రమం మా పురోహితులవారు కేవలం అరగంటలో ముగించి, మరో కార్యక్రమానికి వెళ్ళిపోతారు. సరే... ఆ రోజు వచ్చింది.

పన్నెండైనా బ్రాహ్మడూ భోక్తలూ అంతులేరు.

వంటావిడ వచ్చి కాఫీ తాగి కూచుంది. కానీ కూరగాయలవైపు ఒక్కచూపు కూడా చూడలేదు.

"కూరలు తరగాలిగదమ్మా!" వీలున్నంత నెమ్మదిగా అణకువగా అడిగింది మా మంగతాయారు.

"అది మీరే తరగాలి మేడమ్. నేను కేవలం వండి వారుస్తా. కూరలు కూడా తరగాలంటే ఇంకో ఫైవ్‌హండ్రెడ్ ఎక్స్‌ట్రా అవుతుంది!" చాలా ప్రొఫెషనల్‌గా చెప్పిందావిడ. "నేనే తరుగుతాన్లెండి!" అప్పటికే మడికట్టుకున్న మా ఆవిడ 'రంగం'లోకి దిగింది.

"బాత్‌రూమ్ చూపించండి. స్నానం చేస్తా.... అన్నట్టు కొత్త సబ్బు కావాలి!" వంటావిడ ఉవాచ. తప్పుతుందా? భోక్తలొచ్చారు. రాగానే మా ఆవిడ కాఫీ కలిపి ఇచ్చింది. మరో పావుగంటకి అటు బండిమీదనించి పురోహితులవారు దిగితే, ఇటు బాత్రూమ్‌లోంచి గోచిపోసి కట్టుకున్న చీరలో వంటావిడ వచ్చింది.

"ఏవండి బాగున్నారా! వంటలు అదిరిపోవాలి! వీరు మాకు బాగా కావల్సినవారు" ఓ స్మైల్ అటూ ఓ చూపు ఇటూ విసిరి అన్నారు పురోహితులవారు.

వయసులో కాస్త కుర్రవాడు.

"అలా అంటారుగానీ, ఈ మధ్య నామీద శీతకన్నేశారు? ఎన్నాళ్ళయిందీ నన్ను పనికి పిలిచీ!" గారంగా అంది వంటావిడ. ఇందాకటి 'టోన్'కీ, ఇప్పటి 'ముద్దు' మాటకీ అసలు సాపత్యమే లేదు.

"ఇప్పుడు పిలిచాగా... అలకెందుకూ?"

మరో బ్రాడ్ స్మైల్ ఇచ్చి – "అన్నీ రెడీయా?" అని నన్నడిగారు పురోహిత్. "సిద్ధమేనండీ!" తలాడించా. కార్యక్రమం మొదలయింది.

మధ్య మధ్య 'సెల్‌ఫోన్ల'తో మంత్రాలు ఆగుతున్నాయి. భోక్తలూ పురోహితుడు, పురోహితుడూ వంటావిడా, వంటావిడా భోక్తలూ విడివిడిగా మూకుమ్మడిగా 'దూకుడు', బిజినెస్‌మేన్', 'కొలవరి' మొదలైన ముఖ్య విషయాలు మాట్లాడుకుంటూ అతిపవిత్రమైన 'పిండాలు' పెట్టించారు. ఆ తరువాత 'వాయన' పిండం. చెట్లు ఉంటేగా కాకులు వాలడానికీ, రావడానికీ!

'కాకా...కాకా...' అంటూ నేనూ, మా ఆవిడా గొంతు ఎండిపోయేట్టు అరిచినా 'కాకి' జాడమాత్రం లేదు. మరో పావుగంట అరిచాక పాపం ఓ

ముసలికాకి 'వాయనపిండం' వాసన చూడటం, మేము మైలు పొడుగున నిట్టూర్చడం జరిగింది.

"అయ్యా... చూశారూ! మనం శ్రాద్ధం పెట్టించడమూ 'కాకి'రాక పోవడమూనా? ఆ సుబ్బయ్య శాస్త్రో మిగతావాళ్ళో పెడితే వస్తాయా? పురోహితుడన్నాక హృదయశుద్ధీ, వాక్శుద్ధీ ఉండాలండీ!" గర్వంగా వంటావిడ్ని చూస్తూ నాతో అన్నారు పురోహితులవారు.

"అవునవును! మీకున్న శ్రద్ధా వాక్శుద్ధీ ఆ సుబ్బయ్యకీ, మిగతావాళ్ళకీ ఎలా వస్తాయీ?" మెప్పుదలగా పురోహితులవారికో 'లుక్' ఇచ్చింది వంటావిడ.

'సంభావనలు' ఇచ్చి పంపించా.

మనసంతా డొల్లయిపోయింది.

"ఎందుకూ ఏడుపుమొహం పెట్టావూ?" చిన్నగా నవ్వింది మా ఆవిడ.

"ఇవాళ మనింట్లో జరిగింది శ్రాద్ధమా సినిమా రివ్యూనా?" దీనంగా అడిగా.

"కొంచెం శ్రాద్ధం, ఎక్కువ సినిమా రివ్యూ, మరింతగా ఒంపుసొంపుల ప్రదర్శన. అంటే కేట్‌వాక్ అన్నమాట!" చిద్విలాసంగా అంది మంగతాయారు.

"పోన్లే! కాకి అన్నా వచ్చింది!" నన్ను నేను ఓదార్చుకున్నాను.

"ఓరి నీ ఆనందం పాడుగానూ. ఆ వచ్చిన కాకి వాసన మాత్రమే చూసి ఎగిరిపోయింది. ఏడుస్తావని నేనే ఆ పిండాన్ని మాయం చేసి నూతిలో పడేశా!"

"ఆ!" ఆశ్చర్యంగా అన్నా.

"ఆశ్చర్యంగా ఎందుకూ? ఆ మాధురీదీక్షిత్ వంటని కాకి కాదుగదా చీమలు కూడా ముట్టవు! చక్కగా కళ్ళుమూసుకుని మామగార్ని తలుచుకుని ఓ దండం పెట్టుకో అది చాలు. ఎందుకీ శ్రద్ధలేని శ్రాద్ధాలు!" తేల్చేసింది శ్రీమతి మంగతాయారుగారు.

వచ్చేనెల్లో మా అమ్మగారి తద్దినం ఉంది. ఏం చెయ్యాలీ? మీరేమైనా చెప్తారా?

పి.యస్: ఇది ఎవర్నీ 'బాధ'పెట్టాలని రాసింది కాదు. 'బాధ'పడుతూ రాసింది. బై ఛాన్స్ ఎవరికన్నా 'బాధ' కల్గితే మాత్రం క్షంతవ్యుడ్ని.

– స్వాతి 23-11-2015

# పెళ్ళి

"మొగలిపువ్వులాంటి మొగుడ్నివ్వవే...." పాడుతోంది పార్వతి. "ఏం? గులాబీపువ్వు లాంటివాడొద్దా?" నవ్వుతూ అడిగాడు శివుడు.

"ఊహు! మొగుడంటే కాస్త చురుగ్గా - కాస్త కరుగ్గా, కాస్త గంభీరంగా, అప్పుడప్పుడూ నవ్వుతూ ఉండాలి గానీ, నీలాగా ఇరవై నాలుగ్గంటలూ పళ్ళికిలించేవాడిలా ఉండకూడదు. ఐనా ఏడుమల్లెపూల ఎత్తువాడివి నువ్వెందుకు నాకూ?" దీర్ఘం తీస్తూ లోపలికిపోయింది పార్వతి.

ముద్దుగా....బొద్దుగా.....నడిచే బంతిపూల రథంలా ఉంటుంది పార్వతి. పొడుగ్గా, సన్నగా, కోమలంగా ఉంటాడు శివుడు.'శివుడు తెలుపులో కలిపిన ఎరుపైతే, పార్వతి చామనఛాయతో ఉండే చక్కని చుక్క.

"నల్లదాన్ని ఎవడు చేసుకుంటాడూ? చివరికి 'నువ్వే గతి బావా' అని అనకా మానవు! నేను చేసుకోకామానను!" నవ్వాడు శివుడు.

"పోవోయ్ పుల్లాయ్!" వెక్కిరింతగా అన్నది పార్వతి.

"ఒరేయ్ శివుడూ... ఎప్పుడు చూసినా గిల్లికజ్జాలేనా?" నవ్వింది సుశీలమ్మ.

"సుశీలమ్మ పార్వతి తల్లి. నలభైదాటినా మంచి ఆరోగ్యంతో, ఆరోగ్యాన్ని మించిన అభిమానంతో, అభిమానాన్ని మించిన ఆదరణతో అందరికీ తలలో నాలుకలా ఉంటుంది. ఒక్క 'బొట్టు' లేదుకానీ, లేకపోతే గుళ్ళో అమ్మవారు ఊళ్ళోకొచ్చిందా అన్నట్టు చూసేవాళ్ళకి అనిపిస్తుందీ కనిపిస్తుందీ.

పార్వతి బి.ఎ. శివుడు అయిదో తరగతి. అయినా విపరీతంగా పుస్తకాలు చదివి, లోకాన్ని 'ఎలా అర్థం చేసుకోవాలో 'అలా' అర్థం చేసుకున్నవాడు.

సుశీలమ్మకి అన్నకొడుకు. మూడోఏట తల్లిదండ్రులుపోతే, అప్పట్నించీ సుశీలమ్మే వాడ్ని పెంచి పెద్ద చేసింది. శివుడ్ని సుశీలమ్మ పెద్దచేస్తే, సుశీలమ్మ ఆస్తిని శివుడు 'పెంపు' చేశాడు.

"వాడి కాలుపడ్డ చోట ధాన్యలక్ష్మి తాండవమాడదూ!" అంటారు ఊళ్ళో వాళ్ళు.

చిత్రం ఏమంటే, ఎంత మోటుపనిచేసినా శివుడిలో కోమలత్వం, మనసులో సున్నితత్వం తరగలా.

అదో చిన్న ఊరు. ఓ శివాలయం...రెండు చెరువులు....ఓ ఊరుమ్మడి చెలంబావి... ఓ ఎలిమెంటరీ స్కూలు... ఎప్పుడో బ్రిటీష్‌వాళ్ళకాలంలో ఓ 'దొర' గారు కట్టించిన ఓ బంగళా... ఇవీ ఆ ఊరి ప్రత్యేకతలు.

శివుడు ఇంటిముందు ఓ దిట్టమైన పాక వేయించి, పుస్తకాలు కొనుక్కొచ్చి 'గ్రంధాలయం'గా మార్చాడు. వార్తలు జనాలకి వినిపించడానికి ఓ రేడియో కూడా అమర్చాడు. హైస్కూలు మైలుదూరంలో ఉంటే కాలేజీ ముప్ఫైమైళ్ళ దూరంలో ఉంది. పార్వతి రోజూ బస్సులో వెళ్ళి ఆ కాలేజీలోనే చదివింది.

"అత్తా... నీ కూతురికి పెళ్ళీడొచ్చింది. మొగుడు కావాల్ట! విన్నావుగా! మరి ఏ మొగలిపువ్వుగాడ్ని తెమ్మంటావో నీ ఇష్టం" నవ్వాడు శివుడు.

"నువ్వుండగా ఇంకోడెందుకురా!" నవ్వింది సుశీలమ్మ. "అయితే మరి శాస్త్రిగార్ని పిలవమంటావా?" కొంటెగా అన్నాడు శివుడు.

"ఇదిగో పార్వతీ, మీ బావ శాస్త్రిగార్ని పిలుస్తాట్ట. పిలవమంటావా?"

"ఏం? పిల్చుకోమనూ. పిలిచి ఏం చేస్తాట్ట? శాస్త్రిగారమ్మాయిని పెళ్ళాడతాడా? ఓ.కే! దాన్ని ఎలాగొలా నేనే ఒప్పిస్తా. అదీ నా క్లాస్‌మేటేగా!" పకపకా నవ్వుతూ అంది పార్వతి.

"అలాగే అలాగే! నేను శివుణ్ని గదా! పక్కనొకరూ నెత్తినొకరూ... భలే మజాగా ఉంటుందిలే!" పకపకా నవ్వి అన్నాడు శివుడు.

"ఆ మాట ఇంకోసారంటే చంపేస్తా!" దూసుకొచ్చింది పార్వతి. "అనను తల్లీ అనను. ఈ జన్మకి నువ్వు చాలు!" చేతులెత్తి దండంపెట్టి భయపడుతున్నట్టుగా మొహంపెట్టాడు శివుడు.

"సరే.... క్షమించేశా!" మళ్ళీ లోపలికిపోయింది పార్వతి.

"అత్తా! పొలానికి పోతున్నా!" నవ్వుతూ బైటికి నడిచాడు శివుడు. సుశీలమ్మ కళ్ళనిండా ఆనందమే. ఇద్దరూ చిలకాగోరింకల్లా కళ్ళముందుంటే ఇంకేం కావాలీ!

వెన్నెల్లో పున్నాగచెట్టు 'అమావాస్య ఆకాశం'లా ఉంది. తెల్లని పూవులూ మొగ్గలూ... పిచ్చెక్కించే సువాసన. ఇవతల పక్కనున్న కొబ్బరాకులు వెన్నెల్ని జల్లెడపడుతున్నై.

పెద్దచెరువుమీదుగా వచ్చేగాలి కలవపూల వాసనతోబాటు పున్నాగపూల పరిమళాన్ని మిళాయించి మనసులో మధురమైన ఊహల్ని రేపుతోంది. తెరలు తెరలుగా నేలమీదకి జారుతున్న వెన్నెల ఒళ్ళు వేడెక్కిస్తోంది. మంచంమీద పడుకున్న శివుడికి నిద్రరావట్లా.

"బావా!" చిన్నగా అన్నది పార్వతి.

తటాల్నలేచాడు శివుడు.

"ఊ...! మరీ" నసిగింది.

"ఏమిటీ?" కూర్చోమన్నట్టు సైగచేశాడు.

"నువ్వు అందంగా ఉంటావు! నేను చామనఛాయను. నిజంగా నేను నీకు నచ్చుతానా?" మెల్లగా అంది పార్వతి. పకపకా నవ్వాడు శివుడు.

"ఎందుకా నవ్వు?" చిరుకోపంతో అన్నది పార్వతి. "మొద్దూ! గుళ్ళో అమ్మవారి విగ్రహం ఏ రంగులో ఉంది?"

"నలుపు"

"ఆ అమ్మవారికి తెల్లని వజ్రాల నగలూ, ముత్యాల మాలలూ, తెల్లని పట్టుచీర, బంగారు వడ్డాణం, తెల్లని వజ్రపు ముక్కుపుడక, చేతుల్నిండా నవరత్నాలు తాపడంచేసిన బంగారు గాజులూ, కాళ్ళకి బంగారు పట్టాలు, వెండిమట్టెలు ఇలా సర్వ అవయవాలనీ బంగారు నగలతో అలంకరిస్తే ఎలా ఉంటుందీ?"

"అద్భుతంగా ఉంటుంది" మనసులో అమ్మవార్ని ఊహించుకుంటూ మనస్ఫూర్తిగా అంది పార్వతి.

"కదూ! అలాగే వజ్రకిరీటంపెట్టి చూడు. చక్కని పచ్చని చేమంతి మాలలు మెడలో వేసి అమ్మవార్ని అలంకరించి చూడు!" పార్వతివంకే చూస్తూ అన్నాడు.

"ఎంతో ఎంతో బాగుంటుంది!" పరవశంతో అన్నది పార్వతి. "అవునా? ఆ అమ్మవారి అలంకారాన్ని ఆ కళ్ళతో ఆ శివుడు చూస్తే, ఈ అమ్మవార్ని అలా అలంకరించి ఈ శివుడు చూసుకుంటాడు! తేడా ఒక్కటే! ఆయన ముక్కంటి అయితే నాకు ఉన్నవి రెండే కళ్ళు!" నవ్వాడు శివుడు.

పార్వతి తలదించుకుంది. కళ్ళల్లో చెమ్మ వెన్నెల్లో తళుక్కున మెరిసింది.

"పిచ్చీ! నలుపులో ఉండే అందం తెలుపులో ఎక్కడుందీ? అయినా అసలు నీకు నేను నచ్చాలిగానీ, నువ్వు నాకు నచ్చడం ఏమిటీ?" నవ్వాడు శివుడు.

"బావా!" శివుడి చెయ్యిమీద చెయ్యి వేసింది పార్వతి. ఆమె కళ్ళల్లో నీళ్ళు.

"పిచ్చీ! ఇప్పుడేమైందనీ?" అనునయంగా అన్నాడు.

"నేను లావుగా ఉంటాను. నీకంటే పొట్టి"

"అదా! ఇప్పుడు నీకు ఒకటే పాలకోవాదండ ఉంది. ఇంకోటి కూడా ఉంటే ఇంకా బాగుంటుందని నేను ఆలోచిస్తున్నా!" నవ్వి నడుం మీద ఉన్న బుల్లి మడతని సుతారంగా వేలితో నిమురుతూ అన్నాడు శివుడు. "ఛీ!" శివుడి చెయ్యి తీసెయ్యబోయింది పార్వతి.

"ఉహూ! నీకో నిజం చెప్పనా? పెళ్ళిరోజున నీ బుగ్గ మీద పెట్టే చుక్కకి ఓ తెల్లరాయిని అతికిస్తా!"

"ఎందుకమ్మా?"

"అప్పుడు నీ బుగ్గమీద నా నాలుకతో తడిమి ఆ తెల్లరాయి అదృష్టాన్ని అభినందించవచ్చు!" తటాల్న బుగ్గమీద పెదవానించాడు శివుడు. పార్వతి ఒళ్ళు వొణికింది.

ఒళ్ళంతా వేడి.

"ఇదిగో, ఇలా నీ మెడకి నా ముక్కుని ఆనించి నీ తల్లో పూవుల సువాసన గొప్పదో, లేక నీ వొంటి పరిమళం గొప్పదో కూడా తేల్చిపారెయ్యొచ్చు! నన్నడిగితే నీ వొంటి పరిమళం ముందు ఏ పూల సువాసనైనా బలాదూరే!" నవ్వాడు శివుడు.

"ఛీ....పో!" సిగ్గుపడింది పార్వతి.

"చిన్నీ! అప్పుడు నువ్విలా సిగ్గుపడితే, ఇలా నీ ముఖంపైకెత్తి నీకళ్ళని ముద్దు పెట్టుకుంటా!" మత్తుగా అన్నాడు శివుడు. కళ్ళని ముద్దుపెట్టుకుంటూ....

"ఊ....!" కళ్ళు మూసుకుంది పార్వతి.

"అలాచేస్తే వెంటనే నీ బుగ్గలూ, పెదాలూ అలుగుతాయి!"

"ఊ....? ఎందుకూ?"

"అవును. ఏం? కళ్ళకేనా ముద్దులూ? మేం తగమా? అని!"

"ఊ!"

"పాపం వాటినెందుకు నిరాశపరచాలీ?" ఆమె ముక్కుమీద, బుగ్గలమీదా, పెదాలమీదా మెత్తగా వెచ్చగా ముద్దులుపెట్టాడు శివుడు.

మత్తుగా మూల్గింది పార్వతి.

"ఎంత ముద్దొచ్చే 'చుబుకం' నీది? వాహ్... ఈ మెడ మాత్రం? ఈ గుండ్రని భుజాలూ... ఈ చేతులూ ఓహ్..... నీ ఒళ్ళంతా ముద్దుల దండలు వెయ్యాల్సిందే!" వరుసగా ముద్దులుపెడుతూ అన్నాడు శివుడు.

"ఇదిగో... ఇదీ! కులూ లోయ అనీ, మనాలీ అనీ, కాశ్మీర్‌వేలీ అనీ, అరుకు వేలీ అని ఓ తెగపొగుడుతారు. ఈ లోయ అంత అద్భుతమైనది లోకంంలో ఉందా?" గుసగుసగా అంటూ ఆమె వక్షంమీద తల అన్చాడు.

అద్భుతమైన ఓ మెత్తదనం... నిండైన మెత్తదనం, నిగనిగలాడే మెత్తదనం... ఆహ్లాదకరమైన వెచ్చదనం... గోరువెచ్చగా సువాసనతో కూడిన వెచ్చదనం... మత్తుకే తెలియని ఓ మత్తు. కళ్ళని మూసేసింది.

ఎంత అద్భుతం.... బిడ్డ పుట్టగానే వెదుక్కునేది వీటినే. యువకుడు ఆత్రంగా చూడాలనుకునేది వీటినే. 'మనసు అలిసినపుడు' సేద తీరాలనుకునేది వాటి మధ్యనే. ఎంత విచిత్రం!

పార్వతి మనసు మూగబోయింది. మొహం 'మౌనపు' నీడలో ఒదిగింది. తెలియకుండానే రెండు చేతులూ శివుడి తలను గుండెలకి అదుముకున్నాయి. ఊపిరి వెచ్చగా శ్వాస రూపంలో శివుడితలను అభిషేకిస్తుంటే, పెదాలు శివుడి నుదుటికి ముద్దు నైవేద్యం పెట్టాయి.

"ఇదిగో... ఈ బుజ్జిపొట్ట నా విశ్రాంతిగృహం!" గుసగుసగా అంటూ తలని కిందకి జార్చి పొట్టమీద నాలికతో రాశాడు శివుడు. పార్వతికి చక్కిలిగింత.

"ఇదిగో... ఇదే త్రివేణీ సంగమం. నువ్వు స్నానం చేస్తే ఆ నీళ్ళు మధ్యగా ప్రవహించి ఈ బొడ్లోనే సుడి తిరుగుతాయి!" అన్నాడు శివుడు. తెలియకుండానే వెల్లకిలా మంచం మీదకి వాలింది పార్వతి.

"బుజ్జులూ! ఈ బుజ్జి పొత్తికడుపే నాకు తరతరాలకీ తరగని ఆస్తి! ఎందుకో తెలుసా?"

"ఎందుకూ?" వినీవినిపించనట్టు అంది పార్వతి.

"ఎందుకంటే 'గర్భాలయం' ఉండేది ఇక్కడేగా! మన వినాయకుడు, కార్తీక్ వచ్చేది ఇక్కడ్నించేగా!" పొత్తికడుపుమీద ముద్దులుపెడుతూ అన్నాడు శివుడు.

"ఏయ్ వద్దు!" సిగ్గుతో అంది పార్వతి.

"నేను ముద్దిచ్చేది నీకు కాదు. ఎ.....ప్పు.....డో... పుట్టబోయే నా బిడ్డల విడిదింటికి!'

"ఛీ...ఫో...." మెల్లగా లేచి, ఆమెని హత్తుకున్నాడు శివుడు. ఆమె తన బాహువుల్ని మాలగా అతని మెడమీద వేసింది.

అతను తన తలని ఆమె మెడవంపులో దాచుకున్నాడు. శరీరాల పరిమళం కోటి పూలసువాసనగా మారి, శ్వాస ద్వారా గుండెల్లో ఇమిడిపోతోంది.

రెండు పాములు ఒకదాన్నొకటి పెనవేసుకున్నట్టు... రెండు నక్షత్రాలు ఒకదానిలో ఒకటి లీనమైనట్టు... రెండు ఆత్మలు ఏకాత్మగామారి ఒకే తనువులో ఇమిడినట్టు...ఓహ్.... నిశ్శబ్దం ఇంత మధురంగా ఉంటుందా!

శరీరానికి 'ఇంత' శక్తా! సకల చరాచర ప్రపంచాన్నీ ద్రవంగా మార్చి తనలో ఇముడ్చుకోగలదా! సర్వధర్మాలకీ అతీతంగా... ప్రకృతే తానై పలవరిస్తూ... పులకరిస్తూ... పరవశిస్తూ.... ఓహ్....

అణువణువునించి వెచ్చదనం ఉప్పొంగి ప్రవహిస్తుంటే, అణువణువూ ఓ అమరత్వాన్ని తనకి తానే సిద్ధింపచేసుకుంటే, ఆకాశం భూమిలోకి చొచ్చుకుపోతుంటే – శరీరాలు కాంక్షతో పెనవేసుకుంటున్నాయి. మనసులు 'మౌనపు' ద్వారాలని వెదుక్కుంటున్నాయి.

తనువులు తమకంతో ఉయ్యాలలూగుతున్నాయి. శరీరాకాశంలో కోర్కెల మెరుపులు.

శిరోజాలు 'నింగిని మబ్బులు కమ్మినట్టు' అతని మొహాన్ని కప్పివేశాయి.

అలసటగా చిన్నగా నవ్వింది పార్వతి. ''ఇప్పటినుంచీ నువ్వు నా అర్ధభాగానివి! నేను అర్ధనారీశ్వరుడ్ని" ఆమె పొట్టమీద తలపెట్టుకుని ఆమె వీపుచుట్టూ చేతులువేసి గట్టిగా అదుముకున్నాడు.

– స్వాతి 23-11-2012

# నాట్ సో రొమాంటిక్

ట్రైన్‌లో గడ్డం నిమురుకుంటూ కూర్చున్నాడు పరమాత్మ. అతను తెల్లగా, పొడుగ్గా, పొడుక్కి తగ్గ లావుతో, “సాధన’ వల్ల లభించిన ‘వర్చస్సు’తో గంభీరంగా ఉన్నాడు.

కాషాయవస్త్రం తీసేసి రెండు రోజులయింది. నిజం చెబితే అతనికెవరూ సన్యాసదీక్ష ఇవ్వలేదు. కాషాయాన్ని తనంతట ॰ నే కొనుక్కొని కట్టుకున్నాడు. ఇక్కడ కాస్త పరమాత్మ గతం గురించి చెప్పి తీరాలి. పసిపిల్లాడుగా ఉన్నప్పుడే ఆడవాళ్ళు ఎత్తుకుంటే ఏడ్చేవాడు. దాంతో వాళ్ళమ్మగారు వీడిని ‘ఒరే రుష్యశృంగుడూ’ అని పిలిచేది.

స్కూల్లోనూ అంతే. పొరబాటున కూడా ఆడపిల్లల వంక చూసేవాడు కాదు. పలకరించినా మాట్లాడేవాడు కాదు. పోనీ మగపిల్లలతో అయినా కలిసేవాడా అంటే– అదీ లేదు. ‘ఏకోనారాయణ’ అనేవాళ్ళం.

మేం హాయిగా మాంచి రొమాంటిక్ నవల్సు చదివేటప్పుడు వీడు వివేకానందులవార్నీ, అరవిందులవార్నీ, పరమహంస యోగానందనీ, స్వామి రామానీ చదివేవాడు. క్లాసులో ఫస్టు మళ్ళీ వీడే.

ప్రస్తుతం అదే ట్రైన్‌లో నేను వాడి ఎదురుగుండానే కూర్చున్నాను. ఇద్దరం ఒకటో తరగతినించీ క్లాస్‌మేట్స్. ప్రస్తుతం వాడు తెల్లని ధోవతీ, తెల్లని లాల్చీతో గడ్డం పెంచిన మన్మథుళ్ళా ఉన్నాడు.

"ఒరేయ్ పరమాయ్.... ఇంకెంతసేపు మౌనం ఛోంచేస్తావురా?" విసుగుపుట్టి అన్నాను. వాడు కళ్ళెత్తి నావంక చూసి "మనిషికి దేవుడిచ్చిన అమూల్యమైన వరాల్లో 'మౌనం' ఒకటి!" అన్నాడు.

"నాయనా, ఆ వరాన్ని పెళ్ళయిన మరుక్షణంనించీ ఆస్వాదిస్తూనే వున్నానుగానీ... ఇప్పుడైనా నువ్వు నోరారా మాట్లాడి, నన్ను మనసారా మాట్లాడుకోనివ్వరా...! ఈ వరం తప్ప నిన్ను ఇంకేమీ కోరను" అన్నాను.

అసలు హాయిగా మాట్లాడుకుందామనేగదా... వీడు ఫోన్ చెయ్యగానే బెజవాడనించి పరిగెత్తుకొచ్చింది!

"జీవితం క్షణభంగురం.... శరీరం అశాశ్వతం..... కోర్కెలు మానవుడ్ని పతనంవైపు మళ్ళిస్తాయి..." గంభీరంగా అన్నాడు పరమాయ్.

ఉలిక్కిపడి వాడివంక చూశాను. నా గురించేనా వీడు అన్నదీ? ఎందుకంటే నా దృష్టి గబగబా మా కంపార్ట్‌మెంట్‌వైపు వస్తున్న జీన్స్‌పేంట్ పిల్లమీద ఉంది. "వేదాంతం తప్ప ఇంకేది చెప్పినా వింటాను గానీ జీవితాలూ, క్షణభంగురాలూ అంటే మాత్రం చొక్కా జేబులుచించి, చెవిలో దూదిలాగా పెట్టుకుంటా!" వార్నింగిచ్చా.

ఆ పిల్ల మా కంపార్టుమెంటులోనే, మా ముందుకే వచ్చి బెర్త్ నంబర్లు గమనించింది. వాహ్....సూపర్ స్ట్రక్చర్... నందితా 'నిలుచునే'లూ, దీపికా 'పడుకొనే'లూ ఎందుకూ పనికిరారు. 'ఎక్స్క్యూజ్‌మీ... మీరు కూర్చున్న బెర్తు నాది... మీది పై బెర్తు...!' అని యమా స్టైలిష్ ఇంగ్లీష్‌లో అంది నావంక చూస్తూ.

"యా....! ఇంకా కాస్త పగలు మిగిలుంది గనుక ఈ సీట్లో కూర్చోవచ్చునని అనుకుంటున్నాను.... ఆ మాటే టి.సి.గారు కుడా చెప్పారు.

ఒకవేళ ఇప్పుడే మీరు నిద్రపోదల్చుకుంటే మాత్రం నేను లేచుటకు సిద్ధంగా ఉన్నాను. నాకు ఎటువంటి అభ్యంతరమూ లేదు!" ఆవిడ వాడిన ఇంగ్లీష్‌నే నాకు తెలిసిన 'యాస'తో చెప్పాను.

"ఓ.కె...ఓ.కే...." తను తెచ్చుకున్న సూట్‌కేస్‌ని బెర్త్ కిందకి తోస్తూ అంది. ఆహా....! అలా ఆడవాళ్ళు ఒంగి, సూట్‌కేట్‌ని బెర్త్ కిందకి తొయ్యటం అనే కార్యక్రమం ఎంత రోమాంచితంగా, అద్భుతంగా ఉంటుందో ఆ క్షణాన్నే తెలుసుకోగలిగా. ఆ పిల్ల 'నెవర్ లవ్ ఏ స్ట్రేంజర్' అనే హెరాల్డ్ రాబిన్స్ నవల ఓపెన్ చేసింది.

"ఒరే పరమాయ్... నీ ఫోన్‌రాగానే మీ ఇంటికి వెళ్ళా. మీ అమ్మగారు సంతోషించడమే కాక అర్జంటుగా మీ మామయ్యకి ఫోన్‌చేసి నీకు 'తగిన' పిల్లని వెదకమన్నారు. కనుక ఇప్పటికి ఐనా పెళ్ళిచేసుకుని మీ అమ్మగారిని సంతోషపెట్టడం నీ విధేకాక బాధ్యతకూడా!"

"పెళ్ళి అనేది ఊబిలాంటిది. అన్ని కష్టాలకీ మూలం వివాహమే. అందుకే ఈ జన్మలో నేను పెళ్ళిచేసుకోను" అన్నాడు. "కొన్ని సుఖాలు కూడా ఉంటాయిరా నాన్నా! అనుభవంతో చెప్తున్నా విను" అన్నాను. ఆ అమ్మాయి పుస్తకం మడిచి కిందపెట్టింది.

"కాంతాకనకాలవల్ల సుఖాలు ఉండవు. ఉన్నా అవి ఎండమావిలాంటి సుఖాలే... దాన్నే 'సుఖభ్రాంతి' అని అంటారు" గంభీరంగా అన్నాడు పరమాయ్.

"ఒరే.... ఆ ఒక్కమాట అనకురా! పాపం మీ అమ్మగారు కనీసం పాతికమంది సుందరనారీమణుల్ని రెడీ చేసి వుంటారు. తల్లిరుణం తీర్చుకోరా!" బతిమిలాడాను. ఆ పిల్ల విండోలోంచి బయటికి చూస్తోంది.

"ఒరేయ్... నువ్వు ఆ నస ఆపకపోతే ఇప్పటికిప్పుడు 'చైన్' లాగి మరీ ట్రైన్ దిగేస్తా! మాట్లాడాలంటే ఇంకేదన్నా మాట్లాడు.... లేకపోతే 'మూ....బంద్" అన్నాడు. ఇంకేంచెబుతాం?

"అదికాదురా.... దేవుడు మనుషుల్ని అంటే 'ఆడా-మగా'ని సృష్టించాడు. ఆ తరువాత ఏం చెప్పాడూ? ఓ మానవా, ఓ మానవీ! ఇకనుంచీ మనుషుల్ని సృష్టించే బాధ్యత మీమీదే పెడుతున్నాను. హాయిగా సంతానాన్ని వృద్ధిచేసి మనుజ జాతిని నిలబెట్టండీ అని చెప్పాడు. ఇక నీలాగా అందరూ పెళ్ళిళ్ళు మానేస్తే మన జాతి, మానవజాతి... మా...నవ....జాతి గతి ఏమవుతుందీ?" యమదొంగ స్టైల్లో నొక్కి వక్కాణించా. పెళ్ళి ఆవశ్యకత గురించి.

"అలాగా... సరే...." అని లేచి చైన్ లాగబోయాడు పరమాయ్. "ఒరేయ్... ఆగరా... నోరు మూసుకుంటా.... సరేనా!" నేను లేచి వాడిచెయ్యి 'చైన్'దాకా వెళ్ళకుండా ఆపేశా. ట్రైను యమా ఫాస్టుగా పోతోంది.

చీకటి చీరని చీల్చుకుని పండువెన్నెల్ని వెదజల్లుతున్నాడు నిండుచంద్రుడు. "ఒరేయ్! ఇవాళ పౌర్ణమి అనుకుంటాన్రా!" ఆనందంగా విండోలోంచి ఫుల్‌మూన్ గార్ని చూసి అన్నాను. "తెలుసు!" పద్మాసనం వేస్తూ అన్నాడు పరమాయ్

"ఖానాచాహియే?" అంటూ అడిగాడు ఎటెండర్ రసీదు బుక్కుతెరుస్తూ.

"దో మీల్స్!" డబ్బు తీస్తూ చెప్పాను.

"నహీ... ఏక్..." అన్నాడు పరమాయ్.

"అదేంటీ?" ఆశ్చర్యంగా అడిగాను.

"పౌర్ణమిరోజున భోజనం చెయ్యను. రాత్రిపూట.... నువ్వు నీకోసం మీల్సు తీసుకో" అన్నాడు. ఇంకేంచేస్తాం! ఆ అమ్మాయీ మీల్సు బుక్ చేసింది.

"అంతేనా ఇంకేమైనా ఉన్నాయా?" అడిగాను.

"నేలమీదే పడుకుంటాను!"

"మనం ఉన్నది నేలమీద కాదుగా?" కొంచెం వెటకారంగా అన్నాను.

"ట్రైన్‌కీ ఫ్లోర్ ఉందిగా" నవ్వాడు వాడు.

నాలుక్కరుచుకున్నాను. "అయినా నీకీ వెటకారం ఎప్పట్నించీ అలవడిందిరా?" అడిగాడు పరమాయ్.

"పెళ్ళైన ఆర్నెల్లనుంచీరా నాయనా... ఆవిడకి వెటకారాలంకారం తప్ప మరోటి తెలీదు. మనం చెప్పేదీ మరో విధంగా అర్థం కాదు. అందుకే... ఇలా అయిపోయాన్రా... వివరించాను లోలోపల ఏడుస్తూ.

"కదా....! తెలిసీ మళ్ళీ నన్ను ఈ ఊబిలోకి దింపాలని ఎందుకురా నీ ఆరాటం?" అంటూ నవ్వాడు వాడు.

కీలు ఎరిగి వాతపెట్టడం అంటే దీన్నే అంటారనుకుంటాను.

"ఏదోలేరా! ఎన్ని చికాకులున్నా ఇంటికెళ్ళాక నా కొడుకుని చూస్తే అన్నీ మర్చిపోతా. ఒక తండ్రిగా నేను పొందే ఆనందం నీకూ కలగాలి అనే ఆశతోనే పెళ్ళి చేసుకోమని అంటున్నాగానీ, నిన్ను ఏదో బాధల్లోకి నెట్టాలి అనే దురుద్దేశంతో కాదు" అన్నాను.

అటెండర్ బెర్త్‌లు చూపిస్తుంటే కేటరింగ్‌వాడు భోజనాల ప్యాకెట్లు సప్లై చేశాడు. పరమాయ్ ఓ గుక్క మంచినీళ్ళు తాగాడు. ఆ సుందరి ప్లేటుమీది మూతని తీసి, తినడం ప్రారంభించింది. పూరీలు మొదట మొదలెట్టింది.

ఓ చిన్నముక్కని అందంగా తుంచి పక్కనే 'వేడి నీళ్ళోడుతున్న' ఆలూ సబ్జీలో ముంచి, చాలా అందంగా నోరుతెరిచి, పళ్ళవరుసని నేను గమనించేలోగానే నోట్లో పడేసి, శబ్దం రాకుండా తినడం చూసి మహా ముచ్చటపడ్డాను. ఆ విషయమే పరమాయ్ గాడితో తెలుగులో చెప్పాను.

"ఒరే... పెళ్ళిచూపులంటూ మనవాళ్ళు పనికిరాని హడావిడి చేస్తారుగానీ... అమ్మాయిల అందాన్ని, వాళ్ళ వ్యక్తిత్వాన్ని, గుణాన్నీ కనిపెట్టాలంటే, వాళ్ళు భోంచేసే

టప్పుడు చూడాల్రా. ఆ అమ్మాయిని చూడు... అందం 'అన్నం' తింటున్నట్టు లేదూ?" అన్నాను.

"నోరూ, కళ్ళూమూసెయ్... పరస్త్రీలని గమనించడం తప్పు!" కోపంగా చూశాడు నావంక. వీడితో ఇదొకటి కదూ! "సరే సరే...." చేత్తో నోరుమూసుకున్నా.

"అంత అక్కర్లేదులే!" అని చిన్నగా నవ్వాడు.

సడెన్‌గా నేను ఆమెవంక చూస్తే ఆవిడ 'అదో' విధంగా మావంక చూస్తోంది. కొంపతీసి ఆవిడని చూసి నవ్వుకుంటున్నా మనుకుంటుందేమో అని "వియ్ ఆర్ లాఫింగ్ నాట్ బికాజ్ ఆఫ్ యూ... బట్... బికాజ్ ఆఫ్ 'మేరేజ్!" అని స్టైలుగా చెప్పాను. ముందు కళ్ళుచిట్లించినా నా 'భాషా ప్రావీణ్యానికి' నవ్వీనవ్వనట్టుగా నవ్వింది అనిపించింది. భోజన కార్యక్రమం పూర్తయింది.

"నేను ధ్యానం చేసుకోవాలి. నో డిస్ట్రబెన్స్..." అని ఓ పల్చటి దుప్పట్ని రెండు బెర్తులమధ్యా నేలమీద పరిచి 'సారీ' అని ఆ పిల్లకి చెప్పి పద్మాసనంలో కూర్చొని కళ్ళుమూశాడు పరమాయ్.

"హీ యీజ్ ఏ సెయింట్.... నాట్ వాంట్ టు మేరీ" ఆమెకి చెప్పాను. సందేహం తీర్చాలి గదా! పదిన్నరదాకా ఆమె హెరాల్డ్ రాబిన్స్‌ని వదల్లేదు. ఆ తరువాత నేను నిద్దరపోయాను. ఓ పెద్ద జర్క్... బేంగ్...తో ఉలిక్కిపడి లేచా. కింద పడబోయేవాడిని కాస్తా గొలుసుల్ని పట్టుకుని ఆగాను. బెర్తుమించి కిందకి దిగుదామని చూస్తే పరమాయ్‌గాడి మీద నిలువుగా ఆమె పడివుంది.

ఎందుకో ఆగాను. కంపార్టుమెంట్లో కొందరు ఏడుపులు మొదలెట్టడంతో పైబెర్తుమీదనించి కిందకి దిగక తప్పలేదు. లైట్లు బాగానే పనిచేస్తున్నై...కానీ-

"సారీ...నా మోకాలికి దెబ్బ తగిలింది. లేవలేకపోతున్నా" ఆమె అపాలజిటిక్‌గా ఇంగ్లీష్‌లో అంటోంది. ఈమె వాడిమీద దొర్లిపడటంతో మొత్తం వాడిమీదే వుంది. "చూస్తావేంట్రా, ఆమెకి హెల్ప్‌చెయ్యి!" కోపంగా నన్ను చూసి అన్నాడు పరమాయ్.

"కాదురా... పరస్త్రీలని ఓన్లీ లుక్కింగ్...నో టచ్చింగ్" అన్నాను. ఎందుకో వాడిని అలాగే ఉంచితే కానీ తిక్క కుదరదు అనిపించింది నాకు.

"చంపేస్తా... హెల్ప్ హర్...హీ విల్ హెల్ప్ యూ!" సగం నాతో, సగం ఆమెతోనూ అన్నాడు వాడు.

ఆ అమ్మాయి లేవాలని ప్రయత్నం చేస్తూ "సారీ.... ఓ మోచెయ్యికి కూడా దెబ్బతగిలింది. విరిగిందేమో కూడా" అని ఇంగ్లీషులో అంది.

వాడే ఇక రెండు చేతుల్తో ఆమె భుజాలు పట్టుకుని లేవదీసే ప్రయత్నం చేశాడు. "నో... ఐకాంట్... మోకాల్ని కదపలేను!" ఏడుస్తూ ఇంగ్లీషులో అంది.

"ప్లీజ్... డోంట్ క్రై..." ఓ చేత్తో ఆమె కళ్ళు తుడిచాడు. బహుశా ఆమె కన్నీళ్ళు వాడిమీద పడివుండాలి.

"చూస్తావేమిట్రా గాడిదా... హెల్ప్ హర్" అన్నాడు కోపంగా నన్ను ఉరిమిచూస్తూ.

"ఐ టూ కాంట్... గొలుసులు కొట్టుకుని రెండు చేతులు, మోచేతుల కింద వాచినై!" వీలున్నంత బాధ ఒలికిస్తూ అన్నాను. వాడు నన్ను 'గాడిదా' అంటున్నాడు గానీ, వెల్లకిల్లా ఫ్లోర్‌మీద పడుకున్న వాడిమీదకి బోర్లగా ఆమె పడి కదలకుండా ఉన్నదంటే వాడు ఎన్నిజన్మలు పుణ్యం చేసుకునుండాలి? పోలిక బ్యాడ్ కావొచ్చు. కానీ నిజం నిజమేగదా? పదినిమిషాలు కష్టపడి ఎట్లాగైతేనే ఆమెని లోయర్‌బెర్త్‌మీదకి చేర్చగలిగాడు.

ట్రైన్ ఆగిపోయే ఉంది. "లైట్లు వెయ్యి.. అదే బిగ్‌లైట్స్... ఆ బ్లూ లైట్స్‌లో పాపం దెబ్బ ఎంత తగిలిందో తెలీదు. నేను వేద్దామన్నా నాకు నొప్పి విపరీతంగా ఉంది!" అన్నాను. వాడు లైట్స్ వేసేలోగా, నేను మడతబెట్టిన ఫుల్‌హ్యాండ్ షర్ట్‌ని సవరించుకున్నా వాడికి కనపడకుండా. చూస్తే ఏముంది ఆ పిల్ల మోకాలు (ఎడమ), మోచెయ్యి (కుడి) వాచివున్నాయి.

వాడు కంగారుగా వాడి బ్యాగ్‌లో నుండి ఓ సీసాతీసి ఆ అమ్మాయి షర్ట్‌ని మోచేతిపైకిలాగి, సీసాలోని నూనెని కొంచెంగా వాచి వున్న ఆమె చేతికి సున్నితంగా రాసి, స్మూత్‌గా మర్ధనా చేశాడు.

"హ్యాండ్ సరే... మోకాలి సంగతి ఏమిటీ?" అడిగాను.

"షటప్" ఆన్నాడుగాని వాడి మొహంలో ఆలోచన కనిపించింది.

అటెండర్‌కి సీరియస్‌గా తగిలింది దెబ్బ... తలకి. చాలా బోగీల్లో హాహాకారాలు. సడెన్‌బ్రేకు వెయ్యడంవల్ల ట్రైను పట్టాలు తప్పింది.

ఇదీ అరగంట తరువాత తెలిసిన సమాచారం. ఈలోగా ఆ పిల్ల ఏడుస్తూనే వుంది. మరీ బార్...భోర్...బీర్ అని కాకుండా సున్నితంగానే. "ఒరే పరమాయ్... మెల్లగా ఓ లుంగీచుట్టి, ఆమె ప్యాంటుని..." అని చెప్పబోయా. "షటప్... ఐ కాంట్..." అని అరిచాడు.

"మిస్.... యూ సీ... హీ విల్ పుట్ ఎ లుంగీ అరౌండ్ యూ అండ్ అప్లై ఆయిల్ ఆన్ యువర్ మోకాలి!" అన్నాను (మోకాల్ని ఏమంటారో గుర్తులేదు. అక్కడి కీలుని బంతిగిన్నెకీలని అంటారనుకుంటా)

"ఓకె ఓకె డూ సంథింగ్!" అన్నదాపిల్ల పళ్ళుబిగబెట్టి. ఆ తరువాత సంగతి నన్ను అడక్కండి. వాడి చూపులకి శక్తివుంటే నేను భస్మమైపోయివుండేవాడ్ని. వాడి చేతుల్లో కత్తివుంటే అదెప్పుడో నా గుండెల్లో దిగి గుండె గుసగుసలు వింటూ వుండేది.

మొత్తానికి ఆ వాచిన మోకాలుకి కూడా వాడు ఆ 'సీసా'లోని ద్రవపదార్థాన్ని అతిసున్నితంగానూ, అతి అయిష్టంగానే రాశాడని వేరే చెప్పక్కర్లేదు కదా.

నాలుగుగంటల తరువాత ఎనౌన్స్ చేశారు (అంటే మౌత్ టూ మౌత్ పబ్లిసిటీ అన్నమాట) మరో నాలుగు గంటలకిగానీ ట్రైన్ బయల్దేరదని. ఈలోగా ఆ సౌందర్యవతి బాధతో మూలిగినప్పుడల్లా వాడు మోచేతికీ, మోకాలికీ ఆరారగా, అతిశ్రద్ధగా ఆ సీసాలోని దివ్యఔషదాన్ని రాయడాన్ని చూస్తూనేవున్నాను.

నాకు కడుపు మండదా అంటే ఎందుకు మండదూ? నా చేతులకి దెబ్బ తగిలిందని (అబద్ధమే అనుకోండీ) చెప్పినా వాడు నన్ను పట్టించుకున్నాడా? స్నేహద్రోహి.

ఆడవాళ్ళు మామూలుగా మగవాళ్ళ (లేక సరే ఎందుకులెండి! పెళ్ళయిన వాళ్ళయితే మొగుళ్ళు) అటెన్షన్ కోరుకుంటారని తెలుసుగానీ, ఈ అమ్మాయింత 'సెన్సిటివ్' అని నేను ఊహించలేదు.

"బాగుందిరా... కనీసం నా చేతులు ఎలా ఉన్నాయి అని నువ్వడిగావుట్రా పరమాయ్?" నొచ్చుకున్నట్టుగా అన్నాను. "వెధవ్వేషాలువెయ్యకు. నువ్వు దిగటం నేను గమనించలేదు అనుకున్నావా?" అంటూ కాల్చేసేటట్లు చూశాడు. ఠక్కున నోరుమూసేశా.

ఆ అమ్మాయివంక చూస్తే ఏదో ఇబ్బందిగా కదులుతోంది. "వాట్ హ్యాపెన్డ్.... యూ వాంట్ ఎనీథింగ్?" అడిగాను. ఆమె ఏదో గొణిగింది.

అర్థంకాలేదు. మళ్ళీ అడిగాను.

"ఆడవాళ్ళెవరయినా ఉంటే చూడగలరా?" ఇంగ్లీషులో అడిగింది. ప్రాబ్లెమ్ నాకు అర్థమైంది.

"కెన్ యూ ప్లీజ్...." కొంచెం సిగ్గుతో వాడివంక చూసి అంది.

నిస్సహాయంగా భుజాలు ఎగరేసి ఆమెని అతికష్టం మీద నిలబెట్టాడు లుంగీతో. ఒక్కొక్క అడుగూవేస్తూ ఆ పిల్ల మూలుగుతుంటే నా గుండె తరుక్కు పోయింది.

చెప్పొద్దూ.... కనీసం ఓ అమ్మాయి శరీరం తగిలితేనన్నా వీడిమనసు మారుతుందే మోనన్న ఆశేగానీ, లేకపోతే పాపం వాడికి అంత కష్టం ఎందుకు కలిగిస్తానూ! ఆ పిల్ల అంత బాధపడుతుంటే ఎలా చూస్తుంటానూ! బాత్రూమ్‌దాకా తీసుకెళ్ళటానికి చాలా టైమ్ పట్టింది. ఇరవైనిమిషాల తరువాత వాడు ఆమెని రెండు చేతుల్తో ఎత్తుకుని 'అడ్డంగా' నడుస్తూ రావటం గమనించాను. స్ట్రెయిట్‌గా వస్తే 'వెడల్పు' చాలదుగా! మళ్ళీ బెర్త్‌మీద పడుకోబెట్టాడు. ఆ పిల్ల చాలా కృతజ్ఞతగా 'థాంక్యూ' అంది.

"ఓహ్... డోంట్‌వర్రీ ఎబౌటిట్!" అన్నట్టు వినిపించింది. పగలు ఎనిమిదింటికి ట్రైన్ బయలుదేరింది. తొమ్మిదిన్నరకి కాఫీలూ, టిఫిన్లూ పట్టుకువచ్చారు.

కుడి మోచెయ్యికి దెబ్బ తగలటం వల్ల పరమాత్మే స్పూన్‌తో టిఫిన్ అందించి, కాఫీ తాగించాడు. వాడ్ని ఎంత గమనించినా కూడా సేవలు చేస్తున్నాడే గానీ 'మరో ఆలోచన' కనిపించలేదు. ఆ అమ్మాయి కూడా వాడినే అడుగుతోంది... ఏం కావాలన్నా.

"మిస్.....హి ఈజ్ నాట్ లైకింగ్ మేరేజ్. యూ టెల్ హిమ్ టూ మేరీ!' అన్నాను కావాలనే.

"అది ఆయనిష్టం" అని ఇంగ్లీషులో అంది. వాడు ఆమెని మెచ్చుకోలుగా చూశాడు. ఎందుకూ మాట్లాడ్డం అనుకుని హెరాల్డ్ రాబిన్స్‌గార్ని నేను పట్టుకున్నాను.

మధ్యాహ్నం లంచ్ తినిపించినా, ఒకసారో, రెండుసార్లో బాత్‌రూమ్‌కి తీసుకెళ్ళినా ఇద్దరూ మామూలుగానే ఉన్నారుగానీ, ఓ యువకుడూ ప్లస్ ఓ యువతి ప్రవర్తించ వలసిన తీరులో మాత్రం ప్రవర్తించలేదు. ముక్కుతూ మూలుగుతూ ట్రైను బెజవాడ చేరింది.

వాడు కొంచెం వర్రీగా.... "మీరు మద్రాసు వెళ్ళాలనుకుంటాను! చాలా కష్టం అవుతుంది. ఎవరూ తోడు లేకపోతే పోనీ నన్ను" అంటూ ఉండగానే ఓ ముప్ఫైఏళ్ళ మనిషి, మరో ఇరవై ఎనిమిదేళ్ళ యువతి లోపలకొచ్చారు.

"ఏమిటే ఉమా... ఏమయిందీ.... దెబ్బలేం తగల్లేదు కదా!" కంగారుగా అంది ఆమె.

"లేదు వదినా..... మోకాలికీ, మోచేతికీ తగిలింది గానీ పాపం వీరు చాలా సహాయం చేశారు!" అంది అచ్చమైన తెలుగులో.

పరమాయ్‌గాడూ షాక్ తిన్నాడు. మొత్తానికి ఆ ఇద్దరూ సాయంపడుతుండగా ట్రైన్ దిగింది ఆ పిల్ల. "తెలుగువారయ్యుండీ..." సిగ్గుతో నసిగాను.

"మీ ఇంగ్లీషు బ్రహ్మాండం.... భలే ఎంజాయ్ చేశాను. అందుకే తెలుగుదాన్నని చెప్పలేదు.

పరమాత్మగారూ..... ఒక్కసారి మీ అమ్మగారి మాట వినకూడదూ.... ప్లీజ్!" అంది. తరువాత యథాతథంగా విజిటింగ్ కార్డుల మార్పిడీ జరిగింది.

నెలన్నర తరువాత ఓ సుముహూర్తాన పరమాయ్‌గాడు 'మనుషుల్లో' పడ్డాడని వేరే చెప్పక్కర్లేదుగా...!

"నిజం చెప్పండి... మీరు అసలు బ్రహ్మచారిగానే ఉండిపోదాం అనుకున్నారా?" పరమాత్మ గుండెమీద గడ్డం ఆనించి అంది ఉమ.

"ఆ! జన్మాంతం బ్రహ్మచారిగానే ఉందామనుకున్నా!" ఆమె కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు పరమాత్మ.

"మరి ఆ నిర్ణయం ఎప్పుడు మారిందీ?" నవ్వింది ఉమ. "నువ్వు నామీద దొర్లిపడ్డావే ఇలా...." ఆమెని తనమీద బోర్లగా పడేసుకుని 'అప్పుడు' అన్నాడు.

"ఛీ! నిజంగా చెప్పండి!" పక్కకి దొర్లింది ఉమ.

"నిజం! రెండోసారి నీ మోకాలు ఇలా...." మర్దనా చెయ్యబోయాడు పరమాత్మ. "నో....నాట్ నౌ....నిజం చెప్పాలి." గోముగా అంది. "ఓకె.... మూడోసారి బాత్‌రూమ్ దగ్గర నీకు కట్టిన లుంగీ జారబోతూ ఉండగా"" బొడ్డుదగ్గర చెయ్యిపెట్టాడు పరమాత్మ.

'నో' చీరకుచ్చిళ్ళు పట్టుకుని గట్టిగా అరిచింది. ఆ గదిలో ఇలాంటివేవో జరిగి ఉండాలి! లేకపోతే, సంవత్సరం తిరక్కుండా.... "బ్రదర్...దిస్...కిడ్... యువర్ మేనల్లుడూ!" అని నా ఇంగ్లీష్‌లో మాట్లాడుతూ, నా చేతికే కొడుకుని ఉమ ఎలా అందిస్తుందీ?

– స్వాతి, 13-06-2014

# ప్రాప్తమున్న తీరానికి

"పదమూడు మంచిదిగాదు... అదీగాక నెల ఆగష్టు...ఫోర్ అండ్ ఎయిట్... మరో డేట్‌కి మార్చలేరూ?" అడిగింది సూర్యకుమారి అడ్వకేట్ రమణప్రసాద్‌ని.

"ఫరవాలేదు రమణా.... పెళ్ళయితే పంచాంగంలో, న్యూమరాలజీలో చూడాలి గానీ విడాకులకెందుకూ? విడిపోవడం మంచికోసం అయితే ఏ రోజైనా మంచిరోజే. అదే చెడుకోసం విడిపోవడం అనుకో... ఎంత మంచిరోజైనా చెడ్డదేగా... అయినా సూర్యా... ఇప్పుడా కేలిక్యులేషన్స్ అవసరమా?" ప్రశ్నించాడు శంకర్రావు.

"అవసరమే...స్టడీ చేస్తున్నా గనుక....!"

"ఈ వయసులోనా?" నవ్వాడు శంకర్రావు.

"అసలు ఈ వయసులోనే ఏదో ఒకటి చెయ్యాలి. మనసుకి ఇష్టమైనదీ 'మంది'కి ఉపయోగపడేదీ! అందుకే గత అయిదేళ్ళనించీ స్టడీ చేస్తున్నా... అఫ్‌కోర్స్... 'షీరో' సహాయం ఉందనుకోండీ!

"సరే రమణా.... ఆయనన్నదీ కరెక్టేలే.... ఆయన ఇష్టప్రకారమే కానివ్వు!"

"ఓ.కె. అలాగే చేద్దాం..... ఓ డౌట్ తీర్చండి. తేదీ పదమూడు, అంటే టోటల్ నాలుగు, నెల ఆగష్టు అంటే ఎనిమిది. ఎనిమిదీ ప్లస్ నాలుగూ ఈజ్ యీక్వెల్టు పన్నెండు అనగా టోటల్ మూడు.

మరి ఫోర్ & ఎయిట్ అని ఎందుకన్నారూ?" అడిగాడు రమణ.

"సంవత్సరం కూడా టోటల్ చెయ్యాలిగా... నేను టోటల్ చేసింది మా వెడ్డింగ్ ఇయర్... అది సీక్రెట్ అన్నమాట!" నవ్వింది సూర్యకుమారి.

"మళ్ళీ ఒక్కసారి ఆలోచించుకుంటే మంచిది" అన్నాడు రమణ.

"ఉహూ! ముమ్మాటికీ విడిపోవటానికే నిర్ణయించుకున్నాం. నో డౌట్!" శంకర్రావు వైపు చూస్తూ అంది సూర్యకుమారి.

"అవును. ఆవిడ మాటతో నేనూ ఏకీభవిస్తాను" అన్నాడు శంకర్రావు.

"సరే...మీ ఇష్టం. కానీ. అరవై ఏళ్ళు దాటిన మీరిద్దరూ ఇలాంటి నిర్ణయానికి రావడం నిజంగా బాధాకరం. అదీ పెళ్ళయిన ముగ్గురి పిల్లల తల్లిదండ్రులుగా!" కుర్చీలోంచి లేచాడు రమణ.

"థాంక్స్...నువ్వు బాధపడుతున్నావని మాకు తెలుసు... అయినా మా నిర్ణయం మారదు... ఎందుకంటే, చాలా చర్చించే ఈ నిర్ణయానికొచ్చాం!" శంకర్రావూ, సూర్యకుమారీ కూడా లేచి నిలబడి అన్నారు. రమణప్రసాద్ కారు వెళ్ళిపోయింది.

"కాఫీ కావాలా ఇంకోసారి?" అడిగింది సూర్యకుమారి.

"నో థాంక్స్... ఉత్తి కాఫీ మాత్రమే తాగటం ఈ వయసులో మంచిది కాదు. కాఫీతోపాటు ఏ పకోడీలో, బజ్జీలో ఆయితే ఆరోగ్యానికి చాలా మంచిదని నా అభిప్రాయం!" నవ్వి అన్నాడు శంకర్రావు.

"ష్యూర్... బజ్జీలూ పకోడీలూ ఆరోగ్యానికి మంచివి. అంతేగాక అరవై దాటాక ఎంత నడిస్తే అంత మంచిదిట. సో... ఈ వీధి చివరి 'అన్నారం' హోటల్‌దాకా వెళ్ళి వేడివేడిగా మీరు బజ్జీలు తీసుకురండి... ఈలోగా అతి చక్కని చిక్కని ఫిల్టర్ కాఫీకి నేను ఏర్పాట్లు చూస్తా!" తల ఎగరేసి వంటగదిలోకి నడిచింది సూర్యకుమారి.

"బహుశా నా జీవితంలో ఏనాడూ మర్చిపోలేని 'కేసు' ఇదే అవుతుందేమో! జీవితపు చరమదశలో మీరీ నిర్ణయానికి రావడానికి కారణాలు ఏమైనా ఉండొచ్చు. వాటి గురించి నేను అడగను. కానీ, ఇది మంచి నిర్ణయం అని మాత్రం నాకు అనిపించడం లేదు. సరే... లీగల్‌గా మీకు విడాకులు మంజూరు చేస్తున్నాను. గాడ్ బ్లెస్ యూ!" తీర్పు చెప్పి నిట్టూర్చాడు కుర్రజడ్జి.

"థ్యాంక్స్" కోరస్‌గా అన్నారు శంకర్రావూ, సూర్యకుమారీ.

"పదండి... నా కార్లో దింపుతా!" కోర్టు బయట అన్నాడు రమణప్రసాద్.

"థ్యాంక్స్ రమణా... లాస్ట్‌రైడ్ ఇన్ యువర్ కార్" అన్నమాట. ఇహ కోర్టుతో పనిలేదుగా!

మాట్లాడకుండా కూర్చుంది సూర్యకుమారి.

❀ ❀ ❀

"ఇవాళ ఆగష్టు పధ్నాలుగు. ఎనిమిదీ ప్లస్ అయిదూ=పదమూడు. అంటే టోటల్ నాలుగు!" కుర్చీలో కూర్చుంటూ అంది సూర్యకుమారి.

"అవన్నీ నాకు తెలీదుగానీ రేపు ఆగష్టు పదిహేను. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజు."

"అవును. దేశానికీ మీకూ కూడా....సారీ... 'మనకి' స్వాతంత్ర్యం నిన్ననే సిద్ధించిందిగా! నవ్వింది సూర్యకుమారి. "ముప్పైతొమ్మిదేళ్ళ బంధం నేడు స్వేచ్ఛగా మారింది"

"నీ లెక్క రైట్. నీ లెక్క ఎప్పుడూ తప్పదుగా... థర్టీనైన్ ఇయర్స్!" నవ్వాడు శంకర్రావు.

"లెక్కపెడితేగా తప్పటానికి! ఎలాగెలాగో గడచిపోయింది జీవితం. అసలు గడుస్తున్న విషయమే తెలియనంత వేగంగా గడిచింది!" నిట్టూర్చింది సూర్యకుమారి.

"అవును! మన పెళ్ళప్పటికి నాకు ఇరవైనాలుగూ నీకు ఇరవై (ఒక్కటి) రెండనుకుంటా.. సరిగ్గా సంవత్సరానికి లక్ష్మి పుట్టింది. ఆ తరువాత సంవత్సరానికి శ్రీరామ్ పుట్టాడు. ఆ తరువాత రెండేళ్ళకి సరస్వతి!" అన్నాడు శంకర్రావు.

"అవును! ఈ ఇంట్లోనే ఇన్నేళ్లూ గడిచాయి. పిల్లలూ, పిల్లల పిల్లలూ, అందరూ పుట్టింది ఇక్కడే!" కళ్ళు మూసుకుని అంది సూర్యకుమారి.

"సారీ! బాధగా ఉందా?" అనునయంగా అడిగాడు శంకర్రావు.

"లేదు... నిజంగా బాధలేదు. కాఫీ పెట్టాక గిన్నెని తొలుస్తాం. కాఫీ తాలూకు మరకలు పోయినా వాసనమాత్రం పోదు. అలాంటిదే ఇదీ. వాసన పోవాలంటే... 'సబ్బో', సబీనా'నో వాడాలి!" నిర్లిప్తంగా అంది సూర్యకుమారి.

మౌనం మాటల్ని మింగేసింది... కృష్ణబిలం నక్షత్రాల్నీ, గోళాల్నీ మింగేసినట్టు. సెల్‌ఫోన్ మోగింది. సూర్యకుమారి తీసింది.

"ఎవరూ? ఆ...! శ్రీరామ్.... మా నిర్ణయాల్లో మార్పేమీ లేదు. డైవోర్స్ ఇచ్చేశారు.... ఏం ఫరవాలేదురా... డోంట్‌వర్రీ.... ఇవన్నీ మీరు ఆలోచించకండి. అక్కర్లేదురా, అన్నీ నేను హ్యాండిల్ చెయ్యగలను. తొందరపడి ఇండియా రావద్దని లక్ష్మికి మరీ మరీ చెప్పు. ఓ.కె. కోడలూ, నువ్వు, బాబీ బాగానే ఉన్నారుగా! ఆయనతో మాట్లాడతావా? ఓ.కె.బై...!ఫోన్ పెట్టేసింది సూర్యకుమారి.

"వాడు నాతో మాట్లాడనన్నాడు గదూ?" నిస్పృహతో అన్నాడు శంకర్రావు.

"అదేం లేదు. బిజీగా ఉన్నాట్ట. తర్వాత చేస్తానన్నాడు!" ఫోన్‌వంక చూస్తూ అంది సూర్యకుమారి.

"ఎందుకూ వెనకేసుకురావడం? నాకు తెలుసు సూరీ! లక్ష్మీగానీ, శ్రీరామ్ గానీ ఏనాడూ నన్ను అర్థం చేసుకునే ప్రయత్నం చెయ్యలేదు. బహుశా సరస్వతి నన్ను అర్థం చేసుకుంటుందేమో చూద్దాం. అయినా నాకేమీ బాధలేదులే.... ఒకవిధంగా ఇదీ మంచిదే! నన్ను తప్పుపడితే వచ్చే నష్టం నిజంగా ఏమీలేదు'" నిట్టూర్చాడు శంకర్రావు.

"నిర్ణయం' ఇద్దరిదీ అయినప్పుడు 'నింద' ఒక్కరే ఎందుకు భరించాలి? వాళ్ళకి చెపుతాను... మే...బీ...కొంచెం మెల్లగా!" శంకర్రావుని చూస్తూ అంది సూర్యకుమారి.

"నీకు జ్ఞాపకం ఉందా? ఆ బాదంచెట్టు లక్ష్మి పుట్టినరోజున నాటాను. ఆ టేకు చెట్టు... చెట్టు కాదు... అప్పుడు మొక్కేగా, అది శ్రీరామ్ పుట్టిన రోజున మా అమ్మ నాటింది. ఇదిగో, ఈ మారేడుచెట్టు సరస్వతి పుట్టిన అరగంటలో నాటింది! నాటిందెవరో గుర్తుందా? మీ అమ్మగారు. అంటే నా అత్తగారు!" టాపిక్ డైవర్టు చేశాడు శంకర్రావు.

"అవును.... ఆ చెట్లుమాత్రం ఎక్కడ మొక్కలుగా నాటామో అక్కడే ఉంటాయి. కానీ నాటినవాళ్ళు?" నిర్లిప్తంగా అంది సూర్యకుమారి.

"ఊ! మా అమ్మా లేదు... మీ అమ్మా లేదు... మిగిలింది మనిద్దరం.. రేపట్నించీ మనమూ..." సైలెంటైపోయాడు శంకర్రావు.

"వాక్యం పూర్తిచెయ్యొచ్చుగా.?? మిగిలిన మనిద్దరం రేపట్నించీ దూరంగా.... సారీ, స్వతంత్రంగా స్వేచ్ఛగా... మనసుకి తోచినట్టు ఉండబోతున్నాం"

"సూరీ... ఒక్కమాట చెప్పు... కోర్టు మనకి లీగల్‌గా విడాకులిచ్చింది. సరే.... కలిసివుండాలో, విడిపోవాలో నిజంగా నిర్ణయించుకోవాల్సింది మనమేగా? లీగల్‌గా పేపర్ల మీద సంతకాలు పెట్టి విడిపోయామేగానీ, నేను కట్టిన తాళి ఇంకా నీ మెడమీదే ఉందిగా... అలాగే నువ్విచ్చిన అనుభవాలూ నా గుండెల్లోనే ఉన్నాయిగా! వాటిని తీసివెయ్యగలమా?" భార్య కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు శంకర్రావు.

"నిజమే.... మీరు కట్టిన తాళిని నేను బ్రతికున్నంతవరకూ తీసెయ్యలేను... కానీ..." ఫోన్ మోగింది. చూశాడు శంకర్రావు. 'సరస్వతి' అని డిస్‌ప్లేలో కనిపించింది.

"హలో... ఏంటమ్మా!" ఆన్‌చేసి అన్నాడు.

"డాడ్... శ్రీరామ్ ఫోన్‌చేశాడు. డైవోర్స్ అయిపోయిందంటగా... నిజమేనా?"

"అవునమ్మా!"

"నాన్సెన్స్. ఈ వయసులో ఇలాంటి పిచ్చిపనులేంటి డాడ్... మతిపోయిందా ఇద్దరికీ?" కోపంగా అరిచింది సరస్వతి.

"మతిపోలేదన్నది వాస్తవం. అదిపోతే మాట్లాడలేనుగా!" నవ్వాడు శంకర్రావు.

"నో జోక్స్ డాడీ.... అసలెందుకిలా చేశారో మాకెవరికీ అర్థంకావడం లేదు. దాని సంగతి అలావుంచితే మీ వ్యవహారం చాలా సిల్లీగా ఉంది" సీరియస్‌గా అంది సరస్వతి. "కొన్ని నిర్ణయాలకి మూలం సిల్లీగానే అనిపిస్తుందిరా సరస్వతీ.... కానీ ఆ నిర్ణయాల వెనక ఉండే ఆలోచనో, తపనో, టెన్షనో తెలిసేది నిర్ణయం తీసుకున్నవాళ్ళకేగా!" అనునయంగా అన్నాడు శంకర్రావు.

"మమ్మల్ని భూమిమీదకి తెచ్చింది మీరేగా? మీ నిర్ణయాలు, మీ ఆలోచనలూ, మీ తపనలూ చట్టుబండలూ తెలుసుకోవాల్సిన 'హక్కు' మాకు లేదా?" కోపంగా అంది సరస్వతి.

"మా నిర్ణయం వల్ల మీకేమీ ఇబ్బంది ఉండదుగా చిన్నీ. టెన్షన్ పడకు. కూల్‌గా ఉండు. మీ అమ్మతోటి మాట్లాడతావా?"

"ఆహా... ఇవ్వండి" కోపంగా అంది సరస్వతి.

"ఇదిగో మాట్లాడు..." అంటూ సూర్యకుమారికి ఫోన్ ఇచ్చాడు శంకర్రావు.

"ఊ...! చెప్పవే... కోపంగా ఉందా?" నవ్వింది.

"కాక హాయిగా ఉంటుందా? ఏం పనమ్మా ఇదీ... తెలిసిన దగ్గర్నించీ మీ అల్లుడిగారి సణుగుడు భరించలేకపోతున్నాను.... వదినైతే మరీనూ!"

"బీ కూల్... ఇది మేంఇద్దరం కలిసి తీసుకున్న నిర్ణయం. కారణాలు..." ఫోన్ పక్కన పెట్టింది సూర్యకుమారి.

"పెట్టేశావేం?"

"లైన్‌కట్ అయింది. సిగ్నల్స్ పోవడం మామూలేగా. ఏవేవో చెప్పి దాన్ని జోకొట్టే గోలతప్పింది లైన్ కట్టవడంతో... అందుకే అంటారు... అన్నీ మనమంచికే అని!" సుఖంగా నిట్టూర్చింది సూర్యకుమారి. కాసేపు మౌనం పుట్టలో పాము ఒదిగినట్టు ఒదిగిపోయింది.

"తరువాత...!" నిట్టూర్చి అన్నాడు శంకర్రావు.

"ఏముందీ! నేను కాశీ వెళ్ళిపోదల్చుకున్నాను" నవ్వింది సూర్యకుమారి.

"నేనూ రావొచ్చా?"

"అలా అయితే ఈ విడాకులెందుకూ! చూడండీ... ఉహూ... ఈ క్షణంనించే ఫార్మాలిటీస్ వదిలేద్దాం. మీరు నన్ను సూర్యా అని పిలవొచ్చు... నేనూ మిమ్మల్ని అండీ గిండీలు మానేసి శంకర్ అనో, రావు అనో పిలుస్తా... ఓ.కే.?

"సరే శంకర్. ఇంతకాలం ఒకరినొకరు ప్రేమించుకున్నామో, తిట్టుకున్నామో, లోపల్లోపలే ఆవేశాల్ని అణచుకుని రాజీపడుతూ వచ్చామో మనకే తెలుసు. ఎస్... మన మనసులకి మాత్రమే తెలుసు. అసలీ 'రాజీ' బతుకు ఎందుకూ?

'పెళ్ళి' అనే ఒక్కమాటతో మనల్ని గానుగెద్దులుగా మార్చింది ఈ సంఘం. కేవలం మననేకాదు... తరతరాల్నీ ఇనుపచట్రాల్లో బిగించి, ఇదే మన సంస్కృతి, ఇదే మన సాంప్రదాయం అంది.

మనిషి బ్రతికేది ఒక్కసారే. పోనీ పునర్జన్మలూ గతజన్మలూ ఉన్నాయనుకున్నా ఈ శరీరమూ, ఈ జీవితమూ మళ్ళీ రాదుగా! అందుకే ఎవరి దారి వాళ్ళు చూసుకుందాం!" కొంచెం ఆవేశంగా అంది సూర్యకుమారి.

"నీలో ఇన్ని భావాలున్నాయా సూరీ! నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది. ఏనాడూ ఏ విషయంలోనూ గట్టిగా నోరెత్తేదానివి కాదు!"

"అవును!"" శంకర్రావుని మధ్యలోనే కట్‌చేసి అంది సూర్యకుమారి. "అవును. అందుకే ఇన్నేళ్ళ మన కాపురం సజావుగా జరిగింది. నీలాగానే నేనూ ఉద్యోగం చేశాను. బాధ్యతల్ని ఇన్నేళ్ళూ పంచుకున్నా.... ఏనాడూ ఎదిరించలా....

అంతేకాదు నీకేం గావాలో ప్రతి నిమిషమూ గమనించా... నీ అవసరాలూ, పిల్లల అవసరాలూ సక్రమంగా చూడటంలో "నేను" అనేదాన్ని ఉన్నానని "నేనే" మర్చిపోయా. ఓ మరబొమ్మకింద మారి మనసుని సమాధి చేశా!" ఆగింది సూర్యకుమారి.

ఆమె కళ్ళల్లో నీళ్ళు.

"సారీ...." ముందుకొచ్చి కళ్ళు తుడవబోయాడు శంకర్రావు.

"డోంట్ డూ ఇట్..." కరుగ్గా అంది సూర్యకుమారి.

"ఎందుకీ కళ్ళు తుడవడం? వద్దు శంకర్రావ్ వద్దు... ఇలాంటి పనులే ఆడదాన్ని మళ్ళీ మళ్ళీ సంసారంలోకి నెడతాయి. కళ్ళు తుడవడం... కావలించు కోవడం... కాసేపు బులిపించడం... నువ్వే నా ప్రాణం అనడం... ఇవే... ఇవే మమ్మల్ని మీ బానిసలుగా చేసేవి"

"అంటే నేను నిన్ను బానిసగా చూశానా?" హర్ట్ అయ్యాడు శంకర్రావు.

"ఉహూ....! నేను నిన్ను తప్పుపట్టడంలా! కామన్‌గా చెప్పాను. నువ్వు నన్ను ఏనాడూ బానిసలా చూడలేదు. కానీ నేనే నీకూ ఈ ఇంటికీ బానిసనయ్యాను. గుర్తుందా? పెళ్ళయిన కొత్తల్లో నా 'పాట' అంటే చెవికోసుకునేవాడివి.

మళ్ళీ మళ్ళీ నాచేత పాటలు పాడించుకునేవాడివి.... కథల పోటీలో నేను బహుమతి గెల్చుకున్న రోజునేగా 'లక్ష్మి' పుట్టిందీ... నువ్వేం చేశావో గుర్తుందా! నా కథని వరుస పేజీలుగా పేర్చి ఫోటోలా అద్దాల ఫ్రేమ్ కట్టించి ఇచ్చావు. ఇప్పుడది ఎక్కడుందో తెలుసా?" నవ్వింది సూర్యకుమారి.

ఆ నవ్వులో నవ్వులేదు. ఓ నిష్టూరం ఉంది.

"సూరీ! పెళ్ళికాకముందు నేనూ క్రికెట్ ఆడేవాడ్ని. డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో చదరంగంలో ఫస్టు వచ్చాను తెలుసుగా... పెళ్ళి అయి బాధ్యతలు పెరిగిన కొద్దీ ఆటలు తగ్గాయి. అంతమాత్రాన స్వాతంత్ర్యం పోగొట్టుకున్నట్టా? ఇద్దరం పనిచేశాం. కొన్ని సరదాలు ఇద్దరం పోగొట్టుకున్నాం. కొన్ని సంతోషాలు ఇద్దరం పొందాం!" ఆవేశంగా అన్నాడు శంకర్రావు.

"ఒకమాట అడుగుతాను నిజం చెబుతావా?" సూటిగా అడిగింది సూర్య.

"నీతో అబద్ధం ఎప్పుడైనా చెప్పానా?"

"అబద్ధం చెప్పకపోవడం అంటే 'నిజం' చెప్పినట్టు కాదుగా, నిజాన్ని తెలివిగా దాటెయ్యడం" నవ్వింది సూర్యకుమారి.

"సరే.... అడుగు!"

"నిజంగా నువ్వు రాధని మర్చిపోయావా?" సూటిగా అంది.

"ఏ రాధ?"

"నువ్వు ప్రేమించిన రాధ... నీ మేనత్త కూతురు అనురాధ!"

"వాట్ నాన్సెన్స్! తను నాకు మేనత్త కూతురే... కానీ నేను ప్రేమించానని ఎవరన్నారు? ప్రేమిస్తే ఆమెనే చేసుకునిఉండేవాడ్నిగా?" కోపంగా అరిచాడు శంకర్రావు.

"కూల్‌డౌన్ శంకర్.... ప్రేమించడం తప్పని నేననలేదు. కనుక నువ్వు ప్రేమించడంలో తప్పులేదు. వాళ్ళు బాగా వున్నవాళ్ళు గనుక, పెళ్ళికి ఆమె తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడమూ తప్పుకాదు. ఏమైనా మీ ఇద్దరికీ పెళ్ళి జరగదన్న విషయం మీ అమ్మగారికి తెలుసు.

అందుకే అర్జెంటుగా సంబంధాలు వెదికారు. వాళ్ళు 'కాదన్నా'రన్న ఉక్రోషంతో నువ్వు పెళ్ళికి ఓ.కే అన్నావు. మన పెళ్ళి వెంటనే జరిగిపోయింది..... అవునా?" నవ్వింది సూర్యకుమారి. ఆ నవ్వులో 'నాకన్నీ తెలుసు' అన్న భావన కనపడింది.

"ఎప్పటి సంగతులు తవ్వుతున్నావు సూరీ! గతాన్ని తవ్వుతున్నావు... ఏం దొరుకుతుందీ? ఎముకలూ, కుండపెంకులూ, పగిలిన అద్దాలా?" గొంతుకి ఏదో అడ్డంపడినట్లైంది శంకర్రావుకి.

"మై డియర్ శంకర్... ఉన్నవే తవ్వకాల్లో బయటపడతైగానీ లేనివి కాదుగా!" చిద్విలాసంగా నవ్వింది సూర్యకుమారి.

"నీ ఇష్టం సూరీ... నీ ఇష్టం..."

"నేనడిగేది నా ఇష్టాన్ని కాదు... నిజాన్ని!"

"అంటే?"

"రాధని ప్రేమించావా లేదా అని!"

"ఓ.కె. దేనికి దాయాలీ? ప్రేమించాను... అప్పుడు. ఆ తర్వాత నీతోపెళ్ళయ్యాక ఆమెని కలవలా!"

"కలవకపోవటం నిజం! తల్చుకోలేదా?"

"ఏమో! తలుచుకున్నానేమో!... అయితే?"

"చూశావా! మన మనసుకి మనమే బంధీలవుతాం. పైకిమాత్రం స్వేచ్ఛ కావాలి అంటూ కేకలు పెడతాం. నీ మనసులోని నిజాన్ని నువ్వే చెప్పలేకపోతున్నా వంటే, నీకు ఎంత స్వేచ్ఛ దొరికినా ఏమి లాభం... మనిషికి ఎంత స్వేచ్ఛ ఇచ్చినా తన మనసనే ఊబిలోకి మళ్ళీ మళ్ళీ దిగుతూనే వుంటాడు"

"ఇప్పుడవన్నీ అవసరమా?"

"ఇప్పుడైనా ఓపెన్‌గా ఉందాం. ఎందుకంటే, నేను మా బావ దగ్గరికి అంటే కాశీకి వెళ్ళిపోదల్చుకున్నాను. చెప్పడం నీకిష్టంలేకపోతే బలవంతం ఏదీ లేదు"

"మీ బావా?"

"ఏం? ఉండకూడదా? నిజంగా నాకో బావ ఉన్నాడు. నేను కాలేజీ చదువు వెలగబెడితే అతను వంశపారంపర్యంగా వస్తున్న పౌరోహిత్యం నిలబెట్టుకున్నాడు. నేను బి.ఎ. ననే గొప్పతో అతన్ని చేసుకోనని తెగేసి ఇంట్లో చెప్పేశా. ఓ రోజు అతనికే 'మొహం' మీద చెప్పేశా. మౌనంగా విన్నాడు.

నా పెళ్ళి కుదిరిందని తెలిసి కాశీ వెళ్ళిపోయాడు. ఆ తరువాత అక్కడ క్షుణ్ణంగా వేదపండితుడయ్యాడట. అందుకే ఇప్పుడు నేను కాశీని ఎన్నుకున్నా!" శంకర్రావునే చూస్తూ అంది సూర్య.

"అప్పుడు లేని ప్రేమ ఇప్పుడు పుట్టుకొచ్చిందా అతనిమీద?" వెటకారంగా అన్నాడు శంకర్రావు.

"నేనూ అదేగా అడిగిందీ! అప్పుడు రాధమీద ఉన్న ప్రేమ ఇప్పుడూ ఉన్నదా అనేగా!" నవ్వింది సూర్యకుమారి.

"ఉందీ ఉందీ ఉందీ... సో!" కచ్చగా అన్నాడు శంకర్రావు.

"గుడ్... ఇప్పుడు నువ్వు ఫ్రీబర్డ్‌వి. హాయిగా ఆమెని ప్రేమించు. ఆమెకీ ప్రేమించడానికి తీరిక వుంటే!" పకపకా నవ్వింది సూర్యకుమారి.

"వాట్ నాన్సెన్స్?"

"అరుపులెందుకూ? ఆమెకీ ఇప్పుడు ఎవరూ లేరుగా... భర్తపోయాడు. పిల్లలు లేనేలేరు. ఒంటరిది. తల్లిదండ్రులు పోయారు. అన్నదమ్ములు అసలే లేరు. ఇప్పుడు నువ్వూ ఒంటరివే! ఇద్దరూ కలిస్తే జంట బాగుంటుందని అన్నాను. కోపం ఎందుకూ?"

"ఇవన్నీ... ఇవన్నీ ఎలా తెలుసూ?"

"ఆడవాళ్ళ మనసుకి కూడా కళ్ళుంటాయి గనక తెలిసింది... డైరీల్లో చాలా చాలా రాసుకున్నావుగా!" నవ్వింది.

"అంటే నా డైరీలు దొంగతనంగా చదివావా?" ఆశ్చర్యంగా, ఆవేశంగా అన్నాడు శంకర్రావు.

"కొన్ని తప్పనిసరి పరిస్థితుల్లో చదవాల్సి వచ్చింది. నీ నిర్మలమైన ప్రేమకి నిజంగా జోహార్లు... ఎనీవే... ఇప్పటికైనా నువ్వు కోరుకున్నట్టు జీవించు!"

"సూరీ.... నిజంగా నన్ను నమ్ము.... మనసా వాచా కర్మణా...."

"నో...నో... నీమీద నేనేమీ నిందలు వెయ్యడంలా! అంతేకాదు... నిన్ను నేను అర్థం చేసుకున్నాను. నీమీద కోపంతోటో, నువ్వు అన్యాయం చేస్తున్నావనో నేను ఈ మాట అనడంలేదు. మనస్ఫూర్తిగా అంటున్నా... నేను కాశీ వెళ్ళాక హాయిగా రాధని పిలిపించుకో లేదా ఆమెని ఇక్కడికి రమ్మని నేనే పిలిచి నీ చేతుల్లోకి ఒప్పగిస్తాను!" అంది సూర్యకుమారి సిన్సియర్‌గా.

"మీ బావ ఎవరో 'కాశీ'లో ఉన్నారని చెప్పడం అబద్ధం. ఏనాడూ ఆ బావగారి గురించి నేను వినలేదు. మరో విషయం. ఇన్నేళ్ళ మన ప్రయాణంలో ఏనాడూ నేను రాధని గురించిన ప్రసక్తి తీసుకురాలేదు. పోనీ నా డైరీలోనైనా ఆమె గురించి పిచ్చి ఊహలు, ఆశలూ పెట్టుకోలేదు.

నువ్వెందుకు అసలీ విడాకుల ప్రసక్తి తీసుకొచ్చావో, ఎందుకు ఇన్నేళ్ళ తరువాత రాధ గురించిన గతం తవ్వుతున్నావో నాకు తెలీదు. ఒక్కటిమాత్రం చెప్పగలను. నువ్వు లేకుండా నేను ఉండలేను. ఆ నిర్ణయానికి వచ్చే నువ్వు విడాకులన్నా ఒప్పుకున్నాను కానీ సూరీ నువ్వులేని జీవితాన్ని ఊహించలేను. నమ్ము...నమ్మకపో!" సూర్యకుమారి కళ్ళలోకి సూటిగా చూస్తూ చెప్పాడు శంకర్రావు.

"అలాంటప్పుడు విడాకులకి ఎందుకు ఒప్పుకున్నావూ?"

"మూడుమూళ్ళ బంధం స్త్రీని జన్మాంతం బంధిస్తుంది. 'విడాకులు' అనేది ఇస్తే కనీసం మానసికమైన స్వాతంత్రం నువ్వనుభవించగలవేమో అనుకున్నాను. మొదటి ముడి తనువుది. రెండోది మనసుది. మూడో ముడి ఆత్మది.

శరీరంతో ఇప్పుడు నిజంగా పనిలేదు. మనసుకి స్వాతంత్ర్యం ఇస్తే, సంకెళ్ళు తొలగి ఆత్మబంధం మరింత పెరుగుతుందనుకున్నాను. ఇప్పుడు మనం హక్కులూ బాధ్యతలూ అనే గిరిలో పడుండాల్సిన పనిలేదు. జీవితాంతం స్నేహితుల్లా ఉండవచ్చుననుకునే విడాకులకి ఒప్పుకున్నాను!"

"ఎంత తప్పు! మనమధ్య పిల్లలున్నారుగా హక్కుల్నీ, బాధ్యతల్నీ గుర్తు చేయడానికి!" చిన్నగా నవ్వింది సూర్యకుమారి.

"ఉన్నారు! ఉంటారు! కానీ, వాళ్ళూ చిన్నపిల్లలు కాదు. ఒకవిధంగా చూస్తే వాళ్ళనీ మన స్నేహితుల్లాగే చూద్దాం. పోనీ ఆ గదిలో నువ్వూ ఈ గదిలో నేను అపరిచితుల్లా ఉందాం... మెల్లమెల్లగా ఒకరినొకరు ప్రేమించుకుని ప్రేమికులుగా జీవితాంతం గడుపుదాం!"

"వాటే స్వీట్ డ్రీమ్! నువ్వన్నట్టు నాకు కాశీలో బావ ఎవడూ లేడుగానీ... అక్కడే మిగిలిన జీవితాన్ని గడపాలనే కోరిక ఉంది!"

"పోనీ నేనూ నీతోనే వస్తాను!" అన్నాడు.

"నువ్వూ నాతో వస్తే నేను మళ్ళీ నీ భార్యగానే మెలుగుతానుగానీ నేననుకున్న మోక్షగామిగా కాదు. అలాగే నేనెదురుగా ఉన్నంతకాలమూ నువ్వు నామీద ఆధారపడతావేగానీ, నీలా నువ్వుండలేవు. లేదు శంకర్....నేను వెళ్తాను! దయచేసి మళ్ళీ నన్ను సంసారమనే బురదలోకి లాగొద్దు.

అలాగే భగవంతుడి దయవల్ల నా పెన్షన్ నాకూ నీ పెన్షన్ నీకూ వస్తుంది. కనుక ఈ మాట నిజంగా చెబుతున్నా. ఇన్నేళ్ళు అంటే అరవైయేళ్ళు దాటేవరకూ మనం మనకోసం, మన పిల్లలకోసమే బ్రతికాం. శేషజీవితమైనా కనీసం సంఘం కోసం బ్రతుకుదాం. మనకితోచిన సేవ చేద్దాం! సరేనా?" లాలనగా అంది సూర్యకుమారి. మాటలు రాక మౌనంగా ఉండిపోయాడు శంకర్రావు.

వారణాసి ఎక్స్‌ప్రెస్ బయల్దేరటానికి సిద్ధంగా ఉంది. శంకర్రావు, సూర్యకుమారి వెంట తెచ్చుకున్న రెండు సూట్‌కేసుల్నీ బెర్త్‌కింద సర్దాడు.

"ఓ.కె. శంకర్. ఇంకో మూడునిమిషాల్లో ట్రైన్ బయలుదేరుతుంది. ఒక్క కోరిక కోరితే ఏమన్నా అనుకుంటావా?"

"ఊహూ... నా ప్రాణాలు ఈ క్షణంలో ఇమ్మన్నా ఇస్తా!" బేలగా అన్నాడు శంకర్.

"ఇక్కడ ముద్దుపెట్టవూ.... అదేదో ఫ్రెంచికిస్ అంటారే.... అదీ!" నవ్వింది సూర్యకుమారి.

గభాల్న ఆమెని అక్కడే అందరిముందూ కౌగలించుకుని పెదాలు కలిపేశాడు శంకర్రావు. అతని కళ్ళల్లో నీళ్ళు కారుతున్నా పెదాలుమాత్రం విడలేదు. రెండు నిముషాల తరువాత అతన్ని మెల్లగా వెనక్కి తోసి అంది సూర్య "థాంక్స్!" అని.

❀ ❀ ❀

"ఆంటీ... మీరంటే అంకుల్‌కి ఎంత ప్రేమో!" ట్రైన్ బయల్దేరాక అంది ఎదుటిబెర్త్ అమ్మాయి.

అప్పటికి సూర్యకుమారి 'షీరో' పుస్తకాన్ని బయటికి తీసింది. "అవును! నేను లేకపోతే ఆయన క్షణమైనా ఉండలేరు. ఉత్త పసిపిల్లాడు. ఏంకావాలో ఎంత తినాలో కూడా తెలీదు!" నవ్వింది.

"మరి ఆయన్నీ మీవెంట తీసుకురావొచ్చుగా... ఇప్పుడు ఎంత ఇబ్బంది పడతారో... పాపం ట్రైను బయలుదేరేదాకా కన్నీళ్ళతో చూస్తూనేవున్నారు" జాలిగా అంది ఎదుటిబెర్త్ అమ్మాయి.

"నీకు పిల్లలున్నారమ్మా?"

"ఉన్నారు ఆంటీ... ఇద్దరూ మగపిల్లలే. ఒకళ్ళు ఎయిత్... ఇంకోడు ఫిఫ్త్..." గర్వంగా అంది.

"స్కూలుకెళ్ళేటప్పుడు పేచీలేమైనా పెడతారా?" నవ్వుతూ అడిగింది సూర్యకుమారి.

"పేచీలా? ఓరినాయనో... తల్చుకుంటేనే గుండె గుభేల్‌మంటుంది. అలకలూ, ఏడుపులూ... అబ్బా... వాళ్ళని స్కూలుకి పంపేసరికి తలప్రాణం తోకకొచ్చేది!"

"కదూ! వృద్ధాప్యం కూడా మరో బాల్యంలాంటిదే. అప్పుడు స్కూల్‌కి వెళ్ళడం ఎలా అలవాటు చేశామో ఇప్పుడు ఒంటరిగా తన పనులు తానే చేసుకోవడం మగవాడికి అలవాటు చెయ్యాలి. తప్పదు!"

"ఎందుకూ?" ఆశ్చర్యంగా అడిగింది ఎదుటి బెర్త్ ఆవిడ.

**"భర్త పోయినా భార్య తన పిల్లల్నీ, మనవల్నీ చూసుకుంటూ ధైర్యంగానో, దైన్యంగానో బతుకు వెళ్ళదీయగలదు. అదే భార్య గనక ముందు చనిపోతే ఆ భర్త బతుకు నరకమే. పొట్టలో ఉండగానే పిల్లల తన్నుల్ని తినడం ఆడదానికి అలవాటే....**

కానీ మగవాడికి అలా కాదుగా! స్వంత పిల్లలైనా ఓ చిన్నమాట అన్నా విసుక్కున్నా భరించలేడు. తలవంచుకునో, పరిస్థితులతో రాజీపడో బతుకలేడు" ఓ క్షణం ఆగింది సూర్యకుమారి.

"మరో మార్గం లేదంటారా? పిల్లలు మంచివాళ్ళయినా మగవాడు వాళ్ళతో ఉండలేడా" అడిగింది ఎ.బె. ఆవిడ.

"నిజంగా మరో మార్గం లేదు. పెళ్ళయిన మరుక్షణం నించే మగవాడు భార్యమీద అన్ని విషయాల్లోనూ ఆధారపడటం మొదలెడతాడు. ఊహూ.... మొదలెట్టడం కాదు. మనమే మగవాడ్ని మనమీద ఆధారపడేలా చేసుకుంటాం.

అలా ఆధారపడేవాడ్ని చూసుకుని సంతోషిస్తామే గానీ, 'ఒకవేళ మనం ముందుపోతే ఆ మనిషి ఎంతటి నరకాన్ని అనుభవించాల్సివస్తుందో' అన్న విషయాన్ని గురించి ఆలోచించనే ఆలోచించం. అది తెలిసేసరికి ఇదిగో ఇలా వయసు మీదపడిపోయింది! అందుకే ఇప్పటికైనా కళ్ళు తెరిచి కాశీకిపోతున్నా!"

"అంటే... ఆయన్ని..." అడిగింది ఎ.బె.ఆవిడ.

"ఒంటరిగా ఉండగలిగే ట్రైనింగ్ ఆయనకి ఇస్తున్నాననుకో!" నవ్వింది సూర్యకుమారి. మళ్ళీ 'షీరో' పుస్తకం తీస్తూ.

"మీరు న్యూమరాలజీ బాగా స్టడీచేశారా ఆంటీ?"

"ఆహా! గొప్ప ప్రావీణ్యం ఉన్నదాన్ని కాకపోవచ్చు గానీ ఫరవాలా!" నవ్వింది సూర్యకుమారి.

"నా ఫేట్ చెబుతారా!" మొహం అంత చేసుకుని అంది ఎ.బె.ఆవిడ.

"దానికేం భాగ్యం... ఏదీ నీ డేటాఫ్ బర్త్ మిగతా వివరాలు చెప్పు!"

"ఆగష్టు పదిహేడు... పందొమ్మిది వందల..." చెప్పింది.

మౌనంగా కేలిక్యులేట్ చేసింది సూర్యకుమారి. "నిజం చెబితే పెళ్ళయిన వారంరోజుల్లోనే నీ భర్త యాక్సిడెంట్‌లో పోయుండాలి. సంవత్సరం తిరిగేలోగా రెండో పెళ్ళి చేసుకుని వుండాలి... అవునా?" సూటిగా చూస్తూ అడిగింది సూర్యకుమారి.

"మైగాడ్! ఎలా... ఎలా ... చెప్పగలిగారు?" నిర్ఘాంతపోయింది ఎ.బె. ఆవిడ.

"ఆ గొప్ప నాది కాదు... ఈ సంఖ్యాశాస్త్రానిది. సరే..... నీ ఫ్యూచర్ ఏమంటే అతిత్వరలో మీ ఫ్యామిలీ మొత్తం విదేశాలకి వెళ్ళిపోతుంది!"

"గాడ్...నిజంగానే వెళ్తున్నాం... అమెరికాకి... అక్కడ చాలా పెద్ద ఉద్యోగం వచ్చింది మావారికి. వచ్చేనెల ఇదే తేదీకి చికాగోలో ఉంటాం!" నోరుతెరిచి ఆశ్చర్యంగా అంది ఎ.బె. ఆవిడ.

"ఎంత కరెక్టుగా చెప్పారు! ఫ్యూచర్ తెలియడం ఎంత అదృష్టం... యూ ఆరే లక్కీ యండ్ గ్రేట్ విమెన్!" మెచ్చుకుందామె.

"అవునా!" నవ్వింది సూర్యకుమారి. మనసులో మాత్రం, 'ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియకపోవటంలో వున్న అదృష్టం నీకేం తెలుసూ! తెలుసుకున్నంత మాత్రాన ఒరిగేదేముందీ? దేన్ని ఆపగలం? ఏమీ చెయ్యలేం.... నిస్సహాయంగా నిలబడటం తప్ప!' అనుకుంది.

కళ్ళనీళ్ళతో తనవంకే చూస్తూ.... కదుల్తున్న రైలుతోపాటు కదిలివస్తున్న శంకర్రావు రూపం ఆమె మనసులో తళుక్కుమంది... గుండె రైలింజన్లా కొట్టుకుంటుంటే, కాలం రైలులాగా 'గమ్యం' వైపుకి పరుగులెడుతోంది.

ఆరుద్రగారి పాట గుర్తొచ్చింది..... 'ప్రాప్తమున్న తీరానికి పడవ సాగిపోయిందీ' అని కాదూ ఆ మహానుభావుడు రాసిందీ!' అనుకుంటూ కళ్ళు కొంగుతో తుడుచుకుంది సూర్యకుమారి.

–స్వాతి జూలై 2013

# ప్రేమ

ఆగ్రా... తాజ్‌మహల్‌ని చూస్తున్నా. "ఎంత అద్భుతంగా ఉందీ!" బయటికే అన్నా.

"అవును. ప్రపంచపు అద్భుతాల్లో ఇదీ ఒకటి కదా!" నవ్విందామె.

"ఎందుకు నవ్వుతున్నారూ?" అడిగా.

"ఇది నిజంగా అద్భుతమే... కానీ మానవ జీవితం అంత అద్భుతం కాదేమో!"

"ఎలా?"

"శ్రీశ్రీగారన్నట్లు ఈ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవరో తెలీదు. శిల్పులెవరో తెలీదు. షాజహానూ ముంతాజ్ మాత్రం తెలుసు. ఇది వారి ప్రేమకి చిహ్నం అని తెలుసు... వారిద్దరిదీ 'కళాత్మక ప్రేమ' అనీ తెల్సు. కానీ, మానవ జీవితంలాగా ఇది అశాశ్వతమే!" అందామె.

"అదెలా?"

"తల్లి కడుపులో అణువుగా ఇమిడిన 'బీజం' శరీరాన్నీ ఎముకల్ని అంగాల్ని మెల్లమెల్లగా సంతరించుకున్నట్టు – ఈ కట్టడమూ పునాదులమీద నించి అద్భుత భవనంగా రూపుదిద్దుకుంది.

మనిషి జీవితం నూరేళ్ళయితే, దీని జీవితం కొన్ని వందలయేళ్ళు లేదా కొన్ని వేలయేళ్ళూ కావొచ్చు. కానీ కాలం ఒడిలో ఎప్పుడో ఒకప్పుడు ఇదీ

ఒదిగిపోక తప్పదు. చనిపోయిన బంధువుల జ్ఞాపకాల్లాగా ఇదీ ఒక జ్ఞాపకంలా ఓనాటికి మిగిలిపోక తప్పదు" నిట్టూర్చిందామె.

కంటిముందున్న సౌందర్యాన్ని చూడకుండా ఓ 'అవశేషంలా' ఈ మహాకట్టడాన్ని ఈవిడ చూడటం నాకు వింతగా అనిపించింది.

జనం ఉత్సాహంగా తిరుగుతున్నారు. ఫారినర్స్ హడావిడి చెప్పక్కర్లా. ఫోటోలు తీసేవాళ్ళూ... తీయించుకునేవాళ్ళూ... మౌనంగా వీక్షించేవాళ్ళూ.... ఆనందంతో పరుగులెత్తేవాళ్ళూ... ఓహ్... ఓ పెద్ద 'సంత'లా అనిపించింది.

"బహుశా నా ఆలోచనా విధానం తప్పుకావొచ్చు. భార్య కోసం ఇంత గొప్ప కట్టడాన్ని నిర్మించడం నిజంగా గొప్పే! కానీ అందులో నాకు ఆడంబరమూ, అహంకారమూ కనిపిస్తున్నాయ్" తలవొంచుకుని అన్నది.

"ఎలా?" అడిగాను.

"ప్రేమించింది 'శరీరాన్ని' అయితే అది అశాశ్వతమని తెలియదా? లేదూ... ప్రేమించింది 'హృదయాన్ని' అయితే దానికి చిహ్నాలూ, నివాళులూ ఎందుకూ? ఏమైనా... ఓ అద్భుత భవనం భూమిమీద వెలిసింది. అందుకు నిజంగా మెచ్చుకోవాలి!" అంది. నేను మాట్లాడలేదు.

ఈవిడెవరో ఇంతకుముందు నాకు తెలీ<sup></sup>. ఇక్కడే, ఓ గంటముందు పరిచయం. నా వయసు నలభై, ఆమె వయసూ దాదాపు అంతే ఉంటుంది. సన్నగా, పొడుగ్గా 'అందం' అలసినట్లుగా ఉంది. జుట్టు అక్కడక్కడా నెరిసింది. పలుచటి పెదాలూ, భావాల్ని ప్రతిఫలించే కళ్ళూ అదనపు ఆకర్షణ.

"మీరు చూడటానికి వచ్చారు... మిమ్మల్నెందుకూ నా మాటలతో నిరుత్సాహపరచడం!" చిన్నగా నవ్వి అన్నది.

"మీరూ చూడటానికే వచ్చారుగా!" నవ్వాను.

"అవును! ఎంతో ఊహించుకుని వచ్చాను కానీ ఎందుకో మనసుకి తృప్తి కలగలా!" నిట్టూర్చింది.

"లోపలికి వెళ్దాం పదండి... బహుశా సమాధి దర్శనంతో మనసుకి సమాధానం దొరకవచ్చు" అంటూ ముందుకు నడిచా. నాతో ఆమే అడుగులు వేసింది.

❁ ❁ ❁

రెండు 'అంతస్తుల్లో' ఉండే సమాధుల్నీ చూశాం. వెనకవైపుకి వెళ్తే యమునా నది కనిపించింది. ఓ అరగంటపాటు తిరుగుతూ చూశాం.

"కాసేపు ఎక్కడైనా కూర్చుందామా?" అడిగింది.

"సరే...! మీకు అభ్యంతరం లేకపోతే అదిగో... ఆ చిన్న దుకాణం దగ్గర కూర్చుని టీ తాగుదాం!" అన్నాను.

"అవును! ఈ చల్లని వేళలో టీ తాగితే హాయిగా ఉంటుంది"

డిశంబరు 'ఆహ్లాదంగా' ఉంటుంది. పగలు తొమ్మిదిన్నర అయినా సూర్యుని కాంతి నులివెచ్చగానే ఉంది. వేడివేడి సమోసాలు తింటూ టీ తాగాము.

మల్లెపూలమీద బంగారు కిరణాలు పడితే ఎలా ఉంటుందో తాజ్‌మహల్ అలా ఉంది.

"ముంతాజ్ ఎంతో అదృష్టవంతురాలు. ప్రపంచంలో ఎవరికీ దక్కని ప్రేమ ఆమెకి దక్కడమే కాకుండా ఆ ప్రేమ కలకాలం నిలిచిపోయే అద్భుత కట్టడంగా రూపుదిద్దుకుంది!" తాజ్‌ని చూస్తూ అన్నాను.

"కావచ్చు!" నిర్లిప్తంగా అన్నది.

"ఏం?" అడిగా.

"ప్రేమ కూడా ఓ చిన్నిమొక్కలాంటిదే! రోజూ నీళ్ళుపోస్తే ఆ మొక్క ఎలా పెరుగుతుందో, ప్రేమని చూపితేగానీ హృదయంలోని ప్రేమ మొక్క ఎదగదు. నీరుపోసి సంరక్షిస్తే మొక్క వృక్షమవుతుంది. నిరంతరం ప్రేమిస్తూ, ఆ ప్రేమని అనుభవిస్తూ ఉంటే ఇదిగో, ఆ ప్రేమ ఇలాంటి 'ప్రేమసౌధం' అవుతుంది! అయితే ప్రేమలో 'నిజాయితీ' ఉండాలి...!" మళ్ళీ నిట్టూర్చింది.

"ఈ ప్రేమవ్యవహారాల్లో నా అనుభవం ఆల్‌మోస్ట్ జీరో కనుక, మీరు చెప్పేది వినగలనుగానీ, చర్చించలేను" నిజాయితీగా అన్నా.

ఆశ్చర్యంగా నావంక చూసింది.

"నేను చెప్పేది నిజమే!" అన్నాను.

"జీవితంలో ఒక్కసారి కూడా ఎవర్నీ ప్రేమించలేదా? కనీసం ప్రేమించబడ లేదా?"

"కొన్నిసార్లు ప్రేమలో 'పడ్డా'ననే అనుకున్నాను గానీ అది కేవలం వయసుకి సంబంధించిన 'ఆకర్షణ' అని నాకే తరువాత్తరువాత అర్థమైంది. చిత్రం ఏమంటే,

ఎవర్నిచూసి ఆ ఆకర్షణలో పడ్డానో వారికి ఏనాడూ నా భావాన్ని తెలుపలేక పోవడం!" నవ్వాను.

"ఎందుకూ?"

"బహుశా నాలోని పిరికితనం కావొచ్చు. అవతలివాళ్ళు దాన్ని సీరియస్‌గా తీసుకోక హేళన చేస్తారనే భావనా కావచ్చు!" అన్నాను.

నవ్విందామె. చక్కని పలువరుస.

'మీరేం చేస్తుంటారు?" అడిగింది.

"నిజం చెపితే ఏమీ చెయ్యను. అప్పుడప్పుడూ రాయాలనిపించినప్పుడు కథలు, కవితలు రాస్తా!"

"ఓహ్... మీ పేరు? ఏ పత్రికలకి రాశారూ?" కుతూహలం ధ్వనించింది ఆమె గొంతులో.

"ఏ పత్రికలకీ పంపలేదు. ఇక నాపేరు ముకుందరావు. తండ్రి ఆస్తి సంపాయించి నా పేరున రాసి చనిపోయాడు. మా అమ్మ చిన్నప్పుడే గతించింది. 'ఆస్తి'ని చూడటానికి మనుషులు వున్నారు. ఊళ్ళు తిరగటం... అదీ లేనప్పుడు నెలలపాటు మా ఫామ్ హౌస్‌లో గడపటం... ఇంతే నా జీవితం!"

"పెళ్ళిచేసుకోలేదా?"

"ఊహూ!"

"ఎందుకూ?"

"చేసుకోవాలని అనిపించలా!"

"తగినవాళ్ళు దొరకలేదా?"

"కాదు! చేసుకోవాలనే ఉద్దేశ్యం లేకనే! దూరపు బంధువులు చాలామంది వాళ్ళ అమ్మాయిల్నో, చుట్టాల్నో నాకు అంటగట్టాలని ప్రయత్నించారుగానీ, నా మొండితనం వాళ్ళ ప్రయత్నాల్ని సాగనివ్వలా. చివరికి నేనో మొండిఘటాన్నని తేల్చేసి వాళ్ళ పనులు వాళ్ళు చూసుకుంటున్నారు!" నవ్వాను.

ఆమె నవ్వీ నవ్వనట్టుగా నవ్వింది.

"మరి మీ విషయం!" అడిగాను.

"నా పేరు సరస్వతి. డిగ్రీ అయ్యాక ఓ స్కూల్లో టీచరుగా చేరాను. తల్లీతండ్రీ ఉన్నారుగాని వాళ్ళకి నా 'డబ్బు' తప్ప, అంటే 'జీతం'తప్ప నా బాగోగులతో పనిలేదు!"

"మీరెవర్నీ ప్రేమించలేదా? లేక ప్రేమించబడలేదా?"

"చూశారా! నేను మిమ్మల్ని అడిగిన ప్రశ్న రిప్లైకార్డులా, మళ్ళీ నా దగ్గరకే చేరింది! సరే... కొందరు ప్రేమించానంటూ నా వెంటపడ్డారు. కొందర్ని నేను ప్రేమించాలనుకున్నా. చివరికి అవేమీ ఓ కొలిక్కి రాకముందే నాకు పెళ్ళయిపోయింది!"

"ఓహ్!"

"కాళ్ళకి మట్టెలూ మెళ్ళో మంగళసూత్రం లేవు గనుక పెళ్ళికాలేదనుకున్నారు కదూ!" నవ్వింది.

"అవును! అయితే మీవారు మీతో రాలేదా?"

"రాలేదు. రారు... రాలేరు...." నిట్టూర్చింది.

"అంటే?"

"కొన్నాళ్ళు గడిచాక ఆయనకి నా 'ప్రేమ' వెగటు పుట్టిందేమో. మరో స్త్రీకి దగ్గరయ్యారు!"

"గాడ్!"

"దేవుడేం చెయ్యగలడు?"

"మరి మీరేమీ నిలదియ్యలేదా?"

"ఎందుకూ నిలదియ్యటం? పోనీ నిలదీస్తే మా సంసారం నిలబడినా, 'ప్రేమ' నిలబడుతుందా? అందుకే విడాకులు కావాలంటే ఇచ్చేశాను!"

"సారీ!" ఏం చెప్పాలో తెలియక అన్నాను.

"సారీ ఎందుకూ? జీవితంలో అదీ ఓ మలుపు... అంతే!" నవ్వింది.

"మీకు బాధగా అనిపించలేదా?"

"మొదట్లో కొన్నాళ్ళు అనిపించింది. తరువాత బాగా ఆలోచిస్తే నా నిర్ణయం మంచిదే అనిపించింది"

"పెళ్ళి ఎలా జరిగింది? పెద్దలు కుదిర్చారా?"

"ఉహూ! నా 'జీతం' నా చెల్లెలి పెళ్ళికీ, తమ్ముడి చదువుకీ, మళ్ళీ వాళ్ళ ఇద్దరి పిల్లలకీ ఉపయోగపడినా నాకు మాత్రం 'ఘోటక బ్రహ్మచారిణి' అనే బిరుదుని ప్రసాదించ గలిగింది. అప్పుడితను ఓరోజు పరిచయమై మిమ్మల్ని చూశాక పెళ్ళి చేసుకోవాలి అనిపిస్తోంది.....అభ్యంతరమా? అనడిగాడు. కాదనటానికి అభ్యంతరం కనిపించలేదు. 'ఒప్పుకున్నా"

"తరువాత?"

"ఓ రెండేళ్ళు హాయిగానే గడిచింది. ఆయన జీతం ఆయన సరదాలకీ, నా జీతం ఇంటిఖర్చులకీ హాయిగా సరిపోయింది. ఆ తరువాత ఆయనకి ఉన్నది కేవలం వ్యామోహమేనని, ప్రేమకాదనీ నాకనిపించింది!"

"ఊ!"

"ఆ మాటే ఆయన్ని అడిగాను!"

"ఏమన్నారు?"

"మిమ్మల్ని చూశాక పెళ్ళిచేసుకోవాలి అనిపించిందని అన్నానేగానీ ప్రేమించాననలేదే?" అన్నాడు

"వాట్ నాన్సెన్స్?" నాకు నిజంగానే అతనిమీద కోపమొచ్చి అన్నా.

"అతనన్నది నిజమేగా! తప్పుగా అర్థం చేసుకున్నది నేనే..... ఆ తరువాత ఇంకో ఏడాది మొక్కుబడిగా సంసారం గడిచింది. ఆ తరువాత ఓనాడు ఆయనే చెప్పాడు. తనకి మరో 'స్త్రీ' మీద ప్రేమ 'కలిగింద'నీ, అభ్యంతరం లేకపోతే విడాకులిమ్మనీ... ఇచ్చేశాను"

"తరువాత?"

"ఇంకేంలేదు. నా ఉద్యోగం నన్ను ఆదుకుంది. ఎందుకో ఈ తాజ్‌మహల్ని చూడాలని చిన్నప్పట్నించీ ఓ కోరిక. వచ్చేశాను....! ట్రైన్లో మీరు తెలుగు పుస్తకం చదవటం చూసి మీరు తెలుగువారని గ్రహించా. అందుకే మీరు ఆగ్రాలో దిగగానే పలకరించాను" నవ్వింది.

"నిజంగా చెప్పాలంటే, మీరు పలకరించడం నాకు చాలా సంతోషం కలిగించింది. 'ఎందుకూ' అని మీరు అడిగితే చెప్పలేనుగానీ, నేను సంతోషించిన మాటమాత్రం వాస్తవం!"

"థాంక్స్....! ఇప్పుడేం చేద్దాం?"

"ఉండటానికి చోటు వెదుకుదాం"

"సరే!"

తాజ్‌రెసిడెన్సీలో డబుల్‌బెడ్‌రూమ్ దొరికింది.

"రిలేషన్ ఏమని రాయనూ? ఫ్రెండ్స్ అంటే సందేహిస్తారు. పోనీ మరోచోట రెండు గదులు ట్రై చేద్దామా?" అన్నాను.

"ఏం రాసినా ఫరవాలేదు, మీరంటే నాకు నమ్మకం ఉంది" చిన్నగా అంది. త్రీస్టార్ హోటల్ అది. గదులు విశాలంగా, చాలా లగ్జరీగా ఉన్నాయి.

"చాలా కాస్ట్లీ  అనుకుంటాను" అన్నది.

"ఉహూ....! టారిఫ్‌కంటే కంఫర్ట్ ముఖ్యం. మీరు రిలాక్స్‌డ్‌గా ఉండొచ్చు" సోఫాలో కూర్చుంటూ అన్నాను. తను బెడ్‌కి ఓ అంచున పొందిగ్గా కూర్చుంది.

"టీవీ చూస్తారా?" అడిగాను.

"ఉహూ! దాని జోలికి పెద్దగా పోను"

"సరే! ఇంకేదైనా చెప్పండి!"

"నా గురించి చెప్పాగా... పోనీ మీగురించి చెప్పండి"

"నేనూ చెప్పేశాగా! అయినా చెప్పడానికేముంది? ఏముంటుందీ! చెపితే గతాన్నీ, లేకపోతే జరుగుతాయోలేవో తెలీని భవిష్యత్కాలపు ఊహల్నీ! అంతేగా!"

"నిజమే!" చిన్నగా తలాడించింది.

మళ్ళీ మౌనం. నేను కళ్ళుమూసుకున్నా విశ్రాంతిగా. "మీరు పడుకోండి. నేను సోఫాలో కూర్చుంటా!" అన్నది.

"ఫరవాలేదు. జస్ట్ రిలాక్స్ అవుతున్నా అంతే!"

తెలీకుండానే నిద్రలోకి జారుకున్నానేమో... మెలకువ వచ్చి గడియారం చూస్తే టైము ఒంటిగంటన్నరయింది. ఆమె బెడ్ అంచున నిద్రపోతోంది. ఉచ్ఛ్వాసనిశ్వాసాలకి అనుగుణంగా మెత్తని ఆమె శరీరపు కదలికలు.

సోఫాలోనించి లేస్తే ఆమెకి నిద్రాభంగమవుతుందేమోనని అలాగే చూస్తూ కూర్చున్నా. కేవలం 'కొద్ది' పరిచయంతో ఇద్దరం ఓ గదిలో ఉండటం నాకు 'విచిత్రం' అనిపించలేదు సరికదా 'సహజం' అనిపించింది. ఎందువల్ల?

సరస్వతిలో తెలీని ఓ ఆకర్షణ ఉంది. మాటల్లో నిజాయితీ ధ్వనిస్తుంది. నవ్వులోనూ, నడకలోనూ ఓ హుందాతనం ఉంది. అన్నింటినీ మించిన ఓ వ్యక్తిత్వం ఉంది. ఇందుకేనా ఇలా కలిసి ఓ రూములో ఉన్నదీ?

ఇటువైపుగా వొత్తిగిలిందామె. పచ్చనిపొట్ట...చీర కొద్దిగా... చాలా కొద్దిగా తొలిగి కనిపిస్తోంది. చూస్తున్నాను. నా మనసులో మెల్లగా ఓ కోరిక.... ఆమెని కౌగలించుకుంటే?

'ఛీ... నన్ను నమ్మి అమాయకంగా పడుకుంది. ఈ ఆలోచనే నాకు రాకూడదు' అని నాలో నేనే తప్పుదిద్దుకున్నాను. చూపు మరల్చే ప్రయత్నం ఎంత చేసినా చూపు మరల్చలేకపోతున్నాను. చక్కని కనుబొమలు.... నిండైన బుగ్గలు.... లాభంలేదు.... లేచి నిలబడ్డా.

కిటికీలోనించి 'తాజ్'ని చూస్తూ ఆలోచిస్తున్నా. ఓ పావుగంట గడిచిందేమో!

"సారీ...నాకు తెలీకుండానే నిద్రపోయా!" సరస్వతి మాటలకి వెనక్కి తిరిగా.

"నేనూ నిద్రపోయా!"

"లేచి చాలాసేపయిందా?"

"ఊ!"

"నన్ను లేపవచ్చుగా?"

"ఎలా?"

"పిలిస్తే మెలకువ వచ్చేది!"

"పిలవాలనుకోలేదు!"

"ఊ!"

"ఓ.కే. భోంచేద్దామా?" అన్నాను.

"సరే....కాస్త ముఖం కడుక్కుని వస్తా" బాత్రూమ్‌లోకి వెళ్ళింది.

"రెస్టారెంట్‌కి వెళదామా... రూమ్‌కే తెప్పించుకుందామా?" అడిగా. "ఇక్కడే తినేద్దాం!" టవల్‌తో ముఖం తుడుచుకుంటూ అంది.

'మెనూ' చేతికిచ్చా. "అవేమీ నాకు అర్థంకావు. మీరే సజెస్ట్ చెయ్యండి... ప్యూర్ వెజిటేరియన్.

"నేనూ శాఖాహారినే" రూమ్ సర్వీస్‌కి ఫోన్‌చేసి కావల్సిన 'పదార్థాలు' చెప్పాను.

కొంచెం తల దువ్వుకుంది. మధ్యపాపిడి.... బొట్టు అందంగా పెట్టుకుంది. నేనూ బాత్రూమ్‌కి వెళ్ళి ముఖం కడుక్కున్నా. మౌనంగా భోజనం చేశాం. భోజనం బాగుంది. నార్త్ ఇండియన్ స్పెషల్స్ విత్ ఐస్‌క్రీమ్.

"కాసేపు మళ్ళీ తాజ్‌ని చూసొద్దామా?" బిల్ 'సైన్' చేస్తూ అన్నా.

"ఊ!"

"నేను బయట నిలబడతా.... మీరు డ్రస్ మార్చుకోవాలంటే మార్చుకోండి"

"సరే"

ఆకుపచ్చని మైసూర్ సిల్క్ శారీ.... అదే రంగు జాకెట్టు, అందంగా పొందిగ్గా తయారైంది.

నడుస్తున్నాం.... పెద్ద దూరమేం లేదు.

తాజ్ మిఠాయి దుకాణాల్లోంచి 'తీపి' వాసన, ఆగ్రా తాజ్‌మిఠాయి రుచి అద్భుతం. బూడిద గుమ్మడికాయతో చేసే స్వీట్ అది. నోట్లో వేసుకుంటే 'తియ్యగా' కరిగిపోతుంది. 'లాలా'జీలు బిజీగా ఉన్నారు.

గుర్రపు జట్కాలు.... రిక్షాలు... లాగుడుబళ్ళు.... అధునాతనమైన కార్లూ.... పురాతన బిల్డింగులూ... "ఝూపడ్ పట్టీ'లు ఇదో విచిత్రమైన నగరం.

తాజ్‌మహల్‌ని చూస్తూ ఓ బెంచిమీద కూర్చున్నాం. మధ్యాహ్నం మూడున్నర. ఎండలో కూర్చుంటే కొంతహాయిగా ఉంది. గాలి మెల్లగా చల్లబడుతోంది.

"అన్నట్టు మీకు శీతాకాలపు దుస్తులున్నాయా?" అడిగా.

"ఉహూ! అంత చలిగా లేదుగా!"

"చెప్పలేం....పోనీ హోటల్‌కి వెళ్ళేముందు కొందాం!"

"సరే!" అందామె.

"తాజ్‌మహల్ మనిషి జీవితమంత అద్భుతమైనది కాదేమో అన్నారు ఎందుకూ?" అడిగా.

నవ్వి, "మీరింకా ఆ విషయం మర్చిపోలేదా? ఎంత గొప్ప కట్టడమైనా అది అక్కడే ఉంటుంది. కాలక్రమంలో శిథిలమవుతుంది. మానవ జీవితం

అలాగ కాదే! ఎన్నో ఎన్నెన్నో మలుపులు...ఉత్సాహం...ఉద్వేగం...సుఖం...దుఖం...దైన్యం...ఓహ్...ఎన్ని ఎన్ని భావసాగరాలూ, వీచికలూ!"

ఎక్కడో చూస్తూ ఏదో ఆలోచిస్తూ అన్నది.

"బాగుంది! మంచి విశ్లేషణ!" అన్నాను.

"నా మొహం! తాజ్‌మహల్‌కీ ఎన్నో ఆటుపోట్లు ఉండొచ్చు. అవి కనపడవు! మానవ జీవితపు ఆటుపోట్లు కనబడ్తాయి. తేడా అంతేగా!" నవ్వింది...

కానీ ఆ నవ్వు నవ్వులా లేదు.

"కాదు సరస్వతిగారూ, మానవ జీవితపు ఆటుపోట్లు మానవులే సృష్టించుకుంటారు. తాజ్‌మహల్లో కలిగే మార్పులు ప్రకృతివల్లా, పొల్యూషన్‌వల్లా కలిగేవి!"

"పొల్యూషన్‌కి కారణమూ మనుషులేగా! ఆ పొల్యూషన్ పరిసరాలనేగాదు, మనసులనీ దహింపజేస్తుంది!"

"అవును. కానీ మనిషికి 'బుద్ధి' అనే గొప్ప 'వరం' ఉంది. దానితో తనలోని ఆటుపోట్లని ఎదుర్కోగలడు... ఇంకా తనని తాను సిద్ధం చేసుకోగలడు. సంస్కరించుకోనూగలడు!" అన్నాన్నేను.

"నిజమే!" చర్చకి ఫుల్‌స్టాప్ పెట్టింది సరస్వతి.

నేనూ పొడిగించలా. చలి మెల్లమెల్లగా ప్రకృతిని ఆక్రమించుకుంది. ఇద్దరం లేచాం. ఓ షాపులో ఓ స్వెట్టరూ, ఓ మఫ్లరూ కొనిచ్చాను. తను డబ్బు ఇవ్వబోయింది.

"జస్ట్! ఇదో చిన్న బహుమతి... అంతే!" అన్నాను.

ఓ క్షణం నా కళ్ళల్లోకి చూసింది.

"అయితే నాదీ ఓ రిక్వెస్టు... మీరిక్కడే నిలబడండి" అని మళ్ళీ షాపులోకి వెళ్ళి ఓ ఖరీదైన బ్లేజరు, ఓ షాల్ కొనుక్కొచ్చి "ఇది మీకు నా చిన్న బహుమతి" అంది.

నేను నవ్వాను. "ఎందుకు నవ్వుతున్నారూ?"

"హోటల్లో 'రజాయి'లు ఉంటై! నిజం చెబితే వీటితో అవసరం మనకి పెద్దగా ఉండదు"

"ఏమో....అవసరం రానూవచ్చు!" తనూ నవ్వింది.

ఆమె ఇచ్చిన బ్లేజర్ అక్కడే నేను వేసుకుని 'షాల్'ని ఆమెకి కప్పాను. "థాంక్స్..." చిన్న చిరునవ్వు.... కానీ ఎంతో 'దగ్గరితనం'. వీధుల్లో తిరుగుతున్నాం. ఒకటీ అరా తప్ప పెద్ద సంభాషణ ఏమీ జరగలా. ఓ రెండు గంటలు అలా తిరిగి మళ్ళీ 'తాజ్‌మహల్' దగ్గరికి వచ్చాం. పైన పూర్ణచంద్రుడు.... క్రింద ప్రేమమందిరం. అద్భుతంగా అనిపించింది. ఆ మాటే సరస్వతితో అన్నాను.

"అవును! పొద్దుటకీ ఇప్పటికీ తాజ్‌మహల్లో ఏదో మార్పు ఉంది" ఆమె స్వరంలో చిన్నమార్పు.

ఇందాక కూర్చున్న బెంచీ ఖాళీ అయింది. వెళ్ళికూర్చున్నాం. తన ఒంట్లో నుంచి ఓ సుగంధం నన్ను తాకింది.

పగలంతా అటూఇటూ తిరిగిన జనాలు 'తాజ్‌మహల్ని' వెన్నెల్లో చూడటం కోసం గుమిగూడారు.

ఓ మత్తూ.... ఓ మైమరపు... అక్షరాల్లో ఇమడలేని ఓ కవిత... ఏమని వర్ణించడం?

రెండు గంటలు నిశ్శబ్దంలోకి జారిపోయాయి.

చలి బాగా పెరిగింది.... అయినా లేవాలనిపించదు.

లేవక తప్పలేదు. బలవంతంగా లేచింది.

వెనక్కి వెనక్కి చూస్తూ ముందుకి నడిచాం.

"గుండె నిండింది. ఇక వెనక్కి చూడొద్దు!" సడెన్‌గా నా చెయ్యి గట్టిగా పట్టుకుని అన్నది.

"ఊ!" నడుస్తున్నానేగానీ ఆమె చేతిలోనించి నా చేతిలోకి ఓ వెచ్చదనం ప్రవహించటాన్ని గమనించాను. రూమ్ తాళాలు తీసేటప్పుడూ నా చెయ్యి పట్టుకునే ఉంది. "రూమ్ సర్వీస్‌కి ఫోన్‌చేసి భోజనం తెప్పించనా?" అడిగా.

"వద్దు! గుండెతోపాటు కడుపూ నిండిపోయినట్టుంది" అన్నది. చెయ్యి వదలకుండా సోఫాలో నా పక్కనే నన్ను ఆనుకునే కూర్చుంది. ఓ కమ్మని వెచ్చదనం.

నన్ను నేను నిగ్రహించుకోవడం కష్టంగా ఉంది. పోనీ లేద్దామా అంటే ఏమనుకుంటుందో! ఈ పరిచయాన్ని 'ఎక్కడికో' తీసుకువెళ్ళడం నాకిష్టం లేదు.

"కాలేజీలో చదివేటప్పుడు నేను అల్లికలూ, కుట్లూ నేర్చుకున్నాను. 'లేసు'లు బాగా అల్లేదాన్ని. ఓ రోజున ఓ చీరని చూశా. నా ఫ్రెండ్ నాన్నగారి షాపులో. అప్పట్లో దాని ఖరీదు అయిదువందలు. నా దగ్గర డబ్బులేదు. మా అమ్మా నాన్నా అంత డబ్బు ఇవ్వరు.

ఒక మూడు నెలలు టైమ్ ఇస్తే డబ్బు సమకూర్చుకుని ఆ చీరని కొనుక్కుంటానని, అప్పటివరకూ దాన్ని నా కోసం అట్టిపెట్టమనీ నా స్నేహితురాలి తండ్రిని రిక్వెస్టు చేస్తే ఆయన 'అలాగే' అన్నారు.

రోజూ ఆ షాపుకెళ్ళి ఉదయం, సాయంత్రం ఆ చీరని కళ్ళారా చూసుకునే దాన్ని. లేసులు కుట్టీ, కర్టెన్లు కుట్టీ, చీరెల ఫాల్సు కుట్టీ, చిన్నపిల్లలకి ట్యూషన్స్ చెప్పీ రెండున్నర నెలలయ్యేసరికి అయిదొందలూ సంపాయించి ఆ చీర కొన్నాను. కానీ జరిగిందేమిటో తెలుసా? అప్పటిదాకా ఆ చీరని ప్రతిరోజూ షాపులో చూస్తూ మురుసుకునేదాన్ని.

'ఇంకొక్క నెలలో..' 'పదిహేను రోజుల్లో', 'వారంలో'.... 'రేపే'... 'ఇది' నాది అవుతుందని ఆనందించేదాన్ని.

తీరాకొన్నాక దాన్ని పెట్టెలో పెట్టుకున్నానేగానీ పూటపూటా దాన్ని బయటికి తీసి చూడలా. రెండుసార్లు కట్టుకున్నాక అది మామూలు రోజూ కట్టుకునే చీరల్లో 'ఒకటి'గా మారిందిగానీ, అంతకుమించి ఏ ప్రత్యేకతనీ పొందలా. అప్పుడు అర్థం కాలేదు గానీ ఇప్పుడు తెలుస్తోంది. 'ప్రయత్నించడం'లో ఉండే ఆనందమూ, ఉత్సాహమూ 'పొందాక' ఉండవని" నిట్టూర్చింది.

"ఇదంతా ఎందుకు చెప్తున్నారూ?" అడిగా.

"ప్రేమ అంతే! ప్రయత్నించేటప్పుడు ఉండే ఆకర్షణా ఆరాధనా 'పొందా'క ఉండవు. ప్రేమ కూడా పాతబడిపోతుంది. 'కొత్త'దనం, 'పచ్చ'దనం ఉండాలంటే ప్రేమని ప్రేమగానే ఉండనివ్వాలి. పెళ్ళిదాకా తీసుకువెళ్ళకూడదని!" నా ప్రశ్న వినిపించుకోనట్టుగా అన్నది.

"అంటే ఆకాశం భూమిలా కలిసినట్టు కనిపించాలి గానీ కలవకూడదనా?" అడిగాను.

"బహుశా అంతేనేమో!" కళ్ళు మూసుకుంది.

"మంచంమీద పడుకోండి. నేను సోఫాలో పడుకుంటాను" అన్నాను.

"ఫరవాలేదు.... నేను ఇక్కడ పడుకుంటానులెండి!"

నేను మాట్లాడకుండా నైట్‌డ్రెస్ వేసుకుని మంచంమీద పడుకున్నా. ఎందుకో ఓ రాత్రివేళ మెలకువొచ్చింది. కళ్ళు తెరిస్తే ఆమె నావంకే చూస్తోంది. లేచాను.

"మీరు నిద్రపోయేటప్పుడు పసిపిల్లాడిలా అనిపించారు!" అందామె.

"మధ్యాహ్నం మీరూ అలాగే కనిపించారు. మిమ్మల్ని చాలాసేపు చూశా!" నవ్వి అన్నాను.

"మరి కిటికీ దగ్గర ఎందుకు నిలబడ్డారూ?"

"నిగ్రహించుకోలేక!"

మళ్ళీ కిటికీ దగ్గర నిలబడి తాజ్‌మహల్‌వంక చూశాను. వెన్నెలజల్లులో తడుస్తోంది తాజ్‌మహల్.

నా దగ్గరగా వచ్చి పక్కన నిలబడింది. ఓ కమ్మని పరిమళం... తల విదుల్చుకుని మంచంమీద కూర్చున్నా.

"పడుకోండి!" నా ఎదురుగా నిలబడింది.

ఓ తీవ్రమైన కోరిక. నా తలని ఆమె పొట్టకి తగిలేలా ఆన్చాను. దగ్గరగా నొక్కుకుని తల నిమరసాగింది.

అక్టోబర్ నెలలో ఓ రోజు.... నా చేతిలో ఉత్తరం. "ఆనాడు చూసిన తాజ్‌మహల్ 'సాక్షి'గా మరో బుల్లి ప్రేమచిహ్నం నా ఒడిలో పడుకుని నవ్వుతోంది. పేరేమని పెట్టనూ?"

మూడురోజుల తరువాత పాపని ఎత్తుకున్నాను.

పోలికలు స్పష్టంగా లేకపోయినా.... ముక్కూ కళ్ళూ పెదాలు నావిగానే కనిపించాయి. "ప్రేమ" అన్నాను.

"కొద్దిగా మార్చనా? ప్రేమలత" అన్నది నవ్వుతూ.

"అవును! ఈ 'లత' పెరిగి పువ్వులు పూయాలంటే నిరంతరం 'మనం' ప్రేమ నందించాలి!" నవ్వాను.

– స్వాతి 24-08-2012

# పునాస పంతులు

సన్నగా, పొడుగ్గా నడిచొచ్చే ఆ 'శాల్తీ' పేరు పునాసపంతులు. చిన్నతనంలో ఆయన్ని అలాగే అనేవారు. ఎప్పుడూ నవ్వుతూ ఉంటాడు. ఆ నవ్వు కూడా మామూలుగా అందరూ నవ్వే నవ్వులాంటిది కాదు. గలగలా గుండెల్లోంచి 'తన్నుకొచ్చే నవ్వది'. కితకితలు పెడితే పసిపిల్లాడు నవ్వే నవ్వది. వెన్నలాంటి నవ్వది... వెన్నెల్లాంటి నవ్వది. సమ్మిటారి గూడానికీ చింతలపూడికీ మధ్యనున్న 'పాక' అతడి నివాసం. ఓ కొబ్బరిచెట్టూ, రెండు పునాస మావిడి చెట్లూ అతని ఆస్తి. ఒకప్పుడు పొలాలూ గట్రా ఉండేవిట. వాటన్నింటినీ కరిగించి ఈ 'కాస్త' మాత్రమే మిగిల్చాడు 'పంతులు' తండ్రి. కొబ్బరికాయల్నీ, సీజన్లో పునాస మావిడికాయల్నీ అమ్మి ఆ సొమ్ముతో 'కాలక్షేపం' చేస్తూ ఉంటాడీ పంతులుగారు.

పునాసమావిడి చెట్లున్నాయి గనక అతన్ని పునాసపంతులని అంటారు. భుక్తికి ఆ సొమ్ము ఏం సరిపోతుందీ? అందుకే ఎవరే పనిచెప్పినా కాదనకుండా చేస్తాడు. తృణమో పణమో ఇస్తే తీసుకుంటాడు. లేకపోతే వెళ్ళిపోతాడుగానీ అడగడు.

ఎన్ని పనులొచ్చో ఆయనకి. 'సత్తినాణ' హోటల్లో పప్పు రుబ్బేవాడు. హోమియో డాక్టరుగారు 'ఉడిపి' హోటలు పెడితే అందులో సర్వరుగా, క్లీనరుగా, దోసెమేస్త్రీగా, ఇంకా కౌంటర్లో క్లర్కుగా కూడా పనిచేసేవాడు.

"ఎంతిస్తున్నాడోయ్ పంతులూ?" అని ఎవరైనా అడిగితే "చాలా ఇస్తారండీ!" అని నవ్వేవాడే గానీ, 'ఇంత' అని ఏనాడూ చెప్పలా. పూటకూళ్ళ వెంకమ్మ దగ్గరా 'కుక్' గా పనిచేశాడు. 'జరుగులు' గారి థియేటర్లో సినిమా టిక్కెట్లు అమ్మాడు. 'మిఠాయి నాగభూషణం' గారి కొట్లో సాయంత్రం మిర్చిబజ్జీలూ, పకోడీలూ, వడలూ, పునుకులూ వేసేవాడు. అంతెందుకూ పడాల కృష్ణారావుగారి పొలంలో 'నిఘామాన్' గానూ, బండి రాఘవమ్మగారి మామిడితోటలో 'మాలి'గానూ చాలా అవతారాలెత్తాడు.

ఎప్పుడు చూసినా 'తెల్లని' పైజామా, లాల్చీతో ఉండేవాడు. ఆ పైజామా, లాల్చీలు బండి విశ్వనాథ్ వాడిపడేసినవే. 'పంతులి' కి లూజు లూజుగా ఉండేవి.

"పెళ్ళయిందా పంతులూ?" అని ఓసారి వనమా సత్యవతమ్మ అడిగితే–

"ఓ...ఎప్పుడో అయిందండీ! మాయావిడ పేరు గోదావరండీ!" అని కిలకిలా నవ్వాట్ట.

"మరి పాకలో ఉండేది నువ్వొక్కడివేగా?" అని అయోమయంగా ఆవిడ అడిగితే "తను వాళ్ళ ఊరెళ్ళిపోయిందండీ... అక్కడే సుఖంగా ఉందండీ!" అని చక్కాబోయాట్ట. మా ఊళ్ళో ఇదో సంచలనవార్త.

మేం పిల్లలుగా ఉన్నప్పుడు 'పెద్ద చెరువు'లో ఈతలు కొట్టి అలిసిపోయి పునాసపంతులి మామిడి చెట్లకింద సేదతీరేవాళ్ళం. 'అచ్చాపుచ్చా' మాటల్తో మాలో కలిసిపోయేవాడు పంతులు.

"అబ్బాయిలూ! హోటల్రాజుగారు ఇవ్వాళ గారెలిచ్చార్రా.... తినండి!" అని తెచ్చిన గారెలో... ఇంట్లో ఉన్న మరమరాలో మాకు పెట్టేవాడు. మేం తింటుంటే చూడటం పంతులికి సరదా.

ఓ ఏడు 'ముసురు' పట్టి మా చింతలపూడంతా నీళ్ళమయమైపోయింది. మాదసలే అప్లాండ్. చెరువు కింద పొలాలు తప్ప మిగతావన్నీ వర్షాధారప్పొలాలే. మూడేళ్ళకో, నాలుగేళ్ళకో వర్షాలు పడేవి.

దాంతో పెద్ద చెరువూ... చిన్నచెరువూ... యోగిలింగేశ్వరస్వామి చెరువూ... బూడిదగుంట చెరువూ ఫుల్లుగా నిండిపోయేవి. చెరువులో నీళ్ళున్నంతకాలం బావులు కూడా నీళ్ళతో కళకళ్ళాడేవి. అయినా ఏం లాభం? ఒక్క 'చెలం' బావి

తప్ప మిగతా వాటన్నిట్లోనూ ఉప్పునీళ్ళే. పంతులు 'చెలం'బావి నీళ్ళు 'కూజా' బిందెల్లో నింపి ఇంటింటికీ పోసేవాడు. బిందెకి అర్ధణా ఇచ్చేవాళ్ళకంటే 'మాటల్తో' జేబునింపేవాళ్ళే ఎక్కువ. ఐనా ఏనాడూ ఎవర్నీ డబ్బుకోసం నిలదియ్యలా. మా నాన్నకి పంతులంటే ఇష్టం. అందుకే ఎప్పుడు వచ్చినా టిఫినూ, కాఫీ ఇప్పించేవాడు. మధ్యాహ్నం పూట వస్తే మాతోపాటే 'భోజనం' పెట్టేవాడు.

దానికే పంతులు ఎంతో సంతోషపడి, "నువ్వూ, పిన్నీ దేవతలు బాబాయ్!" అనేవాడు.

ముసురుపట్టిన వారంరోజులూ నేను, మా(ఫ్రెండ్సూ ఇల్లు కదల్లా. కదల్లేదనేకంటే, మావాళ్ళు మమ్మల్ని బయటికి పోకుండా 'కాపలా' కాశారన్నది నిజం. వారం తర్వాత బైటకొస్తే ఊరంతా ఓ వార్త 'గుప్పు'మంది. ఆ వార్త ఏమంటే పునాసపంతులు 'ఎవర్నో' తీసుకొచ్చాడని! కుతూహలంగానే నేను, రంగడు, జిజ్జూ, దివాకరం, పునాసపంతులింటికి పోయాం.

వాకిలి ఊడుస్తూ ఎ(ఱ్ఱగా, ఎత్తుగా, బొద్దుగా ఉన్న ఓ ఆవిడ కనిపించింది. ఆవిడ్నే చూస్తూ నిలబడ్డాం.

"ఎవరు కావాలి బాబూ" తియ్యని స్వరంతో అడిగింది. అంత చక్కని మనిషిని అప్పటివరకూ మా వూళ్ళో నేను చూడలా. పెద్దమొహం, తీర్చిదిద్దినట్లున్న కనుబొమలూ, పెద్దకళ్ళు, నుదుట తిలకం. నవ్వుతూ అడిగిందేమో, ఆ నవ్వు చాలా బాగుందనిపించింది.

"నువ్వేనా పునాసపంతులు తీసుకొచ్చినావిడ?" అడిగాడు దివాకరంగాడు. వాడుత్తి మొరటుమనిషి. నోటికొచ్చింది వాగుతాడు. "ఓ... ఆయన్ని పునాస పంతులని పిలుస్తారా?" మళ్ళీ నవ్వింది.

"మా వూళ్ళో అలాగే పిలుస్తాం. పునాసచెట్టు ఉంది గనక పునాసపంతులు... మిల్లుంది గనక సత్యంగార్ని మిల్లుసత్యం అంటాం. అరిపిరాల సుబ్బారావుకి కిళ్ళీ కొట్టుంది గనక కిళ్ళీసుబ్బారావంటాం. హోటలుంది గనక రాజుగార్ని హోటల్రాజంటాం" మాట్లాడే ఛాన్సు దొరికింది గనుక గడగడా చదివేశాడు రంగడు.

"ఇంతకీ నువ్వేనా పునాసపంతులు లేపుకొచ్చిందానివి?" ఓరగా చూస్తూ అన్నాడు దివాకరంగాడు.

"తీసుకొచ్చాడనో, లేపుకొచ్చాడనో ఎవరు చెప్పారు? ఆయన నన్ను తీసుకురాలా... నేనే వచ్చాను!" అదే చక్కని నవ్వుతో అంది.

"ఇక్కడే ఉంటావా?" జిజ్జూగాడూ అడిగాడు.

"ఏం? ఉండకూడదా?" మళ్ళీ నవ్వింది.

"ఉండిపో.... మా పునాసపంతులు చాలా మంచోడు!" రంగడు సర్టిఫికెటు ఇచ్చాడు.

"అలాగే! మీ పునాసపంతులు ఊళ్ళోకెళ్ళారు. సాయంత్రం రండి ఏం?" అంటూ ముగ్గు తేవటానికి పాకలోకి వెళ్ళింది.

మేం ఇంటిదారిపట్టాం. "ఒరేయ్... పెళ్ళిచేసుకున్నాడా లేదా?" సందేహం వెళ్ళబెట్టాడు దివాయ్.

"నీకెందుకురా?" నేను విసుక్కున్నా. వాడు ఆవిడతో అలా పేద్దపోటుగాడిలా నిలదీసి మాట్లాట్టం నాకు నచ్చలా. ఆవిడ మొహం ఎంత కళగానూ, దయగానూ ఉందో! చెప్పొద్దూ... లోపల్లోపల నాకూ ఉత్సాహంగానే ఉంది 'ఓ గొప్ప' సీక్రెట్.... కనుక్కున్నందుకు.

"నాన్నోయ్... పునాసపంతులు ఆవిడ్ని తీసుకురాలేదుట. ఆవిడే వచ్చిందిట!" మా నాన్నతో ఉత్సాహంగా చెప్పా. "నోరు ముయ్యరా... ఇతర్ల సంగతి నీకెందుకూ?" గద్దించాడు మా నాన్న. ఆయనెప్పుడూ అంతే. ఎవరి విషయాలూ ఎత్తడు. ఎవరన్నా చెప్తున్నా వినిపించుకోడు. కానీ మా అమ్మ, పక్కింటి ఏలేశ్వరపు పిన్నిగారూ, ఆ పక్కింటి పద్మావతమ్మగారూ, ఆ పక్కింటి రంగమ్మగారూ, అందరూ నన్ను మధ్యలో కూర్చోబెట్టుకుని 'వివరాలు' సేకరించారు.

"దీన్నే అంటారు పోయేకాలమని!" దీర్ఘం తీసింది అంట్లు తోముతూ విషయాలు విన్న పనిమనిషి వెంకమ్మ. మరుసటి రోజునుకుంటా పునాసపంతులు రోడ్డుమీద పోతుంటే నా ముందే ఏలేశ్వరపు పిన్నిగారు "ఏవయ్యా పంతులు... వచ్చింది మీ ఆవిడేనా?" అని అడిగింది నాముందే.

"మా ఆవిడ పేరు గోదారండి. ఈవిడ పేరు విశాలాక్షండి!" గలగలా నవ్వాడు పునాసపంతులు.

"నీకూ, ఈవిడకీ సంబంధం ఏమిటీ?" నొసలు ముడిచి ఆరాతీసింది పిన్నిగారు. "ఇద్దరమూ మనుషులమే గదండీ!" నవ్వుతూ వెళ్ళిపోయాడు పంతులు.

"నీకేవన్నా అర్థం అయిందిట్రా?" అని నన్ను అడిగిందిగానీ నేను తలెగరేసి బజారుకి పోయా. అసలు ఇలాంటి విషయాలు అర్థమయే వయసు కాదు నాది. కానీ ఆవిడ మా వుళ్ళో ఉంటే ' బాగుంటుం'దని మాత్రం నిజంగా కోరుకున్నాను. ఎందుకో నాకే తెలీదు.

ఓ రెండు, మూడు నెలలు గడిచాయేమో... పునాసపంతులు పాకనీ, చెట్లనీ కూడా బేరానికి పెట్టి, మొత్తం అయిదువేలకి అమ్మేసి మా వూళ్ళోంచి ఆవిడ్ని తీసుకుని వెళ్ళిపోయాడు. ఇదంతా అప్పటికథ.

రెండు మూడేళ్ళ తరువాత మళ్ళీ మా వూరొచ్చాడు. మనిషి బాగా చిక్కాడు.

"ఎక్కడికెళ్ళావోయ్?" అని మిల్లు సత్యంగారడిగితే "యాత్రలు చేసొచ్చానండీ" అని వినయంగా చెప్పటం నా చెవులారా విన్నా. 'విశాలాక్షి' 'భోగట్టా' అడగాలనిపించింది గానీ ఎందుకో అడగలేకపోయా.

కొన్నేళ్ళు గడిచినై. నా ఫ్రెండ్సు హైద్రాబాద్, విజయవాడల్లో ఉద్యోగాలు వెతుక్కుంటుంటే నేను మాత్రం ఎర్‌ఫోర్స్‌లో చేరిపోయా. సంవత్సరానికోసారి సెలవలకి మావూరు చేరేవాడ్ని. అలా ఓ రెండుసార్లొచ్చాక, మూడోసారి సెలవుపై వచ్చినప్పుడు పునాసపంతుల్ని "అవును బాబాయ్! విశాలాక్షిగారు ఎక్కడా?" అనడిగా.

"ఒరే అబ్బాయ్! ఆవిడ ఎక్కడున్నా చల్లగా ఉండాలి. సుఖంగానే ఉంటుంది. నాకు తెలిసింది ఇంతే" అన్నాడు గానీ మరొక్కమాట ఎక్కువగా మాట్లాడలా.

"మరి పెద్దవాడివయ్యావుగదా..." అని నేను ఏదో అనబోతుంటే "మనకేంటిరా? హాయిగా శివాలయం శుభ్రం చేస్తున్నా. ప్రసాదం ఉండనే ఉంది. అలాగే సాయంకాలం ఆశ్రమంలో పువ్వులు కోసి ఇస్తా. అమ్మ వారి దయవల్ల పులిహోరో, గారెలో దొరుకుతై... హాయిగా ఆ తరువాత శివాలయం మెట్లమీద జంబుఖానా పరిచామంటే నిద్దరే నిద్దర!" గలగలా నవ్వాడు.

ఉన్నదాంతో తృప్తిగా జీవించటం ఎలానో పునాస పంతులి మాటలు విన్నాక అర్థమైంది. పునాసపంతులు అలానే ఉన్నా అతని పాకా, చెట్లూ చాలా చేతులు మారాయి. మొదట పంతులుదగ్గర్నించి కొన్న రహీమ్‌నించి, దొంకాడ వెంకట్రమణకీ, అక్కడ్నించి అల్లిపల్లి జనార్ధనరావుకీ, ఆ తరువాత సుప్రీంపేట ఎఱ్ఱ జాకోబుకీ మారి ప్రస్తుతం నీలవేణి టీచరు చేతికొచ్చాయి.

అప్పుడప్పుడూ పంతులు నీలవేణిగారింటికి వెళ్ళి తన పాతపాకనీ, చెట్లనీ చూసుకుని తృప్తిపడతాడు. ఆ ముక్కే పంతులు నాతో చెప్పి "ఒరే నాయనా... ఆస్తుల్ని ఏం చేసుకుంటాంరా? ఆ చెట్టుచూడు 'రాయి' విసిరినా 'కాయ'లని ఇస్తూనే ఉంటుంది. బోలెడు పక్షులకీ, మనుషులకీ నీడనిస్తుంది. అదిరా బతుకంటే! మానులాగా నిస్వార్థంగా బతకాలి!" అని నవ్వాడు.

కాలం ఎలా గడుస్తుందంటే... అది గడిచిపోయే విషయమే మనకి తెలీదు. ఏర్‌ఫోర్స్‌లో చేరిన అయిదేళ్ళ తరువాతనుకుంటాను... నేను మావూరు వెళ్తే "ఏరా నాన్నా... ఉద్యోగం చేస్తున్నావు బాగానే ఉంది. మరి పప్పన్నం ఎప్పుడు పెడతావురా?" అని పునాసపంతులు అడిగాడు. మనిషి బాగా చిక్కాడు. మొహంలో 'కళ' మాత్రం అలానే ఉంది. "దాని సంగతేంగానీ, నీ ఆరోగ్యం ఎట్లా ఉంది బాబాయ్?" అని అడిగా.

"నాకేంటిరా... బ్రహ్మాండంగా ఉన్నా.... ఏ సమస్యలూ లేవు. ఏ విచారాలూ లేవు. సరేగానీ ఇవ్వాళ నాకు 'మిఠాయి' తినాలని ఉందిరా. కొనిపెడతావా?" అన్నాడు.

నాకు కళ్ళవెంట నీళ్ళొచ్చాయి. ఏనాడూ ఎవర్నీ ఏదీ అడగని మనిషి, ఇవాళ తన జీవితంలో మొట్టమొదటిసారి నన్ను 'మిఠాయి' కొనిపెట్టమన్నందు కనుకుంటా. గబగబా వెళ్ళి మిఠాయి నాగభూషణం కొట్లో 'అర్థశేరు' మిఠాయి కొని పంతులికిచ్చా.

పొట్లం విప్పి ఓ ముక్క నా చేతికిచ్చి మరో ముక్క తను నోట్లో వేసుకుని "భలేగా ఉందిరా మిఠాయి" అన్నాడు. ఏదేదో మాటలు చెబుతూ మిఠాయి తినడం పూర్తిచేసి రామశేఖర్రావు హోటల్లో కడుపునిండా నీళ్ళు తాగి "వస్తాన్రా అబ్బాయ్" అంటూ శివాలయానికి వెళ్ళాడు. మరుసటిరోజు మా అమ్మ నన్ను నిద్దరలేపి "పునాసపంతులు పోయాడుట్రా – వెంకమ్మ చెప్పింది" అంది కన్నీళ్ళతో.

గబగబా శివాలయానికి పరిగెత్తా. శివాలయం ముందర గుంపులు గుంపులుగా జనం. తోసుకుంటూ వెళ్ళి చూద్దునుగదా – మెట్టుమీద పునాస పంతులు... నిద్రలోనే పోయాడేమో.... మొహం మీది చిరునవ్వు చెరగలా... ఎంత సహజమైన మరణం!

"మిఠాయి కొనిపెడతావురా?" అన్న పంతులి మాట గుర్తుకొచ్చి భోరున ఏడ్చా.

రవిగాడూ, గంగాధరం, దివాయ్‌గాడూ కూడా అప్పుడేవచ్చారు. బతికుండగా 'సమస్యలు' లేని పంతులు చచ్చాక ఊరికి 'సమస్య' అయ్యాడు.

'గుడి ప్రక్షాళనం' చెయ్యాలని కొందరు.

గుడిబయట... రోడ్డు పక్కనున్న మెట్టుమీద పోయాడు గనక 'ప్రక్షాళనతో పనిలేదని' ఇంకొందరు.

వాదోపవాదాలేగానీ 'శవం' గురించి ఎవరూ మాట్లాడటంలా. శవాన్ని ఏం చెయ్యాలో ఎవరూ ఎత్తలేదు గానీ, శవం మీద రూపాయిలూ, అర్ధరూపాయిలూ మాత్రం పడేస్తున్నారు.

అసలు ఊళ్ళో ఎవరు పోయినా అందరికంటే ముందు పునాసపంతు లుండేవాడు. పాడె కట్టటం నించి పాడె మొయ్యటం వరకూ తనే చేసేవాడు. అలాంటిది ఇవాళ అతనికి చిల్లర డబ్బుల్తో దహనం చెయ్యడమా? చిన్నప్పుడోసారి "శవాన్ని మోశావుగదా భయం వెయ్యదా పంతులూ" అని అడిగితే "భయం దేనికిరా, ప్రాణాలున్నది 'శివం', ప్రాణం పోతే 'శవం'. అంతేగా!" అని గలగలా నవ్వాడు.

నేనూ, మా స్నేహితులూ 'సూరయ్య' గార్ని పిలిపించి అంత్యక్రియలు కానిచ్చాం. మూడోరోజున బూడిదని బూడిదకుంట చెరువులో కలిపేశాం. న్యాయంగా పునాసపంతులి కథ ఇంతటితో ముగిసినట్టే. ఎవరు గుర్తుంచు కుంటారూ? పునాసపంతులు రాజకీయ నాయకుడు కాదు - వక్తకాడు... కనీసం కాస్త 'ఉన్న' వాడుకాదు - కేవలం ఓ 'మంచివాడు' అంతే! మంచివాళ్ళనెవరూ గుర్తుంచుకోరు. వాళ్ళకి సమాధులూ, శిలాఫలకాలూ నిర్మించరు. జస్ట్.... మర్చిపోతారు.

చాలా ఏళ్ళు గడిచాయి. ఆ మధ్య ఖమ్మం వెళ్ళి అక్కడినించి 'బులుసు సాంబమూర్తి' గారితో భద్రాచలం వెళ్ళా. గుడిదగ్గర 'విశాలాక్షి' కనిపించింది. ఇన్నేళ్ళయినా ఆ మొహం ఏమాత్రం మారలా. నుదుటిమీద ఎర్రని కుంకుమతో, వయసుతెచ్చిన గాంభీర్యంతో కనిపించింది. వెళ్ళి "మీరు విశాలాక్షిగారు కదూ" అన్నా.

"అవును....మీరు?" ఆశ్చర్యంగానూ, అయోమయంగానూ అడిగింది. అదే తియ్యని గొంతుతో.

"గుర్తులేదూ? నా పేరు రాజు. చిన్నప్పుడు పునాసపంతులు గారింట్లో మిమ్మల్నిచూశా. నాతోపాటు నా ఫ్రెండ్సూ వచ్చేవాళ్ళు...!" ఆవిడకి గతం గుర్తుచేసే ప్రయత్నం చేశా. "అబ్బ....! ఇప్పుడు గుర్తుకొచ్చింది. అన్నట్టు పునాస పంతులుగారు ఎలా ఉన్నారు?" సంతోషంతో ఆత్రాన్ని మిళాయించి అడిగింది.

"పంతులుగారు చనిపోయి చాలా ఏళ్ళయిందిగా!" అంటూ పంతులుగారు ఎలా గడిపారో, ఎలా చనిపోయారో వివరించా. "అయ్యో" అంటూ భోరున ఏడ్చింది. కళ్ళవెంట కన్నీరు వరద గోదారిలా జారుతోంది.

ఓ పదినిమిషాల్లో తమాయించుకుని "బాబూ... నేను తెలిసీ తెలీని వయసులో ఒకడ్ని ప్రేమించా. మా వాళ్ళకి తెలిసింది. నా పెళ్ళి చెయ్యాలనుకున్నారు. ఓ పిచ్చితనంతో నగల్ని తీసుకుని ప్రేమించినవాడితో పారిపోయి, మీవూరి దగ్గరున్న నాగిరెడ్డి గూడెం చేరాం. వాడు రాత్రికి రాత్రే నేను తెచ్చిన నగల్ని తీసుకుని ఉడాయించాడు. నా అదృష్టమేమంటే వాడు నన్ను చెడగొట్టలా.

ఇంటికి తిరిగెళ్ళే ధైర్యం లేక 'తమ్మిలేట్లో' దూకి చద్దామనుకున్నా. అదిగో అప్పుడే మీ పునాసపంతులు నన్ను బతికించి మీ ఊరికి తీసుకొచ్చారు. అసలు నేను 'ఎవరూ?' అని ఒక్క ప్రశ్న కూడా అడగలా. ఉండబట్టలేక ఓ రోజు ఆ కథ బలవంతంగా ఆయనకి వినిపించా. ఆయన మా ఊరెళ్ళి మా వాళ్ళతో మాట్లాడితే "అది చచ్చిందానితో సమానం" అన్నారట. ఈయన వెనక్కొచ్చారు. అప్పటికీ మా గురించి మీ ఊళ్ళో నానాపుకార్లూ ఉన్నాయని ఆయనకి తెలుసు.

అందుకే ఆస్తిని తెగనమ్మి నన్ను ఈ ఊరు తీసుకొచ్చారు. గుడిదగ్గర ఓ చిన్నపాక అద్దెకి తీసుకుని హోటలు పెట్టారు. నాకు కొంచెం చదువు చెప్పించారు. ఈ వూళ్ళో పనిచేస్తున్న ఓ టీచరుగారికి నా కథంతా ఉన్నది ఉన్నట్లు చెప్పారు.

ఆ టీచరుగారికీ ఎవరూ లేరు. పంతులుగారు ఆయన్ని ఒప్పించి, మాకిద్దరికీ వివాహం జరిపించారు. మావాళ్ళకి కబురుపెట్టినా పెళ్ళికి ఒక్కరు కూడా రాలేదు. పెళ్ళయిన మరుసటి రోజు హోటలు వేరేవాళ్ళకి అమ్మేసి మూడొంతుల సొమ్ము మా చేతుల్లో పెట్టి "అమ్మా– ఇదే పుట్టింటి కట్నవనుకో!" అన్నారు.

ఆ తరువాత ఎంతచెప్పినా వినకుండా "నేను ఉత్తర దేశయాత్రలకి పోతున్నా. బతికినంతకాలం అక్కడే ఉంటా. నాకోసం దిగులుపెట్టుకోవద్దని చెప్పి వెళ్ళిపోయారు. నా భర్త ఎంతో ఉన్నతుడు. ఆయనకీ పంతులుగారంటే ఎంతో

గౌరవం. పంతులుగారు అన్నాళ్ళు నేను చింతలపూడిలో ఉన్నా ఒక్కసారి కూడా చెడుచూపు చూడలా. ఆయన మనిషికాదు నాయనా... నా పాలిట దేవుడు" అని మళ్ళీ ఏడ్చింది.

నాకూ కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి. ఎంత విచిత్రం... మన పక్కన ఉండే మనుషుల గురించే మనకి తెలీదు. కానీ కంటికి కనిపించని 'దేవుడ్ని' వెతికే ప్రయత్నం చేస్తాం. 'పావలా' దానంచేసి 'దానకర్ణుడి'నని పేపరెక్కే జనాలున్న ఈ రోజుల్లో ముక్కూ మొహం తెలియని వాళ్ళకోసం తన సర్వాన్నీ తృణప్రాయంగా వదిలేసే మనుషులెక్కడ ఉంటారు? ఒకవేళ ఉన్నా పునాసపంతులంత నిష్కల్మషంగా, నిర్మలంగా ఉండగలరా?

నేను తలవంచుకుని ఆలోచనలోపడటం చూసి ఆవిడ "పోనీలే బాబూ... లోకంతో ఆయనకి రుణం తీరిపోయింది!" అంటూ ఏదో చెప్పబోతుంటే ఆవిడ భర్తా, పిల్లలూ ప్రసాదాలు తీసుకొచ్చారు. ఆయనకి నన్ను పరిచయం చేసి "పునాసపంతులుగారు చనిపోయారట" అంది.

ఆయన ఓ క్షణం కళ్ళు మూసుకుని రెండు చేతులూ పైకెత్తి ఆకాశానికి దండం పెట్టాడు. మెల్లగా కళ్ళు తెరిచి "పంతులుగారిలాంటివాళ్ళు చచ్చిపోరు విశాలాక్షీ... శరీరాన్ని త్యజిస్తారు అంతే!" అన్నాడు.

ఆ తర్వాత నావంక తిరిగి "చూడు బాబూ... వీడు మా పెద్దాడు - వీర వెంకటసత్యన్నారాయణ. మేంమాత్రం పునాసపంతులూ అని పిలుస్తాం... మీ పునాసపంతులి అసలు పేరు దామరాజు వీరవెంకట సత్యన్నారాయణ. ఆ పేరే వీడికి పెట్టాం!" అన్నాడు. గలగలా నవ్వాడు చిన్న పునాసపంతులు... నిజం చెప్పొద్దూ... ఆ నవ్వు వినగానే నా గుండెల్లో వెన్నెల విరిసింది.

– స్వాతి ఫిబ్రవరి 2011

# శాస్తి

నిజం చెప్పొద్దూ.... మా విస్సిగాడంటే నాకు మహామంట. వాడు నా చెల్లెలి కొడుకే కావొచ్చు. ఎర్రగా, బుర్రగా ఉంటే ఉండొచ్చు... బి.ఎ.లో స్టేటు ఫస్టూ, ఎమ్మేలో గోల్డుమెడలూ సంపాయిస్తే సంపాయించి వుండొచ్చు.... వాడికి ఎన్ని సుగుణాలుంటేనేం... లౌక్యం అనేది లేకపోయాక.

నాకున్నదే ఒక్క కూతురు. నాలుగుతరాలకి సరిపోయేంత ఆస్తి ఉంది. అంతస్తు ఉంది. పిల్ల నల్లగా ఉంటేనేం? సంసారం చెయ్యడానికి పనికిరాదా? వెధవన్నర వెధవ. కానీ కట్నం తీసుకోడట. ఓ పేదదాన్ని చేసుకుని దేశాన్ని ఉద్ధరిస్తాడట.

పోనీ అలా ఏడిసినా కాదన్నవాడెవడూ? ఓ విధవని చేసుకున్నాడు! అందునా వేరే కులం ఆమెని.

చెడబుట్టాడుగదా నా చెల్లెలికి. అదే మా బావ, అంటే నా చెల్లెలి మొగుడు.... ఎంత ప్రాజ్ఞుడు! అరెకరం లేనివాడు ఆరొందల ఎకరాలకి యజమానయ్యాడు. అంతోటి మహానుభావుడికి పుట్టిన వీడు – మా బావ 'గుటుక్కు' మనగానే, ఆస్తంతా పేదలకిచ్చి అనాథాశ్రమాలకిచ్చీ ఆరేళ్ళు దాటకముందే 'కరారావుడు' చేసేశాడు.

వీడిది ఉలిపిగట్టెతత్వం. చిన్నప్పట్నించీ ఇంతే. మా చెల్లి పోగానే మా బావ రెండోపెళ్ళి చేసుకున్నాడు. 'సవతి తల్లీ, సరుకుచెట్టూ ఒకటేరా నాయనా. హాయిగా నా దగ్గర ఉండి నా కూతుర్ని చేసుకో' అంటే విన్నాడా?

'తల్లిదండ్రులు ప్రత్యక్షదేవతలుట!'

ఓరి వీడి పిచ్చికూలా!

సంవత్సరం తిరక్కుండానే వచ్చినావిడ చచ్చింది.

అప్పుడయినా నా పంచన చేరొచ్చుగా?

ఉహూ! దిగులుతో మంచంపట్టిన తండ్రికి సేవలు చేస్తూ కూర్చున్నాడు. చచ్చేవాడికోసం డబ్బు ఖర్చుపెట్టేవాడు వెర్రివెధవ కాదుటండీ?

సరేనయ్యా... పెళ్ళంటూ చేసుకున్నాక తప్పుతుందా? ఏదో సంసారపక్షంగా ఉండాలిగానీ, వేరేకులం అమ్మాయిని ఇంటింటికి తీసుకొచ్చి పరిచయం చేస్తాడా? ఎంతధైర్యం! ఈ పిచ్చిపనులకు తోడు ఆ వెధవ నవ్వు ఒకటి. వాడు పుట్టినప్పటి నుంచీ చూస్తూనే ఉన్నాగా! ఒక్కసారంటే ఒక్కసారి కూడా ఏడ్చిన పాపాన పోలేదు. తల్లీతండ్రీ చచ్చినా ఏడవడేం? అదేమాట ఓ ఆదినారాయణ వీడితో అంటే, 'దేవుడనేవాడు ఉంటే, గింటే.... ఆయన మనిషికిచ్చిన ఏకైక వరం నవ్వే!' అంటాడా!

అసలు దేవుడంటే మనిషికి కాస్త భయం, భక్తీ ఉండక్కర్లా? 'ప్రాణమున్న ప్రతిజీవీ దైవంతో సమానమే!' అంటాడా? ఓరి వీడ్ని తగలెయ్య! ఇదేం పెడబుద్ధీ?

సరేనయ్యా, లక్షాధికారికాస్తా బికారి వెధవయ్యాడు,

పోనీ చేస్తున్న మేస్టరుగిరీనన్నా సరిగ్గా చూసుకోవాలా? ఉహూ!... మా వూరి మునసబు కొడుకు 'మేధకుడే' అనుకుందాం. ఓ నాలుగు మార్కులు తక్కువే రావొచ్చుగాక! చక్కగా మునసబు చెప్పినట్టు విని ఓ వెయ్యో, రెండు వేలో తీసుకుని, ఆ పిల్లవెధవాయిని పాసు చేస్తే వీడి సొమ్మేం పోయిందీ? లంచం ముట్టనంటాడా? 'లక్ష్మి' దానంతట అదే వచ్చిపడుతుంటే మోకాలడ్డేవాడు ఎవడైనా ఉంటాడా?

"ఛత్! నేను అన్యాయం చెయ్యను!' అని మొండికేశాడు. ఉన్న ఉద్యోగం కాస్తా ఊడబీకించుకున్నాడు.

పోనీ అప్పుడయినా ఏడ్చాడా అంటే లేదు. 'వెధవ బానిసబతుకు వదిలి పోయిం'దని నవ్వుతాడా! నేను రికమెండు చేసి మరో ఉద్యోగం ఇప్పిస్తానంటే ససేమిరా అన్నాడు.

ఎవరి రికమెండేషనువల్లో వచ్చిన ఉద్యోగం వాడికక్కరలేదుట. స్వశక్తిమీద బతకాలని నాకే చెబుతాడా? అంటే నా వడ్డీ వ్యాపారాన్ని యీ బొట్టిగాడు హేళన చేసినట్టేగా! దిక్కూమొక్కూ లేని పిల్లల్ని చేరదీసి ట్యూషన్లు చెప్పడం మొదలుపెట్టాడు.

కూలీనాలీ చేసుకునేవాళ్ళు ట్యూషను ఫీజు ఏమిస్తారూ? వాళ్ళు ఇవ్వా ఇవ్వరు. వీడు అడగా అడగడు!

'ధణుతెగరగొట్టి మరీ వసూలు చెయ్యాలోయ్!' అని నేనంటే, 'పోనీ మావయ్యా, వాళ్ళు పేదవాళ్ళు!' అని ఆ వెధవ నవ్వొకటి నవ్వుతాడే!

వీడు పేదవాడు కాదా?

ఏం ఆస్తి ఉందనీ?

వెధవ బోడిపాకా, ఆ పక్కన ఓ వేపచెట్టూ.

ఆ వేపచెట్టు తల్లిపోయిన రోజు నాటాడుట.... అందుకే అది వీడి 'అమ్మ'ట!

ఇంతకన్నా చోద్యం ఈ లోకంలో ఉంటుందా? అటు ఉద్యోగమూ చెయ్యడు ఇటు సంపాదనా లేదు. అంతకంటే ఘోరం ఏమిటంటే – వీడు తీసుకొచ్చిన ఆ అమ్మాయి ఏడునెల్లకే పండంటి బిడ్డను కంది.

అప్పుడయినా ఆ ఛత్కారీదాన్ని నిలదీసి, 'ఎవడే వాడు? నిన్ను జాలిపడి పెళ్ళి చేసుకున్నాను గానీ, నువ్వింత గుణవతివి, శీలవతివీ, గర్భవతివీ అని ముందరే ఎందుకు చెప్పలేదే?' అని దాన్ని తగలెయ్యాలా? లేదే! ఆడంగిరేకుల వెధవలా పురుళ్ళ ఆస్పత్రిలో దానికి సేవలు చేశాడు.

ఊరంతా ఉమ్మేసినా వీడికి బుద్ధి రాదుటండీ! ఆ ముక్కే ఓ మాధవరావు మొహానే అడిగాడు.

వీడేమన్నాడో తెలుసా? 'అది వయసు చేసిన తప్పు గానీ, మనసు చేసిన తప్పు కాదు' అని నవ్వాడట.

ఓరి వీడ్ని రంపాలు పెట్టి కొయ్యా! ఇంతటి వెధవాతి వెధవ ఈ భూప్రపంచం లో ఎక్కడైనా ఉంటాడా? 'అదేమంటే?' మనిషికి ఆశయాలూ ఉండాలంటాడు.

ఆశయాలేవిటండీ?అసలు ఆశయాలూ ఆచరణలూ ఎన్నటికీ కలవని రైలు పట్టాల్లాంటివని వీడికి తెలీదా? రైలుపట్టాలు రెండూ కలిస్తే యాక్సిడెంటవుతుంది.

ఆశయాల్ని ఆచరణలో పెడితే అమాంతం బతుకుబండి నిట్టనిలువునా కూలిపోతుంది! ఆ మాత్రం తెలీదా వీడికి?

పోనీ... వాడెట్టా ఛస్తే నాకేం? వీడ్ని నమ్ముకొచ్చిన ఆ పిల్ల సంగతైనా ఆలోచించాలా?

కులమూ గుణమూ లేనంతమాత్రాన ఆశలు ఉండకూడదా? నగలు పెట్టుకోవాలనీ, దర్జాగా బతకాలనీ ఆ పిల్లకిమాత్రం ఉండదూ? ఎన్నాళ్ళని కలో గంజో తాగి బతుకుతుందీ? అప్పటికీ రోజూ వీడ్ని సతాయిస్తూనే ఉందని నేను విన్నా. చిలక్కి చెప్పినట్టు ఓనాడు చెప్పి కూడా వచ్చా. వీడు వింటేగా?

ఓ రోజున పుట్టిన పిల్లాడ్ని ఇక్కడే వదిలేసి ఎవడితోనో ఉడాయించేసిందది!

అంతకుమించి అదిమాత్రం ఏం చేస్తుందీ?

"ఏంవోయ్..... మీ ఆవిడ ఎవడితోనో లేచిపోయిందిట గదా?" అని ఓ వెంకట్రావు మొహాన్నే అడిగేశాడంటే అడగడూ? సిగ్గూశరం - చీమూ నెత్తురూ ఉండేవాడెవడైనా ఆ మాటకి ఏ నూతిలోనో, గోతిలోనో పడి చచ్చూరుకుండేవాడు. వీడికి మానాభిమా నాలుంటేగా?

'ఎవరి సుఖం వాళ్ళు చూసుకోవటంలో తప్పేముంది' అని నవ్వుతాడా? మనిషన్నవాడు అనవలసిన మాటేనా అది? అక్కడైనా ఆగాడా? ఆగలేదే!

ఆ పిల్లవెధవని చదివించి ఉద్యోగంలో పెట్టాడు. ఉద్యోగం వచ్చిన మూడు నెల్లకి ఆ కొడుగ్గాని కొడుకు తల్లి పంచన చేరి వీడికి శఠగోపం పెట్టాడు.

'అయ్యో.... ఇంతకాలమూ ఈ మనిషి నన్ను పెంచాడూ.... చదివించాడూ' అన్న ఇంగితం ఆ కుర్రవెధవకి ఉండక్కర్లా? కాస్తయినా కృతజ్ఞత చూపక్కర్లా?

ఆ మాటే అంటే, 'ఆవిడకి ఇవ్వాళ ఎవరూ దిక్కులేరు గనక వీడు వెళ్ళాడూ... తల్లికి సేవ చెయ్యటంకన్నా మహాభాగ్యం ఇంకేముంటుంది?' అని నవ్వుతాడా!

ఓరి వీడ్ని తగలెట్టా! ఇట్లాంటి వెధవకి మేనమామనైనందుకు నలుగుర్లో తలదించు కోవాల్సొచ్చింది.

అప్పటికీ మా ఊరి ప్రెసిడెంటూ, వీడి నాన్న మిత్రులవడంచేత పంచాయితీ ఆఫీసులో గుమస్తా ఉద్యోగం ఇప్పిస్తానంటే, ఎగిరి గంతెయ్యాల్సింది పోయి 'మీరు నన్ను ఎలా చూసినా ఫరవాలేదుగానీ, జాలితో చూసి నన్ను బాధపెట్టొద్దు!' అన్నాడట.

అంతమంచిగా ఆలోచించిన ప్రెసిడెంటుగారిక్కూడా వీడు తలవొంపులు తెచ్చాడంటే ఏమనాలీ?

ప్రెసిడెంటు కొడుకు కాస్త జులాయే కావచ్చు. అసలీ కాలంలో 'మందు' పుచ్చుకోని కుర్రవెధవ టార్చి వేసి వెతికినా కనిపిస్తాడా? సరేనయ్యా! మందు పుచ్చుకున్నాడు. పొలంలో పనిచేసే ఆమెని చూసి చెయ్యి పట్టుకున్నాడు. ఆమె చెయ్యి విదిలిస్తే ఏదో బలత్కారమే అనుకుందాం. కాస్త బలత్కారం చెయ్యబోయాడు. అంతేగా?

వీడు అది చూసి ఆ పిల్లవాడ్ని, కాబోయే ప్రెసిడెంటుని, చాచికొడతాడా? తగుదునమ్మా అని పోలీసు స్టేషన్లో ఆ పిల్లాడిమీదా, వాడి ఫ్రెండ్సుమీదా కంప్లైంటు ఇస్తాడా?

ఆకాశం మీద ఉమ్మేస్తే ఏం జరుగుతుందీ? అది మన మొహం మీదే పడుతుంది! వీడికీ అదే జరిగింది..... ఆ పిల్ల పోలీస్‌స్టేషన్లో ప్రెసిడెంటుగారబ్బాయి 'నాకు దేముడిచ్చిన అన్న' అనటమూ, ఆ ఎస్సై వీడ్ని ఛడామడా తిట్టి గట్టిగా వార్నింగు ఇవ్వటమూ జరిగిపోయాయి. అదే విషయం వీడ్ని అడిగితే, 'ఆ పిల్లమాత్రం ఏం చేస్తుందీ? పెళ్ళికావల్సిన పిల్ల! అందుకే అబద్ధం చెప్పింది!' అని నవ్వుతాడా!

అసలు ఏం చూసుకుని వీడికింత అహంకారం? ఆ మధ్య సన్నగా చిక్కిపోయి కనిపిస్తే. 'ఎంతైనా చెల్లెలు కొడుగ్గదా' అని ఓ రెండు కేజీలు బియ్యం పంపించా. అసలు వీడికి "మమకారం" అంటే అర్ధంతెలిస్తేగా? ఆ రెండు కేజీల బియ్యమూ తీసికెళ్ళి అనాధశరణాలయంలో పోసొచ్చాడుట! ఆ మాత్రం నేను చెయ్యలేనా? 'మా మావయ్య పీనాసి' అన్నాట్ట!

ఓరి వీడి సిగదరగా... ఇంత అహంకారమటండీ? చదువుకున్న చవట కూలికి పోతాడా? డిగ్రీ వెలగబెట్టినవాడు చెయ్యాల్సిన పనేనా ఇదీ? 'దేవుడే'

లేదన్న వెధవకి సిగ్గెక్కడుంటుందీ! అయినా ఆ 'సర్వాంతర్యామి' మాత్రం ఎంతకాలం చూస్తూ ఊరుకుంటాడు? "యదాయదా హి ధర్మస్య" అని దౌర్భాగ్యులుండబట్టే ఎండాకాలంలో భోరున వానలు కురిశాయి. వానంటే వానా? నేను పుట్టి బుద్దెరిగాక చూడని కుంభవృష్టి కురిసింది.

వీడున్న కొంపకాస్తా నిట్టనిలువునా కూలింది. అప్పుడైనా ఏడవొద్దూ, చక్కగా నవ్వుతున్నాడు.

"అదేమిట్రా?" అంటే, "అసలే మన ఊరివి వర్షాధారపు పొలాలు. ఈ వానదెబ్బకి చెరువులన్నీ, బావులన్నీ చక్కగా నిండాయి గనక, మరో మూడేళ్ళపాటు పంటలు విరగబండుతాయి!" అని పకపకా మళ్ళీ నవ్వాడు.

ఓరి వీడి శ్రాద్ధం పెట్టా! వీడికి వెర్రేగాదు.... పిచ్చికూడా ఉందని నా అనుమానం. ఎంతసేపూ కూలికిపోయి ఒళ్ళుహూనం చేసుకుని రావడం, ఆ చెట్టుకిందే నాలుగు తాటాకులపాక లాంటిదాన్లో కూచోడం, ఆ చెట్టుపై వాలే పిట్టలమీదా, పిల్లులమీదా కవిత్వాలు రాయడం-పాడటం!

కవిత్వం అన్నం పెడుతుందిటండీ?

ఆ రాసేదైనా ఏ ప్రెసిడెంటుమీదో, ఎమ్మెల్యేమీదో రాస్తే డబ్బులు రాలతైగానీ, పిట్టలమీదా, పిల్లులమీదా రాస్తే ఏమొస్తుందీ... రెట్టలు మీదపడటం తప్ప?

ఆ 'చెట్టు'ని పట్టుకుని 'అమ్మా' అంటాట్ట! దాంతో కబుర్లు చెబుతూ కావలించుకుంటాట్ట! ఇది 'వెర్రి' కాదూ? ఎన్ని తిట్టినా 'పోన్లే మావయ్యా' అని వెధవ నవ్వొకటీ.

ఆ చెట్టుమాత్రం? పాతికేళ్ళకే 'ఇంతెత్తున' ధ్వజస్తంభంలా' ఎదిగింది. మర్రిచెట్టులాగా 'ఇంత' లావైంది. తక్కువకాక తక్కువకి అమ్ముకున్నా లక్షన్నర చేతికందదూ? ఆ ముక్క నేను వాడితో అనటానికి భయపడ్డాను గానీ – మావూరి ఎమ్మెల్యేకి ఏం భయం? "అబ్బాయ్.... ఏభై వేలిస్తా... ఆ చెట్టు నాకు ఇచ్చెయ్.... కొత్తింటికి తలుపులూ, ద్వారబంధాలూ చేయించుకోవా"లని వడ్రంగి వీరాచారిచేత అడిగించాట్ట.

వీడు కర్రొకటి తీసుకుని వీరాచారిని ఊరంతా పరుగులు పెట్టించాడట. పోగాలమంటే ఇదేగా? ఓరోజు కాకపోతే మరోరోజైనా పెద్దవాళ్ళకి మండదూ?

అప్పటికీ ఎమ్మెల్యేనే వీడి పాకముందుకొచ్చి అడిగాడుట. పెద్దలంటే మన్నన, గౌరవం ఉండొద్దూ? "అది మా అమ్మ. అమ్మనంటే అమ్మ"నని వీడు మొండికేశాడు.

"మంచిది!" అంటూ ఎమ్మెల్యేగారు కారెక్కి వెళ్ళిపోయాడు. వెళ్ళినవాడు ఊరుకుంటాడా? ప్రెసిడెంటుతోనూ, మునసబుతోనూ, పోలీసు ఇన్‌స్పెక్టరుతోనూ మంతనాలు జరిపాడు...... ఓనాడు వీడు కూలిపనికిపోయిన సమయంలో పట్నంనించి బుల్‌డోజర్ తెప్పించి ఒక్కదెబ్బతో దాన్ని కూల్చిపారేశాడు.

పెద్దవాళ్ళతో పెట్టుకోవటం అంటే మాటలా?

ఆ విషయం వినటం ఏమిటీ, వీడు పరిగెత్తుకుంటూ రావటం ఏమిటీ, స్వయంగా నా కళ్ళతో నేను చూశాగా... కళ్ళు నులుముకుని మరీ చూశాగా... పుట్టినప్పటినించీ ఒక్కసారి కూడా ఏడవనివాడు అవ్వాళ ఏడిచాడు. పిచ్చివెధవ! నలిగిపోయిన పిచ్చిగ్గూళ్ళని... చచ్చిపోయిన పిట్టల్నీ ఒళ్ళోపెట్టుకుని, అవ్వాళ కుంభవృష్టి కురిసిందే... అలాగ ఏడ్చాడు. కొమ్మలు విరిగిన ఆ చెట్టుని కావలించుకుని 'అమ్మా అమ్మా' అంటూ ఘొల్లున ఏడ్చాడు.

"నువ్వూ నన్నొదిలి వెళ్ళిపోయావా?" అంటూ భోరుభోరున ఏడ్చాడు. ఎంతమంది ఇవతలికిలాగినా ఆ చెట్టుని వదలడే! ఎమ్మెల్యే తాలూకు మనిషొచ్చి నోట్లకట్ట చేతికివ్వబోతే ఆ నోట్లకట్టనీ, చచ్చినపక్షుల్నీ, చెట్టునీ మార్చి మార్చి చూస్తూ మొహం కప్పుకుని ఏడ్చాడు.

గుండె పగిలేట్టు ఏడ్చాడు.

పెద్దవాళ్ళ మాటవిననందుకు ఈమాత్రం 'శాస్తి' జరగదూ! తగినశాస్తే జరిగింది వెధవకి! అందుకే... ఊరొదిలి వాడెక్కడికెళ్ళాడో ఇప్పటికైనా తెలిస్తేగా!

– స్వాతి 19–11–2010

# స్ఫూర్తి

"అంతేనంటావా?" కోపంగా అడిగాను. "అంతే!" ఫుల్లుగా భోజనం చేసి భుక్తాయాసంతో వున్న శాంతజీవిలా 'శాంతం'గా అంది సావిత్రి.

"నా బడ్జెట్ ఒప్పుకోదు. సారీ!" తెగేసి చెప్పాను.

"ఆ విషయం నాకు సంబంధించింది కాదు. నాకు మాత్రం రెండువేలూ ఇచ్చి తీరాల్సిందే....ఆ!" అల్టిమేటమ్ జారీచేసింది సావిత్రి.

ఏం చెయ్యనూ? మధ్యతరగతీ – త్రిశంకుస్వర్గమూ ఒకటే. ఇంకా చెపితే, మధ్యతరగతిలో పుట్టడం అంత నరకం ఇంకోటి లేదు. నరకంలో ఉంటూ కూడా స్వర్గసుఖాలననుభవిస్తున్నాం అనుకుని బతకడం, ఒక్క మధ్యతరగతివాళ్ళకే చెల్లుతుంది.

సాంప్రదాయాల 'నడ్డి' విరగ్గొట్టి, అనవసరపు ఖర్చుని 'ఆదా' చెయ్యాలని ప్రతివాడూ ఉపన్యాసమిస్తాడు. తనవరకూ వచ్చేసరికి మాత్రం, "తప్పుతుందిటండీ, నలుగురితో నారాయణా" అంటూ చేతులు ఎత్తేస్తాడు. అదీ మధ్యతరగతి మెంటాలిటీ.

అసలు ఆశయాలూ– ఆచరణలూ రైలుపట్టాల్లాంటివి. ఛస్తే కలవ్వు. కలిస్తే బతుకుబండి నడవదు సరికదా, పట్టాలు తప్పి యాక్సిడెంట్ అవుతుంది.

గతవారంనించీ సత్యమూర్తి అనబడే నాకూ, సావిత్రి అనబడే నా గుదిబండకీ యుద్ధం జరుగుతోంది.

ఏ యుద్ధానికైనా 'విరమణ' అన్నది ఏరోజో ఒకరోజు ఉంటుందిగానీ, మొగుడూ పెళ్ళాల యుద్ధానికి ఉండదు. ఒకవేళ ఉన్నా, తాత్కాలికమే. జస్ట్ స్మాల్ బ్రేక్ అన్నమాట. "నాకు వచ్చేది మొత్తం పదిహేనువేలు. అందులో కటింగ్ రెండువేలు, ఇంటద్దె..."

"స్టాప్...! అదేదో పిక్చర్‌లో ఎస్వీ కృష్ణారెడ్డిగార్లాగా జమాఖర్చుల పట్టీ చదవకు. నా చెల్లెలి కూతురి పెళ్ళికి కనీసం రెండువేల రూపాయల చీర కొనాలి. అంతే! నువ్వేం చేస్తావో నాకు తెలియదు!"

గుమ్మడిపువ్వు నడినెత్తిమీద పెట్టుకుని కదలకుండా హాయిగా కూర్చునే సంక్రాంతి గొబ్బెమ్మలా పడక్కుర్చీలో సెటిలైంది సావిత్రి. ఏం చేస్తాం? నెలాఖర్రోజులు... అందరికీ కటకటే.... అప్పిచ్చువాడు ఎవడు? ఎవడు? "నేను!" మనసులో విష్ణుమూర్తిలా ప్రత్యక్షమయ్యాడు రామ్మూర్తి. వాడు ఫ్రెండేగాక, 'వైద్యుడు' కూడా. చిన్నాచితకా ఏ జబ్బొచ్చినా నా దగ్గర 'పైసా' పుచ్చుకోడు. అప్పిచ్చిన 'ధనాన్ని' తిరిగి అడక్కపోవడం వల్ల వాడ్ని దైవాంశగల వ్యక్తిగా నేను భావిస్తాను. ఇంకేం! లేచి బట్టలేసుకుని బయటికి రాబోతుండగా సెల్లు... "హలో...." చికాగ్గా అన్నాను.

అప్పుకోసం పోతుంటే ఈ సెల్లొకటీ! "హలో! మీరు సత్యమూర్తిగారేనా..." తియ్యని ఆడగొంతు.

"అవునండీ" స్వీట్‌గా అన్నాను. అదేమిటో, కస్సుబస్సులాడే ఈవిడ గొంతు విన్నాక, సృష్టిలో ఏ గొంతు అయినా నాకు స్వీట్‌గానే వినిపిస్తోంది.

"గుడ్‌మార్నింగ్ సార్.... నేను 'బక్వాష్' ఇన్స్యూరెన్స్ కంపెనీ నించి మాట్లాడుతున్నాను సార్.... అయిదేళ్ళనించి ఏభైఏళ్ళ వయసున్నవారి వరకూ మా దగ్గర అనేక భీమా, పొదుపు పథకాలున్నాయి సార్... అంతేగాక ఒకవేళ మీరు యాభై దాటినవాళ్ళైనా..."

అక్కడే నాకుమండేది. నేనింకా నలభైకే చేరలేదు.

"సారీ అండి, పనిలో ఉన్నాను"' అన్నాను.

"పోనీ రేపు చెయ్యమంటారా? మా 'బక్వాష్' ఇన్స్యూరెన్స్ కంపెనీ చాలా..." చెప్పుకుపోతోంది.

"సారీ.... ఓ పని చెయ్యండి. రెండువేల రెండొందల పదమూడో సంవత్సరం ఇదే నెల ఇదే తేదీన ఫోన్ చెయ్యండి!" అని కట్ చేశాను.

"ఎవత్తదీ?" కళ్ళు తెరవకుండానే అంది సావిత్రి.

"ఎవడో...! కోన్‌కిస్కా ఇన్సూ్యరెన్స్ కంపెనీనుంచి!"

"ఎవడో అయితే అంత స్వీటుగా ఇంతసేపెందుకు మాట్లాడతావూ? 'ఎవత్తో'నే అయుంటుంది. సరే... నాకెందుకు!" కొంచెంగా అటూ ఇటూ కదిలి మరింత కంఫర్ట్‌బుల్‌గా సెటిలైంది సావిత్రి.

నా సైకిలంటే నాకు చాలాఇష్టం. అది మామూలు సైకిలు కాదు. 'హంబర్' సైకిలు. మా నాన్నగారు కొన్నది. నిజం చెబితే వారసత్వపు 'ఆస్తి'గా నాకు మిగిలింది అదొక్కటే. దాన్ని చూస్తే నాన్న గుర్తుకొస్తాడు.

నన్ను ఓ డిగ్రీ హోల్డర్ చెయ్యడం ఆయనకి తలకి మించిన భారమైనా, నానా కష్టాలూపడి నన్ను గట్టెక్కించాడు. నా పెళ్ళికాకముందే అక్కలిద్దరి పెళ్ళిళ్ళూ చేసేశాడు. దాంతో నామీద 'ఇంటి' తాలూకు బరువు బాధ్యతలేమీ పడలేదనే చెప్పాలి.

పెళ్ళయ్యాక ఓ స్కూటీ కొనక తప్పలేదు. సైకిలెక్కడానికి సావిత్రి ఒప్పుకోకపోవడం ఓ కారణమైతే, అంతధైర్యం నేను చెయ్యలేకపోయాననడం రెండో కారణం. హాయిగా సైకిలెక్కి రోడ్డుమీదకొచ్చాను.

హంబర్ హంబరే! ఇప్పటికీ 'స్మూత్'గా నడుస్తోంది. బండీ, పెళ్ళామూ ఓ విధంగా ఒకటే. అలవాటయ్యేదాకా రెండిట్నీ హ్యాండిల్ చెయ్యడం చాలాకష్టం. ఒకే ఒక్కతేడా. ఒక్కసారి 'బండి' అలవాటయితే జీవితాంతం ఢోకాలేదు. 'పెళ్ళాం' అలవాటయిందని అనుకుంటాం గానీ జన్మలో 'అర్థం'కాదు. సెల్‌లో 'మెసేజ్' వచ్చిన శబ్దం. మా బాస్ పీకలమీదకొచ్చినా 'కాల్' చెయ్యడు.

కేవలం మెసేజ్ ఇస్తాడు. సైకిల్ ఆపి చూశా. 'పాటాలకోమో' వారి బ్రాడ్ బాండ్‌ని గురించిన మెసేజ్. ఏం చెయ్యలేక నిట్టూర్చి మళ్ళీ సైకిలెక్కాను. రామ్మూర్తి హాస్పటల్ చిన్నసైజు థియేటర్లా ఉంది.

జనాలే జనాలు. ఇందాక చెప్పినట్టు వాడు చాలామంచివాడు. నిన్నామొన్నా పట్టా పుచ్చుకున్న 'చిన్నామున్నా' డాక్టర్లే కన్సల్టేషన్‌కి వందా చెవులు ఎక్కదీసి లాగుతుంటే, మావాడు ఇంకా పదిరూపాయల దగ్గరే వున్నాడు. ఒక్కోసారి

పేషెంట్‌ని బట్టి ఆ డబ్బూ 'వాపస్' ఇచ్చేస్తాడు. టూ వీలర్ పార్కింగ్‌లో నా సైకిల్‌ని పార్క్‌చేసి పేషెంట్ల క్యూలో చివర్న నించున్నా.

ఇవ్వాళ సెలవే గనక నాకు 'టైమ్'తో పెద్దగా పనిలేదు. వాడి 'టైమ్' చాలా విలువైంది. ఎందుకూ తొందరపెట్టడం! "ఎవడి 'టైమ్' వాడికి ఇంపార్టెంటే. అయితే, ఎదుటివాడి 'టైమ్'కి ప్రాముఖ్యత ఇవ్వడమే మనిషితనం!" అనేవాడు మా నాన్న.

ఆయన 'పాటించి' చెప్పిన 'సుద్దులే' ఆయన నాకిచ్చిన అమూల్యమైన ఆస్తి. గంటన్నర తరువాత గానీ నేను రామ్మూర్తిముందు నిలవలేకపోయాను.

"ఏరా గోవిందాయ్! ఏమిటీ విశేషాలు? ఆరోగ్యం బానేవుందా? ఏమిటి ఆసారీ కట్? పెళ్ళాంతో గొడవపడ్డావా లేక పైసల్తో పనిబడిందా?" తుఫాన్ మెయిల్లాగా ప్రశ్నలు సంధించాడు రామ్మూర్తి. "ఆరోగ్యం బాగుందిరా. పైసల్తోటే పనిబడింది!" సింగిల్‌లైన్‌లో పని ఏమిటో చెప్పాను. ఎందుకంటే నా వెనుక ఇంకా చాలామంది పేషెంట్లున్నారు.

"ఎంతా? వందలా వేలా? లక్షలు నాదగ్గర లేవనుకో...!" నవ్వాడు రామ్మూర్తి. "ఓ రెండువేలు ఇస్తే, జన్మలో ఎప్పుడో అప్పుడు రుణం తీర్చుకునే ప్రయత్నం చేస్తారా...!" నవ్వుతూనే అన్నానుగానీ నా గొంతు 'దీనంగానే' నాకు వినిపించింది.

నిజమేగా మరీ! 'ఫలానా' నెలలో, 'ఫలానా' తేదీన తీర్చగలనని జన్మలో చెప్పలేను. ఎందుకంటే, నాకు ఎప్పుడు బోనస్ వస్తుందో, ఎప్పుడు ఫెస్టివల్ అడ్వాన్సు ఇస్తారో నాకంటే ముందుగానే సావిత్రి ఎంక్వైర్ చేసి, 'సిద్ధం'గా ఉంటుంది ఆ విషయంలో. అంటే, 'ఆరా' తీసే విషయంలో సిబిసిఐడిలే గాదు. సి.ఐ.ఎ కూడా ఆవిడ ముందు బలాదూరే.

"ఒరే గోవిందా, రుణాలు దుకాణాలూ లాంటి పెద్దపెద్ద మాటలు మనకెందుకురా? ఇదిగో సుబ్బారావ్, మా వాడికో రెండువేలివ్వు!" నాతో మాట్లాడుతూనే డబ్బులు కలెక్టు చేసే గుమస్తా కమ్ సూపర్నెంట్ సుబ్బారావుతో అన్నాడు రామ్మూర్తి. నా పూర్తిపేరు రామగోవింద సత్యమూర్తి.

"నిజంగా థాంక్సరా!" నా కళ్ళల్లో నీళ్ళు ఉబకటం నాకు తెలుస్తోంది. "పోరా... వెధవ థాంక్సూలూ నువ్వూనూ! హాయిగా పోయి పని చూసుకో, అవునూ ఆ సైకిలు మీదే వచ్చావా?" నవ్వాడు రామ్మూర్తి.

నా సైకిలుమీదే వాడు సైక్లింగ్ నేర్చుకుంది. మా నాన్న 'లిబరల్'గా మేం తొక్కుకోడానికి సైకిలిచ్చేవాడు. దాంతో నేనూ, రామూర్తీ, ఇంకా చాలామంది ఆ సైకిలుమీదే సైకిల్ తొక్కడం నేర్చుకున్నాం. నాలాగే వాడికీ ఆ సైకిలంటే ఇష్టం.

"అవున్రా.... అది ఇంకా బాగా పనిచేస్తోంది! నీకు మళ్ళీ మళ్ళీ థాంక్స్" అని గొణిగి బయటికొచ్చా.

నా గొణుగుడు వాడువిన్నాడని నేను అనుకోను. ఎందుకంటే అప్పటికే వాడో పేషెంటు బీపీ చెక్ చేస్తున్నాడు. అన్నట్టు నన్ను 'గోవిందా' అని పిలిచేది ఇప్పుడు వాడొక్కడే – నాన్నపోయాడుగా మరీ!

"చీరకి రెండువేలిచ్చారు సరే, మరి వెళ్ళిరావడానికీ, 'చదివింపులకీ' ఎవరిస్తారూ?" దీర్ఘంతీసింది సావిత్రి.

"నన్ను చంపినా ఇక పైసా పుట్టదు. కావాలంటే నా కిడ్నీనో, గుండెనో అమ్మేసి నీ సరదా తీర్చుకో!" నాలోని కోపాన్ని దిగమింగుకుని అన్నాను. "హూ! అదొక్కటే 'మనం' అనగలిగేది. కనీసం కోరక కోరక కోరిన పెళ్ళాం 'చిన్నకోరిక'లు కూడా తీర్చలేని మహానుభావులకు పెళ్ళెందుకో!' సహజమైన చిరాకుతో అంది సావిత్రి.

"భగవంతుడా! ఓ ఆడది ఇల్లాలు కాగానే ఇంత క్రూరంగా ఎలా మారుతుందీ? ఆ మార్పుకూడా కేవలం మొగుడూ, అత్తామామలూ, ఆడబిడ్డలూ, మరుదులవరకే. మళ్ళీ తన 'వాళ్ళు' ఎప్పుడూ నెత్తిమీద దేవతలే... కన్నవాళ్ళతో సహా!"

"బుద్ధిలేక...గడ్డితిని పెళ్ళిచేసుకుంటారు. ఇలా కొరుక్కుతింటారని తెలీక..." నాలో నేనే గొణుక్కుంటూ నా సైకిలు తీసుకుని బయటపడ్డాను.

కొంపలో వుంటే 'శాంతి' అనేది ఉండదని తెలుసు. ఇంకా 'వాదించే' శక్తో, 'వాదించి గెలిచే' తెలివితేటలో నాకు లేవు. 'ఊరంతా వినిపించేట్టు అరుచుకోవడం, గొంతుపెంచి గెలుచుకోవడం' అంటే నాకు అసహ్యం.

అది తెలిసే ఆవిడ వీరంగం. "హిట్ బిలో ది బెల్ట్" అనేది ఆవిడ ప్రిన్సిపుల్.

పెద్దచెరువు దగ్గర సైకిల్ ఆపి గట్టుమీద కూర్చున్నాను. చనిపోయిన అమ్మా నాన్నా గుర్తొచ్చారు. నాకూ ఇద్దరు పిల్లలున్నారు. ఇద్దరూ 'ఆవిడ' పోలికే. వాళ్ళకి కావలసింది ఇచ్చేదాకా ప్రాణాలు తోడేస్తారు.

వాళ్ళపనయ్యాక పొరపాటున కూడా తిరిగి చూడరు. నవ్వొచ్చింది. మనసు ఏమాత్రం గాయపడినా, సంతోషించినా నాకు గుర్తొచ్చేది మా అమ్మానాన్నలే.

తల్లిదండ్రులతో ఉన్న అనుబంధం అలాంటిది. ఇప్పుడు తల్లికీ బిడ్డకీ, తండ్రికీ బిడ్డకీ, భార్యకీ భర్తకీ మధ్య కనిపించని 'గోడలు'.

**గుట్టలో ఉన్న గులకరాళ్ళు ఒకచోటే ఉంటాయి.కానీ ఏదీ దేన్నీ అతుక్కోదు. ప్రస్తుతం 'కుటుంబసభ్యుల మధ్య' సంబంధాలు కూడా గులకరాళ్ళ సంబంధమే.**

"ఏంటి మూర్తిగారూ... కొంపదీసి దూకేత్తారేటీ?" ఇకిలిస్తూ పెద్దగా అన్నాడు మేకల సత్తినాణ.

"దూకుదామనే వచ్చానయ్యా....తీరాజూస్తే మోకాల్లోతు లేదు. దూకి ఏం ప్రయోజనం?" నేనూ నవ్వుతూనే సమాధానం ఇచ్చాను. "అదేంటండీ.... ఎట్టాచూసినా 'తూము' దగ్గర మూడు నిలువులుంటాదిగదా, మోకాల్లోతు లేదంటారూ?" అన్నాడు మేకల సత్తినాణ.

"బాబూ... సంసారమనే సముద్రంలో పడ్డవాడికీ, చెరువులూ దొరువులూ ఓ లెక్కా! అందుకే మోకాల్లోతు కూడా ఉండదన్నాను" వివరించా.

"ఏవైనా చదువుకున్నోళ్ళు చదువుకున్నోళ్ళే!" వెళ్ళిపోతూ అన్నాడు సత్తినాణ. మందలో మేకెట్టాగో సంఘంలో మనిషీ అంతే. ఇష్టం ఉన్నా లేకపోయినా, సరైనదైనా కాకపోయినా 'సంఘం శరణం గచ్ఛామి' అనక తప్పదు.

ఇప్పుడు మళ్ళీ అప్పుకోసం ఎక్కడికెళ్ళనూ? ఈ 'చదివింపు'లూ పెట్టుబడులూ ఇలాంటి దౌర్భాగ్యపు ఆనవాయితీలూ, సంప్రదాయాలూ లేకపోతే పెళ్ళిళ్ళు కావా? మొన్నీమధ్య మా 'కొలీగ్' కొడుకు పెళ్ళికి వెయ్యిమంది గెస్టులు. చచ్చేంత ఖర్చుపెట్టారు.

ఆహారం ఎంత వ్యర్థమయిందో లెక్కలేదు. ఎందుకు ధనాన్నిలా తగలేస్తారూ? పక్కవాడి ప్రాణాలు పోతున్నా పైసా విదల్చని మహానుభావులే 'పెళ్ళి'కి మాత్రం తెగ ఖర్చుచేస్తారు. దేనికీ? ఎంత గొప్పగా చేసినా ఏ పెళ్ళినీ ఎవడూ నెలలపాటు గుర్తుంచుకోడుగా!

చీకటిపడుతోంది.

లేచి ఊళ్ళోకి బయల్దేరా.

'మా అబ్బాయికి పైసాకట్నం వద్దమ్మా. అలాగే మావేపునించి పదిమందిమి వస్తాం. మీవైపునించి కూడా పదిమందినే పిలుచుకోండి. సింపుల్‌గా గుళ్ళో తాళి కట్టించి రిజిస్టర్ చేద్దాం!' అని మా నాన్నగారు సావిత్రి తల్లిదండ్రులతో చెప్పినప్పుడు వాళ్ళు ఎంత పొంగిపోయారో! మేం పదిమందిమి వెళ్తే వాళ్ళు మాత్రం రెండొందలమందిని పిలిచారు.

నాన్న 'ఖంగు' తిన్నది అక్కడే! ఆ'ఖంగు' ఎటువంటిదంటే, మా ఆవిడ కాపరానికి రాక'ముందే' ఆయన పైకి వెళ్ళిపోయాడు. సరే మా అమ్మ ముందరే 'కాలం' చేసిందనుకోండి.

సెల్లుమోగింది. ఆన్ చేశాను "నేను.... మీ అభిమాన హీరో ఉత్తరకుమార్‌ని మాట్లాడుతున్నాను. నా సరికొత్త సినిమా "నేనేరా బడాచోర్' రేపే విడుదల కాబోతోంది. మీరు మీ స్నేహితులతో, ఫ్యామిలీతో నా సినిమాచూసి 'హిట్' చేస్తారు గదూ... అన్నట్టు 'పైరసీ'ని అరికట్టండి.

టిక్కెట్టుకొని సినిమాహాల్లోనే సినిమా చూడండి. చూస్తారు గదూ...

లవ్‌యూ.....బైబై..... మీ అభిమాన హీరో ఉత్తరకుమార్'' అన్న ఎనౌన్స్‌మెంట్ వినిపించింది.

జనాల్ని థియేటర్‌కి రప్పించడానికి ఈ మధ్య కనిపెట్టిన మరో 'మడత' పద్ధతి ఇది.

చికాగ్గా సెల్ నోరు నొక్కేశా. పెళ్లాం 'నోరు' మాత్రం చెవుల్లో వినబడుతూనే వుంది. ఎంత ప్రయత్నించినా అప్పు దొరుకుతుందన్న 'ఆశ' లేదు.

అలాగని 'ఖాళీ'గా ఇంటికెడితే 'భారీ'గా మూల్యం చెల్లించాల్సి వుంటుందని తెలుసు. మనశ్శాంతికంటే 'గొప్పమూల్యం' ఇంకేముంటుంది?

రిక్షావాళ్ళ గుడిసెల దగ్గర 'ఠపా'మని టైరుకి పంక్చర్ పడింది.

ఠక్కున సైకిల్ దిగాను.ఓ రెండు ఫర్లాంగుల దూరంలో ఒక సైకిల్‌షాపు వుంది. అక్కడికెళ్తే పంక్చరు వేయించవచ్చు. మెల్లగా తోస్తుండగా ఓ ఇంట్లోంచి ఓ ఆడగొంతు, "మర్యేదగా నాక్కొత్తచీర అట్టుకురాకపోతే నే పుట్టింటికెళిపోతా' అని బెదిరించింది.

"దానికేం.... హాయిగా ఎల్లు.... నా దగ్గర డబ్బుల్లేవు. ఉన్నా కొనను'" స్థిరంగా జవాబిచ్చింది ఓ మగగొంతు.

"ఎందుగ్గొంటావూ.... ఉన్నదంతా మీ అమ్మ మందులకి ఊడ్చిపెట్టాలి గదా!" ఈసడింపుగా అంది ఆడగొంతు.

ఆ వెంటనే ఓ మూలుగు.

"అవునే... అందుకే కొనను. మా అమ్మ బతకాలి... బతికి నాతోనే ఉండాలి"' ప్రేమగా అంది మగగొంతు. బహుశా వాళ్ళ అమ్మని చూస్తూ అని వుండాలి.

"ఛీ...నువ్వూ ఓ మొగోడివేనా? కట్టుకున్నదానికీ, కన్నోడికీ ఏమీ జెయ్యకుండా కాటికి సిద్ధంగా ఉన్న ముసల్దానికి చూత్తాడంట.... ఛీ... ఎదవబతుకు" ఆడగొంతులో భరించలేని ఈసడింపు.

"మొగోడ్నిగాబట్టే ఊరుకున్నా. లేకపోతే కాళ్ళిరగ్గొట్టివుందును. నేనేమీ చెయ్యకుండానే ముప్ఫైఏళ్ళ నించీ కాపరం చేస్తున్నావా? ఇక ఆడిగురించి..... అయిదో తరగతి కూడా చదవని నేను రిక్షాలాగుతూ ఆడ్ని బి.ఎ. చదివించా. ఆడేంజేత్తన్నాడూ? బజార్లచుట్టూ బలాదూరు తిరుగుతున్నాడు. ఉద్యోగం కోసం చూత్తన్నాడంట! చదువుకునేది లోకజ్ఞానం కోసంగానీ ఉద్యోగంకోసం గాదు. ఒళ్ళు వంచితే చుట్టూతా పన్లే.

కానీ ఆ నాకొడుకు చెయ్యడు. నామోషీ... రిక్షావోడి సంపాదన మింగటానికి లేని నామోషీ ఉద్యోగాలు చెయ్యటానికొచ్చిందా?

హోటలాయన ఎన్నిసార్లు పిల్చాడూ... బిల్లులు రాసే పనిజెప్తా కౌంటర్లో కూచోమనీ.... ఈడు చెయ్యడు.

**ఒసే..... ఒకటి గుర్తుపెట్టుకో... నువ్వూ ఆడు మద్దెలో వొచ్చినోళ్ళు. మాయమ్మ నన్ను కనకముందే కడుపులో బెట్టుకుని చూసినాది.**

**మీరు వుంటే వుండండి లేకపోతే దొబ్బెయ్యండి. మా అమ్మని మాత్రం ఒక్కక్షణం వదిలిపెట్టేది లేదు!" నిక్కచ్చిగా అంది మగగొంతు.**

నా గుండె నిండిపోయింది. ఏవేవో గొణుగుతోంది ఆడగొంతు. ఆ మాటలు వినిపించలేదు.

"అమ్మా...చల్లగా ఈ గంజి తాగు... దానిమాటలకేంటీ...!" అనునయంగా ప్రేమగా మగగొంతు.

నా కళ్ళల్లో నీళ్ళు ఉబికినై. ఆ మనిషెవరోగానీ పాదాలు కడిగి నెత్తిన జల్లుకోవాలనిపించింది.

కోట్లు కోట్లున్నవాళ్ళే పెళ్ళానికి ఎదురుచెప్పలేక తల్లిదండ్రుల్ని 'ఓల్డేజ్‌హోమ్స్'కి పంపుతుంటే, 'నా తల్లిని మాత్రం క్షణం కూడా వదిలిపెట్టను. మీరు పోతేపొండి' అన్న మగాడ్ని ఇప్పుడే చూస్తున్నాను. చదువుయొక్క అంతిమలక్ష్యం సంస్కారంగానీ, 'సంపాదన' కాదని ఎంత చక్కగా చెప్పాడూ!

టైరు పంక్చరు వేయించిన తరువాత అనిపించింది. నా సైకిలు కరెక్టుగా ఎక్కడ ఆగాలో అక్కడే ఆగిందని. నేను హుషారుగా తొక్కుకుంటూ ఇంటిముందు దిగాను. "తెచ్చారా?" కాళ్ళూపుకుంటూ, కుర్చీలో నుంచి లేవకుండా ఎంతో ఆత్రంగా అంది సావిత్రి.

"తేలేదు.... తేను..." నిక్కచ్చిగా చెప్పా.

"అంటే?" అడిగింది ఆశ్చర్యంగా. ఇంతకాలం ఎప్పుడూ నోరువిప్పని మనిషిని గదా మరి!

ఇప్పుడు విప్పటం ఆవిడకి ఆశ్చర్యం కలిగించదూ! "పొద్దున ఇచ్చిన రెండు వేలల్లోనే సరిపెట్టుకో. అంతే!" అన్నాను.

"కుదరదు!" పంతంగా అంది.

"కుదిరితీరాలి!" నేనూ ఖచ్చితంగా అన్నాను.

"ఇట్టాంటి మగాళ్ళకి...." ఆవిడ ఏదో అనబోతుండగా ఆపాను. "ఈ క్షణం నుంచీ నువ్వు నా ఇంట్లో ఉండదలుచుకుంటే ఉండు. లేకపోతే ఎక్కడికి పోతావో అక్కడికి పో. నేను ఇచ్చినదాంతోనే సరిపెట్టుకోవాలి. పైసా అప్పు చెయ్యను. బాగా విను" అన్నాను.

"ఏమనుకుంటున్నావు నన్ను!" గొంతు పెంచింది.

"ఇప్పటిదాకా మనిషివనే అనుకుంటున్నా.... ఇక ఇప్పుడు ఆలోచించాలి" అన్నాను.

"ఇక ఒక్కక్షణమైనా ఈ దిక్కుమాలిన కొంపలో ఉండను!" అంటూ ఛర్రున కుర్చీలోంచి లేచింది. నేనేమీ మాట్లాడలేదు. ఇంతకాలం 'పరువూ ప్రతిష్టా' అనుకుంటూ నాలో నేనే కుంచించుకుపోయాను. అసలు పరువంటే ఏమిటీ...

ప్రతిష్టంటే ఏమిటీ? మనచుట్టూ మనమే లెక్కలేనన్ని గీతలు గీసుకుని అవి దాటలేక సగం చస్తూ బతుకుతూ ఉన్నాం. ఇంకా ఎంతకాలం ఈ భయం?

సరేనయ్యా.... మనం గిరిగీసుకుని వున్నాం. అంతటితో ఊరుకోలేదే! అందులోనే ఉంచే ప్రయత్నం చేస్తున్నామేగానీ, మనం విడుదలై భావితరాల్ని విడుదల చేద్దామని కనీస ప్రయత్నమన్నా చేశామా? చేస్తున్నామా? ఎవడో ఒకడు మొదలెట్టాలి.

నేనే ఇవాళ మొదలెడతా.

నా 'మానసిక' బానిసత్వాన్ని నేను వదుల్చుకుంటా. స్వేచ్ఛని ఆస్వాదించిన వాడేగా ఇతర్ల స్వేచ్ఛని గౌరవించేదీ! ఆ రాత్రి పదింటికి నేనే వంటింట్లోకి పోయి స్వయంగా వడ్డించుకుని తిన్నాను.

మిగతావారంతా కోపంతోనో, అలకతోనో నేను 'దిగొస్తానని' ఎదురు చూస్తున్నారు.

నాకు ఇష్టమైన 'మడతమంచాన్ని' హాయిగా వరండాలో వేసుకుని నిద్దరపోయాను.

సూర్యోదయంతో లేచాను.

ఎవరిపనులు వాళ్ళు చేసుకుంటున్నారు.

నిన్నటికీ, ఇవాల్టికీ ఒకటే తేడా – నిన్నటిదాకా బతుకుతున్నాననుకుంటూ బతికాను.

ఇవాళ నిజంగా 'బతుకుతూ' సూర్యోదయాన్ని చూశాను. ఎంతో బావుంది.

"ముఖేముఖే సరస్వతి' అన్నట్టుగా జీవితానికి 'స్ఫూర్తి'నివ్వడానికి 'గొప్పవాళ్ళే' ఉండనవసరంలేదు.

కనీసం ముఖమైనా చూపకుండా బతుకుపాఠం నేర్పిన 'మనిషి' లాంటి వాళ్ళు ఉన్నా చాలు. సూర్యబింబం ఎన్నడూ లేనంత అందంగా కనిపిస్తోంది.... కాదుమరీ!

– స్వాతి, 25-04-2014

# శుభం

'వానరాకడ..... ప్రాణం పోకడ' తెలీదని పెద్దలు అనుకుంటుంటే, 'ఏమో అనుకునేవాళ్ళం. ఇప్పుడు..... ఇన్నేళ్ళ తరువాత తెలుస్తోంది. 'మాధవ రాకడ - మనశ్శాంతి పోకడ' ఎప్పుడో నిజంగా తెలీదని.

అలాగని మాధవరావు మరీ అంత చెడ్డవాడేమీ కాదు. ఓ కోణంలో చూస్తే కాస్త మంచివాడని కూడా అనుకోవచ్చు.

మా కాలనీలోకి మాధవ వచ్చాక మాకు, అంటే మగమహారాజులకి పనులు బాగా తగ్గాయి కూడా.

ఇహ మా ఆడవాళ్ళయితే ఏకంగా తమ్ముడా అనో, అన్నా అనో, మాధవని పిలిచి బజారుపనులన్నీ వప్పగిస్తున్నా చిరునవ్వుతో చేసిపెట్టడమే గానీ ఒక్కరోజైనా విసుక్కున్న పాపాన పోలేదు.

మాలాగా 'మందు' కొట్టడు. సిగరెట్లు తాగడు. చుట్టా బీడీ పాన్, పాన్‌పరాగ్ లాంటి వస్తువుల వంక చూడనైనా చూడడు. వచ్చిన చిక్కల్లా అతను మాట్లాడే 'నిజం'తోనే.

వారానికి ఒకసారైనా 'మగపుటక' పుట్టినవాళ్ళకి కాస్త స్వాతంత్ర్యమో, ప్రైవసీనో ఉండటం లేక ఉండాలనుకోవడం తప్పుకాదుగదా!

హాయిగా పేకాడుతున్నప్పుడో, మొదటి పెగ్గు దాటినప్పుడో కొంచెం 'ఆత్మస్తుతీ – పరనిందా' చేసుకోవడమూ తప్పుకాదుగదా!

మనసులోని 'అరిషడ్వర్గాలనీ' బయటపెట్టడం వల్ల జరిగేది మంచే కానీ చెడు కాదుకదా! అవునా.... ఈ మాధవకి ఇంతచిన్న విషయం అర్థంకాదేం?

"అక్కయ్యగారూ.... మీ తమ్ముడు ఉత్తిబేవార్సుగాడటగా? నిన్న సాయంకాలం బావగారు మీ వెనక ఫ్లాటు కృష్ణమూర్తిగారితో అంటుంటే విన్నాను" అన్నాడు మా ఆవిడతో నేను వింటుండగానే.

మా ఆవిడ నావంక చూసిన చూపు మామూల్ది కాదు. ధ్యానభంగం చేసిన మన్మథుడిపై ఉప్పెనలా వాలిన 'శివుడి' మూడో కంటిచూపులాంటిది.

"నేనెప్పుడన్నానోయ్...? వాళ్ళ బావమరిది ఉత్తి బేవార్సుగాడని కృష్ణమూర్తి అంటే–

"అవునా?" అన్నాను గానీ, మా బావమరిదిని నేనెందుకన్నానూ? అసలెందుకంటానూ!" సమర్థించుకోబోయా. ఈ మొద్దుమాధవుడికి అర్థంకాదేం? "అదేంటి బావగారూ! మీరు మీ బావమరిది గురించి చెప్పగానే కృష్ణమూర్తిగారు–

"హూ... మీ బావమరిది ఉత్తి బేవార్సుగాడే, కానీ మా బావమరిది పరమ వేస్టుగాడు మంచీ – మర్యాదా తెలీని బీస్టుగాడు– ఎప్పుడూ మొహం మాడ్చుకునే రోస్టుగాడు అని అన్నారుగా... మర్చిపోయారా?" అన్నాడు మళ్ళీ. "ఒహో..... అలాగన్నారన్నమాట. చెబుతా!" అని హుంకరిస్తూ కృష్ణమూర్తి భార్య విశాలాక్షి మా వంటింట్లోంచి బయటికి వచ్చేదాకా ఆవిడ ఇక్కడే ఉందని మాకు తెలీలా!

నా మొహం నూనె వెయ్యని పెసరట్టులా మాడిపోయింది. మా ఆవిడ వరుసగా ముక్కంటి చూపులు చూస్తూనే వుంది.

"మీరూ ఇక్కడే ఉన్నారా విశాలక్కయ్యా! ఏదో కాస్త 'మందు'లో అన్నార్లెండి..... మరీ అంత పట్టించుకోవద్దు!" సముదాయించాడు మాధవ.

మరో స్కైలాబ్ నెత్తినపడ్డట్టయింది. కేవలం ఆదివారాలు, అదీ నెలకి రెండుసార్లు మాత్రమే మందుకి పర్మిషన్ ఇచ్చారు మా ఆడంగులు... మిగతా రోజుల్లో మేము ఏ జిన్నో, లిమ్కాలో కలుపుకొని తాగి, వాసన రాకుండా మాంఛిఘాటయిన చాక్లెట్లు నములుతూ ఇంటికొస్తాం.

ఇవాళ ఆ గుట్టు కాస్తా మాధవ సముదాయింపుతో రట్టయింది. ఎందుకంటే నిన్న సాయంకాలం అంటే 'గురువారం' గనక. 'ఒహో.... గురువారాలు కూడా మొదలెట్టారన్నమాట! మంచిది!'

నావైపు ఓ చూపు విసిరి, మాధవతో ఆ మాట అని, బయటికి నడిచింది విశాలాక్షి.

ఆ 'విసవిస' నడకతోనే నాకు అర్థం అయింది, 'కృష్ణమూర్తి'ని సాక్షాత్తూ ఇవాళ కృష్ణపరమాత్ముడొచ్చినా రక్షించలేడని.

"సరే వెళ్ళొస్తానక్కయ్యా..." లేచాడు మాధవ. మామూలుగా అయితే మా ఆవిడ 'ఆతిథ్యం' విషయంలో మొసలిపట్టు పడుతుంది.

తింటేగానీ గడపదాటనివ్వదు. అలాంటిది 'సరే తమ్ముడా' అనింది. నా గుండె గుభేల్‌మంది. ఏం చేస్తాం? లక్షసార్లు కాలుజారినా వెనక్కి లాక్కోగలం గానీ ఒక్కసారి నోరుజారితే ఆ మాటని వెనక్కి తీసుకోలేము గదా...! అన్నిటికీ 'సిద్ధమై' మౌనంగా కూర్చున్నా, తప్పేదేముందీ?

❀ ❀ ❀

'శ్రీఆంజనేయం' గారి భార్య పర్వతవర్ధినిగారు ఊరెళ్ళారని తెలియగానే మాకు మహదానందం కలిగింది. పాలకొంకులమీద వాలే పక్షుల్లా శ్రీ ఆంజనేయంగారి ఇంట్లో వాలిపోయాం.

"రండి రండి" మొహం ఇంత చేసుకుని ఆహ్వానించారు శ్రీఆంజనేయం గారు. ఆయన అసలు పేరు నల్లాన్ చక్రవర్తుల రాఘవాచార్యులు. మా ఊరివాడే. పొరపాటున కూడా 'మందు' ముట్టని చక్రవర్తి. మాగ్గావలసిందీ అదే! గంటకోసారైనా ఆయన ఆంజనేయదండకం చదువుతాడు గనక శ్రీ ఆంజనేయం గారని పిలుస్తామన్నమాట.

"ఒరే రామారావూ.... ఈ మాధవగాడు మనల్ని ప్రశాంతంగా బ్రతకనివ్వడ్రా! నిన్నంటే నిన్న మా ఆఫీసుకొస్తే, నేనేదో వెర్రివాడిలా మా హెడ్‌క్లర్కుని పరిచయం చేశాను.

అంతే! ఇహ జూసుకో నాయనా, 'హరిబాబు గారూ... ఈయన్నేగా మీరంతా 'టార్టైజ్' గాడని తిట్టేదీ! భలే పేరు పెట్టారు... ఈయనది అచ్చు తాబేలు మొహమే!" అన్నాడ్రా.

"మహాప్రభో! మేం అనేది మీ మొహం గురించి కాదు, మీ 'నెమ్మదితనం' గురించి అని ఎంత మొత్తుకున్నా మా హెడ్‌క్లర్కు వింటేగా!' ఏడ్చినంత పనిచేశాడు బర్మా హరిబాబు.

"హు....! మొన్న మా ఇంట్లో టిఫిన్‌చేస్తూ మా ఆవిడతో అక్కయ్యా, మీరేమో ఇలా చక్కగా మడీ ఆచారం పాటిస్తారు గదా– మరి బావగారేమిటీ ఆ మూడో అపార్టుమెంటు నాయుడింట్లో 'చికెన్' తిన్నారూ?' అన్నాడ్రా! ఆ రోజునించీ నాకూ మా ఆవిడకీ మాటల్లేవు... అన్నీ సైగలే!" గటగటా గుక్క బిగించి నిట్టూరుస్తూ అన్నాడు విధ్వంసం శాస్త్రి. (ఆయన పనిచేసేది 'విధ్వంసం' పత్రికలో)

ఇంకేం! 'అగ్గిపుల్ల అడివినంతా అంటించిం'దన్న సామెతలాగా మావాళ్ళంతా విజృంభించి మరీ తమ తమ కష్టాలు చెప్పుకొచ్చారు.

అందరి మాటల్లోనూ 'కింగ్‌పిన్' మాధవే. అందరం కలిసి ఏకగ్రీవ తీర్మానం పెట్టాం.

**నెంబర్ వన్:** మాధవని ఎవరూ ఇంటికి పిలవకూడదు.

**నెంబర్ టూ:** ఒకవేళ చనువుకొద్దీ ఆడంగులు సదరు మాధవని ఇంటికి పిలిచినా, మనం వీలున్నంత ముభావంగా ఉంటూ, మన అసంతృప్తి తెలియ పరచాలి.

**నెంబర్ త్రీ:** 'శివైక్యం' పార్టీల్లోకి, అనగా 'అమృతసేవన'లోకి మాధవని రానే రానివ్వకూడదు. మనం పిలవకపోయినా వస్తాడు గనుక, మందుపార్టీ ఎక్కడ జరుపుకునేదీ చివరిక్షణందాకా వెల్లడించరాదు.

**నెంబర్ ఫోర్:** ఆ నిర్ణయం సమయోచితంగా తీసుకోబడుతుంది. మొత్తానికి సమస్యని పరిష్కరించిన ఉత్సాహంతో ఆనాటి కార్యక్రమాన్ని 'పెగ్విజయం'గా ముగించాం.

మేం గేటుదాటి లోపలికి వెళ్ళబోతుండగా కార్తికేయశర్మా, రిలయన్స్ చౌదరీ ఒకరినొకరు క్రూరంగా తిట్టుకోవడం కనిపించింది. నిజానికి వాళ్ళంత మంచి స్నేహితులు మా బెజవాడలో టార్చి వేసుకుని వెతికినా కనిపించరు. అందుకే వాళ్ళిద్దరికీ బాపూ–రమణా అని నిక్‌నేమ్స్ కూడా పెట్టాం (బాపు శర్మ, రమణ చౌదరి అని)

"ఏమయింది శర్మగారూ...." అర్జెంటుగా మధ్యలో దూరి అరిచాడు హరిబాబు.

"మీరేమిటీ ఇలా అరుస్తున్నారూ? అసలు మీ నోట్లోంచి ఒక్క తిట్టుకూడా రాదుగా!" చౌదర్ని అడిగాడు నిరంజనం.

"చూడవయ్యా హరీ... డబ్బు అవసరం ఉందన్నాడు. నేను లేదన్నాను- దానికే నానామాటలూ అనాలా?" యుద్ధం తాత్కాలికంగా ఆపి వివరించాడు శర్మ.

"హు! లేదు అనంటే ఎందుకంటానూ? ఇదిగో నిరంజనం, ఆయన్నే అడుగు నేనెన్నిసార్లు అవసరానికి ఆదుకున్నానో"

"నాకు అవసరం వచ్చినప్పుడు అడిగితే ఉంచుకుని కూడా లేదని అబద్ధం ఆడటం న్యాయమా? ఛీ.... స్నేహితుడని చెప్పుకోవడానికే సిగ్గుగా ఉంది!" శర్మని చూస్తూ అసహ్యించుకున్నాడు చౌదరి.

"ఆ మాటంటేనే నాకు కాలుతుంది. ఎవడూ నా దగ్గర డబ్బున్నదన్న వంకాయిగాడు? లేదురా నాయనా అని మొత్తుకున్నా వినవేం?" పిచ్చికోపంతో అరిచాడు కార్తికేయ శర్మ.

"వంకాయిగాడన్నాడో, ఉల్లిపాయిగాడన్నాడో నీ దగ్గర డబ్బున్న మాట నిజం" ఖచ్చితంగా అన్నాడు రిలయన్స్ చౌదరి.

"రుజువు చేస్తే మీ అందరితోటీ చెప్పుతో కొట్టించుకుంటా!" ఛాలెంజ్ చేశాడు శర్మ.

"రుజువు కావాలా? మొన్న నువ్వు గొల్లపూడి దగ్గరి ఫ్లాట్లు అమ్మలేదూ?"

"ఉ! అమ్మానూ! ఆ డబ్బు అయిపోయింది." నీరసంగా అన్నాడు శర్మ అటూ ఇటూ చూస్తూ.

"మొన్న అమ్మితే నిన్నే అయిపోయిందా?" హేళనగా అన్నాడు రిలయన్స్ చౌదరి. "అవును.... అయిపోయింది!" గొంతుతగ్గించి అన్నాడు శర్మ.

"మేం నమ్మాలి.... అవునా? ఎందుకన్ని అబద్ధాలు? ఇవ్వటం ఇష్టంలేదని చెబితే పోయేదానికి....!" అసహ్యంగా చూశాడు చౌదరి.

"అసలు ఆ ఫ్లాటు అమ్మానని ఎవరూ నీతో చెప్పింది?"

"ఎవరైతేనేం? నిజం బయటపడింది! డబ్బుముందు స్నేహం చిల్లిగవ్వకి కొరగాదని రుజువైంది... బస్, ఈ క్షణంనించీ నీ మొహం కూడా చూడను...." చరచరా తన అపార్టుమెంట్‌వైపు నడిచాడు చౌదరి.

తరువాత తెలిసిందేమంటే మాధవే "ఏవండోయ్ చౌదరిగారూ, మీ ఫ్రెండు శర్మగారు ఇవాళ మా ఆఫీసుకొచ్చారండీ! కోటిరూపాయల ఫ్లాటుని అరవైలక్షలకి అమ్మారు ఏమిటో!" అన్నాట్ట.

"పోనీ చౌదరి నీ ఫ్రెండేగా... అదీ అతను అడిగింది లక్షేగా! ఇస్తే నీ సొమ్మేం పోయిందీ' తిరిగిచ్చేస్తాడుగా!" అని శర్మనడిగా–

"నాయనా, రాంబాబూ... ఆ డబ్బు వెంటనే మా ఊరికి పంపించేశా. ఎందుకంటే మా నాన్న అప్పులు చేసి మమ్మల్ని చదివించారు. మేమంతా ఆ విషయం వదిలేసి ఎవరి ఆస్తులు వాళ్ళం కూడబెట్టుకున్నాం. నేను తీర్చేసివుంటానని నా తమ్ముళ్ళూ, వాళ్ళ దగ్గర తీసుకుని అప్పు 'నాన్న' తీర్చేసివుంటాడని నేనూ అనుకున్నాం.

సరిగ్గా వారంరోజుల ముందు తెలిసింది ఇల్లు వేలం వెయ్యబోతున్నారని. అదే జరిగితే మా అమ్మా నాన్నా గతి ఏమిటీ?

తమ్ముళ్ళకి ఫోన్‌చేస్తే వాళ్ళు చేతులెత్తేశారు. నేనే తప్పని పరిస్థితుల్లో గొల్లపూడి ఫ్లాట్ అమ్మేసి మా ఇంటిమీద అప్పు తీర్చేశా.

ఈ విషయం తెలిస్తే మా ఆవిడ నా ప్రాణాలు కొరికేస్తుందని చాలా గుట్టుగా పని ముగించినా, విషయం బయటపడింది. అటు స్నేహితుడికీ ఇటు పెళ్ళానికీ కూడా శత్రువునైపోయా!" తలొంచుకుని అన్నాడు శర్మ. ఏడుపొక్కటే తక్కువ.

చెప్పొద్దూ..... మాధవగాడ్ని చితకతన్నాలనిపించింది. కనీసం 'వీరతిట్లు' అయినా తిట్టకపోతే నా బీ.పీ కంట్రోల్ తప్పుతుందనిపించింది. బలవంతంగా శర్మని లేవదీసి మాధవ ఉండే సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌కి బయల్దేరాను.

ఎందుకైనా మంచిదని హరిబాబునీ, నిరంజన్‌నీ కూడా బయల్దేరదీశా. నాలుగడుగులు వేశామో లేదో మాధవరావే ఎదురొచ్చాడు. నవ్వుతూ నావంక చూసి, "బావగారూ! అందరూ ఎక్కడికి బయల్దేరారూ? అన్నట్టు ఓ విషయం

విన్నారా? కోదండ రామ్మూర్తి కొడుకు మన కాలనీలోనే ఎవరో అమ్మాయిని గాఢంగా ప్రేమిస్తున్నాడు" అన్నాడు.

అసలు విషయం మర్చిపోయి, "ఎవర్ని ప్రేమిస్తున్నాడు? ఎవరు చెప్పారు? ఎలా తెలిసింది?" కోరస్‌గా అడిగారు శర్మా, హరిబాబూ, నిరంజనం. వాళ్ళ గొంతులో చెప్పలేనంత ఆదుర్దా.

ఓ నిమిషం అయ్యాక నాకు తట్టింది వీళ్ళకా ఆదుర్దా ఎందుకో...ముగ్గురికీ పెళ్ళీవయసుకొచ్చిన ఆడపిల్లలున్నారు.

కోదండరామ్మూర్తి గో....ప్ప 'ఎకనమిస్టు' అతని పేరుప్రఖ్యాతులు మా కాలనీలోనే గాక చుట్టుపక్కల అన్ని కాలనీల్లోకీ కొండచిలవలు పాకినట్టు పాకిపోయాయి. అప్పుడెప్పుడో పట్టాభిసీతారామయ్యగారు చెప్పినట్టు 'ఒక పంచె చిరుగుపడితే రెండు లుంగీలవుతాయి. ఆ లుంగీలు చిరుగుపడితే నాలుగు తువ్వాళ్ళవుతాయి. ఆ తువ్వాళ్ళు చిరుగుపడితే పదహారు రుమాళ్ళవుతాయి. అవీ చిరుగుపడితే ఇల్లు తుడిచే అలుగ్గుడ్డలవుతాయి అన్న పొదుపుమంత్రాన్ని యధాతథంగా పాటిస్తాడు కోదండరామ్మూర్తి.

అంతేకాదు.... పిల్లలకయిన పురిటిఖర్చులనించి కాలేజీ ఖర్చులదాకా 'విడివిడి' పుస్తకాల్లో తు.చ. తప్పకుండా రాసి పిల్లలచేత సంతకాలు కూడా పెట్టించాడు. అదేమంటే, "ఏం? రేపు వాళ్ళు మనల్ని చూస్తారనే గ్యారంటీ ఏమన్నా వుందా? బ్యాంకులోన్ తీసుకుంటే తీర్చరా? ఇదీ అంతే!" అన్నాడు.

"రుణానుబంధరూపేణా పశుపత్నీ సుతాలయా! అన్నారు గదండీ" అని శర్మ ఓనాడు నచ్చచెప్పబోతే, "రుణం అంటే నాకు మా చెడ్డకోపం శర్మగారూ..... అందుకే రుణశేషం ఉండకూడదని 'లెక్కలు' రాస్తున్నాను" అని ఒక్కమాటలో శర్మనోరు మూయించాడు. చెప్పొద్దూ! పిల్లల విషయంలో కోదండరామ్మూర్తిని ఫాలో అవుదామని నేనూ ఉత్సాహపడ్డాను గానీ, మా ఆవిడ 'స్వరశక్తి' గుర్తుకొచ్చి ఆ ఉత్సాహానికి నేనే అడ్డుకట్ట వేసుకున్నాను.

మళ్ళీ ప్రస్తుతానికి వస్తే, "ఎవరో తెలీదుగానిండీ ఖచ్చితంగా మన కాలనీలోని అమ్మాయే....ఆ... ఒక క్లూ ఉంది!" నవ్వి అన్నాడు మాధవ.

"ఏమిటి?" ఒకేసారి అన్నారు ముగ్గురూ.

"ఆ అమ్మాయికి సెల్‌ఫోన్ ఉంది! ఎందుకంటే ఆ కుర్రవాడు అనగా- కల్యాణరామ్మూర్తి గంటలు గంటలు సెల్‌ఫోన్లో మాట్లాడుతున్నాడు గనక!" ఓ గొప్ప సస్పెన్సుని విప్పినంత గొప్పగా అన్నాడు మాధవ.

"ఏడిసినట్టుంది.... ఇప్పుడు సెల్‌ఫోన్ లేనిదెవరికీ? ఎల్‌కేజీ పిల్లకాయల చేతుల్లోనూ అదే" నీరసంగా అన్నాడు నిరంజనం. వాళ్ళమ్మాయి ఎవరిమాటా వినదు. ఎవర్నీ మాట్లాడనివ్వదూ.

"ఈ విషయం కోదండరామ్మూర్తికి తెలుసా?" ఆలస్యంగా అయినా మంచి ప్రశ్న వేశాడు శర్మ.

"ఆ.....! నేనే చెప్పాను!" ఆనందంగా అన్నాడు మాధవ. "చెప్పావా? ఏమన్నాడూ?" ఆశ్చర్యంగా అడిగాడు హరిబాబు.

"ఎవతిని చేసుకున్నా ఫరవాలేదుట. ఇప్పటిదాకా ఆయన కల్యాణ్‌కి పెట్టిన పెట్టుబడి పాతికలక్షలూ ప్లస్ వడ్డీ ఇచ్చేస్తే చాలుట" "ఓరి నాయనోయ్.... అసలూ వడ్డీ కలిపితే కనీసం నలభై లక్షలన్నా అవదూ?" నోరు తెరిచాడు నిరంజనం.

"ఎందుకు కాదూ? అందునా కోదండ రామ్మూర్తి లెక్కల్లో 'శకుంతల లాంటోడు గదా! అయినా మనకెందుకా బాధ...!" తనని తాను సమాధానపరుచు కుంటూ అన్నాడు హరిబాబు.

"పోనీ కల్యాణరామ్మూర్తినే అడుగుదామా?" అన్నాడు శర్మ. "అడిగితే చెబుతాడా? మీకెందుకండీ నా ప్రేమ విషయం... మీరేవన్నా ఆరుస్తారా తీరుస్తారా అంటే మొహం ఎక్కడ పెట్టుకోవాలీ?" కొట్టిపారేశాడు నిరంజనం.

"నేనే కనుక్కుని చెబుతాలెండి... అన్నట్టు మీరెక్కడికో వెళ్తున్నారుగా వెళ్ళిరండి!" అంటూ చక్కాబోయాడు మాధవ. ఇంకేం చేసేదీ... మాట్లాడకుండా ఎవరి 'గూళ్ళ'ల్లోకి వాళ్ళం వెళ్ళిపోయాం.

నిన్నటిదాకా నేను పెద్దగా గృహసంబంధిత విషయాల్లో ఏమీ పట్టించుకోలేదు గాని, కల్యాణరామ్మూర్తి విషయం విన్నాక అలా ఏదీ పట్టించుకోకపోవటం తప్పనిపించి పిల్లల్ని గమనించడం మొదలెట్టాను. నా కొడుకు అజితేంద్రకి క్రికెట్ పిచ్చీ ఇంటర్నెట్ పిచ్చీ తప్ప మిగతా విషయాలు పట్టవని, గమనించిన కొద్దిసేపట్లోనే తెలిసిపోయింది.

పెద్దవాళ్ళు చెప్పే సామెతల్ని వాడు గౌరవిస్తాడని తెలిసి సంతోషించా కూడానూ. ఎలాగంటే, "ఒరే అజితూ, నీకు తెలిసిన తెలుగు పద్యం ఒకటి చెప్పరా... సుమతీ శతకంలోనిది" అన్నాను.

"సుమతి ఎవరూ?" ఆశ్చర్యంగా అన్నాడు. ఒక్కమాటతో వాడి తెలుగుతనాన్ని బయటపెట్టగలిగాడంటే వాడు నిఖార్సైన పండితపుత్రుడేగా!

(చెప్పలేదు గదూ.... నేనో రచయితనేగాక తెలుగు ఎమ్మేని. ఆకలి కవిత్వం, మందుకవిత్వం పుంఖానుపుంఖాలుగా రాశాను.... సరస, విరస, శృంగార కవితల్ని కూడా లెక్కకు మించి రాశాను) ఇహ వాడిగురించి బెంగ లేదనిపించింది.

మా అమ్మాయి 'ఆనంది'ని పిలిచా. గొప్ప చెప్పుకోకూడదుగానీ, మా అమ్మాయికి వాళ్ళమ్మ పోలిక ఒక్కటికూడా రాలేదు... అందుకే పిలవగానే వచ్చింది. "అమ్మాయ్ ఆనందీ, ఉప్పు యొక్క రుచి ఎప్పుడు మారుతుందీ?" అనడిగాను.

"వాట్‌డాడ్.... ఆర్యూమేడ్" అంది కళ్ళు పెద్దవి చేసి. "ఓ.కె. యుకెన్ గో నౌ" అన్నాను గంభీరంగా. కానీ లోలోపల చాలా సంతోషించా.

(ప్రేమలో ఉన్నప్పుడు ఉప్పు తియ్యగానూ, తేనె పుల్లగానూ ఉంటుందని దీనికి ఇంకా తెలియలేదు. అంటే నా ఇరవయ్యేళ్ళ కూతురూ ఇంకా ప్రేమలో పడలేదని నాకు అర్థమైపోయింది.

వచ్చిన చిక్కల్లా మా ఆవిడతోనే వచ్చింది. నిద్దరపోయేముందు "ఏమిటో పిచ్చిప్రశ్నలు వేస్తున్నారట? మళ్ళీ కవిత్వం ఏమన్నా మొదలెట్టారా?" అని తెల్లవార్లూ దోమలు కుట్టినట్టు కుడుతూనే ఉంది. మా ఆవిడ ఎంత 'కరోడా' అంటే, కవిత్వం మానేస్తానని ఒట్టేయించుకున్న తరువాతే కొంగు పట్టుకోనిచ్చింది (ఏం చేస్తాం.... అప్పుడు వయసు గోల తట్టుకోలేక ఓ.కె అన్నాను) ఏమైనా కోదండరాముడి 'ఎఫెక్టు' మనకు రాదు అని సంతోషించినవాడనై తెల్లవారు ఝామున నిద్రపోయాను.

❀ ❀ ❀

"ఇంతకీ నీ పెళ్ళి ఎప్పుడోయ్?" అని మా ఎల్.ఐ.సీ సీతారామారావు మాధవని అడగనే అడిగాడు..... ఆ మరుసటిరోజున. "ఇంకా ఏమీ అనుకోలేదంకుల్...." సిగ్గుపడుతూ నవ్వాడు మాధవ.

"బెండకాయ ముదిరినా బ్రహ్మచారి ముదిరినా పనికిరాదంటారు గదోయ్!" పేద్ద జోకు వేసినట్టు నవ్వాడు ట్రావెల్సు సత్తినాణ.

"విత్తనాలకి పనికొచ్చేది ఎండిన బెండేనండీ...!" షార్ప్‌గా అన్నాడు మాధవ. చుట్టూతా వున్న అందరికీ నవ్వొచ్చింది. "సర్లే.... సర్లే... పెళ్ళిచేసుకునే ఉద్దేశం వుంటే ఏదన్నా తెలిసిన సంబంధం చూద్దామని అడిగాను!" సర్దుకున్నాడు సత్తినాణ.

"చేస్కుంటే లవ్‌మేరేజినేనండీ... లేకపోతే.....నో!" హుషారుగా అన్నాడు మాధవ.

మళ్ళీ నా గుండెలో రాయి పడింది. అవునూ.... వీడు దురాలోచనతో 'దూరం' ఆలోచించి నన్ను బావా అనీ, మా ఆవిడ్ని అక్కా అనీ పిలవట్లేదుగదా? ఎందుకంటే అక్కకూతురు వరసకి ఫిట్ అవుతుందిగా... "ఏమిటో... ఏం ప్రేమలో పాడో... నాకు మాత్రం లవ్‌మేరేజంటే ఒళ్ళు భగ్గుమంటుంది....!" ఎందుకైనా మంచిదని అన్నాను.

"లవ్‌మేరేజే కాదు బావగారూ, ఇంటర్‌కేస్ట్ మేరేజే చేసుకుంటా. ఎందుకూ, రెలిజియన్ కూడా పట్టించుకోను.... 'పిల్లా, వాళ్ళవాళ్ళు 'మంచివాళ్ళయితే....!" చిద్విలాసంగా అన్నాడు మాధవ.

దాంతో అందరికీ తారుపుట్టింది. ఎలా? ఎలా ఈ బ్రహ్మచారులనించి కన్నబిడ్డల్ని కాపాడ్డం? అందునా వీళ్ళు ఇంగ్లీషు చదువులు మరిగి కులం, మతం లేవంటున్నారే! ఈ అప్రాచ్యపు పనులకి పైనున్న పితృదేవతలు ఎంత ఘోషిస్తారో కదా! హతవిధీ!

"ఆల్‌రెడీ ఎవరికన్నా లైనువేశావా?" కూపీలాగే ఉద్దేశంతో అడిగాడు ఎల్.ఐ.సి సీ.రా.రా.

"కొందరు దృష్టిలో ఉన్నారనుకోండీ! అయినా బాగా గమనించిగానీ నిర్ణయం తీసుకోదల్చుకోలేదు. లవ్‌ఎట్ ఫస్ట్ సైట్‌మీద నాకు నమ్మకం లేదు.....నిదానంగా ప్రేమించి నిర్ణయం తీసుకోవడమే నాకు ఇష్టం! ఎనీవే, వస్తా!" మళ్ళీ ఓ నవ్వు నవ్వి ముందుకు పోయాడు మాధవ.

చెప్పొద్దూ.... ఆ రోజునుంచీ యుక్తవయసుకొచ్చిన ఆడపిల్లల తల్లిదండ్రులకి మనశ్శాంతి లేకుండా పోయిందని ఢంకా బజాయించి మరీ చెప్పగల్ను. ముఖ్యంగా తండ్రులకి.

"అదేమిటండీ, వీడు ఓ ప్రైవేటు కాలేజీలో లెక్చరర్ అయివుండీ ఇలా మాట్లాడతాడూ... వీడిహ క్లాసులో పిల్లలకి ప్రేమపాఠాలు బోధిస్తాడో ఏమిటో? నిదానంగా గమనించి నిర్ణయం తీసుకుంటాట్ట! వీడ్ని మన మధ్యలో ఉండనిస్తే మన పిల్లలు చెడిపోకతప్పదు. ఆ!" ఆందోళనగానూ, హెచ్చరికగానూ అన్నాడు శర్మగారు.

"త్వరలో "పేద్ద కాలేజీ'లో ఉద్యోగం వస్తుందిట. ఐ.ఏ.ఎస్.కి కూడా తయారయ్యాట్ట!' అదనపు వివరాలు అందించాడు రిటైర్డ్ పోస్టుమాస్టర్ వేద నారాయణమూర్తి. చెప్పొద్దూ.... ఆ మాట వినగానే నాలో ఓ సంచలనం కలిగింది.

కలెక్టరుగారికి 'కాబోయే మామగారు' కావడం అల్లాటప్పా వ్యవహారం కాదుగదా.

నాలాగే అక్కడున్న ఆడపిల్లల తండ్రులందర్లోనూ ఇదే సంచలనం కలిగిందని మరీ చెప్పగలను. కావాలంటే వాళ్ళ మాటలు చిత్తగించండి.

"మాధవ ఆలోచనలు మహా గొప్పవోయ్ రాంబాబూ. ముఖ్యంగా ఆ 'నిదానంగా గమనించి ప్రేమించాలన్నమాట!' ఆహా... మాటనిబట్టి బాగా నెమ్మది గల పిల్లనే చేసుకుంటాడన్నమాట!" తన్మయంగా అన్నాడు ట్రావెల్సు నత్తినాణి.

ఆయనకి ముగ్గురు కూతుళ్ళున్నారు. ఏ పనిచెప్పినా మరుసటి రోజుకానీ చెయ్యరు... అంత నెమ్మది. "ముందర మాధవ కులం తెలియాలిగా!" అన్నాడు హరిబాబు.

"ఆ... ఏం వుందండీ కులంలో.... ఆయనెవరో కవిగారు, గాలికి కులమేదీ అని రాయనే రాశాడు గదా! కాలం మారిపోయింది హరిగారూ, మనమూ మారాలి!" అన్నాడు శర్మగారు.

"మేరేజెస్ ఆర్ మేడిన్ హెవెన్ అని ఇంగ్లీషువాడు చెప్పనే చెప్పాడుగా.... మన చేతుల్లో ఏముందీ?" ఏదో ఆలోచిస్తూ అన్నాడు నిరంజన్.

ఎవరి గూళ్ళకి వాళ్ళం చేరాంగానీ, నా ఆలోచనలు నావి. ఆ తరువాత మాధవని ఆహ్వానించని అపార్టుమెంట్ లేదు. వీలున్నంతవరకూ పక్కింటి ఆడపిల్ల 'దుర్గుణాల్ని' ప్రతి సంసారీ మాధవచెవిలో వేస్తూవున్నాడు. అఫ్‌కోర్స్ నేను తప్ప. ఆ పని మా ఆవిడ చేస్తోందనుకోండీ!

ఆఖరికి మడీ – ఆచారం అంటూ ప్రాణాలు తినే ఆర్‌టీసీ రామానుజం కూడా మాధవని ఇంటికి పిలవడమేగాక టిఫిన్లు కూడా మెక్కిస్తున్నాడు.

సరిగ్గా ఆగష్టు రెండోతారీఖున మాధవ హడావుడిగా ఇంటింటికీ తలో కార్డు పంచాడు.

అందులో వున్న సమాచారమేమనగా, "అయ్యా... అందరికీ నమస్కారం. నా పెళ్ళి ఈ నెల 17న జరగబోతోంది. మీరంతా ఆశీర్వదించాలని కోరుతున్నాను. పిల్ల వివరాలు 'గోప్యం' కనక అడగవద్దు.

ఇట్లు మీ ఆగమనాభిలాషి... మాధవరావు"" (ఇంటిపేరు రాస్తే కులనిర్ధారణ చేస్తారన్న భయంతో ఇంటిపేరు దాచబడింది) ఇదీ!

ఇదేమిటీ ఇలా చేశాడూ? జాగ్రత్తగా కనిపెడితే ఈ విషయం తెలిసింది. మాధవ మా కాలనీ అమ్మాయిలందరి తోటీ చనువుగా నవ్వుతూ మాట్లాడుతూనే ఉన్నాడు. దాంతో ఎవరికివాళ్ళూ మా అమ్మాయినే చేసుకుంటాడు అనే నమ్మకం పెంచుకున్నారనిపించింది. ఎందుకైనా మంచిదని నేనూ మా అమ్మాయినేగాక 'ప్రొలుబుల్' అమ్మాయిలందర్నీ గమనించడం మొదలెట్టా.

మా ఆనందిలో ఏ మార్పూ లేదు. మిగతావాళ్ళల్లో మాత్రం కాస్త అతిచనువే కనిపించింది. ఏమైనా విషయం తేల్చాల్సిందే! ఎందుకంటే పెళ్ళి ఇంకా పదిహేనురోజులుంది. పెళ్ళికూతురు కొద్దోగొప్పో 'సన్నాహాలు' చేసుకుంటుంది గదా... చివరికి మాధవ మరో కాలనీ పిల్లని పెళ్ళాడతాడేమో అని కూడా అనుకున్నాం జనరల్ బార్ మీటింగ్‌లో.

"ఏమయ్యా..... మరి కల్యాణమండపం అవీ బుక్‌చేశావా? ఆ!" ఆత్రంకొద్దీ ఒకళ్ళిద్దరు ఈ ప్రశ్న అడిగినా. "అయ్యా.... మీకిచ్చింది ఇన్విటేషన్ కాదండీ, నా పెళ్ళి ఫలానా తారీకున అనే ఇన్ఫర్మేషన్!" అంటూ నవ్వాట్టా. ఇంకేం మాట్లాడతాం?

స్వాతంత్ర్యదినం వచ్చిందీ వెళ్ళిందీ. పదహారో తారీఖు సాయంత్రం కూడా మాధవ మామూలుగానే ఉన్నాడు. ఏ అట్టహాసమూ లేదు. జనాల్ని 'ఫూల్స్' చేస్తున్నాడని పించింది. ఏప్రిల్ ఫూల్స్ కాకుండా ఆగష్టు ఫూల్స్ అన్నమాట.

నేనూ, శర్మా, నిరంజనం, హరిబాబూ, సీ.రా,రా, అందరం కలిసి 17 తెల్లవారు జామునే లేచి మాధవ అపార్టుమెంట్ దగ్గరికి పోతే, అది తాళం వేసుంది.

నిన్నరాత్రి పదింటిదాకా అతను గదిలోనే ఉన్నాడు. అంటే ఏ అర్ధరాత్రో తాళంపెట్టి బయటికి వెళ్ళుండాలి. సరిగ్గా ఎనిమిదింటికి రెండు ఆటోలు గేటు ముందర ఆగాయి.

మొదటి ఆటోలోంచి దిగింది హైదరాబాద్‌లో చదువుతున్న పక్కపోర్షను ఇన్‌కంటాక్స్ ఆఫీసరుగారి అమ్మాయీ, ఎకనమిస్టు కోదండరామ్మూర్తి గారి అబ్బాయి కల్యాణ రామ్మూర్తీ ఇద్దరూ కొత్త బట్టలతో మెళ్ళో దండలతో దిగారు.

రెండో ఆటోలోంచి దిగింది మాధవా... ఇంకో అమ్మాయీ. ఆ అమ్మాయిని చూస్తుంటే మొహం ఎక్కడో చూసినట్టే వుంది. వాళ్ళూ పెళ్ళిడ్రెస్సూ, దండలతోనే ఉన్నారు. సినిమాటిక్‌గా జరగాల్సిన అరుపులూ, గోలలూ ఏడుపులూ, శాపనార్థాలూ అయిపోయాయి. మాధవ ఆ అమ్మాయి మాత్రం కామ్‌గా వాళ్ళగదిలోకి పోయారు.

ఇంతకీ ఆ అమ్మాయి ఎవరూ? ఏమయితే అదే అయిందని తలుపుకొట్టాము. మాధవే తలుపు తీశాడు. “అవును మాధవా... ఆ అమ్మాయిని ఎక్కడో చూసిన గుర్తు!” అన్నాను డైరెక్టుగా.

“అవును” మిగతావాళ్ళూ అన్నారు కోరస్‌గా.

“అవును. మీరందరూ చూసినమ్మాయే. “సీతా! ఓసారిలారా” అన్నాడు తలుపు బార్లగా తీసి పక్కకి జరుగుతూ. ఆ పిల్ల దండలూ, అవీ తీసేసి మామూలుగా ఉంది. ఠక్కున నాకు గుర్తొచ్చింది. ఆ అమ్మాయి మా ‘మేపుల్ ఎపార్ట్‌మెంట్స్’ వాచ్‌మేన్ కూతురని.

నేను నిర్ఘాంతపోయాను.

“అవును బావగారూ... చనిపోయిన వాచ్‌మెన్ నరసింహులుగారి అమ్మాయే ఈ సీత. తండ్రి చనిపోయాడని దయాదాక్షిణ్యం కూడా చూపకుండా ఈమెనీ, వీళ్ళ అమ్మగారినీ రెండేళ్ళ క్రితం మీరందరూ కలసి వాచ్‌మేన్ క్వార్టర్‌ని ఖాళీ చేయించారు. నేనెవర్నీ తప్పుపట్టట్లా.

వీళ్ళమ్మగారు ఏడాదిక్రితం పోయారు. ఈమె ట్యూషన్లు చెప్పుకుంటూ నాలుగిళ్ళల్లో పనిచేసుకుంటూ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసింది.

గత రెండేళ్ళుగా ఈమెనీ, ఇతర అమ్మాయిల్నీ కూడా గమనించే ఈ నిర్ణయానికి వచ్చాననుకోండీ... మిగతా అమ్మాయిలకి తల్లిదండ్రుల అండవుంది. ఈమెకి లేదు. స్వంతకాళ్ళమీద నిలబడాలనే తపనా, ఓ నిర్ణయం తీసుకుంటే ఆ పని సాధించే పట్టుదల ఈమెలో నిండుగా నాకు కనిపించాయి. నాకెలాగూ ఏ బాదరాబందీలు లేవనుకోండి. అందుకే మీరంతా మమ్మల్ని ఆశీర్వదించండి!" అన్నాడు.

మేం నిశ్చేష్టులమై నిలుచుండగానే బిలబిలమంటూ అన్ని అపార్టుమెంట్లనించీ పిల్లలొచ్చారు. వాళ్ళమొహాల్లో నవ్వులూ, చేతుల్లో గిఫ్టులూ.

"కంగ్రాట్స్ మాధవా" అంటూ మా ఆనందీ, అజితూ కూడా వాళ్ళని అభినందించారు.

ఆ పక్కన ట్రావెల్సాయన కూతుళ్ళూ, ఈ పక్క శర్మగారి కూతురూ.... అదిగో అక్కడ మిగతా కన్యకామణులూ. ఇంకేం చేసేదీ! "శుభమోయ్... ఆయురారోగ్య ఐశ్వర్యాలతో నిండు నూరేళ్ళూ జీవించండి!" అంటూ ఆశీర్వదించాను. వెంటనే మా మిగతా బార్ బ్యాచ్ కూడా నన్ను ఫాలో అయిపోయారు.

"శతమానం భవతి" అంటూ ఒకరూ....

"సుపుత్ర ప్రాప్తిరస్తూ" అంటూ ఇంకొకరూ...

"శతపుత్ర ప్రాప్తిరస్తూ" అంటూ మరొకరూ...

ఆ పదినిమిషాల తర్వాత కాలనీకి మొత్తం కానీ ఖర్చులేకుండా అంగన్యాస, కరన్యాస, హ్రస్వ, దీర్ఘ విన్యాసాలతో అరుస్తూ, జుట్టు పీక్కుంటూ, నిఖార్సైన గుంటూరు బూతుల్ని మంత్రాలుగా చదువుతూ, అందరికీ వినోద కార్యక్రమాన్ని అందించాడు కోదండరామ్మూర్తి.

కల్యాణరామ్మూర్తీ, అతని నవవధువూ ఆ హంగామాని ఏమాత్రం పట్టించుకోకుండా వాళ్ళ ఆనందంలో వాళ్ళున్నారని మాకందరికీ తేలిగ్గా తెలిసిపోయిందని చెప్పక్కర్లేదుగా!

–స్వాతి (మే, 2014)

# వరాలు

"దేవుడు మనిషికిచ్చిన నాలుగు వరాల్లో మొదటిది 'నిద్ర' రెండోది 'మరుపు', మూడోది 'ఆశ', నాల్గవది 'మృత్యువు'. అన్ని సమస్యలకీ అతి సహజమైన పరిష్కారం మృత్యువు. దాన్నెవరూ కోరనక్కర్లా! దానంతటదే వచ్చి ఈ శరీరాన్నించి మనల్ని వేరుచేసి బతికిస్తుంది. అసలు మృత్యువు ఎప్పుడు మొదలవుతుందో తెలుసా?"

ఆ రాత్రి గడుస్తుందని ఎవ్వరికీ నమ్మకం లేదు. చిమ్మచీకటి, కీచురాళ్ళ రొద, అప్పుడప్పుడూ ఎగురుతూ వెలిగే మిణుగురు పురుగులు... అసలు తెల్లవారుతుందా?

"ఈ చీకటంటే నాకు భయం.... చచ్చిపోవాలనిపిస్తోంది!" సన్నగా ఏడుస్తూ అంది లత.

"నాకు మాత్రం చాలా ఇష్టం. ఎన్ని జన్మలయినా ఇలాంటి చీకట్లో హాయిగా గడపగలను" పకపకా నవ్వుతూ అన్నాడు సాగర్.

"నువ్వు నిశాచరుడివి!" ఫ్లాట్‌గా అన్నాడు ప్రకాష్.

"గుడ్ కామెంట్! వెలుగంటే నాకు అసహ్యం. అవునూ... మీరేం మాట్లాడటం లేదే... కామెంటో, కాంప్లిమెంటో ఏదో పారెయ్యొచ్చుగా!"

"వింటున్నాను గదా సాగర్‌గారూ!" నేనన్నాను.

చాలాసేపు మౌనం మా మధ్యే తారట్లాడింది.

"ఓ సిగరెట్టు పెట్టె జేబులోంచి తీసి నేనొకటి వెలిగించుకుని అతనికొకటి ఇచ్చా. అగ్గిపుల్ల వెలుతురు చూడగానే సాగర్ కళ్ళు మూసుకోవటం గమనించా.

లత మొహం తళుక్కున ఆ వెలుతుర్లో మెరిసింది. కళ్ళు ఏడ్చిఏడ్చి ఉబ్బినట్టున్నాయి.

"ఆకలేస్తోంది!" గొణిగాడు ప్రకాష్.

"వెయ్యనిదెవరికి?" పకపకా నవ్వాడు సాగర్.

"ఆ నవ్వు కాసేపు ఆపుతారా? అసలే భయంతో ఛస్తుంటే మధ్యన మీ నవ్వొకటీ!" కోపంగా అన్నది లత.

"పోనీ మీలాగా నన్ను కూడా ఏడవమంటారా? కానీ నాకు ఏడుపు రాదే!" అన్నాడు సాగర్.

"మాట్లాడకుండా ఉంటే చాలు!" విసుగ్గా అంది లత.

"మౌనం మనసులోని భయాన్ని పెంచుతుందంటారు పెద్దలు. అయినా ఈ రైలుపెట్టె ఎలా 'డీ-లింక్' అయి ఇక్కడ ఆగిందో మనకి తెలీదు.

రైల్వేవాళ్ళు గమనిస్తే మనం బతుకుతాం. లేకపోతే వెనక స్టేషన్ నుంచి ఏ గూడ్సో వస్తుంది. దూ...రం నించి ఈ పెట్టెని ఆ డ్రైవర్ 'స్పాట్' చెయ్యగలిగితే ఓ.కె. లేకపోతే నవ్వడానికో, ఏడవడానికో మనం ఉండం" శబ్దం వచ్చేలా నవ్వాడు సాగర్.

"పోనీ బోగిలో నుండి కిందకి దిగితే?" ప్రకాష్ గొంతులో ఆశ.

"మర్చిపోకండి... మనం ఉన్నది మధ్యప్రదేశ్ రివైన్సులో. ఎటుపక్కకి దిగినా అగాధాలే. వాటిల్లో పడినా కాళ్ళూ, చేతులూ ఉంటాయని నాకు నమ్మకం లేదు. ఛస్తే ఓ.కె. బతికితే కష్టం... లైఫ్‌లాంగ్ ఎందుకు బతికానా అని ఏడవాలి. నన్నడిగితే అన్ని అవయవాల్తో హాయిగా 'పెట్టె'లో కూర్చోవడమే సుఖం!" వివరించాడు సాగర్.

"భగవంతుడా!" భయంతో అరించింది లత.

"దేవుడ్ని సృష్టించింది 'మనిషే' అని మరిచిపోవద్దు!"

"వాట్ నాన్సెన్స్?" అరిచాడు ప్రకాష్.

"అవునూ! తప్పేముందీ? దేవుడ్ని సృష్టించింది ఖచ్చితంగా మనిషే!" అన్నాడు సాగర్.

"ఏ ఆధారంతో ఆ మాట అంటున్నారు?" అని రెట్టించాడు ప్రకాష్.

"ఏ జంతువూ, మరే జీవీ దేవుళ్ళని సృష్టించలా! దేవాలయాలు కట్టలా! ఈ ఆధారం చాలదూ?"

"మానవుడొక్కడే 'బుద్ది జీవి' గనక తనను ఎవరు సృష్టించారా అని ఆలోచించాడు. సర్వజీవులలోనూ ప్రాణరూపంలో ఉండే పరమాత్మని గుర్తించాడు!" అన్నాడు ప్రకాష్.

"గుడ్! మీ ఆనందం మీది! అన్ని జీవుల్లోనూ ఉండే పరమాత్మని మీరు గుర్తిస్తూ, ఆ గుర్తించినదాని విలువా, వివరమూ ప్రచారం చెయ్యండి. వీలయితే మరో దేవుడ్ని సృష్టించండి!" అన్నాడు సాగర్.

"వెటకారాలెందుకూ? దేవుడిమీద మీకు నమ్మకం లేకపోతే లేనట్టే ఉండండి. నమ్మేవాళ్ళని చెడగొట్టడం మనిషి చెయ్యాల్సిన పనికాదు!" ఈసడింపుగా అన్నది లత.

"అరే! తప్పుగా ఎందుకూ అర్థం చేసుకోవడం? సర్వజీవుల్లోవున్న ప్రాణశక్తి ఒక్కటే. అదే పరమాత్మ"అన్నాడు ప్రకాష్.

"ఆ లెక్కన మన నలుగురిలోనూ పరమాత్మ ఉన్నట్టేగా? అలాచూస్తే మనమూ దేవుళ్ళమేగా?" గట్టిగా నవ్వాడు సాగర్.

"స్టుపిడిటీ...షీర్ స్టుపిడిటీ!" తీవ్రంగా అంది లత.

"అంటే మనలో ప్రాణశక్తి లేదా?" ఉడికిస్తున్నట్టు అన్నాడు సాగర్.

"మీతో మాట్లాడదలచుకోలేదు... డోన్ట్ టాక్ టు మి" అరిచింది లత.

"కూల్‌డౌన్ మేడమ్! సరే! మీరేమంటారు ప్రకాష్?"

"మీరు నమ్మినా, నమ్మకపోయినా నేను నమ్ముతాను. భగవంతుడు సర్వాంతర్యామి మీలోనూ ఉన్నాడు. నాలోనూ ఉన్నాడు. సర్వజీవుల్లోనూ ఉన్నాడు" నిర్వికారంగా అన్నాడు ప్రకాష్.

"నమ్మటం అనేది ఓ గొప్ప గుణం. మానవుడు బతకాలంటే దేన్నో దాన్ని నమ్మాలి. మీరు దేవుడ్ని నమ్ముతారు. ఇంకొకడు స్వశక్తినీ, కృషినీ నమ్ముతాడు"

"మీరు చీకట్ని నమ్ముతారు" సాగర్‌ని కసిగా మధ్యలోనే కట్‌చేస్తూ అంది లత.

"ఎస్! నిజం చెప్పారు. నేను చీకట్నే నమ్ముతాను. ఎందుకంటే వెలుగులో చెయ్యలేనివి చీకట్లో సులభంగా చెయ్యగలం!"

"అంటే?" లత గొంతులో కొంచెం భయం ధ్వనించింది.

"ఏముందీ? చీకటికి సిగ్గులేదు. మనిషికి సిగ్గున్నా...ఆ సిగ్గు చీకట్లోకి వచ్చేసరికి పారిపోతుంది" మళ్ళీ నవ్వాడు సాగర్.

మళ్ళీ మౌనం మా మధ్య కురుల్ని ఆరబెట్టుకుంది. నిముషాలు గంటల్లా గడుస్తున్నాయి. విపరీతమైన గాలి..... చల్లగా, ఐసులా, వర్షం కురవబోయే ముందర వీచేగాలి.

"వర్షం కూడా ఈ చీకటికి తోడైతే భలే బాగుంటుంది" నవ్వాడు సాగర్.

"ఆ వెధవ నవ్వు మానండి ప్లీజ్!" అరిచింది లత.

"మామీదేనా, మీవాళ్ళమీద కూడా ఇలానే అరుస్తారా?" నవ్వుతూనే అడిగాడు సాగర్.

"దటీజ్ నన్నాఫ్ యువర్ బిజినెస్!" కచ్చగా కొంచెం గట్టిగా అంది లత.

"నేను బిజినెస్‌మేన్‌ని కాదు!"

"మరి?" కుతూహలంగా అడిగాడు ప్రకాష్.

"మామూలు మనిషిని! ఆ... మీరు చెప్పినట్టు నాలోనూ 'ప్రాణశక్తి' ఉంది గనక దేవుడ్నేమో?" గలగలా నవ్వాడు సాగర్.

"స్ట్రెయిట్‌గా మాట్లాడ్డంరాదా?" చికాగ్గా అంది లత.

"ఇందులో డొంకతిరుగుడుగా అన్నదేముందీ? ఓ.కె. కాసేపు నేనే దేవుడ్ని అనుకుందాం! అనుకోవటం ఎందుకూ? నేనే దేవుడ్ని. ఇప్పుడు చెప్పండి... మీకేం కావాలి?" సాగర్ మళ్ళీ నవ్వి అన్నాడు.

"ఓహో! దేవుడు పేంటూ, షర్టూ వేసుకుని, నెక్ టై కట్టుకుని ట్రైన్లో అటూఇటూ తిరుగుతాడుగామోసు!" వెటకారంగా అంది లత.

"ఇంకెలా ఉంటాడు? చేపలాగానా? తాబేలు లాగానా? వరాహంలాగానా? సగం మనిషీ, సగం సింహంలాగానా? అలా ఉంటే తప్ప మీరు దేవుడ్ని గుర్తించరా?" అడిగాడు సాగర్.

"హిందువై పుట్టి హిందూ ధర్మాన్నీ, మతాన్నీ కించపరచడం, దైవస్వరూపాల్నే ధిక్కరించడం. ఛీ" అసహ్యించుకుంది లత.

"నేను హిందువుననో, ముసల్మాననో, క్రిస్టియన్ననో మీతో చెప్పానా? లేదే!" ఆశ్చర్యం సాగర్ స్వరంలో దోబూచులాడింది.

"సాగర్" అని ట్రైన్లో ఎక్కంగానే పరిచయం చేసుకున్నారుగా?" అడిగింది లత.

"సాగరం అంటే సముద్రం. సముద్రాలకి మతాలు లేవే! అయినా నేను దేవుడ్నని చెప్పాను గాని ఫలానా మతం నాది అని చెప్పలేదే?"

"నాన్సెన్స్!" కోపంగా అరిచింది లత.

"నో నాన్సెన్స్. ఓన్లీ సెన్స్! అసలు మతం అంటే ఏమిటి? మానవుడ్ని మానవత్వంవైపు మళ్ళించి, విశ్వమానవుడిగా చేసేది.

మనిషి నడవడికని చక్కగా తీర్చిదిద్దేది మతం. ఏ మతం బోధించినా 'సారం' ఇదేగా! దేవుడికీ, మతానికీ అసలు సంబంధం ఏమిటీ? దేవుడు జీవుల్ని సృష్టిస్తే మనిషి మతాన్ని సృష్టించి నానాగందరగోళంగా సంఘాన్ని చీల్చాడు!" మళ్ళీ నవ్వాడు సాగర్.

"అమ్మయ్య! దేవుడు జీవుల్ని సృష్టించాడని ఒప్పుకున్నారు గదా! అంటే దేవుడ్ని 'ఎగ్జిస్టెన్స్'ని ఒప్పుకున్నట్లేగా?" ఉత్సాహంగా అన్నాడు ప్రకాష్.

"ఇందాకే చెప్పాగా 'ప్రాణశక్తి' థియరీ ప్రకారం నేను కూడా దేవుడ్నే... లేకపోతే దేవుడే లేడూ!" పకపకా నవ్వాడు సాగర్.

"మీ నాలిక్కి అన్నివేపులా పదునుందని మీరు అనుకుంటున్నారేమో!"

"కాక?"

"వాదోపవాదాల్లో మీరు దిట్ట కావచ్చు! కానీ 'నేనే దేవుడ'ని మీరనటం మీ అహంకారాన్ని చాటుతోంది!" షార్ప్‌గా అంది లత.

వర్షం మొదలైంది. దూరాన పిడుగులు రాలిన భయంకరమైన శబ్దం. ఆ తరువాత మెరుపులు..... ఆకాశం నిట్ట నిలువునా చీలిపోయేంత మెరుపులు.....

"చూశారా? నేను వర్షం కురిపిస్తున్నాను!" గట్టిగా నవ్వాడు సాగర్.

"హూ!"

మెరుపు వెలుగులో సాగర్ మొహం వెలిగిపోతోంది. లత మొహం కోపంగా, ప్రకాష్ మొహం నిర్వికారంగా ఉన్నాయి.

"మరోగంట గడిస్తే చాలు!" మళ్ళీ నవ్వుతూ అన్నాడు సాగర్.

"ఏం జరుగుతుంది?" కోపంగా అన్నా లత గొంతులో కుతూహలం వినిపించింది.

"ముందే చెబితే ఎలా?" ఊరిస్తూ అన్నాడు సాగర్.

"పేద్ద తెలిసినట్టు!" లత గొంతులో వెటకారం.

"తెలుసు!"

'ఏం తెలుసు?"

"సరే! ఒకటి చనిపోవడం... రెండోది బ్రతకడం!"

"నీలాంటివాడే అన్నాట్ట.... ఆడపిల్ల కాకపోతే మగపిల్లవాడే పుడతాడని!" ఎకసెక్కంగా అన్నది లత.

"ఇంతకీ మీకు పిల్లలున్నారా?" అడిగాడు సాగర్.

"అదంత అవసరమా?" తీవ్రంగా అన్నా లత గొంతులో చిన్న విషాదం.

"దేవుణ్ని గదా! ఒకవేళ మీకేదైనా అయితే వాళ్ళకి కబురందించడమో, మంచీ చెడూ చూడటమో చెయ్యాలిగా!" మళ్ళీ నవ్వు.

"విల్ యూ షటప్?" పిచ్చికోపంలో 'స్వరం' ఎలా మారుతుందో నాకు తెలిసింది.

"సరే లతాజీ! మాట్లాడను. కానీ ఏం చెయ్యాలి? కబుర్లు చెప్పుకుంటేనన్నా కాస్త మీ భయం కోపంగా కన్వర్ట్ అవుతోందని మాట్లాడుతున్నాను గానీ లేకపోతే మౌనంగా గుళ్ళో దేవుడి విగ్రహంలా కూర్చుని ఉండేవాడిని!"

"ఏం? మీకు భయం లేదా?" అడిగాడు ప్రకాష్.

"భయం ఎందుకూ? మృత్యువు గురించా? పిచ్చి మనిషీ! బ్రతకడం గురించి భయపడాలి కానీ, చావుకి భయపడటం ఎందుకూ? అసలు మృత్యువనేది భగవంతుడు మనిషికిచ్చిన నాలుగో వరం!" నవ్వాడు సాగర్.

"నాలుగో వరమా?" ఆశ్చర్యంగా అంది లత.

"అవును. దేవుడు మనిషికిచ్చిన వరాల్లో మొదటిది 'నిద్ర'. ఎన్ని కష్టాలున్నా నిద్రలో అన్నీ మర్చిపోయి విశ్రమిస్తాం.

రెండోది 'మరుపు' ఎంత భయంకరమైన సంఘటన జరిగినా కాలం గడుస్తున్నకొద్దీ దాన్ని మరిచిపోయి మళ్ళీ జీవితాన్నెదుర్కునే ధైర్యాన్ని కూడదీసుకుంటాం"

"మరి మూడోది?" అడిగాడు ప్రకాష్.

"ఆశ! కుంటివాణ్ని, కుష్టువాణ్ని కూడా బ్రతికించేది 'రేపటి' మీది ఆశే! ఇక నాల్గవది ఇందాకే చెప్పాగా..... 'మృత్యువు!' అన్ని సమస్యలకీ, అతి సహజమైన పరిష్కారం అది! దాన్నెవరూ కోరనక్కర్లా! దానంతట అదే వచ్చి ఈ శరీరాన్నించి

'మనని' వేరుచేసి బ్రతికిస్తుంది. అసలు మృత్యువు ఎప్పుడు మొదలవుతుందో తెలుసా?"

"ఎప్పుడూ?" కుతూహలంగా అడిగాడు ప్రకాష్.

"మనం పుట్టిన క్షణమే మనతోపాటు అదీ పుడుతుంది. మెల్లగా క్షణాల్ని జుర్రుకుంటూ ఓ క్షణం మనని మింగేస్తుంది!"

"చావు గురించి మాట్లాడటం ఆపుతారా సాగర్?" అర్థించినట్లు అన్నది లత.

"చూశారా! నిజాన్ని గుర్తించక ఎలా భయపడతామో! పుట్టుక 'నిజం' అయితే 'చావూ' నిజమే. జీవుడు 'నిజ'మయితే దేవుడూ నిజమే! కానీ..... ఈ విషయాలను మనం ఒప్పుకోం!" నవ్వాడు సాగర్.

గంట గడిచింది. నిద్ర కళ్ళలోకి ముంచుకొచ్చింది. కనురెప్పలపై వాలి జోకొట్టింది.

నేను లేచేసరికి తూరుపుదిక్కు 'వెలుగు చీర' సద్దుకుంటోంది. లత గాఢంగా నిద్రపోతోంది. ప్రకాష్ గుర్రుపెడుతున్నాడు. సాగర్ కనిపించలేదు.

రైలుపెట్టె దిగి బయటికి వచ్చా. నిజంగా ట్రాక్‌కి అటువైపూ ఇటువైపూ లోయలు. ఆ లోయలన్నీ వృక్షాలతో నిండివున్నాయి.

దూరంగా ఇసుకదిబ్బలు.....ఎర్రగా.... వొంపులు వొంపులుగా. వర్షానికి మట్టి జారిపోయింది.

ఓ రెండు గంటలకి వేరే ఇంజన్ రావటం చూశాం. మా పెట్టెలో ఉన్నది మేం నలుగురమే. ఎంత చూసినా సాగర్ జాడ తెలియలేదు. రైల్వేవాళ్ళు కాసేపు వెతికారు. జాడ తెలియలా... ఇంజన్‌ని మా పెట్టెకి అనుసంధానం చేసి మరో గంటలో మమ్మల్నొక చిన్నస్టేషన్లో దించారు. మా ముగ్గురి మనసూ మనసులో లేదు.

సాగర్ ఏమయ్యాడూ?

జరిగిన సంభాషణ అంతా గుర్తుతెచ్చుకున్నాం.

"ఒకవేళ సాగర్ దేవుడేమో? నిజంగా దేవుడేమో!" సంభ్రమంగా అంది లత.

"దెయ్యం కూడా కావొచ్చుగా?" అన్నాడు ప్రకాష్.

"ఎలా?" అడిగింది లత.

"మృత్యువు గురించి మాట్లాడాడుగా!"

"దేవుడు, జీవుడు, జననం, మరణం..... వీటి గురించి ఎవరైనా మాట్లాడొచ్చు..... ఏదైనా మాట్లాడొచ్చు.... మాట్లాడినంత మాత్రాన ఒక వ్యక్తిని దేవుడనో దెయ్యమనో అనుకోలేముగా?" నేనన్నాను.

"మరో మూడు గంటలకి ఎక్స్‌ప్రెస్ వస్తుంది. ప్రత్యేకంగా దానిని మీకోసం ఆపుతున్నాం!" అంటూ శుభవార్త చెప్పాడు స్టేషన్ మాస్టర్.

"గాడ్! రేపొద్దుటికల్లా మావాళ్ళని చూడొచ్చు!" రిలీఫ్‌గా అన్నది లత.

"శుభం! మీ గురించి ఎదురుచూసే వాళ్ళున్నారు. నాకెవరూ లేరు! ఐనా, ఆనందంగానే ఉంది!" నవ్వాడు ప్రకాష్. "మా వాళ్ళంటే నాతో ఉండే రూమ్‌మేట్స్! నిజంగా చెబితే నాకూ ఎవరూ లేరు!" తలదించుకుంది లత.

"మరి మీ విషయం?" కుతూహలంగా ప్రకాష్ నన్ను అడిగాడు. నేను నవ్వి ఊరుకున్నా.

మనసులోంచి 'సాగర్' జ్ఞాపకాలు బయటికి పోవట్లేదు. మెరుపు వెలుతురులో మెరిసిన అతని 'ముఖం' గుర్తుకొస్తోంది. ఏమయ్యాడూ?

వీడుకోలు తీసుకునే సమయం మర్నాడు పొద్దునొచ్చింది. ట్రైన్ దిగిపోయే ముందే అడ్రస్‌లు తీసుకున్నాం.

లతా, ప్రకాష్ పెళ్ళిచేసుకున్నారని ఉత్తరం ద్వారా తెలిసింది. మళ్ళీ చాలా సంవత్సరాల తరువాత ఢిల్లీ వెళ్ళి తిరిగొచ్చేటప్పుడు సాగర్ గుర్తుకొచ్చాడు.

'భగవంతుడు మనిషికిచ్చిన వరాలు నాలుగు.... నిద్ర, మరుపు, ఆశ, మృత్యువు...." సాగర్ మాటలు మధ్యప్రదేశ్ రివైన్స్‌లోంచి ట్రైన్ నడుస్తుండగా వినిపించినై.

కళ్ళు నులుముకుని చూశా.

చిమ్మచీకటి......వర్షం.... మెరుపులు..... దూరాన పిడుగులు పడ్డ భయంకరమైన శబ్దం.....

మెరుపు వెలుతుర్లో ఈసారి సాగర్ 'ముఖం' కనిపించలా... ఆ తరువాత నాకు నిద్రపట్టలా.

రచనాకాలం : 1972

(17-08-2012)

# మౌనం శరణం గచ్ఛామి

వంటింట్లోంచి గిన్నెల డబడబలు పిడుగుల్లా తాకాయి. ఆ వెంటనే ఉరుము ఉరిమినట్టు నాలుగేళ్ళ వయసున్న మా అమ్మాయి వీపు విమానం మోత మోగింది.

ఆ తరువాత మెరుపులా మా ఆవిడ హాల్లోకొచ్చి ఫటేల్మనేట్టు టిఫిన్‌ప్లేటు టేబుల్‌మీద పడేసి ధడేల్న వంటగదిలోకి పోయింది. ఉరుములు మెరుపులూ వచ్చాయంటే వానరాక తప్పదు గదా!

సొంత డబ్బా కొట్టుకోకూడదుగానీ, యుద్ధం అంటే ఏమిటీ, అది ఎలా ఎట్నుంచి వస్తుందీ అని చాలా రిసెర్చి చేశాను. తేలిన విషయం ఏమంటే, యుద్ధం ఎప్పుడూ మనుషుల మధ్య రాదు. మనుషుల అహంకారాల మధ్యన వస్తుంది.

దేశాల మధ్య యుద్ధం కూడా నాయకుల అహంకార, అజ్ఞానాల వల్ల మాత్రమే వస్తుంది కానీ, ప్రజల మధ్య రాదు. ప్రతి యుద్ధమూ తాత్కాలికంగానో, పూర్తిగానో ఆగక తప్పదు.

కానీ 'నెవర్ ఎండింగ్ వార్' అనగా, 'ఎన్నడూ అంతం కాని సంగ్రామం' మాత్రం కేవలం భార్యాభర్తల మధ్యనే వస్తుంది. మరీ అంతగా కాకపోయినా అలాంటి యుద్ధమే అత్తాకోడళ్ళది కూడా.

అకారణంగా, అనూచానంగా వస్తున్న యుద్ధాలివి. జయాపజయాలు దైవనిర్ణయాలనేది ఉత్తిమాట. జయం ఎప్పుడూ స్త్రీదే. ఈ విషయం పెళ్ళయిన ప్రతివాడికీ తెలుసు.

'తెలుసుకోని'వాడు నిజంగా 'జ్ఞానే!' అసలు విషయమేమంటే, ప్రస్తుతం మా ఆవిడ అనగా సూర్యకాంతంగారి కూతురు యుద్ధం ఎందుకు డిక్లేర్ చేసిందో అర్థంకాలేదు.

నిన్న టీవీలో పాత హిందీ సినిమా చూస్తూ, నవనవలాడే 'నిరూప', అనే నాటి హీరోయిన్ పెదాలు పకోడీల్లా వున్నాయని కామెంటు ఇచ్చినందుకా? లేక ఉదయమే పేపర్లో దర్శనమిచ్చిన బాలీవుడ్ సుందరి పొంకాల్ని పళ్ళు తోమటం కూడా మర్చిపోయి తిలకిస్తున్నందుకా ఈ సమరం?

"టిఫిన్ పెట్టి గంటయ్యింది" వంటింట్లోంచి అరుపు. టేబుల్‌మీదకి చూస్తినిగదా. రంభాది అప్సరసల్లాగా పెసరట్టూ, ఉప్మా, పక్కన అందమైన చెలికత్తెల్లాగా అల్లంపచ్చడీ, ఉల్లిపాయ పచ్చడీ ఊరిస్తూ కనబడ్డాయి.

యుద్ధం చెయ్యాలంటే శక్తి కావాలి. శక్తి కావాలంటే ఆరోగ్యకరమైన పదార్థాలు అర్జంటుగా తినాలి.

అవి ఎదురుగా, సిద్ధంగా, 'రారమ్మని... రారా రమ్మని' ఆహ్వానిస్తుంటే ఆలోచనలేల... ఆరగించవలెగానీ! "నాన్నా... అమ్మ కొట్టింది!" వెక్కుతూ వచ్చింది నా చిట్టితల్లి. "పర్లేదులేమ్మా.... ఇదిగో... ఈ పెసరట్టుప్మా మనిద్దరం తినేస్తే, బోలెడు బలం మనకొస్తుంది. ఆ తర్వాత మీ అమ్మని చితకామతకా తన్నేద్దాం..... సరేనా?" బుజ్జగించి, తినడానికి మొదలెట్టా.

అదేదో సినిమాలో ఎఎన్ఆర్, బి.సరోజ పైట సుతారంగా లాగినట్టుగా ఓ పెసరట్టు ముక్కని త్రుంచి, ఎన్‌టిఆర్, సావిత్రిని 'హగ్' చేసుకున్నట్టు ఆ పెసరట్టు ముక్కని ఉప్మాతో 'హగ్' చేయించి, ఓ యంగ్ ఎండ్ బ్యూటిఫుల్ బాంబేపిల్ల స్విమ్మింగ్ పూల్లో దూకినంత ఉత్సాహంగా, ఆ రెండిట్నీ అల్లం చెట్నీలో ముంచి,

ఆ సంయుక్త పరిమళాల్ని పీలుస్తూ సదరు కాంబినేషన్‌ని నోట్లో పడేశా.

ఆహా...ఏమి రుచీ! పెసరట్టుప్మా కాంబినేషన్ కనిపెట్టినవాడికి కనీసం పద్మశ్రీ అన్నా ఇవ్వకపోవడం ఎంత ఘోరం!

"అన్నీ నువ్వే తింటున్నావు...నాకేదీ?" కోపంగా నా వంక చూస్తూ అన్నది మా చిట్టి.

"ఇదిగో" ఓ చిన్నముక్కని పైవిధంగా చెట్నీలో జలకాలాడించి బుడ్డదానికి అందించా.

"మింగండి మింగండి... మింగాక మీ విషయం తేలుస్తా!" ఈసారి కేవలం అల్లం, పచ్చిమిర్చీ, జీలకర్ర మాత్రమే వేసిన గరమ్‌గరమ్ పెసరట్టు ప్లేట్లో వేసి అన్నది చిన్నదాని తల్లి.

"ఇంతకీ ఏమంటావ్? నేనేం తప్పు చెయ్యలేదే? నేనెవర్నీ విమర్శించలేదే? ఎవర్నీ తప్పుపట్టలేదే? ఇక తేల్చడానికి ఏ విషయం వుందీ?" బెట్టుగానే అన్నా, మరో పెసరట్టు ముక్క త్రుంచి ఉల్లిపాయ చెట్నీతో జతచేస్తూ.

"ఏమీ అన్లేదా?" సీరియస్‌గా చూస్తూ అన్నది శ్రీమతి సూర్యకాంతం కూతురు.

"ఏమన్నాను? ఏమీ అనలేదే! రాత్రంతా కూడా టీ.వీ చూస్తూనే గడిపాగానీ ఒక్క మాట అన్నానా?" చాలా సెల్ఫ్‌కాన్ఫిడెన్స్‌తోనూ, గంభీరంగానూ జవాబిచ్చాను. ఒక మాట మాత్రం నిజం చెప్పుకోవాలి. నా జ్ఞాపకశక్తి జీరో అయితే ఆవిడది ఎవరెస్టు.

"ఎవరి గురించీ ఎత్తలేదా?" గుచ్చిగుచ్చి కళ్ళల్లోకి చూస్తూ అన్నది సూర్యకాంతం కూతురు. లాభం లేదు. ఏదో గట్టి ఆయుధం లేకపోతే ఇలా మాట్లాడదు అనుకుంటూ ఆలోచించా.

"తొందరేం లేదు....మింగి మరీ ఆలోచించుకో!" యమధర్మరాజు సావిత్రికి 'వరం' ఇచ్చినట్టుగా నాకు 'టైం' ఇచ్చింది సూర్యకాంతం కూతురు.

ఉల్లిపాయ+టమోటా+ఎండుమిర్చితో కనువిందుగా చేసిన చెట్నీ నన్ను చూసి ఎర్రగా కన్ను కొట్టింది. తాత్కాలికంగా ఆలోచనల్ని వాయిదావేసి ఎర్రెర్రని ఆ చెట్నీని ఆదరంతో అక్కున చేర్చుకున్నాను. (అన్నీ అపభ్రంశపు ప్రయోగాలే!)

"ఇప్పుడు చెప్పు....నిన్న రాత్రి ఏమన్నావూ?" నేను శుభ్రంగా చేతులు కడుక్కున్నాక తీరిగ్గా అడిగింది సూర్యకాంతం కూతురు. అన్నట్టు, టిఫిన్ రుచి పోతుందని నేనెప్పుడూ టిఫిన్ తిన్నాక కాఫీ తాగను.

"ఏమన్నానూ?" అర్ధనిమీలిత నేత్రాలతో అడిగాను. అంత మత్తు మరి.

"శ్రీమతి ఉమాలక్ష్మి సరస్వతి గురించి ఏమన్నావో గుర్తులేదా?" ఓ పోలీసు ఇన్‌స్పెక్టరు జేబుదొంగ వంకచూసే చూపుని నాకు ప్రసాదించి అన్నది సూర్యకాంతం కూతురు.

నా గుండె గుభేల్‌మంది. ఒక ఆడదాని ముందు మరో ఆడదాన్ని ఏనాడూ మనసా వాచా కర్మణా పొగడకూడదన్న ప్రాథమిక సూత్రాన్ని మరిచిపోయి 'చెడవాగి'నందుకు వచ్చిన ఫలితమిది.

అయినా బెట్టువీడితే పట్టుపోతుందిగదా అందుకే, “ఏమన్నానూ? చాలా మంచిదన్నాను.

అందులో తప్పేమిటీ? మంచివాళ్ళని మంచివాళ్ళని కూడా అనకూడదా? ఓస్, ఇలాంటిది నేనెక్కడా కనలేదమ్మా!” అంటూ బుకాయించా

‘కేవలం ‘మంచిది’ అని మాత్రమే అన్నావా?” రాంజఠ్మలానీ లాంటి లాయరు లావొక్కింతయూ ఎరుగు కూరగాయలవాడ్ని అడిగినట్టు సూటిగా అడిగింది సూర్యకాంతం కూతురు.

ఇప్పుడు నాకు మొత్తం తు.చ. తప్పకుండా గుర్తొచ్చింది. నేను కలకత్తా వెళ్ళడం నిజం. ఆ కలకత్తాలో ‘ఉమ’ ఇంటికి వెళ్ళడం ఇంకా నిజం.

ఆమె ఓ ప్రక్క ఉద్యోగం చేస్తూ, మరోపక్క ‘ఇంటెడు’ పనులూ చేస్తూ కూడా సమర్థవంతంగా పిల్లల్నీ, భర్తనీ, అత్తమామల్నీ అలరిస్తూ, సంసారాన్ని ఈడ్చుకు రావడం నిజాతినిజం.

అలాగు వాళ్ళాయనా నిరుద్యోగికాడు. మాంచి ఉద్యోగస్తుడే. బాగా సంపాదిస్తున్నవాడే. వాళ్ళ అత్తమామలకి, అంటే ఉమాలక్ష్మి సరస్వతి అత్తామామలకి చచ్చేంత మడి.

భీకరమైన చాదస్తం. అందువల్ల వాళ్ళు ‘పనిమనిషి’ ముట్టుకున్నది తినరట. అంతేగాక అంతంత జీతాల్ని పనిమనుషులకి జీతంగా ‘పొయ్యడం’ ఉమా అత్తగారికి అసలు ఇష్టం వుండదట.

అందువల్ల పాపం ఉమ అటు ఉద్యోగం, ఇటు ఇంటిపనీ, వంటపనీ సర్వం ఒంటిచేత్తో ఎలా నిర్వహిస్తోందో మహదానందంగా, చిలవలుపలవలుగా వర్ణించా. మామూలుగా అటువంటి పని ఏనాడూ చెయ్యను. కానీ బుద్ధి, ఆనాడు బ్రాందీ సావాసం చెయ్యడంవల్ల ఈ ఉపద్రవం సంభవించింది.

“అవును! ఉమాలక్ష్మి సరస్వతిని పొగిడాను. ‘షీ ఈజ్‌వర్త్‌ఏ’ పొగడ్త. అనగా ఆవిడ పొగడబడేందుకు అర్హురాలు. వావ్... ఓపక్క ఉద్యోగం, ఇంకోపక్క మడితో వంటా మరోపక్క భర్తకీ, అత్తామామలకీ సేవలుచేస్తూ అటువాళ్ళనీ ఇటు కన్నపిల్లల్నీ కంట్లో పాపలుగా చూసుకోవడం అంటే మాటలా?” దడదడా ఉపన్యాసం దంచేశా. నిజమేగా మరీ!

“అంటే ఆవిడొక్కర్తే పనిమంతురాలూ మేము ఎవరం కాము అనేగా నీ ఉద్దేశ్యం?” చూపుల్తో చురకత్తులు దూస్తూ అన్నది సూర్యకాంతం కూతురు.

"ఓహో.... అన్నీ నువ్వే అనుకుంటే నేనేం చేస్తానూ! అసలు నీ గురించి ఒక్కమాటన్నా అన్నానా?"

నేనూ నిలదీశా... నేను 'ఉమ'ని మెచ్చుకున్నమాట వాస్తవమే గానీ ఈవిడ్ని ఏమీ అనలేదు 'షంషేర్'గా నాకు గుర్తుంది.

"రాజుగారి చిన్నపెళ్ళాం మంచిదంటే పెద్దపెళ్ళాం దుర్మార్గురాలు అనేగా అర్థం?

అయినా నువ్వన్నదీ నిజమే. ఆవిడ గురించి వెయ్యి మాటలు మాట్లాడావు. నా గురించి 'ఒక్క మాటంటే ఒక్క మాటైనా' అనలేదన్నది పచ్చినిజం!" ఓ బల్లెం లాంటి చూపుని సూటిగా నా మొహం మీదికి విసిరి, తల పంకించింది సూర్యకాంతం కూతురు.

నాకు ఉరుములూ, పిడుగులూ అన్నా భయం లేదుగానీ, ఆడవాళ్ళు 'తలపంకిస్తే' మాత్రం చచ్చేంత భయం. ఆ తరువాత వచ్చేవి క్లుప్తమైన తిట్లూ, దీవెనలు కాదు అఖండ ఉపన్యాసాలు.

"అవును వాయ్. ఆవిడ చిటుకూ చిటుకూ పూరీలు వత్తడం గురించీ, చకాచకా ఇల్లం తట్నీ క్షణాల్లో ఊడ్చెయ్యడం గురించీ, గలాగలా విష్ణుసహస్రనామాలు చదువుతూ ఓ పక్క పూజా, మరోపక్క వంటా చేసెయ్యడం గురించీ, ఆ తరువాత ధనాధనా అందరికీ కేరే జీలు సర్దేసి, ఠకఠకా పిల్లలకీ, పెద్దవాళ్ళకీ చెప్పాల్సిన జాగ్రత్తలు చెప్పేసి గబగబా నడుచుకుంటూ బస్సెక్కిన తీరు గురించీ చిలవలు పలవలుగా అనకొండ అంత పొడుగున వర్ణించావు గానీ, ఇన్నాళ్ళూ నీకోసం, నీ కొంపకోసం నేను పడుతున్న పాట్లగురించి గానీ, చేస్తున్న చాకిరీ గురించిగానీ ఒక్కమాటంటే ఒక్కమాట అన్నావా?" తుఫానులా ఉపన్యాసం మొదలెట్టింది సూర్యకాంతం కూతురు.

ఇంకేమంటానూ? తనన్నది అక్షరాలా సత్యమే కదా! కానీ, కొంచెం తేడా కూడా వుంది. ఆ తేడానీ వివరిస్తే మరిన్ని 'తేడా'లకి తెరదించినవాడ్నవుతానని నోరు మూసుకున్నా.

"ఏం వాయ్.... పాపం ఆవిడ ఆఫీసునించి వచ్చాక కూడా ఎంతో ప్రశాంతంగా ఇంటిపనులన్నీ చేసి, చిరునవ్వుతోనే అందరికీ నానా పనులూ, సేవలూ చేస్తుందని కూస్తావా? ఏం? మేమందరం లేవంగానే చికాకు మొహాలతో మీకు సేవలు చెయ్యకుండా 'రుబాబు' చేస్తున్నామా?

పొద్దున్నే మీచేతే తలుపులు తీయించి, మీచేతే పాలు తెప్పించి, మీచేతే కాఫీ పెట్టించి మేం హాయిగా తాగుతున్నామా? మీజాతే అంత.

హూ...ఒక్క ఆడది జీవితకాలంలో ఎన్ని చీపుళ్ళనీ, సబ్బుల్నీ అరగదీస్తుందో మీకేమన్నా తెలుసా?" ఓ క్షణం ఆగింది.

"చీపుళ్ళూ, సబ్బులూనా?" అడిగాను.

అసలు ఓ చీపురూ, ఓ సబ్బు ఎంతకాలం వస్తాయో మనకేం తెలుసూ?

"అవును అవే. అంతేగాదు ఓ మగువ, ఓ అబల, తన వివాహం అయిన దగ్గర్నుంచీ ఎన్ని టన్నుల బియ్యాన్నీ, అపరాల్ని, కూరగాయల్నీ వండి వారుస్తుందో మీ మగ మహారాజులకి ఏమైనా తెలుసా?

ఎన్నిసార్లు 'మాపు'తో ఇల్లు తుడుస్తుందో, ఎన్నిసార్లు మీ మురికిబట్టల్ని ఉతికారేస్తోందో మీకేం తెలుసూ?" కొంచెం ఆగింది... సరైన ఎఫెక్టుకోసం.

"మరి మేం మాత్రం పగలూ రాత్రి అన్నది లేకుండా ఉద్యోగాలు చెయ్యట్లేదా?

మీకు అయితే సహాయం కోసం పనిమనుషులు ఉంటారు. కానీ మా పని మేమే చెయ్యాలి గానీ, ఇంకొకళ్ళకి మీలాగా ఒప్పగించలేము కదా?" లాపాయింటు లాగాను.

"హూ! ఆ మాట అనడానికి సిగ్గులేదూ? ఇవాళ నూటికి తొంభైమంది ఆడవాళ్ళు ఉద్యోగం చెయ్యడమే గాదు, ఇంటి పనులు కూడా చూసుకుంటున్నారు. మీ 'ఉమ'లాగా!" ఖస్సుమంది సూర్యకాంతం కూతురు.

'ఉమ' అన్న పేరుని ఒత్తి పలుకుతూ.

"నేనన్నది కూడా అదేగా, మీరంతా పనిమనుషుల సహాయం తీసుకుంటుంటే 'ఉమ' పాపం...." ఠక్కున ఆగిపోయా.

"ఊ.... చెప్పు... ఉమ పాపం....? చెప్పూ! ఏం ఓయ్, పాపం పరాయి స్త్రీలంటే మహాజాలి. మరి ఏ సర్వెంట్సూ లేకుండా మీ అక్కలూ, చెల్లెళ్ళూ, వదినలూ పనిచేసుకుంటుంటే రాని జాలి, క్లాస్‌మేట్ కష్టపడుతుంటే వచ్చిందా? దీన్నే ఛండాలపు 'మగబుద్ధి' అనేది!"

కారుకి అడ్డొచ్చిన బిచ్చగాడ్ని, కోటీశ్వరుడు చూసే చూపుతో నా వంక చూస్తూ అన్నది మా మహాకాళి. "అఫ్‌కోర్స్... నువ్వూ ఎంతో కష్టపడుతున్నావు మా కోసం. ఈ మాట నిజం. లేకపోతే ఇన్ని రకాల పెసరట్లూ, ఉప్మా, అదే చెట్నీలూ" రాజీధోరణిలో అన్నాను.

చెప్పొద్దూ, ఓడిపోవడం ఖాయం అని తెలిశాక నాకు తెలీకుండానే నేను తడబడతా. అది నా వీక్‌నెస్.

"నీ మెరమెచ్చు ఖబుర్లు నాకక్కర్లా. ఆ 'ఉమా'నే పొగుడుతూ అష్టకాలో అష్టోత్తరాలో రాసుకో!" కోపంగా నిష్క్రమించింది సూర్యకాంతం కూతురు వంటింట్లోకి. (ఇది ఫ్లాష్‌బాక్)

❀ ❀ ❀

"హూ!... చూశావా... లోకంలో ఎవత్తీ చెయ్యనట్టూ, తనొక్కత్తే కష్టపడు తున్నట్టూ తెగ వాగుతోంది ఆ సుమిత్ర" బ్యాగ్ మంచం మీదకి విసిరేసి అన్నది శ్రీమతి సూర్యకాంతం కూతురు.

"ఏమయిందీ?" అయోమయంగా అన్నాను.

"గంటసేపు వాయించింది. ఓ పక్క ఇంటిపనీ, వంట పనేకాకుండా అత్తగార్నీ, మామగార్నీ, పిల్లల్నీ, అసలు ఇవతలి చెంబు అవతల పెట్టని మొగుడ్నీ చూసుకోవాలంటే ఎంతకష్టమో తెలుసా వదినా?" అనడిగింది.

"ఏం? మేమందరం చేసుకోవడంలేదా?" రుసరసలాడుతూ లోపలికి పోయింది సూర్యకాంతం కూతురు. ఇంతకీ 'సుమిత్ర' అంటే నా బావమరిది, అదే, శ్రీమతి సూర్యకాంతం కూతురుగారి తమ్ముడి భార్య.

నాకు మతిపోయింది. అంటే ఆడదాని గొప్పతనాన్ని ఓ మగవాడు మరో ఆడదాని ముందు పొగడకూడదు. మరి ఆడది కూడా మరో ఆడదాన్ని పొగడటానికి ఇష్టపడదా? అసలు మెచ్చుకోదా?

నాకు తెలిసినంతవరకూ సుమిత్ర కూడా పనిమంతురాలే.

పాపం అత్తమామల్ని కూడా చక్కగా చూసుకుంటూనే ఉంటుంది.

"అలాగందా?" ఆశ్చర్యాన్ని అభినయిస్తూ అన్నాను.

"మరి? ఎంతసేపు సొంతడబ్బా కొట్టుకుందో తెలుసా? నాకైతే మా అమ్మనీ, నాన్ననీ అర్జంటుగా నాతోపాటు మనింటికి తీసుకొచ్చెయ్యాలనిపించిది" నైటీ వేసుకుని చీర ఓ మూలకి విసురుతూ అన్నది సూర్యకాంతం కూతురు.

"పోనీ తీసుకురావాల్సింది... పాపం ఆ అమ్మాయికీ కాస్త పని తగ్గేది!" అని వెంటనే నోరు మూసుకున్నా. ఏమిటో, ఎన్ని అనుభవాలొచ్చినా ఒక్కోసారి నోరు వాటినించి పాఠాలు నేర్చుకోదు.

“హూ’ అని ముక్కు పిలుస్తూ లోపలికి పోయింది. ‘హూ’ అనేది ఏకాక్షర గ్రంథం. సూర్యరాయాంధ్ర నిఘంటువులో వున్నన్ని అర్థాలు ఆ గ్రంథంలో ఉంటాయి, సెల్‌ఫోన్లు వచ్చాక నిజంగా ‘బంధుత్వాలు’ పెరిగాయని ఖచ్చితంగా చెప్పొచ్చు.

అంతకు ముందు దశాబ్దాలపాటు కార్డు ముక్క కూడా రాసుకోని మా ఆవిడా, ఆవిడ చెల్లెళ్ళూ గంటలతరబడి అదేపనిగా ఫోన్‌లోనే మాట్లాడుతున్నారు. హైదరాబాద్, విజయవాడ, తిరుపతీ మూడూ కూడా ఓ చిన్నసిమ్‌కార్డులో ఇమిడిపోయాయి.

“ఏవండోయ్... ఈ విషయం విన్నారా?” మహోత్సాహంగా అన్నది.

“ఏ విషయం?” అడిగా.

“అదేనండీ మన మధూ ఢిల్లీ వెళ్ళిందిగా, అక్కడ్నించి వాళ్ళకి అమెరికా ట్రాన్స్‌ఫర్ అయిందిట. ఇక్కడ వుండగా ఒక్క పనిచేసేది కాదుగదా, అమెరికా వెళ్ళగానే తనూ ఉద్యోగంలో చేరిందట.

ఇంటిపనీ, వంటపనీ, అటు భర్తా, పిల్లల్నీ, ఇటు అత్తామామల్ని చూసుకోవడం అదీ పనిమనుషులు లేకుండా.... అన్నీ ఒంటిచేత్తో చేస్తోందిట!” నా వద్ద మురుసుకుంటూ చెప్పింది సూర్యకాంతం కూతురు. ఇంతకీ ‘మధూ’ అంటే మా ఆవిడ చెల్లెలి కూతురు. అనగా నా మరదలి కూతురు.

“అలాగా... వెరీగుడ్... వెరీనైస్.... వెరీవెరీ బ్యూటిఫుల్” అన్నాను.

“ఆ తిక్క మాటలేమిటీ?” ఇంతెత్తున లేచింది.

“ఏ తిక్కో నాకేం తెలుసూ? అవునే సూర్యకాంతం కూతురా! నా ఫ్రెండు ఉమకో న్యాయం, నీ మరదలు సుమిత్రకో న్యాయం, నీ చెల్లెలు కూతురు మధూకో న్యాయం. ఇదేవన్నా న్యాయంగా ఉందా?’ అన్నాను. అంతే, మా చంటిదానివీపీమీద పటాల్న మెరుపులు మెరిశాయి. దాని కళ్ళల్లోంచి జలజలా వర్షం కురిసినా, యుద్ధంమాత్రం ఇంకా మొదట్లోనే వుందనిపించింది.

ఇప్పుడు వాగ్బాణాలు మొదలవుతాయేమో.... ఏం చేస్తాం!

మౌనం శరణం గచ్ఛామి.

# కొడుకు

"ఒరే! పెద్దజిల్లాకి పోయి బుద్ధిలేనిదాన్ని తెచ్చుకున్నాను కదరా"అంటూ బోరుమన్నాడు అంజినీలు.

"రంభలాంటి పెళ్ళాన్నెట్టుకుని ఏడుత్తావేంట్రా ఎఱ్రినాయాలా" చనువుగా మందలించాడు అల్లంశెట్టి సత్తినారాయణ.

"అరే అంజిగా! ఓసారి పెళ్ళైపోనాక సద్దుకుపోవాలగానీ అందరిముందు పెళ్ళాం గుట్టు బైటేసుకుంటార్రా?" చిన్నగా గదమాయించాడు మా నల్లమోలు పాండురంగడు.

ఈ సంభాషణ అంతా జరుగుతున్నది 'అడవి ఆంజనేయ స్వామి' గుళ్ళో. మా ఊర్నుంచి అడ్డరోడ్డుకెళ్ళే మధ్యలో ఉందా గుడి. సాయంత్రాలు అక్కడిదాకా నడిచి.... నాలుగు కబుర్లాడుకుని ఏ ఆరింటికో తిరిగి మా ఊరు చేరటం మా అందరికీ అలవాటు. నడక్కి నడకా, కాలక్షేపానికి కాలక్షేపం. అటు ఎస్ఎస్ఎల్సీ కాగానే ఇటు పెళ్ళి చెయ్యడం అప్పటి ఆచారం. అన్నీ ఉమ్మడి కుటుంబాలే. పాండురంగడికీ, ఇంకా కొంతమందికీ పెళ్ళయిపోయింది అప్పటికి. నేనూ, అల్లంశెట్టి సత్తినారాయణా అందర్లోకీ చిన్నవాళ్ళం.

"నా బాధ మీకేం తెలుసురా? నోరు తెరిస్తే చాలు పాఠాలు చెబుతుంది. మొన్నటికి మొన్న 'బజారుకు వెళ్ళి వేగచ్చేత్తా' అన్నాను. అలా అనకూడదుట.... 'బజారు కెళ్ళి త్వరగా వచ్చేస్తా' అనాలిట. అట్టాగే మానాన్న 'పేపరట్టుకురాయే కోడలుపిల్లా' అన్నాట్ట. దానితో పెద్దయుద్ధం. 'కోడలా పేపరు తెచ్చిపెట్టు అనకుండా

పట్టుకురాయే అంటాడా? అసలు కోడల్ని రాయేపోయే అనవచ్చా? మీరంతా అలగావాళ్ళు... మీది అలగాభాష' అంటూ తెల్లార్లూ నాకు పులగం తినిపించిందిరా!" ఎంతో దీనంగా అన్నాడు ఆంజనేయులు.

"పోన్లేరా... ఆవిడ భాష ఆవిడదీ.... మన భాష మనదీ" అనునయించాడు సూర్యనారాయణ. వాడిప్పుడు బెజవాడ లయోలా కాలేజీలో చదువుతున్నాడు. అందుకే మా యాస కాస్త తగ్గింది.

"ఎంత అని సద్దుకుపోన్రా? 'టిఫినీకి ఇడ్డెన్లు వెయ్యవా' అని మా అమ్మ అడిగితే 'టిఫిని అనకూడదు. టిఫిన్ అనాలి. ఇడ్డెన్లేమిటీ నా బొంద.... చక్కగా 'ఇడ్లీ' అనలేరూ? అంటూ మా అమ్మమీద పోలేరమ్మలాగా విరుచుకుపడింది. మా అమ్మ మొహంలో నెత్తురుచుక్క లేదు" ఆంజనేయులికి కన్నీళ్ళొక్కటే తక్కువ.

"అన్నీ అవే సద్దుకుంటాయిరా. మొక్క నాటంగానే మానవుతుందా? ఎక్కడో పిల్ల ఇక్కడికి కోడలుగా వచ్చింది. అర్జంటుగా భాషా, యాసా మారాలంటే ఎలా మారుతయ్యా? మనమే కాస్త సద్దుకుపోవాల!" అనునయిస్తూ లేచాడు కంభంపాటి రాములు.

అందరం లేచాం. మాటల్లేకుండానే నడుచుకుంటూ బస్‌స్టాండ్‌కొచ్చేసరికి దాసరి వెంకన్న దీపాలు వెలిగిస్తున్నాడు. భుజాన ఓ చిన్న 'కణాతు బొంగు'ల నిచ్చెనా, చేతిలో అగ్గిపెట్టి, నిక్కరు జేబులో 'వత్తి ఉండ' ఓ చేతిలో కిర్సనాయిలు డబ్బా పట్టుకుని సాయంత్రాల్లో దాసరి వెంకన్న బయల్దేరతాడు.

నిచ్చెనేసుకుని స్తంభాలపై నుండే గాజు తలుపుల మధ్య నుండే పెద్ద దీపంబుడ్డి తీసి, కిర్సనాయిలు పోసి, వత్తి సరిచేసి, దీపం వెలిగించి తలుపులు మూస్తాడు. పాతగుడ్డతో 'మసి' తుడవడం మర్చిపోడు.

ఇలా అన్ని దీపాలూ వెలిగించి ఏ ఆరున్నర ఏడింటికో ఇంటికి చేరతాడు. అన్ని వీధుల్లోనూ అతను దీపాలు వెలిగించినా, అతనింట్లో మాత్రం దీపం వెలిగించేవాళ్లెవరూ లేరు. భార్య కాలంచేసి రెండేళ్ళయింది. అతను ఉండేది ఆంజనేయులు పెంకుటింటి పక్కనున్న పాకలో. మనిషి చాలా మంచివాడూ, మాటకూడా మంచిదే!

పల్లెటూరి పద్ధతులే వేరు. చీకటిపడంగానే పిల్లలూ, పెద్దలూ భోజనాలకి ఎదురుచూస్తారు. 'గూట్లో దీపం – నోట్లో ముద్దకి ఇదీ సిస్టం. ఆంజనేయులు తల్లీ తండ్రీ, వెంకప్పగారూ గూట్లో దీపం పెట్టగానే ఏదో ఒకటి తినేసి పెరట్లో మడతమంచాలు వేసుకుని ఎక్కడెక్కడి విషయాలో మాట్లాడుకుంటూ పడుకుంటారు.

ఒకప్పుడు ఆంజనేయులూ అంతే. పట్నం పెళ్ళాం వచ్చాక ఆ అలవాటు తప్పింది. తప్పింది అనేకంటే ఆవిడే మొగుడి అలవాటుని తప్పించింది అనడం సబబు.

"గబ్బిలాల్లాగా చీకటిపడంగానే మింగడానికి బయల్దేరడం మా ఇంటా వంటా లేవు" అని వచ్చిన కొత్తల్లోనే అందరిముందూ అన్నది.

వస్తూవస్తూ ఓ ట్రాన్సిస్టర్ వెంట తెచ్చింది. ఆరింటికి 'ఆన్' చేసిన ట్రాన్సిస్టర్ పదింటిదాకా మోగుతూ కొందరికి పరవశాన్నీ, కొందరికి పరమ చికాకునీ తెప్పిస్తోంది. ఆంజనేయులు భార్య 'కళావతి'కి మరో కోపం ఏమంటే ఇంటికి కరెంటు లేకపోవడం. ఊరు మొత్తంలో కరెంటు ఉన్న ఇళ్ళు ఓ పాతిక్కి మించవు.

ఇక ఫోన్ అయితే పోస్టాఫీసులోనూ, బండి బాబూరావు గారి ఇంట్లోనూ తప్ప ఇంకెక్కడా లేదు.

కరెంటు అంటే అందరికీ ఆ రోజుల్లో భయం. ఎక్కడ 'షాక్' కొడుతుందో అని ఒకటి, 'ధరావతు' కట్టే సొమ్ము లేకపోవడం రెండోది.

ఆంజనేయులు తల్లి చంద్రావతి అమాయకురాలు. ఎవరొచ్చినా, ఎప్పుడొచ్చినా వేడివేడిగా వండిపెట్టడం ఆవిడకి అలవాటు. కొసరి కొసరి తినిపించేది. వంట రుచి అమోఘం. 'ఆవిడ' చేతిలో అన్నపూర్ణ కొలువుందండీ' అనేవాళ్ళు.

అందరూ కడుపునిండా తినేసి, ఆవిడకి మిగల పోతే మరీ సంతోషపడేది. "అదేంటమ్మా అందరికీ పెట్టి నువ్వు పస్తుంటే ఎట్టా?" అని అడిగితే "మీ అందరి కడుపులూ నిండితే నాది నిండినట్టు కాదూ!" అని ఆనందంగా నవ్వేది.

అంతేకాదు. "ఆడదానికి అన్నవెందుకురా? ఉడుకుతుంటే వచ్చే వాసన చాలు.... కడుపునిండడానికి" అనేది.

ఆంజనేయులి విధవప్పగారు సుశీల చాలా నెమ్మదస్తురాలు. కలిగినవాడికే ఇచ్చి పెళ్లి చేశారు. పెళ్ళయిన నెలకే భర్త పాము కరిచి పరమపదించడంతో పుట్టిల్లు చేరింది.

ఆంజనేయులికి అక్కంటే ప్రాణం. అస్తమానం సుశీలక్కా.... సుశీలక్కా అని ఏదో మిషమీద పిలుస్తూనే ఉంటాడు. కళావతికి అది గిట్టదు.

"ఏం? మంచినీళ్ళు కావాలంటే నేను తెచ్చివ్వను అన్నానా? ఆవిడ తెస్తే గానీ తాగవా?" అని ఓసారీ, "ఓహో... మీ అక్క పెడితేగానీ నీకు అన్నంముద్ద దిగదు కాబోలు... ఆవిడ్నే వడ్డించనీ" అని మరోసారి బాహాటంగానే రుసరుస లాడింది.

సుశీల కన్నీళ్ళు కళ్ళల్లోనే కుక్కుకునేది కానీ ఒక్కమాట ఎదురు చెప్పేది కాదు.

తల్లీతండ్రీ విని, "దాన్ని తెచ్చి అంజిగాడికి కట్టబెట్టిన పాపం మనదే... ఏ మాత్రం మనం కలుగజేసుకున్నా వాడిని ఇంకా వేపుకుతింటుంది" అని మౌనంగా లోలోపలే బాధపడేవారు.

చుట్టుప్రక్కల ఆడవాళ్లు కూడా 'ఈ కళావతి ఆ చంద్రావతమ్మకి తగిన కోడలు కాదు. ఇట్టాంటి అహంకారిని కోడలుగా తెచ్చుకున్నారు. ఎట్టావేగుతారో ఏమిటో... ఆ ఆంజనేయులు పాపం మరీ మెత్తనోడు' అనుకునేవాళ్ళు.

అవన్నీ ప్రత్యక్షంగానో పరోక్షంగానో విని ఆంజనేయులు కుమిలిపోయేవాడు. ఇవన్నీ దాసరి వెంకన్న 'చూపు' దాటిపోలేదు.

"బాబూ ఆంజనేలూ... భార్యాబిడ్డలూ పశువులూ రుణబంధం ఉంటేనే వస్తారుట. రుణం తీరేదాకా ఉంటారట! ఎవరిమీదా ఏ కోపం పెట్టుకోకు. నీ తల్లితండ్రీ మాత్రం దేవతలు... వాళ్ళని మాత్రం వాళ్ళు బతికున్నన్నాళ్ళూ వదలకు" అని ఓరోజు ఎంకన్న ఆంజనేయులికి చెప్పాడు.

'కుండ' ఎంతగట్టిదైనా ఏదో ఓనాడు పగలకమానదు. పొలం నుంచి వస్తున్న ఆంజినీలు తండ్రిగారికి పక్షవాతంవచ్చి రోడ్డుమీదే పడిపోయాడు. మూతి ఒంకర తిరిగిపోయింది. ఓ కాలూ, ఓ చెయ్యీ స్థంభాల్లా గట్టిపడిపోయాయి.

❀ ❀ ❀

ఎద్దుల బండిలో 'అడ్డరోడ్డు' ఆస్పత్రికి తీసికెళ్తే ఏలూరు పట్టుకు పొమ్మన్నారు. ఎలా? పైగా సాయం చీకటి. విషయం విన్న కాశియ్యగారు తనే బస్సు బైటికి తీశాడు. ఆటో బొగ్గు బస్సు. బొగ్గు వేసి మండిస్తే గానీ బాయిలర్ వేడెక్కదు. ఆ తరువాతే బండి నడిచేది. ఎడ్లబండి 'లింగపాలెం' దాటేలోపులో 'కాశయ్య' గారి బస్సు ఎడ్లబండిని గుర్తించింది.

ఎడ్లబండిలో నించి బస్సులోకి రోగిని మార్చటానికి తంటాలుపడ్డా రాత్రి తొమ్మిదింటికల్లా బస్సు ఏలూరు చేరింది.

"పక్షవాతం వచ్చిన 'గంటలో' ఆస్పత్రికి చేరిస్తే రెండ్రోజుల్లో మనిషి నూటికి నూరుపాళ్ళూ కోలుకుంటాడు. ఆలస్యంగా తెచ్చారు... చూద్దాం!" అంటూ డాక్టరు ఇంజక్షను మీద ఇంజక్షను ఎక్కించాడు. ఎమ్.బి.బి.ఎస్ డాక్టరంటే 'దేవుడే' మరి! 'నాడి' పట్టుకునే రోగం కనిపెట్టేవాళ్ళు.

ఏమైనా 'ఖర్మ' ప్రకారం శివశంకరంగారి (ఆంజినీలు తండ్రి) బతుకు మంచంపాలైంది.

అధికారం అమాయకుడైన ఆంజినీలు చేతుల్లోంచి కళావతి పరమైంది. పదిమందికి అన్నం పెట్టిన 'అన్నపూర్ణ' లాంటి చంద్రావతి కళావతి దృష్టిలో పనిమనిషైంది కూతురితో సహా.

ఆంజినీలు మాట్లాడడు. వాకిలిముందున్న వేపచెట్టు కింద ఓరాయి మీద కూర్చుని తదేకంగా పనిచేస్తున్న తల్లినో, పడకమీద ఉన్న తండ్రినో చూస్తూ ఉంటాడు. ఆకలేస్తే సుశీలని మాత్రం పిలుస్తాడు.

కళావతి 'ఇంటి'కి కరెంటొచ్చింది! 'వాల్వు రేడియో' వీధి, వీధంతటినీ పాటల్తో ముంచి పారేస్తోంది. వీధి దీపాల 'బదులు' కరెంటు దీపాలొచ్చి రాత్రిని 'పగలు'గా మారుస్తున్నాయి, ఓ టూరింగు టాకీసు వెలిసి కుర్రకారుని వెర్రెత్తిస్తోంది. ఫస్టు 'షో' అయితేగానీ ఎవరికీ ముద్ద దిగట్లా.

శివశంకరంగార్ని పలకరించి, ఆయన వింటున్నా లేకపోయినా ఊరి కబుర్లు అందవేస్తున్నాడు 'తపాలా' మామయ్య.

దాసరి ఎంకన్నది 'పని' పోయింది. అయినా అలవాటుకొద్దీ ఖాళీ కిర్సనాయిలు డబ్బా, భుజాన నిచ్చెన, జోబీలో అగ్గిపెట్టెతో సాయింకాలాలు మూగబోయిన వీధి దీపాలన్నిటినీ చేతుల్తో తడిమి బడ్డీ కొట్టుకి కాకుండా 'ఇంటి'కొచ్చి చీకట్లోనే కూర్చుంటున్నాడు.

కళావతికి కొడుకు. ఆంజనేయులు వాడ్ని చూస్తాడు గానీ, ఎత్తుకున్న పాపాన పోలేదు.

కళావతి నయానా భయానా చెప్పినా ఆంజనేయులు నోరెత్తడు.

చంద్రావతమ్మ కొడుక్కి నాలుగు మంచిమాటలు చెప్పి సంసారం బాగు చెయ్యాలని ప్రయత్నించింది గానీ వాడు కళ్ళెత్తి చూస్తేగా!

కళావతి 'అమ్మానాన్నా' 'ఆయిలు' బస్సులో దిగారు. అదేదో పెట్రోల్. దాన్ని పోస్తే మహావేగంగా బస్సుపరుగులు తీస్తుందిట! ఇహ కాశియ్య గారి బొగ్గు బస్సు ఎవడెక్కుతాడు?

"ఏమయ్యా అల్లుడూ! నా కూతురు ఏం పాపం చేసిందనీ? ఉలుకూ పలుకూ లేకుండా కూచుంటావుటా.... కనీసం బిడ్డనైనా ఎత్తుకోవుట.

అసలేమనుకుంటున్నావు? తెలిసినవాళ్లు కదా అని మాబిడ్డని ఈ దిక్కూ మొక్కూ లేని ఊళ్ళో పడేశాం. మర్యాదగా ఉన్నావా ఉన్నావు. లేదా నేనేం జెయ్యాలో అది చేస్తా!" అంటూ రెచ్చిపోయాడు ఆంజినీలు మామగారు.

ఇరుగు పొరుగూ వచ్చినా ఏం మాట్లాడతారూ? వేళ్ళనిండా ఉంగరాలతో మెళ్ళో జెర్రిపోతులాంటి బంగారు గొలుసుతో ఆయనా, ఒళ్ళంతా నగలు దిగేసుకుని ఈవిడా వస్తే!

చంద్రావతమ్మ ఓ మూల నిలుచుంది. అసలే మెతక మనిషి, కొడుకుని రోజూ చూసుకోవచ్చనే ఆశతో పనిమనిషి కంటే హీనంగా కోడలు చూస్తున్నా ఓర్పుతో వుంటోంది. శివశంకరంగారికి మాటే రాదాయే! ఆంజనేయులు ఒక్క మాట మాట్లాడలా. కనీసం తలెత్తి అయినా చూడలా.

"ఏం? మాట్లాడవేం?" గద్దించాడు కళావతి తండ్రి. ఆంజనేయులికి వినిపించిందో లేదో తెలీదు అనేదానికంటే, వినడానికి అతను ఇష్టపడటంలేదన్నది నిజం. "అయ్యా.... మీరు పెద్దవాళ్ళు" మాట్లాడబోయింది సుశీల.

"నోర్మూయ్యహె.... తలచెడిందానివి నువ్వేంటే చెప్పేదీ? నీ దిష్టే నా కూతురికి కొట్టింది" ఛర్రుమంటూ లేచింది కళావతి తల్లి.

"చూడండి వదినా! మీరు మా ఇంటికొచ్చారు. నోటికొచ్చినట్లు మాట్లాడకండి. హాయిగా తిరిగే బిడ్డ నేడు మూగవాడైపోయాడు. వాడ్ని ఇంకో మాట అంటే ఊరుకునేది లేదు" జీవితంలో మొట్టమొదటిసారి గట్టిగా మాట్లాడింది చంద్రావతమ్మ.

"ఓహో...నీపిల్లల్నంటే రోషం పొడుచుకొచ్చిందా? మరి నా బిడ్డమాటేమిటీ? నీ కొడుకు ఒక్కనాడైనా దాన్ని సరిగ్గా చూశాడా?" చేతులు తిప్పుతూ వెటకారంగా అన్నది కళావతి తల్లి.

"ఆవిడ ఆడదయితే గదా అమ్మా చూడటానికీ!" అప్పుడే వచ్చిన దాసరి ఎంకన్న అన్నాడు.

"నువ్వెవడివీ?" పిచ్చికోపంతో అరిచాడు కళావతి తండ్రి.

"నేనా? సందె దీపాలు వెలిగించే దాసరి ఎంకన్ననండీ. ఆ పక్క పాకలోనే నేనుండేది" సూటిగా కళావతి తండ్రిని చూస్తూ అన్నాడు ఎంకన్న.

"ఇది కుటుంబ విషయం. ముందు నువ్వు అవతలికిపో" అరిచింది కళావతి తల్లి.

"ఎవరి కుటుంబ విషయం మహాతల్లీ? ఈ శివశంకరంగారు మీలాంటి

నడమంత్రపుసిరి మనిషి కాదు. చంద్రావతమ్మ తల్లి ఎట్టాంటిదో వంద జన్మలెత్తినా మీకు అర్థంకాదు.

అవునూ 'నా బిడ్డ మాటేమిటీ' అనికదూ మీరు అడిగిందీ? ఆ కళావతమ్మ లాంటి కోడలు మీ కొంపలో అడుగుపెట్టిననాడు మీకు తెలుస్తుంది మీ బిడ్డమాట ఏమిటో.

లోకంలో కరుకు మనుషుల్నీ చూశాను, పెళుసు మనుషుల్నీ చూశాను. కానీ తల్లీ ఇట్లాంటి మనిషిని మాత్రం చూళ్ళేదండీ.

మీకే అట్లాంటి కోడలొస్తే మరుసటిరోజే మక్కెలిరగదంతారు. ఒంటినిండా నగలు వేసుకోవటం కాదమ్మా.... మనిషన్నాక మనసుండాల... మానవత్వం ఉండాల.." చెప్పదల్చుకున్నది నిర్మొహమాటంగా చెప్పాడు దాసరి ఎంకన్న.

"ముందు నువ్వు నోరు మూసి బయటికి నడు.... ఏవమ్మా.... మర్యాదగా విడి కాపరం పెట్టి నీ కొడుకు నా కూతుర్ని సరిగ్గా చూసుకున్నాడా సరేసరి లేకపోతే నా కూతురిచేత నీ కొడుక్కి విడాకులిప్పించడమే గాదు, ఇంకేం చేస్తానో నాకే తెలీదు...!" ఇంతెత్తున ఎగిరాడు కళావతి తండ్రి.

"ఏ తల్లి తండ్రైనా కాపురం నిలబెట్టాలని చూస్తారు. నువ్వేం మనిషివయ్యా? కన్న కూతురు కాపరాన్నే చెడగొడతానంటున్నావూ?" ఈసడింపుగా అన్నాడు ఎంకన్న.

"నా కూతురు ఏం బావుకుంటోందనీ? ఇదిగో నా మనవడి తరపున మైనరుదావా కూడా వేయిస్తా. కోర్టు చుట్టూ తిప్పి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తా – నేనేమిటో మీకు తెలీదు...!" చిందులేశాడు కళావతి తండ్రి.

"ఆ మనిషికి సిగ్గూ లజ్జా ఉంటేగా? చూడు నాన్నా ఎట్టా తలొంచుకుని నించున్నాడో! అసలు ఆ మనిషి.." ఏదో చెప్పబోయింది కళావతి.

"ఆగు. ఎంతైనా నువ్వూ ఆడదానివే.... అందరి ముందూ నా తమ్ముడ్ని నానామాటలు అనకు!" భయంగానే అన్నది సుశీల.

"నోరుముయ్యవే బోడీ.... నువ్వెవతివే నోరెత్తడానికీ? నా కూతురి ఇంటిమీద పడి తెగ తింటున్నావు!" చేతులు తిప్పుతూ అన్నది కళావతి తల్లి.

"మీ తిండి కాదు నా కూతురు తినేది. వాళ్ళ నాన్న సంపాయించింది తింటోంది. ఎందుకూ నోరు పారేసుకుంటారూ?" రోషంగా అన్నది ఆంజినీలు తల్లి చంద్రావతి.

"ఏ నాన్న సంపాయించిందీ?" వెటకారంగా అన్నాడు కళావతి తండ్రి.

ఒకే ఒక్క నిముషంలో చెప్పుతీసి కళావతి తండ్రి చెంపలు పగిలేట్టు కొట్టాడు ఆంజినీలు.

"రేయ్! నీ కూతురుకెంతమందిరా నాన్నలు? ఇంకొక్క మాట నీ నోట్లోంచి బైటకొస్తే మీ ముగ్గుర్ని నరికి ఇక్కడే పాతిబెడతా. విడి కాపురం అన్నావు గదూ? జన్మలో జరుగదు పో... కోర్టులో కేసువేస్తావో మధ్యవర్తుల్ని తెస్తావో... తీసుకురా.

ఎంత ఇవ్వాలో అంతా ఇస్తా... నీ కూతుర్ని కూడా ఇక్కడ్నించి తీసుకుపో... ఈ క్షణం నుంచీ నాకున్నది మా అమ్మానాన్నా అక్కా... అంతే.... వాళ్ళమీద 'ఈగ' పడ్డా మీ పీకలు తెగ్గోస్తా!" భయంకరంగా అరుస్తూ కళావతి తండ్రిని నెట్టాడు ఆంజినీలు.

కిందపడ్డ కళావతి తండ్రి నోరు తెరుచుకుని అల్లుడ్ని చూస్తుండిపోయాడు ఆశ్చర్యంగా.

మరో గంటకల్లా తల్లీతండ్రితో పాటు కళావతి ఆమె బిడ్డా కూడా బస్టాండ్‌లో ఉన్నారు.

**కొన్నేళ్ళ తరువాతి కథ :**

ఆంజనేయులి తల్లీ తండ్రీ పోయి అయిదారేళ్ళయింది. ఆంజనేయులూ, సుశీలా మాత్రం అదే ఇంట్లో ఉంటున్నారు.

కళావతి విడిగా ఉంటోంది. కారణం ఆవిడ వదినగారు (అన్నభార్య) వెళ్ళగొట్టడమే. కళావతి తల్లి తండ్రీ కూడా కూతురుతోనే ఉంటున్నారు. కోడలు వాళ్ళనీ వెళ్ళగొట్టింది మరి.

కళావతికి మొహం మీద ముడతలొచ్చాయి. ఇవాళ ఆవిడకీ ఆవిడ తల్లిదండ్రులకీ ఆంజనేయులు భరణంగా ఇచ్చిన ఆస్తే ఆధారం.

కళావతి కొడుకు గొప్ప చదువులు చదివి ఢిల్లీలో ఉంటున్నాడట.

"ఆంజనేయులుగారి ఇల్లు ఇదేనా?' నవ్వుతూ సుశీలని అడిగాడు ఓ ముప్ఫైయేళ్ళవాడు.

"అవునండీ... మీరు?" అయోమయంగా అన్నది ఆంజనేయులు అక్క సుశీల.

"నేనా? ఆంజనేయులుగారి కొడుకుని" అని నవ్వాడతను.

"అంటే....అంటే" ఇంకా అయోమయంగా అన్నది సుశీల.

"అంటే... కళావతిగారి కొడుకునంటే గుర్తుపడతారా సుశీలత్తా! ఇన్నాళ్ళూ మీ గురించి నాకేమీ తెలీదు. మా అమ్మా, అమ్మమ్మా, తాతయ్యా, మీ గురించి నాకేమీ తెలియనివ్వలేదు. వారంరోజుల క్రితమే తెలిసింది నేను ఈ ఊరివాడినని.

మా ఊరొచ్చిన దాసరి ఎంకన్న మా అమ్మని గుర్తుపట్టి పలకరించడంతో మీ విషయం తెలిసింది. తల్లిదండ్రులకోసం, తోడబుట్టినదానికోసం మానాన్న నన్నూ, అమ్మనీ, ఒదులుకున్నాడని తెలిసిన దగ్గర్నించీ, మీరసలు ఎలా వుంటారో తెలుసుకోవాలన్న కుతూహలంతో గుండె కొట్టుకులాడింది.

నేను లోపలికి రావొచ్చా? మా నాన్నని చూడవచ్చా? "సుశీల రెండు చేతులూ పట్టుకుని ఆర్ద్రంగా అన్నాడు ఆ అబ్బాయి.

❀ ❀ ❀

"ఒరే.... మన ఆంజినీలు కొడుకు భలేవాడురా! తండ్రి దగ్గరే ఉంటాట్ట. వస్తే వాళ్ళమ్మ ఇక్కడికి రావాల్సిందే గాని తను మాత్రం అక్కడికి పోడట!" అన్నాడు అల్లంశెట్టి సత్తినారాయణ తిరుమల హోటల్‌లో.

మేమందరం అక్కడ కాఫీ తాగుతున్నాం. ఓ ఫ్రెండ్ కొడుకు ఒడుగైతే తిరుమల వచ్చాం.

"ఆంజనేయులు బంగారంలాంటోడురా... వాడికి పుట్టినవాడు ఇంకెలా ఉంటాడు!" మెచ్చుకోలుగా అన్నాడు ఎల్. వి ప్రసాదు.

ఇది జరిగి కొన్నాళ్ళేం..... కొన్నేళ్ళే అయింది

❀ ❀ ❀

**నేటికథ :**

నేను నా కొడుకు కార్లో మా ఊరు వెళ్తున్నాము. ఆంజనేయులు చనిపోయాడన్న వార్త నిన్న రాత్రే తెలిసింది. అంత్యక్రియలకి ముందే వాడ్ని చూడాలి. చూసి తీరాలి. నా బెస్ట్ ఫ్రెండ్ వాడు.

కళావతి నన్ను చూసి బోరుమన్నది. "చూడండన్నయ్యా... ఈ వయసులో నన్ను" అని ఏడుస్తూ. సుశీల మౌనంగా పనులు చూసుకుంటోంది. ఆమె కళ్ళల్లో సముద్రాలు ఇంకిపోయాయి.

నిశ్చలంగా పడుకుని ఉన్నాడు ఆంజనేయులు. ప్రశాంతంగా నిద్రపోతున్నట్టుగా... కార్యక్రమాలు అన్నీ చక్కగా విధిగా జరిగాయి.

ఆంజనేయులు కొడుకు వెంకటరమణ అతి శ్రద్ధగా, భక్తిగా అంత్యక్రియలు చేశాడు. అందరం ఎవరిదారిన వాళ్ళు బయలుదేరేంతవరకూ ఏడుస్తూనే ఉంది కళావతి.

నేను ఒక్కమాట కూడా మాట్లాడలేదు. ఎందుకంటే, నాది ఆంజనేయులి గుండెలాంటి గుండె కాదు. నాకు ఇంకా జ్ఞాపకం ఉంది.

"ఒరే కేశవా.... చచ్చిపోవాలనుందిరా... కానీ నేను పోతే అమ్మనీ, నాన్ననీ, అక్కనీ ఎవరు చూస్తారూ?" అని ఆంజనేయులు ఏడవటం.

"ఎందుకురా?"అన్నాను.

మూడునెలల మౌనం తరువాత నేను సెలవుల్లో వచ్చినప్పుడు చెప్పాడు "కళావతికి పుట్టినవాడు నా కొడుకుకాదుట్రా... వాళ్ళ బావకీ కళావతికీ పుట్టాట్ట" అని.

"ఎవడ్రా ఆ మాటందీ?" అని పిచ్చి కోపంతో అరిచా.

"ఎవరో కాదురా.. కళావతే చెప్పింది. కడుపుతో ఉండగానే..." కళ్ళవెంట కన్నీరు గోదారిలా ప్రవహిస్తూ ఉండగా అన్నాడు ఆంజినీలు.

వాడు నాకా రహస్యం చెప్పి ముప్పయేళ్ళు అయింది. వాడి శవాన్ని చూస్తూ ఏడిచా....

"అగ్నిని ఇన్నేళ్ళు గుండెల్లో దాచుకుని చచ్చిపోయావా అంజిగా" అని.

నేను బయలుదేరినప్పుడు వెంకటరమణ అన్నాడు "అంకుల్, మానాన్న అంత గొప్ప మనిషిని ముప్పై ఏళ్ళు మిస్సయ్యాను. అయినా ఆయన చూపిన ప్రేమ అనంతం."

ఇప్పుడు నేను నిజంగా ఒంటరిని అంకుల్. కళావతి లాంటి అమ్మలు జన్మజన్మలకీ దొరుకుతారు. కానీ ఆంజనేయులులాంటి నాన్న దొరకాలంటే లక్ష జన్మలెత్తాలి అంకుల్" అని ఏడ్చాడు.

లోకంలో ఎంతమంది కొడుకులు తమ తండ్రి గురించి ఈ మాట అనగలరూ? 'కొడుకంటే నువ్వురా....' అనుకున్నా కార్లో తిరిగొస్తూ.

'ఆ' రహస్యం నాతోనే భూస్థాపితమవుతుందని నాకు తెలుసు.

# స్వయంవరం

"హూ... బావట బావ... ఉత్తి ఆడంగి రేకులోడు...." ముఖం అదోలా పెట్టి ముఖం చిట్లించి అన్నది సంయుక్త.

"నోర్ముయ్... నోటికొచ్చినట్టు మాట్లాడకు. నాకున్నది ఒక్కగానొక్క అన్న. ఆయనకు ఉన్నది ఒక్కగానొక్క కొడుకు. ఆరు నూరైనా నూరు ఆరైనా మా గోవర్ధనాన్ని నువ్వు పెళ్ళిచేసుకోవాల్సిందే.... తప్పదు" అని అరిచింది నీలాంజని.

"ఛస్తే చేసుకోను!" మొండికేసింది సంయుక్త.

"అదీ..! అలా చెప్పమ్మా మీ అమ్మకి!... పెళ్ళంటే నూరేళ్ళ పంట..." అన్నాడు సుదర్శనం.

"నా బొంద... నూరేళ్ళవంట! ఇదిగో ముందే చెబుతున్నా. మీ కుళ్ళు ఆలోచన నాకు తెలీదనుకోకండి. మీ చెల్లెలి కొడుక్కి ఇద్దామనేగా మీ దురాలోచనా? నా కంఠంలో ప్రాణం వుండగా ఎట్టి పరిస్థితుల్లోనూ సాగనివ్వను' డిక్లేర్ చేసింది నీలాంజని, మొగుడు సుదర్శనం గారి మాటను మధ్యలోనే త్రుంచేసి.

"దాని పెళ్లి దాని ఇష్టం.... మధ్యలో నీ జబర్దస్తీ ఏమిటీ?" కోపాన్ని ప్రదర్శించే ప్రయత్నం చేశాడు సుదర్శనం.

"ఇదిగో... నాకు టైమైంది... నేను పోతున్నా...." హేండ్‌బేగ్ తీసుకుని చరచరా కారువైపు నడిచింది సంయుక్త.

"అది కాదే... టిఫిన్ బాక్సు రెడీ చేశాగా...." అంటూ బాక్సు తీసుకుని వెంటపడింది నీలాంజని.

"అక్కర్లా... బాగా దెబ్బలాడుకుని అలిసిపోయిన తర్వాత మీరే తినండి...." అంటూ కారు ముందుకు పోనిచ్చింది సంయుక్త.

❀ ❀ ❀

"అమ్మాయ్... ముక్కూ, మొహం తెలీని ఏ టమాటాగాడ్నో, ఉల్లిపాయగాడ్నో పెళ్ళి చేసుకునే బదులు తెల్సినవాళ్ళని పెళ్ళాడటమే సేఫ్.

పే...ద్ద అమెరికా వరుడు ఓ వంకాయ్‌గాడ్ని పెళ్ళిచేసుకుని నేను పడుతున్న యాతన నీకు తెలుసుగదా!" లంచ్ అవర్‌లో తను తెచ్చిన గోంగూర, పండు మిరపకాయల పచ్చడి రైస్‌ని సంయుక్తతో షేర్ చేసుకుంటూ అన్నది అమూల్య.

"అబ్బ.... భలే కలర్‌ఫుల్‌గా ఉందే ఈ రైస్... చక్రాల్లాగా పైన ఆ ఉల్లిరేకుల అమరిక... ఓహ్..." టిఫిన్ బాక్సు ఓపెన్‌చెయ్యగానే చూసి అన్నది సంయుక్త.

"ఇదంతా నా తెలివితేటలు కాదు తల్లీ. మా ఇంట్లో ఓ పోర్షను ఖాళీగా వుంటే ఈ మధ్య అద్దెకి ఇచ్చాం. అందులోకి ఓ బెండకాయ్ అద్దెకి దిగాడు.

ఏదో సాఫ్ట్‌వేర్ కంపెనీలో మనలాగే ఉద్యోగస్తుట్ట. ఇంకా పెళ్ళికాలేదు. అక్కా ఒక్కా అంటూ వరస కలిపాడు. నీకు తెల్సుగా.... మా అమ్మ మడితో పూజతో ఏనాడూ వంట టైముకి రెడీకాదనీ!

అతనుమాత్రం 7 గం॥ కల్లా ఠంచన్‌గా రకరకాలుగా వండేసుకుంటాడు. ఇలా నాకు కూడా ఓ డబ్బా రెడీ చేసి అప్పుడప్పుడూ ఇస్తుంటాడు. ఇది అతని తయారీ!" గోం.ప.రైస్‌కి పక్కనే సరికొత్త దోసావకాయ కూడా వడ్డించి అన్నది అమూల్య.

"మళ్ళీ ఈ దోసావకాయ ఎందుకూ?" అడిగింది సంయుక్త.

"ఏమో.. గోంగూర, పండుమిరపకాయల పచ్చడి కలిపిన రైస్‌తో కొంచెం ఈ దోసావకాయ నంచుకుంటే అద్భుతంగా ఉంటుందని చెప్పి మరీ ఇచ్చాడు" స్పూన్‌తో రైస్ తినబోతూ అన్నది అమూల్య.

"ఓహ్... ఎలా తినాలో కూడా చెబుతాడన్నమాట....సరే చూద్దాం!" అని ఓ స్పూన్‌తో రైస్ తీసి టేస్ట్ చేసింది సంయుక్త.

"వావ్... నిజంగా గ్రేట్! మీ బెండకాయది మంచి టేస్టే" రుచిని ఆస్వాదిస్తూ అన్నది సంయుక్త.

"ఇంతకీ పెళ్ళి విషయం ఏం డిసైడు చేశావూ? మీ అమ్మగారి తరఫువాడ్నా, నాన్నగారి తరఫువాడ్నా?" అని అడిగింది అమూల్య.

"అయ్యో.... ఇక్కడా అదే గొడవా?" అంటూ ముఖం చిట్లించింది సంయుక్త.

"సర్లే సర్లే... ఏ 'డిప్పం'గాడైతే నాకెందుకులే! అయినా అమ్మాయ్, వంట వచ్చినవాడ్ని చేసుకుంటే సుఖపడతావు. ఏమీ రాని దద్దోజనంగాడ్ని చేసుకుంటే జన్మంతా ఏడుపే!" GP రైస్ లాగిస్తూ అన్నది అమూల్య.

సెల్ మోగితే తీసింది సంయుక్త.

"హలో... హలో... సంయుక్తగారేనా?" అవతల నించి ఓ మగగొంతు.

"అవునండీ... మీరెవరూ?"

"నేనా... నాపేరు శ్యామసుందర్. ఈ నెంబరు మీ మేనత్తగారు ఇచ్చారు."

"వారు మీకేమవుతారు? అసలు వారెలా మీకు తెలుసు?" సీరియస్‌గా అన్నది సంయుక్త.

"వారు మా అమ్మగారండీ.... చాలా రోజులుగా రాకపోకలు లేవుగా! అందుకే డైరెక్టుగా చెప్పలేకపోయానండీ.... నేను స్టేట్స్‌నించి మొన్ననే వచ్చాను. చెన్నైకి ఇవ్వాళే వచ్చాను. మీకు వీలయితే సాయంత్రం కలుద్దామనీ..." మెల్లగా అన్నాడు శ్యామసుందర్.

"అదీ, సారీ.... ప్రస్తుతం నేను కొంచెం వర్క్‌లో బిజీగా వున్నానండీ. కాసేపు.... అంటే ఓ గంట అయ్యాక ఫోన్ చెయ్యగలరా?" ఏం చెప్పాలో తెలీక అన్నది సంయుక్త.

"అలాగేనండీ...థేంక్స్" పెట్టేశాడు శ్యామ్.

"ఎవరూ? ఏం చెప్పాలో తెలీక ఇబ్బందిపడుతున్నావూ?" అడిగింది అమూల్య.

"మా మేనత్తకొడుకు శ్యామ్‌సుందర్‌ట. ఎప్పుడో చాలా చాలా చిన్నప్పుడు చూశాను. కలుద్దామంటున్నాడు.... ఏం చెప్పాలో తెలీటంలేదు."

"అందులో ఆలోచించాల్సింది ఏముందీ? ఎప్పుడో అప్పుడు కలవాలిగా" తేలిగ్గా అన్నది అమూల్య.

"అసలు నాకు మేనరికాలు ఇష్టంలేదు!" మనసులో మాట చెప్పింది సంయుక్త.

"కాదనను. కానీ, చూడటంలో తప్పులేదు గదా? అసలు చూడనంటే మీవాళ్ళూ పంతాలకి పోతారు. చూసి నచ్చలేదని చెప్పెయ్...!" టిఫిన్ డబ్బా మూతపెడుతూ అన్నది అమూల్య.

"సరే. మమ్మల్ని ఎక్కడ కలవమంటావూ...?" అని అడిగింది సంయుక్త.

"బహుశా మీ ఇంటికే వస్తానంటాడేమో, అదీ మంచిదే. హోటళ్ళూ గీటళ్ళూ అంటే మాత్రం ఒప్పుకోకు!" జాగ్రత్తలు చెప్పింది అమూల్య.

"ఇంట్లోకాకుండా విడిగా కలుద్దామంటే?"

"ఓ ఫోన్ నాక్కొట్టి మా ఇంటికొచ్చెయ్యమను. ఇట్నుంచి నువ్వూ అట్నించి ఆయనా వచ్చేలోగా ధనాధన్ ఏర్పాట్లుచేస్తా!" భరోసా ఇచ్చింది అమూల్య.

"అలాగయితే మరీ మంచిది. ఎందుకంటే, నాకంటే ఈ సిచ్యుయేషన్ నువ్వే బాగా డీల్ చెయ్యగలవు!' నిశ్చింతగా అన్నది సంయుక్త.. ఇంటిదగ్గర అయితే పెద్దవాళ్ళముందు మాట్లాడటం కష్టం అవుతుంది అనుకుని.

❀ ❀ ❀

"హౌస్ నెంబర్ టెన్. సుందరేశన్ కోవిల్ స్ట్రీటుకి వచ్చెయ్యండి...అయిదింటికల్లా అక్కడ వుంటాను" భోజనం కాగానే శ్యామ్ సుందర్‌కి ఫోన్‌చేసింది సంయుక్త.

"అలాగే, తప్పకుండా... ఇంతకీ ఆ స్ట్రీట్ ఎక్కడ ఉందీ?" అడిగాడు శ్యామ్‌సుందర్.

"తొండివాక్కంలో" చెప్పింది సంయుక్త. అమూల్య వుండేది తొండివాక్కంలో.

"అమ్మయ్యా! ఇన్నాళ్ళకి నేనో పెళ్ళి పెద్దని కాబోతున్నాను. నీకు పెళ్ళై ఓ దొండకాయో, చిక్కుడుకాయో పుడితే నా పేరే పెట్టుకోవాలమ్మాయ్!" సంయుక్తని దీవిస్తున్నట్టుగా తలమీద చెయ్యిపెట్టి అంది అమూల్య.

"పేర్లు ఆల్‌రెడీ నువ్వే పెట్టేశావుగా...!" అంటూ నవ్వింది సంయుక్త.

అయిదు గంటల రెండు నిముషాలకల్లా ఠంచనుగా వచ్చాడు శ్యామ్. చాలా హేండ్సమ్‌గా వున్నాడు.

"రండి.... ఈమె అమూల్య... నా స్నేహితురాలు. ఆమె శ్రీవాణిగారు... అమూల్య మదర్. ఇక్కడయితే ఫ్రీగా మాట్లాడుకోవచ్చని అనుకున్నాను!" అంటూ అతన్ని ఆహ్వానించింది సంయుక్త.

శ్రీవాణికి నమస్కరించి, అమూల్యకి హలో చెప్పి సోఫాలో కూర్చుని–

"నన్ను బావా అంటే చాలు... అండీ అనక్కర్లేదు సంయుక్తా.... అఫ్‌కోర్స్! మనం చిన్నప్పుడు ఎప్పుడో కలుసుకున్నా చుట్టరికం వున్నది కదా.

అదీగాక మావయ్య ఈ మధ్యనే నీ ఫోటో కూడా నాకు పంపించాడు" నవ్వుతూ అన్నాడు శ్యామ్.

"నాకు తెలీదే! ఎనీవే! ఇప్పుడు చెప్పండి బావా" తనూ కూర్చుని అన్నది సంయుక్త. లోపల్లోపల 'డేడ్' మీద మండుతున్నా.

"ఫోటో చూడగానే నచ్చావు. నీకు ఇష్టమైతే వీలున్నంత త్వరగా మేరేజ్ చేసుకుని స్టేట్స్ వెళ్ళిపోదాం" డైరెక్టుగా చెప్పాడు శ్యామ్.

"అబ్బా... భలే సూటిగా పచ్చిమిరపకాయంత ఘాటుగా చెప్పేశారండీ!" మెచ్చుకుంది అమూల్య.

"టైమ్ ఈజ్ మనీ...లైఫ్ ఈజ్ వెల్త్..... అందుకే ప్రిసైజ్‌గా ఉండాలను కుంటాను... అలా ఉండేవాళ్ళు నాకు చాలా బాగా నచ్చుతారు..." నవ్వి అన్నాడు శ్యామ్.

సన్నగా, పొడుగ్గా కాస్త నిర్లక్ష్యమయిన చూపుతో వున్న ఓ యువకుడు ఇవతలివైపు గదిలోంచి వేడివేడి పకోడి పేట్లు ఓ ట్రేలో పట్టుకుని హాల్లోకొచ్చాడు.

"హలో ఎవ్రిబడీ... నా పేరు సారథి. అమూల్యక్కయ్యగారి ఇంట్లో అద్దెకుంటున్నాను. జస్ట్ పెళ్ళిచూపుల్లాంటి ఓ ప్రోగ్రామ్ వుందనీ, వచ్చేప్పుడు శరవణభవన్‌లో ఏదయినా మాంఛి టిఫిన్ వుంటే తీసుకురమ్మనీ అక్క చెప్పింది.

అంత చిన్న విషయానికి శరవణ భవన్‌దాకా ఎందుకని నేనే ఈ పకోడీలను చేశాను. ప్లీజ్ హావిట్!" అంటూ టేబుల్‌మీద అయిదు ప్లేట్లు సర్దాడు.

"ఓ... థాంక్స్!" మనస్ఫూర్తిగా అన్నది సంయుక్త.

"దేనికీ..! కాసిని పకోడీలు చేసినందుకా...?" అంటూ నవ్వాడు సారథి.

"కాదు. నాకు ఆకలిగా వుందని ఇప్పుడే తెలిసింది. తెలిసిన వెంటనే ఫుడ్ ప్రత్యక్షమయినందుకు. మరో ఎమెండ్‌మెంట్ ఏమంటే, ఆయన నాకు బావ అవుతారు, ఇదో కేజువల్ మీటింగ్. పెళ్ళిచూపులు కాదు!" ప్లేటు చేతిలోనికి తీసుకుని చనువుగా అన్నది సంయుక్త.

"మార్వలెస్... ఇదే స్టాండర్డ్‌గనక మీరు మెయిన్‌టైన్ చెయ్యగలిగితే మా అమెరికాలో సంవత్సరం తిరిగేలోగా మీరు మిలియనీర్లవుతారు!" పకోడీల రుచిని మెచ్చుకుంటూ అన్నాడు శ్యామ్.

"నేనూ అదే చెప్పాను. ప్రతి కాలీఫ్లవర్‌గాడూ ఓ హోటల్ పెట్టడం, ఏడాదికల్లా రెండో మూడో బ్రాంచీలు ఓపెన్ చెయ్యడం. అస్సలు రుచీ పచీ ఉండదు. అదే మా సారథి అయితేనా...!" పకోడీ నములుతూ అన్నది అమూల్య.

"సారీ సర్... సారీ సిస్టర్. వంట అనేది నా హాబీ. అంతే! ఆ హాబీని ధన సంపాదనకోసం వినియోగించకూడదనేది నా పాలసీ. పాక కళ దైవదత్తమైనది. కనుక, కుక్కింగ్ అనేది నాకు ప్రార్థనతో సమానం. ఇంతకీ కాఫీనా, టీనా, కూల్‌డ్రింక్సా ఏం కావాలి?" అందరి వంకా చూస్తూ అడిగాడు సారథి.

"కాఫీ బెటరనుకుంటా" అన్నది అమూల్య.

"కాఫీ తాగితే పకోడీ రుచి పోతుంది కనక నాకు ఏమీవద్దు!" చెప్పింది సంయుక్త.

"జస్ట్ కాఫీ" అన్నాడు శ్యామ్. అయిదు నిముషాలతర్వాత రెండు కప్పుల్లో కాఫీ తెచ్చాడు సారథి.

"అదేంటీ? మీరు తాగరా?" అడిగింది సంయుక్త.

"విడిగా అయితే తాగుతాను. టిఫిన్ తిన్నాక తాగను. కారణం మీరు చెప్పిందే!" నవ్వాడు సారథి.

"వావ్...ఫిల్టర్ కాఫీ.... ఐ లవ్ ఇట్!" కాఫీ సిప్‌చేసి అన్నాడు శ్యామ్.

అమూల్యా, సారథి, శ్రీవాణీ లోపలికెళ్ళారు.

"నిజం చెబితే నేను పెళ్ళి గురించే ఆలోచించలేదు. అసలు ఇప్పటివరకూ ఆ ఆలోచనలేదు. సరే... ఎక్కడ సెటిల్ అవుదామనీ?" సూటిగా అడిగింది సంయుక్త.

"ఇంకెక్కడా... స్టేట్స్‌లోనే!" అని కొంచెం ఆశ్చర్యంగా అన్నాడు శ్యామ్.

"మరి అత్తయ్యా, మామయ్యా?" అడిగింది సంయుక్త.

"వాళ్ళకేం? ఇక్కడే వుంటారు. ఫైనాన్షియల్ ప్రాబ్లమ్ లేదుగా! వాళ్ళకి అమెరికన్ లైఫంటే ఇష్టం లేదు. రెండు నెలలు వుండి ఇహ వుండలేక ఇండియాకి వచ్చేశారు" వివరిస్తున్నట్టుగా అన్నాడు శ్యామ్.

"సరే బావా. నేను ఆలోచించుకోవాలి. నాకసలు మేనరికాలు ఇష్టం లేదు. డాక్టర్లు కూడా అదే చెబుతున్నారు" అన్నది సంయుక్త.

"మామయ్యకి ఫోన్‌చేసి నీ బ్లడ్‌గ్రూప్ ఏమిటో కనుక్కున్నాను. మెడికల్ ప్రోబ్లమ్స్ ఏవీ మనకి అడ్డురావని స్టేట్స్‌లో వుండే నా డాక్టర్ ఫ్రెండ్ చెప్పాడు.

ఎనీవే. నువ్వు ఒప్పుకుంటే నేను చాలా సంతోషిస్తానని మాత్రం ఖచ్చితంగా చెప్పగలను. ఇండియాలో మరో పదిరోజులు ఉంటాను. ఈ సమయం చాలనుకుంటా, నువ్వో నిర్ణయం తీసుకోవడానికి!" లేచాడు శ్యామ్.

"ఆలోచించాలిగా!" అని నవ్వి అమూల్యని పిలిచింది సంయుక్త. వెయిటింగ్‌లో వున్న కాల్‌టేక్సీలో శ్యామ్ ఎక్కేదాకా అందరూ గేట్ దగ్గర వుండి ఆ తరువాత లోపలికి వచ్చారు.

"ఆయన చాలా హేండ్సమ్‌గా ఉన్నారు. ఆయన మాటకూడా సూటిగా, స్పష్టంగా వుంది. పెళ్ళికొడుగ్గా పెర్‌ఫెక్ట్ అనుకుంటాను...!" సంయుక్త భుజం తట్టి అన్నది అమూల్య.

"మీరేమంటారూ?" సారథిని అడిగింది సంయుక్త.

"సారీ.. పెళ్ళి విషయంలో ఎవరి నిర్ణయాలు వాళ్ళే తీసుకుంటే మంచిది" నవ్వి అన్నాడు సారథి.

"అదీ నిజమేలే! అనవసరంగా ఓ కేబేజీగాడి మాట విని నేను పెళ్ళి అనే చదరంగంలో ఇరుక్కున్నా. ఆయనేమో ఏడాదికోసారొస్తాడు. ఉద్యోగం వదిలేసి నన్ను రమ్మంటాడు. నాకు ఎలా కుదురుతుందీ?" అంటూ నిట్టూర్చింది అమూల్య.

"మమ్మీ" సంయుక్తంగా అరిచి లోపలికి వచ్చారు 'పంటూ, చింటూ'లు. వాళ్ళిద్దరూ కవలలు... అమూల్య పిల్లలు.

"రండిరా పిల్లలూ... రండి. సంయుక్త ఆంటీకి గుడీవినింగ్ చెప్పండి!" మురిపెంగా పిల్లలను దగ్గరకు తీసుకుని అన్నది అమూల్య.

"హలో సంయుక్తా... నేను గోవర్ధనాన్ని!" సంయుక్త గేటు తోసి లోపలకి అడుగుపెడుతుండగా అన్నాడు గోవర్ధన్. చాలా స్మార్ట్‌గా, అందంగా ఉన్నాడు గోవర్ధన్. పదేళ్ళక్రితం ఉత్తి ఆడంగి రేకులోళ్ళా వుండేవాడు.

"హలో బావా.. ఏమిటీ ఆకస్మిక ఆగమనం!" నవ్వి అన్నది సంయుక్త.

సంయుక్తకి ఆశ్చర్యంగా వుంది. అరగంటక్రితం శ్యామ్, ఇప్పుడు గోవర్ధన్ కలవడం.

"నేను వచ్చి రెండు గంటలయింది. ఫైవ్ థర్టీకల్లా నువ్వు ఇంటికి వచ్చేస్తావని అత్తయ్య చెప్పింది" నవ్వి అన్నాడు గోవర్ధన్.

'నవ్వు కూడా బాగుంది' అనుకుని, "చిత్రం ఏమిటో తెలుసా? శ్యామ్‌బావ ఆఫీసుకి ఫోన్‌చేశాడు. అతన్ని నా ఫ్రెండ్ అమూల్య ఇంటిదగ్గర కలిసి ఇక్కడికి వచ్చేసరికి లేటయ్యింది.

అఫ్‌కోర్స్! కారు కొంచెం ట్రబులిస్తే మన వీధి చివర మెకానిక్ షెడ్‌లో వదిలేసి నడిచి రావడానికి మరో పది నిముషాలు ఎక్కువ టైమ్ పట్టిందనుకో...!" హాల్లోకి నడుస్తూ అన్నది సంయుక్త.

"ఓహ్! తనూ వచ్చాడా?" కొంచెం అసూయ ధ్వనించింది గోవర్ధన్ స్వరంలో.

"అవును, నేనొప్పుకుంటే పెళ్ళికూడా చేసుకుంటానన్నాడు. వారం రోజులు టైమ్ కూడా ఇచ్చాడు. భలే హేండ్సమ్‌గా వున్నాడులే!" కావాలనే కాస్త ఉడికిద్దామని అన్నది సంయుక్త.

"హేండ్సమ్మా లెగ్సమ్మా? వాడిబొంద - జిడ్డుమొహం వాడూనూ" బైటికొస్తూ అన్నది నీలాంజని.

"అబ్బ..! నువ్వసలు చూడనేలేదుగా! అతనొచ్చింది మొన్నేట. చెన్నై ఇవ్వాళే వచ్చాడుట" ఓరకంట గోవర్ధన్‌ని చూస్తూ తల్లితో అన్నది సంయుక్త.

"అవన్నీ అమెరికా మిసమిసల్లే అత్తయ్యా! ఇదిగో సంయుక్తా.... మేం ఇద్దరం నీకు వరసైనవాళ్ళమే. కాదనను. ఇద్దరం ఉద్యోగం చేస్తున్నాం. ఇద్దరికీ ఆల్‌మోస్ట్ సంపాదనకూడా ఒకటే. ఎవరి ప్లస్‌లు వాళ్ళకి వున్నై. పెళ్ళి విషయంలో అయితే ఓపెన్‌గా చెబుతున్నా.

నీకు అన్నదమ్ములు లేరుగనుక, నన్ను చేసుకుంటే నీ తల్లిదండ్రుల్ని చివరిదాకా నేను కన్నకొడుకులా చూసుకుంటాను. మా కంపెనీకి చెన్నైలోనూ బ్రాంచి వున్నదిగనక

ఇక్కడికే ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటాను. వారం కాదు.... పదిరోజులు ఆలోచించుకుని చెప్పు. అత్తయ్యా! ఇప్పుడు ఇవ్వు కాఫీ!" అన్నాడు గోవర్ధన్.

❀ ❀ ❀

"భలే చిక్కొచ్చిపడిందే! శ్యామ్ అమెరికా విడిచిరాడు. గోవర్ధన్‌ని పెళ్ళి చేసుకుంటే నిన్నూ మీ ఇంటిని విడిచిపోడు. ఒకవిధంగా అది మంచిదైతే ఓ విధంగా ఇది మంచిది.

ఒకడు నిమ్మకాయ అయితే ఇంకోడు నారింజకాయ్. పెళ్ళి అనేది గనక 'పప్పు' లాంటిది అయితే ఈ రెండిట్లో దేన్ని పిండితే బాగుంటుందీ?" ఆలోచిస్తూ అన్నది అమూల్య. సంయుక్త వున్నదీ అమూల్య ఇంట్లోనే.

"మీరేమంటారూ?" సారథిని అడిగింది సంయుక్త.

"ఇది రెండోసారి మీరు నన్ను అడగడం. సంయుక్తగారూ, ఏదో ఒకటి ఆశించి మాత్రం పెళ్ళి చేసుకోకండి. మీ మనసు ఏది చెబితే దాని ప్రకారం నడుచుకోండి. ఇద్దరు వ్యక్తులు కొన్ని దశాబ్దాల పాటు కలిసి జీవించాలంటే, వారిమధ్య వుండాల్సింది లాభనష్టాల బేరీజు కాదు.... చక్కని అవగాహన, అనురాగం, అన్నిటికీ మించి అర్థం చేసుకునే మనస్తత్వం" కాఫీకప్పు చేతికి ఇచ్చి అన్నాడు సారథి.

❀ ❀ ❀

"నాకెప్పుడూ అనిపించేదే సంయుక్తా... మా ఇంట్లో అద్దెకుండే బెండకాయ్‌గాడ్ని నువ్వు పెళ్ళిచేసుకుంటే పదికాలాలపాటు సుఖంగా వుంటావని!" గ్రేట్...మంచి నిర్ణయం తీసుకున్నావు.

సారథిమీదా, సంయుక్తమీదా అక్షింతలు జల్లుతూ అన్నది అమూల్య. వెంటనే నాలుక్కరుచుకుంది.

"నాకు తెలుసులే అమూల్యక్కా.... నాకూ ఏదో పేరుపెట్టి వుంటావనీ" చల్లగా నవ్వాడు సారథి.

"అదీ...అదీ! ఆ పేరు పెట్టానుగనకే నువ్వు ముదరకముందే మా సంయుక్త నిన్ను ఓ.కె. చేసింది. అయినా, మీ బావలిద్దర్నీ కాదని సారథిని ఎలా, ఎందుకు సెలక్టు చేసుకున్నావే సంయుక్తా!" అని కుతూహలంగా అడిగింది అమూల్య.

"సింపుల్. శ్యామ్ బావ లైఫ్ ఈజ్‌వెల్త్ అనీ, టైమ్ ఈజ్ మనీ అనీ అన్నాడు. జీవితాన్నీ, సమయాన్నీ 'డబ్బు'తో కొలిచేవాళ్ళు డబ్బు తెచ్చే కంఫర్ట్స్‌ని కొనుక్కోగలరేమోగానీ జీవితాన్ని అనుభవించలేరు. ఇహ గోవర్ధన్ బావైతే నాకు అన్నదమ్ములు లేరన్న ఒకే ఒక కారణంతో, తనవాళ్ళని వదిలేసుకుని నా దగ్గరకి రావడానికి ఇష్టపడ్డాడు.

నాకోసం తల్లిదండ్రుల్నీ వదులుకోవడానికి సిద్ధపడినవాడు రేపు మరో విషయంకోసం నన్ను వదులుకోడని గ్యారంటీ ఏమిటీ?" నవ్వింది సంయుక్త.

"మరి సారథిలో ఏం చూశావు?" అమూల్య గొంతులో కుతూహలం పెరిగింది.

సారథికూడా చెవులు రిక్కించాడు.

"ఆయన అన్న ఒక్క మాట నచ్చింది. భార్యాభర్తల మధ్యన అనురాగం, అవగాహన, అన్నిటికీ మించి అర్థం చేసుకునే మనస్తత్వం" అన్నారు.

"బస్... ఇంకేం కావాలీ?" వెచ్చని మెడలో పచ్చని తాళి మెరుస్తుండగా అన్నది సంయుక్త.

❀ ❀ ❀

పాలగ్లాసు సంయుక్త నోటికందించాడు సారథి. "ముందు మీరు" సిగ్గుపడింది సంయుక్త. "మగవాడు సగం తాగి మిగతా పాలు భార్యకివ్వడం ఆచారం. నా దృష్టిలో భార్య తాగాక భర్త తాగటమే ధర్మం" తాగిస్తూ అన్నాడు సారథి.

"భర్త అంటే భరించేవాడనా?" నవ్వింది సంయుక్త.

"ఈ భారాన్ని భరించడం!" రెండు చేతుల్తో ఆమెను ఎత్తుకుని, "మీరు నన్ను పెళ్ళిచేసుకుంటారా! అన్నప్పుడు నాకేమనిపించిందో తెలుసా? నువ్వు తప్ప ఈ లోకంలో మరేదీ వద్దనిపించింది".

"మరి ఇప్పుడూ" రెండు చేతులూ అతని మెడచుట్టూ వేసి అన్నది సంయుక్త.

''అచ్చు నీలాంటి పిల్లలకే తండ్రిని కావాలని అనిపిస్తోంది. అదీ యమర్జంటుగా!' పెదాలకు పెదాలు జోడిస్తూ అన్నాడు సారథి.

# జాగ్రత్తపరుడు

"ఒరే కుమార్రాజూ! ఇది పీటర్ ఇంగ్లాండ్ షర్టురా! ఖరీదెంతో తెలుసా? కళ్లు తిరిగి పడిపోతావ్. వద్దులే" కొత్త షర్టుకున్న గుండుసూదులు, క్లిప్పులూ తీస్తూ అన్నాడు అవినాశంగాడు.

వాళ్ళనాన్న కొంతకాలం బెంగాల్‌లో పనిచెయ్యడం వల్ల, బెంగాలీ మోజులో కొడుక్కి అవినాశ్ అనీ, కూతురుకి మృణాళిని అనీ పేరు పెట్టాడు. ఊరంతా మాత్రం వీణ్ణి 'అవినాశం' అనీ, ఆ పిల్లని 'ముల్లీ' అని పిలుస్తుంది.

"హొదిలెయ్‌రా...అది పీటర్ ఇంగ్లాండైతే నాకెందుకూ, కుత్తాయి మారిషస్ అయితే నాకెందుకూ? నువ్వు తొందరగా తెమిలితే చాలు" అన్నాను. ఎందుకంటే వీడంత స్లోగాడు ప్రపంచంలో ఉండడు. అంతేకాదు తనో సోగ్గాడినని వీడి ప్రగాఢ నమ్మకం.

"ఒరేయ్... ఆ పేపర్ని స్కేల్‌లాగా మడిచి ఇవ్వరా" అన్నాడు. నేను మడిచి ఇవ్వగానే ఆ గుండుసూదుల్ని నీటుగా పేపర్‌కి గుచ్చడం మొదలెట్టాడు.

"అవెందుకురా?" తెలిసే అడిగాను.

"ఓరి పుల్లాయ్.... ఈ గుండుసూదిని తయారుచేయాలంటే ఎంత కష్టమో, ఎంత సమయం పడుతుందో నీకు తెలుసా? ముందుగా 'ఐరన్ ఓర్'ని భూమినించి

వెలికితియ్యాలి. తరువాత దానిని ఇనుముగా మార్చాలంటే ఓ ఫ్యాక్టరీనే కట్టాలి. ఆ తరువాత..." అని చెప్పబోతుండగా.

"బాబూ క్షమించు... ఈ కథంతా నాకు చెప్పి నాకున్న మిల్లీమీటరంత బ్రెయిన్నీ మిర్చిబజ్జీలా కొరుక్కుతినకు. నేనడిగింది ఓ సింపుల్ క్వశ్చెన్, పెళ్ళిచూపులకి వెడుతూ ఈ గుండుసూదులను ఎందుకు జాగ్రత్త చేస్తున్నావని. అంతే" దండంపెట్టి మరీ చెప్పాను. లేకపోతే ఇనుప ఖనిజం నుంచి ఇన్ఫోసిస్‌దాకా చెప్పి నా ప్రాణం తీస్తాడు నాకు తెలుసు.

"పిచ్చివాడా... పెళ్ళిచూపులకే కాదు, పెళ్ళిపీటల మీదైనా సరే... ఏ వస్తువునీ నిర్లక్ష్యంగా అవతల పారెయ్యడం నాకు ఇష్టం ఉండదు. నువ్వు తయారు చెయ్యలేనిదాన్ని అవతల పారేసే హక్కు నీకు లేదు..." పేపర్ స్కేల్‌ని చక్కగా గుచ్చుకోకుండా మడిచి అన్నాడు అవినాశం. ఇంకేం చెబుతాం? చిన్నప్పటినించీ వీడంతే. మాస్టార్లు విసిరేసిన చాకుపీసుముక్కల దగ్గర్నించీ సిగరెట్టుపెట్టె డొక్కుల్నించీ ఏదీ వదలకుండా అన్నీ దాచేవాడు.

అరిగిపోయి, ఇక దేనికీ పనికిరావు అని పారేసే సబ్బుముక్కల్ని వీడు జాగ్రత్తగా ఓ సీసాలో పడేసి, కొద్దిగా నీళ్ళుపోసి 'లిక్విడ్‌సోపు' గా మార్చి వాడేవాడంటే వాడి పొదుపరితనం గురించి ఇంకేం చెప్పాలి?

అసలు పాతికేళ్ళ క్రితమే ఖాళీ వాటర్ బాటిల్సుని పోగుచేసి వాటిల్లో చక్కగా మా 'చెలం' నూతి నీళ్ళు పోసి బాటిల్ అర్ధ రూపాయికి అమ్మేవాడు. అప్పుడు వాడికి ఆరేళ్ళూ, నాకు ఏడేళ్ళూ.

వాడిపారేసిన టూత్‌బ్రష్ ఎన్ని విధాలుగా ఉపయోగించవచ్చో వాడిని అడిగితే చాలు... వెయ్యి పేజీల సమాచారం ఇస్తాడు. ఆ తరువాత మీరు 'ప్రొఫెషనల్ యూజ్‌డ్ టూత్ బ్రష్ కలెక్టర్' అయినా నేను ఆశ్చర్యపోను.

ఓసారి వీడు అనర్గళంగా ఉపన్యసిస్తూ 'కంచు గ్లాసులూ, రాగి, ఇత్తడి, స్టీలు, గాజు గ్లాసులూ మళ్ళీ మళ్ళీ ఉపయోగించంగా లేనిది పేపరు గ్లాసులూ, పాలిథిన్ గ్లాసులూ ఎందుకు తిరిగి వాడకూడదూ?" అన్నాడు. ఆ మాటలు విన్న మా పక్కింటావిడ కొడుకు పుట్టినరోజుకి ఉపయోగించిన యూజ్ & త్రో గ్లాసుల్ని కడిగించి, మూడు రోజుల తరువాత వచ్చే కూతురు పుట్టినరోజుకి వాడింది.

వాడితే ఎవడికీ తెలిసేది కాదుగానీ, "అబ్బాయ్ అవినాశూ! నువ్వు చెప్పినట్లు యూజ్&త్రో గ్లాసుల్ని రీయూజ్ చేశానోయ్ అని కళ్ళు మిలమిలలాడించి మరీ చెప్పింది. బస్... ఆనాటినుంచి వాళ్ళింట్లో ఏ శుభకార్యం జరిగినా ఒక్కడు ఎటెండ్ అయితే ఒట్టు.

"పోదామా?" స్టైలుగా తల దువ్వుకుని బూట్లు తగిలించుకుని అన్నాడు అవినాశం గాడు.

"ఆహా!" అన్నాను లేస్తూ.

పెళ్ళికూతుర్ని చూసి మావాడి కళ్ళు తళతళలాడాయి. పిల్ల బ్రహ్మాండంగా ఉంది. రవ్వ కేసరిమీది జీడిపప్పులా రసవత్తరంగా ఉంది.

నవ్వినప్పుడల్లా బుగ్గలు నేతిపూరీల్లా పొంగుతున్నాయి. మావాడు బ్యాంకు ఆఫీసరు. ఆ అమ్మడిది సాఫ్ట్‌వేర్‌ట. పెళ్ళిచూపులు ఏదో సిగ్గుసిగ్గుగా, ఇబ్బందిగా ఓ చిత్రమైన గంభీరమయిన వాతావరణంలో జరుగుతాయని నేను ఊహించు కున్నాను.

కానీ జరిగింది వేరు. చాలా ఫ్రీగా, హుషారుగా, అదేదో ఛానల్‌లో వచ్చే 'హోలీ వధువు జాలీ వరుడు' టైప్‌లో ఉత్సాహంగా జరిగాయి.

"మీ పేరు వనిత... నాకు తెలుసు..." నవ్వుతూ అన్నాడు అవినాశంగాడు.

"మీ పేరు అవినాశ్.... ఎస్.బి.ఐ.లో ఆఫీసర్..." నవ్వుతూ అన్నది వనిత.

"థాంక్యూ... మీ గురించి చాలా ఇన్ఫర్‌మేషన్ కలెక్టు చేశాను. మీరు సెంట్‌పర్సంట్ నాకు నచ్చారు" అన్నాడు మెచ్చుకోలుగా చూస్తూ మావాడు.

"సేమ్... నేనూ మీ గురించి సమాచారం సేకరించాను. గ్రేట్!"అంది వనిత.

అతిజాగ్రత్త గురించి కూడానా? అని అడుగుదామనుకున్నానుగానీ, బాగోదని ఊరుకున్నా.

"మీరు కాఫీ అంటే ఇష్టపడరని తెలిసి మా అమ్మాయి మీకోసం 'హార్లిక్స్' తెప్పించింది" మురిపెంగా కూతుర్ని చూస్తూ అన్నది. పె॥ కూ॥ తల్లి.

"యా! జీడిపప్పులంటే ఇష్టమని జల్దీరామ్ జీడిపప్పులూ, నటరాజన్ మొదలియార్స్ బూందీ, పుల్లారెడ్డి స్వీట్సూ, శరవణభవన్ కాఫీ ప్రత్యేకంగా తెప్పించింది" తనూ తందానా అన్నాడు పె॥ కూ॥ తండ్రి.

"సో నైస్ ఆఫ్ యూ!" చిరునవ్వుని బడా నవ్వుగా మార్చి అన్నాడు మావాడు.

పేపర్ ప్లేట్లు పెట్టారు. చక్కని ప్యాకింగ్ ప్లాస్టిక్ డబ్బాలోంచి... సదరు ఉపాహారాలను వడ్డించింది పె॥ కూ॥ తల్లి.

"ప్రశ్నలు ఏమన్నా అడగాలంటే అడగవచ్చు. హాయిగా టిఫిన్ చేస్తూ!" అన్నాడు పెళ్ళి కూతురు తండ్రి.

"ప్రత్యేకమయిన ప్రశ్నలేవీ లేవుగానీ, ఏదో సాంప్రదాయంగా అడగాలి గనుక అడుగుతున్నాను. సపోజ్.... ఈ జీడిపప్పులూ, బూందీ కొంచెమే తిని వదిలేశాననుకోండీ ఏం చేస్తారూ?" అన్నాడు మా అవినాశంగాడు.

నా గుడ్లు వెళ్ళుకొచ్చాయి. వీడి దుంపతెగా, పెళ్ళిచూపుల్లో అడగాల్సిన ప్రశ్నా?

"గుడ్! మంచి ప్రశ్న వేశారు. మిగిలినవి చక్కగా ఓ బటర్ పేపర్లో ప్యాక్ చేసి మా బస్టాండ్ ముందు అడుక్కునే పిల్లలకి పంపిస్తా. ఫుడ్ వేస్ట్ చెయ్యడం మహాపాపం!" స్మూత్‌గా నవ్వుతూ అన్నది వనిత.

జీడిపప్పు మూడో స్పూన్ నాకు వెయ్యబోతూ ఆగింది పె॥ కూ॥ తల్లి.

'ఇంకా నయం. నెక్స్ట్ పెళ్ళిచూపులకి వచ్చే ముందావాడికి పెడతాము అన్లేదు....' అనుకుంటూ నిట్టూర్చా. కారణం ఆవిడ జీడిపప్పు వడ్డన అర్ధాంతరంగా ఆపింది నాప్లేటులోనే గనకా, జీడిపప్పంటే నాకు చచ్చేంత ఇష్టం గనకా.

"మరి ఆ ప్యాకింగ్‌తో వచ్చిన డబ్బాలను ఏం చేస్తారూ?" అడిగాడు మావాడు.

"చక్కగా పనిమనిషిచేత కడిగించి ఎండబెట్టి జాగ్రత్తగా ఉంచితే ఏ ఊరన్నా వెళ్ళినప్పుడు వాటిల్లో పూరీ, ఉప్మాలాంటి టిఫిన్లో, పులిహోర, కర్డ్ రైస్ లాంటి రైస్ ఐటమ్సో పెట్టుకెళ్ళచ్చు" అంది వనిత.

'కొంపదీసి రేపు హనీమూన్‌కి వీటిల్లోనే ఫుడ్ ప్యాక్ చేసుకోరుగదా!' నాలో నేను.

"లవ్లీ...!" పేపర్‌ప్లేట్లు ఊడ్చేసి నీళ్ళని తృప్తిగా తాగేసి అన్నాడు అవినాశం. హార్లిక్స్ పొగలు గక్కుతోంది.

"మన అభిరుచులూ అభిప్రాయాలూ బ్రహ్మాండంగా కలిశాయి. ఐ హోప్... మనిద్దరం గొప్ప జీవితం గడుపుతాం... పెళ్ళికి మీరు ఒప్పుకుంటే!" మావాడే అన్నాడు.

"రైట్! ఈసారి మీరెప్పుడు వచ్చినా ఒంటరిగానే రండి. అప్పుడు మరింత ఫ్రీగా ఉండొచ్చు. మేరేజీ ఫిక్సవడానికి టైం పడుతుందిగదా!" చిరునవ్వుతో అన్నది వనిత. 'అంటే నేను వేస్టుగాడ్నా? నాక్కోపం వచ్చిందంటే రాదుమరీ! తిరిగొచ్చేటప్పుడు నేను నోరు తెరిస్తే ఒట్టు'.

నేను ఆ ఊరొచ్చింది రాజమండ్రినించి. వాడు పనిచేసేది ఒంగోల్లో. ఇద్దరం కలిసింది హైద్రాబాదులో. వాడు నన్ను పెళ్ళిచూపులకి తోడుగా రమ్మనడం వల్ల స్నేహాతిరేకంతో వచ్చానన్నమాట.

సక్సెస్‌ఫుల్‌గా పెళ్ళిచూపులు ముగిశాక సామాన్లు సర్దుకుంటున్నాం. నేనేమో ఓ చిన్న బ్యాగ్‌తో వచ్చా. ఓ ప్యాంటూ ఓ షర్టూ ఓ లుంగీ, బ్రష్షూ, పేస్టూ ఎట్సెట్రాలతో. వాడిప్పుడు ఓ సూట్‌కేసూ మరో పెద్ద బేగూ సర్దుకుంటున్నాడు.

బాత్‌రూమ్‌లో గెస్ట్‌లకోసం ప్రత్యేకంగా పెట్టే షాంపూ బాటిళ్ళూ, సబ్బులూ, సూయింగ్ కిట్, బ్రష్ పేస్ట్‌ల కిట్, ఆఖరికి షవర్‌బాత్ చేసేప్పుడు తల తడవకుండా వేసుకునే కేప్‌తోసహా ఇప్పుడు వాడి మంచం మీద ఉన్నాయి.

వాటన్నిట్నీ చక్కగా ఓ కేరీబ్యాగ్‌లో నీట్‌గా ప్యాక్ చేసి, ఆ బ్యాగ్‌ని పెద్ద బ్యాగ్‌లో సర్దాడు.

"అదేమిట్రా... మనం వెళ్ళిపోయినాక ఇవన్నీ కనిపించకపోతే దొంగల మనుకోరూ?' అన్నాను.

"నోరుముయ్యవోయ్. ఇవన్నీ మనం ఉపయోగించుకోవడానికేగా వాళ్ళు పెట్టిందీ! మనం, మనం తెచ్చుకున్న వస్తువుల్ని ఉపయోగించి వీటిని మనతో తీసుకువెళుతున్నాం. అంతే! అదీగాక వీడు వేసే 3 స్టార్‌బిల్లులో ఇవన్నీ కలిసే వుంటాయి" అన్నాడు.

'కామోసు' అనుకున్నాను. "వీటన్నిట్నీ తరువాత వాడతావన్నమాట" అని అన్నాను.

"యస్... ఈ సబ్బులు చూడు చిన్న చిన్నగా ఎంత ముద్దొస్తున్నాయో.. ఈ షాంపూ బాటిళ్ళు చూడు ఎంత అందంగా ఉన్నాయో! ఇవి దొరికేది కేవలం స్టారు హోటళ్ళలోనే! మనం ఎప్పుడైనా ఓ చిన్న ఊరికి వెళ్లినప్పుడు వీటిని ఎంచక్కా వాడుకోవచ్చును" అన్నాడు మురిపెంగా.

వాడి ఫోన్ మోగింది.

"హాయ్ వనితా...I am so గ్లాడ్... 'etc... etc..." చాలా మాట్లాడాడు. ఓ పదినిమిషాలు గది బయటికి పోయి మాట్లాడివచ్చాడు కూడా.

అబ్బ! లోకం ఎంత ఫాస్టు అన్పించింది.

"ఒరేయ్ కుమార్రాజూ! వాళ్ళమ్మ మూడో గరిట జీడిపప్పు నీ ప్లేట్లో వేయబోతూ ఆగిపోయిందని ఆవదం ముఖం పెట్టావుటగా! హ....హో... వాళ్ళందరూ ఇంకా నవ్వుకుంటూనే ఉన్నారట!" పడీపడీ నవ్వుతూ అన్నాడు. నాకు పిచ్చి ఎక్కదూ?

"అంతేగాదు. నిన్నెందుకు తీసుకువచ్చానా అని అడిగింది. కానీ నే చెప్పలేదు!" అన్నాడు.

వాడి మొహంవంక చూశాను.

"నీకు చెబుతాన్లే. ఒక పొట్టివాడు పొడుగ్గా కనిపించాలంటే ఏం చెయ్యాలీ? మరో మహా పొట్టివాడ్ని తోడు తీసికెళ్ళాలి. నేను అందగాడ్నే అనుకో. అయినా నా అందం ఇంకా బాగా పెళ్ళికూతురు మనసులో రిజిస్టర్ కావాలంటే ఏం చెయ్యాలా అని ఆలోచించి ఆలోచించీ నిన్ను తీసుకెళ్ళాన్రా" అన్నాడు.

'వీడు మిత్రద్రోహే కాదు, పరమ శత్రువు. ఈ క్షణం నుంచీ' అని నాలో నేనే నిర్ణయించుకున్నా.

"అయితే ఒక్క కండిషన్ పెట్టిందిరా. హాయిగా అయిదేళ్లు ఎంజాయ్ చేశాకే పిల్లల్ని కనడానికి 'ప్లాన్' చేసుకుందామని" చెప్పాడు.

"ఏమన్నావూ?" అసలు మాట్లాడకూడదనుకున్నా కుతూహలం ఆగనిస్తేగా!

"ఒప్పుకోలేదు. అయిదేళ్ళయితే చచ్చినా ఒప్పుకోను. ఆరేళ్ళు ఆగుదామంటే మాత్రం డబుల్ ఓకే అని చెప్పేశా!" అన్నాడు.

వావ్! ఏం పట్టుదల!! చెప్పొద్దూ... పెళ్ళిమాత్రం బ్రహ్మాండంగా జరిగింది. అవినాశంగాడు చచ్చేంత బతిమలాడితేగానీ నేను పెళ్ళికి వెళ్ళలేదు.

అంతేగాదు... వనితావాళ్ళ అమ్మ ప్రత్యేకంగా నాకోసం కిలో జీడిపప్పు ప్యాకెట్ తెచ్చింది. తనే స్వయంగా ఇచ్చింది.

పెళ్ళయ్యేదాకా వాళ్ళతోనే ఉన్నాను. అవినాశరావు గాడి అసలు ఊరు తిరుపతికి చాలాదూరంలో ఉండే పచ్చి పల్లెటూరు. అయినా వాళ్ళ హనీమూన్ ఆ పల్లెటూళ్ళోనే ప్లాన్ చేసుకున్నారట.

వాళ్ళ తాత 'హవేలీ'ని వీడి పెళ్ళికిముందే బాగుచేయించి వచ్చాడు. వండి పెట్టడానికి అక్కడో బంధువులావిడని కూడా ఉంచి వచ్చాడట.

దిగ్విజయంగా వారి కారు అలంకారాలతో పెళ్ళి జరిగిన బెజవాడ హోటల్ ముందు ఠీవిగా ఉంది.

వాళ్ళ సామాన్లు డిక్కీలో పెడుతుండగా చూశా ఆ వేళ హోటల్లో చూసిన పెద్ద బ్యాగ్‌ని.

"అదేగదరా నువ్వు హైద్రాబాదుకి తెచ్చిందీ... అందులో ఏముందీ?" అనడిగా.

"ఒరే పిచ్చోడా! అది వన్ బ్యాగ్ విత్ మెనీ బ్యాగ్స్ ఇన్‌సైడ్' రా. సబ్బులు, సూయింగ్‌కిట్‌లూ, గుండుసూదులూ, ట్వైన్ దారాలూ ఇలాంటివి అన్నీ అందులో ఉంటాయనుకో. సడన్‌గా ఫ్యూజ్ పోతే వెయ్యడానికి ఫ్యూజ్ వైర్‌తో సహా సమస్తం అందులో ఉంటాయి.

మనిషి అన్నింటినీ జాగ్రత్తగా జాగ్రత్త చెయ్యాలోయ్. అన్ని పరిస్థితుల్నీ ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి!" కృష్ణుడు అర్జునుడికి గీతాబోధ చేసినట్టు నాకు ఐలాపురం పోర్టికోలో బోధ చేశాడు అవినాశం.

చెప్పొద్దూ! నాకు మహా ఇదనిపించింది. నేను అన్నిటి గురించీ వెతుక్కోవడమే గానీ వీడిలాగా సర్వసన్నద్ధంగా ఏనాడూ లేను. వాడిముందు నేను ఎంత అల్పజీవినో అర్థమయింది.

"శభాష్‌రా అవినాశా! ఇంత ముందుచూపుగల ఫ్రెండ్ నాకు ఉండటం నా పూర్వజన్మ పుణ్యం" అని అభినందించాను కూడా... ఆ క్షణమే.

కారు జాలీగా రోడ్డుమీదకి నూతన వధూవరులను ఎక్కించుకుని దూసుకు పోయింది.

❀ ❀ ❀

ఓ అయిదునెలలు గడిచాయి. వాడి దగ్గర్నించి ఉత్తరం కూడా లేదు. నేనూ బిజీగానే ఉన్నా... పెళ్ళిసంబంధాలతో.

పెళ్ళిచూపులకి నాకు తోడుగా వచ్చినవాళ్ళందరికీ పెళ్ళిళ్ళయిపోతున్నాయిగానీ, నాకు మాత్రం ఒక్క సంబంధంకూడా కుదరట్లా. ఏం చేస్తాం? పోనీ అవినాశంగాడు వేసిన 'అయిడియా' వేద్దామన్నా అందర్లోకీ 'స్లో...సో'గ్గాడ్నాయే.

మొత్తానికో సంబంధంకుదిరేలా అనిపించింది. పిల్లది ఒంగోలట, పెద్ద కలిగిన కుటుంబం కాదుగానీ, పెళ్లికొడుక్కి నచ్చితే చాలన్నారుట.

ఇంకేం.... హ్యాపీగా బయల్దేరా. అవినాశంగాడ్ని కూడా కలవొచ్చు గదా అని.

"ఒరేయ్! పెళ్ళిచూపులకి పోతూ వాడ్ని మాత్రం నీతో తీసుకెళ్లకు. చిచ్చుబుడ్డి ముందు అగ్గిపుల్లలా!" జాగ్రత్తలు చెప్పాడు ఓ మిత్రుడు. నిజమేగా మరి!

ముందు అవినాశంగాడింటికే వెళ్ళాను. ఆదివారం గనుక ఇంట్లోనే ఉంటాడు. వాళ్ళావిడ అంటే వనిత నన్ను చూసి 'రండిరండి' అని నవ్వబోయి గబగబా లోపలికిపరిగెత్తి 'భళ్ళున' వాంతి చేసుకుంది.

"ఇదేమిట్రా" బేలగా అన్నాను. నా మొహం అందంగా ఉండకపోవచ్చునుగానీ, మరీ చూడంగానే వాంతివచ్చేట్టు ఉండదుగా!

"అబ్బ...అదేం లేదురా. గత రెణ్ణెల్లుంచీ ఛస్తున్నా. ఇప్పుడావిడకి నాలుగో నెల. గంటకో వాంతీ పూటకో అలక" చికాగ్గా అన్నాడు.

"మరి అయిదారేళ్ళదాకా పిల్లలు వద్దనుకున్నారుగా?" ఆశ్చర్యంగా అడిగా.

"అదా.. నా పెద్దబ్యాగ్‌లో అన్నీ సర్దుకున్నాను. ఆ ఒక్కటీ తప్ప. అదే నా కొంప ముంచింది. అదీగాక పచ్చి పల్లెటూరు. అవి దొరికిచస్తేగా...!" అన్నాడు నిట్టూరుస్తూ.

"మరి!' అన్నాను, ఏం చెప్పాలో తెలీక.

'కళ్యాణమొచ్చినా కక్కొచ్చినా ఆగదంటారుగా! అప్పుడు కళ్యాణం... ఇప్పుడు కక్కు" మైలు పొడుగునా నిట్టూర్చాడు మా 'జాగ్రత్తపరుడు.'

blank page

981

# భువనచంద్ర కథలు

బీ- ఇండియన్ ఒక మంచికథ.... బ్రాండెడ్ భూతం ఆవహించిన మనం ఆలోచించడం మానేసి మనమేలు, దేశంమేలు కూడా మర్చిపోతున్నామని మనని "కుదిపి" చెప్పేకథ ఇది.... జాతిని నిర్వీర్యం చేసేవాళ్ళు, దేశాన్ని ఆర్థికంగా ఆక్రమించాలన్న ప్రణాళిక ఉన్నవాళ్ళు, అడ్వర్‌టైజ్‌మెంట్స్‌ను వాడుకుని జనాన్ని హిప్నటైజ్ చేస్తారు. ఎర్రటి అట్టమీద తెల్లటి అక్షరాలపేరు పదేపదే చూపిస్తే కొట్టుకువెళ్ళి ఒద్దనుకున్నా అదే కొంటాము. ఆ పద్ధతి ఉపయోగించే మనమీద "బ్రాండ్"ను ఆవహింపజేస్తున్నారు వ్యాపారవేత్తలు.

ఒకప్పుడు హైద్రాబాద్ బాలానగర్‌లో అమెరికాలో ఒక ప్రముఖవ్యక్తి వేసుకునే బ్రాండెడ్ షర్ట్స్ కుడుతున్నారని తెలిసింది కుర్రకారుకు... అతను కుట్టిచ్చిన షర్ట్‌కు బ్రాండ్‌నేమ్ ట్యాగ్‌తో అమ్ముతాడు దళారి. ఇంకేం ఆ టైలర్ కోటీశ్వరుడైపోతాడు. టైలర్ దగ్గర గుడ్డ, టైలరింగ్ బిల్లు కలిసి నాలుగువందలు. కానీ బ్రాండ్ టాగ్ వేస్తే షర్ట్‌ఖరీదు పద్దెనిమిది వందలు.... కానీ బ్రాండ్ కోసం, ఆ చిన్న ...లేబుల్‌కోసం నాలుగువందల వస్తువు పద్దెనిమిది వందలకు కొంటున్నారట జనం....

ఇట్లాంటి విషయాలు సహేతుకంగా చెప్తూ భువనచంద్రగారు ఈ కథలో ఒక ట్రిక్ చేశారు.

పొలం నుంచి వచ్చిన తాజా కూరల్ని, సరుకుల్ని, పళ్ళను అమ్మే చిల్లర వ్యాపారస్థులతో సామాన్యమానవుడికి ఉండే సత్సంబంధాలను ఆ తాజా సరుకులతో చేసే వంటకాలను వర్ణిస్తూ తెగనోరు ఊరింపజేసి "ఛీ! పాడు బ్రాండ్లు.... ఎప్పటి నిలవున్న సరుకులో" అనిపించేట్లు చేసేశారు.

ఇది నిజంగా దేశసేవే.

జలంధర చంద్రమోహన్

₹ 150/-

SPQ020

సాహితి ప్రచురణలు
నవ్య నవలా ప్రపంచం

282